

వైద్యప్రేమికుల వినూత్న నవల

# మరో హృదయం మరో ఉదయం

డా॥ కనుపూరు శ్రీనివాసులు రెడ్డి

# మనసులో మాట...

నిశితంగా ఆలోచించి, వైద్యం చేసే ఏ వైద్యుడయినా వ్యాధి ఎలా పరిణమిస్తుందో తెలుసుకోగలడు అని నా గట్టి నమ్మకం.

ఆ నిశిత దృష్టే యిప్పుడు డాక్టర్లో కరువైంది. చాలా తక్కువ శాతం, శారారీక పరిక్షలు, తమ అవగాహన, రోగి కథనంతో నిర్దుష్టంగా రోగాన్ని నిర్ధారించి చాలా తక్కువ మందులు, ఉత్తరోత్తరా చెడ్డ చేయని పద్ధతిలో వాడి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. అలాంటి మహానుభావులకు శిరసు వంచి నమస్కరిస్తున్నాను.

కానీ ఈ కాలం రోగులకు అలాంటి వాళ్లు నచ్చనే నచ్చరు. వాళ్లను దూరం చేస్తూనే ఉంటారు. ఇప్పుడంతా క్షణాల మీద జరిగిపోవాలి. ఎంత డబ్బయినా పరవా లేదు! ఎన్ని డిగ్రీలుంటే అంత పెద్ద డాక్టరు. అనుభవం అవసరం లేదు. మన కులపు వాడయితే, పనికి మాలిన వాడయినా పరవాలేదు. నిండు ప్రాణాల్ని కళ్లు మూసుకుని అప్పగిటించటం. ఇది ఎంత ప్రమాదమో, ఎంత దిగజారిపోవటమో తెలుసుకోలేకపోతున్నారు. అందుకనే రోజుకొకటి ప్రతి మూలా ఒక కులానికి, ఒక ఐదు నక్షత్రాల ఆస్పత్రి. ప్రతి చిన్న విషయానికి అక్కడికి వెళ్ళటం రోగులకు ఒక పెద్ద హెూదా. వచ్చిన వాళ్లను అవసరం ఉన్నా లేక పోయినా తమ దగ్గర ఉన్న అన్ని పరికరాలకు పనిపెట్టి పీల్చి పిప్పి చెయ్యడం అడ్డు తిరిగినప్పుడు "బాగా చూసారు. చాలా బాగా చూసారు" కానీ ఎం లాభం మనకు అదృష్టం లేదంటూ దలుపుకు రావటం చాలా సహజమైన తృప్తి. లేకపోతే గొడవ చెయ్యటం అరాచకం, దౌర్జన్యం, డబ్బు పొగరు పెరిగిపోయింది. ముదరపెట్టి చావు బ్రతుకుల్లో తీసుకొచ్చిన పేషంటు కూడా బ్రతకాలి.

నేను చెయ్యను అంటే - మానవత్వం లేదా! మనిషివా- దున్నపోతువా? ఎంత డబ్బు కావాలి నీ ముఖాన కొడతాం - కొట్ట బోతున్నారు. ఒకవేళ డాక్టర్ల ప్రయత్నంలో, లోపం లేకపోయినా, చనిపోతే గౌరవ మర్యాదలు మరిచి, నానా తిట్లు తిడుతూ కొట్టడం - కోర్టులుకు లాగటం. దానితో "ఏ కేసు తీసుకోవాలన్నా వెనకడుగు వేస్తున్నారు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఎన్నో చట్టాలు, ఈ డాక్టర్లు.

gudachari.com

ఇది ఎంత పొరపాటో ఈ ప్రజలు గాని ప్రభుత్వం గాని ఆలోచించటం లేదు. డాక్టర్లను భయభ్రాంతుల్ని చేసి, వారి చేతులు కట్టివేస్తే చాలా నష్టమే జరుగుతుంది. ఇచ్చిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం డాక్టర్లు చేసినా ప్రమాదాలు జరుగుతాయి. అందుకే అందరిలోనూ నిజాయితీ ఒకరి మీద ఒకరికి నమ్మకం, గౌరవ మర్యాద లున్నప్పుడే, ఈ వృత్తి బాగు పడుతుంది. ఎందరికో ఆనందాన్ని కలిగిస్తుంది.

ఇవన్నీ చూసి చాలా మానసిక సంఘర్షణకు లోనయ్యేవాడిని. ఏదో చెయ్యాలి? మార్పు తీసుకురావాలని ఆరాటం. కానీ ఏం చెయ్యలేని - నిస్సహాయత. నిస్పృహ. మనకెందుకులే అని సరిపెట్టుకోవడానికి మనసు అంగీకరించేదికాదు. చిన్నచిన్న తప్పులు వలన రోగికి ఆ జబ్బు ముదిరినా, లేక చనిపోయినా పచ్చని సంసారాలు నాశనం అయిన సందర్భాలు ఉన్నాయి. జీవితాంతం, ఆర్థికంగా, మానసికంగా కృంగిపోయి జీవించే వాళ్ళు ఎంతో మంది ఉన్నారు.

ఏదీ నీ చేతిలో లేదు. దేనికయినా అదృష్టం కావాలి.. ఈ రెండు మాటలు ఎంత నిజమో నేను నిర్ణయించలేను. చచ్చేవాడు ఎట్లాగూ చస్తాడు. బ్రతికే వాడు ఎలాగూ బ్రతుకుతాడు. మరి యిన్ని ప్రయత్నాలు ఎందుకు! అర్థంగాని ప్రశ్న. ఎప్పుడూ నాలో మెదిలే ఈ ఆలోచనలను కథల రూపంలో రాయాలని మనసు ఆరాటం పడుతూ ఉండేది. అలాంటి సమయంలో ఇంగ్లీషు నవల ఒకటి చదవటం సంభవించింది. చాలా చాలా కాలం అయ్యింది. ఆ నవల నా ఆలోచనలకు ఒక రూపునిచ్చినా. రచయిత పేరు కూడా జ్ఞాపకం లేదు. రోబిన్ కుక్ మాత్రం కాదు. డాక్టరే పేషంటు అయితే...?

అందుకే ఇద్దరూ డాక్టర్లు అయితే. అదిగాక హార్టు ఫెయిల్యూరుని తెలుసుకోలేకపోయిన ఒక అత్యంత ఆధునిక ఆసుపత్రితో నిష్ణాతులైన ప్రముఖులు విధానం.

బైపాసు సర్జరీ చేసి ఇంటికి వచ్చిన తరువాత 'చలిజ్వరం వస్తే ఆలోచించకుండా మలేరియా జ్వరానికి మందులిచ్చి, వేసిన కుట్లులో చీము చేరి ఉందని ఆలస్యంగా తెలుసుకొని, ప్రయత్నం చేసినా ఫలించని చేదు నిజాలు. అలాగే చీము చేరి సంవత్సరం పాటు నరక యాతన అనుభవించిన వాళ్ళ బాధలు. ఇంకా ఎన్నో!! యానిజియోగ్రహీకి తక్కువ రకం కతిటర్ వాడి ఇన్‌ఫెక్షన్‌తో చనిపోయిన వాళ్ళు.

గొంతులో గొట్టాం (ఎండోట్రాకియిల్ ట్యూబ్) ఉంచవలసిన రోజుల కంటే ఎక్కువ ఉంచి, దానితో గొంతు వాపు వచ్చి ప్రాణం పోయిన డాక్టరయిన, మా ప్రొఫసర్ కథనం. ఉంచాల్సిన దానికంటే ఎక్కువ లోతులోకి పెట్టి ఉంచి దానితో ఒక ఊపిరితిత్తి మూసుకు పోతే దాన్ని తెరిపించడానికి సరిగ్గా చెయ్యలేక రక్తం పొంగి, మూసుకుపోయి, బాగయి పోయింది అనుకున్న సమయంలో ప్రాణం పోయిన నాకు అతి సన్నిహితులు. ఇదంతా జరిగింది అత్యవసర కేసులు వార్డులులోనే.



ఎంతో మంది డాక్టర్లు, నర్సులు. పరిస్థితి ముందుకొచ్చేంత వరకు తెలుసుకోలేని వారి అనుభవ శూన్యత ఎం కాదులే అనే ధీమా! తరువాత చూద్దాంలే అనే అలుసుతనం. ఎన్ని జీవితాలు బలి అవుతున్నాయో!! చాలా బాధాకరమైన విషయం.

ప్రతిదీ గమనించాలి. చెయ్యాల్సింది. చెయ్యాల్సిన సమయంలో, చెయ్యాల్సిన పద్ధతిలో మనం చేసి తీరాలి. అలా చేసిన తరువాత కూడా మించిపోతే కర్మ సిద్ధాంతాన్ని నోరు మూసుకొని అంగీకరించాల్సిందే. తప్పు చేశామని, దోషిగా జీవితాంతం బాధ పడాల్సిన అవసరం లేదు. ఆ మానసీయత ఈ వృత్తిలో ప్రస్తుతం లేనట్టు అనిపిస్తుంది. కానీ యివన్నీ మనసులో ఉంచుకుంటే, ఆలోచిస్తే, చలించిపోతే ఏ డాక్టరూ వైద్యం చెయ్యలేడు.

అలాగని అంటీ, అంటీనట్లుగా కూడా ఉండకూడదు. డాక్టరు మరీ నిరంకుశుడు కాకూడదు. ఎటుపోతే నాకేం అని మనస్తత్వం అసలుండకూడదు.

సాగరమంత విశాలమై అగాధమై, అంతుపట్టని ఎన్నో మర్మాలున్న ఈ వ్యాధుల కీకారణ్యంలో, మార్గం అంత సులువు కాదు.

నిష్కామకర్మతో, నిశిత దృష్టితో, పరవాంచకు లోనుకాకుండా మరో హృదయాన్ని, మరో ఉదయాన్ని ప్రసాదించి ఈ అభాగ్యుల జీవితాలలో వెలుగు నింపమని, ఆ హృదయాలకు ఊరట కలిగించమని ప్రతి వైద్యుడ్ని, వైద్య రంగాన్ని, వైద్య వృత్తి అభ్యసించే ప్రతి ఒక్కరిని కోరుకుంటున్నాను.

నాకు తెలియక నేను కూడా చాలా పొరపాట్లు చేసి ఉండొచ్చు. అందుకు నన్ను మనస్ఫూర్తిగా క్షమించని ప్రార్థిస్తున్నాను.

డాక్టరుగా నీ శక్తి మీద నమ్మకం లేకపోతే ఏమీ చెయ్యలేవు.

అలాగే అతి నమ్మకం ఉంచితే చాలా చెడ్డ జరిగే అవకాశం ఉంది.

కుల, మత, రాజకీయ సాంఘిక శక్తులు ఈ వైద్య వృత్తి నిరోధకాలయితే వాటి నరికి పారెయ్యండి. మందే లేని అంటురోగాలుగా మారినా వాటి ప్రలోభాలకు, మానసిక ఒత్తిడులకు లోనుగాకుండా నిర్భయంగా మీ వైద్యామృతాన్ని అందించి, అందరి జీవితాలలో చిరు జల్లులు చల్లమని కోరుతున్నాను.

డబ్బే ప్రధానం ఎనాటికీ కాకూడదు. డబ్బు లేకుండా జీవించలేం. కానీ...

నువ్వు బాగు చేసిన జీవితాలకు, సేవకు ఎంత ధనం యిచ్చినా సరిపోదు.

చేసే పనిని నిర్దుష్టంగా చేయాలి. మానవతా దృక్పథం ఏనాడూ నీలో చచ్చిపోకూడదు.

మనమూ మనుషులమే. ఎంత చేసినా మరిచిపోయే ఈనాటి సమాజంలో కృతజ్ఞతను ఆశించి బాధపడకూడదు. చాలా మంది ఉంటారు. మనల్ని దేవుడు అనేవారు. అవి గుర్తు చేసుకుంటే చాలు.



gudachari.com

డా. కె.ఎస్.రెడ్డి (నరశింహారెడ్డి) కార్డియాలజిస్టు. విజయా హార్టు ఫౌండేషను డైరెక్టరు. నాకు అత్యంత ఆప్తుడు ఇది చదివి ఎన్నో సూచనలు చేసారు. (హార్టు ట్రాన్స్‌ప్లాంటేషను) గుండె మార్పిడిని గురించి చాలా పరిశోధనా విషయాలు చెప్పారు. అవి యిందులో పొందుపరచలేదు, మరీ శాస్త్రీయంగా ఉంటుందని. ఆయనకు నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. ఆయన చదివి, "ఇందులో ఎన్నో మేము తెలుసుకోవాల్సిన విషయాలు ఉన్నాయి. మాలో కూడా చాలా మార్పు రావాలి అనిపిస్తుంది. మేం చేసే తప్పులు ఎత్తి చూపి, కనువిప్పు కలిగించేలా ఉంది." నవ్వుతూ అన్నాడు. ఆ నిజాయితీ చాలు నా ప్రయత్నానికి ఫలితం.

చదివి తన అభిప్రాయాన్ని సంతోషంగా వెలబుచ్చిన శ్రీమతి అబ్బూరి చాయాదేవి గారికి అంజలి ఘటిస్తున్నాను. నామీద నా పిల్లలమీద ఎనలేని అనురాగాన్ని, ఆప్యాయతను చివరి క్షణంవరకు చూపించిన కీ॥శే॥ శ్రీవేలామూర్ రాజగోపాల్ అయ్యంగార్ (చిత్తూరు)ను స్మరించు కుంటూ శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నాను.

భవదీయుడు

డా॥ కనుపూరు శ్రీనివాసులురెడ్డి.



# ఒక వైద్యుడి హృదయావిష్కరణ

ఈ నవలా రచయిత డా. కనుపూరు శ్రీనివాసులురెడ్డి మంచి కవి, రచయిత. భావుకతా, తాత్త్వికతా నిండిన హృదయం ఆయనది. వృత్తి రీత్యా వైద్యుడు, ప్రవృత్తి రీత్యా సృజనాత్మక రచయిత. అనుభవజ్ఞుడైన వైద్యుడు, మేధావి కనుకనే, తన రంగానికి సంబంధించిన వాస్తవిక విషయాలని మనో విశ్లేషణని జోడించి ప్రతిభావంతంగా నవలా రచన చేయగలిగారు.

పేషెంట్‌గా మారిన ఒక డాక్టరూ, అతని కోసం తోటి డాక్టరుగా తాపత్రయపడిన అతని భార్య ఆరోగ్యరీత్యానూ, ఆర్థికంగానూ, కుటుంబరీత్యానూ ఎటువంటి విషమ పరిస్థితుల్ని ఏవిధంగా ఎదుర్కొన్నారో వివరించిన వైజ్ఞానిక, మనో విశ్లేషణాత్మక, సాంఘిక నవల ఇది.

వైజ్ఞానికంగా ఎంతో పురోగమించినా, కొందరిలో అనైతిక ధోరణీ, వ్యాపార ధోరణీ, అమానవీయతా ఎంతగా పెరిగిపోయాయో ఈ నవల చదివితే అర్థమవుతుంది.

ఒక వైద్యుడు (సర్జన్) తన జీవితంలో హఠాత్తుగా అనారోగ్య రీత్యా ఏర్పడిన పరిస్థితిని (గుండె జబ్బుని) శారీరకంగానూ, మానసికంగానూ ఎదుర్కొన్న వైనాన్నీ, భార్యా పిల్లలతోనూ, తోటి వైద్యులతోనూ, సహెూద్యోగులతోనూ, అనుచరులతోనూ వ్యవహరించిన రీతినీ, భార్య మనోభావాల్నీ, అతని చుట్టూ ఉన్న వారి మనోభావాల్నీ సంభాషణల ద్వారా, హావభావాల ద్వారా వాస్తవికంగా, ఆర్ద్రంగా, ఆలోచనాత్మకంగా చిత్రించిన నవల ఇది. క్షణ క్షణం జరుగుతున్న పరిణామాలనూ, సాగుతున్న ఆలోచనలనూ అక్షరబద్ధం చేస్తూ రచయిత పాఠకులను తన వెంట తీసుకుపోతాడు. ముఖ్య పాత్రల ఉద్వేగ మనఃస్థితితో పాఠకులు తాదాత్మ్యం పొందుతారు. ఇది ఒక మనో వైజ్ఞానిక, మనో విశ్లేషణాత్మక నవల అయినా, పాఠకులు చివరి వరకూ అత్యంత ఆసక్తితో, ముందుముందు ఏమవుతుందోనన్న ఉత్కంఠతో చదువుతారు. అలా చదివించేటట్లుగా ఉంది ఈ నవల.

ఇదివరకు తెలుగులో వైద్యరంగానికి సంబంధించిన కాల్పనిక సాంఘిక నవలలు- వినోదాత్మకమైనవీ, ఉత్కంఠభరితమైనవీ ప్రముఖ రచయితలు రాసినవి రాకపోలేదు. గుండె జబ్బుకి సంబంధించిన నవల పాఠకుల గుండెల్ని బిగపట్టినట్లు చేస్తుంది. ఎన్నో

gudachari.com

విశేషాలు - ఆరోగ్యానికి సంబంధించినవీ, అనారోగ్యానికి సంబంధించినవీ - వైద్యపరమైనవీ, సామాన్యులు తెలుసుకోదగినవీ, వైద్యులకూ, వారి సిబ్బందికీ కనువిప్పు కలిగించేవీ, మానవీయతని పెంపొందింప జేసేవీ ఉన్నాయి ఈ నవలలో. గుండె మార్పిడికి సంబంధించిన విశేషాలు కూడా ఉండటం విశేషం.

ఈ నవలలో విశిష్టంగా కనిపించేది వైద్య వృత్తిలో ఉన్న భార్యాభర్తల గాఢ ప్రేమానుబంధం, దీన్ని రచయిత వ్యక్తం చేసిన వైనం.

అనుభవజ్ఞుడూ, మానవతా దృష్టి ఉన్న డాక్టరుగా రచయిత వ్యక్తం చేసిన కొన్ని అభిప్రాయాలు - ఆయన మాటల్లోనే -

"డాక్టరుగా తెలుసుకోనివి, ఊహించనివి, హాస్పిటల్‌లో జరిగే వింతలు, విడ్డూరాలు, కొన్ని నగ్నసత్యాలు ఇప్పుడు తెలుస్తున్నాయి డాక్టరు శ్రీనికి... రోగిని మానవతా దృష్టితో ఆదరించి అర్థం చేసుకోవాలంటే ప్రతి డాక్టరు జీవితంలో వొక్కసారైనా జనరల్ వార్డులో పేషెంటుగా వుండాలనిపించింది"...

"ఈ వారం రోజుల్నుండి నొప్పి అంటే చాలు వొక్క ఇంజక్షన్‌తో ఈ లోకం నుండి పంపించి వేస్తున్నారు. అంత చిన్న నొప్పికి మత్తు ఇంజక్షన్ అవసరం లేదు. అయినా వాళ్ళిచ్చేస్తున్నారు"...

తన హౌస్ సర్జన్‌గా ఉన్న రోజులు గుర్తుకొచ్చినప్పుడు- "మెడలో స్టెతస్కోపు పడితే చాలు సాధించలేనిది ఏదో సాధించిన తృప్తి... దాంతో అహంకారం, లెక్కలేనితనం చోటు చేసికుంటాయి. మిగిలిన మనుషులకంటే మనం ప్రత్యేకత అనే గుడ్డి నమ్మకం చోటు చేసుకుంటుంది చాలా మందిలో"...

"తమ దగ్గర వాళ్ళకు సీరియస్‌గా వుండి వైద్యం చేయాలన్నా, సాటి డాక్టరుకి వైద్యం చేయాలన్నా అదోరకమైన స్థిరత్వం లేని మానసిక బలహీనత వుంటుంది డాక్టర్లలో. అందులోనూ సీరియస్, కాంప్లికేటెడ్ కేసు అయితే మరీనూ."...

"నిజంగా డాక్టర్లంత చెడ్డ రోగులు ప్రపంచంలో మరొకరుండరు... అశ్రద్ధ చేయడంలో డాక్టర్లు మొదట వుంటారు"....

"పేషెంట్ చెప్పిందంతా నిజంకాదు, చిన్న దాన్ని పెద్దది చేసి చెబుతున్నాడు - అనుకుంటాడు డాక్టరు. డాక్టర్ చెప్పిందంతా నిజం కాదు. డబ్బు గుంజడానికి జబ్బును భయంకరంగా చెబుతున్నాడు డాక్టర్ అనేది పేషెంట్ ఆలోచన. అయితే రెండూ సరికాదు"...

"తమ తప్పు తెలుసుకోడానికి ప్రయత్నించి చిత్తశుద్ధితో నయం చేయాలని తపన పడే డాక్టర్లు దేవుళ్ళు. లెక్కలేనితనంతో అశ్రద్ధగ ప్రవర్తించే డాక్టర్లు రాక్షసులు"....

ఎక్సరేలు చూస్తున్న సీనియర్ డాక్టర్ మాటలు విని-



"చాల మంచి పిక్చర్స్ వచ్చాయి. బ్యూటిఫుల్!... బ్యూటిఫుల్ అంటాడేమిటి... అవేమన్నా కాశ్మీర్ ప్రకృతి దృశ్యాలా..? ... అందాల రమణుల వయ్యారపు వొంపులా..!!! ఈ డాక్టర్లకివే కనిపిస్తాయి కాబోలు వీటిలో. వీటిలోనే వాళ్లు పచ్చిక మైదానాల్నీ, విరబూసిన లతా వల్లరుల్నీ చూస్తారు. పిటీ... ఈ డాక్టర్ల జీవితాలింతే...! అనుమానమే- ప్రశాంతమైన రాత్రుల్లో పిండారబోసినట్లుండే వెన్నెలని ఎంత మంది చూసుంటారని."....

"తప్పును ఒప్పుకోవడంలోనే నిజాయితీ వుంది. ఆ నిజాయితీ లేకపోతే డాక్టర్ కాడు."....

"కొన్ని జబ్బులు ముదరడానికి, తిరిగి రావడానికి కారణం ఎక్కువగా డాక్టర్ల చేతగానితనమే అయివుంటుంది. డిగ్రీలుండగానే సరిపోదు. తమకు తెలిసిన దాన్ని సరైన పద్ధతిలో సరైన సమయంలో ఉపయోగించే ఇంగిత జ్ఞానం వుండాలి."...

"ఈ దేశంలో వైద్య వృత్తి ఈ దశకు దిగజారడానికి కారణం ఒక్కటే... నిర్లక్ష్యం. దీనిక్కారణం మళ్ళీ మూర్ఖత్వం...

పేషెంట్ డాక్టర్ని నమ్మాలి.

డాక్టర్ పేషెంటుని నమ్మాలి.

పేషెంటు డాక్టర్తో నిజాయితీగా ప్రవర్తించాలి.

డాక్టరు డబ్బు కోసం కక్కుర్తి మానాలి.

పేషెంటు ఏరు దాటగానే తెప్ప తగలేసే మనస్తత్వం మానాలి.".... అనుకుంటుంది డాక్టర్ భార్య, డాక్టరుగా. ఈ నవలలోని డాక్టర్ దంపతులు పరస్పర ప్రేమానురాగాలతో అన్యోన్యంగా ఉంటారు. అందుకే భర్త అనారోగ్యం భార్యని అమితంగా బాధిస్తుంది. "కష్టాలు కలసి పంచుకోవడంలోనే భార్యాభర్తల అనుబంధం అమరివుంది. బాగున్నప్పుడు కలసి వుండి, బాగులేనప్పుడు వొకర్ని వొకరు దూరం చేసికుంటారా... అప్పుడే కదా అసలు బాధ్యత. అందుకే కదా ఈ కలయిక. అదే కదండీ వివాహానికి అర్థం." అంటుంది.

"భార్యాభర్తలు ఒకరి కోసం ఒకరు ఎన్నో త్యాగాలు చేసుకోవాల్సిన అవసరం వుంది. త్యాగమా... ఛ... ఛ... దాన్ని త్యాగమనకూడదు... ఎదుటి వారి అభిరుచిని మన్నించడం... అభిప్రాయాల్ని గౌరవించడం... అదే ప్రేమ అవుతుంది..." అనుకుంటారు భర్త (డాక్టరు). భర్తకేదైనా అయితే తనూ చచ్చిపోతాను అని భార్య అన్నప్పుడు- "ఎంత బలమైన ప్రేమైనా కానీ ఆ క్షణం అలా అనిపిస్తుంది. చావు నిజం. బ్రతుకు నిత్యం... ఒకరి కోసం ఒకరు చచ్చిపోవడం కాదు ప్రేమంటే... మిగిల్చిన బాధ్యతలు సరిగ్గా నిర్వర్తించడం..." అంటాడు డాక్టరు.

ఇద్దరూ నిరాశా నిస్పృహలకు గురైనప్పుడు వాదోపవాదాలు జరిగేవి కాస్సేపు. అంతలోనే భార్య తేరుకుని భర్తని క్షమించమని వేడుకునేది. డాక్టరు కూడా భార్యని కష్టపెడుతున్నందుకు క్షమించమనే వాడు. ఇద్దరూ కలిసి కళ్ళ నీళ్ళు పెట్టుకునేవారు.



gudachari.com

రాత్రి స్నేహితులతో ఒంటి గంట వరకు కబుర్లతో గడిపిన విషయం గుర్తుకు రాసాగింది. మంట యింకా తగ్గలేదు.

మెడవైపుకు, చేతి భుజం వైపు ప్రాకుతున్నట్లు సన్నని నొప్పి.

మజ్జిగ త్రాగాడు. కాసేపటికి సర్దుకుంటుందేమో!

ఏం లాభం లేకపోయింది. రాత్రి పార్టీలో మిగిలిన సోడా మూత తీసేందుకు ప్రయత్నించాడు. రాలేదు. చెమట పోస్తూ వుంది. చేతులు నిలకడగా లేవు. ప్రయాసతో మూత తీసి కొంచెం కొంచెంగా త్రాగాడు. అయినా లాభం లేక పోయింది. ఏమి తగ్గినట్లుగా లేదు. క్షణక్షణానికి నొప్పి అధికం కాజొచ్చింది. చెమట విపరీతంగా పోస్తోంది.

ఉన్నట్లుండి నాడి చూసుకున్నాడు. చాలా త్వరగా... బలహీనంగా కొట్టుకొంటోంది. నొప్పి అధికం అవుతోంది. శరీరం పట్టు తప్పుతూ వుంది.... కళ్ళు మూసుకు పోతున్నాయి... ఎక్కడో... అతి వేగంగా ఈ మామూలు ప్రపంచానికి దూరంగా వెళ్ళిపోతున్నట్లనిపించింది.

అప్పుడు స్ఫురించింది.

తనకేదో జరగబోతోంది. భయంకరమైనది. జరగకూడనిది. అది తలచుకోగానే శరీరమంతా భయంతో జలదరించిపోయింది... లేదు... లేదు... అలా జరగడానికి వీల్లేదు... వీల్లేదు... ఎవ్వరూ దగ్గర లేకుండా దిక్కులేని చావు చావకూడదు. గట్టిగా అరవాలనే కోరికకు నవ్వొచ్చింది అతనికే.

ఒక డాక్టరుగా వుండి ఈ విధంగా ఆలోచించడం చాలా తెలివి తక్కువ అనిపించింది.

నొప్పి ఇప్పుడు మరీ ఎక్కువైంది.

మళ్ళీ నాడి చూసుకున్నాడు. బలహీనంగా వుంది. కాళ్ళు చేతులు తాకి చూసుకున్నాడు. చల్లగా నిర్జీవంగా అనిపించాయి.

మైకం కమ్ముతున్నట్లుగా వుంది.

ఎవరినైనా పిలిస్తే బావుంటుంది. కిటికీ దగ్గరకి నెమ్మదిగా చేరాడు. బయటంతా చీకటి. ఎవ్వరూ వస్తున్న జాడ లేదు. ఎక్కడో దూరంగా కర్రతో తట్టిన శబ్దం.

పిలవాలి, పిలవాలి మాట రావడం లేదు. నిల్చునే శక్తి సన్నగిల్లి పోతూవుంది... లాభం లేదు. హాస్పిటల్‌కి ఫోన్ చేయాలి. ఫోన్ డ్రాయింగ్ రూములో వుంది. అక్కడకి వెళ్లేదెలా? తను పోగలడా?!

చిన్నగా అడుగువేశాడు. తూలి పడబోయాడు. చెమట పోస్తూ వుంది. విపరీతంగా నొప్పి... చాకుతో పొడిచినట్లు... లోతుగా... ఇంకా లోతుగా కర్కశంగా గుండెల్లో గుచ్చినట్లు, భరించలేనంత.

తప్పదు. తనకిక చావు తప్పదు. చచ్చిపోతానా!?



కనీసం స్వాతితో వొక్క మాటైనా చెప్పకుండా చనిపోతే ఆమె క్షమించదు. వెంటనే నవ్వొచ్చింది పిచ్చి ఆలోచనకు.

అతి కష్టం మీద ఫోను వద్దకు చేరాడు. మూడు మైళ్ళు మండుటెండలో పరిగెత్తిన్నంత అలసట.

ఫోన్ రిసీవర్ ఎత్తుతొంటే ఇనుప ముద్ద ఎత్తినంత బరువుగా వుంది. హాస్పిటల్ నెంబర్ తిప్పాడు. చేతులు వణుకుతున్నాయి.

రింగ్ అవుతోందే గానీ ఎవ్వరూ ఎత్తలేదు.

మళ్ళీ రింగ్ చేయాలంటే వీలవుతుందా... ఒక్కో నెంబరూ అతి కష్టం మీద చేయాల్సి వొచ్చింది. జవాబు లేదు. ఓపిక లేక చెవి దగ్గరే వుంచుకుని టేబుల్ దగ్గరగా జారిపోయాడు.

అవతల ఫోను ఎత్తిన శబ్దం.

హలో... హల్లో... జవాబు లేదు. సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. ఆడ, మగా గొంతుల నవ్వులు వినిపిస్తున్నాయి. గాడిదల్లారా! ఫోను చేతిలో ఉంచుకొని సరసాలా! స్టుపిడ్స్ ఇక్కడ వొక డాక్టర్ నిస్సహాయంగా చచ్చిపోతోంటే, మీరు నవ్వుకుంటున్నారా? గట్టిగా అరవాలనిపించింది. కానీ వోపిక లేదు.

"హలో" గట్టిగా అరిచాననుకున్నాడు. చాలా పేలవంగా వినిపించింది తనకే.

"కాస్త గట్టిగ మాట్లాడ లేవూ?" కసిగా ఆడగొంతుక ఫోన్‌లో వినిపించింది. తన గొంతు గుర్తు పట్టలేనందుకు కోపం వచ్చింది.

"నేను డాక్టర్ని...."

అయితే...?

నాకు హార్ట్ అటాక్ వొచ్చింది. వెంటనే యాంబులెన్స్ పంపండి..." ఎక్కడికో చెప్పలేకపోయాడు. మైకం కమ్ముతున్నట్లుగా ఉంది.

"యాంబులెన్స్ చెడిపోయి ఆర్నెల్లయింది. మీరెవరు...?"

ఎక్కడుంటున్నారు... హలో... హలో..."

తను మాట్లాడలేకపోతున్నాడు... తప్పదు. తన చావు తప్పదు. వొంటరిగా నిస్సహాయంగా చావాల్సిందే. నీరసం మరీ ఎక్కువవుతోంది. నొప్పి చంపేస్తోంది.

గట్టిగా మరీ గట్టిగా తన భార్య స్వాతికి వినిపించేట్లు... 'మై డియర్ డార్లింగ్.... నేను దిక్కులేని చావు చస్తున్నాను. వెంటనే రా! నీ ఒడిలో చచ్చిపోవాలని వుంది. ఒక్కసారి చూడాలనుంది." ఆలోచన్లు కూడా మందగించిపోతున్నాయి.

"... అలా జరగడానికి వీల్లేదు. నిన్ను చూడందే నీ స్పర్శ తగలందే నేను చావడానికి వీల్లేదు. హాస్పిటల్‌కి వెళ్ళాలి. "మొండి పట్టుదల సన్నగిల్లుతున్న ధైర్యాన్ని కూడకట్టుకొని...



gudachari.com

మెల్లగా తలెత్తి వాకిటి వైపు చూశాడు. వేసిన తలుపులు యినుపగోడలగా కనుపించాయి.

తల చాలా బరువుగా నేలకు వంగిపోతున్నట్లుగా అనిపించింది.

తను తలుపు తీసి బయటకు వెళ్ళగలడా! ప్రయత్నిస్తే... ప్రయత్నించాలి.

లేచి నిలబడాలని ప్రయత్నించి తూలిపోతున్న శరీరాన్ని అదుపు చేసుకోలేక చాలా సేపు కూర్చుండిపోయాడు.

చమటలు పోస్తున్నాయి. పాక్కుంటూ జరిగి జరిగి తలుపు దగ్గరకి వచ్చాడు.

నొప్పి ఎక్కువవుతోంది. శరీరంలో ఏమాత్రం శక్తి లేదు. ఎక్కడి భాగాలక్కడ పట్టుతప్పిపోతున్నాయి. బలవంతంగా రాయిలా వున్న చేతితో అతి ప్రయాసతో మధ్య గడి తీశాడు.

పై గడియ తీయాలి. ఎలా...?

అతి ప్రయత్నం మీద మెల్లగా తలుపు ఆసరాగా పైకి ప్రాకుతున్నట్లు లేచాడు. గడి ఎక్కడో ఆకాశంలో వున్నట్లు అనిపించింది. చెమటతో వొళ్ళంతా తడిచి ముద్ద ముద్దయింది... చేతులు జారిపోతున్నాయి. నీరసం, మైకం క్రమంగా ఎక్కువ కాసాగాయి.

ప్రయత్నిస్తే.. కొంచెం మరికొంచెం... ఆ.... అమ్మ... గడి దొరికింది. లాగు... గట్టిగా... వేయి టన్నుల బరువు... వస్తూవుంది... వచ్చేసింది...

కానీ... కానీ... తనను తను ప్రోత్సహించుకుంటూ శక్తినంతా కూడగట్టుకొని విశ్వ ప్రయత్నం మీద తీయగలిగాడు.

తెలియని తృప్తితో గట్టిగా నిట్టూర్పు వదిలాడు.

అలాగే ప్రక్కనే వున్న స్విచ్ నొక్కాడు. బయట వాళ్లెవరైనా చూసి ఇంతరాత్రి పూట లైటేమిటా? అని రావచ్చు.... పిచ్చిగానీ ఆ వాచ్‌మెన్ ఎక్కడో... తలంతా మొద్దుబారినట్లయి నిలుచోలేక జారిపోయాడు. గడియ తీసినా - తలుపు తీయాలి ఆయాసంగా ఉంది. నొప్పి విపరీతంగా ఉంది. ప్రతి చిన్న పనికి ఎంతో ప్రయాస పడినట్లుగా అనిపిస్తోంది.

అలాగే మెట్ల మీద జరుక్కుంటూ వెలుపలకి వచ్చాడు.

వేకువ జామున చల్లగాలి రివ్వున శరీరానికి తగిలిగానే కొంత ఉపశమనం కలిగి నట్లుగా నిద్ర వస్తున్నట్లుగా అనిపించింది. కళ్లు మూతలు పడసాగాయి.

అది నిద్ర కాదు మైకం. స్పృహ తప్పిపోవడం.

అప్రయత్నంగా నాడి చూసుకొన్నాడు. నాడి చేతికి తగల్లేదు.

రక్త ప్రసారం గుండెకు సన్నగిల్లిపోతున్నట్లుగా అనిపించింది.

అయిపోయింది... అంతా అయిపోయింది. కొన్ని నిమిషాల్లో ఈ లోకం నుంచి వెళ్ళిపోబోతున్నాడు. చావును తప్పించుకోలేకపోతున్నాడు.



నా డార్లింగ్ నన్ను క్షమించదు. అని తలంపురాగానే నొప్పి మరీ ఎక్కువయ్యింది. వీధులు నిర్మానుష్యం. ఏం చెయ్యాలి.

వాకిట్లో ఇలాగే పడి చావాల్సిందే. ఉదయానికి కాళ్ళు చేతులు గట్టిపడి నీలుక్కు పోతాయి. శరీరమంతా చీమలు చుట్టుకుంటాయి. ఈగలు ముసురుకుంటాయి. ఛీ... ఛీ... ఎలాంటి చావు రాసి ఉంది.

కళ్ళు మూతలు పడుతున్నాయి. చూడాలంటే కనురెప్పలు చాలా బరువుగా ఉన్నాయి.

హల్లో! డాక్టరు మీరేనా యిలా ఆలోచిస్తున్నది. ఏమిటిది... ఏమిటిది. ఎంత మందికో ధైర్యం చెప్పి ఎన్నో ప్రాణాలు కాపాడిన మీరు... ఛీ... ఛీ... చాలా అవివేకం. ఈ సమయంలో కావాల్సింది. ధైర్యం మీ మీద మీకు ఆత్మ విశ్వాసం. కమాన్... కమాన్... పిరికవాడు కాదు మీరు. ఎంతో ఆత్మవిశ్వాసం మీకుంది ఇదేం చేస్తుంది. బి అలర్ట్... బి అలర్ట్... ఎవరో హెచ్చరిస్తున్నారా?

ధైర్యం... ధైర్యం తెచ్చుకో... అవును... నేనేమిటి ఇలా! కళ్ళు బలవంతంగా తెరచి చూశాడు. అన్ని మసక మసకగా మాసిపోతున్నాయి....

ఉన్నట్లుండి తేలిగ్గా... హాయిగా... ప్రశాంతంగా... ఉన్నట్లనిపించి నవ్వోచ్చింది. చస్తుంటే హాయి ఏమిటి?

"ఎక్కడో ఫోన్ మోగిన శబ్దం. ఎక్కడో... ఎక్కడో... నా యింట్లోనే. నేను వెళ్ళలేను.... బహుశా అది నా హాస్పిటల్ నుంచి అయి వుంటుంది.. అరే నేను గవర్నమెంటు హాస్పిటల్‌కి ఎందుకు ఫోన్ చేశాను. నా హాస్పిటల్‌కి చేసి ఎవర్నేనా రమ్మంటే వస్తారు కదా! ఎంత తప్పు చేశాను... కనీసం నా స్నేహితులకెవరికి చేసినా... ఏమిటి నా మతిమరుపు ఎందుకంత పొరపాటు చేశాను. ఇప్పుడు ఆలోచించి లాభం లేదు.

...నాకు దిక్కులేని చావు తప్పదు ఈ మెట్ల మీద. ఛీ... ఏమిటిది? ధైర్యం కోల్పో కూడదు.'"

అంతే స్పృహ కోల్పోయాడు.

"చలిగా వుంది. దుప్పటి కప్పుకుంటే బావుండును... వొక ప్రక్క చెమట పోసి చస్తూ వుంటే అదెందుకూ. కానీ చల్లగా హాయిగా వుంది."

మెల్లగా కళ్ళు తెరిచాడు. చీకటి... గాఢాంధకారమైన చీకటి. ఎక్కడో ఆకాశంలో గాలిలో తేలిపోతూ పయనిస్తున్నట్లు అనిపిస్తూ వుంది. చీకట్లోకి సూటిగా చూడడానికి ప్రయత్నం చేశాడు. చుక్కలు మిణుకు మిణుకు మంటూ కొద్ది కొద్దిగా కన్పించసాగాయి.

ఎక్కడున్నాడు తను...? తను చచ్చిపోలేదా! మరి ఇదేమిటి ఆకాశం... చీకటి... బొందితోనే ఏదో లోకాలు వెళ్తున్నానా!



gudachari.com

అప్పుడు విన్పించాయి మాటలు.

అది వాచ్‌మెన్ గొంతు, "రాత్రి బాగా తాగుంటాడ్రా."

"ఆయన తాగడు కదరా!"

"నీకేం తెల్సురా! డాక్టర్లందరూ తాగుతార్రా! "వీళ్ళకి తప్పదు" అందరి లాంటి వాడు కాదురా యితను.

"అరేయ్ నేను చూసినపుడు చచ్చిపోయాడనే అనుకున్నా! కాళ్ళు చేతులు ఆడలేదురా. నాకు చెమటలు పోసిపొయ్యాయి. ఏం చేయడానికి తోచలేదు. గబుక్కున భుజం మీద వేసికొని పరిగెత్తుకొచ్చాను."

"ఒరేయ్! గవర్నమెంట్ హాస్పిటల్‌కి ఎందుకురా! ఆయన హాస్పిటల్‌కే తీసుకుపోతే పోలా!"

"అది చాలా దూరం రా. చావు బతుకుల్లో వున్నాడా, అక్కడైతే ఎవరోవొక డాక్టరుంటాడు కదా! చూడ్డానికి. హాస్పిటల్ చేర్పించిన తర్వాత నువ్వు పోయి ఆయన హాస్పిటల్‌లో చెప్పు."

"నన్ను రిక్షాలో తీసుకు పోతున్నారా! ఇంత మెల్లగా పోతున్నారేమిటీ... అదేమిటి నా కారేమైంది... ఆరే స్వాతి తీసుకెళ్ళింది కదూ! ఒరేయ్ బాబూ! తొందరగా తీసుకెళ్ళండ్రా.... స్నేహితులెవరికైనా ఫోన్ చేయండిరా..." అని చెప్పాలనిపించింది అతనికి. మాట్లాడాలంటే వీలుకాలేదు. చాలా నీరసంగా వుంది.

వాళ్ళు తాగే బీడీ పొగ ఘాటుగా తగిలింది. ఫరవాలేదు. తనింకా చావలేదు. మళ్ళీ మైకం వస్తున్నట్లుగా అనిపించింది.

ఎవరో మాట్లాడుకొంటున్నట్లు ఎక్కడో వినిపిస్తోంది. ఏం మాట్లాడుకుంటున్నారో అర్థం కావడం లేదు. కొద్ది కొద్దిగా పరిసరాలు తెలుస్తున్నాయి. పైన సీలింగ్ ఫ్యాన్ గడ... గడ శబ్దం ఇప్పుడు బాగా వినిపిస్తోంది.

"పోయి లేపమ్మా! ఆయన ఈ ఊళ్ళో మంచి డాక్టరు." బ్రతిమాలుతున్నాడు వాచ్‌మెన్ డ్యూటీ నర్సును.

"ఇప్పటికి ఆరుసార్లు డ్యూటీ అసిస్టెంట్ రూముకి తిరిగాను వార్డులో ఆపరేషన్ చేసిన పేషంటు చస్తున్నాడని. చస్తే ఉదయం పోస్టుమార్టం (శవపరీక్ష) చేస్తాం. డిస్టర్బ్ చేయకు అంటూ గట్టిగా కేకలేసాడు. వాళ్ళ చేత నేనెందుకు తిట్లు తినాలి? నువ్వే వెళ్ళి పిలువ్" గట్టిగా చెప్పింది నర్సు.

"డాక్టర్ పేషంటైతేనే ఇట్లా వుంది. ఇక మామూలు వాళ్ళనేం చూస్తారు." అంటూ విసురుగా వెంకటేశ్వర్లు, (తన వాచ్‌మెన్) వార్డు వైపు వెళ్ళినట్లు అనిపించింది.

ఇప్పటి వరకూ... ఏ సీరియస్ పేషెంటుతో వేగి వేసారి పడుకున్నారో పాపం అనిపించింది అతనికి.



"ఇప్పటికి నాల్గు సార్లు వెళ్ళొచ్చాము. రూములో నుంచి బయటకు రానంటారే ఈ డాక్టర్లు. ఏం చేస్తున్నారో... ఏమో" అని నర్సు గొణుక్కోవడం కూడా వినిపించింది డాక్టర్ శ్రీనికి.

వెంటనే "అబ్బ ఇప్పటికి బయట పడ్డాడు అసిస్టెంట్ సర్జన్" అంటూ నర్సు ఫిజీషియన్ భానుమూర్తితో.

"పేషంటు డాక్టరట. వచ్చి అరగంట అయింది. హౌస్ సర్జన్లు వొక్కరూ అంతులేరు."

"వాళ్ళెక్కడుంటారండీ ఏ మూలో బాతాఖానీ వేస్తుంటారు. వాళ్ళకి నేర్చుకోవాలనే ధ్యాస వుంటేకదా!"

"అప్పటికి ఈయన ఎదో తొందరగా వొచ్చినట్లు" అనుకుంది నర్సు మనసులో.

"ఎక్కడ? డాక్టరా? ఓహో! యితనా! ఏమైంది?"

ఏమైందో తెలిస్తే మీరు రావడం ఎందుకు. పడిపోతే ఎవరో తీసుకొచ్చారండీ."

"మందు బాగా కొట్టుంటాడు. వాళ్ళవాళ్ళెవరైనా వొచ్చారా? ఈయన భార్య కూడా డాక్టరనుకుంటాను."

"అవునండి ఆవిడ ఊళ్ళోలేరట."

ఇంతలో అసిస్టెంట్ సర్జన్ రామూర్తి వచ్చాడు.

"అరే! మనవాడే... నా స్నేహితుడు. ఏమైంది? ఎగ్జామిన్ చేశారా?!"

పల్సు చూస్తున్న భానుమూర్తికి ఆత్రుత పెరిగింది.

"ఇ.సి.జి. తీస్తే బావుంటుంది. తీసుకురండి."

"ఎక్కడుందండి అది పాడైపోయి నెలరోజులు పైనయ్యింది. ఛీఫ్‌కు చెప్తే చూస్తామంటున్నారు. ఆయనక్కావల్సిన కేసులకి మాత్రం సొంతది తెచ్చి వాడుతున్నారు." అంది నర్సు.

"ఏమిటి రామూర్తి ఎగ్జామిన్ చేస్తావా!" భానుమూర్తికి చెమటలు పోయడం మొదలెట్టాయి. "బి.పి. ఆపరేటస్ కట్టండి." అన్నాడు భానుమూర్తి ముఖం తుడుచుకుంటూ.

"అది పని చేయడం లేద్సార్."

భానుమూర్తికి కోపం వచ్చింది. "ఇంత పెద్ద హాస్పిటల్‌లో బి.పి. ఆపరేటస్ లేదు, ఇ.సి.జి. మిషన్ లేదు, మరి మేమెందుకండీ?"

"మా మీద కోప్పడతారేమిటండీ అది చూసుకోవాల్సిన బాధ్యత మీది" తిరుక్కుంది నర్సు.

"పల్స్ చాలా వీక్‌గా వుంది. శరీరమంతా చెట పోసి చల్లగా వుంది. హార్ట్ అటాక్ అయివుండచ్చేమో... నువ్వూ చూడు రామూ!"



gudachari.com

రామూర్తి కూడా చాలా సేపు టెస్ట్ చేశాడు.

"హార్ట్‌అటాక్ అయితే హార్ట్ రెగ్యులర్‌గా వుందే... పల్స్ కూడా బావుంది. డయాబిటిక్ కోమా అయి వుంటుందా! పోతే పెప్టిక్ అల్సర్ (కడుపులో పుండు) సడన్‌గా నొప్పి వొస్తే యిలా వుండొచ్చు."

ఇద్దరూ అరగంట సేపు వాదించుకుని. మెడికల్ వార్డులో చేర్చుకోమని ఆయన, సర్జికల్‌లో చేర్చుకోమని ఆయన సలహా యిచ్చి ఎట్టకేలకు మగత (ఫాక్)కు మందులివ్వాలని, ఉదయం అన్ని పరీక్షలు చేసేట్లు మాట్లాడుకుని వార్డుకు పంపుదామని నిర్ణయించుకున్నారు.

"సిస్టర్, మెడికల్ వార్డులోనే అడ్మిట్ చేసి ఈ మందులు వాడమని చెప్పండి."

మగతగా వినిపిస్తున్న ఈ సంభాషణకు నవ్వాలో, ఏడవాలో అర్థంకాలేదు.

మెడికల్ వార్డు ఏమిటి? ఇన్‌టెన్సివ్ కేర్‌కు పంపించాలి గాని! వార్డు కొద్దు ఐ.సి.యు.కు పంపండి. వాళ్ళకు ఫోను చేస్తాను" అవి ఎవరి మాటలో! మేల్కొన్నారు, అనిపించింది.కానీ రెండింటికి అశక్తుడు డాక్టర్ శ్రీని.

ఓ (మనిషీ) నువ్వు బ్రతికేందుకు డాక్టర్లు కాదు కావల్సింది. నీ అదృష్టం! నో హోప్... నో హోప్ వీళ్ళు తనను చంపుతారు. డూ... సమ్‌థింగ్... డూయిట్ ఇమ్మిడియట్లీ... మీరు నన్ను బ్రతికించవచ్చు. మీకు ఆశక్తి ఉంది." అని వాళ్ళతో చెప్పాలి. కానీ ఎలా ఎలా?

అంత మగతలోనూ గుండెలో నొప్పి బాగా తెలుస్తోంది.

"రండి డాక్టర్స్! రండి!! నన్ను త్వరగా చూడండి. మీలో వొకర్ని! చచ్చిపోతున్నాను." అని గట్టిగా అరవాలనిపించింది. ఇంతలో ఏదో కలకలం.

మెల్లగా కళ్ళు తెరిచాడు.

చుట్టూ మనుషులు... ఎవరి పనుల్లో వాళ్ళు. ఆక్సిజన్ పెడ్తున్నారు. నర్సులు తలక్రింద దిండు ఎత్తుగా పెడ్తున్నారు. ఐ.వి. ఫ్లూయిడ్స్ యిస్తున్నారు. రక్తపోటు చూస్తున్నారు. వాళ్ళలో వాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారు.

గుండెల మీదంతా వైర్లు. ఇ.సి.జి. తీసారు కాబోలు. అందరి ముఖాలూ ఉత్సుకతతో వున్నాయి. ఎవరూ అవసరానికి మించి మాట్లాడ్డం లేదు.

ఎవరో భుజం మీద తడ్తున్నారు.

కళ్ళు తెరువలేక పోతున్నాను.

"డాక్టర్... డాక్టర్... కళ్ళు తెరవండి. ఎలావుంది... ఏం భయపడాల్సిన అవసరం లేదు. బాగుంది."

"బాగుంది... ఏమిటి బాగుండేది. హార్ట్ అటాకా! నాతలకాయా... హార్ట్‌అటాక్ ఏమిటి బాగుండేది" నవ్వొచ్చింది.



"ఎందుకు నవ్వుతున్నారు?"

"నేను నవ్వుతున్నానా! నాకు తెలీదే!"

"మాట్లాడకండి. నిదురపోండి."

మగత....

"మళ్ళీ ఈ నిదుర నుంచి లేస్తానో లేదో! ఉదయం మిమ్మల్నందర్నీ చూస్తానో లేదో! ఎవర్ని చూసినా చూడకపోయినా... నా భార్య స్వాతిని చూడాలి. నా పిల్లల్ని చూడాలి. తప్పదు. నేను బ్రతకాలి.. బ్రతకాలి."

సుదూర తీరాలకు వెళ్ళి పోతున్నట్లుగా వుంది. తేలిపోతున్నట్లుగా ఉంది. ఈ లోకం విడిచిపోతున్నట్లుగా అనిపించింది అంతే.

\- - -

ఫోను ఎడతెరిపి లేకుండా మోగుతూ వుంది.

స్వాతికి మెలుకువ వచ్చింది. లేవాలంటే బద్ధకం వేసింది.

ఎవరూ లేచినట్లు లేదు. అయినా ఈ అర్ధరాత్రి పూట ఎక్కడ్నించి? అనుకుంది. నిద్రముంచుకొస్తోంది. ఇంతలో ఆమె నాన్నగారు తీసినట్లుంది.

"హలో..."

"తిరుపతి నుంచా!"

ఆ మాటతో వొక్క వుదుటున లేచి వెళ్ళి రిసీవర్ అందుకుంది స్వాతి. వణుకుతున్న చేతుల్ని... అదురుతున్న గుండెనీ అదుపులో తెచ్చుకుంటూ.

వొక్క మాటే వినిపించింది. - డాక్టర్ శ్రీనిని హాస్పిటల్‌లో చేర్చామని... ఆ తర్వాత వినే శక్తి తనలో లేకపోయింది.

ఎంత ప్రమాదాన్నయినా ఎదుర్కొంటుంది. మరెంత కష్టమైనా భరిస్తుంది. కానీ భర్తకు కొంచెం బావోలేదన్నా, ఏ కాస్త అలసినట్లు కన్పించినా ప్రపంచమే తల్లక్రిందులైనట్లు వుంటుంది ఆమెకు. ఏం చేయడానికి తోచదు. భయం... భయం... ఎందుకో.

ఆ అర్ధరాత్రి ప్రయాణమై ఇక్కడకి వచ్చి డాక్టర్ శ్రీనిని చూసేంతవరకూ స్వాతి మానసిక క్షోభ అంతా ఇంతా అని చెప్పలేము.

మొదటి రోజు ఎంత కృంగిపోయిందో స్వాతి.

ఎంతో చలాకీగా, ఎప్పుడూ ప్రశాంతంగా గంభీరంగా వుండే ఆయనకు హార్ట్ అటాక్ రావడం ఏమిటి?

పరిస్థితి ఏమిటో అర్థం కాలేదు. రెండో రోజు కూడా గడచిపోయింది. ఎవ్వరూ సరైన సమాధానం ఇవ్వడం లేదు. అడిగితే "మరో రెండ్రోజులు చూడందే, ఏం చెప్పలేం" అనే సమాధానం.



gudachari.com

ఈ డాక్టర్లంతా ఇంతే. కావాలనే ఈ మాటలంటున్నారనిపిస్తూంది. అసలు పరిస్థితి వీళ్ళకి తెలియదు. అందుకే గట్టిగా అడిగితే తెలివిగా తప్పించుకుంటారు పరిస్థితి విషమంగా వున్నప్పుడు.

ఇప్పటి వరకూ వాళ్ళేం చెప్పలేదు. స్వాతికి. తన ఆత్రుతను అదుపులో ఉంచుకోలేకపోతోంది. ఎన్నో భయాలు, ఆలోచనలు. తెలిసిందల్లా ఒక్కటే... గుండెపోటు అది చాలా ఎక్కువ. ఈ గుండెపోటు అందులో మాసివ్ (చాలా ఎక్కువ) దేనికి దారితీస్తోందో ఎవరికీ తెలియదు. తన ఇష్టం వచ్చినట్లు గుండె కండరాల్ని ఎంద దూరమైనా కాల్చుకు తినవచ్చు. (గుండె పై భాగానికి రక్తం అందించే నాడి ఎంత ఎక్కువ పూడుకుపోతే ఆ భాగమంతా కండరాలు పనిచేయకుండా, దానిలోని జీవకణాలన్ని చచ్చిపోయి గుండెను నిలిపివేసే అవకాశం వుంది). లేదా ప్రాణం పోవచ్చు. వేచి చూడాల్సిందే అదే సమాధానం. వాళ్ళకు తెలిసిందీ అంతే. మరెక్కడికయినా మారుద్దామా అంటే కదిలించడానికి వీల్లేదు. డాక్టర్నీ అడుగుదామా అంటే ఎప్పుడు పరుగులు, ఉరుకుల మీద ఉంటాడు. అడిగితే

"యూడోంట్ వర్రీ." అదే సమాధానం ఎప్పుడూ.

ఈ రెండు రోజులు స్వాతి డాక్టర్ శ్రీని ఎదురుగ్గా కూర్చోడం, కన్నీళ్ళు కూడా కరువై ఎండిపోయి నిస్త్రాణమైన చూపులలో జీవం తెచ్చుకుని డాక్టర్ శ్రీని అప్పుడప్పుడూ వేసే ప్రశ్నలకు బలవంతంగా జవాబు చెప్పడం.

"అధైర్యపడకు. ఏం ప్రమాదం జరగదు. మనల్నిద్దర్ని విడదీసే శక్తి ఎవ్వరికీ లేదు. ఏవీ జరగదు. భయపడవద్దు" యిలా ఎన్నో వేల సార్లు తనకు తానే ధైర్యం చెప్పుకోవడం.

రెండు రోజుల తర్వాత ఆ రోజు ఛీఫ్ కార్డియాలజిస్ట్ మురళిని కలుసుకొనే అవకాశం కలిగింది స్వాతికి.

బాగా మారిపోయాడు. తను చదువుకొనేటప్పుడు వొక సంవత్సరం సీనియర్. అప్పుడు చలాకిగా, చురుగ్గా వుండేవాడు. ఇప్పుడు వయస్సుతో నిబ్బరం, పెద్దతనం కొట్టొస్తోంది.

డాక్టరు పరీక్ష చేస్తొన్నంత సేపూ ఏదో తెలియని ఆరాటం... ముచ్చెమటలు వొసేవి. నోరెండిపోయేది. డాక్టరు ముఖంలోని ప్రతి కదలికకూ ఏదో అర్థం... ఏం చెబుతాడో...

సిస్టర్స్‌కు, హౌస్ సర్జన్లకు సలహాలిచ్చి స్వాతి వైపు తిరిగి సూటిగా ఆమె కళ్ళలోకి చూసి మరలా పేషంట్ వైపు చూసి, "ఎన్‌జైమ్స్ లెవల్ చాలా ఎక్కువ వుంది. రెండు రోజులు గడిస్తే గానీ సరిగ్గా చెప్పలేను."

"మరి నువ్వు స్పెషలిస్టువి... ఆ మాత్రం చెప్పలేవా! ఇటు కావచ్చు, అటు కావచ్చు. మామూలు డాక్టరుకు నీకు తేడా ఏమిటి?" అని అడగాలనిపించింది స్వాతికి.

ఛ... డాక్టరుగా వుండి ఇలా ఆలోచించడం....



ఏవో కొన్ని కేసుల్లో తప్పిస్తే మిగిలిన వన్నీ కూడా ఇదమిద్ధంగా చెప్పలేనివని తనకు తెలుసు. అయినా తన భర్త రోగి. తను రోగి భార్య. ఇప్పుడు డాక్టరు కాదు.

"ఏదో ఆలోచిస్తున్నారు ఏమైనా అడగాలనా?"

అవునన్నట్లు తలవూపింది.

"రండి! అక్కడ కూర్చుందాం."

డాక్టర్ని ఎన్నో ప్రశ్నలు వేయాలని ప్రతి పేషంటు బంధువులకీ వుంటుంది. అయితే ఆ సమయంలో మరచిపోయి వెళ్ళిపోయిన తర్వాత అరే పథ్యం అడగలేదే! కోడి మాంసం తినొచ్చా... మాత్రలు మంచినీళ్ళతోనా... వేడి నీళ్ళతోనా? భోజనానికి ముందా, వెనుకా?... భోం చేసి నిద్రపోవచ్చా... కాగితంపై అన్ని ప్రశ్నలూ వ్రాసుకుంది స్వాతి కూడా.

నవ్వుతూ స్వాతి వైపు చూసి "కానివ్వండి."

మొదటి ప్రశ్న "నా భర్త పరిస్థితి ఏమిటి?"

"నే నింతకు ముందే చెప్పాను. ఇంకా సరిగ్గా తెలియదు."

"మరి హౌస్ సర్జన్ మాసివ్ హార్ట్ అటాక్..."

"ఫూల్... ఆ విషయం మీతో చెప్పివుండకూడదు" విసుక్కున్నాడు.

"ఒక్క సారి గుండెపోటు వచ్చిన తర్వాత గుండె తిరిగి మామూలుగా పనిచేసే అవకాశం వుందా?"

"బాగయిన తర్వాత తిరిగి హార్ట్ అటాక్ వొచ్చే అవకాశం వుందా?"

ఆ ప్రశ్నలకు చిన్నగా నవ్వుకున్నాడు. డాక్టరయి వుండి కూడా అర్థం లేని ప్రశ్నలు వేస్తున్నానేమో! అనిపించింది స్వాతికి.

"చెప్పలేము. మీ వారికి యాన్‌జైనల్ అటాక్. హార్టులో పెద్ద డామేజీ కనిపించటం లేదు. కానీ ఎందుకో అతను ప్రమాదంలోకి వెళ్ళాడు."

స్వాతికి చాలా కోపం వచ్చింది.

"మరి మీరంతా స్పెషలిస్టులు ఎందుకు? చాలా కేసులు చూసి వుంటారు కదా ఇటువంటివి. మీ దగ్గర దానికి సంబంధించిన రికార్డ్స్ వుంటాయి కదా! ఏ కేసు ఎలా వుంటుందో మీకుండే అనుభవంతో చెప్పలేరూ!" చాలా గట్టిగానే మాట్లాడింది.

డాక్టర్ ముఖం పాలిపోయింది. విభ్రాంతిగా స్వాతిని చూస్తూ వుండిపోయాడు. మెల్లగా తేరుకుని చిన్నగా, "మీ బాధ నాకర్థం అయింది. మీరూ డాక్టరే. మెడిసిన్ ఎంత అన్‌సర్టన్‌గా వుంటుందో, కొన్ని విషయాల్లో నిర్ణయం తీసుకోవడం ఎంత కష్టమో మీకు తెలుసు" అన్నాడు స్వాతిని కొంచెం గుర్రుగానే చూస్తూ.

ఐదవ రోజు స్వాతి జీవితంలో మరపురాని రోజు. ఆ రోజే పరిస్థితి ప్రమాదకరం." అని కాక, "బాగుంది" అనే మాట విన్నది డాక్టర్ల నుంచి.



gudachari.com

స్వాతి వెళ్ళేసరికి శ్రీని కూర్చుని వున్నాడు. తనను చూసి హాయిగా నవ్వుతున్నట్లని పించింది. స్వాతి నవ్వింది. స్వాతి కళ్ళలోంచి నీరు కారుతోంది. తనకు తెలియకనే ఏడుపు... చెప్పలేని ఆనందం... మోయలేని బరువేదో సునాయసంగ తొలగినట్లయి గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. పరిసరాల్లో ఎవరున్నారో గమనించే స్థితిలో లేదు. ఒక్క వుదుటన పరుగెత్తికెళ్ళి గుండెలకు హత్తుకు పోయి ఏడ్చేసింది స్వాతి.... ఏడుస్తూనే నవ్వుతోంది. నవ్వుతూ ఏడుస్తోంది.

"నన్ను అన్యాయం చేసి వెళ్ళిపోవాలనుకున్నారా! నేను లేకుండా మీరు వెళ్ళగలరా... భయంకరమైన ఈ అయిదు రోజులూ నాకెంత శిక్ష... జన్మజన్మలకూ వద్దు."

స్వాతి తలని పొదివి పట్టుకుని

"ప్లీజ్... టేకిట్ ఈజీ... ఈజీ..."

స్వాతి ముఖాన్ని ముద్దుపెట్టుకుంటూ, కన్నీరు తుడుస్తూ వీపు నిమురుతూ ఏదో అంటున్నాడు. ఏం చెపుతున్నారో స్వాతికి తెలియదు. ఇన్ని రోజుల శ్రమ, మానసిక వ్యధ ఒక్కసారిగా తొలిగేసరికి నిద్ర ముంచుకు వచ్చింది స్వాతికి. మెల్లగా ఈ లోకానికి దూరంగా సుషుప్తిలోకి జారుకుంది. ఎంతసేపలా ఒడిలో నిద్రపోయిందో... తెలీదు.

\- - -

అలసి ఆదమరచి తనవొడిలో నిద్రపోతొన్న స్వాతిని చూస్తుంటే ఆ అయిదు రోజులూ ఎంత మానసిక క్షోభ అనుభవించిందో తలచుకుంటే జాలి వేసింది. ప్రేమతో హృదయం స్పందించి కళ్ళలో నీళ్ళు పొంగుకొచ్చాయి డాక్టర్ శ్రీనికి.

వింతగా వుంది, డాక్టర్ శ్రీనికి ఇదంతా.

తనెప్పుడూ కలలో కూడా అనుకోలేదు.

ఎవరికైనా గుండెపోటు వచ్చి మరణించారంటే...

"అరెరే... పాపం... చాలా మంచివాడు... అతనికా!

చాలా యాక్టివ్‌గా వుండేవాడే!"

"ఓహో! అతనా.... లావుగా.... పొడవుగా... నిజమేలేండి ఆరోగ్యం మీద అతనికి శ్రద్ధ లేదు. ఎప్పుడూ త్రాగుడు, పేకాట."

"అరే! వాడా... బాగా తిరుగుబోతు."

"కనీసం నలభై సంవత్సరాలు దాటిన తర్వాతైనా అప్పుడప్పుడూ పరీక్ష చేయించుకోడం మంచిది. ఆరు నెలలకు ఒకసారి అయినా చేయించుకోవాలి."

"ఆ ఏముంది లేండి ఈ కాలంలో ముప్పయ్యేళ్ళకే వచ్చేస్తోంది."

"వాళ్ళ నాన్నగారు, వాళ్ళ మేనమామ కూడా గుండెజబ్బుతోనే చనిపోయారండి"... ఎవరైనా తనవద్ద కొచ్చే పేషంట్లు చెప్తే - డాక్టర్‌శ్రీని అనే మాటలివి.



నవ్వొచ్చింది. అయిదు రోజుల క్రితం డాక్టరు, నేడు పేషంటు.

హార్ట్ అటాక్... యస్ హార్ట్ అటాక్... ఆ పదం వింతగానూ కొత్తగానూ వుంది. వైతరిణి దాటి యముని కబంధ హస్తాల నుండి అతి మెళకువగా తప్పించుకొని ఈ రోజు హాస్పిటల్ బెడ్ మీద కూర్చుని చావు బ్రతుకుల తేడాను బేరీజు వేస్తున్నాడు డాక్టర్ శ్రీని.

చావు... బ్రతుకు... ఎంతటి సున్నితమైన వ్యత్యాసం ఈ రెండింటి మధ్య...!

ఆ రోజు డాక్టర్ శ్రీనిని ఇన్‌టెన్సివ్ కరొనరీ కేర్ యూనిట్ రూము నుంచి మామూలు మెడికల్ వార్డుకు మార్చారు. ఆ హాస్పిటల్‌లో ఐ.సి.యు. చాలా చిన్నగది. అందులో వొక పేషంటును మాత్రమే వుంచే అవకాశం వుంది. ఐ.సి.యు. అంటే గుండెపోటు వచ్చిన వాళ్ళను ఇరవై నాల్గుగంటలూ వాళ్ళ గుండెలోని మార్పులు, వాళ్ళకు కావలసిన ఆక్సిజన్, అత్యవసర పరిస్థితిలో కావలసిన అన్ని మందులు, వొక డాక్టరు, వొక నర్సు ఎప్పుడూ పేషంటుకు అందుబాటులో వుండే గది.

జనరల్ మెడికల్ వార్డులో చేర్చారు. స్పెషల్ రూము కావాలని స్వాతి గొడవ చేసింది. అయితే వున్నవే రెండు. అందులో వొకదాన్ని స్థానిక ఎం.ఎల్.ఏ. బంధువు ఆక్రమించగా, మరొకదాన్లో పలుకుబడి కలిగి వోడిపోయిన ఒక నాయకుని కుమార్తె భర్త మీద అలిగి తిష్ట వేసి కూర్చుని వుంది.

అందుకని డాక్టరనే ప్రత్యేక అభిమానంతో (నయం ఆ మాత్రమైనా గౌరవం ఇచ్చారు) బెడ్ చుట్టూ గుడ్డలతో రూము లాగా కర్టెన్‌లు వేసియిచ్చారు. గాలి కూడా ఫర్వాలేదు. అనిపించింది డాక్టర్ శ్రీనికి. స్వాతికి మాత్రం అరికాలిమంట నెత్తికెక్కుతూ ఉంది పరిసరాల్ని చూస్తుంటే.

వింత అనుభవమే...

డాక్టరుగా ఉదయం ఎనిమిది గంటలకు హాస్పిటల్‌కి వెళ్ళడం వేరు. డాక్టరు పేషంటుగా ఇరవై నాలుగ్గంటలూ రకరకాల పేషంట్ల మధ్య వుండడం వేరు.

డాక్టరుగా తెలుసుకోనివి, ఊహించనివి హాస్పిటల్‌లో జరిగే వింతులు విడ్డూరాలు, కొన్ని నగ్నసత్యాలు ఇప్పుడు తెలుస్తున్నాయి డాక్టర్ శ్రీనికి.

అనుభవం అనూహ్యం... అద్భుతం అనిపించింది.

\- - -

రోగిని మానవత దృష్టితో ఆదరించి అర్థం చేసికోవాలంటే ప్రతి డాక్టరు జీవితంలో వొక్కసారైనా జనరల్ వార్డులో పేషెంటుగ వుండాలనిపించింది.

పేషంట్ల దగ్గరుండే బంధువులు వొక్కసారిగా నర్సుల మీద విరుచుక పడుతున్నారు.

"యూరిన్ రాలేదండీ..."



gudachari.com

"బెడ్‌పాన్ పెట్టేందుకు రాత్రి ఎవ్వరూ రాలేదండి, పది రూపాయలిస్తే వొస్తామన్నారండి."

"రాత్రంతా మా వారు నిద్రపోలేదు."

"కడుపులో నొప్పి వచ్చింది." "వాంతి అయింది."

"గుండెల్లో నొప్పి తగ్గలేదు."

"మీరేం చేస్తున్నారు... పేషెంట్లు బాధ పడుతుంటే డిటెక్టివ్ నవల్లు చదువుతూ కూర్చున్నారా?"

"అవసరానికి వొక్కరూ పలకరు ఏం హాస్పిటల్ ఇది."

"ఒక నరకం... యమకూపం."

"ఆ లెట్రిన్ వాసన ముక్కు అదరగొట్టేస్తోంది."

"నా పక్క బెడ్ పేషంటు అక్కడే దొడ్డికి కూర్చున్నాడు. భరించలేకుండా వున్నా."

"అంతేనండీ జనరల్ హాస్పిటలంటే అంతే వస్తే మళ్ళీ తిరిగి వెళ్ళే ప్రశ్నే లేదు."

"... అమ్మో... ఆ బెడ్ మీదనే వుండను. నా పక్క పేషంటు రాత్రి వున్నట్లుండి చనిపోయాడు."

..................?

మానవ మనస్తత్వం అద్భుతం...

నర్సులని తెగ తిట్టేవాళ్ళు, తెగ మెచ్చుకొనే వాళ్ళు...

పేషంట్లని కసిరి కొట్టే నర్సులూ.... ఆదరంతో ఆప్యాయంతో సేవలు చేసే నర్సులూ...

నిజంగా పేషంటుకు, జబ్బుకూ లింకులు ఈ నర్సులే.... ఇవ్వాల్సిన సమయానికి కరెక్టు మోతాదు మందు ఇచ్చేవాళ్ళు - ఇదీ నర్సుల్ని గురించి సామాన్యంగా డాక్టర్లకు తెలిసింది.

కాని ప్రస్తుతం తమ పేషంటు. ఎన్నో తెలియని నిజాలు...

సత్యాలు...

నర్సుని పిలిస్తే, "ఊ! చెప్పండి"

"పక్క బాగా లేదు." దిండు సరిగా సర్ది పడుకోబెట్టి

"ఇప్పుడు బావుందా?"

"బాగవుతుంది. అధైర్యపడకండి. నేను డాక్టరు గారితో చెబుతాగా! బాగా చూస్తారు...." అంటూ ఇరవై నాలుగ్గంటలూ పేషంట్ల మధ్య తిరిగే దేవతలు.

వీరే ముఖ్యం పేషంటుకు.

మహా వస్తే డాక్టరు రోజుకి వొకసారి లేదా రెండు సార్లు వొస్తాడు. వచ్చి కొందరి బాగోగులు కనుక్కుంటాడు. మరి కొందరు డ్యూటీ ప్రకారం రక్తపోటు, జ్వరం చూసి



పొట్టమీద ఛాతీ మీద నాల్గుసార్లు తట్టి, నర్సుతో ఏదో మాట్లాడి వెళ్ళిపోతారు. పేషంటు గాని వాళ్ళ బంధువులు గాని ఎన్నో డాక్టరుకు చెప్పాలనుకున్నవి నోట్లోనే అణిగిపోతాయి.

ఇవన్నీ ఆలోచిస్తుంటే గుండెల్లో ఏదో బరువుగా తోచింది డాక్టర్ శ్రీనికి. కానీ నొప్పి మాత్రం కాదు, నొప్పిగా ఉంది అని చెప్పాలంటే భయం. ఎందుకంటే

ఈ వారం రోజుల్నుండీ నొప్పి అంటే చాలు వొక్క ఇంజక్షన్‌తో తనను ఈ లోకం నుండి పంపించి వేస్తున్నారు. అంత చిన్న నొప్పికి మత్తు ఇంజక్షన్ అవసరం లేదు. అయినా వాళ్ళిచ్చేస్తున్నారు.

"హలో! సర్...." చాలా సీరియస్‌గ వున్నారు హౌస్‌సర్జన్ కాబోలు.

"హలో...." శ్రీని ఛార్టు తీసుకున్నాడు.

"ఏమైనా బాధ వుందా!"

"కొద్దిగా!"

"ఎంత కొద్దిగా?"

"భరించ గలిగినంత కొద్దిగా."

కొద్దిగా అంటే ఏం వ్రాయాలో అర్థం అయినట్లు లేదు.

"ఓహో... ఎంత... ఏ విధంగా..." విసుగ్గా అడిగాడు.

"మీ పెద్ద వాళ్ళంతా యింతే?" ఛార్టులో ఏదో వ్రాసి గొణుక్కుంటు విసురుగా వెళ్ళిపోయాడు.

డాక్టర్ శ్రీనికి నవ్వొచ్చింది. తను హౌస్ సర్జనుగ వుండిన రోజులు గుర్తొచ్చాయి. మెడలో స్టెతస్కోపు పడితే చాలు సాధించలేనిది ఏదో సాధించిన తృప్తి... దాంతో అహంకారం, లెక్కలేనితనం చోటు చేసికుంటాయి. మిగిలిన మనుష్యుల కంటే మనం ప్రత్యేకం అనే గుడ్డి నమ్మకం చోటు చేసుకుంటుంది, చాలా మందిలో.

ఆ రోజు మధ్యాహ్నం చెప్పాడు.

"నాకు నొప్పి అంతగా లేదు, బావుంది. కొద్ది నొప్పి అని చెప్పినా మత్తు ఇచ్చేస్తున్నారు. అంతకన్నా ఏదైనా టాబిలెట్ ఇవ్వచ్చుకదా!"

ఆ చిన్న డాక్టరుకు చాలా కోపం వచ్చింది.

"మేం ఇన్‌స్ట్రక్షన్స్ ఫాలో కావాలండి. మీకు ఇష్టం వుంటే వేయించుకొండి లేకపోతే లేదు." అంటూ బర బరా వెళ్ళిపోయాడు.

సాయంత్రం డ్యూటీ మారిన తర్వాత అదే విషయం మరో డాక్టరుతో చెప్పాడు.

"అలాగా... మీకు ఇష్టం వుంటేనే వేసికోండి." ఎంతో మంచిగా, అనునయంగా నవ్వుతూ అనడం చూసి,



gudachari.com

అబ్బా... కొందరైనా వున్నారు పేషంటు మాటవినేవాళ్ళు అనిపించింది డాక్టర్ శ్రీనికి. నొప్పి తగ్గిపోయింది.

కానీ ఒక నగ్న సత్యం తెలిసింది శ్రీనికి తన జీవితంలో ఇదో రకమైన అనుభూతి.

ఈ పేషెంటుకు ఈ మాత్రే ఇవ్వండి. అదివద్దు. కాదు కూడదని పేషెంటు ఆ మాత్రలు నాకు పనిచేయడం లేదంటే పేషెంటుని వొక్క ఉరుము ఉరిమి మందు సంగతి నీకు తెలుసా! నాకు తెలుసా! ఇచ్చింది తీసుకో అని కసిరికొట్టే డాక్టర్లను ఎంతో మందిని చూసి ఉన్నాడు తను.

మీరిచ్చే మందు నాకు పనిచేయడం లేదు. నాకేదో చేసేస్తోంది అని పేషెంటు అంటే అది తన చదువునే అవమానించినట్లు, తన అనుభవాన్నే కించపరచినట్లు బాధపడిపోయి కోపం తెచ్చుకుని విసుక్కుంటారు. సరియైన పరిజ్ఞానం లేక పేషెంటు అలా అని వుండొచ్చు. లేదా అన్ని రోజులు వొకే మందు వాడడం వల్ల నమ్మకం పోయి వుండొచ్చు.

అది ఎంత తప్పో తనీరోజు గ్రహించాడు.

పేషెంటు మాటల్లో నిజం వుంటుందని, వారి దృష్టిలో మందు ప్రభావం ఎలా వుంటుందో ఆలోచించేందుకు తమ డాక్టర్ బిరుదు అడ్డం వస్తుంది చాలా మందికి.

తనకుండే తెలివినంతా ఉపయోగించి మందు వ్రాస్తే... పని చేయడం లేదంటారా! ఎంత పొగరు.

డాక్టర్ శ్రీని - తనెప్పుడైనా ఇలా ప్రవర్తించాడా!

తెలిసిగాని, తెలియక గాని పేషెంటుని అశ్రద్ధ చేశాడా...

ఆలోచించసాగాడు.

ఒకసారి తను ప్రభుత్వ డాక్టరుగా వున్నప్పుడు వయసు మళ్ళినాయనొకరికి యూరినరీ బ్లాడర్ (మూత్రకోశం) ఆపరేషన్ చేసి మూత్రం పోసుకొనేందుకు గొట్టం ఎక్కించి నర్సుతో చెప్పి వచ్చేశాడు.

వేకువన నాలుగ్గంటలకి ఫోన్ వచ్చింది. ఆ పేషెంటు కడుపునొప్పికి గొడవ చేస్తున్నాడని. ఆపరేషన్ బాగా చేశానే! మరి ఎందుకు అలా అయ్యింది?! అనుకుంటూ.

"డ్యూటీ డాక్టరుకి ఫోన్ చేయలేదా!" అని అడిగాడు.

"చేశానండి... అదేం వుండదు వూరికే గొడవ చేస్తారు ఈ ముసలాళ్ళు మత్తు ఇచ్చేయమన్నారండి. అలాగే ఇచ్చాను. అయితే మళ్ళీ వొక గంట నుండీ వొహటే గొడవ.... వాళ్ళ బంధువులంతా వొకటే ఏడుపు."

"యూరిన్, గొట్టం నుండి వొస్తోందేమో చూశారా"

"చూశానండి రావడం లేదు."



gudachari.com

ఎక్కడ లేని కోపం వచ్చింది డ్యూటీ డాక్టరు మీద. పనికిమాలిన వెధవ, తను లేచి వచ్చే ఓపిక లేక మత్తు మందిచ్చేయమని చెప్పాడు. పాపం... ఆ పేషెంటు ఎంత బాధ పడ్తున్నాడో.... వెంటనే బయలుదేరి హాస్పిటల్‌కి వెళ్ళాడు, తను. చూస్తే గొట్టం మాత్రం లోపలే వుంది. కన్నీళ్ళు పెట్టుకుంటూ చేతులెత్తి" డాక్టర్! ఆపరేషన్ బాధ కంటే ఈ బాధ భరించలేకున్నాను. దీనికంటే నన్ను చంపెయ్యండి." దండపెడ్తూ అన్నాడతను డాక్టర్ శ్రీని చూసి.

అనునయించి గొట్టం తీసి చూశాడు. గొట్టనికి వుండే రంధ్రం రక్తంతో పూడుకుపోయి వుంది. తుడిచి మళ్లా పెట్టాడు. యూరిన్ బాగా వచ్చింది. మోయలేని బరువు దించిన హాయి అతనికి. ఉన్నంత సేపు దండాలు పెట్తూనే వున్నాడు. అయితే తన మనసు కోపంతో వుడికిపోయింది.

ఆ హౌస్ సర్జన్‌ను పిలిచి

"చూడు మిస్టర్! నువ్వు పేషెంటును చూసి తెలియలేదని చెప్పినా క్షమించవచ్చు. లేదా నిద్రే ముఖ్యం అయితే నాకు చెప్పమని నర్సుతో చెప్పొచ్చు. మత్తు యిచ్చి పడెయ్యమని చెప్పడం ఎందుకు? అదే మీ నాన్నో, మరో బంధువో అయితే నువ్వే ఎంతో గొడవ చేసి, హాస్పిటల్ని ఇక్కడున్న వాళ్ళని పందులని, దున్నపోతులని ఎంతగా తిట్టి పోసేవాడివో... అదే జాతికి నువ్విపుడు బంధువువు." అన్నాడు తన కోపాన్ని అణుచుకోలేక.

అందరి ముందూ తనని అవమానించినట్లు గుర్రుగా చూసాడు.

"రావలసింది కోపం కాదు, బుద్ధి. ఒక రోగిని నీకు శ్రమ కలుగుతుందని అనవసరంగా బాధ పెట్టావు. అతను ఎంతో నమ్మకంతో అతని బాధను, ప్రాణాన్ని మన చేతుల్లో వుంచాడు. పైకి రావలసిన వాడివి తెల్సుకోవలసింది చాలా వుంది. డాక్టర్ పట్టా పుచ్చుకోగానే సరిపోదు. ఇంగితజ్ఞానం, మానవతా దృక్పథం చాలా అవసరం డాక్టరుకు. వెళ్ళు... మళ్ళీ ఇలాంటి పొరపాటు ఎప్పుడూ చేయకు." అని వచ్చేసాడు.

తనకు తెలుసు, తను తిట్టాడని కోపం వున్నాదే గాని, తను చెప్పిన దాన్లో మంచిని గ్రహించలేదని. బాధపడ్డాడు ఆ రోజు. అదొక అనుభవం. అటువంటి వెన్నో. తెలుసుకుంటే బాగుపడుతాడు.

ఇవన్నీ మాములుగా డాక్టర్లకు తెలియకనే జరిగిపోతుంటాయి. ఇక డాక్టరు లేనపుడు జరిగేవి. డాక్టరు తెలుసుకోవలసినవి చాలా వున్నాయి.

కొందరు పేషంటును ప్రశ్నించి, ఆ వైపుకు, ఈవైపుకు పేషంటును త్రిప్పి త్రిప్పి ఏవో చొప్పదంటు ప్రశ్నలు వేసి హడావిడిగా వెళ్ళిపోతుంటారు. చాలా మందికి పేషెంటు ఏదో వొక జడ పదార్థం. డాక్టరు వొస్తే ఎన్నో అడగాలనుకుంటాడు పేషెంటు పాపం! అతను చేప్తూనే వుంటాడు. డాక్టరు తన పని చేసికుపోతూనే వుంటాడు. డాక్టరుకు పేషంటుని

గురించి తెలుసుకోవడం కంటే వేరే పనేం వుంటుంది? ఎంత అనుభవం ఉన్నా ఎంతటి చిన్న విషయమైనా అశ్రద్ధ చేయకూడదని ఇంగిత జ్ఞానం డాక్టర్లకు ఉండాలి.

డాక్టరు పేషెంటు మాటలకు విలువ ఇవ్వాలి. జబ్బును గురించే గాక

"ఇక్కడ వుండే వాళ్ళు ఎలా చూస్తున్నారు."

"భోజనం ఎలా వుంది? ఇక్కడ నీకు బావుందా?"

"పిలచినప్పుడు నర్సులు వాళ్ళు పలుకుతున్నారా?"

"నీకేదైనా కావాల్సుంటే నాకు చెప్పు!"

ఇవన్నీ చొప్పదంటు ప్రశ్నలు కాదు. పేషెంటుకు మానసికంగా చాలా తృప్తినిస్తాయి. డాక్టరును పేషెంటుకు చాలా దగ్గరగా తీసుకువెళ్తాయి. ఈ ప్రశ్నలు తను కూడా పేషెంట్లకు వేసిన గుర్తులేదు. కానీ వాటి అవసరమెంతో తనకిప్పుడు తెలిసివచ్చింది.

తను కూడా తన పేషెంట్లకు రాత్రి పూట అవసరముంటే నిద్రమాత్రలు వ్రాసేవాడు. నిజంగా ఆ నిద్ర మాత్రల అవసరం ఏమిటో ఇప్పుడు తెలియవచ్చింది. అవి పేషెంటుకు కాదు ముఖ్యం డ్యూటీ చేసే డాక్టరుకు, నర్సులకు, మధ్య మధ్యలో వాళ్ళను నిద్ర లేపకుండా, విసిగించకుండా, పనిపెట్టకుండా నోరు మూసుకొని పడి వుండేందుకు కొంత వరకు పేషెంటు ఆత్రుతను ఉపసమనమిస్తాయి. అయినా ఆలోచించాలి.

ఏవైనా గొడవ చేసేట్లుంటే వొక మాత్ర వేస్తే సరి! ఆ రాత్రంతా హాయి.

తను డాక్టరు కాదిప్పుడు, పేషెంటు, గుండెపోటు పేషెంటు. ప్రమాద పరిస్థితి దాటిన తర్వాత నిద్రమాత్రల అవసరం లేదు. అసలీ అలవాటు వ్యాధి లా అంటుకొనే ప్రమాదం వుంది. ముఖ్యంగా మెడికల్‌కి సంబంధించిన వాళ్ళల్లో. సీరియస్ పేషెంట్లులో ప్రతి చిన్న మార్పు మరో పెద్ద మార్పునకు నాంది. అది తెలుసుకుని ముందుగానే డాక్టరు జాగర్త పడాలి.

"ఏమిటి డాక్టరు గారు! నిన్న ఇంజెక్షన్ వద్దన్నారు. ఈవాళ మాత్రలే వద్దంటున్నారు!!"

"చెప్పండి గుండెపోటు పేషెంటు మాములుగా నొప్పి లేకుండా వున్నప్పుడు ఏమిటి వీటి అవసరం?" అడిగాడు శ్రీని.

కొంచెం సేపు డాక్టరు శ్రీనివైపు చూసి.

"ఆల్‌రైట్ అలాగే మీ ఇష్టం, మీరూ డాక్టరే." అన్నాడు.

మరుసటి రోజు డాక్టర్ శ్రీనిని స్పెషల్ రూములోకి మార్చారు. అందులో వున్న వాళ్ళను ఎట్లా డిస్‌ఛార్జీ చేసారో... పాపం!

ఆ రూములో అడుగుపెట్టగానే తెలిసింది. దాన్ని వాళ్ళు పర్మనెంట్ ఇళ్ళుగా వాడు కుంటున్నారని.



రకరకాల వాసనలు... మసాలా వాసన గుప్పున కొట్టింది. గోడల మీదంతా పిల్లలు కాబోలు ఎ.బి.సి.డి.ల దగ్గిర నుంచి లవ్ దాకా పదాలు, వాళ్ళు మంచి కార్టూనిస్టులు కూడానేమో! బొమ్మలు కింద ఎన్టీయర్, ఏయెన్నార్, కృష్ణ, శ్రీదేవిల పేర్లున్నాయి. నేల మీదంతా వివిధ రకాల మరకలు.... బహుశా వాళ్ళ భోజనాల్లో వంటకాలు ఏవేం వున్నాయో వాటిని చూసి చెప్పొచ్చు. ఇక పరుపూ, మంచం చూస్తే పరిగెత్తి పారిపోవాలనిపిస్తుంది.

ఇది స్పెషల్ రూము....

ఇది దానిలో వున్న వారి సంస్కృతి.

ఎప్పుడు బాగు పడ్తుందో ఈ దేశం!

కనీసం ఈ హాస్పిటల్ అధికార్లు సైతం నోరెత్తి వుండరు పాపం. బాగా డబ్బున్న వాళ్ళు అయి ఉంటారు.

తనని తన పరిసరాల్ని శుభ్రంగా వుంచుకోవాలనే తపన మనిషిలో ఎప్పుడైతే కలుగు తుందో అప్పుడే ఈ దేశం ముందుకు పోతున్నట్లు.

దాన్ని చూసి డాక్టర్ శ్రీని ససేమిరా అందులో వుండనన్నాడు. కనీసం దాన్ని కడిగించండి అన్నాడు నర్సుతో.

"డాక్టరు గారూ! మీకు తెలియంది ఏవుంది. ఈ కడిగే వాళ్ళు, చిమ్మే వాళ్ళ సంగతి. నిన్న సాయంత్రం నుంచి పోరాడుతున్నాను. వొక్కరూ మాట వినడం లేదు. కాస్త గట్టిగా మాట్లాడితే.... యూనియన్లు (మా) హక్కులు, నినాదాలు. నేనే కడుగుతాను. మీరు చేరండి." అంది నిస్సహాయంగా. అంతే మరి.

ఇంతలో స్వాతి వచ్చింది.

రూమునంతా కడిగి, బెడ్ సర్ది కొంతవరకూ నివాసయోగ్యం చేశారు. ఒక యమ్.డి. డాక్టరు, హెడ్ నర్సు కలిసి.

- - -

మద్యాహ్నం ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు డాక్టర్ శ్రీని. స్వాతి బయట కెళ్ళింది. వున్నట్లుండి తలుపులు దబాలున తోసుకుని ఇద్దరు వ్యక్తులు విసురుగా వచ్చారు. "ఏమనుకుంటున్నావు నువ్వు? మహా గొప్పనుకుంటున్నావా.... ఏం చేస్తావు నువ్వు మమ్మల్ని?" అంటూ విరుచుకు పడ్డారు.

డాక్టరు శ్రీనికి ఏం అర్థం కాలేదు.

"ఏమిటండీ? అసలు మీరెవ్వరు??"

"మేం ఎవరమైతే నీకెందుకు ముందు దీనికి సమాధానం చెప్పు..."



gudachari.com

డాక్టరు శ్రీనికి కోపం తారాస్థాయినందుకొంటోంది. అయినా కంట్రోలు చేసికుంటూ....

"ఆల్‌రైట్ నేను డాక్టర్ శ్రీని.... మరిప్పుడైనా మీరెవరో చెబుతారా!?" అన్నాడు.

ఆ మాటతో వొక్కమారు బిత్తరపోయి తడబడుతూ, "నేను... మేము డాక్టర్లము."

"అలాగని మీరు మెడలో తగిలించుకున్న ఆ రబ్బరు గొట్టం, తెల్ల కోటు చెప్తున్నాయి ఏమిటిదంతా?"

ఇంతకీ జరిగినదేమిటంటే ప్రక్క గదిలోని పేషెంటు మీద విసురు, డాక్టరు శ్రీని మీద పడింది. వాళ్ళు తెలియక పొరపాటున ఆ గదిలో ప్రవేశించారు. అయినా ఇదా పద్ధతి - బాధ పడ్డాడు శ్రీని. ఇద్దరూ పదిసార్లు 'సారీ' చెప్పి గుంట ముఖాలతో బయట పడ్డారు.

రోగి మీద... అందులో హార్ట్... మామూలు పేషెంటైనా సరే... అంతగా విరుచుకు పడడం...? ఎవరిచ్చారు వీళ్ళకీ అధికారం? ఎందుకింత చిన్నచూపు, లెక్కలేనితనం పేషెంటును చూస్తే?

ఎదురు తిరగడనే కదా!

ఆ మాత్రం మర్యాద తెలియదా అడిగిరావాలని! - నీవు డాక్టరు వైనంత మాత్రాన నేను నీ బానిసను కాను. ఈ విధంగా అమర్యాదకరంగా ప్రవర్తించే హక్కు లేదు మీకు. బయటకు వెళ్ళండి - అనే ధైర్యం ఈ పేషెంట్లకుంటే వాళ్ళలా ప్రవర్తించలేరు. భయం... ప్రాణం మీద తీపి... మనిషి అహంకారం మీద భయం... వాళ్ళ ప్రవర్తనకు చాలా నొచ్చుకున్నాడు డాక్టర్ శ్రీని.

అసలు డాక్టర్‌కు, మెడికల్‌కు సంబంధించిన వాళ్ళకి కొన్ని నిబంధనలుండాలి. వున్నాయి. కానీ రకరకాల మనుషులు.

ప్రతి డాక్టరూ కనీసం ఒక వారం రోజుల పాటు అందరి పేషెంట్ల మధ్య జనరల్ హాస్పిటల్‌లో వుండేట్లు నిబంధన తప్పని సరి అని మరీ మరీ అనిపించింది. అప్పుడు గానీ పేషెంటు అంటే ఏవిటో డాక్టరుకు తెలిసి వస్తుంది.

చెడిపోయింది... చెడిపోతోంది... నాశనం అయిపోతోంది. వైద్య వృత్తి పాడైపోతోంది.

గుండెపోటు కంటే ఇదే ఎక్కువ బాధనిపించింది.

"కాసేపు లేచి తిరిగితే బావుండు... లేవగలనా! అనిపించింది డాక్టర్ శ్రీనికి.

"ఓ.... బ్రహ్మాండంగా... ఏమైంది నాకు హార్ట్ అటాక్ వచ్చింది, పోయింది. దానికే ఇంతయిదైపోవాలా!" ధైర్యం చెప్పుకున్నాడు తనకుతానే.

"ఉక్కు మనిషివి నువ్వు. ఎన్ని చావులు చూళ్ళేదు. ఎందర్ని నీ చేతుల్తో బ్రతికించలేదు. ఆత్మ విశ్వాసముంటే చావునైనా సాధించవచ్చు."



ఇంతలో స్వాతి వచ్చింది సరంజామాతో. ఆమెను చూసి ఈ వారం రోజుల్లో ఎంత మార్పు...! "జబ్బు తనకు చేసినట్లు లేదు. ఆవిడకు చేసినట్లుంది. తనకంటే విశ్రాంతి ఆమెకు అవసరం - అనిపించింది. తను చచ్చిపోతాడని ఎంత తల్లడిల్లి పోయిందో... పాపం!!" అనుకున్నాడు.

హిందూ స్త్రీకి మంగళసూత్రం ముఖ్యం. భర్త ముఖ్యం. అవునా!!

ప్రపంచం ఏమైపోయిందో, కాలం తిరుగుతుందో లేదో గుర్తు లేదు స్వాతికి.

నవ్వుతూ, "ఈ రోజేం వారం?" అన్నాడు.

"ఈ రోజాండీ?;.. ఈ రోజు... ఉండండి కాలెండర్ చూసి చెప్తాను." అంటూ, "ఈ రోజు ఏ తేదీ?" అని డాక్టర్ శ్రీనినే ప్రశ్నించింది. అలా వుంది ఆమె పరిస్థితి.

నవ్వుకున్నాడు డాక్టర్ శ్రీని.

నవ్వు చూసి, "అబ్బ... నన్నే పరీక్ష చేస్తున్నారా? మీకలాగే వుంటుందండీ... మీ ఆరోగ్యం ముఖ్యంనాకు. తేదీలు దినాలు నా కనవసరం." అంటూ దగ్గర చేరి ముఖాన్ని తన చేతుల్తో స్పృశిస్తూ, "చాలా తగ్గిపోయారండి." అంది కన్నీరు పెట్టుకుంటూ.

"నేనా! నువ్వా!!, ఎవరైనా చూస్తే నువ్వే పేషెంటనుకుంటారు. అది సరే... నాకు లేచి తిరగాలని వుంది." అన్నాడు.

"అమ్మో!" బాంబు పడినట్లు భయపడింది.

"డాక్టర్ని కనుక్కోకుండా మీరు బెడ్ దిగడానికి వీల్లేదు."

"నేనెవరు?"

"మీరు డాక్టరు!"

"కాదు! నేను పేషెంటుని. పేషెంటు లేచి తిరగ్గలను అంటుంటే మధ్యలో డాక్ట రెందుకు?"

స్వాతి కళ్ళలో వెయ్యి భయాలు... అనుమానాలు... వేడికోలుగా చూస్తూ "వుండండి వొక్క మాట అడిగి..."

పడక మీది నుంచి లేచి నిలబడ్డ శ్రీనిని ఎంతో సున్నితంగా పొదివి పట్టుకుని, శరీరానికి తన శరీరం అనించి, బరువంతా తనపైన వేసికొని పాదాలు భూమ్మీద నిలుస్తాయో లేదా అని పదే పదే ముఖంలోకి పాదాల వైపు చూస్తుంటే నవ్వొచ్చింది శ్రీనికి.

నిల్చోగానే కొంచెం తల తిరిగినట్లయింది. ముచ్చెమటలు పోశాయి. పట్టుకున్న శ్రీమతి చేతులు వణుకుతున్నట్లనిపించి చిన్నగ వీపు మీద తట్టాడు. ఉలిక్కి పడింది.

"అబ్బ... చంపేశారండీ. మీరు పడిపోయారేమోనని నా గుండె ఆగిపోయింది."

"నువ్వు పట్టుకుని వుంటే నేను పడిపోవడం ఏమిటి?"



gudachari.com

చిన్నగా అడుగులు వేసాడు. కొంచెం భారంగానే అనిపించింది. అయినా నడవాలని పట్టుదల. వరండాలోకి వచ్చాడు. గోడకి చేయి ఆనించి కాసేపు నిలబడ్డాడు. ఆయాసంగా అనిపించింది.

"నువ్వు వదిలేయి. నేను నడుస్తాను." అలుపు తీర్చుకుంటూ అన్నాడు.

"అమ్మో! వదిలేసేదా... ఏం నేను బావుండటం మీకిష్టం లేదా!"

సరే... నీ ఇష్టం."

ఎదురుగా డాక్టరు మురళి వస్తున్నాడు. నవ్వుతూ ఆయన వైపు చూశాడు డాక్టర్ శ్రీని. ఆయన ముఖంలో నవ్వు కనిపించడం లేదు. డాక్టర్ శ్రీనిని చూడగానే ముఖం ముడుచుకున్నాడు.

దగ్గరగా వచ్చి, "వాటీస్ దిస్... ఏమిటిదంతా... నన్ను మంచిగా వుండనివ్వవా నువ్వు." స్వాతి ముఖంలోకి చూస్తూ అన్నాడు. స్వాతి ఆశ్చర్యపోతూ శ్రీనివైపు చూసింది.

అతను శ్రీనివైపు సూటిగా ఎప్పుడూ చూడడు. ఎందుకంటే అతని బలహీనతలు శ్రీనికి తెలుసు. శ్రీని మంచి సర్జనని కొంచెం అసూయ. ఇది మామూలే... ఈ వృత్తిలో వొక డాక్టర్ని మరో డాక్టర్ మెచ్చుకోవడం చాలా అరుదు. అందునా అభిప్రాయాల విషయానికొస్తే, ఏ వొక్క డాక్టరూ మరో డాక్టరు అభిప్రాయాల్తో ఏకీభవించరు. కనీసం మందులు వ్రాసే విషయంలోనైనా.

స్వాతి భయంగా వాళ్లిద్దరిని మార్చి మార్చి చూడసాగింది.

ఏం జవాబు చెప్పాలో తెలియక.

"నాకు బావుంది లేచి నడవాలి అనిపించింది."

"అది చెప్పాల్సింది నేను." కార్డియాలజీ స్పెషలిస్టుననే అధికారం.

"కరెక్టే... కానీ హార్ట్ అటాక్ వొచ్చి కోలుకున్న తర్వాత వీలయినంత త్వరగా లేచి తిరగడం మంచిదనుకుంటాను."

దాంతో ఏంమాట్లాడకుండా విసురుగా వెళ్ళిపోయాడు డాక్టర్ మురళి.

వెనక నుంచి, "నన్నెపుడు ఇంటికి పంపుతారు", అన్నాడు శ్రీని.

"అది నీ ఇష్టం. నేను చెప్పడం ఎందుకు.."

... ఇదీ డాక్టర్ల వరస.

డాక్టర్లెప్పుడూ తమ తప్పులను మనస్ఫూర్తిగా వొప్పుకోరు.

దానికి తోడు ఈ పేషెంట్ల ప్రవర్తన సైతం అలాగే వుంటుంది. దేనిమీదా నమ్మకం వుండదు. పేషెంటును చూడ్డానికి వచ్చే బంధుమిత్రులు ఉచిత సలహాలతో పేషెంటుకు పిచ్చి పట్టేట్లు చేస్తారు.

"గుంటూరులో పొగాకు మందు ఇస్తారట."



ఆళ్ళగడ్డలో అల్లం మందిస్తారట."

"ఆరే! ఇక్కడకు వచ్చారే... నాకు చెప్పివుంటే బ్రహ్మాండమైన డాక్టరున్నాడు. చేయి పట్టుకుంటే చాలు చచ్చేవాడైనా లేచి కూర్చుంటాడు."

"ఈ జబ్బుకి లింగయ్య తాయెత్తు వేసికుంటే చిటికెలో తగ్గిపోతుంది."

ఇలా అన్నిటి దగ్గరకూ తిరిగి తిరిగి జబ్బు బాగా ముదురు పెట్టుకుని అప్పుడు పడతారు డాక్టర్ల వేటలో.

డాక్టర్లకూ పేషెంట్లకు మధ్య జరిగే యుద్ధం అంతం లేనిది, అంతం కానిది.

"ఏవండీ పేషెంటెందుకు చనిపోయాడు?"

ఆఖరి క్షణంలో తీసికొచ్చారు. మేమేం చేయగలం!"

"ఆపరేషన్ ఎందుకంత లేటయింది?"

"చేసేటప్పుడు చాలా రక్తం పోయిందండి."

"ఎందుకు డాక్టరు గారు! ఇన్నిసార్లు రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు?"

"జబ్బు ఎలా మారుతొందో తెలుసుకొనేందుకు."

(నీ జబ్బు సంగతి నాకు అర్థం కాక... హాస్పిటల్‌కి లాభం రావాలిగా)

"ఎన్నిసార్లు మందులు వాడినా మళ్ళీ వస్తోందేం ఈ జబ్బు?"

"నీకు చాలా ఎక్కువ జబ్బుంది. ఊపిరి తిత్తులంతా పాడైపోయాయి. అయినా చెప్పినట్లు మందులు వాడితే కదా! ఎప్పుడో వస్తారు ఎప్పుడో పోతారు."

"... అదేమిటండీ మీరు చెప్పినపుడల్లా వస్తూనే వున్నాను. మీరు వాడమన్న మందల్లా వాడుతున్నాను."

"ఎక్కడ వాడావు. వంకాయకూర తినొద్దంటే తింటున్నావు. సిగిరెట్లు తాగొద్దన్నాను. తాగుతున్నావు." గట్టిగా అరిచేసరికి పేషెంటు నోరుమూత. (తను సరైన మందులు వాడక రోగి యిలా బాధ పడ్తున్నాడని తెలిసినా).

"నేనిప్పుడు ఇంటికి వెళ్ళొచ్చాండీ?"

"ఇంకా జబ్బు తగ్గాలి. అయినా మీ ఇష్టం."

ఇట్లా వుంటాయి జవాబులు.

తమ దగ్గర వాళ్ళకు సీరియస్‌గా వుండి వైద్యం చేయాలన్నా, సాటి డాక్టరుకు వైద్యం చేయాలన్నా అదో రకమైన స్థిరత్వం లేని మానసిక బలహీనత వుంటుంది డాక్టర్లలో. అందులోనూ సీరియస్, కాంప్లికేటెడ్ కేసు అయితే మరీనూ.

వెన్ ఎ డాక్టర్ బికమ్స్ సిక్, దస్ ది డాక్టర్ డాక్టరింగ్ ది డాక్టర్ (పేషెంట్) యూజ్ టు డాక్టర్ ది డాక్టర్ బీయింగ్ డాక్టర్డ్ బైదివే ది డాక్టర్ బీయింగ్ డాక్టర్డ్ వాంట్స్ ది డాక్టరింగ్



gudachari.com

డాక్టర్ టు డాక్టర్ హిమ్. ఆర్ ది డాక్టర్ డాక్టరింగ్ ది డాక్టర్ (పేషెంటు) యాజ్ టు డాక్టర్ ది డాక్టర్ బీయింగ్ డాక్టర్డ్ యాజ్ ఫర్ ది వ్యూస్ అండ్ ఛాయిసెస్ ఆఫ్ ది డాక్టరింగ్ డాక్టర్.

బహుశా అందుకనేమో! శ్రీని పరీక్ష చేసేపుడు ఎప్పుడూ శ్రీనిని నేరుగా చూడడు డాక్టర్ మురళి. ఏదైనా చెప్పాల్సి వున్నా అతనితో చెప్పడు. ఒక రోజు ఎగ్జామిన్ చేస్తున్నాడు, శ్రీనిని ఏదో మందుల్ని గురించి అడుగుతున్నాడు.

మధ్యలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఉన్నట్లుండి జేబులో చేయి పోనిచ్చి చిన్న పేపర్ తీసి, "అరే... మర్చేపోయాను మా అమ్మాయి కాడ్‌బెరిస్ చాక్లెట్‌ను తెమ్మంది" అన్నాడు డాక్టర్ మురళి.

శ్రీనికి చటుక్కున ఆమాట అనేసరికి అర్థం కాలేదు. స్వాతి వైపు చూశాడు. తనూ అర్థంకానట్లు చూసింది. శ్రీనికి కోపం వచ్చింది. అడుగుతున్న దేమిటి.... అతను మాట్లాడుతున్నదేమిటి? అని అయినా నిగ్రహించుకొని "సరే... నామందు విషయం వొదిలెయ్యండి... మీ అమ్మాయి ఎన్ని చాక్లెట్లు తెమ్మందో చెప్పండి. నేను తెప్పిస్తాను" వ్యంగ్యంగా అన్నాడు మురళితో.

అతని ముఖం వివర్ణమైంది.

సిగ్గు పడాల్సింది పోయి కోపంతో స్వాతి వైపు చూసి "ఇతనెప్పుడూ ఇంతేనా?" అంటూ చర చరా వెళ్ళిపోయాడు.

ఇంటి దగ్గర విషయాలు యింటి దగ్గర, హాస్పిటల్ విషయాలు హాస్పిటల్లో, ఆలోచించి చేసే డాక్టర్లు చాలా అరుదు. వాళ్ళు చాలా గొప్పవాళ్ళు. ఈ కాలంలో డబ్బు, డబ్బును ఎలా, ఎంత, త్వరగా సంపాదించాలి. అదే జీవిత ధ్యేయం. స్వవిషయాలన్నీ ఇక్కడకు మోసుకురాకూడదు. కానీ...

గుండె జబ్బు రోగులు మామూలు పేషెంట్ల కంటే కొంచెం కోపంగాను, జీవితం మీద విరక్తి తోను పరిసరాలతో సంబంధం లేనట్లుగా వుంటారు. గుండె జబ్బనగానే ఏదో భయం.... చావు దగ్గరవుతోందనే నమ్మకం.... ఎంతసేపూ వాళ్ళమాటల్లో వేదాంతం వినిపిస్తుంటుంది. శ్రీనికి ఇంకా ఆవేదాంతం అలవడలేదు.

అందరు రోగులు వొక రకమైతే, డాక్టరు రోగి అయితే మరో రకం. నిజంగా డాక్టర్లంత చెడ్డ రోగులు ప్రపంచంలో మరొకరుండరు. ఎందుకంటే జబ్బును నయం చేసే వాళ్లు వారు. జబ్బు తమనేం చేయదనే ధైర్యం. అశ్రద్ధ చేయడంలో డాక్టర్లు మొదట వుంటారు. ఇతరులకైతే శ్రీరంగనీతులు ఎన్నైనా చెబుతారు. వినకపోతే కోప్పడతారు కూడా. కానీ తమ దగ్గరకి వచ్చేప్పటికి అంతా తారుమారు.

మరుసటి రోజు



"రేపు నిన్ను డిస్చార్జ్ చేస్తున్నాము."

"యస్ ఐ నో... హార్ట్ పేషెంట్ ఏ జాగ్రత్తలు తీసికోవాలో..."

"ఉప్పు తక్కువగా వుండే ఆహారము."

కొవ్వు పదార్థాలు తక్కువగా"

"రోజూ కొంచెం దూరం నడవాలి"

"ఎక్కువ శ్రమ పడకూడదు. మెట్లు గాని, ఎత్తు ప్రదేశాలు కాని ఎక్కకూడదు."

"మూడు వారాలు కొంచెం పని చేసికోవచ్చు. ఆరు వారాల తర్వాత పూర్తిగా పని చేసికోవచ్చు. వారం తర్వాత వొక సారి వచ్చి కనిపించండి."

"ముఖ్యమైన విషయం వొకటి మర్చిపోయారు." సూటిగ అతని ముఖంలోకి చూస్తూ అన్నాడు శ్రీని.

తడబడి, "ఏ విషయం." అన్నాడు.

"మీ అమ్మాయి చాక్లెట్ల విషయం."

ముఖం ఎర్రబడి పోయింది. ఇంతలో స్వాతి కల్పించుకుని "చాలా థాంక్సండి... మీరు మాకు మరోజన్మని ప్రసాదించారు. మీమేలు మేమెన్నటికీ మరచిపోలేము." నమస్కరిస్తూ అన్నది.

"మరి అతనికి ఆ ఉద్దేశ్యమే వున్నట్లు లేదు." వొకవేలితో శ్రీనివైపు చూస్తూ అన్నాడు.

"నో... నో... అయామ్... నేను మీకు ఋణపడి వున్నాను. వాట్ ఆల్ కేర్ యు హావ్ టేకన్ ఫార్ మి. నువ్వు చూపిన శ్రద్ధకు, నీ ప్రతిభకు నా జోహార్లు. కానీ... సమ్‌థింగ్ యు హావ్ టు కరెక్టు ఇన్ యువర్.... మీ పద్ధతిలో ఇంకాస్త మార్పు రావాలి... అంతే!." ఇంకా ఉడికించడం బావుండదని చేయి అందిచ్చాడు శ్రీని.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్. విష్ యు ఆల్ ది బెస్ట్." అన్నాడు కొంచెం విప్పారిన ముఖంతో, డాక్టరు మురళి.

ఆ రోజు డిస్చార్జీ అనే సరికి శ్రీని రూము చుట్టూ చాలా కలకలం బయల్దేరింది. తోటీలు, ఆయాలు, వార్డుబాయిలు ఉదయం నుంచి స్వాతికి, శ్రీనికి దండాలు పెట్టూనే వున్నారు.

"అమ్మా... నీ మంగళసూత్రం గట్టిదమ్మా."

"అదే ఏమైనా జరిగుంటే?...!" కొందరు కన్నీళ్ళు కూడా పెట్టుకున్నారు స్వాతి దగ్గర.

ఇంతలో శ్రీని బావమరిది అరవింద్ పిల్లల్ని తీసుకొని వచ్చాడు. వాళ్ళను చూసి అరే... ఈ పది రోజుల్లో పిల్లలున్నారనే సంగతి గుర్తురాలేదు. ఏమిటిది... అనుకున్నాడు శ్రీని.



gulaachari.com

వస్తూనే చిన్న పాప దీపు, "డాడీ!" అంటూ సంతోషంతో బెడ్‌మీదికి వురికింది. ఇంతలో స్వాతి వొక్కుదుటున దాన్ని పట్టిలాగి, "పాపా! ఇంటి దగ్గర నీకేం చెప్పాను. నాన్నను డిస్టర్బ్ చేయకూడదని చెప్పానా." అని కోప్పడింది.

"ఓ... కమాన్... వదిలెయ్యి. రా! తల్లీరా!" అంటూ దగ్గరకు తీసుకున్నాడు. దాంతో ఒడిలో వొదిగి కూర్చుని బిక్కు బిక్కు మంటూ వాళ్ళ అమ్మవైపు చూస్తుండి పోయింది దీపు.

ఇక పెద్ద పాప బిందు. తొనకదు, బెణకదు. నెమ్మదిగ దగ్గరకు వచ్చింది. తెలియని సంతోషమేదో ప్రతిఫలిస్తోంది దాని ముఖంలో.

"ఆరే... వాడేడీ నాటీ బాయ్."

వాళ్ళ చిన్నబాబుకి వొక అలవాటు అమ్మ, నాన్న హాస్పిటల్నుంచి ఇంటికి రాగానే తలుపు చాటున చేరి వాళ్ళమ్మను భయపెట్టడం, ప్రతిసారీ గుండె ఆగినంత పని అవుతుంది స్వాతికి.

అట్లాగే తలుపు సందులోంచి తొంగి చూస్తున్నాడు. అది చూసి "ఓయ్... నేను చూసేశాను." కొంటెగా నవ్వుతూ పొంగుకొస్తున్న సంతోషాన్ని అదుపులో ఉంచుకుంటూ అన్నాడు శ్రీని.

"ఓహ్!" అంటూ అరుస్తూ పరిగెత్తుకొచ్చి శ్రీని బెడ్ మీదికి వురికాడు.

స్వాతిముఖం చూడనక్కరలేదు.

"అమ్మో!" అనేసింది.

"విష్ణూ!" కోపంతో బాబు వైపు చూసింది.

"అబ్బ! నువ్వు కాసేపుండు. పది రోజులైంది వీళ్ళను చూసి." అంటూ దగ్గరకు తీసుకున్నాడు. ఏదో తెలియని ఆనందం.... అద్వితీయమైన అనుభూతి... సంతృప్తితో డాక్టర్‌శ్రీని.

నాకేమైనా జరిగుంటే వీళ్ళంతా ఏమయ్యేవాళ్లో...! ఆలోచించలేకపోయాడు. గుండెల్లో బరువుగా అనిపించింది.

బిందు కళ్ళలో నీళ్ళు తిరగడం చూశాడు డాక్టర్ శ్రీని.

"ఏయ్... ఏమిటిది?" దగ్గరకు తీసికున్నాడు. అతుక్కుపోయింది వాళ్ళ నాన్నకు.

"అవును డాడీ! ఇంట్లో కూడా అంతే! రోజూ మమ్మీ ఏడుస్తుంటే మేం అందరం ఏడ్చాము." దీపు అంది అమాయకంగా కళ్ళు త్రిప్పుతూ.

స్వాతి వైపు చూసాడు. ఆ చూపుల్ని తప్పించుకొనేందుకు ప్రక్కకు తిరిగింది.

"సో! ఇవన్నమాట నీ ధైర్యం. పిల్లల్ని కూర్చోపెట్టుకుని ఏడుస్తున్నావన్నమాట ఈ పది రోజులూ. యూ... కవర్డ్ లిటిల్ గూస్... పిరిక దానిలాగా." స్వాతి మీద జాలి పొంగి పొరలింది. ఆమాట లంటుంటే కళ్ళు నీరు కమ్మాయి.



తమాయించుకొని, "ఆల్‌రైట్... నేను బాగున్నాను. ఇక ఇంటికి వెళ్ళి హాయిగా వుందాం." అన్నాడు డాక్టర్ శ్రీని.

"డాడీ... హౌస్ ఫుల్." విష్ణు జోకేశాడు.

అర్థంకానట్టు స్వాతివైపు చూశాడు.

"అవునండీ! మిమ్మల్ని చూడాలని మా అమ్మా, నాన్న, అన్నయ్యలు మీ అమ్మ గారు, నాన్నగారు, చెల్లెళ్ళు అందరూ వచ్చివున్నారు."

"సో! ఇంటి వద్ద విశ్రాంతి లేదన్నమాట నాకు."

నవ్వుతూ అన్నాడు.

"లేదు డాడీ... మమ్మీ వాళ్ళందరికీ మిమ్మల్ని డిస్టర్బ్ చేయొద్దని గట్టిగా చెప్పేసింది."

భారతదేశంలో ఈ విచారింపులు, పరామర్శలు కొంచెం ఇబ్బందికరంగానే వుంటాయి. ఇంట్లో వాళ్ళయితే ఫరవాలేదు. అందరూ కట్టకట్టుకుని వస్తారు అభిమానంతోనే అనుకోండి. అయితే అసలు రోగిని గురించి మరచిపోయి వచ్చిన వాళ్ళకి మర్యాదలు చేయలేక ఇబ్బంది పడాలి. వాళ్ళకి భోజనాలు, పడకలు, స్నానాలు పేరు పేరునా అడిగి చూడాలి. రోజంతా ఇలాగే సరిపోతుంది.

ఇంకా ఆయాలు, వార్డుబోయ్‌లు, చిమ్మేవాళ్ళు తచ్చాడుతూనే వున్నారు. వాళ్ళను చూసి, "ఏం వీళ్ళు మనల్ని పంపి గాని పనిలోకి వెళ్ళెట్టులేరు. ఈరోజు లీవు గానీ పెట్టారా, ఏం?" అన్నాడు స్వాతితో.

"కాదండీ పేషెంటు డిస్చార్జి అయ్యేపుడు వాళ్ళకిచ్చే మామూళ్ళ కోసం కాచుకుని వున్నారు."

"డాక్టర్ల దగ్గర కూడా తీసకుంటారా!"

"మీరు... పేషెంటే కదా."

ఈ జాడ్యం మన హాస్పిటల్‌లో కూడా వుందిగా! వదలరు. వాళ్ళ మామూలు వాళ్ళకి ఇచ్చితీరాలి. ఇవ్వకపోతే దబాయించైనా తీసుకుంటారు. అంతకు మునుపు ఏ పనికి కనిపించని వీరు, డిస్చార్జీ సమయంలో ఎక్కడున్నా ప్రత్యక్షమవుతారు. సరిగ్గా సమయానికి వచ్చి లేని నవ్వులు ముఖానికి అతికించుకుని "అయ్యగారికి అంతా చూసింది మేమేకదమ్మా, రూము కడిగాము, బెడ్‌పాన్ పెట్టాము..." అంటూ చేతులు నలుపుకుంటూ నిలబడతారు.

చచ్చిన వాళ్ళ నుంచి కూడా రాబందుల్లా పీల్చుకుతింటారు. అదేమంటే- మామూలు- ఏది మామూలు!?

కారులో పిల్లలు లక్ష ప్రశ్నలు. స్వాతి వాళ్ళను కోప్పడుతూనే వుంది.

"డాడీ... నీకు జ్వరమని చెప్పింది మమ్మీ." "జ్వరానికి ఎందుకు ఏడుస్తారు? రెండు మాత్రలు వేసుకుంటే తగ్గిపోదా!?"

"యాన్టీబయాటిక్, పారా సిటమాల్," చిన్నవాడు అన్నాడు.

నిజాన్ని ఎందుకు దాచాలి అనిపించింది డాక్టర్ శ్రీనికి.

"లేదమ్మా! నాకు గుండెపోటు వచ్చింది. అది చాలా చెడ్డ జబ్బు. అందుకని మమ్మీ భయపడి వుంటుంది." అన్నాడు.

"గుండెజబ్బు వొస్తే ఏమవుతుంది డాడీ?"

"చచ్చిపోతారమ్మా!"

"మరి నువ్వు చచ్చిపోలేదేం?" దీపు అమాయకమైన ప్రశ్న.

స్వాతి వొక్కమారుగా విరుచుకుపడింది దానిమీద, "నువ్వు నోరు మూసుకుని వుంటావా లేదా... పిచ్చిప్రశ్నలు... నువ్వూనూ!" అంటూ.

"ఏయ్... గమ్మునుండవే! డాడీకి స్ట్రెయిన్ ఇవ్వకూడదు. వీక్‌గా వున్నారు." అంది బిందు పెద్దతనం చూపిస్తూ.

పసి పిల్లలు అమృతాలు.

"మీ డాడీ ఉక్కు మనిషి. చచ్చే వాళ్ళను బ్రతికిస్తారు. చావును జయిస్తాడు."

"అవునవును. మాడాడీ మంచి. అందుకని దేవుడు బ్రతికించాడు."

"అలా అని మీ మమ్మీ చెప్పిందా!"

డాక్టర్ శ్రీనికి దేవుడు, దెయ్యాల మీద నమ్మకం లేదు. మనిషి మనో నిబ్బరం మీద, మంచితనం మీద, ఆత్మవిశ్వాసం మీద గౌరవం, నమ్మకం.

"పూజలు కూడా చేయించిందా!"

"అవును డాడీ రోజూ ఏదో వొక గుడికి వెళ్తూనే వున్నాం."

"అబ్బ.... మీరు నోరు మూస్తారాలేదా?" కోప్పడింది పిల్లల్ని. కిక్కురుమనకుండా అయిపోయారు అందరూ. బిందు మాత్రం తండ్రి భుజం మీద తల ఆన్చి కళ్ళు మూసుకుంది. దాని ముఖంలో ఏదో తృప్తి. వాళ్ళ డాడీ మాములు మనిషి అయ్యాడని కాబోలు. దీపు శరీరానికి అతుక్కుపోయి కూర్చుంది. విష్ణు మాత్రం మూతి మూడు వంకర్లు తిప్పుతూ వాళ్ళ మమ్మీని గామోసు తిడ్తున్నాడు.

వాళ్ళందర్ని చూస్తుంటే నవ్వొచ్చింది డాక్టర్ శ్రీనికి.

ఇంటి దగ్గర కారులోంచి దిగ బోయి స్వాతి అరుపుతో ఆగిపోయాడు.

"దిగకండి! కుర్చీ తీసుకు వస్తారు."

ఎదురుగా చూశాడు. ఇద్దరు మనుషులు వీల్ ఛైర్ తీసుకుని వస్తున్నారు. వాళ్ళ వెనక నూరు, నూటయాభై మంది నిల్చుని కారునే చూస్తున్నారు.

పాత పేషెంట్లు, బంధువులు, మిత్రులు, తన మీద ఆధారపడి వున్న మందుల షాపు వాళ్ళు చాలా మంది.



డాక్టర్ శ్రీనికి కోపం వచ్చింది, "ఏమిటిది? నేను దిగి నడవగల్ను గదా!"

"కారులో వచ్చారు కదా కొంచెం శరీరం కదలి వుంటుంది."

తన జబ్బున పడ్డానని ఇప్పుడే తెలిసివస్తోంది. ఇక వాదించి లాభం లేదు. అనవసరంగా హైరానా పడడం తప్పు.

హాల్లోకి తీసుకు వెళ్ళారు.

వొక్కొక్కరే వచ్చి నమస్కారం చేసి, ఏవో నాలుగు మాటలు అడిగిపోతున్నారు. అందరికి తిరిగి నమస్కారం చెయ్యాలంటే అలసటగా ఉంది. అందుకని నవ్వు ముఖానికి పులుము కుని తల ఆడించటం మొదలు పెట్టాడు. అది మరీ బాధనిపించింది.

ఏమిటేమిటో చెప్తున్నారు.

స్వాతి ఎక్కువ మాటాడ వద్దని అందర్ని వేడుకొంటోంది సైగల్తో. వచ్చిన వాళ్ళందరి ముఖాల్లో ఆనందం కన్పించడం లేదు. ఏదో భయం, జాలి. అయ్యో పాపం! అనట్టున్నాయి వాళ్ళ చూపులు డాక్టర్ శ్రీనికి.

"అసలు ఆ హాస్పిటల్‌లో ఎందుకు చేరారండి. ఏ మద్రాసో, రాయవెల్లూరో వెళ్ళాల్సింది."

"ఈ హాస్పిటల్‌లో చేరినవాళ్ళు మళ్ళీ తిరిగి రారు. మీ అదృష్టం."

"మీరు చేసిన మంచి ఆ యమ్మ మపుసు కుంకుమ కాపాడింది."

"విశ్రాంతి తీసికోండి. దేన్ని గురించి ఆలోచించకండి."

"చాలా బలహీనంగా వున్నారు. మంచి ఆహారం, పాలు, గుడ్లు మాంసం బాగా తీసుకోండి."

"మీకేం అవసరమైనా చెప్పండి సార్! నిమిషాల మీద చేసి పారేస్తా."

అలా ఎన్నో వింత వింత అభయాలు... వరాలు....

– – –

డాక్టర్‌శ్రీనికి అప్పుడప్పుడూ గుండె బరువుగానే వుండేది. కానీ ఏమంత కష్టం అనిపించేది కాదు. కొంచెం దూరం నడిస్తే మాత్రం ఆయాసంగా వుండేది. మరీ నీరసం అనిపించేది– కానీ, "నడవాలి. మళ్ళీ మామూలు మనిషినవ్వాలి. ఏం చేస్తుందీ జబ్బు నన్ను... భయపడకూడదు. ఎంతో మంది రోగార్తుల్ని చూశాను. చచ్చిపోతారనుకున్న వాళ్ళు బ్రతికి హాయిగా వున్నారు ఎందరో. అందులో నేనూ వొకడ్ని ఎందుకు కాకూడదు..." అని తనలో తనే అనుకోసాగాడు.

డాక్టర్‌శ్రీనికి చాలా బాధలు, బాధ్యతలు, కష్టాలు వున్నాయి. ఇద్దరూ డాక్టర్లే. అయితే రోగుల్ని పీడించి డబ్బు కూడబెట్టుకునే మనస్తత్వం ఇద్దర్లోనూ లేదు!



gudachari.com

ఏదో జాలి... వాళ్ళ దారిద్ర్యం మీద. వాళ్ళ జీవితాలు, అందులోని బాధామయ గాథలు వింటూవుంటే అనిపిస్తుంది. ప్రపంచంలో దారిద్ర్యానికి మించిన శిక్ష లేదని.

అందునా పది సంవత్సరాలు ప్రభుత్వ డాక్టరుగా వుండి, విపరీతమైన మానసిక వ్యధకు గురై విసిగి... వేసారి సొంతంగా హాస్పిటల్ ప్రారంభించి నాలుగు సంవత్సరాలు మాత్రమే అయింది. పేరైతే వొచ్చింది బాగానే. మరి డబ్బేది? ఆ డబ్బుని గూర్చి ఇంతవరకూ ఆలోచించలేదు. ఇక ఆలోచించాలేమో! తను ఆరోగ్యంగా వుంటే అదేమంత కష్టం కాదనిపించింది డాక్టర్ శ్రీనికి.

గతం గుర్తుకు రాసాగింది.

డాక్టర్‌శ్రీని పోస్టు గ్రాడ్యూయేషన్ చేసిన తర్వాత పోస్టింగ్ కోసం ఆరునెలలు ఆగాల్సి వచ్చింది. కావాల్సినన్ని ఖాళీలున్నాయి. కాని పోస్టింగ్ మాత్రం ఇవ్వలేదు. నాల్గుసార్లు రాజధానిలోని డి.యం.హెచ్.యస్. చుట్టు తిరగాల్సి వొచ్చింది. వేస్తాం... ఇస్తాం... అంటారే గాని ఫలితం లేదు. రోజురోజుకు అసహనం ఎక్కువ కాజొచ్చింది.

ఎట్టకేలకు పోస్టింగ్ ఆర్డర్స్ వొచ్చాయి.

ఎగిరి గంతేశాడు. విప్పిచూసి కృంగిపోయాడు. ఏం చెయ్యాలో తోచలేదు. ఈ గుడ్డి మెడికల్ సర్వీసెస్ మీద విపరీతమైన కోపం వచ్చింది. అతను సర్జరీ చేయడం ఏమిటి.. సాంఘిక సంక్షేమ వ్యాధి నిరోధక శాఖలో అసిస్టెంట్‌గా వెయ్యడమేమిటి?

అదో టీచింగ్ జాబ్. తను చదివినదానికీ ఇప్పుడొచ్చిన ఉద్యోగం శాఖకి ఎలాంటి సంబంధం లేదు. అందులోనూ... ఏదో చేయాలని, పేదసాదను ఆదుకోవాలనీ కలలు కనీ తనకు ఈ వార్త ఆశనిపాతమే అయింది.

స్నేహితులతో చెపితే పదివేలు పారేస్తే కోరిన చోటుకు పోస్టింగ్ వచ్చేది అన్నారు.

ఈ డిపార్టుమెంటులో చేరితే తన వెనకటి చదువునంతా మళ్ళీ చదువుకోవాలి. ఎంత డి.డి.టి. పౌడర్ ఎన్ని నీళ్ళలో కలపాలి.... దేశంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు పనికి వచ్చే భార్యాభర్తలెంతమంది వున్నారు... అంటు వ్యాధుల నివారణ ఎలా చేయాలి? అసలు అంటువ్యాధులంటే ఏమిటి.... అవన్నీ విద్యార్థులకు చెబుతూ వాళ్ళను క్యాంప్‌లకు తీసుకు వెళ్ళి చూపించాలి. ఇందువల్ల తను చదివిందీ, తనకు తెలిసింది నిరుపయోగమై పోతుంది అని బాధపడ్డాడు. ఏం చేయ్యాలో అంతుచిక్కలేదు.

హైద్రాబాద్ వెళ్ళాడు. ఖాళీలు లేవన్నారు. ఉన్నాయన్నాడు. ఇష్టముంటే డ్యూటీలో చేరు, లేకపోతే లేదు అన్నారు. గుడ్డి ప్రభుత్వం... తలలేని అధికార్లు...

పదివేలు పారేస్తే! తన మనసంగీకరించలేదు. పదివేలిచ్చి ఉద్యోగం సంపాదిస్తే తిరిగి ఆ పదివేల సంపాదనకు అవినీతి బురద పూసుకోవాల్సిందే.

విధిలేక చేరాడు.



రోజులు గడుస్తున్నాయి.... అసహనం పెరిగిపోతోంది.

ఒక సంవత్సరం తర్వాత ఓ మారుమూల పల్లెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేశారు. వెళ్ళాడు. హాస్పిటల్ పాత జమీందార్ల గుర్రపుశాల - విడి గదుల్లేవు. పడకలు లేవు, అసలు మందులే లేవు. తను గాక మరో ఇద్దరు డాక్టర్లున్నారక్కడ అప్పటికే.

"మేమే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునివుంటే మళ్ళీ మీరెందుకు...." నవ్వుతు అన్నారు వాళ్ళు.

"అదేమిటి! చాలా వర్క్ వుంటుందనుకున్నానే..."

"ఈ మారుమూల ప్రాంతంలో ఏవుంటుంది.... ముఖ్యంగా కుటుంబ నియంత్రణ ప్రాపగాండ, ఎప్పుడైనా వాంతులు, విరేచనాలు, స్పెషలిస్టుకి పనేం వుండదు."

"సర్జరీ కేసులే రావా!"

"వస్తాయి. కానీ ఎక్కడ చేయడం...? ఎలా చేయడం...? వొక్క వస్తువూ లేదు బట్టలు కత్తిరించే కత్తెర తప్ప."

"వార్డు... బెడ్స్... లేబర్‌రూం... కాన్పులగది... కనీసం ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ గది...?" ఇంకా ఏదో అడుగుతున్నాడు డాక్టర్‌శ్రీని.

వోవింత జంతువును చూసినట్లు చూశారు వాళ్ళు డాక్టర్ శ్రీనిని.

"ఎక్కడున్నారు మీరు...! భారతదేశంలో అందులో... ఆంధ్ర రాష్ట్రంలో... ముఖ్యంగా" రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో పేరుకు మాత్రమే హాస్పిటళ్ళు. ఇక్కడికి మరీ నికృష్టమైన దరిద్రులై వుంటే తప్పరారు. వాళ్ళు కూడా తప్పని స్థితిలో వొస్తారు. అంత పేరుంది మన హాస్పిటళ్ళకి."

"మన అనుంగు సోదరుల ప్రతిభ... ప్రభుత్వం నిర్లక్ష్యం... ప్రజలు... అందరూ కలసి వీటినీ స్థితికి దిగజార్చారు. ఏదో చెయ్యాలని ఉబలాటపడకు. పిచ్చి పట్టుంది. తెల్లమాత్ర...ఎర్రమాత్ర, తెల్లసూది... ఎర్రసూది ఇవి మాత్రమే గుర్తు పెట్టుకో. రెండు సంవత్సరాలు నువ్వు ఇక్కడుంటే ఇవి తప్ప నీకింకేం గుర్తుండవు."

"అంటే రోజూ వచ్చి గోళ్ళుగిల్లుకుంటూ కూర్చుని, నెల జీతం తీసికోవడమేనా?"

"రావద్దు... ఎవర్రమ్మాన్నారు నిన్ను... నువ్వు రాకపోతే వచ్చావా! లేదా! అని అడిగే నాథుడెవ్వరు...? ఎప్పుడో వొకసారి క్యాంపులుంటాయి. ముందుగా తెలుస్తుంది. అప్పుడు కనపడితే చాలు."

"చేతులు కట్టుకుని కూర్చుని వుండటం బాధగా లేదూ మీకు...?"

"బాధా... ఎట్లా వుంటుంది... ప్రాణం పోతున్నా మనుషులు రారు. వచ్చినా ఇక్కడ మందుల్లేవని తరిమేసి... చేతులు కట్టుకుని కూర్చోడం అలవాటయి పోయింది. ఇప్పుడు కష్టపడాలన్నా వీలుకాదు."



gudachari.com

ఇప్పుడు తెలుస్తోందీ, డాక్టర్‌శ్రీనికి. బయట ప్రపంచం విశాలమైనదే కాక వింతలూ, విడ్డూరాలతో కూడుకున్నదని. చదువుకునే రోజుల్లో ఇటువంటి విషయాలు ఎవరైనా మాట్లాడినా వీళ్ళంతా ప్రపంచాన్ని భూతద్దంలో చూస్తున్నారని, పరిస్థితులు.... మనుషులు మరీ అంత నీచంగా వుండరనీ అనుకొనేవాడు.

మన దేశంలో డెబ్బయి వేల జనాభాకు వొక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుంది. అయితే ప్రతి మండలంలోనూ వొక కేంద్రం ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతోంది. వొక్కో కేంద్రం అజమాయిషీలో సుమారు నూరుగురు సిబ్బంది వుంటారు. వీటితోపాటు తాలూకా హాస్పిటళ్ళు, డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్ హాస్పిటళ్ళు వుంటాయి. ఇన్ని వున్నా ప్రజల వైద్య అవసరాలు తీరడం లేదు. అవసరానికి అందుబాటులో డాక్టరు వుండరు. అందరూ ప్రైవేటు డాక్టర్ల వద్దకు పరుగు తీయాల్సిందే. ఇక వొక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నెలకు నిర్వహణకు కొన్ని లక్షలు రూపాయలు వరకూ ఖర్చవుతోంది ప్రభుత్వానికి? అయితే ఇవి సరిగా పనిచేస్తున్నాయా! లేదా! అని జాగ్రత్త ప్రభుత్వం తీసికోవడం లేదు. పోనీ ప్రజలైనా శ్రద్ధ తీసుకుంటారా! అంటే అదీ లేదు. ఎవరికి వారు మనకెందుకులే అని తొలగిపోవడం, మన డబ్బు, మన శ్రమ ఇలా దుర్వినియోగమవుతున్నాయనే ధ్యాస వొక్కరికీ లేదు.

ప్రభుత్వం యిచ్చింది, చేస్తున్నది ప్రజలకు అందితే! రోగంతో బాధపడే వారే ఉండరు. దేశం ఎంతో పురోభివృద్ధి సాధిస్తుంది. అన్ని స్కామ్‌ల కంటే ఈ మెడికల్, డ్రగ్స్ స్కామ్ అతిభయంకరమైనది. దీన్ని గురించి పూర్తిగా వదిలేసారు. ఎన్ని కోట్లు మింగుతున్నారో? ఎంతమంది పేదవారు బుగ్గి అయిపోతున్నారో!

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు రెండు రోజులకు వొకరోజు సబ్ సెంటర్లను వైద్య నిమిత్తం దర్శించాలి. మల్టీపర్పస్ వర్కర్లు నెలకు వేల రూపాయల విలువగల మందులు కేటాయించిన ప్రాంతంలో సరఫరా చేయాలి. బావులు. గుంటల్లో వ్యాధి నిరోధక మందులు కలపాలి. వాంతులు, విరేచనాలు వుంటే వెంటనే డాక్టర్లకు తెలియజేయాలి. వారు వెంటనే జిల్లా వైద్యాధికారికి తెలపాలి. హెడ్‌క్వార్టర్స్ నుంచి వెంటనే మందులు పంపాలి. ఇవన్నీ యుద్ధ ప్రాతిపదిక మీద జరగాల్సిన చర్యలు. అయితే అలా జరగవు. అన్నీ అంది వీళ్లు బయల్దేరే సమయానికి జీపు కదల్దు. ఎలాగా దాన్ని నడిపించి వెళ్ళేప్పటికి పేషెంట్లు ప్రైవేటు డాక్టర్ల వద్దకి వెళ్ళి చేతి చిలుం వొదుల్చుకుని నీరసపడి వుంటారు. అప్పుడు వెళ్ళిన సిబ్బందికి అక్కడేం కన్పించదు. నాలుగిళ్ళు తిరిగి అంతా బావుంది... అంతా బావుందని రిపోర్టు వ్రాసుకుని, బావుల్లో గుంటల్లో వారం రోజులు నీళ్ళు త్రాగకుండా బ్లీచింగ్ కలిపి వెళ్ళి పోతారు. ఇదీ సాధారణంగా జరిగే తంతు.

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది డాక్టర్లతో సహా ఆ ఊర్లోనే కాపురం వుండాలి. అయితే ఈ కేంద్రాలు సాధారణంగా ఏ మారుమూల పల్లెల్లోనో



వుంటాయి. అక్కడ సిబ్బంది నివసించడానికి ఇళ్ళుండవు... పిల్లలు చదువుకునేందుకు సరియైన పాఠశాలలుండవు. అందుకే సాధారణంగా వీరు సమీపంలో వుండే పట్టణాల్లో వుంటూ చుట్టపు చూపుగా అప్పుడప్పుడూ వొచ్చి పోతుంటారు. రోజు ఎందుకు రావడం, లేదని ఎవరైనా ప్రశ్నిస్తే క్యాంపు వెళ్ళామని చెప్తారు.

ఒక ప్రభుత్వం అవసరమైన మందులు సరిగా అందజేయదు... కారణం ఫండ్స్ వుండవు. బడ్జట్ లేదు... ప్రతి నెలా తప్పదన్నట్లు కొద్ది మందులు పంపుతారు. అందుకే ఏ జబ్బున్న రోగులకైనా తెల్లమాత్రలు ఎర్రమాత్రలు తప్ప మరేమీ అందవు. అవి కూడా సిబ్బంది అమ్ముకోవడం కద్దు. ఆయిచ్చిన మందులైనా సక్రమంగా పంచబడుతున్నాయో లేదో తనిఖీ చేసే నాథుడే వుండడు. ఎంత డబ్బు, ఎంత టెక్నికల్ మిషనరీ నిరుపయోగమవుతుందో... ప్రభుత్వం పట్టించుకోదు. పప్పు, బెల్లం పంచినట్లు మండలానికో ఆసుపత్రి....

ఎందుకు ఉపయోగం లేనివి... అవసరానికి ఆదుకోనివి....? అసలీ డబ్బంతా ఎక్కడిది...? ప్రజలదే కదా! అయినా ఈ ప్రజలు ప్రశ్నించరేం...!?

పాపం... తీరికెక్కడ వుంటుంది వీళ్ళకి... ఎక్కడ సబ్సిడీతో లోన్లు ఇస్తున్నారా.... తీరిగ్గా కష్టపడకుండా డబ్బెలా వస్తుందా.... ఏబాంకుల్నుంచైనా అప్పులభిస్తుందా... వీటితోనే సరిపోతుంది. మరి ఇతర విషయాలు పట్టించుకునే తీరికెలా వుంటుంది... పాపం....!

ఆ రోజు డాక్టర్‌శ్రీని డ్యూటీ. పేషెంట్లెవరూ లేరు. ఆలోచన్లు అనేక విధాల పరుగులు తీస్తున్నాయి. "ఎందుకు చదివాను... ఏం చేస్తున్నాను? నిస్పృహ... నిరాశ రోజురోజుకూ పెరిగిపోతోంది. జీవితమ్మీద విరక్తి.... ఎందుకూ పనికి రాని వాడ్నిగా తయారయి పోతున్నాను... కేవలం జీతం రాళ్ళ కోసమేనా ఇంత కష్టపడి చదివింది.... నాతోటి డాక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లు చాలా తేలిగ్గా ఈ జీవితానికి అలవాటు పడిపోయి హాయిగా... ఆనందంగా వుంటున్నారే...!! మరి నేనెందుకు సర్దుకు పోలేకపోతున్నాను...?"

ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోతున్న డాక్టర్‌శ్రీనిని ఫార్మాసిస్ట్ వచ్చి స్టోర్ రూము తాళాలు అడిగాడు. ఇచ్చాడు. ఆ తర్వాత అనుమానమొచ్చింది. ఇప్పుడేం అవసరమొచ్చింది వాటితో... లేచి వెళ్ళాడు. స్టోర్ రూములు తలుపులు నెట్టాడు. తెరచుకున్నాయి.

ఎదురుగా కనిపించిన దృశ్యం...

సభ్యతగల ఏ వ్యక్తి చూడకూడనిది. ఆ సమయంలో సిగ్గున్న వాళ్ళెవ్వరూ అంతసేపు నిలబడరక్కడ. అయితే డాక్టర్‌శ్రీని నిలబడ్డాడు. సభ్యత, సిగ్గుల గురించి ఆలోచించే శక్తి లేదు. అసలే వాతావరణానికి అసహనంతో వున్నాడాయె అటువంటి సమయంలో ఈ దృశ్యం కోపంతో వణికిపోయాడు.

అనుకోని ఈ సంఘటనకు లోపలున్న వాళ్ళు కలవరపడిపోయారు. ఆ అమ్మాయి హాస్పిటల్‌లో పనిచేసే నర్సు. అతనెవ్వరో తేలీదు. తత్తరపాటుతో బట్టలు సరిచేసుకుని



gudachari.com

ఏడుస్తూ ఆ అమ్మాయి డాక్టర్ శ్రీనిని దాటుకుని పరుగున వెళ్ళిపోయింది. అతను మాత్రం సాఫీగా బట్టలు సర్దుకుని డాక్టర్‌శ్రీనిని వైపదోలా చూస్తూ సమీపించి, "ఇటువంటి సమయాల్లో మీర్రాగూడదు డాక్టర్!" వెకిలిగా నవ్వుతూ అన్నాడు. టెర్లిన్ పంచె చొక్కా పెద్ద మీసాలు.. చదువుకున్న తిరుగుబోతులా వున్నాడతను.

అసలే మతిపోయే కోపంతో వున్నాడు చొక్కా పుచ్చుకుని

"ఎవడ్రా నువ్వు... ఇది హాస్పిటలనుకున్నావా! బ్రోతల్‌హౌస్ అనుకున్నావా... అందునా పట్టపగలు డ్యూటీలో వున్న నర్సుతో... నువ్వసలు మనిషివా... పశువ్వా... ఇంగితం లేదు నీకు..." అంటూ ఉతికిపారేశాడు డాక్టర్‌శ్రీని.

హఠాత్పరిణామానికి తెల్లబోయాడతడు. ఇంతలో హాస్పిటల్ సిబ్బంది అంతా వచ్చి బలవంతంగా లాక్కుపోయారు డాక్టర్‌శ్రీనిని.

స్టాఫ్ అందరూ ఎందుకో భయపడ్తున్నట్లున్నారు. అర్థంకాలేదు డాక్టర్‌శ్రీనికి.

"సార్... మీరు నిదానించండి. చాలా పొరపాటు జరిగిపోయింది. తొందరపడ్డారు మీరు."

"ఏమిటీ నేను తొందర పడ్డానా...! పిలవండి ఆ నర్స్‌ను. ఐ విల్ రైట్ టు ది డి.ఎం. సస్పెండ్ చేసిపారేస్తాను. మెడికల్ ప్రొఫెషన్ పరువునే గంగపాలు చేసింది. ఈ ఉద్యోగం కంటే ఆ ఉద్యోగమే చేసుకుని బ్రతుకుతుంది..."

ఇంతలో కొంతమంది జనం కర్రలూ, కత్తులూ పట్టుకుని హాస్పిటల్ వైపు రావటం చూసి

స్టాఫ్ అంతా డాక్టర్‌శ్రీని దగ్గరకు వచ్చి, "సార్... సార్... పారిపోండి. ఈ రోజు మన ప్రాణాలుదక్కవు." అంటూ డాక్టర్ శ్రీనిని రూములోకి నెట్టుకుపో ప్రయత్నించారు. వాళ్ళ ముఖాల్లో ప్రాణ భీతి కొట్టోస్తోంది.

"నన్నొదలండి... ఎవరొస్తారో రమ్మనండి... నా హాస్పిటల్‌లోకి. ఏం.... ఏం తప్పు చేశానని ఎందుకు చంపుతారు నన్ను...?" ఆవేశంతో ఊగిపోయాడు. డాక్టర్‌శ్రీని.

"సార్... దయచేసి మా మాట వినండి. ఇక్కడ్నించి వెళ్ళిపోండిముందు. తప్పొప్పులు ఆలోచించేటంతటి సంస్కారం లేదు వాళ్ళకి. మీరు చేయి చేసికుంది ఈ ఊరి ఎమ్మెల్యే కొడుకు మీద... దెబ్బతీయటమే గానీ తిని ఎరుగడతను... మేం మాత్రం సంతోషంగా చూస్తూ వూరుకున్నామనుకుంటున్నారా! అధికార అహంకారానికి, పశుత్వానికి భయపడి సర్దుకుపోవడం అలవాటు చేసుకున్నాము బలవంతంగా... మీరింకా కొత్త..." డాక్టర్‌శ్రీనికి నచ్చ చెప్పబోయారు.

"మీరెన్ని చెప్పినా వినను. నా హాస్పిటల్ మీదకి దాడి చేయడం నేను సహించను. నన్నొదలి పెట్టండి." విదిలించుకుని బయటకు వచ్చాడు.



ఎదురుగా నలభై, యాభై మంది కర్రలెత్తిపట్టుతూ కేకలు పెడ్తూ వున్నారు. వారి మధ్య ఇందాకటి కథానాయకుడు కూడా వున్నాడు. డాక్టర్‌శ్రీనిని కాల్చుకు తినేటట్లు చూస్తూ, "ఎవడ్రా నువ్వు... నన్నే కొట్టేంత మాత్రమా! నిన్ను ముక్కలు ముక్కలుగ నరికి నీ ముందే నీ నర్సుల్ని రేప్ చేస్తాన్రా ఏం చేస్తావో చెయ్యి.... పెద్ద పతివ్రతలా నీ స్టాఫ్... వాళ్ళ సంగతి మాకు బాగా తెలుసు...." అనాగరికంగా అసభ్యంగా దూకుడుగ వస్తోన్న ఆ మాటలు వింటూ కూడా ఏం చేయలేకపోయాడు... ఏమిటిది...?

ఆ మొరటు మాటల హోరు మళ్ళీ ప్రారంభమైంది.

"రేయ్... డాక్టరూ! తప్పించుకోలేవురా... నిన్ను చావగొట్టి నా కాళ్ళముందు పడేయకపోతే నేను మా అబ్బకే పుట్టలేదనుకో... చూస్తాను... నీ అంతు చూస్తాన్రా... పెద్ద నీతివంతుడిలా ఫోజులు కొడ్తున్నావే... వచ్చిన మందుల్ని అమ్ముకుతినే పందులు మీరు... పేషెంట్ల నోర్లు గొట్టి వాళ్ళకిచ్చే తిండికి కక్కుర్తి పడే కుక్కలు మీరు... ఆసుపత్రిలో కూర్చుని బూతు పుస్తకాల్చదివి పేషెంట్లను పీల్చుకుతినే రాబందులు మీరు.... మీ చేతుల్లో నలిగిన తర్వాతే కదరా నర్సులు మాకు దక్కేది. ఈ రోజుల్లో ఎవడ్రా నీతుండే డాక్టరు... చూపించరా వొక్కడ్ని... నాతో తాగుతార్రా మీ డాక్టర్లు... అవసరమైతే నా కాళ్ళు పట్టుకుంటార్రామీ డాక్టర్లు... డబ్బుకోసం... ఏ నీచానికైనా వెనుకాడర్రా... చెడిపోయింది... మీరా... నేనా! కావాలంటే నేను చూపిస్తానురా బుజువులు.... అడుగు మీవాళ్ళనంతా..."

డాక్టర్‌శ్రీనికి ఏం చేయాలో తోచడం లేదు... అతని మాటలు సంస్కారవంతులు భరించనలవికానివి... అతని మాటల్ని విశ్వసించలేకపోతున్నాడు.... అవే నిజాలయితే వీళ్ళముందు ఈ అనాగరిక దండు మందు తలవంచుక నిలబడక తప్పదు తను ఒకప్పుడు డాక్టర్ దేవుడితో సమానం... మరి ఇప్పుడు...?!

"రాక్షసులు... రాబందులు... అంటున్నారు... ఇందుకెవరు బాధ్యులు...??? నైతికంగా దిగజారిపోయిన ఏ కొద్దిమంది వల్ల అందరికీ అదే పేరు. కానీ.. మరీ ఇంతగా దిగజారిపోతారా పవిత్ర వృత్తిలోవుంటూ...."

"ఏం! నమ్మకం లేదా... నీతోటి డాక్టర్లని పిలువ్ ఇంతకు ముందిక్కడున్న డాక్టర్ల సంగతి ఇక్కడందరికీ తెలుసు...."

ఇంతలో కొలీగ్స్ పరిగెత్తుకు వచ్చారు. భయంతో వణికిపోతున్నారు. డాక్టర్‌శ్రీనిని బలవంతంగా లోపలికి లాక్కుపోయి తలుపు గొళ్ళెం పెట్టి బయటకు పోయారు. వాళ్ళకు సర్ది చెప్పేందుకు.

డాక్టర్‌శ్రీని మెదడు మొద్దుబారిపోయింది. ప్రపంచంలో అత్యంత ఉత్తమమైనది, అతి విలువైనదీ అయిన వైద్యవృత్తి ఇంత దిగజారిపోయిందా? డాక్టర్లు ఇంత నీచంగా ప్రవర్తిస్తారా! అతని మనస్సు అంగీకరించడం లేదు. తల ఆలోచన్ల వేడితో బ్రద్దలయ్యే



gudachari.com

ట్లుంది... అతని మాటలు ఈటెల్లా మెదడ్ను పొడుస్తూనే వున్నాయి. అవమానంతో మ్రగ్గిపోయాడు.

బయటింకా కోలాహలంగానే వుంది.

కొలీగ్స్ లోపల కొచ్చి చెమటలు తుడుచుకుంటూ

"లాభం లేదు... అయినా ఇంత చిన్న విషయానికి మీరింత రాద్ధాంతం చేస్తే ఎలా... ఇప్పుడు చూడండి ఎంత గొడవయ్యిందో!"

"ఇది చిన్న విషయమా! పట్టపగలు హాస్పిటల్‌లో...."

"చూడు బ్రదర్! ఎక్కడెక్కడ్నించో వచ్చిన వాళ్ళం మనం. లోకల్ పీపుల్‌తో తగవు పెట్టుకుంటే బ్రతగ్గలమా?"

"అందుకని నికృష్టమైన పనుల్నిన్నింటినీ చూస్తూ వూరుకుంటామా... ఎంత అవమానం...."

"ఆ మనిషికి లేని అవమానం మీకెందుకు, మీ నెత్తి మీదకి తెచ్చుకోవడం ఎందుకు...?"

"మీకు చాలా భయంగా వున్నట్లుందే...."

"అవును... భయమే... వొప్పుకుంటున్నాము. నడివీధిలో పట్టుకుని మమ్మల్ని చావగొడ్తే ఎవరొస్తారు మాకు అడ్డం? పోలీసులొస్తారా... ప్రభుత్వ మొస్తుందా...? వీళ్ళకెదురు తిరిగితే క్రింద నుంచి పైదాకా తమకున్న పలుకుబడితో నానా యాతనలు పెట్టి నరకాన్ని సృష్టిస్తారు. మా జీవితాల్ని తెలిసి తెలిసీ నరకప్రాయం చేసికోవడం మాకిష్టంలేదు."

"సర్దుకు పోవాలి. అదేకదూ మీరు చెప్పేది... నావల్ల కాదు. నేనీ ఉద్యోగాన్నైనా వదులుకుంటాను గానీ, ఇటువంటి పనులు నేనుండగా జరగనివ్వను."

"అంతవరకు మిమ్మల్నుంచితే కదా!"

"అంటే చంపుతారా... లోకం గొడ్డుపోయిదా?"

"పిచ్చివాడా! నడిబజార్లో హత్య జరిగితే సాక్ష్యం చెప్పేందుకు మనుషులు దొరకరు. ఐ.జి. కళ్ళముందు జరిగిన రేప్‌కి కేసు పెట్టేందుకేమీ ఆధారాలు దొరకవు. మా మాటవిను. అతనికి క్షమాపణ చెప్పేస్తే కొంత సర్దుబాటైపోతుంది. నీకోసం మేం అతని కాళ్ళు పట్టుకుంటాం."

"నేను క్షమాపణ చెప్పాలా... ఎందుకు?!"

"అతన్ని కొట్టినందుకు... నోటి కొచ్చినట్లు తిట్టినందుకు."

"అతనంత నీచంగా మన హాస్పిటల్‌లో ప్రవర్తిస్తే మీరు సమర్థిస్తున్నారా?"

"మేము సమర్థించడం లేదు. కానీ నువ్వు ఏ అధికారంతో అతన్ని కొట్టావు? అతన్ని కొట్టేందుకు నీకేం హక్కువుంది... కావాలంటే నీ స్టాఫ్‌ని దండించు. అంతేగానీ...."



"ఎవర్నడిగి ఈ పని చేశాడతను?"

"ఎవరి పర్మిషన్ కావాలి ఇటువంటి పనులకి ఇది ప్రజా వైద్యశాల."

"నాలో తప్పేం లేదు. నేను క్షమాపణ చెప్పను."

"మేమెన్ని చెప్పినా నువ్వినేట్టులేదు. ఏం చేస్తాం అది నీ ఖర్మ. కనీసం ఇక్కడ్నించి ఎవ్వరికీ కనిపించకుండా కొన్ని రోజులు లీవులో వెళ్ళిపోయి ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నించు."

"నేను వెళ్ళను పోలీసు రిపోర్టిస్తాను."

"మరి! ఇంతవరకూ రాలేదేవాళ్ళు...? ఈ గలభా సంగతి తెలియదనుకున్నావా... మన ప్రక్క వీధిలోనే పోలీసు స్టేషనుండేది... ఇక్కడ గలభా పూర్తయ్యేంతవరకూ రావద్దని అప్పుడే ఆర్డర్స్ వెళ్ళివుంటాయి వాళ్ళకి. వొక వేళ వొచ్చినా, నిన్ను తీసుకుపోయి అతని చేతికిస్తారు భద్రంగా..."

"ఐ విల్ డై రాదర్ దేన్ సబ్‌మిటింగ్ టు దెమ్. లీవ్‌మీ," అంటూ విసురుగా తలుపులు తోసుకుని వీధిలో కొచ్చాడు డాక్టరుశ్రీని.

"కొట్టండ్రా... కొట్టండి... మహా సత్యవంతుడొచ్చాడు..."

"ఆగండీ..." అరుస్తున్నాడు. ఆ తర్వాతేం జరిగిందో అతనికి తెలియదు.

గట్టి దెబ్బలే తగిలాయి. వాటి బాధ కన్నా మనసు కైన గాయం బాధ భరించడం కష్టంగా వుంది... ఒక్కరూ డాక్టర్‌శ్రీని చేసింది మంచి పనని సమర్థించనందుకు.

వాళ్ళు కేసు పెట్టారు డాక్టర్‌శ్రీనిమీద.

డ్యూటీలో వున్న నర్సును బలవంతం చేసినట్లు, అడ్డు వచ్చిన వాళ్ళను కొట్టినట్లు, ప్రాణాల్ని కాపాడుకొనే నిమిత్తం జరిగిన ఘర్షణలో దెబ్బలు తగిలినట్టు కేసు నమోదైంది.

ప్రళయకాల రుద్రుడయి వాళ్ళందర్ని చీల్చి చెండాడాలనిపించింది డాక్టర్‌శ్రీనికి. ఇదో గుడ్డి చట్టం... ఈ చట్టాన్ని భక్షించే నరరూప రాక్షసుల్ని ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెట్టాలనిపించింది. ఆవేశం పొగలు చిమ్మింది.

కానీ ఎవరిమీద తీర్చుకోగలడు పగ....???

తన ప్రమేయం లేకుండానే తన వాళ్ళంతా సంధి ప్రయత్నం మొదలెట్టారు. మొత్తానికి ఎలాగో ఆ సమస్యతో మరో తాలూకా హాస్పిటల్‌లో వేశారు.

అదేమిటో డాక్టర్‌శ్రీనికి ఎక్కడా మంచి, మానవత్వం వెతికినా కనిపించడం లేదు. బహుశా తనలోనే ఏవైనా తప్పుందేమో! అందరూ ప్రవర్తించేదే అసలైన పద్ధతేమో! తను ఈ కాలానికి ఎదురు నడుస్తున్నాడేమో! కానీ పరిస్థితులతో రాజీ పడ్డానికి తన మనసు ససేమిరా అంగీకరించడం లేదు....

చదువులో తక్కువే అయినా మరో మేల్ డాక్టర్, లేడీ డాక్టరొకరున్నారు. వొక డెంటిస్ట్‌కి కూడా వేశారీమధ్యే. ఆపరేషన్ థియేటరూ వుంది.



gudachari.com

జాయినైన రోజే ఆపరేషన్ థియేటర్ చూడ్డానికి వెళ్ళాడు. ఘోరమైన స్థితిలో వుంది.

"మీరు ఆపరేషన్లు చేయడం లేదా,?"

"ఎందుకు చేయడం లేదూ."

"మరి... థియేటరూ..." "రిపేర్లంటే డబ్బులేవంటుంది ప్రభుత్వం. చేయకపోతే చేయలేదంటుంది." అన్నారు సీనియర్ డాక్టర్ చాలా తేలిగ్గా.

వార్డులోకి వెళ్ళాడు. అక్కడ నలుగురో అయిదుగురో పేషెంట్లు వున్నారు. భోజనాల సమయం.

"ఏం కూరలు వేశారు మీకు... అన్నం బావుందా?"

"ఎవరు స్వామీ మాకు వేసేది. ఏదో పచ్చడి మెతుకులు మేమే వండుకు తింటున్నాం."

"అదేం! హాస్పిటల్లో మీరు రొట్టె పాలు ఇవ్వడం లేదా?"

"హాస్పిటల్‌లో రొట్టె, పాలు ఇస్తారా?! మాకింతవరకూ తెలియదే!?" ఆశ్చర్యంగా అడిగారు తనవైపు అదోలా చూస్తూ.

తన ప్రక్కనే వున్న ఫార్మాసిస్ట్ కమ్ క్లర్క్‌ని అడిగాడు.

"అది... అది... ఫండ్స్ లేవటసార్... పెద్దసార్ చెప్పారు."

నేరుగా. వెళ్ళి సీనియర్ డాక్టర్ని అడిగాడు. ఆయనికి చాలా కోపం వచ్చినట్టుంది.

"అంటే... మేము తింటున్నామనా? అనవసరమైన విషయాల్లో జోక్యం కలుగజేసుకో వద్దు."

"అనవసరమేమిటిసార్! పేషెంట్లకు కనీసం పాలు, రొట్టె ఇవ్వడం...."

"చూడు మిస్టర్... చిన్నవాడివి నువ్వు నేర్చుకోవాల్సింది చాలా వుంది."

"ఏమిటండి! దీనికి చిన్నా పెద్దా... ప్రభుత్వం ఇస్తున్న ఆహారాన్ని రోగులకు ఇవ్వక ఏం చేస్తున్నట్లు?", కాస్త గట్టిగానే అడిగాడు.

"నాకు తెలియదు. ఎవరికో కాంట్రాక్టుకు ఇచ్చారు. ఆయన డి.యం. గారికి కావలసిన వాడట. ఆయన్నడిగితే రిపోర్ట్ చేస్కోమన్నాడు. వొకట్రెండు సార్లు రిపోర్ట్ చేసినా ఫలితం లేదు."

"ఊళ్ళోవాళ్ళెవ్వరూ ఈ విషయం పట్టించుకోలేదా...?"

"వాళ్ళకేం అవసరం. వాళ్ళే అడిగితే ఇలా ఎందుకు జరుగుతుంది."

"కూటికి లేని దరిద్రుల నోర్లు గొట్టి వీళ్ళేం బాగుపడుతారండి. వాళ్ళ గోడు తగలకమానదు. అయినా ఆ కాంట్రాక్టర్ ఎవరో... ఆయన పలుకుబడి ఏమిటో? ప్రజలముందు తేలుస్తాను."

ఆశ్చర్యం!!



ఆ మరుసటి రోజు అందరికీ రొట్టె, పాలు ఇస్తున్నారు. అసలు విషయం అదికాదు. ఆ కాంట్రాక్టరు నెలకు పదిహేనొందలు సీనియర్ డాక్టరుకు ముట్టచెప్తాడట.

ఇలా వుండగా ఒకరోజు రాత్రి ఏదో యాక్సిడెంటల్ కేసు వచ్చింది. నల్గురైదుగురికి బలమైన గాయాలు తగిలాయి. ఎవరో వచ్చి చెప్తే వెళ్ళాడు డాక్టర్‌శ్రీని. పోలీసులున్నా రప్పటికే. గాయాలు తగిలిన వాళ్ళను చెట్లక్రింద పారేసి ఉన్నారు. విపరీతంగా రక్తం కారుతోంది. మూల్గులు, ఏడ్పులతో వాతావరణం బీభత్సంగా వుంది.

డాక్టర్లెవ్వరూ లేరు.

"ఎక్కడికి వెళ్ళినట్లు... ఇక్కడింత ప్రమాదం వుంటే...."

"ముందు వీళ్ళని వార్డులో చేర్చండి."

"ఉండండి సార్... పెద్ద డాక్టర్ రానివ్వండి."

"అవసరం లేదు. ముందు వెళ్ళి ఆయన దగ్గర్నుంచి మందుల గది తాళం తీసుకు రండి.." అప్పుడే వచ్చిన నర్సుకి చెప్పాడు.

ఆమె అక్కడ్నించి కదల్లేదు.

"ఏమిటి అలా చూస్తారు... త్వరగా వెళ్ళండి. లేకుంటే వీళ్ళంతా చస్తారు."

భయపడుతూ చెప్పింది, "ఎమ్.ఎల్.సి. (మెడికోలీగల్‌కేస్) కేసులంతా ఆయనే చూస్తా రండీ."

"ఆయన్నే చూడనివ్వండి. అయితే ఒక్కరే ఎన్ని కేసులు చూస్తారు. ఆలశ్యం అవుతుంది మీరు వెళ్ళండి." తొందర చేశాడు డాక్టర్‌శ్రీని.

ఇంతలో ఎవ్వరో ఏడుస్తూ పోలీసుల్తో అంటున్నారు.

"స్వామీ! మా దగ్గిర డబ్బుల్లేవు. ఆయనకి మూడొందలిస్తే చూస్తానంటున్నాడు."

"అవున్రా ప్రాణం కంటే మూడొందలో లెక్కా! ఇచ్చి పిలవండి." వాళ్ళ సలహా అది.

"ఈ అర్ధ రాత్రి పూట... ఎక్కడ్నించి తెస్తాం. సామీ!"

"మీరు దొంగ నాయాళ్ళురా... మీ దగ్గిర లేకుండా వుంటుందా రేపు అవసరం తీరిన తర్వాత ఆయన ముఖం చూస్తారా మీరు ఫో... పొయ్యి డబ్బులిచ్చి పిలవండి."

"మనుష్యుల మధ్య వున్నానా... శవాల్తో బేరమాడే కసాయిల మధ్య వున్నానా" అని అనిపించింది డాక్టర్‌శ్రీనికి.

నేరుగ తనే వెళ్ళాడు. కాస్త కలవరపడ్డాడు సీనియర్ డాక్టరు.

"ఫార్మసీ తాళాలివ్వండి. కేస్‌లు సీరియస్‌గా వున్నాయ్." అన్నాడు డాక్టర్ శ్రీని.

"నిన్నెవరు రమ్మాన్నారు? నేనేం మెమో పంపలేదే!"

"డాక్టర్ని వొకరు పిలవాల్సిన అవసరం లేదండి! యాక్సిడెంట్ అని తెలిసి మీకు అవసరముంటుందని వచ్చాను."



gudachari.com

"నాకేం అవసరం లేదు. ఐకెన్ హాండిల్‌ది కేసెస్... మీరు వెళ్ళచ్చు."

"ఎప్పుడూ మీరు చేసేది...? వాళ్ళు చచ్చింతర్వాతనా? లేక డబ్బులిచ్చిం తర్వాతనా??" వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ అరిచాడు డాక్టర్‌శ్రీని.

"డబ్బెవ్వరడిగారు? చూడు మిస్టర్! ఇది, ఇవి మెడికో లీగల్ కేసెస్ ఏదైనా అవకతవకలు జరిగితే కోర్టులో నేను జవాబు చెప్పుకోవాలి. అది నాబాధ్యత."

"ఐ నో, వాటీస్ ఎ మెడికో లీగల్ కేస్... చచ్చిపోయినా ఫర్వాలేదు. పరీక్ష చేసేలోగా చచ్చిపోయాడని వ్రాసెయ్యచ్చు. ఎప్పుడు చూశారో! ఎంత త్వరగా అటెండ్ అయ్యారో తెలీదు కదా!"

"మిస్టర్ హద్దులు మీరి మాట్లాడ్తున్నావ్... ఐయమ్ యువర్ సీనియర్ ఆఫీసర్."

"ఐనో. ఇంకొక్క క్షణం ఆలస్యం చేస్తే ఆ హెూదా పోగొట్టుకోవాల్సొస్తుంది."

కాసేపు డాక్టర్‌శ్రీనివైపు గుర్రుగా చూసి లేచి వచ్చాడు. వచ్చాడే గానీ ట్రీట్‌మెంట్ చేసేట్లు కనిపించడం లేదు. కేస్ షీట్స్ వ్రాయడంలో మునిగిపోయాడు. డాక్టర్‌శ్రీని ఉండబట్టలేకపోయాడు.

"వాళ్ళకు ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేసి, తర్వాత వ్రాసుకోవచ్చుకదా!"

"ఐనో! ఐనో! వాట్ షుడ్ బి డన్, ఐ విల్ డు ఇట్.... నేను ఇంకొకరి దగ్గర నేర్చుకోవాల్సిన అవసరం లేదు." కసిగా డాక్టర్‌శ్రీని వైపు చూసి, తాళాలు విసిరేస్తూ.

"సేవ్ దెమ్... యు ఆర్ నెక్స్ట్ టు గాడ్ దేవదూతవు బయల్దేరావు." వెటకారంగా అన్నాడు.

ఆ మాటలేమీ పట్టించుకోక వెంటనే పనిలో మునిగిపోయాడు డాక్టర్‌శ్రీని. ఒక మంచి పని చేయడానికి ఎంత శ్రమ పడాల్సొచ్చింది....

ఆరోజు నుంచి అతనికీ డాక్టర్‌శ్రీనికీ మాటలు సరిగా లేవు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... డాక్టరు గాని, డాక్టరమ్మ గాని రోగుల్ని పరీక్ష చేసినట్లు ఎప్పుడూ చూడలేదు. వాళ్ళు చెప్పటం, వీళ్ళు మందుల చీటీ వ్రాసివ్వడం. అంతే ఎంత అనుభవజ్ఞులైన వైద్యులే ఎంత శ్రద్ధగా పరీక్ష చేసినా వొక్కొసారి తప్పులు జరిగిపోతుంటాయి. అటువంటిది కనీసం ప్రాథమిక పరీక్ష అయినా చేయక...?! ఎంత ప్రమాదం.!

అక్కడ పని చేసినన్ని రోజులూ ఏదోవొక గొడవ. ప్రతి చిన్న విషయానికి తగవు పెట్టుకోవడం ఇబ్బందికరంగా వుండేది డాక్టర్‌శ్రీనికి. అయినా తప్పేది కాదు. తను అవునంటే అతను కాదనం సర్వసామాన్యమైన విషయమైపోయింది.



"అబ్బ! దిగి వచ్చాడయ్యా ఉద్ధరించడానికి. మార్చేస్తాడిక దేశాన్నీ, ప్రజల్ని... ఆయనొక్కడివల్లే తెల్లవారిపోతుందనుకుంటున్నాడు." ఇటువంటి మాటలు చాటుమాటుగ వినిపిస్తూనే వున్నాయి.

పైగా అక్కడున్న స్టాఫ్‌కి కూడా మంచి చేస్తున్నాడే అని మెచ్చుకోవడం పోయి, గుర్రుగా చూసేవారు. మందులు వొస్తున్నాయి. అయితే హాస్పిటల్‌లో వుండవు. అడిగితే అయిపోయాయనో! రాలేదనో! చెప్పేవాళ్ళు. బాధపడ్డం తప్ప మరేం చేయలేకపోయేవాడు డాక్టర్‌శ్రీని.

"అసలెందుకు... నేనింతగా ప్రాకులాడుతున్నాను? అందరూ నిజాయితీగా వుండాలని ఎందుకు కోరుకుంటున్నాను...? మరే శాఖలో అన్యాయాలు జరిగితే కొంతైనా సహించవచ్చేమో! కానీ మెడికల్ ప్రొఫెషన్‌లో...?? ఎందుకంటే ఇక్కడ ఇవ్వాల్సిన మందు, చూడాల్సిన పద్ధతిలో జాప్యంగాని పొరపాటు గాని జరిగితే ప్రాణాలే పోతాయి. తిరిగిరానిది కదా ప్రాణం!" - అనిపిస్తూ ఉండేది డాక్టర్‌శ్రీనికి.

"ఎందుకు చెయ్యాలండీ! బండ చాకిరీ... ప్రభుత్వం ఇచ్చే జీతానికి ఈ మాత్రం పని చాలు" అనీ వాళ్ల వాదన.

"నువ్వలా మాట్లాడ్డానికి వీల్లేదు. అసలా ఆలోచనే రాకూడదు. నీజీతం వేరు. డాక్టర్‌గా నీ ధర్మం వేరు. జీతం చాలదనుకుంటే దీన్నొదిలేసి ప్రైయివేటు ప్రాక్టీస్ పెట్టుకో. లక్షలకు లక్షలు సంపాదించొచ్చు. నీఇష్టం వచ్చినపుడు, ఇష్టమున్నవార్ని, ఇష్టమొచ్చినంత తీసికొని పరీక్ష చేయి."

"ఇదే మనుష్యులు ప్రయివేటు డాక్టర్ల దగ్గరకు వెళ్ళి వేలకు వేలు ఖర్చు పెట్టుకుంటారు. అదే మనం చేస్తే కనీసం పిలిస్తే పలికే నాథుడే లేదు." వాళ్ళ వాదన.

"ప్రభుత్వం ఇన్ని అవకాశాలు కల్పిస్తోందికదా! దయతో, ప్రేమతో నిస్వార్థంగా సేవ చేయి ఈ ప్రయివేట్ డాక్టర్లందరూ బోర్డులు తిప్పుకోక పోతే చూడు... నిన్ను దేవుడని ఏనాటికైనా స్తుతించకపోతే చూడు" డాక్టర్‌శ్రీని వాదన.

"అబ్బాయ్. అదికలలో మాట... ఈ ప్రజ బాగా చెడిపోయింది. అవకాశానికి దండం పెట్టే వారేకానీ...!

నిన్ను గుర్తుంచుకోవాలని ఎందుకు కోరుకుంటావయ్యా!

మనిషిగా కనీసపు కోరిక అది. మేమేం గౌతమ బుద్ధులం కాదు."

డాక్టర్‌శ్రీని స్వగతం యిది. "ఎవరు చేసినా ఎందుకు చేస్తున్నారు...?

కర్తవ్యం.

ప్రతిఫలం లేని కర్తవ్యం ఏమిటి?

ప్రతిఫలం ఆశించనపుడు స్వార్థం అవుతుంది.



gudachari.com

మంచిగా ఆదుకోవాలని చెయ్యడం కూడా స్వార్థమే కదా!

నీ మానసిక సంతృప్తి కోసం.

మానసిక సంతృప్తి ఈ కాలంలో ఏకొందరో మంచి అనగానే సరిపోదు...! ఎదుటి వాడు కారులో పోతూవుంటే... వాళ్ళపిల్లలు పూటకో గుడ్డ తీసిపారేస్తుంటే.... అంతస్తు మీద అంతస్తు కడుతుంటే... నేనూ మానవ మాత్రుడ్నే కదా! ప్రభుత్వమిచ్చే జీతం కనీసం అవసరాలకి కూడా సరిపోదు. డబ్బులేనిదే గాలైనా వీచని ఈ రోజుల్లో... నేనీ పరుగు పందెంలో పాలుపంచుకోకుండా ఎలా వుండగలను... అడ్డుగా నిలబడితే క్రిందపడదోచి వెళ్ళిపోతారు.

అందుకని పేదవాళ్ళ కడుపు కొడతావా?

నేను కొట్టకపోతే ఇంకొకడు కొడ్తాడయ్యా! వాళ్ళు దోచుకోడం లేదూ మనల్ని. వాళ్ళునీతిగా ప్రవర్తిస్తున్నారా! ఏదీ వొక్కర్ని చూపించు. పరుల సొమ్ము ఆశించని వాడు, అవకాశమున్నా మోసం చేయని వాడ్ని... పాతకాలపు నీతి, దీపముండగనే ఇల్లు చక్కబెట్టుకో, అవకాశం వున్నపుడే నాలుగు రాళ్ళు దోచుకో... యిది ఈ కాలపునీతి. డబ్బుకున్న మతింపు మరిదేనికి లేదు. డబ్బు అవసరం నీకిప్పుడు తెలియదు. తెలిసినప్పుడు నువు డబ్బు సంపాదించే అవకాశం వుండదు.

మోసం చెయ్యకుండా ఇతర్ల సొమ్ము ఆశించకుండా డబ్బు సంపాదించలేమా?

రోజురోజుకీ విపరీతంగా అవసరాలు పెరిగిపోతున్నపుడు ఏమూలకొస్తాయి నీ జీతపు రాళ్ళు...?

అవసరాలు మనం తగ్గించుకుంటే....

పిచ్చివాడా! అవసరమంటేనే తప్పించుకోలేనిది. అది నీకు చెప్పిరాదు...

మరో నగ్నసత్యం నీకు తెలియదేమో... నిస్వార్థంగా నువ్వేం చేసినా లాభం కోసం చేశావనే వక్ర దృష్టి వుంటుందీ మనుషుల్లో. మంచిని మనస్ఫూర్తిగ మన్నించి అభినందించే మనుష్యులు చాలా తక్కువ. మంచి అంటే చేతకానితనం, పిరికితనం, బలహీనత ఇదీ ఈయుగ ధర్మం.

రోజూ చిల్లర వేసే భిక్షగాడికి ఒకరోజు పది రూపాయలు వేస్తే ఛస్తేవాడు మంచి నోటు అని నమ్మడు. అలాగే వుంటుందిప్పుడు మనం మంచి చేయాలనుకోవడం.

ఎన్నైనా చెప్పనీ... ఎన్నైనా జరగనీ నేను మంచిగానే ఉండటానికి ప్రయత్నిస్తాను.

నువ్వేమీ సాధించలేవు... మానసిక వ్యథ తప్ప.

ఈరాజ్యం ఎవరిది? ప్రజలది!

ఈ డబ్బెవరిది? ప్రజలది

ఈ ప్రజలెవరు? నేను



కాబట్టి ఎవరి డబ్బు నేను తినడం లేదు. నా వాటా నేను తీసికుంటున్నాను. అసలు నాకు రావాల్సిన వాటా ఎవరో తింటున్నారు కనుక ఎవరివాటానో నేను తింటున్నాను. ఆ ఎవరో మరొకరివద్ద తింటారు. కాబట్టి ఎవరిది ఎవరూ తినడం లేదు. వాళ్ళది వాళ్ళే తింటున్నారు. ఇందులో మోసం, దగా, కుట్రలేమీ లేవు. ఎవరికీ అన్యాయం జరగడం లేదు. అన్యాయం జరిగిందని అరుస్తున్నాడంటే వచ్చింది చాల్లేదు ఇంకా కావాలని అర్థం."

నీచం... నికృష్టం... అధర్మం... అన్యాయం... ఇవీ డబ్బు సంపాదించేందుకు మొదటి సోపానాలు. ఇదీ సారాంశం.

ఎలాగో మూడు సంవత్సరాలు మూలిగి జిల్లా హాస్పిటల్‌ల్లో పడ్డాడు. ఇక్కడి పరిస్థితులు మరీ భయంకరంగా అనిపించాయి.

ఛీఫ్ సర్జన్‌కి తెలియకుండా ఆయన అనుమతి లేకుండా ఎవర్నీ హాస్పిటల్‌ల్లో చేర్చుకోడానికి లేదు. ఒక వేళ చేర్చుకున్నా వార్ని నిర్దయగ గెంటేయడమే. సాయంత్రం ఆయన్ని కలసి ఇవ్వాల్సింది సమర్పించుకుంటే తప్ప.

వెంటనే ఆపరేషన్ చేయాల్సి వున్నా డబ్బు చెల్లించందే వారం కాదు సంవత్సరం అయినా వాడలా పడి చావాల్సిందే. కుళ్ళి కంపు కొడ్తున్న పుండుకు మందు వేయడానికి లేదు. కనీసం దగ్గరకు పోయి పలకరింపు కూడా వుండదు.

ఆపరేషన్ టేబుల్ మీద పడుకోబెట్టి డబ్బివ్వలేదని తిప్పిపంపిన కేసులు కూడా ఎన్నోవున్నాయి. డబ్బు యివ్వలేదని చంపిన కేసులు కూడా ఉంటాయేమో.

దరిద్రంతో... దిక్కులేక జబ్బుతో మానసికంగా కృంగి పోయి - అయ్యా నన్ను కాపాడండీ!- అని ఎలుగెత్తి మొరపెట్టుకున్నా కరిగే గుండె కనిపించదు. ఇంత నిర్దయగా నీచంగా మానవత్వం మరచి డబ్బు కోసం దిగజారిన వీళ్ళందర్ని చూస్తే ఎందుకు చదివారా వీళ్ళీ చదువులు.... వీధులూడ్చే పనిచేసుకున్నా ఎంతో మనశ్శాంతి వుంటుందని పించేది డాక్టర్‌శ్రీనికి.

హాస్పిటల్లో చేసే వైద్యం ప్రభుత్వ ఖర్చుతో... మరి జరుగున్న వాస్తవం...? ఎక్కడిదీ న్యాయం... వీళ్ళతో మార్పురాదా! మానవత డబ్బు మత్తులో మరణించిందా?

డబ్బు శాశ్వతం కాదు... మంచి శాశ్వతం, మానవత్వం, దైవత్వం - అంటే పిచ్చిపట్టిందని తరిమికొట్టేట్టున్నారు.

ఇంత నీచానికి దిగజారిపోవడానికి కారణం మితిలేని డబ్బు మీది ఆరాటం. ఎంత సంపాదించినా ఇంకా ఇంకా సంపాదించాలనే మానసిక రుగ్మత. నిజమే ఇదీ జబ్బే! ఏ మందూ లేని జబ్బు. ఏ ప్రభుత్వమూ అరికట్టలేని టెర్రరిజమ్.

ఎలా వస్తుంది మార్పు...? ఎప్పుడు కలుగుతుంది చైతన్యం??



gudachari.com

చేసిన సాయానికి గుర్తింపు, చెప్పిన మాటకు విలువ, ఎదుటివాడి బాధకు స్పందించే హృదయం, సాటి వారికి సాయం చెయ్యాలనే ఆలోచన, నిస్వార్థసేవ చేయాలనే ఉబలాటం... మంచికి నీరాజనాలర్పించే రోజు... ఎప్పుడు... ఎప్పుడొస్తుంది...?

ఏవిటి తన మానసిక ప్రవృత్తి...? ప్రతి విషయాన్ని భూతద్దంలోంచి చూస్తున్నాడాతను! ప్రపంచంలో తనొక్కడేనా మంచి కోసం ప్రాకులాడేది... అవసరాన్ని బట్టి న్యాయం, ధర్మం మారుతుంటుందా...! ఎవరూ ఎవర్ని గురించి ఆలోచించడం లేదు. తన గురించి మట్టుకే తను ఆలోచిస్తున్నాడు. సంఘం లేదు, ప్రభుత్వం లేదు. నీతి లేదు, నియమం లేదు. మంచి లేదు, మానవత్వం లేదు. ఉండేదొక్కటే... అది "నేను." ఆ నేను "డబ్బు".

రోగులు.... వీళ్ళంతా... ఏ మందుకూ నయంకాని, నయంచేయలేని రోగులు... డబ్బురోగులు.

చాలా అలసిపోయాడు ఈ ఆలోచనల్తో.

కొందరైనా మార్చాలన్న ప్రయత్నం వ్యర్థం అనిపించింది. ప్రతినిముషం తన మనసు చంపుకుని ఈమనుషులత్తో కలవలేననిపించింది. ఈ మానసిక నరకంనుంచి తనకు విముక్తి కావాలి... అందుకే తన యిష్టం వచ్చినట్టు, తన పద్ధతుల ప్రకారం తన చేతనైనంతవరకు, తన అవసరమున్న వాళ్ళకు సాయపడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రైవేటు ప్రాక్టీసు పెట్టాడు. ఇది కూడా అంతా ముళ్ళ పొదే...కానీ-

\- - -

గతంలోనుంచి వర్తమానం..

వారం రోజుల తర్వాత డాక్టర్‌శ్రీని మురళిని కలువడానికి వెళ్ళాడు. పోగానే డాక్టర్‌శ్రీనిని లోపలకి తీసుకువెళ్ళి మళ్ళీ ఇ.సి.జి. తీశారు. అన్ని పరీక్షలూ చేశారు. అయితే ఇతన్నేం ప్రశ్నించలేదు. డాక్టర్ మురళి.

కుర్చీలో కూర్చుంటు నర్స్‌తో "వీరి భార్యను పిలవండి." అన్నాడు.

"... ఏవిటి ఇతని మనస్తత్వం....?!" అనిపంచింది డాక్టర్‌శ్రీనికి.

స్వాతి రాగానే, "అంతా బావుంది. ఇ.సి.జి.లో హార్టు అటాక్ మార్పులే లేవు. చాలా రికవరీ. రిస్క్ లేకుండా చూసుకోండి."

"ఎవరికి రిస్క్... డాక్టర్‌కా, పేషెంటుకా...

రిస్క్ అంటే ఏవిటి... గుండెను చెడుదార్నపోకుండా చేతిలో వుంచుకోమంటాడా. డాక్టర్లకిదో స్టాకు ఆయుధం. ఏవయిన జరిగితే నేను ముందే చెప్పాను కదా! రిస్క్‌లేకుండా చూసుకోమని అనొచ్చు."

"ఇక హార్ట్ అటాక్ రాకుండా వుండొచ్చా?"



"చెప్పలేం. రావచ్చు, రాకపోవచ్చు."

"మరి..."

"అది మీ శరీరతత్వం మీద, మీరుండే పద్దతి మీద ఆధారపడి వుంటుంది." డాక్టర్ తప్పించుకుంటున్నాడు. తన బాధ్యత పూర్తయి పోయింది. ఇక పేషెంటు అదృష్టం.

"నా శరీర తత్వం ఏవిటి... నేనుండే పద్ధతులేమిటి..."

మళ్ళీ ఆలోచనలో పడ్డాడు డాక్టర్‌శ్రీని.

మొదటిది వంశపారంపర్యం, తన వంశవృక్షాన్ని పెకలించి ఎంతమంది గుండెపోటుతో మరణించారో సింహావలోకనం చేసుకున్నాడు. తనకు తెలిసినంతవరకూ ఎవ్వరూ లేరు. వాళ్ళ జేజి తాత తమ్ముడొకరు మాత్రం హఠాత్తుగ చనిపోయాడని తెలిసింది. అయితే అప్పట్లో గుండెపోటు అంటే తెలియదు. కనుక ఆయన మరణం గుండెపోటు అయివుండొచ్చు, కాకపోయి వుండొచ్చు. ఇక వాళ్ళనాన్న, ఆయన తమ్ముళ్ళెవరికి గానీ ఈ జబ్బు వున్నట్లు గానీ, బాధపడినట్టుగానీ లేదు. అసలు వంశపారంపర్యంగా కొందరికిది రావచ్చు, రాకపోవచ్చు.

రెండోది తన భారీ మనిషి కాదు. బరువు ప్రశక్తి లేదు. ఉండవలసిన దానికన్నా ఎక్కువ బరువుంటే ఈ జబ్బొచ్చే అవకాశముంది.

మూడు, రక్తంలో కొవ్వుపదార్థం (కొలెస్టరాల్) ఇది ఎక్కువవుంటే ఈ జబ్బువచ్చే అవకాశముంది. తన కిది చాలా ఎక్కువేవుంది. ముందే తెలుసు. అందుకు మందులు వాడాడు. ఒక కంపెనీ అయితే వారి మందు గురించి ప్రకటనచేస్తూ "మీ గుండె మాది మా మందు మీది" అని ప్రకటనలిచ్చింది. అయితే దాన్ని వాడితే కళ్ళలో పొరలేర్పడతాయి. దాని ప్రభావం చాలా చెడుగావుంటుంది. ప్రభుత్వం ఆ మందును వాడరాదని మూడు సంవత్సరాల తర్వాత నిషేధించింది. అంటే త్వరగానే మేల్కొన్నదనుకోవచ్చు. ఈ మూడు సంవత్సరాల కాలంలో దాని ప్రభావంతో ఎంతమంది అంధులయ్యారో ప్రభుత్వానికి గాని, ఆ కంపెనీకిగానీ అక్కర్లేదు. ఇందుకోసం మరోకంపెనీ మందు వాడాడు. ఇంతలో వొక మెడికల్ జర్నల్‌లో ఇందుకు సంబంధించిన వొక వ్యాసం చదవడం జరిగింది. రక్తంలో ఎంత కొవ్వుపదార్థం తగ్గినా గుండెపోటు వచ్చేందుకు అవకాశం లేకపోలేదు ఇదీ సారాంశం.

మరి ఈ మందు లెందుకు...?

నాల్గో కారణం పొగత్రాగడం. ఎక్కువే... విపరీతమైన పనివత్తిడి ప్రతి విషయాన్నీ ఎక్కువగా ఆలోచించడం... వీటి కారణంగా ఈ వ్యసనం వదులుకోలేకపోతున్నాడు. దీనివల్లే తనకూ తన శ్రీమతికి అప్పుడప్పుడూ ఘర్షణ జరిగేది.

ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం... లేదు!

gudachari.com

మరో కారణం చక్కెరవ్యాధి. ఈ వ్యాధి తనకు గానీ తన వంశంలో మరెవ్వరికి గానీ లేదు?

చివరిది శరీర తత్వం. ఎంతపనివున్నా తీరిక లేకపోయినా ప్రతిరోజూ కనీసం రెండుమైళ్ళు సైకిలింగ్ కానీ లేదా సాయంత్రం టెన్నీస్ ఆడడంగానీ చేస్తాడు. తిని కూర్చుంటే మనిషి బరువెక్కిపోయి ఈ జబ్బు రావచ్చు.

పైగా బ్లడ్‌గ్రూపు ఎ గాని బి గాని వుండేవాళ్ళకు రావచ్చు. అంతేగానీ వస్తుందని కాదు.

గుండెపోటు వచ్చిన సగం మంది హాస్పిటల్‌కి తీసుకువెళ్ళేలోగా చనిపోతారు. మిగిలిన సగంలో ముప్పయిఅయిదు శాతం రెండు సంవత్సరాల్లోగా చనిపోవచ్చు.

మరి... తనూ! ఇంకా చచ్చిపోలేదు. నవ్వొచ్చింది ఈ ఆలోచనకు. ఎందుకో హృదయం మీద చేయివేసుకున్నాడు డాక్టర్‌శ్రీని.

ఈ వారం రోజుల్లో గుండెపోటుకు సంబంధించిన పుస్తకాలన్నీ చదివేశాడు. స్వాతి అవి చదువొద్దని మొత్తుకుంటూనే వుంది.

"అదేవిటి... నేను డాక్టర్ని. నా జబ్బును గురించి తెలుసుకోవద్దా..." అనేవాడు.

"మీరు డాక్టర్ కాబట్టే చదవొద్దన్నాను. చదివిన దగ్గర్నించీ అన్నీ అనుమానాలే.. లేనిపోని ఆలోచన్లు..."

"నేను మాములూ డాక్టర్ని గాను. మామూలు పేషెంటునూ కాదు. ఆత్మవిశ్వాసంతో, గుండెనిబ్బరంతో ఎన్ని కష్టాలైనా భరించి, ఎంతటి జబ్బునైనా జయించగల ధైర్యమున్న వాడ్ని." గుండెలపై తట్టుకుంటూ నవ్వుతూ అనేవాడు డాక్టర్‌శ్రీని.

"సరే! మీ ఇష్టం. మీ మొండితనం మానరు కదా!"

ఆరు వారాలు గడిచిపోయాయి. అంటే ప్రమాదం తప్పినట్లే. గుండెపోటు వచ్చిన వారికి ఈ ఆరువారాలే ప్రధానం. గుండెపోటువల్ల చెడిపోయిన గుండెకండరాలు ఈ సమయంలో తిరిగి జీవకణాల్ని ఉత్పత్తి చేయ ప్రయత్నిస్తాయి. దెబ్బతినకుండా వున్న కండరాలు చనిపోయిన కండరాల్ని నెమ్మదిగా మాములు స్థితికి తెచ్చేందుకు ప్రయత్నిస్తాయి. రక్తప్రసారం వాటికి కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

ఈసారి డాక్టర్ దగ్గరకి వెళ్ళినపుడు ఆయన కాస్త ఉత్సాహంగానే మాట్లాడాడు. అన్నీ పరీక్షలయిన తర్వాత

"చాలా బావుంది. ఫరవాలేదు ధైర్యస్తుడవే. అదేవిధంగా వుండు." అన్నాడు.

"చిన్న అనుమానం... అన్నీ బావున్నాయంటున్నారు. మరి నా రిజల్ట్స్ చూస్తే మార్పేం కనిపించడం లేదు.." డాక్టర్‌శ్రీని అనుమానం వ్యక్తం చేశాడు.



"మీకు తెలుసు... కొంచెం టైం తీసుకుంటుంది."

"అదే నాకర్థం కావడం లేదు." -

"ముగ్గురు పిల్లలున్నారు నాకు. వాళ్ళ భవిష్యత్‌కు ఇంకా నేనేమీ ఏర్పాట్లు చేయలేదు."

"ఓ... డోంట్‌వర్రీ... మీ మిసెస్ వుందికదా!"

...? షాక్‌తిన్నట్లయ్యింది ఆమాటకు. అంటే అతని ఉద్దేశ్యం? నవ్వొచ్చింది డాక్టర్‌శ్రీనికి.

"నేనీమధ్యే... గుండెపోటుమీద మెడికల్ స్టాటిస్టిక్స్ చదివాను. అందులో గుండెపోటు వచ్చి బ్రతికిన వారు రెండేళ్ళలోగా చనిపోవచ్చని వ్రాసుంది...?"

డాక్టర్ మురళికి ఎక్కడ్లేని కోపం వచ్చింది. చివుక్కున లేచి

"ఎవరు చదవమన్నారు... మిమ్మల్ని..? నేను చెప్తున్నాను కదా! నా మీద నమ్మక ముంటే..."

ఇంకేం మాట్లాడదల్చుకోలేదు.

"ఇతనికి పేషెంటు మనస్తత్వం పూర్తిగా తెలియదు. పేషెంటెందుకు ప్రశ్నిస్తున్నాడు... మనం ఎలా జవాబు చెప్పాలి... కొంచెమైనా జ్ఞానం లేదు" అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

గుండెపోటు పేషెంట్లకు ఎన్ని అనుమానాలుంటాయో! ఆలోచన్లుంటాయో డాక్టర్లు తప్పక తెలుసుకోవాలి. అదే ప్రశ్న తననెవరైనా పేషెంటు వేసి వుంటే

"అవన్నీ లెక్కలు. వాటిని గురించి మీరేం ఆలోచించకండి. మీకు వచ్చింది చాలా తక్కువ జబ్బు. ఎక్కువ సంవత్సరాలు బ్రతికిన వారు అనేక మంది వున్నారు. ఆరోగ్యంగా మామూలగా తిరిగిన వాళ్ళున్నారు. ఎవరో కొందరికే అలా కావచ్చు. అందరికీ అనుకోకండి, నీకేం భయంలేదు. నేవున్నాను." అని చెప్పేవాడు.

ధైర్యం చెప్తారనే సాధారణంగా పేషెంట్లు

-నేను బ్రతుకుతానా? మళ్ళీ మామూలుగా తిరగ్గలనా? ఈ జబ్బు మళ్ళీ వస్తుందా...?- వంటి ప్రశ్నలు వేస్తారు.

అతనికి ధైర్యం చెప్పాలి. అతని భయాన్ని పోగొట్టాలి. అతనిలో మానసిక స్థైర్యం కల్గేలా చేయాలి. జీవితం మీద ఆశ కలిగించాలి. అది చేయలేని డాక్టరు డాక్టరేకాదు.

డాక్టరు చెప్పినట్లుగా-

రోజూ వ్యాయామం చేస్తూనే వున్నాడు. అన్నిమందులూ వాడుతున్నాడు. కాసేపు హాస్పిటల్‌కి వెళ్ళి కొద్దిమంది పేషెంట్లని చూసి వస్తున్నాడు. అప్పుడప్పుడు మాత్రం కొంచెం నడిస్తే ఆయాసంగా వుండేది. గుండెలో నొప్పిగా వుండేది. తన గుండెలో మార్పులేవో జరుగుతున్నాయనుకునేవాడు డాక్టర్‌శ్రీని.

gudachari.com

డాక్టర్‌శ్రీని హాస్పిటల్‌కి రావడం పేషెంట్లకి ఆనందం కల్గించిందేమో నవ్వుముఖాల్తో పలకరించేవారు.

రోజురోజుకూ నడుస్తూ వుంటే ఆయాసం ఎక్కువ కాజొచ్చింది. ఎక్కువ దూరం నడవలేకపోయేవాడు. నిదుర కూడా సరిగ్గా పట్టేది కాదు. పడుకోవడం కన్నా కూర్చుని వుంటే కాస్త బావున్నట్టనిపించేది డాక్టర్‌శ్రీనికి.

గుండెల్లో ఏదో అదిమినట్లు... దేనికో రాసుకున్నట్లు శబ్దం వచ్చేది. కాస్త దగ్గుకూడా వచ్చేది.

ఆమాటే డాక్టరుకు ఫోన్ చేస్తే,– "ఏమీ వుండదు. మీకు భయం ఎక్కువ. బాగా ఎక్సర్‌సైజ్ చేయండి" – అనే జవాబు.

తనకు భయం ఏవిటి...? ఈ హాస్పిటల్లో అన్ని పరిక్షలకు పరికరాలు లేవు. ఎక్కడ కయినా వెళ్ళమని చెప్పవచ్చుగా?

అదే పరిస్థితిలో మరెవరైనా వుంటే భయంతో ఎప్పుడో చనిపోయేవారు. అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

స్వాతి డాక్టర్‌శ్రీనిని చూసి కళ్ళలో నీళ్ళు నింపుకునేది.

"ఏమండీ! మరో స్పెషలిస్టుని కలుద్దామండి."

ఆ మాటే తన మనసులో వున్నా...!

"చూడుస్వాతీ! అందరు పేషెంట్లులాగా రోజుకో డాక్టర్ని మార్చడం, డాక్టర్లమైవుండి మంచిదికాదు. మురళిమంచి డాక్టరే. కాకపోతే నేను బ్రతికివుండేవాడ్ని కాదు కదా!"

"అది సరేనండే మీరు రోజురోజుకీ కృశించిపోతున్నట్లున్నారు. ముఖం కూడా ఉబ్బినట్టుగా వుంది."

"నిజమే... కాస్త నీరు చేరినట్టుగా వుంది."

ఫెయిల్యూరులోకి వెళుతున్నారేమో? "సెకండ్ ఒపీనియన్ తీసుకోవడం తప్పేం కాదు కదా! నామాట వినండి. మద్రాస్‌లో డాక్టర్ రెడ్డికి మంచి పేరట. ఆయన్ని కలిస్తే బావుంటుంది."

"సరే! మురళినీ అడిగి చూద్దాం... ఇంతచేస్తే చూశావా విశ్వాసం లేకపోయిందనుకోవచ్చు."

ఫోన్ చేశాడు. తన అభిప్రాయం చెప్పాడు. కాసేపేం మాట్లాడలేదు.

"సరే! మీ ఇష్టం." జవాబులో అయిష్టత, కోపం, స్పష్టమవుతున్నాయి. ఏం చేస్తాం తప్పదు అదిమామూలే డాక్టర్లకు.



"నా మెడికల్ రికార్డ్ మీ దగ్గరుందికదా... అది పంపితే కాస్త తేలిగ్గా వుంటుంది రెఫెరెన్స్‌కు."

"ఓ... యస్ అలాగే పంపుతాను."

"ఎవర్ని కలిస్తే మంచిదంటారు...?"

"అది మీ ఇష్టం. మీకు తెలియని వాళ్ళెవరున్నారు?" అతన్ని సుముఖపర్చుకోవాలని ఆ ప్రశ్న వేశాడు. అయితే మాట వరసకి యిలా అడిగాడని తెలుసతడికి.

సాయంకాలం మద్రాస్‌కి కాల్ చేశాడు డాక్టర్‌శ్రీని.

రిసెప్షనిస్ట్ తీసుకుంది డాక్టర్ రెడ్డితో అపాయింట్‌మెంట్ నెల రోజులు పడ్తుందట. ఎంత చెప్పినా వినలేదు. సరే నేను డాక్టర్‌తో డైరెక్టుగా మాట్లాడతాను కనెక్షన్ ఇవ్వమంటే మొదట ఒప్పుకోలేదు. విధి లేక ఇచ్చింది.

"హలో! డాక్టర్ రెడ్డి హియర్."

"ఐయామ్ డాక్టర్‌శ్రీని."

"హలో! డాక్టర్! చెప్పండి... ఎలాగున్నారు?" కుశల ప్రశ్నలు అయింతరువాత,

"అంతా చెప్పడమెందుకని, "నేను రేపే మిమ్మల్ని కలువాలి. హార్టు పేషెంట్‌ని.""

"సారీ! డాక్టర్ రేపు వీలుకాదు. అంతగా అవసరమైతే నేనో డాక్టర్ని చెబుతాను. అతని దగ్గరకు వెళ్ళండి. సారీ! చాలా బిజిగా ఉన్నాను. అపార్థం చేసుకోకండి." శ్రీని ఆత్మాభిమానం దెబ్బతింది. డాక్టరని తెలిసికూడా! యిలా!!

"నొ... నొ... మిమ్మల్ని కలువాలి అంటే మరో డాక్టరంటారేవిటి. దానికి మీ రెకమెండేషను ఎందుకు" కఠినంగా అన్నాడు. కాస్సేపు మౌనం. "ఆల్‌రైట్ రండి" అని ఫోను పెట్టాసాడు డాక్టరు రెడ్డి. తిరిగి రావడానికి వారం పడ్తుందని మరో డాక్టరుకు హాస్పిటల్‌ని అప్పచెప్పారు. పిల్లల్ని స్వాతీవాళ్ళ అమ్మా, నాన్నలవద్ద వొదిలి మద్రాసు బయల్దేరారు.

ప్రయాణం చేస్తుంటే చాలా కష్టంగా వుంది డాక్టర్‌శ్రీనికి. మాములూగా కూర్చోలేక పోతున్నాడు. దిండువేసుకుని పడుకుంటే బావుంటుందనిపించింది.

లోపలికి అడుగు పెట్టగానే తనేదయినా పెద్ద హొటల్ రిసెప్షన్ రూములోకి వొచ్చానా అనిపించింది డాక్టర్‌శ్రీనికి. కుషన్ ఛేర్స్, ఏర్‌కండీషనర్... పేషెంట్లను పిలిచేందుకు అమ్మాయి... వచ్చిన వాళ్ళకి అపాయింట్‌మెంట్ ఉందో లేదో చూసేందుకు మరొకరు, టైపిస్ట్ నిర్విరామంగా టైప్ చేస్తోంది. ఫోన్ ఎడతెరిపి లేకుండా మోగుతూనే వుంది. అందరికి ఒకటే జవాబు.

"డాక్టరు గారు చాలా బిజీగా వున్నారు. తర్వాత చేయండి."

"లేదండి... వొకనెలవరకూ అపాయింట్‌మెంట్ కష్టమండి.. తర్వాత ట్రై చేయండి... లేదంటే మీ అడ్రస్ చెప్పండి వీలుంటే చెబుతాను."



gudachari.com

అందరూ హడావిడిగా వున్నారు.

వచ్చిన పేషెంట్లు మాత్రం చాలా వరకూ వయసు మళ్ళిన వాళ్ళే....

అన్ని ముఖాలూ... దీనంగా... అలసటగా కనిపిస్తున్నాయి. అందరి ముఖాలూ ఆయాసంతో... కూర్చోలేనంత ఇదిగా కొందరు... వాళ్ళతో వచ్చిన బంధువులు కూడా ఏదో పోగొట్టుకున్నట్లు... అకస్మాత్తుగా ఏదో నెత్తిన పడబోతున్నంత భయంగా వున్నారు. మెల్లగ మాట్లాడుకుంటున్నారు.

తన వయసు వాళ్ళెవరూ కనిపించడం లేదు డాక్టర్‌శ్రీనికి. వాళ్ళందర్ని చూస్తూవుంటే తనలో కూడా ఏదో దిగులు ప్రవేశించింది. ఏదో భయం... మరెదో అనుమానం...

రిసెప్షనిష్టుకి తన పేరు చెప్పాడు డాక్టర్‌శ్రీని. వెంటనే ఆ అమ్మాయి లోపలికి వెళ్ళివచ్చి "డాక్టరుగారు మీకోసం వెయిట్ చేస్తున్నారు. రండి!" వాళ్ళిద్దరినీ లోపలికి తీసుకెళ్ళింది. అమ్మయ్య. బ్రతికించారు. చాలా మర్యాదస్థుడల్లే ఉంది డాక్టరుగారు. లేకపోతే చాలా పోజుకొట్టే అవకాశంఉంది. చాలామంది స్పెషలిస్టులంతే కొలీగ్స్ అని కూడా లేకుండా గంటల తరబడి వెయిట్ చేయిస్తూ ఉంటారు.

డాక్టర్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. కూర్చోమన్నట్లు చేత్తో సైగచేశాడు.

"ఢిల్లీ నుంచా... చెప్పండి... నొ... నొ... అవే మందులు వాడండి. కదలడానికి వీల్లేదు. ప్రధానమంత్రితో డిన్నరుందా! ఎవరైనా కానివ్వండి మీరు కదల్డానికి వీల్లేదు. ఆ... నేను రావడం వీలుపడదు... మిగిలిన వాళ్ళకి కూడా నేను ముఖ్యమే కదా! నథింగ్ టు వర్రీ... ఏం కాదు. నే వ్రాసిచ్చిన మందులు వాడండి... సరిపోతుంది. ఓ.కే..."

ఫోన్ పెట్టేసి, ఎ.సి. రూములో నొసట పట్టిన చెమటను తుడుచుకుంటూ వాళ్ళిద్దరివైపు తిరిగి నవ్వుతూ

"ప్రధానమంత్రి పర్సనల్ సెక్రెటరీనండి, ప్రతి దానికి ఫోన్ చేస్తూనే వుంటాడు. నేను వెంటనే విమానంలో రావాలట. యాస్ ఇఫ్ ఐయామ్ హిస్ ఎంప్లాయి!" అన్నాడు తన ఆర్భాటం, పెద్దవాళ్ళతో తనకున్న పరిచయం అందరికీ తెలియాలనే తపన....

ఆ గది గోడలనిండా పెద్దపెద్ద వాళ్ళతో తను దిగిన ఫోటోలు. ప్రెసిడెంటు, ప్రధాని తనను గౌరవిస్తున్న ఫోటోలు...

మనిషిలో హుందాతనం... మాటల్లో అధికారం... తను గొప్పవాడ్ననే అహంకారం కనిపించకపోయినా వైద్యంలో తాను గట్టివాడ్ననే నమ్మకం అతనికి ఉందనిపిస్తుంది చూడగానే.

"యస్... డాక్టర్‌శ్రీని.. ఐ నో యు బోత్.. ఇంతకు మునుపు విన్నాను, మీ ఇద్దరి పేర్లు. చెప్పండి, నావలన మీకు కావలసిన సాయం..." కళ్ళ జోడు పైకి నెట్టుకుంటూ అన్నాడు నవ్వుతూ.



డాక్టర్‌శ్రీనికి అతనిమీద మంచి అభిప్రాయమే కలిగింది. తన అస్వస్థత గురించి టూకీగా చెప్పి, "నాకు మీ స్వంత, నిర్దుష్టమైన అభిప్రాయం కావాలి?" ఆ మాటన్న తర్వాత ఎలా తీసుకుంటాడా దీన్ని అనిపించింది డాక్టర్‌శ్రీనికి.

"వెల్.. నే నెప్పుడూ నా అభిప్రాయమే చెబుతాను. ఇతర్ల మాటలు, అభిప్రాయాలు నమ్మి నిర్ణయం తీసికోను." అంటూ నవ్వుతూ డాక్టర్‌శ్రీనిని పరీక్ష చేసే గదిలోకి తీసుకువెళ్ళాడు.

టేబిల్ మీద పడుకోపెట్టిన తర్వాత

"ఎలా అనిపిస్తోంది నీకు." అన్నాడు

"బావుంది. కాకపోతే నడిస్తే ఆయాసంగా వుంది." డాక్టర్‌శ్రీనిని పూర్తిగా పరీక్ష చేసిం తరువాత అతని ముఖంలో ఏదో ఆలోచన ముడివేసుకుంది. డాక్టర్‌శ్రీనిని లేచి రమ్మని గదిలోకి వస్తూ, "ఎలా వున్నాడింతకాలం ఇతను. ఇంత మాములుగా... చాలా ధైర్య వంతుడు, మొండివాడు కదూ!" అన్నాడు రిలీఫ్‌గా నవ్వుతూ స్వాతిని చూస్తూ డాక్టర్ రెడ్డి.

ఇంతవరకు ఏం చెబుతాడోనని భయపడుతున్న స్వాతికి ఆ నవ్వు కాస్త ధైర్యానిచ్చింది. కుర్చీలో మాములుగా కూర్చుంటు నవ్వుతూ భర్తవైపు చూసింది.

"వెల్.. నోడౌట్... యుగాట్ మైల్డ్ హార్ట్ ఫెయిల్యూర్. (గుండె ఎడమవైపు భాగం కాస్త పెరిగి, ఊపిరితిత్తుల్లో నీరు చేరి, లివర్ కొంచెం పెరిగి తాకితే నొప్పిగా వుంటే దాన్ని హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. దీని వల్ల నాడిలో కూడా మార్పు వస్తుంది.) మీ డాక్టర్ ఈ చిన్న విషయాన్నెలా మిస్ అయ్యాడో అర్థం కావడం లేదు." అన్నాడు.

నిజమే. మాములుగా నాల్గవ సంవత్సరం మెడిసిన్ చదివే విద్యార్థి తేలిగ్గా కనుక్కో గలడు దీన్ని. మరి... కార్డియాలజీ స్పెషలిస్టు ఎలా కనుక్కోలేకపోయాడో... కొన్ని సమ యాల్లో అంతే పేషెంటుకు డాక్టర్ మీద, డాక్టర్‌కు పేషెంట్ మీద వొక్కొక్కసారి చిన్న చిన్న అపోహల వల్ల కొన్ని అభిప్రాయాలు ఏర్పడి పోతాయి. అది చాలా తప్పు. డాక్టర్లు చేయరాని తప్పు.

పేషెంటు చెప్పిందంతా నిజం కాదు. చిన్నదాన్ని పెద్దది చేసి చెబుతున్నాడు అను కుంటాడు డాక్టరు. డాక్టర్ చెప్పిందంతా నిజంకాదు. డబ్బు గుంజడానికి జబ్బును భయంకరంగా చెబుతున్నాడు డాక్టర్ అనేది పేషెంట్ ఆలోచన. అయితే రెండూ సరిగాదు.

డాక్టరు పేషెంట్ ప్రతిమాటను శ్రద్ధగా పరిశీలించాలి. పేషెంటు పూర్తి నమ్మకంతోనే డాక్టరు దగ్గరకు వెళ్ళాలి.

"సరే.. మీరు ఎన్ని రోజులుంటారిక్కడ?" అనే డాక్టర్ రెడ్డి మాటలతో ఈలోకంలోకి వచ్చి స్వాతి వైపు చూశాడు డాక్టర్‌శ్రీని.

"మీరెన్ని రోజులుండమన్నా వుంటాము" అంది.



gudachari.com

"ఆల్‌రైట్... ప్రస్తుతం ఈ మెడిసిన్స్ వాడండి రెండు రోజులు ఆగి మొత్తం పరిక్షలు చేస్తాము" అంటూ డిగాక్సిస్ (గుండె ఆడే పద్ధతిపై పనిచేస్తుంది) మైల్డు డైయూరిటిక్ (నీరు తగ్గేందుకు) వ్రాసి ఇచ్చాడు.

తర్వాత కాసేపు మెడికల్ విషయాలు మాట్లాడి, తను అమెరికా ప్రెసిడెంటును కలుసుకున్న వైనం, అమెరికాలో ఏయే హాస్పిటళ్లలో తనకు పలుకుబడి వుండేది ఇంకా ఏమోమో చెప్పాడు.

ఫీజు ఇవ్వబోతే తీసుకోలేదు. "డాక్టరువద్ద మరో డాక్టరు ఫీజు వసూలు చేయడం ఈవృత్తికే అవమానం ఆవేశంతో అన్నాడు. మనలో మనం సహాయం చేసుకోకపోతే మరెవ్వరు చేస్తారు." ఎవరి విషయమెలా వున్నా నా విషయంలో మీరివన్నీ మరచిపొండి. మీరెప్పుడైనా నేరుగ నాకు ఫోన్ చేసి వచ్చేయండి - అంటూ చాలా అప్యాయంగా చెప్పాడు.

ఇప్పడది మారిపోయింది. సొంతవాళ్ళ దగ్గర కూడా డబ్బు వసూలు చేసే డాక్టర్లున్నారు.

డాక్టర్‌శ్రీనికి చాలా సంతోషం వేసింది ఆయన ప్రవర్తనచూసి. అభిమానానికి కృతజ్ఞతలు తెలిపి బయటపడ్డారు.

కారులో ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. ఏవేవో ఆలోచన్లు... డాక్టర్‌శ్రీనికి. స్వాతివైపు చూశాడు. ముఖం కోపంగా వుంది. ఆకోపానికి కారణం ఏవిటో తెలుసు డాక్టర్‌శ్రీనికి.

నవ్వుతూ, "ఏవిటి ఆలోచిస్తున్నావు" అన్నాడు.

"మీకు నవ్వులాటగానే వుంటుందండీ, ఒక కొలీగ్ అందులో బాగా తెలిసిన డాక్టర్ ఈ చిన్న విషయాన్నెలా కనుక్కోలేకపోయాడండి. ఎందుకు అతనో స్పెషలిస్టు తగలెయ్యడానికా?" అంటూ విరుచుకు పడింది.

"కోప్పడకు. ఒక్కొక్కప్పుడు అలా జరుగుతుంటుంది. అతను నిజంగా దీన్ని కనిపెట్టలేడంటావా! గలడు. అయితే నామీద అతనికో ప్రి ఫామ్డ్ ఒపీనియన్..." డాక్టర్ డాక్టర్‌కి వైద్యం చెయ్యాలంటే కొందరు తడబడతారు.

"అందుకని ఇలా చెయ్యొచ్చా! తను చేయలేకపోతే మరెక్కడికైనా పొమ్మని చెప్పచ్చుకదా!"

సర్దిచెబుతూ, "పోనీ. ఇతను కరెక్టుగా డయాగ్నోస్ చేశాడంటావా?" అన్నాడు డాక్టర్‌శ్రీని.

ఏం మాటాడలేదు.

రూముకు వెళ్ళింతర్వాత సిటీలోని నలుగురైదుగురు తెలిసిన డాక్టర్లకు ఫోన్ చేసి అడిగాడు డాక్టర్ రెడ్డిని గురించి. అందరూ చాలా మంచివాడు, సబ్జక్టులో గట్టివాడు అనే చెప్పారు.

మందులు వాడిన రెండ్రోజులకే ఆరోగ్యం మెరుగైనట్లనిపించింది. నీరు తగ్గింది. ఆయాసం కూడా తగ్గిపోయింది. ఆకలి, నిదురా బాగా వున్నాయి. కాకపోతే ఉప్పు తగ్గించి తినటం ఇబ్బందిగా వుంది డాక్టర్‌శ్రీనికి.



మరో రెండ్రోజుల తర్వాత డాక్టర్ రెడ్డిని కలిశాడు. ఏ సమయంలోనైనా తాను చేయగల్గింది వుంటే రమ్మని మరి మరీ చెప్పాడు. రిజల్ట్స్ అంత చెడ్డగా లేవని, భయం అవసరం లేదని చెప్పాడు.

ఇంటికి వచ్చిన తరువాత ఒకరోజు ఈవినింగ్ వాక్ వెళ్తుంటే డాక్టర్ మురళి తటస్థపడ్డాడు డాక్టర్‌శ్రీనికి.

"హలో... డాక్టర్.. మీరు నా మెడికల్ రిపోర్టు పంపలేదే...?"

"నేను పంపే లోపలే మీరు వెళ్ళిపోయారు."

"డాక్టర్ రెడ్డి, డయాగ్నయిస్ట్ దట్ అయామ్ యిన్ ఫెయిల్యూర్."

"యస్ ఐ నో... నేను చెప్పినట్లు నువ్వు మందులు వాడి వుంటే కదా." అంటూ చర చర వెళ్ళిపోయాడు.

ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. అతను చెప్పినమాట తు.చ తప్పక పాటించిన వాడు తను. డాక్టర్లింతే...

మద్రాస్‌నుండి వొచ్చిన వారం తర్వాత ఓరోజు ఇంట్లో డాక్టర్‌శ్రీని వొక్కడే వున్నాడు. ప్రశాంతంగా వుంది. స్వాతి హాస్పిటల్‌కి వెళ్ళింది. టేబుల్ మీద కాళ్ళు పెట్టుకుని కూర్చొని మెడికల్ మాగజైన్ చదువుతున్నాడు. గుండెల్లో ఏదో... కొంచెం అదిమినట్లుగ వుందనిపించింది. బహుశా కూర్చోవడం వల్లెమో అని పడుకున్నాడు. కానీ బరువుగ అలాగేవుంది. గతంలోలాగ ప్రాణం తీసే నొప్పిగాని, చెమటలు పోయడం గాని లేదు. అయినా తీసిపారెయ్యడానికి వీల్లేదు. ఒకసారి గుండెజబ్బు వచ్చిన తర్వాత ఎంత చిన్న విషయమైనా ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆలశ్యం చేయక డాక్టర్ రెడ్డికి ట్రంకాల్ చేశాడు డాక్టర్‌శ్రీని.

ఆయన "వెంటనే బయల్దేరి నేరుగా 2020 ఏ.డి. హాస్పిటల్‌కు వచ్చేయి" అన్నాడు.

స్వాతికి కూడా చెప్పాల్సినంత అవసరం లేదు. తనే వెళ్ళి రావచ్చు అనుకున్నాడు. అయినా ఫోన్ చేసి చెప్పాడు. బాంబు ప్రేలినంత భయపడింది.

"ఏం లేదు... మామూలుగనే వున్నాను. నువ్వు హాస్పిటల్ చూసుకో నేనే మద్రాసు వెళ్ళొస్తాను." అన్నాడు.

ససేమిరా వీల్లేదని వెంటనే వొచ్చేసింది స్వాతి.

ఆమెను చూసి, "ఇదేవిటి... ఈ ఆయాసం... శరీరం చమటతో తడిసి ముద్దై పోవడం... ఎందుకిలా భయం? నీచేతులు వొణుకుతున్నాఏమిటి... నీకు హార్ట్ అటాక్ రాలేదు కదా!" నవ్వుతూ దగ్గరకు తీసికున్నాడు.

డాక్టర్‌శ్రీని గుండెలపై తల అన్చి

"నా ప్రాణాలెగిరిపోయా యనుకున్నా నండీ, పేషెంట్లంతా ఏవనుకున్నారో... ఏమీ చెప్పకనే పరిగెత్తుకు వచ్చేశాను." నొసటి చెమట తుడుచుకుంటూ అంది స్వాతి.



gudachari.com

"రిలాక్స్... బేబీ... రిలాక్స్... ఏమిలేదు.. కొంచెం బరువుగ వుందంతే." వీపు నిమురుతూ సముదాయించాడు డాక్టర్‌శ్రీని.

మద్రాసువెళ్ళిం తరువాత నేరుగా హాస్పిటల్‌కే వెళ్ళారు.

డాక్టర్ రెడ్డి వాళ్ళకోసమే ఎదురుచుస్తున్నట్లు వెంటనే అన్ని పరీక్షలూ చక చక చేయించాడు.

అరగంట తర్వాత డాక్టర్‌శ్రీని దగ్గరకు వస్తూ...

"ఇటీజ్ నథింగ్ సీరియస్... ఏమంత ప్రమాదం కాదు. మైల్డ్ హార్ట్ అటాక్ అయివుండవచ్చు. ఇ.సి.జి.లో మార్పులు లేవు. రక్తంలో మార్పు కనిపిస్తోంది. హాస్పిటల్‌లో వుంటే మంచిది." అన్నాడు.

"ఎప్పుడు చేరమంటారు" ఆతృతగ అడిగింది స్వాతి

"ఎప్పుడో ఏవిటి... రూము కూడా మాట్లాడాను ఇప్పుడే."

అంతే... మళ్ళీ తతంగమంతా...

హార్ట్ అటాక్ అయివుండొచ్చు అంటాడేమిటి... నిర్దుష్టంగా అవునా, కాదా తెలియదా! కొన్ని సమయాల్లో తెలియదు. కొంతమందికి వారి జీవితంలో ఒకటి రెండు సార్లు వొచ్చివుండవచ్చు. కానీ వాళ్ళకది తెలియకపోవచ్చు. ఆహారం జీర్ణంకాకపోవడం వల్లనో లేదా కడుపులో పుండు అనో మంటో అని సరిపెట్టుకుని వుండవచ్చు.

వారం రోజులు హాస్పిటల్‌లో వుండి ఇంటికి వొచ్చిన తర్వాత కొంత ధైర్యంగ వుంది డాక్టర్‌శ్రీనికి. ఎవరికైనా హార్ట్ అటాక్ వచ్చి మృత్యువుతో ముఖాముఖీ పోరాడి చివరికి జయించి మళ్ళీ హార్ట్ ఫెయిల్యూర్ వొచ్చి బాగయితే ఆ మనిషి శారీరకంగా, మానసికంగా కృంగి కృశించి పోతాడు. అయితే డాక్టర్‌శ్రీని విషయంలో అలాకాదు.

జబ్బు మనిషికి కాక మరెవరికి వస్తుంది... వొస్తే ఎందుకు భయపడాలి... సైన్సు సాధించిన అభివృద్ధి ఎక్కువే... ఎంతో మంది డాక్టర్లున్నారు, సాంకేతిక సాయం వుంది, అధునాతన హాస్పిటళ్ళు వున్నాయి.

తనకు తెలుసు తన జబ్బు ప్రమాదమైనదని. అలా అని ఏ నిమిషంలో చచ్చిపోతానో అని, ప్రతి నిమిషం చావటం అతని కిష్టంలేదు. "జరగనివ్వు చూద్దాం... ఎందుకు చని పోతాను...? నాకిప్పుడు బావుంది. మామూలు మనిషిని నేనిప్పుడు - ధైర్యం కావాలి రోగికి. రోగి బంధువులకూను. అనుకోని సంఘటన ఎదురైనప్పుడు మనిషికి మనో నిబ్బరం అవసరం. ఏదో జరుగుతుందని భయం ఎందుకూ?" అనే ధృడమైన అభిప్రాయం.

ఎప్పుడూ ఇంట్లోనే వుంటే విసుగ్గా అనిపించి అలా తిరిగివద్దామని బజారు బయల్దేరాడు ఒకరోజు.



గుండెల్లో కొద్దిగా బరువు... ఏం చేస్తుంది లెమ్మనుకున్నాడు. చిన్నగ నడుస్తున్నాడు. ఒక్కసారిగా వున్నట్లుండి సీసపు ముద్దతో బలంగా కొట్టినట్లయింది.

"అమ్మా!" అరుపుకి చుట్టుప్రక్కల వాళ్ళలాగే నిలిచిపోయారు. "పోయింది... ప్రాణం పోయింది. పోతేనే బాగుండిపోను. ఈ నొప్పికన్నా. కళ్ళు బైర్లు కమ్మిపోతున్నాయి." మైకం... పడిపోయేట్లుంది ప్రక్కనే గోడకు ఆనుకున్నాడు. తగ్గిపోయింది. పూర్తిగా తగ్గిపోయింది. ఇంటికి వెళ్ళొచ్చు. ఫరవాలేదు.... నడుస్తున్నాడు... కాసేపు ఆగు విశ్రాంతి తీసికో... తగ్గిపోయింది. అవును ఇది యన్‌జైనా. (Angina) గుండెనొప్పి. ఎంత భయంకర మైనదో అనుభవిస్తేగానీ తెలియదు. కొందరికి. హార్ట్ అటాక్ వచ్చేముందు వొస్తుందిది. మరి కొందరికి తర్వాత.

అంతే అంతకాలం ఎంతో ధైర్యంగ వున్న డాక్టర్‌శ్రీని ఇప్పుడయ్యాడు హార్ట్‌పేషెంటు. మంచం దిగాలంటే భయం... నడవాలంటే భయం.. కనీసం లేచి కూర్చోవాలన్నా భయం... అంతా భయం.. ఏ నిమిషమొస్తుందో నొప్పి అని.

మళ్ళా మద్రాసు.

డాక్టర్ రెడ్డి కరోనరీ యాన్ జియోగ్రఫీ చేస్తే బావుంటుందన్నాడు. ఇంత కాలం ఎందుకు ఆగినట్లు?

మైగాడ్... యాన్జియోగ్రఫీ..?! ఇంకేదైనా చేయించుకుంటాడు కానీ ఆ పరీక్ష అంటేనే డాక్టర్‌శ్రీనికి విపరీతమైన భయం. ఇదే చిక్కు డాక్టర్ పేషెంటుగ మారితే. మామూలు పేషెంటు తెలియక కొద్దిగ భయపడితే, డాక్టర్ పేషెంటు తెలిసి విపరీతంగా భయపడతారు.

ఇది చాలా సున్నితమైన పరీక్ష.

తొడపైభాగంలో వుండే ఫిమొరల్ ఆర్టరీ (రక్తాన్ని గుండెనుంచి కాలుకి తీసుకుపోయే గొట్టం)లో నుండి వొక రకమైన ప్లాస్టిక్ గొట్టాన్ని గుండె రక్తనాళాల్లోకి పంపి, ఆ గొట్టం ద్వారా మందును పంపి వెంటనే ఎక్స్‌రేలు తీయడం, వీడియో కూడా తీస్తారు. చేతిలో నుంచి కూడా చేస్తారు.

ఇందులో ఇచ్చే మందు మోతాదు ఖచ్చితంగా వుండాలి. నిర్దుష్టమైన పద్ధతిలో ఒకేవేగంతో మందును గుండెరక్తనాళాల్లోకి పంపాలి. ఈ రెండింటిలో ఏ చిన్న పొరపాటు జరిగినా రోగి ప్రాణమే పోవచ్చు. ఎందుకంటే ఆ సమయంలో రక్తానికి బదులు ఆ మందే గుండె కండరం లోపల వుంటుంది. అంటే రక్త ప్రసారం గుండెకు ఆ సమయంలో వుండదు. కొంచెం ఎక్కువ తక్కువైతే గుండె నిలచిపోవడమో లేదా హార్ట్ అటాక్ రావడమో జరుగుతుంది.



gudachari.com

లెక్కల ప్రకారం ఈ పరీక్షల వల్ల చావు ఒక శాతం కంటే తక్కువే. సాధారణంగా ఈ అపాయం ఏ పరీక్షలోనైనా వుండొచ్చు. చిన్నగడ్డను కోసేప్పుడు కూడా ఒక్కొక్కసారి ప్రాణానికి ప్రమాదం జరగవచ్చు.

ఎందుకో డాక్టర్‌శ్రీనికి ఈ పరీక్ష ఇష్టంలేదు.

డాక్టర్లింతే... ఆపరేషన్ ప్రమాదమా? అని ప్రశ్నిస్తే

చాలా సింపుల్... కోసి తీసెయ్యడమే అంటారు. డాక్టర్ రెడ్డి కూడా అలాగే చెప్తున్నాడు.

తనెప్పుడైనా పేషెంటుకిలా చెప్పివున్నాడా అని ఆలోచించాడు డాక్టర్‌శ్రీని.

"ఏం.. భయపడాల్సిన అవసరం లేదు. చాలా తేలికైన పరీక్ష. నీకేం తెలియదు. నొప్పి కూడా వుండదు. అంతా మేం చూసుకుంటాం కదా" ఇలా ఎన్నో పర్యాయాలు పేషెంట్లకి చెప్పి ఉన్నాడు. మరి తనకూ అంతే. తను పేషెంటు కదా! అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

మరీ భయపడే పేషెంటయితే ముఖ్యమైన విషయాలు వదిలేసి సాధ్యమైనంతవరకూ ప్రమాదం లేదని నచ్చచెప్పడం తప్పని సరి. వాళ్ళ భయం పారద్రోలాలి కాస్తో కూస్తో. తను కూడా ఆ కోవకే చెందుతాడా ఇప్పుడు... నిజమే ననిపించింది. కానీ తను భయపడు తున్నట్లు స్వాతికి తెలియకూడదనుకున్నాడు అందుకని "డాక్టర్ రెడ్డి తొందరపడు తున్నాడెమో? యిప్పుడే ఆ పరీక్ష అవసరం లేదేమో".

"మంచిదే కదండీ. ముందుజాగ్రత్త అవసరమేకదా!" చాలా తేలిగ్గా అనేసింది స్వాతి ఆమాటకు.

ఏం చెప్పాలో అర్థంకాలేదు డాక్టర్‌శ్రీనికి. కానీ ఎలాగయినా తప్పించుకోవాలని, "పోనీ మరో డాక్టర్ని చూస్తే" అన్నాడు.

"ఎందుకండీ! మనకు ఈయనమీద నమ్మకంవుంది", ఈ సారి కూడా అలాగే అంది.

"అసలు ఈనొప్పి యాన్‌జైనా కాదేమో అనిపిస్తోంది." స్వాతికి ఈమాటలు వింటుంటే అనుమానం వచ్చింది. డాక్టర్‌శ్రీని కళ్ళలోకి సూటిగా చూస్తూ! "మీ వాలకం చూస్తుంటే మీరు దేనికో భయపడుతున్నట్లుందే", అంది.

నేరుగా ముఖంలోకి చూడలేక తలొంచుకుని ఇక తప్పదని నచ్చచెప్పబోయే ధోరణిలో.

"అదికాదు స్వాతి.. ఈపరీక్షలో రిస్కుకొంచెం ఎక్కువగా వుంది. అందుకని మరొకర్ని కలిస్తే బావుంటుందేమో అనిపిస్తోంది" అన్నాడు.

"రిస్కు ప్రతిదాన్లోనూ వుంటుంది."

ఆమాటకు కోపం వచ్చింది. తను పడుతున్న బాధ అర్థంచేసుకోలేదని, "నా జీవితమే రిస్కు అంటుంటే చాలా తేలిగ్గా మాట్లాడుతున్నావే. నేను బ్రతకడం నీకిష్టంలేదా?" అన్నాడు గట్టిగ ముఖం ప్రక్కకు తిప్పుకుని.



కాసేపు శబ్దం ఏం వినిపించలేదు. ఏమయిందని తిరిగిచూశాడు. కళ్ళనిండా నీరు నింపుకుని ముఖం కందిపోయి పంటితో క్రింది పెదవి నొక్కిపట్టుకుని నిలబడి వుంది స్వాతి.

ఆమెను చూడగానే చాలా జాలి వేసింది. చేత్తో చెంపనిమురుతూ "సారీ.. స్వీటీ క్షమించు. నిన్ను బాధపెట్టాలనికాదు... నన్ను అర్థం చేసుకో... ఎందుకో భయం వేస్తోంది", నిజం వొప్పేసుకున్నాడు.

డాక్టర్‌శ్రీని వొడిలో ముఖందాచుకుని వెక్కివెక్కి ఏడ్చేసింది స్వాతి.

"మీరు నా సర్వస్వం... మీరు నాజీవితం.. మీకోసమే నేను జీవిస్తున్నాను. మీరు లేని నేను లేను. ప్రతిక్షణం భయంతో చచ్చిపోతున్నాను. మీరేమైపోతారా!" అంటూ

ఆప్రేమకు అనురాగానికి డాక్టర్‌శ్రీని కళ్ళుచెమర్చాయి.

"సారీ మై డియర్... ఛ... ఛ... ఏవిటిది. ఇంత పెద్ద డాక్టరువైయుండి ఇలా సెంటిమెంటల్‌గా..."

"ఏం డాక్టర్లు మనుషులు కారా... హృదయముండదా?"

"ఉంటుంది. అయితే కొన్ని సమయాల్లో ఆ హృదయాన్ని గట్టి చేసికోవాల్సిన విషమ ఘడియలు డాక్టర్ల జీవితాల్లో సహజం."

ఇద్దరూ చాలా సేపు ఒకర్నొకరు చూసుకుంటూ వుండిపోయారు. ఒకర్ని చూసి ఒకరు నవ్వుకున్నారు.

డాక్టర్‌శ్రీని గుండెలమీద చేత్తోరాస్తూ, "ఏవండీ నిజంగానే భయంగా వుందా!" అంది స్వాతి అనునయంగా

"అబ్బే... అంత భయవేం లేదు. కాకపోతే మరో డాక్టర్ని సంప్రదిస్తే బావుంటుందని..." అప్పుడు కూడా తను భయపడ్డట్టు తెలియకూడదని ప్రయత్నిస్తూ. అది చూసి నవ్వుకుంటూ.

"అలాగేనండీ. మీరు చెబితే నేను దేనికి కాదంటాను. మీ ఇష్టం."

మరుసటి రోజు అప్పుడే వృద్ధిలోకి, వేరు ప్రఖ్యాతుల్లోకి వస్తున్న యువకుడైన కార్డియాలజిస్టును కలిశారు.

అన్ని పరీక్షలు చేయించి, ఇది అదే అయివుండొచ్చు. అయితే యానిజియోగ్రఫీకి అప్పుడే అవసరం లేదని, రెండోసారి హార్ట్ అటాక్ వచ్చింతర్వాత హార్టుకు కొంచెం విశ్రాంతి అవసరం అని చెప్పాడు.

అయ్యో! అనిపించింది చిన్ని కార్డియాలజిస్టని చూస్తూంటే డాక్టర్‌శ్రీనికి. తనక్కావల్సిన దానికి ఇతను వొప్పుకున్నాడు. మనస్ఫూర్తిగానే తన ఆలోచనల్తో సంధి చేసుకున్నాడు. చాలా తప్పు... పేషెంటుకు కావల్సిన విధంగా డాక్టర్ మారిపోవడం, పేషెంటు చెప్పిన దానికి వొప్పుకోవడం వైద్యవృత్తిలో చేయరాని నేరం.



gudachari.com

డాక్టర్ రెడ్డితో చెప్పాడీ విషయం. కొంచెం కోపం వచ్చినట్లు అనిపించింది "చాలా తప్పు చేస్తున్నావేమో డాక్టర్.. నో హార్మ్ టు అండర్ గో దిస్ టెస్ట్. ఏవైనా ఉంటే దాన్ని కరెక్టు చేసికోవచ్చుకదా! మీయిష్టం" అని వెళ్ళిపోయాడు.

ఇంటికి తిరిగివచ్చేశారు.

ఆ పరీక్షను తప్పించుకున్నాడేగాని నొప్పిని మాత్రం తప్పించుకోలేకపోయాడు. ఎన్నోవిధాల ప్రయత్నించి చూశాడు, తగ్గుతుందేమో అని. రోజురోజుకి కదల్లేకపోతున్నాడు. కదిల్తే నొప్పి వస్తుందేమోనని భయం. తను చాలా పొరపాటు చేసినట్లు గుర్తించాడు డాక్టర్‌శ్రీని.

స్వాతి మౌనంగా గమనిస్తూ వుండేది అన్నీ, ఎదురుచెప్పలేక. రాత్రిళ్లు నిద్రలేకుండా డాక్టరుశ్రీనినే చూస్తూ అలాగే కూర్చుని వుండిపోవడం, శ్వాస ఆడుతుందో లేదో అని ముక్కుదగ్గర దూదిపింజలు పెట్టడం, ఆమె రోజురోజుకి నిద్రలేమి వల్ల నీరసించిపోవడం అన్నీ గ్రహిస్తూనే ఉన్నాడు డాక్టర్‌శ్రీని. ఈ గుండె బాధ కన్నా ఆమెను విపరీతమైన మానసిక వ్యథకి గురిచేస్తున్నానే అనే బాధ ఎక్కువగా వుంది డాక్టర్‌శ్రీనికి.

డాక్టర్నయి వుండీ ఇలా ప్రవర్తించడం... తనకే సిగ్గుగా వుంది. అది కష్టమైనా నష్టమైనా ఒక పరీక్ష తప్పని సరిగా చేయాల్సోచ్చినపుడు ఏం జరుగుతందో అని ఆలోచించడం అవివేకం. చేసిన పరీక్ష వల్ల వొచ్చే ఫలితాన్ననుసరించి తగిన వైద్యం చేయొచ్చు, తద్వారా రోగి బాధను ఉపశమింపచేయచ్చు. అటువంటిది ఏమో అయిపోతుందనే అనవసర భయంతో నిరోధించడం నేరం. ప్రమాదం కూడా. అని నిర్ణయానికి వచ్చి, అంగీకరించాడు. ఆపరీక్ష చేయించుకోవడానికి. స్వాతికి చాలా సంతోషం వేసింది.

హాస్పిటల్ వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది. రూము తలుపులు ముందుకు వేసి వున్నాయి. పైన ఫాన్ తిరుగుతుంది. ట్యూబ్‌లైట్ కాంతి గదంతా పరచుకుని వుంది. బెడ్‌మీద పడుకుని పై కప్పుకేసి చూస్తున్నాడు డాక్టర్‌శ్రీని. బయట నర్సులు, డాక్టర్లు తిరుగుతున్న చప్పుడు వినిపిస్తోంది చిన్నగా. పేషెంట్ల బంధువులెవ్వరో అంటున్నారు.

"ఆరోజే తీసుకొచ్చేసుంటే పోనమ్మా! ఎంత ప్రమాదం తప్పిందో! పోతే పోనీ డబ్బులు, ఈరోజు కాకపోతే రేపొస్తాయి. ప్రాణం పోతే మళ్ళీ వస్తుందా!"

ఆ మాటలు వినిపించాయి డాక్టర్‌శ్రీనికి.

"... నిజమే ప్రాణం పోతే మళ్ళీ వస్తుందా... రాదు! మరి డబ్బు పోతే...!" కొన్ని దీర్ఘరోగాల వలన ఎన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయో, మానసికంగా కృంగిపోతున్నాయో ఆలోచిస్తే చాలా బాధగా వుంటుంది.

సరియైన అవగాహన లేక వ్యాధి ముదరపెట్టుకునీ, లేదా డాక్టర్ల అశ్రద్ధ వల్లనో చేతులు మించిపోయి ఆఖరి క్షణాల్లో ఎంత ఖర్చు పెట్టుకుంటే ఏం లాభం వుంటుంది..



సంసారం చితికి పోవడం గాక, ఆర్థికంగా తట్టుకో లేక చావు కోసం అహర్నిశలు ప్రార్థించే వ్యాధిగ్రస్తులు ఎంతమందో... వీడెంత త్వరగా చచ్చిపోతాడా అని ఎదురుచూసే కుటుంబ సభ్యులెంతమందో....

ప్రజల్ని ప్రభావితం చేయాలి. మూఢనమ్మకాల్తో, అజ్ఞానంతో ఎంత చిన్న జబ్బునైనా అలసత్వం చేయొద్దని వాడ వాడల్లో మనసుకు హత్తుకునేలా, వాళ్ళు మారేవిధంగా ప్రచారం చేయాలి. అలాగే డాక్టర్లకూ చదువుకునేటప్పుడే ప్రజల్లోకి, ప్రపంచంలోకి వెళితే ఎదురయ్యే సమస్యలు గురించి నూరిపోయాలి. "రోగి నీ దయాదాక్షిణ్యాల మీద బ్రతకడం లేదు. నువ్వే అతని దయ మీద బ్రతుకుతున్నావు. అతను నీకెంతో జ్ఞానాన్ని అతని జబ్బు ద్వారా అందిస్తున్నాడు. నువ్వు ముఖ్యం కాదు. రోగి ముఖ్యం." అనే ముద్ర వాళ్ళ హృదయాల్లో వేయాలి.

నీ అహంకారానికి, నీ అశ్రద్ధకూ, తెలివితక్కువ తనానికీ రోగిని బలిచేయవద్దు. నీకు తెలియకపోతే నిజం వొప్పేసుకో. మరోమంచి డాక్టర్ దగ్గరకు పంపు... గుడ్డిగా నీ పేరు కోసం, డబ్బు కోసం రోగుల ప్రాణాల్తో ఆటలాడకు. సత్యాన్ని నిర్భయంగా వొప్పుకోవడం దైవత్వం. అప్పుడే డాక్టర్ మానవాతీతుడు.

డాక్టర్లని ప్రత్యేకంగా అవమానించాల్సిన అవసరం లేదు. "లాభం లేదు. ఇంటికి తీసుకువెళ్ళండి." అని చెప్పిన పేషెంటు బ్రతికి ఎదురుగా కనబడుతుంటే చాలు డాక్టర్ జీవితాంతం తన ఓటమికి కృంగిపోతూనే వుంటాడు.

రెండుమూడు పర్యాయాలు "మీరిచ్చిన మందులు పనిచేయలేదండి. ఎక్కడికైనా వెళ్ళమంటారా?" అని అడిగితే చాలు ఉన్న అహంకారమంతా హరించుకపోతుంది ఆక్షణం. తమ తప్పు తెలుసుకోడానికి ప్రయత్నించి చిత్తశుద్ధితో నయంచేయాలని తపనపడే డాక్టర్లు దేవుళ్ళు. లెక్కలేని తనంతో అశ్రద్ధగ ప్రవర్తించే డాక్టర్లు రాక్షసులు.

ఈ మెడిసన్ వొక మహా సముద్రం. దీని లోతు తెలుసుకోవడం ఎవరి తరమూ కాదు. అందునా రోజుకో కొత్త మందుల పరిశ్రమ పుట్టుకొచ్చి మందుల పటిష్టత దినదినానికి దిగజారిపోతోంది. జబ్బు తెలుసుకోకుండా ఏవంటే ఆ మందులు వాడడం వల్ల వ్యాధి స్వరూపమే మారిపోయి ఆకరకు వ్యాధిని కనుక్కోవడం కష్టమైపోతోంది.

సాధారణంగా డాక్టర్లు మందులు నాలుగురోజులు వాడమంటే పేషెంట్లు ఆర్థిక ఇబ్బందివల్లో, అశ్రద్ధవల్లో రెండురోజులే వాడడం, జబ్బు తగ్గకపోవడం జరుగుతుంది. తప్పని సరిగా కొంతకాలం పాటు ఈ మందులు వాడండి అని డాక్టర్లు చెబితే ఇప్పటికి తగ్గితే చాలు అనే ధోరణిలో పేషెంట్లు వుంటారు. మరి డాక్టర్లేం చేయాలి...?

అశ్రద్ధ.. మందులు వాడే వారికి అశ్రద్ధ... తయారు చేసే వారికి అశ్రద్ధ... రాసే డాక్టర్లకూ అశ్రద్ధ... ఇదే అన్నిటికీ మూలకారణం.



gudachari.com

అప్పటికి తగ్గితేచాలు. రేపొస్తే మళ్ళీ చూస్తాం. ఈభావం ప్రజల్లో ఎక్కువ. అందుకనే ప్రతి చిన్న జబ్బు మొండి జబ్బయి వయసు మళ్ళిన తర్వాత తిరగబడి నానా యాతనలకు గురిచేస్తుంది. డాక్టర్ల దగ్గరకు వెళ్ళకనే మందులు షాపుల్లో ఏదో మాత్రలు తీసుకొని వాడటం. అందరి డాక్టర్ల చీటీలు చూసి, వాళ్ళందరి కంటే పెద్ద వాడ్ని అని, తోచిన మందు, సంబంధం లేని మందులు యిచ్చి షాపువాడు ప్రతిభ చూపిస్తాడు. డాక్టర్లకు తెలిసిందే అంతంతమాత్రం. ఏ పది సంవత్సరాలప్పుడు డాక్టరు రాసి యిచ్చిన మందునే, అతని దగ్గరకు వెళ్ళకనే వాడటం ఇవన్నీ ఎంత ప్రమాదానికి దారితీస్తాయో తెలియదు వాళ్ళకు.

"ఏవిటి... దీర్ఘంగా ఆలోచిస్తున్నారు...?"

స్వాతి మాటలకు ఈలోకంలోకి వచ్చాడు డాక్టర్‌శ్రీని.

"ఏం లేదు, మన వైద్యవృత్తి గురించి ఆలోచిస్తున్నాను. ఎంత లోపభూయిష్ఠంగా తయారైంది... దీన్ని చికిత్స చేయాలంటే ఎవర్ని మార్చాలి? ఎవరు మారాలి?? అర్థం కావడం లేదు." అన్నాడు.

నవ్వింది స్వాతి.

"కొన్ని పరిస్థితుల్లో కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకోవాల్సొస్తుంది."

"కొన్ని సార్లు రోడ్డు ప్రమాదాల్లో శరీరం చితికిపోయి, మాంసం ముద్దగా కొనూపిరితో హాస్పిటల్‌కి చేరిన వాడ్ని ఏమాత్రం బ్రతుకుతాడనే ఆశ లేకపోయినా వైద్యం చేస్తే బ్రతికి కూర్చుంటున్నాడు. ఒక్కోసారి మన చేతుల్లో ఏమీ లేదనిపిస్తుంది. బావున్నాడు. ఫరవాలేదు. బ్రతికిపోయాడు అనుకున్న వ్యక్తి అనుకోని మార్పు క్షణాల్లో వచ్చి చేతులు దాటిపోతాడు. ఇదంతా ఏవంటారు..."

"మెట్టవేదాంతం అంటాను" అంటూ లేచి,

"సరే మీరు విశ్రాంతి తీసుకోండి. నేను రూముకి వెళ్ళి రాత్రికేవైనా తెస్తాను" అంది స్వాతి.

"అప్పుడే వెళ్ళిపోతావా... ఒంటరితనం కష్టంగావుంది. ఏవేవో ఆలోచనలు...? అన్నాడు డాక్టర్‌శ్రీని. స్వాతి వెళ్ళిపోవడం యిష్టంలేక."

"నిద్రమాత్ర ఇస్తారుగా, వేసుకుని పడుకోండి. పిచ్చి పిచ్చిగా ఆలోచించి నిద్రలేకుండా చేసుకోకండి."

వెళ్ళిపోయింది స్వాతి

నిదురెలా పడుతూంది. ఏదో తెలియని భయం. డాక్టర్ పేషెంటైతే ఆలోచనలన్నీ వేరుగవుంటాయి.



ఇంతలో డ్యూటీ నర్స్ వొచ్చి మందులిచ్చి, "విష్‌యు పీస్‌ఫుల్ నైట్ డాక్టర్" అని చెప్పి వెళ్ళిపోయింది.

... ప్రశాంతమైన రాత్రిట, ప్రశాంతమైన రాత్రి...! నయం స్వీట్ డ్రీమ్స్ అనిందికాదు. నవ్వుకున్నాడు డాక్టరు శ్రీని.

ఎన్నో కష్టమైన, ప్రమాదకరమైన ఆపరేషన్లు అతి సునాయసంగా చేసిన శస్త్ర చికిత్సానిపుణుడికి రేపో చిన్న పరీక్ష చేయబోతోంటే.. చిన్న పరీక్ష ఏమిటి... గుండెపరీక్ష... అన్ని అవయవాలులోకి సున్నితమైనది. మరి భయం వుండదేమిటీ... అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.. మళ్ళీ అనుకున్నాడు తనే

"ఏం జరుగుతుంది...? ప్రాణం పోతుందా...! పోదు. పోతుందేమో అనే భయం. అదీగాక తన ఆఖరికోరిక తనకు అప్పులెంతవున్నాయో... తనకు రావల్సినవి, ఇన్సూరెన్స్‌లు.. ఇవికూడా స్వాతికి చెప్పలేదు. పాపం. పిచ్చిమాలోకం.... ఏవైనా జరిగితే... ఎలా చేస్తుందో ఏవో... మరీ వేషాలేవయ్యా.... కార్డియాక్ కెతిటరైజేషన్‌కి ప్రాణం పోతుందా!? ఎవరైనా వింటే నవ్విపోతారు. పదిమందికీ చెప్పాల్సింది పోయి, అందర్నీ అదరగొట్టి బెంబేలు పెట్టేట్లు వున్నావే... ఏం జరగదు. నిదురపో... హాయిగ ఏ కలలూ లేకుండ.. మంచి నిదురపో... గుండెలమీదచేయి వేసుకుని ఆలోచిస్తున్న శ్రీనికి గుండె అంటే జ్ఞాపకం వచ్చింది. చేయి వేసికుని చూశాడు. దివ్యంగా వుంది. ఆ శబ్దం తనకు వేయి వీణలు మీటినట్లుంది. తన గుండె ఆడుతూ వుంది. పాడుతూవుంది.. ఏదో తెలియని సంతృప్తి... అదోరకమైన అనుభూతి... మెల్లగ ఛాతీమీద నిమురుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు డాక్టర్‌శ్రీని."

తెల్లవారగనే స్వాతి నవ్వుముఖం ప్రత్యక్షం. ఇంతలో ఒక నర్స్ వచ్చింది, "గుడ్ మార్నింగ్ డాక్టర్... బాగా నిదురపట్టిందనుకుంటాను. ఈ టెస్టును గురించి మీకు తెలియనిది ఏముంది... అయినా మా బాధ్యత. ముందుగా ఏం జరుగుతుందో తెలుసుకుంటే మనసు కొంచెం కుదుటపడుతుంది." నవ్వుతూ అంది.

"వెరీగుడ్... చెప్పడం మంచిదే కానివ్వు" అన్నాడు డాక్టర్‌శ్రీని.

ముందుగా ఎక్కడ చేస్తారో, ఆ ప్రాంతంలో మత్తు మందు యిస్తారు. మీకు క్యానులా ఆర్టరీలోకి పంపేటప్పుడు నొప్పి ఏమాత్రం ఉండదు.

"మందు ఆర్టరీ లోపలికి వొచ్చేప్పుడు వొకరకమైన వేడి ఆవిరి శరీరమంతా ప్రవేశించినట్లు వుంటుంది."

"దట్సిట్. నాకు తెలుసు" అన్నాడు డాక్టర్ శ్రీని.

"రెండోది... ఒక సమయంలో గాలిలో తేలిపోతున్నట్లనిపిస్తుంది. మరుక్షణం మామూలు అయిపోతుంది. కొందరికి అదీ ఉండదు."



gudachari.com

ఈ విషయం తనకు తెలియదు. తను చేసేపుడు పేషెంట్లు మొదటి విషయం చెప్తారు గానీ రెండోది చెప్పరు. ఎందుకంటే కార్డియాక్‌కేతిటరైజేషన్ తనెప్పుడూ చేయలేదు గనుక.

"ఓ.కే. డాక్టర్.. మీరు రెడీ అనుకుంటాను" అంది నర్సు.

"యస్... యస్. ఐయామ్ రెడీ." కొంటెచూపుచూస్తూ అన్నాడు. నర్సు ముఖం ఎర్రబడింది. స్వాతి చిరుకోపంతో మందలిస్తూన్నట్లు చూసింది. ఆతృత, భయాన్ని తగ్గించుకోడానికి అలా చేశాడని తెలుసు స్వాతికి.

"మంచి నర్స్... ముందుగా ఏ విషయాన్నైనా పేషెంటుకు విశదంచేయడం చాలా వరకు మంచిది. కొన్ని సమయాల్లో చెడ్డ కూడా.. ఉన్న భయాన్ని పెంచినట్లవుతుంది. వైద్యవృత్తిలో ఇదొక విషమ సమస్య. చెప్పటమా...! మానటమా! అందుకే ఎక్కుమంది డాక్టర్లు అపవాదు పాలవుతుంటారు." కానీ ఇప్పుడు అదొక నిబంధన. అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

ఆ ముందురోజు రాత్రి ఆలోచిస్తూ వరండాలో చాలా సేపు తిరిగాడు డాక్టర్‌శ్రీని. కాళ్ళు నొప్పిపుట్టేవరకూ, శరీరమంతా చెమటలు పోసేవరకూ, తనగుండె శబ్దం వినిపించేంత వరకూ... అయినా నొప్పి అంతగా అనిపించలేదు. డ్యూటీ డాక్టర్‌తో ఇంతసేపు అలసినా నొప్పిరాలేదు తనకు. పోనీ యాంనిజియోగ్రఫీ వాయిదా వేస్తే.." అని చెప్పాలనిపించింది. అయితే అతడు తనను పిచ్చివాడ్ని చూసినట్లు చూస్తాడేమో అని సిగ్గుపడి పూరుకున్నాడు.

స్టెచర్‌మీద కార్డియాక్ కెతిటరైజేషన్ (కాత్‌లాబ్) లాబ్‌కి తీసుకువెళ్ళారు. మామూలు ఎక్స్-రేలకి దీనికి చాలా తేడా వుంది. రూములో ఎక్కడా కిటికీలు లేవు. అందరూ ముసుగుల్లో వున్నారు. ఎవరు ఎవరో పోల్చుకోలేకుండాన్నారు. బహుశా ఛీఫ్ రేడియాలజిస్ట్, అసిస్టెంట్ డాక్టర్, ఇద్దరో, ముగ్గురో నేర్చుకునే రెసిడెన్షియల్ డాక్టర్లు, ఇద్దరు నర్స్‌లు, ఒక ఎక్స్-రే తీసే వ్యక్తి. ఆగది అంతా లేత ఆకుపచ్చ రంగువేసివుంది. వాళ్ళ ముసుగులు సైతం అదేరంగులో వున్నాయి.

ఎదురుగా ఎక్స్-రే టేబిల్, దానిమీదకి వంగి ఎక్స్‌రే మిషన్ వున్నాయి. టేబిల్ ఎదురు గోడమీద పెద్ద తెల్లటి తెర... బహుశా టి.వి. స్క్రీన్ అయివుంటుంది. శరీరంలోని ప్రతిభాగం దానిమీద కనిపిస్తుంది. డాక్టర్లకు సరిగాచేస్తున్నామా లేదా అని తెలుసుకోడానికి ఉపయోగిస్తుంది.

టేబిల్‌మీద పడుకో పెట్టి బెల్టు చేతులకి బిగించారు. కుడిచేయి చక్కగ చాపి దానిక్రింద చెక్కపలక పెట్టారు. మత్తు ఇవ్వడానికి అయివుంటుంది. ఇంతలో ఒక ముసుగు మనిషి దగ్గరకు వచ్చి, "హలో డాక్టర్‌శ్రీని... నేను డాక్టర్ రావుని... ఎలావున్నారు.." అన్నాడు.

"ఓ... బావున్నాను... థ్యాంక్యూ..." అన్నాడు డాక్టర్‌శ్రీని.



"అన్నీ రెడీగా వున్నాయి. అనస్థటిస్ట్ రావాలి. కేసు మొదలు పెట్టబోతున్నాం. మీరు బాగా రిలాక్స్ కావాలి. ఇదేమంత బాధ కలిగించదు."

"ఓకె. డాక్టర్.. మీరు కానివ్వండి..." అన్నాడే గాని భయంగానే ఉంది. స్వాతి దగ్గరుంటే బాగుండుననిపించింది డాక్టర్‌శ్రీనికి.

కాళ్ళకు తలకు మధ్య ఒక కర్టెన్ వేశారు. ఎందుకంటే తొడభాగాన్ని వాళ్ళేం చేస్తున్నారనేది తెలియకుండా వుండేందుకు, పరిశుభ్రంగా వుంచేందుకు. వాళ్ళేం చేస్తున్నారో కనిపించకపోయినా ఊహించుకోవచ్చు, ఎందుకంటే అంతా తెలుస్తూనే ఉంటుంది కనుక.

బొడ్డు నుంచి రెండు వైపులా నాలుగుసార్లు శుభ్రం చేశారు. దానిమీద స్టెరైల్ క్లాత్ (ఆపరేషన్లకూ, ఇతర పరీక్షలకు ప్రతి వస్తువుని విషక్రిములు లేకుండా ఆవిరితో బాగా చేస్తారు. దీన్నే స్టెరిలైజేషన్ అంటారు. అందుకు ఉపయోగించే యంత్రాన్ని ఆటో క్లేవ్ అంటారు) వేసి కుడి తొడభాగాన్ని వేళ్ళతో తడుముతున్నట్లనిపించింది డాక్టర్‌శ్రీనికి.

అంటే వాళ్ళు ఫిమోరల్ ఆర్టరీ కోసం చూస్తున్నారన్నమాట. నడుముక్రింద భాగము, కాళ్ళపైభాగమూ కలిసేచోట కాళ్ళకు రక్తాన్ని తీసుకువెళ్ళే నాళాన్ని ఫిమోరల్ ఆర్టరీ అంటారు. ఇక్కడ ఫిమోరల్‌నర్వ్ అని మరో ముఖ్యమైన నరం కూడా వుంటుంది. ఈ నర్వ్ వీన్‌నుకు ఆర్టరీకి మధ్యలో వుంటుంది. మూడింటికీ మధ్య ఒక మిల్లీమీటర దూరం మాత్రమే వుంటుంది. కొందరిలో చాలా తక్కువ ఉంటుంది.

కార్డియాక్ కాతిటర్‌ని (సన్నని పాలిథిన్‌తో చేయబడి మధ్య సన్నని రంధ్రం గలిగి వుండేది) ఫిమోరల్ ఆర్టరీలోకే పంపాలి. కొంచెం అనుభముంటే ఇదేమంత పెద్దపని కాదు. ముందుగా ట్రోకార్ (స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేయబడిన మాములు కన్నా పెద్దదిగా వుండే సూది లాంటి పరికరం. దీని మధ్యలో రంధ్రం వుండి స్టైలేట్ అనే మరో సూదితో మూయబడి వుంటుంది) ఆర్టరీలోకి పంపి తరువాత స్టైలేట్‌ని తీస్తారు. దీన్ని పంపేటప్పుడు చాలా జాగ్రత్తతో వ్యవహరించాలి. అది నేరుగా ఆర్టరీలోకేపోతే రక్తం ఎర్రటి ఎరుపు రంగులో ఉబుకి వస్తుంది. అలాకాక వీన్‌లోకి పోతే ముదురు ఎరుపురంగులో కొంచెం మెల్లగా వస్తుంది. అంతేగాకుండా ట్రోకార్ లోపలికి వెళ్ళేపుడు ఆర్టరీకి తగిల్తే రబ్బరు గొట్టాన్ని సూదితో పొడిస్తే వొచ్చే శబ్దం సన్నగ వస్తుంది. అదే వీన్‌కి తగిల్తే దాని పొర పలచన కనుక కష్టం అనిపించదు. ఈ వ్యత్యాసం డాక్టర్లకు తెలుస్తుంది.

ఒకవేళ పొరపాటున వీన్‌లోకి వెళితే ప్రమాదం ఏమి వుండదు. కానీ రక్తం తొడలో గూడుకట్టుకుని వాపు వస్తుంది. వొకటి రెండు రోజుల్లో తగ్గిపోతుంది. అదే నర్వ్‌కి తగిల్తే విపరీతమైన బాధ వేస్తుంది.

"ఇంకా అనెస్తటిస్ట్ రాలేదా! మేం మొదలుపెడ్తున్నాం." గట్టిగ అరవడం వినిపించింది.



gudachari.com

ట్రోకార్ తొడలోకి పంపే దగ్గర లోకల్ అనెస్థేషియా యిచ్చారు. నొప్పి తెలియకుండా ఉండేందుకు. తొడలో సూది గుచ్చుతున్నట్లనిపించింది. సపల్ మనే స్పర్శ తెలుస్తోంది. అంటే ఆర్టరీలోకే సరిగ్గా ట్రోకార్ని పంపారన్నమాట. వెరిగుడ్. స్టైలేట్ తీసేసి వుంటారు. ఇప్పటి నారక్తం ఉబుకుతు వస్తుంటుంది. అని ఊహించుకున్నాడు. చెమట పోయడం మొదలెట్టింది. డాక్టర్‌శ్రీనికి.

అసహనంగా వుంది, "ఇంకా అనెస్థటిస్ట్ రానట్లుంది", అన్నాడు డాక్టర్‌శ్రీని.

"వచ్చేస్తాడు. డోంట్ వర్రీ..."

ఎదురుగ వున్న టి.వి. స్క్రీన్ వేపు చూశాడు. తొడ నుండి మెడ వరకు లోపలి భాగాలన్ని కనిపిస్తున్నాయి. గుండె ఆడుతూవుంది. ఊపిరితిత్తులు గాలి పీలుస్తూ వదుల్తూ వున్నాయి. వాటితోపాటు ఛాతీ ఎముకలు కదుల్తున్నాయి. అలా చూస్తూ వుండిపోయాడు డాక్టర్‌శ్రీని.

అప్పుడు కనిపించింది. తెల్లగ వానపాములా కుడివైపు భాగంలో పైకి ప్రాకుతూ కెతిటర్. చిన్నగ ఎక్స్‌టర్నల్ యీలియాక్ తర్వాత కామన్ ఈలియాక్ అక్కడ్నించి అబ్‌డామినల్ అయోర్టా ఆతర్వాత గుండెలోనికి ప్రవేశిస్తుంది.

చెమట పోస్తోంది. శరీరమంతా గడ్డకట్టుకుపోయి కట్టెలాగా బిగుసుకుపోయినట్లుగా వుంది. గుండె బిగ్గరగ కొట్టుకోవడం వినిపిస్తుంది డాక్టర్‌శ్రీనికి.

"ఆ అనెస్థటిస్ట్‌ని త్వరగా రమ్మనండి. ఎక్కడ ఏం వెలగబెడ్తున్నాడో..." ఎవరో గట్టిగ అరుస్తున్నారు. ఆత్రుతను తగ్గించడానికి తేలికపాటి మత్తు ఇంజెక్షను యిస్తారు. ప్రమాదం జరిగితే ఆయన అవసరం.

డాక్టర్‌శ్రీనికి భయంవేసింది. కానీ తను యిప్పుడు భయపడి కూడదు- "ముసుకో కళ్ళు. చూడకు. ఎందుకంతయిద్దై పోతున్నావు. నొసలు చిట్లించడమేమిటీ... పిడికిళ్ళు బిగించడమేమిటీ... కాళ్ళెందుకలా నిటారుగ పెట్టుకున్నావ్... చెమటెందుకలాపోస్తోంది... ఊ, కమాన్... మాన్.. రిలాక్స్... రిలాక్స్... చేతులు సాఫీగా పెట్టుకో... కాళ్ళు వదిలెయ్యి... ముఖాన మడతలు పోనీ... గాలి పీల్చుకుని... వదులు, బాగా... ఇంకా ... రిలాక్స్.. నీకు మత్తు ఇచ్చి వున్నారనుకో... నొప్పిలేదుకదా... రిలాక్స్... డాక్టర్... రిలాక్స్"-తనకుతానే చెప్పుకున్నాడు. కొంచెం రిలీఫ్‌గ అనిపించింది.

అయినా కళ్ళు తెరిచిచూసాడు.

ఆ కెథిటర్ వానపాములా మూత్రకోశం వెనక దాక్కుని, చిన్నప్రేవుల్ని దాటి పొట్టకు శ్వాసకోశాలకీ మధ్యవున్నా డయాఫ్రెమ్ రంధ్రం ద్వారా పోయి ఛాతీలోకి ప్రవేశించి ఇంకా ముందుకు పోయి కొంచెం వంపు తిరిగింది. అంటే ఆర్చ్ ఆఫ్ అయోర్టాలోకి వెళ్ళిందన్నమాట. మరీ కొంచెం వంపుతిరిగి కాస్తదూరం ప్రయాణించి నిలచిపోయింది.



దిస్ ఈజ్ మై హార్ట్.. తన గుండె. తనగుండె లోపలి భాగాన్ని తనే చూస్తున్నాడు. తన గుండె... అద్భుతంగా వుంది.

.... ఏదో తెలియని అనుభూతి. ఆలోచన్లు లేవు. అంతా ఆశ్చర్యం. విచిత్రం... తన కళ్ళతో తను గుండె లోపలి భాగాల్ని చూస్తున్నాడు. బ్రతికి వుండగానే తనను తాను చూసుకుంటున్నాడు. "వండర్‌ఫుల్... సృష్టిలో ఇంతకన్నా గొప్ప అనుభూతి మరొకటి వుండదనుకుంటాను.." అని అనిపించింది డాక్టర్‌శ్రీనికి.

"వుయార్ గోయింగ్‌టు ఇన్‌జెక్ట్ ద డై..." ఆ మాటల్తో ఈలోకంలోకి వచ్చాడు.

వెంటనే శరీరంలోకి వేడి ప్రవేశించినట్లయింది. ముక్కులోంచి, నోట్లోంచి, శరీరం ప్రతి రథం గుండా ఆవిరి వెళుతున్నట్లుంది. ఓహ్... ఇదే కాబోలు... ఫ్లష్... వెంటనే విపరీతమైన నొప్పి గుండెల్లో భరించలేనంత... తట్టుకోలేనంత... గట్టిగ అరచేశాడు డాక్టర్‌శ్రీని.

"చాలా నొప్పిగా వుంది," అని

ఎవరూ పట్టించుకోవడం లేదు... మరీ ఎక్కువవుతోంది. ప్రాణం పోతున్నట్లుంది... మళ్ళీ హార్ట్ అటాక్ వొచ్చిందేమో...! గుండెనుపిండేస్తోంది. గుబ... గుబ.. చెమటలు... మైకం కమ్మేస్తుంది. ఈక్షణంలోనే చచ్చిపోయేది. ఈక్షణానికే భయపడింది డాక్టర్‌శ్రీని.

వెంటనే కొంచెం తగ్గింది. మరికొంచెం సేపటికి పూర్తిగ తగ్గిపోయింది. "అమ్మయ్య... బ్రతికిపోయాను..." అని అనుకొని కళ్ళు తెరిచాడు డాక్టర్‌శ్రీని.

కుడిచేతివైపు ఎవరో ముసుగుమనిషి రావడం కనిపించింది. ముఖం స్పష్టంగా కనిపించకపోయినా చికాకు, కోపం తెలుస్తోంది. తన చేతిని పట్టుకున్నాడు.

"ఏవిటి.." అన్నాడు డాక్టర్‌శ్రీని.

"అనెస్థీషియా... మత్తు."

"... అంతా అయిపోయిన తర్వాత... ఇప్పుడు.. వాట్..." కోపం రాలేదు. నవ్వొస్తోంది. ఆ నిర్లక్ష్యపు అనెస్థిస్ట్‌ని చూస్తుంటే, డాక్టర్‌శ్రీని సగం ఆలోచనల్తోనే నిదురలోకి జారుకున్నాడు.

ఉదయం, స్వాతి డాక్టర్‌శ్రీని నవ్వుకున్నారు. రాత్రి విషయాలు చెప్పుకుని. ఇంతలో డాక్టర్ రెడ్డి ఎక్స్‌రేలు వీడియో ఫిల్మ్ తీసుకువచ్చాడు.

"వెల్... చాలా మంచి పిక్చర్స్ వచ్చాయి. బ్యూటిఫుల్... రిజల్ట్ ఈజ్ వెరీ గుడ్..." వాటిని చూసే బోర్డుకు తగిలించాడు. వీడియో మానిటర్ కూడా ఆన్ చేసాడు.

"... బ్యూటిఫుల్ అంటాడేవిటి... అవేమన్నా కాశ్మీర్ ప్రకృతి దృశ్యాలా...? మంచు కొండలా, నయాగరా జలపాత సోయగాలా... అందాల రమణుల వయ్యారపు వొంపులా...!!! ఈ డాక్టర్లకివే కనిపిస్తాయి కాబోలు వీటిలో. వీటిలోనే వాళ్ళు పచ్చికమైదానాల్నీ, విరబూసిన



gudachari.com

లతావల్లరుల్నీ చూస్తారు. పిటీ... ఈ డాక్టర్ల జీవితాలింతే...! " అనుమానమే ప్రశాంతమైన రాత్రుల్లో పిండారబోసినట్లుండే వెన్నెలని ఎంతమంది చూసుంటారని.

యాన్‌టీరియల్ కరోనరీ బ్రాంచి మాయమయి పోయింది. అంటే పూర్తిగా పూడుకు పోయిందన్నమాట. మిగిలిన రెండూ అక్కడక్కడ మూసుకుపోయి కొంత భాగం బావున్నాయి.

డాక్టర్ రెడ్డి నవ్వుతూ

"నలభై ఏళ్ళ వయసులో ఎనభై ఏళ్ళ గుండెతో జీవిస్తున్నారన్నమాట." అన్నాడు.

నిజంగానే తన గుండె గోడలకు రక్తప్రసారం చాలా తగ్గిపోయింది. అసలింత కాలం ఈగుండెతో ఎలా వున్నానో అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

మరో భయంకరమైన ప్రమాదకరమైన విషయం. కూడా బయట పడింది. ఎడమ గుండెలో నుంచి చిన్న రబ్బరు బంతి సైజు ఆకారం ఉబికి వచ్చింది. దీన్ని అన్యూరిసమ్ అంటారు. కొంచెం కష్టమైన పనిచేసినా, ఎక్కువ ఆతృత పడినా అది పగిలిపోయే అవకాశం వుంది. ఇంతకాలం టైంబాంబ్‌ను గుండెల్లో పెట్టుకుని జీవిస్తున్నానన్నమాట. అదేక్షణంలో నైనా పగిలివుండొచ్చు. యాన్‌జియోగ్రఫీకి ముందురోజు రాత్రి తిరిగినప్పుడు పగిలి అక్కడి కక్కడే చచ్చిపోయి వుండొచ్చు. అదృష్టం... లక్కీ... మోస్ట్ లక్కీయిస్ట్ ఫెలో... అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని. ఇంతకాలం ఈ పరీక్షను ఎందుకు చేయలేదు.

"ఆఫ్టర్ సీయింగ్ దిస్... మీ అభిప్రాయం ఏవిటి డాక్టర్‌శ్రీని..?" ఆ ప్రశ్న కావాలనే వేశాడని తెలుసు డాక్టర్‌శ్రీనికి కారణం యానిజియోగ్రఫీ వొద్దన్నాడని.

"ఏవుంది.. సింపిల్... బైపాస్ సర్జరీ.." తడుముకోకుండా సమాధానం చెప్పాడు డాక్టర్‌శ్రీని.

"యస్.. దటీజ్ ఇట్.. మళ్ళీ దాన్ని కూడా ఎక్కడ వాయిదా వేస్తావేమో అనిపించింది." నింపాదిగా డాక్టర్ శ్రీని కళ్ళల్లోకి చూస్తూ..

..."సూనర్ ది బెటర్ దట్ టూ యు ఆర్ ఎన్ ఐడియల్ కేస్ ఫర్ సర్జరీ", అని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్‌రెడ్డి.

అవును.. ఎంత త్వరగా చేయించుకుంటే అంతమంచిది. ఆ తర్వాత మామూలు మనిషిలా జీవించొచ్చు. అని అనిపించింది స్వాతికి. డాక్టరుశ్రీని తన ఆలోచనల్లో తను మునిగిపోయాడు.

తన గార్డెన్... సెలయేర్లన్నా డాక్టర్‌శ్రీనికి చాలా ఇష్టం. అందుకని చిన్న కొండ దగ్గర గుబురుగ చెట్లు పెరిగివున్న స్థలంలో, పది ఎకరాలు కొని మామిడి, పూలమొక్కలు, పండ్ల చెట్లు పెట్టించాడు. అందులో నుంచి వర్షాకాలం వొక సన్నని కాలువ కొండమీది నుంచి పారుతుంది. దాని మీద వెదురు బొంగుల్తో చిన్నవంతెన... నెమళ్ళు, జింకలు రెండు, తెల్లటిపావురాళ్ళు, తెల్ల కుందేళ్ళు తీసికొచ్చి పెంచుతున్నారు. అక్కడో చిన్న



ఇల్లుకూడా కట్టించాడు. ఆప్రదేశమంటే ఎంత ఇష్టమో అతనికి. పిల్లలకి అక్కడకి వెళ్ళాలంటే చెప్పలేని సంతోషం.

అక్కడికి వెళ్ళొచ్చు. ప్రశాంత సాయంకాలాల్లో కొండమీద నుంచి వీచే గాలి... పక్షులు చేసే శబ్దాలూ... ఓహ్... అనిర్వచనీయమైన ఆనందం... చెబితే తెలియదు. అనుభవిస్తేనే తెలిసేది.

తనకోసం ఎదురుచూసే పేషెంట్లతో, తన మిగిలిన జీవితాన్ని తనతో ముడిపెట్టుకున్న భార్యాపిల్లల్తో సుఖంగా గడపొచ్చు. అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

తనకు ఆపరేషన్ చేయబోయే డాక్టర్లెవరని అడిగాడు మరుసటి రోజు డాక్టర్‌శ్రీని.

"డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ శంకర చౌదరి, చాలా గొప్ప డాక్టర్లు. మంచి రిపోర్టు వుంది. వెరీగుడ్ కేపబుల్ హేండ్స్ ఇన్ ఇండియా", అని చెప్పాడు డాక్టర్‌రెడ్డి.

డాక్టర్‌శ్రీనికి భయమని కూడా అనిపించడం లేదు. ఎందుకో, తను మామూలు మనిషి కావాలంటే, డాక్టర్‌గా తన వృత్తి తిరిగి కొనసాగించాలంటే, తన వారి భవిష్యత్‌లు తీర్చిదిద్దాలంటే ఆ ఆపరేషన్ తప్పనిసరి అనిపించింది.

"ఈ గుండె నాది కాదు... మా శ్రీమతి ఏమంటుందో" అన్నాడు ఆమెవైపు కొంటెగా చూస్తూ డాక్టర్‌శ్రీని.

"ఛీ... పెద్దవాళ్ళముందేవిటా మాటలు..." అంది సిగ్గు పడుతూ

"అననీ అమ్మా... కుర్రాడు కదా!" నవ్వుతూ. "ఓ.కె. నీ ఆపరేషన్ సోమవారానికి పోస్ట్ చేస్తాను. ఈ రోజు శుక్రవారం. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్. బి ఛీర్ ఫుల్. వస్తాను", అతను వెళ్ళిం తరువాత డాక్టర్‌శ్రీనిని మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి.

ముందుగా పిల్లల్ని పిలిపించమన్నాడు.

మధ్యాహ్నం కల్లా వొచ్చేశారు వాళ్ళు. వారి అమాయకపు మాటలు... వారి ప్రేమ... తనకు తెలియకనే కళ్ళల్లో నీరు తిరిగాయి డాక్టర్‌శ్రీనికి. పెద్దమ్మాయి సరే సరి. డాక్టర్‌శ్రీని ప్రక్కన మౌనంగా కూర్చున్నది భుజం మీద తల ఆన్చి విష్ణు, దీపుల ప్రశ్నలకు కోప్పడుతూ వుంది.

చిన్న పిల్లలు మాత్రం వచ్చిన దగ్గర్నించి ఒకటే ప్రశ్నలు...

"వాటీజ్ గుండె ఆపరేషన్ డాడీ?" కళ్ళు తిప్పుతూ అడిగాడు విష్ణు.

వాడ్ని చూసి అందరికీ నవ్వొచ్చింది.

"ఛ.... బట్లర్ ఇంగ్లీష్ మాట్లాడొద్దురా..." అంది దీపు.

"డాడీ.. గుండె ఆపరేషనంటే ప్రమాదమా...?" అడిగింది దీపు.

"లేదమ్మా! డాక్టర్స్ మంచి వాళ్ళయితే తేలిక"



gudachari.com

"నాకు భయంగా వుంది డాడీ." దగ్గరగా జరిగింది.

"భయమెందుకు?" దగ్గరకు తీసికుని అన్నాడు డాక్టర్‌శ్రీని.

సాయంకాలం వరకూ వాళ్ళను తన దగ్గరే వుంచుకున్నాడు. వాళ్ళుండేందుకు స్పెషల్ పర్మిషన్ కావాల్సివొచ్చింది. మనసులో ఏదో ప్రశాంతత ఏర్పడినట్లు తోచింది. వాళ్ళతో గుడుపుతూ ఉంటే, అప్పుడప్పుడూ వాళ్ళను చూస్తుంటే కళ్ళుచెమర్చడం ఆపుకోలేకపోయాడు. మరుసటి రోజు ఉదయానికి డాక్టర్‌శ్రీనిని చూసేందుకు వొచ్చేవాళ్ళను కంట్రోల్ చేయడం హాస్పిటల్ సిబ్బందికి కష్టమైంది. విసుక్కోసాగారు. గట్టిగా ఏమి అనలేరు.

ఈ బంధువుల అభిమానం ఒక్కొక్కపుడు ఆపదలో అండగా వున్నారనే ధైర్యానిస్తుంది. మరొక్కపుడు విసుగు వేస్తుంది. స్వాతి అందరికి మర్యాదలు చేస్తూనే వుంది. బాగా అలసిపోయినట్లుంది.

సాయంకాలనికి డాక్టర్‌శ్రీని, స్వాతి మాత్రమే మిగిలారు.

"మీరు రెస్ట్ తీసుకోండి. ఎవరొచ్చినా మాట్లాడొద్దు. ఆపనేదో నేను చేస్తాను." అంది స్వాతి. అప్పటికే బాగా అలసిపోయి తను యిక ఏమాత్రం పనిచేయలేకపోయినా, వచ్చే వాళ్ళను మర్యాదచెయ్యడం, మనసులో సుడిగాలిలా చేస్తున్న ఆలోచనలు, వీటితో దస్సిపోయింది. "నేనుకాదు ముందు నువ్వు కాసేపు ఆ తలుపులు వేసొచ్చి ప్రక్కన పడుకో." అన్నాడు ఆమె పరిస్థితి చూసి డాక్టర్‌శ్రీని.

ఆమాటకోసమే కాచుకుని వున్నట్లుంది వెంటనే తలుపులు వేసొచ్చి దగ్గరగా పడుకుని డాక్టర్‌శ్రీని మీద చేయి వేసుకొని కళ్ళుమూసుకుంది.

"ఇలా మీదగ్గర పడుకుంటే వేయి ఏనుగుల బలం." అంది మనసులోని అలసటనంతా నిట్టూర్పుతో దించుకుంటూ.

ఆమె గుండె శబ్దం వినిపిస్తోంది. శరీరం చల్లాగా, నొసటిమీద చెమట బిందువులు, అలసటవల్ల ఏర్పడ్డ కళ్ళక్రింద నలుపు, చెరిగిన తల అదోరకమైన అందంతో ముద్దొస్తుంది. చేత్తో వెంట్రుకలు ఎగదోస్తూ

"ఏం... భయంగా వుందా..." అన్నాడు డాక్టర్‌శ్రీని.

కళ్ళెత్తి చూసి అవునన్నట్లు తలూపి ఇంకా దగ్గిరగా జరిగింది.

నొసటిమీద ముద్దు పెట్టుకున్నాడు. తృప్తిగా చిన్ననవ్వు... ఛాతీమీద తన ముఖాన్ని శరీరంలోకి చొచ్చుకుపోవాలన్నట్లుగా దగ్గరకు జరిగింది స్వాతి.

ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసికున్నాడు. కన్నీళ్ళు.. వాటికవే కారిపోతున్నాయి. అది చూసి మతిబోయినట్లయ్యింది డాక్టర్‌శ్రీనికి.

"ఛీ... ఛీ... ఏవిటి... పిచ్చి మరీ నువ్వు." అంటూ కన్నీరు తుడిచాడు.



"కాదండీ.. నాకు తెలియడం లేదు." తెచ్చిపెట్టుకున్న నవ్వుతో లేవబోయింది. లేవనీకుండా స్వాతి చేతిని పట్టుకుని అన్నాడు.

"నేను చచ్చిపోతానను..." గుబుక్కున డాక్టర్‌శ్రీని నోరు మూసివేసి "ఆ ఆలోచనే నేను భరించలేనండీ... కాకపోతే... ఎందుకో... ఏవిటో... చెప్పలేకున్నాను." అంది తన భయాన్ని అణుచుకుంటూ.

"మంచితనం మీద నమ్మకముంది నాకు. దేవుడిమీద లేకపోయినా." అన్నాడు శూన్యం లోకి చూస్తూ డాక్టర్‌శ్రీని.

"అన్నింటికంటే నాప్రేమ మిమ్మల్ని దూరం చేయదనే నమ్మకం నాకుంది. మనం మామూలు జీవితం మళ్ళీగడపగలమనే విశ్వాసముంది."

"ఓ సి... పిచ్చి... ప్రేమ, మంచితనం... బీదా, సాదా అనుకునేవాళ్ళకే కష్టాలు." అన్నాడు తలమీద చేయి పెట్టి గిలిగింతలు పెట్టూ.

"నాప్రేమ నిజమైందయినపుడు ఏశక్తి మిమ్మల్ని నానుంచి కదిలించలేదు." ధృడ నిశ్చయంతో కళ్ళలోకి చూస్తూ అంది స్వాతి.

ఆమాటలకు కళ్ళు సంతోషంతో దివ్వెలు కాగా హృదయం ఆనందంతో ఊగిసలాడింది డాక్టర్‌శ్రీనికి.

"ఓ... మై స్వీట్.. ఐలవ్‌యు ఫర్ ఎవర్..." కళ్ళలోకి చూస్తూ అన్నాడు ప్రేమ పొంగుకొస్తున్న గొంతుకతో.

డాక్టర్‌శ్రీని చేతిని తనచేతిలోకి తీసుకుంటూ, "మీ.. టు.. డార్లింగ్." ఆ కళ్ళలోనూ నీళ్ళు తొంగి చూశాయి. చేతి మీద వేయి ముద్దుల వర్షం కురిపించింది. అనునయంగా ఆమె వీపుమీద రాస్తూ అలా ఎంతసేపు గడిపారో వాళ్ళకే తెలియదు.

ఇంతలో, "గుడ్ ఈవినింగ్ సర్... బార్బర్ని సర్," అంటూ వొచ్చాడోవ్యక్తి. బుర్రమీసాలు, నల్లమొద్దులా శరీరం, గారపళ్ళు, మాసినచొక్కా కొంచెం భయంకరంగా వున్నాడు.

"బార్బరా... ఎందుకు..?" అంటు లేచింది స్వాతి. ఆశ్చర్యంగా.

"అయ్యగారికమ్మా... షేవ్ చేయాలమ్మా..."

"ఆయన చేసికునే వున్నారుగా," తిరిగి డాక్టర్‌శ్రీని వైపు చూస్తూ.

"అదికాదమ్మా... ప్రిపేర్ చేయాలమ్మా... వొళ్ళంతా చేయాలి."

"నువ్వా!!" భయపడింది స్వాతి.

"అవునమ్మా నేనే!" అంటూ అవసరమైన వస్తువులు సర్దసాగాడు.

"అసలు నీచేతవచ్చా! దేంతో చేస్తావు?" ఆతృతగా అంది.

"కత్తి... చాలా పదునుగా వుంటుందమ్మా."

మరీ భయపడింది.



gudachari.com

"పదునుగా వుంటుందా... అయితే వద్దు." ఆత్రుతగా అంది.

"ఏం భయం లేదమ్మా. యం.జి.యార్ కి నేనే చేశాను. యన్.టి.యర్.కీ నేనే చేశానమ్మా."

స్వాతి భయపడడం చూసి నవ్వుకుంటూ

"ఏం కాదులే... భయపడకు. నువ్వు కానీయవయ్యా", అన్నాడు డాక్టర్‌శ్రీని. స్వాతికి మనసు కుదుటపడలేదు.

అతనెక్కడ శరీరంపై గాట్లు పెడ్తాడో అని బయపడుతూ అక్కడే నిల్చుంది.

"మీరు భయటకెళ్ళండమ్మా... నేను పని మొదలెట్టాలి."

"ఎందుకు... నేనిక్కడే వుంటాను. వెళ్ళను." మొండిగా అంది. తను వెళ్ళితే అతను ఎట్లా చేస్తాడోనని.

"ఊ... చేప్పేదివిను." మందలింపుగా అన్నాడు డాక్టర్‌శ్రీని

"కత్తిని వేడినీళ్ళతో కడిగావా... నీదగ్గర యాటీసెప్టిక్ లోషనుంటే దాంతో కడుగు" అంది అనుమానంగా చూస్తూ స్వాతి. "అన్నీ ఉన్నాయమ్మా! మీరు వెళితే నాపని మొదలుపెడ్తాను."

విధిలేనట్లు కర్టెన్ వెనక్కుపోయి కూర్చుంది.

శరీరంలో మెడనుండి కాళ్ళ వరకు శుభ్రంగా రెండుసార్లు షేవ్ చేశాడు. శరీరమంతా సబ్బుతో కడిగి యాంటీసెప్టిక్ లోషన్ పూశాడు. చేస్తున్నంతసేపూ ఏదో వొకటి వాడి గొప్పలు చెపుతూనేవున్నాడు.

అన్నీ సర్దుకుని "మీరు రావచ్చమ్మా." అన్నాడు.

ఎప్పుడెప్పుడా అని హడావిడిగా వొచ్చి డాక్టర్‌శ్రీని ముఖంలోకి ఆతృతగ చూసింది. తను నవ్వుతూండటం చూసి హాయిగ నిట్టూర్చింది.

"సరే... వాడికో పది రూపాయలిచ్చి పంపు." అన్నాడు.

తీసికుని నసుగుతూ నిలబడ్డాడు. ఇంకో పదియిమ్మన్నాడు. ఇంకా తృప్తిపడలేదు.

"యం.జి.యార్ వందరూపాయలిచ్చి పంచెగుడ్డ, చొక్కాగుడ్డ, ఇచ్చారండి. యన్టీయార్ రెండాపిల్ పండ్లు, వందరూపాయలిచ్చారండీ." అన్నాడు మీరూ అంతటి వారేకదా అన్నట్లు.

"ఒరి... బాబోయ్ వాళ్ళు ఛీఫ్ మినిష్టర్లు. నేను మామూలు డాక్టర్ని. పోనీ... నీకెప్పుడైనా కడుపునొప్పి వస్తేరా వంద తగ్గించుకుని ఆపరేషన్ చేస్తా." అన్నాడు నవ్వుతూ డాక్టర్‌శ్రీని.

ఆ దెబ్బతో వెళ్ళిపోయాడు, ఒక యాభై తీసుకొని.

"ప్రతిదానికీ డబ్బు. ప్రతివొక్కరికీ డబ్బు గుంజుకోవడమే పరమావధి అయిపోయింది.." అంది అసహ్యించుకుంటూ స్వాతి.



"డబ్బుమీద ఆశలేని దెవరికి... నీకు నాకు కూడా వుంటుంది. కాకపోతే మనం మరీ దిగజార లేకపోతున్నాం. మరీ గవర్నమెంటు హాస్పిటళ్ళయితే చెప్పనే అక్కర్లేదు. పీల్చుకుతింటారు."

"ఏవండీ... రాత్రికి నేనిక్కడే వుంటానండి."

"నీ ఇష్టం.." అన్నాడు. ఒంటరిగా ఉండటం తనకూ యిష్టంలేదు. రేపు ఉదయం ఆపరేషను గనుక.

బైపాస్ సర్జరీకి సంబంధించిన ఆలోచనలు చుట్టుముట్టాయి డాక్టర్‌శ్రీనికి. భారత దేశంలో బాగానే ఈ ఆపరేషన్ చేస్తున్నారు. అయితే ఇంకా పర్‌ఫెక్షన్‌కు చేరుకోలేదు. మద్రాస్‌లోను, బొంబాయిలో మరో హాస్పిటల్లోను మాత్రమే బాగా సక్సెస్ అవుతున్నట్లు రిపోర్టులు తెలుపుతున్నాయి.

ఒకసారి డాక్టర్ రెడ్డి డాక్టర్‌శ్రీనితో మాటాడుతూ ఈ హాస్పిటల్‌ను అధునాతన పద్ధతుల్లో, అనుభవజ్ఞులైన డాక్టర్లతో, అమెరికాకు తీసిపోని సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసినట్లు చెప్పాడు. అందుకే తను ఈ హాస్పిటల్‌ని 2020 ఏ.డి. అంటుంటాను అని.

మనదేశంలో స్మగ్లర్లు మొదలు రాజకీయ నాయకుల వరకు కూడా అమెరికా వెళ్ళి ఈ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. డబ్బున్న వాళ్ళు కనుక వెళ్ళగలరు. మరి లేని వాళ్ళ మాటేమిటి...?

అసలు మన డాక్టర్లు చేతగానివాళ్ళు గాక కాదు. సరియైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోలేక. అలోటు పూడ్చడానికే ఈ హాస్పిటల్ స్థాపించారట.

ఓపెన్ హార్ట్ సర్జన్ల ప్రపంచ మహాసభల్లో ప్రఖ్యాత డాక్టర్ గిరినాథ్ మాట్లాడుతూ భారతదేశంలో ఈ ఆపరేషన్ వలన వచ్చే ప్రమాదాలు చాలా వరకూ తగ్గాయని, ఇప్పుడు అందుబాటులోవున్న మైక్రోవాస్కులార్ సర్జరీ, మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా చాలా కేసులు తేలికవుతున్నాయనీ అన్నారు. పశ్చిమ దేశాల ప్రజలకి కరోనరీ ఆర్టరీ భారతీయులకన్నా లావుగ వుంటుంది. కనీసం 1.5 యం.యం. లేనిదే బైపాస్ సర్జరీ చేయడం కష్టం. ఈ శస్త్ర చికిత్స విషయంలో ప్రతి చిన్న విషయానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. ఇక్కడ కార్డియోప్లీజిక్ అరెస్ట్ అనే పద్ధతిలో గుండెను ఆపి, చెడిపోయిన ఆర్టరీని బాగా వెడల్పు చేసి దాన్ని కొంచె లోపల కలియబెట్టి అడ్డంకులేవీ లేవని నిర్ధారించుకున్న తర్వాత వీన్‌ను 7/0 ప్రోలిన్ అనే కుట్లు వేసే దారంతో కుట్టాలి. ఇందుల్ల భవిష్యత్‌లో ఆ గొట్టం మళ్ళీ పూడుకుపోకుండా వుంటుంది. కరోనరీ ఆర్టరీ 1.5 యం.యం. వెడల్పు గలిగి గుండె ఎడమభాగం బావుంటే ఈ ఆపరేషన్ నూటికి నూరుపాళ్ళు సక్సెస్ అవుతుంది అని చెప్పాడు.

మరి... నాగుండె! ఆలోచించాడు డాక్టర్‌శ్రీని. ఎడుమభాగంలో టైంబాంబ్ వుందే...?! అది తీసివేయక తప్పుదుకదా! నడిరోడ్డు మీదో, సినిమా హాల్లోనో, బాత్‌రూంలోనే పగిలితే

gudachari.com

ఎంత త్వరగా సహాయం అందినా చేయగలిగిందేమీ ఉండదు. కదా. మరి తనకు ఆపరేషను సక్సెస్ అవుతుందా? అది చేసేవాళ్ళ మీద ఆధారపడి ఉంటుంది. లోపల నాగుండె ఉండే పరిస్థితి మీద, తరువాత నా అదృష్టం మీద అని అనుకున్నాడు.

ఎందుకో భయం అనిపించడం లేదు, ప్రశాంతంగా ఉంది. జరిగేది జరక్కమానదు. అనవసరంగా హైరానా పడ్డం ఎందుకూ... ఇదంతా ఒక ఎత్తు అయితే మనిషికి ఆ రెండు గంటలు బ్రతికించే అద్భుత సృష్టి, హార్ట్‌లంగ్ మెషిన్ ఆపరేషన్ జరుగుతున్నంత సేపు శరీరంలోని రక్తమంతా తాను తీసికుని శుభ్రపరచి ఆక్సిజన్ కలిపి రోగి శరీరంలోకి క్రమం తప్పక పంపుతూ వుంటుంది. అంటే గుండె, ఊపిరితిత్తులు చేసే పనిని ఇది నిర్వహిస్తుంది.

స్పేస్‌లాబ్‌ల నిర్మాణం కన్నా, చంద్రమండలంలో మానవ నివాసం కన్నా, క్షణంలో ప్రపంచాన్ని నుసి చేసే అణ్వాయుధాలకన్నా అపూర్వమైన సృష్టి ఇది. మానవ మేధకు జోహార్లు.

స్వాతి గాఢ నిద్రలో వుంది. ఆమెను చూస్తూ చాలాసేపు ఉండిపోయాడు.

మరుసటిరోజు మత్తులో నేనూ అంతేకదా! అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

– – –

స్వాతి విజిటర్స్ రూమ్‌లో క్షణమొక యుగంగా గడుపుతోంది. పరిసరాల్లో ఏం జరుగుతోందో ఎవరేం మాట్లాడుతున్నారో తెలీదు. అంతలోనే లేస్తుంది. ఎదురుగ వున్న ఆపరేషన్ గది తలుపుల వైపు చూస్తుంది. ఏదో... భయం... శరీరమంతా చెమటలు... సన్ననివొణుకు. చేతులు ముడుచుకుంటుంది. నొసలు తుడుచుకుంటుంది. ఎన్ని నీళ్ళు తాగినా గొంతు తడారిపోతోంది. ఎవరైనా పలకరిస్తే ఉలిక్కిపడి ఈలోకంలోకి వస్తుంది.

... అప్పుడే నాల్గుగంటలు దాటిపోయింది. డాక్టర్‌శ్రీని ఆపరేషన్ గదిలోకి తీసుకుపోయి, కానీ డాక్టర్ స్వాతికి నాలుగు గంటలూ ఎన్నో వందల సంవత్సరాలుగ అనిపిస్తోంది.

అయిపోయి వుంటుంది. ఇక వచ్చేస్తారు. ఇంకెంతో సేపు పట్టదు. మరో గంట గడిచింది. ఎవరూ రాలేదు.

"ఎంతసేపు పడుతుందమ్మా ఆపరేషను," ఎవరో అడిగారు.

"ఏమో... నాకు తెలియదు..." అంటూ కసురుకుంది

ఏవరో అన్నారు. "కొంచెం కాఫీ తాగమ్మా."

"కాఫీ వొద్దు... ఏం వద్దు.. నన్ను వదిలేయండి."

ఆమెను మాటాడించే ధైర్యం మరెవ్వరికీ లేకపోయింది.

"ఏంకాదమ్మా... భయపడవలసిన అవసరం లేదు." వాళ్ళ నాన్నగారు అన్నాడు.



"నాకు తెలుసు... ఇంతసేపేం చేస్తున్నారు వాళ్ళు లోపల." తిట్టుకుంది వాళ్ళను. నిరీక్షణ భరించరానిది. ఇటువంటి సమయాల్లో మరీ భయంకరంగా వుంటుంది. ఏ శబ్దం వినిపించినా ఆపరేషన్ థియేటర్ తలుపుల వేపు చూస్తుంది. తన గుండె శబ్దం ఆ గదంతా వినిపిస్తుందేమో అన్నంత గట్టిగ కొట్టుకుంటోంది. ఇంకాసేపైతే నిలచిపోతోందేమో. ఏది ఆలోచించడానికి శక్తి చాలడంలేదు, ఏమీ వినిపించడం లేదు. ఏమీ కనిపించడం లేదు... క్షణక్షణానికి నీరసం ఆవరిస్తోంది.

ఆరు గంటలు గడిచాయి.

అప్పుడు తెరుచుకున్నాయి. ఆపరేషన్ థియేటర్ తలుపులు, డాక్టర్ రెడ్డి నొసటి చెమట తుడుచుకుంటూ క్షణ కాలం స్వాతిని చూసి ప్రక్కకు తిరిగి వెళ్ళిపోయాడు.

ప్రక్కనే వున్న వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుని కూలర్‌లో మంచినీళ్ళు త్రాగి వెనక్కు తిరిగాడు. డాక్టర్ స్వాతి ముఖంలోని ఆతృతనీ, భయాన్నీ భరించలేనట్లు విజిటర్స్ రూంలో వొచ్చి కూర్చున్నాడు.

అది చూసి స్వాతి గుండె వేగం హెచ్చింది.

ఏదో జరిగుంటుంది... జరగరానిది. ఏవిటీయన తన ముఖం చూడ్డానికే భయపడు తున్నాడు. హృదయాన్ని అదిమేస్తున్నట్లుగా వుంది. భరించలేనంతగా ఉంది అతని మౌనం.

"డాక్టర్... ఆయన... బావున్నారా..?" అణుచుకోలేనంత ఆత్రుతతో అడిగింది.

కళ్ళెత్తి స్వాతి వైపు చూసి నవ్వు తెచ్చుకుంటూ

"ఆపరేషన్ సక్సెస్ ఫుల్.. బాగా జరిగింది..." ప్రక్కకు తిరిగి మిగిలిన వాళ్ళతో, "అరే చాలా మంది వచ్చారే... ఏం ఫరవాలేదు మీరంతా వెళ్ళిపోండి."

"మీరు స్వాతి నాన్నగారా!" అంటూ అక్కడే ఉన్న స్వాతి తండ్రిని ప్రశ్నించాడు.

ఆ పలకరింపు డాక్టర్ స్వాతికి నచ్చలేదు.

అసలు సంగతి దాటేసి ఇవన్నీ ఎందుకు. ఏవిటి ఈయన తత్వం. ఎంత ఆదుర్దా, ఆతృతగ వున్నానో... మనసెంత తల్లడిల్లిపోతోందో గమనించడేం...?! విపరీతమైన కోపం... దుఃఖం ముంచుకొచ్చేసింది.

డాక్టర్ భుజం పట్టుకుని కుదుపుతూ.

"డాక్టర్ నన్ను చూసి మాట్లాడండి... ఎలావుంది. ఆయనకు?! ఎందుకింత ఆలశ్యమయింది...???"

తనపై నుండి చేతులు తొలగిస్తు, "చెప్పాను కదా! సక్సెస్‌ఫుల్... చాలా కష్టపడ్డారు డాక్టర్లు..." మరలా ప్రక్కకు తిరిగి, "మీరంతా భోం చేశారా?"

"భోజనం కాదు ముఖ్యం... నాభర్త బ్రతుకు. ఏదో దాస్తున్నారు మీరు... నిజం చెప్పండి..." ఏడుపు ఆపుకోలేక పోతోంది. నేలపై నిలబడలేకపోతుంది స్వాతి.



gudachari.com

"చూడు స్వాతి... ఇంకెక్కడో అయితే నీభర్త ఖచ్చితంగా చనిపోయి వుండేవాడు. ఈ డాక్టర్లు నిజంగా... మార్వలెస్... దె హేవ్ డన్ ఎ వెరీ గుడ్ జాబ్... ఆ అన్యురిసమ్ అనుకున్నన దానికంటే పెద్దది. ఏమాత్రం గుండెకు దెబ్బతగలకుండా చాలా బాగా చేశారు. కాకపోతే చిన్న..." అంటూ ఆగిపోయాడు.

... తడబడుతూ నొసటి చెమట తుడుచుకుంటూ, పెదవులు తడుపుకుంటూ స్వాతి ముఖంలోకి నేరుగ చూసే ధైర్యం లేక మిగిలిన వాళ్ళవైపు చూస్తూ పూర్తి చేశాడు.

"ఏవిటి...? ఏం జరిగింది... ఐ వాంట్‌టు సీ హిమ్." గొడవచేసేసింది డాక్టర్‌రెడ్డి చేతులు పట్టుకుని లాగుతూ.

అక్కడున్న వాళ్ళు స్వాతిని దూరంగా తీయడానికి ప్రయత్నించి విఫలులయ్యారు.

"ఇప్పుడా... ఇప్పుడు చూడ్డానికి వీల్లేదు. బాగున్నారు. టేకిట్‌ఈజీ..." మై బేబి... టేకిట్ ఈజీ... స్వాతి తలనిమురుతూ అన్నాడు డాక్టరు రెడ్డి.

"నొ... నొ.. ఐవాంట్ టు సీ హిమ్.. ఇమిడియట్‌లీ..." ఏడుస్తూ అంది.

"స్వాతీ! బీయింగ్ ఎ డాక్టర్.. ఇంత మొండిగ వుండకూడదు.."

"లేదు... లేదు.. నేనాయన్ని చూస్తేచాలు. ఎలా ఉన్నా ఆయన బ్రతికుంటేచాలు..." ఏడుస్తూ గోడకు తలబాదుకుంటోంది ఉన్మాదిలా...

డాక్టర్‌రెడ్డికి ఏం చెయ్యాలో తోచలేదు. ఆ వాతావరణం ఇబ్బందిగా... సిగ్గుగా వుంది...

"ఆల్‌రైట్... కూల్‌డైన్... నేను వెళ్ళి చూసి నిన్ను పిలుస్తాను", అని చర చరా లోపలకెళ్ళిపోయాడు.

రెండు నిమిషాల్లో నర్సు వొచ్చి స్వాతిని పిలిచింది. ఆమె తమ్ముడూ, నాన్నకూడా వెళ్ళారు. రికవరీ రూము ఎదురుగ డాక్టర్ రెడ్డి, డాక్టర్ శంకర్ చౌదరి స్వాతి రావడం చూశారు. వాళ్ళముఖాలు పాలిపోయి వున్నాయి. ఒక విధమైన భయం స్పష్టంగా వ్యక్తమవుతోంది వాళ్ళ కళ్ళలో.

డాక్టర్ రెడ్డి అనునయంగా, "స్వాతీ... నువ్వు డాక్టర్‌వి... ఎన్నో ప్రమాదమైన పరిస్థితుల్ని నీ జీవితంలో చూసి ఎంతో ధైర్యం చూపి వుంటావు. కానీ, ఇది నీ స్వంత విషయం. అయినా...

డాక్టర్ శంకర్ చౌదరి కల్పించుకుని, "ఆపరేషన్ హండ్రెడ్ పర్‌సెంట్ సక్సెస్... కానీ.. ఇప్పుడొచ్చిన బాధల్లా.. అతని రక్తపోటు... చాలా తగ్గిపోయింది దాని క్కారణం...", గుటకలు మింగుతూ రెడ్డి వైపు చూశాడు.

"... కారణం సరిగ్గా అర్థంకావడం లేదు.." ఇక నీవంతు అన్నట్లు డాక్టర్ శంకర్ చౌదరి వేపు చూసి చెమట తుడచుకున్నాడు డాక్టర్ రెడ్డి.



".. రక్తపోటు నార్మల్‌కి వొస్తే మరే ప్రమాదము లేదు... ఈ రోజు రాత్రికి గడిస్తే..."

"ఏవిటి...? మీరు మాట్లాడేది..." ఏడుపును ఆపుకుంటూ అంది.

"అదే... అన్నీ సక్రమంగా జరిగాయి. ఇదొక్కటే సరి అయితే... అవుతుందనే నాకు నమ్మకం వుంది." డాక్టర్ శంకర్‌చౌదరి అన్నాడు.

"ఆయన్ని నేను చూడాలి..."

భయం వేసింది వాళ్ళకు.

డాక్టర్లిద్దరూ ముఖాలు చూసుకొని గాఢ నిట్టూర్పుతో స్వాతిని లోపలకి తీసుకువెళ్ళారు.

కళ్ళల్లో నీరు కమ్మి మసకమసకగా కనిపించింది ఎదుట దృశ్యం... ఎవరో చంద్ర మండలమ్మీదికి వెళ్ళి అస్ట్రోనాట్ బెడ్ మీద పడుకున్నట్లు...

...నోటి ద్వారా ఎన్‌డొట్రాకియల్ ట్యూబ్ (శ్వాసకోశంలోకి చొప్పించిన రబ్బుగొట్టం) గొంతులో దూర్చి దాన్ని ఆక్సిజన్ మిషన్‌కి తగిలించి వున్నారు. రోగి చావుబ్రతుకుల్లో వున్నపుడు, పూర్తిగ స్పృహలో లేనప్పుడు, శ్వాస పీల్చుకోలేనపుడు ఈ పద్ధతిలో ఆక్సిజన్ పంపుతారు.

ఎలక్ట్రికల్ వైర్లు.. .గుండె గతిని తెలిపే కార్డియాక్ మానిటర్ వైర్లు... ఇంకా అర్థంకాని అనేక రకాల ట్యూబులు శరీరమంతా పాతుకుపోయి... సైన్స్ సృష్టించిన భయంకరాకార మేదో బెడ్‌మీద వున్నట్లుంది.

కన్నీళ్ళు చెలియలకట్టదాటి జారుతుండగా నా భర్తేనా ఇతను... నాతో జీవితం పంచుకున్న వ్యక్తికా ఇలాటి పరిస్థితి... వీళ్ళీ చిక్కువైర్లు బిగించి బ్రతికున్నట్లు నాటక మాడుతున్నారు... అయిపోయింది...

"హి ఈజ్ డెడ్... హిఈజ్‌డెడ్..." కుప్పలా కూలిపోయింది స్పృహతప్పి డాక్టర్ స్వాతి.

ముఖమ్మీద చల్లిన నీళ్ళకి కళ్ళు తెరిచింది.

"డాక్టర్ స్వాతీ వాటీజ్ దిస్.. బీయింగ్ ఎ డాక్టర్... బిబ్రేవ్... కంట్రోల్..."

"అతను నాప్రాణం... నాభర్త... అతను లేకుండా..." మాటలు రాక గొంతు పూడుకుపోయింది డాక్టర్‌స్వాతికి. గుండెలు బ్రద్దలయ్యేటట్లున్నాయి. తలదిమ్మ తిరిగిపోతుంది.

"లేదమ్మా... అతను చనిపోలేదు.. నామాటనమ్ము... కావాలంటే చూడు..." అని బెడ్ దగ్గరకు జరిగి

"డాక్టర్‌శ్రీని... యువర్ వైఫ్ ఈజ్ హియర్... టెల్‌హిర్.. ఆర్.. గివ్‌హర్ ఎసైన్... దట్ యు ఆర్. ఆల్‌రైట్..."

అందరూ బెడ్‌మీద దృష్టి కేంద్రీకరించి ఎదుర్చూస్తున్నారు. ఎక్కడైనా కదలిక వస్తోందేమో అని.



gudachari.com

కదలికేం... లేదు. డాక్టర్ రెడ్డికి చెమట్లు పోయసాగాయి. స్వాతి వైపు వో మారు చూసి మళ్ళీ పిలిచాడు మంద స్వరంతో.

అప్పుడనిపించింది స్వాతికి కొంచెం ప్రమాదమైన ఆపరేషన్లప్పుడు పేషెంట్ల గురించి వారి బంధువులుపడే ఆతృత, ఆదుర్దా ఎలాంటిదో... ఎవరైనా ఏడుస్తూంటే తనే అనేది ఏడవకూడదమ్మా... ధైర్యంగా వుండాలి... ప్రమాద పరిస్థితిల్లో ఏడుస్తూకూర్చుంటే చేయాల్సింది మరచిపోతాము... లేదా ప్రమాదం వస్తుందికూడా... కొన్ని సమయాల్లో వాళ్ళమీద కోప్పడిన సంఘటనలూ వున్నాయి.

ధైర్యం తెచ్చుకోవాలి.. ఎన్నో విషమ పరిస్థితుల్ని ప్రమాదాల్ని చూసిన డాక్టరయి వుండీ.. తనింత అధైర్యపడ్డమా... ధైర్యం తెచ్చుకో... కుదుటపరచుకో మనసు... ఏం జరగదు... జరిగినా నువ్వేం చేయగలవు... అని తన మనసులో అనుకుంది డాక్టర్ స్వాతి.

బెడ్మీది శరీరంలో కొద్దిగా కదలిక.. స్వాతి గుండె వేగం పెరిగింది. నిశితంగా గమనించసాగింది. కొద్దిగా కుడిచేతివేళ్లలో. కనురెప్పల్లో కదలిక. స్వాతి ఆనందానికి అవధుల్లేవు ఆమాత్రానికే.

\- - -

డాక్టర్శ్రీనికి కొద్దిగా మెలకువ వస్తోంది.. అంతలోనే స్పృహ తప్పుతోంది. ఎక్కడున్నాడో ఏ పరిస్థితుల్లో వున్నాడో ఆలోచించే శక్తి లేదు. ఎవరెవరో వస్తున్నారు? పోతున్నారు. గుర్తుపట్టలేక పోతున్నాడు. కళ్ళు పూర్తిగా తెరవలేకపోతున్నాడు.

పూర్తిగ స్పృహ వచ్చిన తర్వాత ఎన్ని రోజులు అలా వున్నాడో అర్థంకాలేదు. బహుశా ఆపరేషన్ చేసిన మరుసటి రోజు అనుకున్నాడు. కాదని ఆ తర్వాత తెలిసింది. మూడవ రోజు.

ఈ మూడ్రోజుల్లో స్పృహలోకి వచ్చినపుడు ఏం తెలిసేది కాదు. విపరీతమైన నొప్పి తప్ప. చూచాయగ పరిసరాలు తెలియసాగాయి. గొంతునిండా ఏదో ట్యూబు. గాలి పీల్చుకోలేకపోతున్నాడు. ఆ పని మిషన్ చేస్తోంది. స్వతంత్రంగా తనే పీల్చుకోవాలనే తపన... కానీ వీలుకాదని తెలుసు డాక్టర్శ్రీనికి.

క్రమంగా వొక్కొక్కటే గుర్తుపట్టగల్గుతున్నాడు. ఒక్కోసారి డాక్టర్లు ఏవేవో ప్రశ్నలు వేసేవారు. తనేదో జవాబు చెబ్తుండేవాడు.. మరోమారు విచారవదనాల్తో స్వాతిపిల్లలు కనిపించేవారు. ఏం భయంలేదని చెప్పాలనుకునేవాడు కానీ... వీలు కాదు... వాళ్ళనలా చూడగానే మనసులో నుంచి బాధ ఉప్పెనలాగ పొంగుకొచ్చి కళ్ళలో నీరు తిరిగేవి డాక్టర్శ్రీనికి.

బాగా తెలివి వొచ్చిన తర్వాత



మొట్టమొదటిసారి తన శరీరాన్ని చూసుకుని ఆశ్చర్యపోయాడు డాక్టర్శ్రీని. వొళ్ళంతా వైర్లమయం... కుడిచేతికి రేడియల్ ఆర్టరీలోనుంచి ఒక రబ్బరు గొట్టం, వీన్లో నుంచి తీస్తారు సహజంగా మరియిది...? బహుశ రక్తపరీక్షల నిమిత్తం ఆలస్యం లేకుండా తీసికొనేందుకు. మెడ దగ్గర సబ్క్లేవియస్ వీన్లో నుంచి మరో గొట్టం, గుండెలోకి శరీరంలోంచి ఎంత రక్తం అందుతుందో తెలిసికొనేందుకు. ఛాతీలోకి రెండు గొట్టాలు... గుండెకు, ఊపిరితిత్తులకు మధ్య చెడు రక్తంగాని, నీరుగాని చేరితే వెంటనే తీసేసేందుకు, పెద్ద ఆపరేషన్లలో అలా జరిగే అవకాశం వుంది. కార్డియాక్ మానిటర్ సరే సరి. మూత్రనాళం లోకి (యూరిన్ వచ్చే దగ్గర్నుంచి) మరో గొట్టం, గంటకి ఎంత యూరిన్ వస్తోందో తెలిసికొనేందుకు, చేతికి సలైన్ బాటిల్...

తన శరీరం క్రింది భాగంలో విపరీతమైన నొప్పిగా ఉన్నట్లనిపించింది డాక్టర్శ్రీనికి.

ఐస్ గడ్డ మీద పడుకున్నట్లు.. భరించలేకుండా వున్నాడు... ఇదంతా చూస్తూంటే తను బ్రతికే వున్నాడా అన్న అనుమానం వేసింది: తనకి మామూలు బైపాస్ సర్జరీకి ఇంత తతంగం ఎందుకు...?! బహుశా ఆపరేషన్ సమయంలో జరగకూడనిదేదైనా జరిగిందా...?! ఏమో! ఎక్కువగా ఆలోచించలేకపోయాడు.

ఉదయం స్వాతి, పిల్లలు వొచ్చారు. ఉబికివస్తున్న కళ్ళనీళ్ళతో, దగ్గరకు వెళ్ళబోయిన పిల్లల్ని స్వాతి వారించింది. వాళ్ళని చూసి నవ్వాడు.. నవ్వాను అని అనుకున్నాడు. గొంతులో గొట్టం దూర్చుకుని ఎలా నవ్వగలడు. కళ్ళతోనే నవ్వాలి అంతే తను అశక్తుడు బావున్నారా... అన్నట్లు సైగచేశాడు. వాళ్ళకర్థమైనట్లు లేదు. మెల్లగ కుడిచేయి లేపి సైగచేశాడు.

బాగున్నట్లు తల ఊపారు.

పేపర్ పెన్ ఇస్తే బావుంటుంది అని అనిపించింది డాక్టర్శ్రీనికి సైగ చేశాడు. అది వాళ్ళకు అర్థం కాలేదు. మళ్ళీ చేశాడు. పెద్దపాప కనుక్కుంది. వెంటనే పేపర్ దగ్గర వుంచి పెన్ డాక్టర్శ్రీని వేళ్ళమధ్య పెట్టారు.

నేను బావున్నాను. భయపడకండి ఎంతో శ్రమతో ఆ పదాలు వ్రాయగలిగాడు. అప్పుడే అక్షరాలు నేర్చుకున్నట్లు వుంది ఆ వ్రాత.

స్వాతి వైపు చూశాడు. భయంతో తల్లడిల్లిపోతున్న ఆమెను ఎలా వోదార్చాలో తెలియడం లేదు. గుండెలు పిండేస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుని గుంబనంగా వుంది. తను బయట పడ్తే పిల్లలు మరీ బెంబేలు పడుతారని, ధైర్యంగా వుండమని వ్రాశాడు. ఉంటాను. అన్నట్లు పంటి బిగువుతో వస్తున్న ఏడుపును ఆపుకుంటూ తల ఊపింది.

ఆ రోజు డాక్టర్శ్రీని గొంతులో గొట్టం తీసివేశారు. అమ్మయ్య.... ఎంత హాయి... తన ఊపిరి తనే పీల్చుకోగల్గుతున్నాను అని సంబరపడిపోయాడు డాక్టర్శ్రీని. కానీ గొంతు చాలా నొప్పిగ వుంది. మాట్లాడేందుకు వీలుగ లేదు. బొంగురుగ, పీలగ, అస్పష్టంగా



gudachari.com

వస్తొన్నాయి మాటలు. అదీ చాలా కష్టంమీద. ఎటూ కదల్లేని పరిస్థితి... వీపు క్రింద విపరీతమైన బాధ.. భరించలేనంత.

ఇంతలో నర్స్ వచ్చింది.

అతికష్టం మీద... "నన్నేందుకు ఐస్‌మీద వుంచారు?" అని అడిగాడు.

"ఐస్ గాదండి.. ఎక్కువ జ్వరం వస్తోంది మీకు అందుకని ఐస్‌వాటర్ బాగ్స్ పెట్టవున్నాయి."

"తీసేయ్యకూడదా!"

"నూటనాలుగుంది మీకు జ్వరం ఇప్పుడు"

"మాత్రలేవైనా ఇవ్వచ్చుకదా"

"మా ఇన్‌స్ట్రక్షన్స్ అలాంటివి. మేం చేయకూడదాపని,"

కాసేపు అతనివైపు చూసి వెళ్ళిపోయింది. ఆచూపులో అతని మీద జాలి... సానుభూతి వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్‌శ్రీని మొదట్లో ఈ తతంగమంతా చూసి బాగా భయపడిన మాటవాస్తవం. ఆ తర్వాత పూర్తిగ అర్థమయింది తన పరిస్థితి. నిజానికి తనెప్పుడో చనిపోయాడు. ఆపరేషన్ చేసేటప్పుడో, చేసింతర్వాతో అయితే వీళ్ళు ఎలాగో బ్రతికించారు తనను. ఇప్పుడు భయం పూర్తిగ తగ్గిపోయింది. ఎందుకంటే ఎప్పుడో చనిపోయాడు కనుక.

అతనికి రక్తపుపోటు పెంచేందుకు వాడే మందు చాలా శక్తివంతమైనది. శరీరంలోని అన్ని భాగాల్లో వున్న చిన్న చిన్న వీన్స్‌లో వుండే రక్తాన్ని లాక్కుని గుండెకు అందిస్తుంది. గుండె మామూలుగ ఎంత రక్తం తీసికుంటుందో అంత రక్తాన్ని మరలా శరీరంలోకి పంపిస్తుంది. దీన్నే కార్డియాక్ సైకిల్ అంటారు. ఇందులో ఏకొద్ది మార్పు సంభవించినా ప్రమాదమే. పేషెంటు ఎంతప్రమాద స్థితిలో వుంటే ఇదివాడుతారో అతనికి తెలుసు. అంటే అటువంటి స్థితిలో అతడున్నాడన్నమాట. కానీ సాధ్యమైనంత సంతోషంగా వుండేందుకు ప్రయత్నించాలి అని అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

సలైన్ ఎక్కించే ప్రాంతంలో తెల్లగా పాలిపోయినట్లయి, వలయాకారంలో మచ్చ ఏర్పడింది. ఎక్కించేపుడు మందు చర్మం ప్రక్కభాగంలోకి చిమ్మినందువల్ల అలా అవుతుంది. నర్సుకి చెబితే కట్టుకట్టారు. రెండో రోజుకి నల్లగా మారింది.

మూడో రోజు మళ్ళీ నొప్పి పుట్టసాగింది. ఆ విషయం నర్సుతో చెప్పాడు.

డాక్టరుతో చెపుతానంది.

డాక్టర్‌శ్రీనికి ఎదురుగా కర్టెన్ వెనుక డ్యూటీ డాక్టర్ కాళ్ళు రెండూ టేబిల్ మీద పెట్టుకుని సినిమా పత్రికలో లీనమై ఈ లోకాన్ని మరచిపోయినట్లున్నాడు.



ఏ అందగత్తె సోయగాలో ఆస్వాదిస్తున్నాడో..?

నర్సు వెళ్ళి ఏదో చెప్పింది ఆ డాక్టరుకు.

ఆమెకేదో జవాబిచ్చి మళ్ళీ తన పనిలో నిమగ్నమైపోయాడు.

"అదేం చెయదట. డాక్టరు గారు కట్టు వదులు చేయమన్నారు." నర్సు వచ్చి చెప్పింది.

కోపం వచ్చింది శ్రీనికి.

గట్టిగా, "టెల్‌హిమ్ నీడిల్ ఈజ్ నాట్ ఇన్ పొజిషన్" అన్నాడు డాక్టర్ శ్రీని.

మళ్ళీ వెళ్ళి చెప్పింది డాక్టర్‌శ్రీని బెడ్‌వైపు కొంచెం గుర్రుగా చూసి మళ్ళీ ఏదో చెప్పి పుస్తకంలో తలదూర్చాడు.

డాక్టర్‌శ్రీనికి అతను ఏం చెప్పిఉంటాడో అర్థం అయ్యింది.

"నీడిల్ పొజిషన్‌లోనే వుంది కట్టుకట్టమన్నారండి."

"ఏ డాక్టరతను..." నర్సువైపు చూస్తూ కోపంగా అన్నాడు బిత్తరపోయి ఆశ్చర్యంగా చూసింది.

"అతను మనుషుల డాక్టరా, పశువుల డాక్టరా... నేనూ డాక్టర్ని... ఆమాత్రం నాకు తెలియదనుకున్నాడా... ఇడియట్."

బిత్తరపోయిన ఆ నర్సు తేరుకుని

"సారీ! డాక్టర్.. కొందరంతే." నొచ్చుకుంటూ అంది.

డాక్టర్‌శ్రీని మాటలు విన్నాడేమో లేచి అతని వైపు అదోరకంగా చూచి వెళ్ళిపోయాడు.

"అతని పేరేమిటి?"

ఏదో చెప్పింది.

"మైగాడ్... ఇంత పెద్ద హాస్పిటల్లో ఒక పనికిమాలిన డాక్టర్ ఉన్నాడంటే విచారంగా వుంది. ఎంత తెలివితేటలున్నా పేషెంట్ బాధ నర్థంచేసికోలేని వాడేం డాక్టరు." అన్నాడు కసిగా.

మరో పది నిమిషాల్లో వేరే డాక్టర్ వచ్చాడు. అతనితో జరిగిందంతా చెప్పాడు డాక్టర్‌శ్రీని.

సారీ చెప్పి కట్లు విప్పాడు. ఆ ప్రాంతంలో చీముపట్టి వుంది. అదంతా క్లీన్ చేసి, నీడిల్ పొజిషన్‌లో పెట్టి, వాపుకు కట్టు కట్టించాడు. దాని కోసం మళ్ళీ ఇంజెక్షన్‌లు తీసికోవాల్సి వొచ్చింది. అసలే విపరీతమైన జ్వరంతో బాధపడ్తుంటే మళ్ళీ ఇదొకటి... అని అనిపించింది. డాక్టర్‌శ్రీనికి.

చీముపట్టిన ప్రాంతం గుర్తించకపోతే, అక్కడ్నించి విషక్రిములు ఐ.వి ఇచ్చే వీన్ ద్వారా శరీరంలో ప్రవేశించి చాలా ప్రమాదానికి దారి తీసి వుండేది.



gudachari.com

డాక్టర్లకన్నా నర్సుల సేవలే అభినందనీయంగా వున్నాయిక్కడ. ప్రైవేట్ హాస్పిటళ్ళకు జీవం ఈ నర్సులే.

తన శరీరాన్ని ఎన్ని కుట్లు పొడిచారో తలచుకుంటే వొళ్ళు జలదరించింది డాక్టర్ శ్రీనికి. కానీ తను బ్రతికి వున్నది వీటివల్లే... అప్పుడు జ్ఞాపకం వచ్చింది తనకు...

ఒకసారి తను కాన్సరున్న మూత్రకోశపు ఆపరేషన్ చేయాల్సి వొచ్చింది. పూర్తిగ మూత్రకోశాన్ని, దానిచుట్టు ప్రక్కల వుండే కండరాల్ని, మలవిసర్జన గొట్టాన్ని (రెక్టమ్) కొంత భాగం తీసేయాల్సి వొచ్చింది. యూరిన్ రీ బ్లాడర్‌గా పొట్ట ప్రేవుల్లో కొంత భాగాన్ని మార్చి దాన్ని మూత్రపిండానికి కలిపి మరలా మూత్రం బయటకు వచ్చేందుకు పొట్టలో మరో రంధ్రం చేయాల్సి వచ్చింది. మలం వచ్చేందుకు ఇంకో కృత్రిమ రంధ్రం చేయాల్సి వొచ్చింది.. ఇదంతా చేస్తుంటే తనకే ఏదోలా అన్పించింది. జంతువును కోసినట్లు కోస్తున్నానేవిటాని... అయితే తప్పదు. అతను బ్రతకాలంటే ఇదంతా చేసి తీరాలి. అందుకే డాక్టర్లని మరో సృష్టికర్త అంటున్నారు. మృత్యుముఖద్వారంలో వున్న వ్యక్తిని తన శక్తితో జయించి జీవింపజేస్తున్నాడు. ఆ సంతృప్తి డాక్టర్లకు జీవం.

డాక్టర్‌శ్రీనికి ఈ నాలుగు రోజుల్లో చాలాసార్లనిపించేది గట్టిగ ఏడ్వాలని, మరలా భయం మొదలుపెడ్తే ఆపుకోలేనేమో అని. ఆశక్తి తనకు లేదేమోఅని.

రోజంతా విసుగు విరామం లేక చలాకీగ పనిచేసుకుపోయే తను, రోజుల తరబడి బెడ్‌మీద కదల్లేని స్థితిలో... తలచుకుంటే దిగులు.. అయితే మాములు మనిషినౌతాడనే నమ్మకం. ఆ నమ్మకమే తనని ప్రమాదస్థితి నుంచి దాటించిందనిపించింది.

ఆర్థోపెడిక్ ఆపరేషన్లయితే మరీ భయంకరంగా వుంటాయి. కసాయి కత్తితో కస కసా నరకినట్లు, చూసే వాళ్ళకి మొరటుగ జుగుప్సగా వుంటాయి. చేసేవాళ్ళకు మాత్రం ఒకటే ధ్యేయం. పేషెంటు వ్యాధి నయం చేయాలని. ఇంత జరిగినా పేషెంటు కొంతకాలానికి మచ్చైనా మిగలక ఆరోగ్యవంతుడు కాగలుగుతున్నాడు. మానవ శరీరానికి అంతటి రికవరింగ్, హీలింగ్ పవర్ ఉన్నదన్నమాట. మాని పోవటం, మామూలుగా రావటం. మాయ. అంతా మాయ. నవ్వుకున్నాడు.

డాక్టర్‌శ్రీని శరీరంలోని గొట్టాలు, వైర్లు చాలా వరకూ తీసివేశారు. ఆరోజు గ్లూకోజ్ సైతం తీసివేశారు. సంతోషంగా వుంది డాక్టర్‌శ్రీనికి. అయినా శరీరమంతా నొప్పిగానే వుందనిపించింది.

తొడ నుండి మోకాలి క్రింద వరకు బైపాస్ చేసేందుకు చేసిన గాయం ఏమంత బాధగ లేదుగానీ, ఛాతీ మీద మాత్రం బాగా నొప్పిగా వుంది. గొంతులో గల్ల... దగ్గాలంటే భయం ఎక్కడ ఛాతీ పగిలి గుండె బయటకొస్తుందేమో అని. గల్ల ఉమ్మకపోతే శ్వాసించడానికి ఇబ్బందిగా వుంది. అందుకని దిండుగుండెకు గట్టిగ అదిమి దగ్గితే గల్ల వచ్చేస్తుందని



నర్సు చెప్పేదాకా గుర్తురాలేదు. ఆరోజునుంచి అదే చేయసాగాడు. అలాకూడా రాకపోతే బోర్లా పడుకుని దిండు గుండెకు అదుముకుని స్వాతిని వీపు నుంచి క్రింది వరకు క్రమబద్ధంగా తట్టమనేవాడు. తనకెక్కడ నొప్పి కల్గుతుందేమో అని చిన్నగ తట్టేది. అంత ప్రయత్నం చేస్తే కొంచెం వచ్చేది. అది వచ్చేస్తే సగం ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించేంది.

ఇప్పుడు దిండు తనకి ప్రాణం.... తన గుండెను శత్రుబారి నుండి రక్షించే కవచం... దిండులేనిదే తోచదు. నిదుర పట్టదు. ఎదురుగ ఎవరైనా వస్తుంటే తనకు తెలియకనే గుండెకు దిండు అడ్డుగ పెట్టుకునేవాడు డాక్టర్‌శ్రీని.

సహజమే కదా మరి! కవులంతా హృదయం మీద కవిత్వం చెప్పారేగాని చేతులమీదో కాళ్ళమీదో వ్రాయలేదే!

ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్ నుంచి ప్రైవేట్ రూముకు మార్చారు. బి.పి. కూడా ఎనభై, అరవైకి వచ్చింది. అంతకన్నా తక్కువ చేస్తే మళ్ళీ గుండెకు భారం. మందు లవసరం లేకుండా నిలకడగ వుంది.

ఇప్పుడు డాక్టర్ శ్రీని తన గాలి తనే పీల్చుకోగల్గుతున్నాడు. లేచి చిన్నగ నడవగల్గుతున్నాడు. మరో రెండ్రోజుల్లో పరుగు తీయగలడు. ఆ ధైర్యం, నమ్మకం వుంది తనకు స్వాతికి పిల్లలికి చాలా సంతోషంగా ఉంది.

"రేపు పార్టీ చేసికుందాం." అన్నారు పిల్లలంతా.

"ఏం పార్టీ?"

"మరచేపోయారా... టుమారో ఈజ్ యువర్ బర్త్‌డే." అంది స్వాతి సంతోషంగా.

"ఈజిట్...! వండర్‌ఫుల్."

ఉదయం లేస్తూనే స్వాతి, పిల్లలు రెపరెపలాడే బట్టల్తో ప్రత్యక్షమయ్యారు. అలాగే చూస్తుండిపోయాడు డాక్టర్‌శ్రీని. అందరి ముఖాల్లో ఆనందం తాండవిస్తోంది.

స్వాతి డాక్టర్‌శ్రీని కాళ్ళకి నమస్కరించి "దీవించండి" అంది. పిల్లలు కూడా అలాగే చేశారు. అతనికి నోట మాట రావడం లేదు. ఆప్రేమ... ఆప్యాయత... భరించడం కష్టంగా వుంది. అతని కళ్ళు వర్షిస్తున్నాయి.

స్వాతి ముఖం చేతిలోకి తీసికుని

"ఏమని దీవించను..."

"మనం కలకాలం ఇలాగే వుండిపోవాలని, మనల్ని వేరు చేసే శక్తి ఎవరికీ వుండకూడదని..." స్వాతి కళ్ళ వెంట అశ్రుధారలు. పిల్లల వైపు చూశాడు. దిగులుగా భయంగా ఉబుకుతున్న కన్నీటితో వాళ్ళందరినీ చూస్తున్నాడు. వాళ్ళ కళ్ళనిండానీళ్ళు.

"అరెరే... అదేవిటిలా బడ్డీస్... ఏడుస్తున్నారు." నవ్వుతూ దగ్గరకు తీసికున్నాడు.

"... మరి మీరేడుస్తొంటే మాకు ఏడుపొచ్చింది డాడీ!"



gulachari.com

"మేం ఏడవడం లేదమ్మా! మిమ్మల్నందర్ని చూసి సంతోషంతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి." అందర్ని ముద్దుపెట్టుకుంటు అన్నాడు.

ఇంతలో ఒక డాక్టర్ వొచ్చాడు చేతిలో ఇంజెక్షన్ సిరంజితో.

"ఏవిటి... డాక్టర్?" కళ్ళు తుడుచుకుని అన్నాడు.

ఇంజెక్షన్ చేయాలి!

"చేయండి"

చేసి వెళ్ళిపోయాడు.

అంతవరకూ నిశ్శబ్దంగ వున్న పిల్లలు మాటల్తో విజృంభించారు. తికమక పెట్టేస్తున్నారు. ఇంతకాలం బలవంతంగా దాచుకున్న ప్రేమ... ఆప్యాయతల్ని ఆక్షణం తండ్రి మీద కురిపించివేస్తున్నారు.

అప్పుడు కొద్దిగ మైకం కమ్ముతున్నట్లనిపించింది డాక్టర్‌శ్రీనికి. బహశ అలసట వల్ల అయివుంటుందనుకున్నాడు. మరికొద్ది సేపటికి నిస్సత్తువగ అనిపించింది. భయం వేసింది. ఉన్నట్లుండి, "సిస్టర్‌ని పిలువ్" అన్నాడు.

నిశ్శబ్దం. ఎక్కడి వారక్కడే నిలిచిపోయారు.

స్వాతి సిస్టర్‌ని పిలుచుకొచ్చింది.

"నాకేదో అయిపోతూ వుంది డాక్టర్ని పిలవండి." వెంటనే వెళ్ళింది. పదినిముషాలైంది రాలేదు.. ఇరవై నిమిషాలు... రాలేదు. అప్పటికే శరీరమంతా చెమటలు పట్టాయి. మైకం ఎక్కువ అవుతోంది. స్వాతి పల్స్ చూస్తూ ద్వారం వైపు చూస్తోంది. ఎవరూ రాలేదు. స్వాతికి కూడా భయం వేసింది. పల్సు చాలా వీక్‌గా ఉంది.

"మరలా పిలువ్ సిస్టర్ని." అన్నాడు. చెప్పడానిక్కూడా శక్తి చాలడం లేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి. అరగంట గడిచింది... ఎదుటి వస్తువులన్నీ అస్పష్టమవుతున్నాయి. సిస్టరొచ్చింది. "క్షమించండి! డాక్టర్లంతా మీటింగ్‌లో వున్నారు అయిన తర్వాత వచ్చి చూస్తారట." అంది.

"ఎప్పుడు... పేషెంటు ప్రాణం పోయింతర్వాతనా." ఆ అరుపుతో బయటకు పరుగు తీసింది. నానా గొడవ చేస్తే అప్పటికొచ్చారు ఇద్దరు డాక్టర్లు.

అప్పటికే ఊపిరి అందడం లేదు సరిగ్గా. చెమటతో తడచిపోయాడు పూర్తిగా.

ఆక్సిజన్, సలైన్ పెట్టారు వెంటనే.

ఇరవైనిమిషాలకి కొద్ది స్థితిమితం.. అరగంటకు మామూలు అయ్యాడు. గంట తర్వాత పూర్తిగ కోలుకున్నాడు.

"ప్రాణం పోతోంది రండయ్యా అంటే ఇంత తీరిగ్గానా వచ్చేది...?" కోపం కట్టలు తెంచుకొంటోంది అతనిలో.



"ఎప్పటికప్పుడు గమనిస్తూనే వున్నాం, శ్రద్ధ తీసికుంటున్నాం కదండీ," నవ్వు పులుముకుంటూ అన్నారొకరు.

"ఏవిటి మీరు గమనించేది.. మరో పది నిమిషాలు ఆలస్యం అయివుంటే ప్రాణం పోయివుండేది." గట్టిగ అరచాడు డాక్టర్‌శ్రీని.

స్వాతి అతన్ని కంట్రోల్ చేయ ప్రయత్నిస్తోంది.

"ప్రాణం పోలేదు కదా!" మరొకరన్నారు.

"ప్రాణం పోతే వస్తామనుకున్నారా... బికేర్‌ఫుల్.. డాక్టర్... డోంట్ మేక్ జోక్స్... ఎవరు నీకు డాక్టర్ పట్టా ఇచ్చింది." అసభ్యంగానే తిట్టాడు వారి ప్రవర్తనకు తట్టుకోలేక.

"సారీ డాక్టర్! ... మీరు ఆ మందుకు మరీ సెన్సిటివ్."

"చాల్లేవయ్యా నీ తప్పును ఒప్పుకోక ఆ మందు నా శరీరానికి పడలేదంటావా... అసలే చావుతో పోరాడి బలహీన స్థితిలో వుండి, బి.పి. తక్కువగా వున్నప్పుడు ఆ మందు ఎలా ఇస్తావ్? ఆమాత్రం జ్ఞానం లేదా... ఎంతమందిని చంపడానికి మీరు డాక్టర్లయ్యారు...?"

వాళ్ళు ముఖాలు మాడ్చుకుని వెళ్ళిపోయారు.

ఆయాసంతో రొప్పుతున్నాడు డాక్టర్‌శ్రీని. గొంతు తడారిపోయింది. మంచినీళ్ళు తెమ్మని అడిగాడు.

పిల్లలు ముగ్గురూ నీళ్ళు తలో గ్లాసు తెచ్చారు.

అంతకోపంలోను నీళ్ళ గ్లాసులు పట్టుకుని ఎదురుగా నిల్చున్న వాళ్ళను చూసేసరికి కోపమంతా పోయింది. నవ్వేశాడు. పిల్లల మనసు తేలికపడింది.

విష్ణు వచ్చి, "డాడీ... డాడీ వాళ్ళు చెడ్డ డాక్టర్లు కదా డాడీ" అన్నాడు.

"వెరీ బాడ్... వాళ్ళ డాడికే ఇట్లా జరిగితే అప్పుడు తెలుస్తుంది."

మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది దీపు.

"ఆ మాత్రం తెలీదా వాళ్ళకి డాడీ! నీకు బి.పి. తక్కువ వుందని. ఆ మందు ఎందుకు ఇవ్వాలి." అంది పెద్దపాప బిందు.

"తెలుస్తుందమ్మా. కాని ఏం కాదులే అని కొంతమంది అలక్ష్యం చేస్తారు మరికొంత మంది ఇతరపనుల వల్ల అలా చేస్తారు. కావాలని ఎవరూ చేయరు సాధారణంగా."

"తెలిసి చేసినా తెలియకచేసినా తప్పు తప్పే కదా! అందులోనూ డాక్టర్లు యిలాంటి పని చెయ్యకూడదు. తప్పులేకపోతే నువ్వు వాళ్ళనలా ఎందుకు తిట్టావు?" పిల్లల ప్రశ్న.

"నేను పేషెంటును కదమ్మా అందునా ప్రమాదకరమైన జబ్బు నాది. ఎన్ని పనులున్నా నా విషయంలో వచ్చితీరాలి." అన్నాడు వాళ్ళని దగ్గరకు తీసికుంటూ, ఇంత చేసినా దిండు అతని గుండెమీద వుంది.



gudachari.com

"ఓ కె... ఫర్‌గెటిట్... నాకు హాపీ బర్త్‌డే చెప్పలేదే." వాళ్ళను అది మరిచిపోయేటట్లు చెయ్యాలని అన్నాడు డాక్టర్‌శ్రీని.

అందరూ ఒక్కసారిగ టేబిల్‌మీదుంచిన స్వీట్స్ తెచ్చి తన నోట్లో తురిమి "హాపీ బర్త్‌డే టు యు" అన్నారు.

స్వాతికి ఇంకా గుండెదడ తగ్గలేదు

"ఏవిటి.... అలా వున్నావు?" నవ్వుతూ స్వాతిని చూసి.

"మీరు రెస్ట్ తీసికోండి కాసేపు" బ్రతిమలాడినట్లంది.

"రెస్ట్ లేదు, గిస్ట్ లేదు. ఇన్ని రోజులు తీసికుంది చాల్లే. మీతో వుంటేనే నాకు విశ్రాంతి. జరిగినదంతా కాసేపైనా మరచిపోగలుగుతాను."

పిల్లల్తో వారి మాటల్తో ప్రశ్నల్తో సరదాగా కొద్దిగ ఇబ్బందిగ వున్నా హాయిగా ఆరోజు గడచిపోయింది.

బైపాస్ సర్జరీ చేస్తే మామూలుగ రెండు వారాలు హాస్పిటల్‌లో వుండాలి. అటువంటిది డాక్టర్‌శ్రీని రెండు నెలలుండాల్సివచ్చింది. ఈ రెండు నెలల్లో తిరిగి ఎలాంటి ఉపద్రవము జరగలేదు, కానీ గొంతులోని గల్ల మాత్రం తరచూ ఇబ్బంది పెట్టేది. క్రమంగా శరీరంలోని అన్ని భాగాలు మామూలు స్థితికి వచ్చేశాయి.

హాస్పిటల్ వాతావరణం బాగా బోర్ కొడుతుంది డాక్టర్‌శ్రీనికి. సినిమా పత్రికల్నుంచి, అన్నిరకాల మాగజైన్‌లు ఎన్ని చదివినా ఒక్కటీ జ్ఞాపకం ఉండదు. మొదట్లో అంతగా పట్టించుకోలేదు. బహుశా మానసికంగా బాగా అలసిపోయి వుండటమే ఇందుకు కారణం అయివుండొచ్చు. అని అనుకున్నాడు.

డాక్టర్లు మళ్ళీ అన్ని పరీక్షలు చేసి,

సంతృప్తికరంగా వుంది ఇంటికి వెళ్ళొచ్చు అని చెప్పి రెండు రోజులైంది. స్వాతి కదిలే సూచనలు కనిపించలేదు.

డాక్టర్‌శ్రీని ఆశ్చర్యపోయాడు ఎందుకు అలా చేస్తుందా అని.

అదే అడిగాడు "ఎప్పుడు వెళ్దాం?" అని

కొంచెం తొట్రుపాటుతో అంది

"వెళ్ళిపోదామండీ... డబ్బు కోసం మనిషిని ఊరికి పంపాను. తెచ్చింది చాల్లేదు."

"ఎంతయిందేవిటి..? ఏదీ బిల్లు??"

"పెద్దగా ఏం కాలేదు లెండి.... మామూలే," దూరంగా ఏదో పన్నుట్లు వెళ్ళింది

అనుకున్నదానికన్నా ఎక్కువ మొత్తమే అయివుంటుందని అనుకున్నాడు. అందుకే స్వాతి అలా ఉందనిపించింది అతనికి.



"ఏం ఫరవాలేదు... నాగుండె ఆగిపోదు ఇలా ఇవ్వు"

ఇచ్చింది.

దగ్గర దగ్గర మూడు లక్షలు "ముందుగా కొంత కట్టాము." మరో రెండు లక్షలు... మధ్యలోనే భర్తవైపు చూసి ఆగిపోయింది మాట.

మైగాడ్! క్షణకాలం ఏమి ఆలోచించలేకపోయాడు.

ఒక్కసారిగా విపరీతమైన దిగులు ఆవరించింది. ఎక్కడ్నించి కట్టను... ఇంతమొత్తం... నన్ను బ్రతికించినందుకిది తక్కువే... అయితే నాకది ఎక్కువ. కట్టలేనని చెప్పగలనా. విపరీతమైన దిగులు వేసింది అలా అనుకోగానే.

అప్పుడుగాని గుర్తు రాలేదు డాక్టర్‌శ్రీనికి డబ్బు అవసరం.

స్వాతి తరచూ అనేది, "మీరు సేవ... సేవ... అంటూ మరీ లిబరల్‌గా వుంటున్నారు. డబ్బులేనిదే ఏవీ జరగదు. మనకెంత మంచి పేరున్నా గడపదాటగనే మరచిపోతారీ మనుష్యులు.. డబ్బుకిచ్చే విలువ మంచితనానికి ఇవ్వరు. అవసరమైతే డబ్బువైపే మొగ్గుతారుగానీ మంచితనం వేపు తల కూడా తిప్పి చూడరు." అని.

"చూద్దాం.. వాళ్ళనుంచి మనమేమీ ఆశించకపోయినా ఏదో చేశామనే తృప్తి చాలు," అనేవాడు.

"డబ్బు అవసరమొచ్చినపుడు తెలుస్తుందండీ మీకు. మిమ్మల్ని మోసం చేసి సంపాదించమనడం లేదే...."

"పోనిస్తూ, వాళ్ళ బాధలెన్నో," అనేవాడు.

"మన ఔదార్యాన్ని కీర్తించిన వ్యక్తే జబ్బు త్వరగా నయం కాక మరొక డాక్టర్ దగ్గరకు వెళ్తే... మళ్ళీ మనల్ని చేతకాని డాక్టరు అందుకే డబ్బు తీసికోలేదని నిందవేస్తారు...." స్వాతి అనేది.

తమకు సంబంధించిన అంటే ఆపరేషను కేసులు, స్త్రీలకు సంబంధించిన కేసులు మాత్రమే చూసేవాళ్ళు. మిగతావి మరో దగ్గరకు వెళ్ళమని చెప్పేసేవారు. అయితే నేటి సమాజంలో అది పరికిరాదు. దగ్గరకు వచ్చిన పేషెంటుని మరో డాక్టరు దగ్గరకి పంపకూడదు. అతనిది గుండెజబ్బుగావచ్చు, కళ్ళరోగి కావచ్చు, తలలోపల గడ్డలే ఉన్నా, చిన్నపిల్లల జబ్బుకావచ్చు ఏదైనా అన్ని కేసులూ తానే చూడాలి.

మాకు సంబంధం లేదు. మరో డాక్టర్ దగ్గరకు వెళ్ళండంటే చేతకాని వారి కింద లెక్కకడ్తారు. అసలు వచ్చిన వాళ్ల దగ్గరైనా కరెక్టుగ తీసుకుని వుంటే వాళ్ళు చాలానే సంపాదించి వుండేవాళ్ళు. ఇది పెరిగి పెరగని పట్టణాలలో జరిగేది.

ఎందుకనో డబ్బు విషయంలో గట్టిగా అడగాలంటే సిగ్గుగా వుంటుంది వాళ్ళకు.. ఎదుటి వాళ్ళ దారిద్ర్యం మీద జాలి వల్లో, వాళ్ళు చెప్పే మాటల వల్లో...

gudachari.com

ఒక్కొకరొచ్చి, "ఈ డబ్బు కోసం పెళ్ళాం తాళి కుదువ పెట్టాననంటారు."

మరొకరు ఉన్న పాతిక సెంట్ల మడిచెక్కా తెగనమ్మానంటాడు కళ్ళనీళ్ళతో

ఇంకొకరు ఇంట్లోవున్న చెంబు తపేలా కుదువ పెట్టానని చెప్తాడు

ఇది మధ్య తరగతి సంగతి.. అటు అప్పు అడగలేక, వున్నవి అమ్ముకోలేక సంఘంలో పరువుకోసం ప్రాకులాడ్తూ ఎంత నలగిపోతుంటారో ఆలోచిస్తే డబ్బెలా అడగ్గలం...?! అనుకొనేవారు. ఉన్నవాళ్ళ సంగతి అవసరం లేదు. పావర్టీ లైనుకు క్రింద ఉన్న వాళ్ళంతా దాన్ని దాటేసారు. వాళ్ళు డబ్బుకు వెనకాడటం లేదు.

మరో విషయమేమిటంటే ఎంత ధర గల మందులు వ్రాసినా క్షణాల్లో ఎలాగో తెచ్చుకుంటారు. ఒక్క డాక్టరు విషయంలోనే ఈ కష్టాలు కన్నీళ్ళూనూ... వాళ్ళని వాళ్ళమంచిని ఉపయోగించుకుంటున్నారని తెలిసినా గట్టిగ అడగలేకపోయేవారు. ఒక్కోసారి గట్టిగా అడిగితే స్వాతి పోనీలెండి అనేది. స్వాతి గట్టిగా అడిగితే తను సర్దిచెప్పేవాడు. ఆవిధంగా వుంటుండేవాళ్ళు.

ఇతర ఖర్చులు, ఆపరేషన్‌కు కలిపి లక్షా యాభైవేలు అవుతుందని చెప్పారు. అనుకున్న దానికన్నా ఎక్కువ రోజులు వుండాల్సొచ్చినందువల్ల ఎందుకు ఉండాల్సి వచ్చింది. డాక్టర్ల అశ్రద్ధా! లేక తన వ్యాధికారణమా! ఆలోచించడం అనవసరం.

మిగిలిన డబ్బెలా చేయాలి...?

"ఏవిటి... దీర్ఘాలోచనలో వున్నారు...?" కుదుపుతూ నవ్వాలని ప్రయత్నిస్తూ అంది స్వాతి.

"డబ్బెక్కడ తెమ్మన్నావు...?"

"ఎక్కడో ఒక దగ్గర. మీరది ఆలోచించకండి"

"మీ నాన్ననేమైనా అడిగావా...?"

"లేదు... వాళ్ళు కొంత ఇవ్వబోయారు. అయితే నేనే వద్దన్నాను."

తనకు తెలుసు స్వాతి అభిమానం. కనీసం కన్నతల్లితో కూడా చెప్పుకోదు ఇటువంటి బాధలు. తనతో తప్ప.

ఈ నాలుగు సంవత్సరాలు మిగిలింది, ఆ బిల్లు కంటే తక్కువ ఉంటుంది.

ఇన్ని సంవత్సరాలు కూడ బెట్టింది ఒక్కసారిగా అయిపోతే చాలా బాధగా వుంది డాక్టర్‌శ్రీనికి. పైగా మిగిలింది అప్పు. ఏం చేయగలం... మళ్ళీ సంపాదించాలి. తనలో శక్తి వుంది. తెలివి వుంది. అనుభవం వుంది. ఇంకేం డబ్బు సంపాదించడం ఎంతసేపు. అయితే ఖర్చుల విషయంలో తమ ఇద్దరివీ పెద్ద చేతులే అనుకున్నాడు.

ఎవరైనా అడిగితే.. తిరిగి వస్తుందా రాదా అని ఆలోచించకుండా, వుంటే ఇచ్చేసేవారు. ఇకనుంచీ కాస్త గట్టిగా వుండాలి. అంటూ తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు. నిర్ణయించుకున్నాడు.



స్వాతి వాళ్ళదిగాని, తనదిగాని పెద్దగా ఉన్న కుటుంబాలు కావు. మర్యాద, మన్నన గలిగిన పెద్దతరహా కుటుంబాలు. డాక్టర్‌శ్రీని పెళ్ళి చేసికుంటూ మళ్ళీ కట్నం ఏవిటి... నువ్వెంతో తనూ అంతే. కట్నం తీసికోవడం చాలా తప్పు. అనేది తన ఖచ్చితాభిప్రాయం. కనీసం పెట్టిపోతలు కూడా ససేమిరా వద్దన్నాడు. మేం సంపాదించుకుంటాములే అనేవాడు.

ప్రభుత్వ డాక్టర్‌గ వుండేటప్పుడు ఏమీ మిగిలేది కాదు. అందుకే స్వంత ప్రాక్టీస్ పెట్టేపుడు అప్పు తప్ప లేదు.

వాళ్ళ మంచితనం వలనో, అదృష్టం వలనో నాల్గు సంవత్సరాల్లోనే చిన్న ఇల్లు, బాంక్‌లోన్‌తో హాస్పిటల్ కట్టించగలిగారు. పాత కారొకటి కొన్నారు. నాలుగు సంవత్సరాల్లో నాలుగు లక్షలు డబ్బు మిగుల్చుకోవచ్చు. అయితే వాళ్ళది చేయలేకపోయారు. దాన్ని గురించెప్పుడూ బాధ పడలేదు కూడా.

ఇప్పుడు ఆ అవసరమొచ్చింది. లేని తనం ఎంత చిన్న తనమో తెలిసి వస్తోంది. ఇద్దరమూ డాక్టర్లం అయివుండి హాస్పిటల్ బిల్ కట్టడానికి ఎవరెవర్నో డబ్బులడగాల్సి రావడం... చాలా అవమానకరం... శ్రీని మనసు బాధగా మూలిగింది.

ఊరికి వెళ్ళగానే హాస్పిటల్‌కి పోవాలని శ్రీమతితో పాటు రడీ అయ్యాడు.

స్వాతి వీల్లేదండి. కనీసం వారం రోజుల విశ్రాంతి తీసికోమంది.

లేదు వచ్చి తీరాలని పట్టుదల పట్టాడు.

"అక్కడకి వస్తే ఎవరో ఒకరొచ్చి మాట్లాడిస్తూ వుంటారు."

"నాకేం బావుంది. ఇంట్లో తోచదు. అక్కడైతే పొద్దుపోతుంది." విధిలేక వొప్పుకుంది.

హాస్పిటల్ బోసిగా వుంది.

స్టాఫ్ అందరూ వొచ్చి క్షేమ సమాచారాలు విచారించసాగారు.

వాళ్ళు లేని సమయంలో చాలామంది పేషెంట్లు తిరిగి వెళ్ళిపోయారట. కొంతమంది అయిష్టంగానే చికిత్స చేయించుకున్నారట, మరికొంతమంది ఎప్పుడువొస్తారు డాక్టరు గారు అని అడిగి వెళ్తున్నారట.

ఇంతలో వయసు మళ్ళిన ఆయన వొకరు వొచ్చాడు. వస్తూనే, "వచ్చావా! నాయనా! నువ్వేమయిపోయావో అని ప్రాణం కొట్టుకులాడింది. ఈ గాడిదలు చచ్చిపోయావని చెప్పారు. నాగుండె పగిలిపోయింది నాయనా! అంత మంచి మనిషికి చెడ్డ ఎలా జరుగుతుంది. నోటికొచ్చిందల్లా మాట్లాడారు వెధవలు." అంటూ శాపనార్థాలు పెట్టసాగాడు.

ఆ ఆప్యాయత.. అనురాగం... ఆతృతకు డాక్టర్‌శ్రీనికి నోట మాట రాలేదు. కాని చివరన ఆయన అన్నమాటలే తన చెవుల్లో గింగిర్లు తిరుగసాగాయి. ఓర్వలేని మనుషులు... ఎలాంటి పుకార్లు పుట్టిస్తారో...

తను నవ్వి... "అంటే అననివ్వండి వాళ్ళ నోర్లే కదా పోతాయి." అన్నాడు.



gudachari.com

"అంతే కదా నాయనా! నువ్వు వచ్చావు అంతేచాలు. దేవుడు చల్లాగా చూస్తాడు. నా ఆయువు కూడా నువ్వే పోసుకో... మేం బ్రతికేం లాభం భూమికి భారం. పదిమందికి సాయపడే మీలాటి వాళ్ళు కలకాలం వుండాలినాయనా!" ఆయని కళ్ళలో నీరు తొంగి చూస్తోంది.

తన మనసు సైతం ఆర్ద్రమైంది.

ప్రైవేట్ ప్రాక్టీస్ కత్తిమీద సాము వంటిది. ఎంతటి ఉత్తమమైన వృత్తో.. అంతటి నీచమైన పోటీ వుంటుంది.

ఒక పేషెంటు ఒక డాక్టర్ నుంచి మరో డాక్టర్ దగ్గరకు ఏ కారణం చేతనైనా వెళ్ళడం తటస్థిస్తే.... ఇక అతన్ని మామూలు మనిషిని చూసినట్లు చూడరు. మునుపటి డాక్టర్ వ్రాసిన మందుల్ని తిడుతారు. అంతవరకే అయితే ఫర్వాలేదు. అసలా మందుల వల్లే రోగం ముదిరిందనీ భయాన్ని పేషెంటులో కల్గించి నేను వేరే మందులు వ్రాసిస్తాలే తగ్గిపోతుంది అని అభయం కూడా ఇస్తారు.

మరికొంతమంది డాక్టర్లైతే ఆయన దగ్గరకే పోకూడదూ.... బాగా ముదర పెట్టుకుని వొచ్చావిక్కడికి. అని తిడ్తారు. మరికొందరు ఎవరీ మందులు వ్రాసింది... అతనూ డాక్టరేనా... సమయానికి వొచ్చావు కనుక సరిపోయింది. లేకుంటే చచ్చిపోయి వుండేవాడివి

.... ఇలా వుంటాయి ప్రైవేట్ డాక్టర్ల నీచ ప్రవర్తనలు.

కొన్నిసార్లు డాక్టర్లు వాడిన మందులు పనిచేయకపోవచ్చు. కారణం జబ్బును త్వరగా నయం చేయాలనే ఉబలాటంతో మందులు ఎక్కువ మోతాదులో ఇవ్వడం. ఇందువల్ల కొన్ని మందులు పేషెంటుకు పనిచేయవు. పేషెంట్లూ అంతే జబ్బు త్వరగా తగ్గకపోతే వెంటనే మరో డాక్టర్ని సంప్రదిస్తారు. అందుకే డాక్టర్లు తమ వృత్తిని ప్రధానంగా డబ్బుమీదే కేంద్రీకరిస్తున్నారు. త్వరగా సంపాదించాలనే తపనతో దిగజారిపోతోంది నేటి వైద్యవృత్తి.

ఇందుకెవరు కారణం...? ఎవర్ని మార్చాలి... ఎలా మార్చాలి... డాక్టర్లందరూ ఒక దృఢ దృక్పథంతో పేషెంట్లకి అర్థమయ్యేట్లు విశదీకరిస్తే ఏవైనా మార్పు వస్తుందేమో... మరి అంత ఓపిక... తీరిక ఎక్కడిది...? ఒకవేళ ఎవరైనా ప్రయత్నిస్తే చేతగాని డాక్టర్ క్రింద జమచేసి పారేస్తున్నారు. అందుకే ఆ కొద్దిమంది కూడా మనీమైండెడ్‌గా మారిపోతున్నారు.

డబ్బు... వైద్యవృత్తిలో అల్లుకుపోయి బలమైన పాషాణపు తీగ.... డబ్బు.

డాక్టర్ వేసిన బిల్లు ఎంత చిన్నదైనా... ఓరి... నాయనో.... ఇంతా.?! అని గుండెలు బాదుకుంటాడు పేషెంటు. నేను చేసిన శ్రమకి, సహాయానికి ఇంతేనా అనుకుంటాడు డాక్టరు. ఎవరో కొద్దిమంది మాత్రం సంతోషంగా బిల్లు ఇస్తారు. అలాగే కొంతమంది డాక్టర్లు మాత్రం పేషెంటు ఎంత ఇచ్చినా తీసుకుంటారు.

ఆలోచన్లు సాగిపోతూ వున్నాయి అంతంలేక. ఇంతలో స్వాతి వచ్చింది.



"ఏవిటి... ఏదో ఆలోచిస్తున్నారు?"

"ఏవిటి... నీకు పేషెంట్లు ఎవరూ రాలేదా..."

"మూడు నెలల నుంచీ మనం ఇక్కడ లేకపోతే మనకోసం జబ్బులు కాచుకుని వుంటాయా... వస్తారు. ఇంతకీ మీరేం ఆలోచిస్తున్నారో చెప్పనేలేదు."

"నేనా! అతను ఎవరో గుర్తురావడం లేదు... ముఖం బాగా గుర్తుంది. పేరు మాత్రం ఎంత ప్రయత్నించినా గుర్తురావడం లేదు... మతిమరుపు ఎక్కువ అయింది."

"కొంతకాలం... ఇలాగే వుంటుంది లెండి."

"కాదు స్వాతీ... నాకు ఏదో అనుమానంగా వుంది. నేను మొదట్లో అలాగే అనుకున్నాను."

"ఊరికే అనుమానపడకండి. ఆలోచించవద్దు."

అంతటితో ఆగిపోయాడు.

తన జ్ఞాపక శక్తి తగ్గిపోతున్నట్లు అనుమానం. అది రోజు రోజుకి మరీ ఎక్కువ కాజొచ్చింది. ఆఖరికి కాగితాల మీద తననుకున్నది వెంటనే వ్రాసుకోవాల్సి వస్తుంది. చిన్న చిన్న సంఘటనలు, పదాలు, సంఖ్యలు వెంటనే మరచి పోతున్నాడు. పదాలు చదివేందుక్కూడా కష్టంగా వుంది. కనిపించకకాదు, అర్థంకాక, జ్ఞాపకం రాక.

ఏ వస్తువు ఎక్కడ పెట్టేడో గుర్తుండడం లేదు. దీనితో విసుగు... చికాకు... కోపం... ఇతర్లమీదకూడా అనవసరంగా విరుచుకుపడుతున్నాడు. ఏమైంది నాకు...? ఏమైంది...? ఏమైంది ఇదే ప్రశ్న సుడులు తిరగసాగింది డాక్టర్‌శ్రీని మనస్సులో.

సర్జరీ చేయడమంటే అతనికి చాలా ఆనందం... గర్వం... ఉత్సాహం.. అయితే ఆ అనుభూతి, ఆనందం తనకు శాశ్వతంగా దూరమవుతున్నాయేమో అని తెలియని భయం... అసలు తను ఏదైనా ఆపరేషన్ చేయగలడా... ఎందుకో భయం... లేదు. "నేను ధైర్యం తెచ్చుకోవాలి. నా మనసు కంట్రోలు చేసికోవాలి. మళ్ళీ నేను ఆపరేషన్ చేయాలి. అప్పుడు గాని నాకు మనశ్శాంతి దొరకదు" పదే పదే అనుకోసాగాడు.

ఒకరోజు ఒక అపెండిసైటిస్ కేస్ వచ్చింది. వెంటనే ఆపరేషన్ చేయాలి. అందుకు కొంత ఆలోచించాల్సి వచ్చింది.

ముందుగా శ్రీమతి దగ్గరకు వెళ్ళాడు. ఎలా చెప్పాలో తెలియక మౌనంగా వుండి పోయాడు.

"ఏవిటండీ! అలా వున్నారు."

"ఏం లేదు... అపెండిసైటిస్ కేస్ వచ్చింది. ఆపరేషన్ చేయాలి." అన్నాడు తలవంచుకుని.

"దానికింత ఆలోచనెందుకండీ... చేసేస్తే సరిపోతుంది." తేలిగ్గా నవ్వేస్తూ అంది.

"నాకెందుకో ధైర్యం చాలాడం లేదు."

ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది నమ్మలేనట్లు.

"....నిజం నాకెందుకో చేయలేనేమో అనిపిస్తోంది." నిస్సహాయతకు సిగ్గుపట్టు అన్నాడు.

"ఏవిటండీ... ఇది..? ఎంతటి ఆపరేషనైనా తొణక్కుండా చేసే మీరు... భయపడ్డం ఏవిటి...?!"

"నిజం స్వాతీ... నిజంగా... నేను"

"ఊరుకోండి... చాలుగానీ.... నేనుదగ్గరే వుంటాను. మీరు చేయలేకపోవడం ఏవిటి... నాకు మీ మీద పూర్తి నమ్మకముంది. కమాన్... చేద్దాం పదండి." అంటూ సిస్టర్ని పిలిచి అన్ని సిద్ధం చేయమంది.

ఆపరేషన్ థియేటర్లో అడుగిడగానే అంతా కొత్తగాను... వింతగాను... వుంది. భయం... భయం... ఎందుకో... పరధ్యానం...

"ఏవిటండీ ఆలోచిస్తున్నారు... దిగ్రేట్ సర్జన్ గారూ! పేషెంట్ రెడీ... మీరు కత్తి పట్టడమే లేట్." తన కళ్ళలోకి చూసి నవ్వుతూ అంది.

ఆ కళ్ళలోకి చూశాడు... తన శక్తి మీద నమ్మకం... ప్రోత్సాహం, ధైర్యం వ్యక్తమవుతున్నాయి.

.... కమాన్ మైబోయ్... ఏవిటీ అధైర్యం... ఈ కత్తి నీ చేతుల్లో ఎన్ని వింత విన్యాసాలు చేసిందో... నీ సహచరిణిగా, తోబుట్టువుగా ఎన్ని సంవత్సరాలు గడిపిందో... ఎంతమంది ఉదర కోశాల్ని సున్నితంగా, అతిమెలకువగా, కోసిందో... అని ఎన్ని విధాల ధైర్యం తెచ్చుకుంటున్నా... భయం... ఏదో తెలియని భయం... అది భయం...

ఏదో లోకంలో వున్నట్లు... ఏం చేస్తున్నాడో కూడా తెలియనట్లు. అపుడపుడూ శ్రీమతి ఆదేశాలు, అనునయపు మాటలతో, మెచ్చుకోళ్ళతో పూర్తిచేశాడు. సర్జన్లకు అతి తేలికయిన ఆపరేషన్ ఇది. అయితే తనెందుకో బాగా అలసిపోయాడు. నోరు తడారిపోయింది. శరీరమంతా చెమట.. తలంతా మొద్దుబారినట్లు అనిపించింది.

పూర్తి చేసి మెల్లగా తలెత్తి ఎదురుగా వున్న శ్రీమతివైపు చూసి నవ్వగలిగాడు. వెంటనే ఎక్కడలేని సంతోషం.. తృప్తి తనకు ముంచెత్తాయి. స్వాతిని అమాంతం కౌగలించుకుని గిరగిర తిప్పుతూ ఐ డిడ్ ఇట్... ఐ డిడ్ ఇట్ అంటు గంతులు వేయసాగాడు.

అరే... ఇదేవిటి.. చిన్నపిల్లాడిలా?

ఈ క్షణం నా భవిష్యత్తుకు సోపానం. ఇది నా తొలి విజయం. నేను చేయగలను.. ఆపరేషను చేయగలను.. ఉత్సాహంతో పొంగిపోయాడు.

తనకూ చాలా సంతోషంగా వుంది.

"ఆరె.. మీరు కాసేపు కూర్చోండి.. నా మాట వినండి" బలవంతంగా కూర్చోబెట్టింది.



"చూడండీ! మీరు చేయలేనిదంటూ ఏమీలేదు. అనవసరంగా ఏదేదో ఆలోచించుకుని అధైర్యపడకండి." అంది.

ఈ సంతోషం తన కెంతో కాలం నిలువలేదు. అన్ని సమయాల్లోనూ డాక్టర్ అద్భుతాలు చేయలేడు, ఆరోజు చాలా నీరసంగా ఉందితనకు. స్వాతి వొద్ద వొద్దని వారిస్తున్నా పేదవాడనే జాలితో, దయతో అతడ్ని ఎలా అయినా బ్రతికించాలని చూసాడు. దాని ఫలితం అతని మీద విరుచుకపడింది.

అసలు ఆరోజు రాత్రి.. హాస్పిటల్ నుంచి వచ్చిన ఫోన్ని స్వాతి తీసికుంది.

"ఏం... కేసు పొట్ట ఉబ్బరమా..."

"మూడు రోజులా! ఆ... కడుపునొప్పి కూడా వుందటనా! జ్వరం కూడానా"

"సరే... డాక్టర్ని రాత్రి పూట లేపడం పడదని చెప్పు. ఆయనకు విశ్రాంతి కావాలి.. ఎక్కడికైనా వెళ్ళమను."

"ఏవిటీ... ఎక్కడికీ వెళ్ళరటనా! వీలుకాదని చెప్పేయి అని ఫోన్ పెట్టేసింది."

ఆ మాటలు వింటున్నతను, "పోనీ! వెళ్ళి చూసొస్తే పోలేదా," అన్నాడు.

"భలే వాళ్ళండీ మీరు... అసలు హాస్పిటల్కి రావడమే ఇష్టంలేదు నాకు అందునా రాత్రి కూడానా.. అదేం వీలుకాదు పడుకోండి." కోప్పడుతూ అంది.

మరో అరగంటకల్లా కాలింగ్ బెల్ మ్రోగింది.

విసుక్కుంటూ తీసింది స్వాతి. వాళ్ళ సంభాషణంతా వినిపిస్తూనే వుంది డాక్టర్శ్రీనికి.

"వీలుకాదండీ... ఆయన గుండె ఆపరేషన్ చేయించుకుని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇంకెక్కడికయినా తీసుకువెళ్ళండి."

"మాకు ఆయన మీదే గురి తల్లీ... కాస్త దయ చూపండమ్మా! నా బిడ్డను బ్రతికించండమ్మా... చాలా దూరం నుంచి మిమ్మల్ని వెతుక్కుంటూ వొచ్చాము."

"చెబితే అర్థంకాదా! నీ బిడ్డ సంగతే ఆలోచిస్తున్నావ్ కానీ! నా భర్త సంగతి నేనూ ఆలోచించవద్దా!"

"తల్లీ... నీకాళ్ళు పట్టుకుంటాను. అయ్యగారి చేయి వాసి మంచిదని గంపెడాశతో వచ్చాము. ఒక్కగానొక్క బిడ్డ... వాడి కేదైనా జరిగితే మేం ఉరివేసుకుని చచ్చిపోవాల్సిందే..."

తనులేచి వెళ్ళాడు. కాళ్ళు రెండు పట్టుకుని భోరున ఏడుస్తూ "స్వామీ...! నా బిడ్డ...! నాబిడ్డను బ్రతికించు స్వామీ..." అంటూ కాళ్ళు వదలట్లేదు.

"అరె... ఏవిటయ్యా ఇది.. లే... లే... వచ్చి చూస్తాలే."

"ఓ సారి వెళ్ళి చూసివస్తాం." అన్నాడు స్వాతితో

"ఏవిటండీ... మీరు మాట్లాడేది... మీ పరిస్థితి ఏవిటి... మీరిప్పుడు హాస్పిటల్కి వెళ్తానంటున్నారు..."

"టేకిట్ ఈజీ... నేనిపుడు బావున్నాను. వెళ్ళొస్తాను."

ఇక తప్పదని తనూ బయల్దేరింది.

వెళ్ళి చూస్తే కేసు చాలా బాడ్‌గా వుంది. పీక్కుపోయిన కళ్ళు... పొట్ట ఉబ్బిపోయి, విపరీతమైన జ్వరం, ఆయాసం... చావుకు చాలా దగ్గరగా వున్నట్లు అర్థమవుతోంది.

జనరల్ కండీషన్ చాలా బాడ్... ఆపరేషన్ చేయడానికి వీల్లేదు. షాక్‌లో వున్నాడు.

ముక్కులోంచి కడుపులోకి గొట్టం ఎక్కించి వున్నదంతా తీసివేసి, గ్లూకోజ్ పెట్టి, అవసరమైన ఇంజెక్షన్‌లు ఇచ్చి, చెప్పాడు వాళ్ళతో పరిస్థితి మెరుగు పడితే గాని ఆపరేషన్ చేయడానికి వీల్లేదు అని

వాళ్ళ తల్లిదండ్రులు కాబోలు భోరున ఏడుస్తూ "స్వామీ మీరు వెంటనే ఆపరేషన్ చేయండి.. నా బిడ్డను బ్రతికించండి." అంటూ కాళ్ళు చుట్టేశారు.

"చేసేందుకు వీల్లేదండీ... ఇప్పుడు చేస్తే తప్పక చనిపోతాడు." ఎంత చెప్పినా ఆపరేషన్ చేయమని మొండి పట్టుదల.

డాక్టర్‌శ్రీనికి కోపం వచ్చింది... విసిగి పోయి నేను చేయను, తీసుకు వెళ్ళండని కేకలువేశాడు.

అట్టా అంటే ఎట్టా స్వామీ.. మిమ్మల్ని నమ్ముకుని ఇంతదూరం వచ్చాము. నా బిడ్డను బ్రతికిస్తారని.

అయితే నా మాట ప్రకారం వినండి

"ఆపరేషన్ చేయకపోతే చచ్చిపోడా..."

"ఆ విషయం నాకు తెలుసా? మీకు తెలుసా?"

"కోప్పడకండి సార్. మా ఆతృత మాది. మీరు ఆపరేషన్ చేసేయండి."

"నేను చేయను. నా వల్ల కాదు. మీరు వెంటనే వెళ్ళిపొండి."

"మీరు చంపినా... బతికించినా ఇంకో దగ్గరకి వెళ్ళం. అంతా మీ ఇష్టం, బిడ్డ ప్రాణం మీ చేతుల్లో పెడుతున్నాం..."

వాళ్ళతో వాదించి నచ్చచెప్పేసరికి బాగా అలసిపోయాడు. స్వాతి చాలా విసుక్కుంది.

తను బైపాస్ సర్జరీ చేసికున్నపుడు గానీ, అంతకు ముందుగాని ఇటువంటి టెన్షన్ అనుభవించలేదు. బహశా మృత్యుముఖంలోంచి బయట పడిన తనకు మృత్యువుతో పోరాడుతున్న అతన్ని చూసి భయం కాబోలు అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

నాల్గో రోజు ఆ పేషెంటు చనిపోయాడు. కనీసం ఒక్క రోజు ముందు వచ్చి వుండినా బ్రతికించి వుండే వాడ్ని కదా! అని చాలా బాధపడ్డాడు.



శవాన్ని తీసికెళ్తున్న వాళ్ళని ఓదార్చుద్దామని వెళ్ళాడు. వాళ్ళ ముఖాల్లో తన మీద ఇంతకు ముందు కనిపించిన గౌరవం గాని, అభిమానం గాని, నమ్మకం గాని కనిపించడం లేదు. తనేదో తప్పు చేసినట్లున్నాయి వాళ్ళ చూపులు.

ఇంతలో వాళ్ళలో ఒకరు, "మీకు.... ఆరోగ్యం బాగాలేకపోతే... ఆపరేషన్ చేతగాక పోతే..." ఆమాట పూర్తిగాక మునుపే డాక్టర్‌శ్రీని తల తిరిగిపోయింది. నోట మాట రావడం లేదు.

"నాకు ముందే తెలుసు. అందరూ చెప్పారు. ఆయనకి గుండె ఆపరేషను తర్వాత బుర్ర సరిగా పనిచేయడం లేదని... వీళ్ళు నామాట వింటే గదా... ఆయన దగ్గరికే పోవాలని మంకుపట్టు పట్టారు... చంపడానికి...."

మరొకరు, "అంతా మన ఖర్మ, మరొకర్ని అనుకోవడం దేనికి.. అయినా స్వామి! మీకు వొంట్లో బాగలేనపుడు ప్రాక్టీస్ మానుకోండి.... చాలా మంది బ్రతుకుతారు."

"ఈయనకి పిచ్చిపట్టింది అని ఊళ్ళో వాళ్ళు చెబితే నమ్మలేదు. ఆయనేం చేస్తున్నది ఆయనకే తెలీదు. చంపేస్తాడు..." మరొకరి నింద.

ఛీ... ఛీ... వీళ్లా మనుషులేనా... కోపంతో వణికిపోయాడు.

"మీరు మనుష్యులా దున్నపోతులా.... నా ఆరోగ్యం ఎలా వున్నా, నా ప్రాణాన్ని కూడా లెక్కచేయక అతన్ని బ్రతికించాలని ఈ మూడు రోజులూ అహర్నిశలూ ప్రయత్నిస్తే... ఇదా మీరు మాట్లాడేది...."

"మాటలు సరిగ్గా రానివ్వండి... దున్నపోతులు, పందులు అంటే వూరికే వుండం."

"ఎవడు చెప్పాడు నాకు మతి చెడిందని...? ఏ గాడిద చెప్పాడు... రమ్మను నా దగ్గరకు వాడికి చెడిందో నాకు చెడిందో తేలుస్తాను."

తనకు తెలుసు ఇదంతా ప్రొఫెషనల్ జెలసీతో అనుంగు డాక్టర్ సోదర్లు తనను దెబ్బ తీయడానికి విసిరిన విసుర్లు... డాక్టర్లంటే అత్యున్నతమైన వృత్తి చేసేవాళ్ళు. కాని అతి అల్పమైన బుద్ధులతో బ్రతికే వాళ్ళూ డాక్టర్లే.

...నీచులు.. నీచులు... అవసరానికి కాళ్ళు పట్టుకుంటే టేకప్ చేశాడు. ఇందులో తన తప్పేమీ లేదు. అయినా ఈ మనుష్యులంతా ఇంతే... విశ్వాసం లేని కుక్కలు.. ఎంత అభాండం నెత్తిన రుద్ది పారేస్తున్నారు.. మంచి చేద్దామని పోతే, ఇదా ప్రతిఫలం...?! మనుష్యులకన్నా హీనంగా ఆలోచించగల్గిన జాతి ప్రపంచంలో మరేదీ వుండదేమో... అనిపించింది డాక్టర్‌శ్రీనికి. వాళ్ళు అంతవరకే ఎదిగారు అసహ్యించుకొని, కొప్పడకూడదు. జాలిపడటం తప్ప.

ఆసంఘటనతో చాలా రోజుల వరకూ కోలుకోలేకపోయాడు. హాస్పిటల్‌కి వెళ్ళడం కూడా మానుకున్నాడు. ఒకటే ఆలోచన్లు... పిచ్చిపిచ్చిగా... సిగరెట్లు త్రాగడం ఎక్కువైంది.



gudachari.com

పైగా మతిమరుపు.... సిగరెట్ల విషయంలో స్వాతి చాలా బాధపడుతోందని తెలుసు. అయినా తను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాడు.

చదవడమూ... మాట్లాడటమూ., కూడా వీలు పడ్డం లేదు. పోనీ హాస్పిటల్‌కి వెళ్దామా అంటే హాస్పిటల్‌కి వెళ్తే తను మానేస్తానని మంకుపట్టు. ఒక్కోసారి కన్నీళ్ళు పెట్టుకుంటుంది స్వాతి. ఆమెను బాధపెట్టడం ఇష్టం లేక అదీ మానుకోవాల్సి వచ్చేది. మరి... తనేం చేయాలి... అర్థంగాలేదు. డాక్టర్‌శ్రీనికి.

వేళకు తిని, గదిలో కాసేపు, బయటకాసేపు తిరగడం.... పడుకోవడం... లేవడం... కూర్చోవడం... వెనక్కువాలి ఆకాశంలోకి చూడ్డం... సీలింగ్ ఫ్యాన్ ఎంత స్పీడుగా తిరుగుతోందో గమనించడం... క్యాలెండర్ తేదీలు లెక్కపెట్టడం... చూసిందే చూడడం... చేసిందే చేయడం... ఎంతసేపని... ఒంటరితనం.. దాంతో సిగరెట్లు తగలేయడం...

ఒకసారి హార్ట్ అటాక్ వచ్చి పైగా బైపాస్ సర్జరీ చేయించుకుని ఇలా సిగరెట్లు త్రాగడం చేయకూడని పని?! కానీ తనేం చేయగలడు. లేకపోతే పిచ్చిపట్టుందేమో అనిపిస్తుంది.

సిగరెట్లు త్రాగొద్దని స్వాతి సాధింపు రోజు రోజుకూ ఎక్కువయింది. ఇక ఎందుకులే అని దొంగచాటుగా త్రాగడం మొదలుపెట్టాడు. బాత్‌రూంలోనూ, పుస్తకాల మాటున, ఒక్కోమారు కాలి బూట్‌లలో దాచిపెట్టి ఎవరూ లేనపుడు తనివితీరా కాల్చేవాడు.

ఒకరోజు స్వాతి రూంలోకి వస్తూనే

"సిగరెట్లు మరలా తాగుతున్నారు కదూ!" అంది

"లేదే... ఎవరు చెప్పారు?"

"ఎవరో చెప్పాలా... కాంపౌండు వరకు వస్తోంది వాసన."

"అది... ఇంతకు మునుపు ఎప్పుడో త్రాగిన వాసన అయి వుంటుంది." అన్నాడు తేలిగ్గా ముఖం తప్పించి

"... ఎందుకండీ మమ్మల్నిలా బాధపెడ్తారు... ఉండే మనశ్శాంతి కూడా కరువు చేస్తారు..."

"అదిలేకనే కదా త్రాగుతోంది."

"ఏం వచ్చిందండీ మనకూ... మీరు అనవసరంగా లేనిపోనివి ఊహించుకుని మన శ్శాంతి లేకుండా చేసికుంటున్నారు."

మాట్లాడలేదు. ఎవరూ అర్థం చేసికుంటారు నా బాధ... అని అనుకొన్నాడు మనసులో.

స్వాతి దగ్గరగా వచ్చి

"చూడండీ...! మీ ఆరోగ్యం బ వుంటే జీవితంల కోరుకొనేది ఏదీ లేదు.. అంతకన్నా వేరే ఏ అదృష్టమూ అక్కర్లేదు నాకు. ఇలా సిగరెట్లు త్రాగి మీ ఆరోగ్యం పాడు చేసుకుని నన్ను బాధపెడుతారా... నా మీద ప్రేమ ఏమాత్రం వున్నా మీరు సిగరెట్లు త్రాగడం మానెయ్యాలి." నాకళ్ళలోకి చూస్తూ అంది.

మౌనంగా తలఊపాడు.

నిజం... నాకోసం తను జీవిస్తోంది. మరి తనకోసం నేను ఈ చిన్న కోర్కె తీర్చలేనా...! భార్యాభర్తలు ఒకరి కోసం ఒకరు ఎన్నో త్యాగాలు చేసికోవాల్సిన అవసరం వుంది. త్యాగమా... ఛ... ఛ... దాన్ని త్యాగమనకూడదు... ఎదుటి వారి అభిరుచిని మన్నించడం... అభిప్రాయాన్ని గౌరవించడం... అదే ప్రేమ అవుతుంది. మరి... నాస్వాతి కోసం ఈ ఒక్కటి చేయలేనా...! చేయగలను. అనుకున్నాడు. కానీ చేయలేకపోయాడు.

ఒకరోజు "ఏం ఇంకా హాస్పిటల్‌కి వెళ్ళలేదా... చాలా టైం అయిపోయింది." అన్నాడు డాక్టర్‌శ్రీని స్వాతిని చూస్తూ.

"ఎక్కడండీ... పిల్లల్తో సరిపోతోంది కదా! ఇదిగో అయిపోయింది."

కాసేపటికి మళ్ళీ అడిగాడు

మళ్ళీ. మళ్ళీ అడిగాడు

స్వాతి ఆశ్చర్యపోయింది.

"ఏవిటండీ... అరగంటలో పదిసార్లు అడిగారు... ఎందుకంత ఆతృత పడుతున్నారు నన్ను పంపించాలని..!?"

"ఏం... లే...దు... పేషెంట్లు వెయిట్ చేస్తుంటారేమోనని"

అనుమానంగా చూసింది డాక్టర్‌శ్రీని వైపు.

తడబడుతూ, "ఎందుకు అలా చూస్తావు..." తలదించుకుని అన్నారు స్వాతి కళ్ళల్లోకి నేరుగా చూడలేక.

"మీ వాలకం చూస్తుంటే... నేను వెళ్ళింతర్వాతేదో పెద్ద ప్లానులో వున్నట్లున్నారే..."

"ఛ... ఛ... అదేం లేదు." సర్ది చెప్పబోయాడు.

పనివాళ్ళను పిలిచి ఎదురుగ నిలబెట్టింది. ఎందుకు పిలిచిందో అర్థం కాలేదు డాక్టర్‌శ్రీనికి.

"మేం సుఖంగా వుండాలని మీరంతా కోరుకుంటున్నారా..?" అడిగింది వాళ్ళని.

వాళ్ళకి ఏం అర్థంకాక ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

"చెప్పండి." నిలదీసింది

"మాకెందుకుండదమ్మా! దేముడు మిమ్మల్ని చల్లగా చూడాలని ఎప్పుడూ కోరు కుంటాము. మీలాంటి మంచోళ్ళకి ఏ కష్టమూ రాకూడదు తల్లీ..." అన్నారు.

gudachari.com

"అయితే నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. అయ్యగారిని జాగ్రత్తగా చూసుకోండి. ఆయనకేమైనా జరిగితే ఈ ఇంట్లో ఆయనతో పాటు మరో నాలుగు ప్రాణాలుపోతాయి. గంభీరంగా చెప్పింది."

"అంతమాట అనకండమ్మా! అలాంటిదేవీ జరగదు."

"జరుగుతుంది, మీరంతా అయ్యగారికి భయపడితే." వాళ్ళంతా నోరెళ్ళ బెట్టి స్వాతిని డాక్టర్‌శ్రీనిని చూస్తున్నారు.

"... అయ్యగారు ఎంత బెదిరించినా, కోప్పడినా, బ్రతిమాలినా సిగరెట్లు తెచ్చి ఇచ్చారంటే.. ఆయన్నీ ఆయన్తోపాటు మమ్మల్ని చంపినట్లే... జాగ్రత్త" అని భర్త వైపు తిరిగి

"ఏవండి...!"

తలెత్తలేకపోయాడు.

"ఇటు చూడండి మానలుగురి ముఖాల్లోకి చూడండి. మీ ఒక్కరికే మనశ్శాంతి లేదను కోకండి. మీఆరోగ్యమే మానల్గురి ఆరోగ్యమూనూ... మీ క్షోభ మా నలుగురుదీ.. మీ జీవితమే మా జీవితమూ. మీకేవైనా జరిగితే మీతో పాటు మరో నల్గురు తోడవుతారను కుని తాగండిసిగరెట్లు... మీరొదిలే ఆపొగలు... మమ్మల్ని దహనం చేస్తున్నట్టు, ఊహించు కుని మరీ త్రాగండి, అదే మీకు సంతృప్తినీ.. మనశ్శాంతిని కలిగిస్తుందనుకుంటే." అంటూ పిల్లల్ని తీసికుని చరచరా వెళ్ళిపోయింది.

నిర్ఘాంతపోయి నిలబడిపోయాడు డాక్టర్‌శ్రీని. ఆరోజు నుండి సిగరెట్లు మానేశాడు.

ఇక తన జ్ఞాపకశక్తితో యుద్ధం మొదలైంది. చదవడం.. వ్రాసుకోవడం.. వ్రాసుకున్న దాన్ని మళ్ళీ చదవడం... ఏపనైనా చేయాలన్నా, ఎక్కడికైనా వెళ్ళాలన్నా ముందుగా కాగితం మీద వ్రాసుకుని ప్లాన్ ప్రకారం చేస్తున్నాడు. ఈ విషయం ఈసారి డాక్టర్‌కి చెప్పాలి. అప్పుడే రెండు వారాలైంది తనింటికి వచ్చి. డాక్టర్ రెండు వారాల తర్వాత రమ్మాన్నాడు. డాక్టర్ని ఏఏ ప్రశ్నలు వేయాలి... పూర్తిగా తను పనిచేయొచ్చా? ఏమందులు వాడాలి... ఇవన్నీ పేపర్ మీద వ్రాసుకుని, పదిసార్లు తను అనుకున్న వన్నీ వ్రాసాడా? అని మరీ మరీ చూసుకున్నాడు డాక్టర్‌శ్రీని.

వెళ్ళగానే డాక్టర్ శంకర్, డాక్టర్‌రెడ్డి వాళ్ళ కోసమే ఎదురుచూస్తున్నట్లుంది. పలకరింపులయ్యాకే పరీక్షలన్నీ చేశారు. వాళ్ళ ముఖాల్లో తృప్తి కనిపించింది.

డాక్టర్ శంకర్ నవ్వుతూ, "యూఆర్ దూయింగ్ వెల్. మేం అనుకున్నట్లుగా అంతా సవ్యంగానే వుంది." అన్నాడు.

"అంతా బాగానే వుంది ఒక్కటి తప్ప..."

ఏవిటన్నటు చూశారు



"నా జ్ఞాపకశక్తి రోజు రోజుకీ తగ్గిపోతోంది. చిన్న చిన్న విషయాలు సైతం మరిచి పోతున్నాను."

"ఓహ్... అది అందరికీ వుండేదే... నేనూ చాలాసార్లు చాలా విషయాలు మరచిపోతూ వుంటాను." అదే మంత పెద్ద పట్టించుకోవాల్సిన విషయం కానట్లు అన్నాడు శంకర్.

"అలాకాదు... ఏదో జరిగి వుంటుందని నా అనుమానం."

"ఏం జరిగి వుంటుందని...? పిచ్చి ఆలోచనల్లు పెట్టుకోకు. ఆపరేషన్ అయిన తర్వాత కొంతకాలం అలా వుండొచ్చు. తర్వాత సర్దుకుటుంది."

"అలాగే నేనూ అనుకున్నాను కానీ రోజు రోజుకీ పెరుగుతొందే గానీ తగ్గడం లేదు."

"మరచిపోవడం అంటే...?"

"... అంటే టెలిఫోన్ నంబర్లు సగం చేసిన తర్వాత మిగిలినవి గుర్తుండవు. అవికూడా చేశానా అని అనుమానం. పెద్ద విషయాలు గుర్తుంటాయి. నేనేం చేస్తున్నానో తెలుస్తుంది. అయిం తర్వాత మరచిపోతాను." సరిగ్గా చెప్పలేకపోయాడు. తన బాధను వాళ్ళు అర్థం చేసుకోవడం లేదనిపించింది డాక్టర్‌శ్రీనికి.

"అది మామూలే... నాకూ మా ఇంటి టెలిఫోన్ నెంబరు కూడా ఒక్కోసారి గుర్తుండదు. మరోసారి నాపేరే గుర్తుండదు. రోజూ మనతో ఉన్నవాళ్ళ పేర్లు కూడా మరచిపోతుంటాం." వాళ్ళకి అర్థం అయ్యేటట్లు "ఒకేసారి రెండుపనులు... అంటే కాఫీ త్రాగు తున్నాననుకోండి, ఫోన్ మ్రోగితే ఏపని ముందు చేయాలి... ఏది చేయకూడదు.. అనే సందిగ్ధంలో పడిపోతాను." చెప్పాలని ప్రయత్నించాడు.

"అదీ ఏమంత ప్రత్యేకమైన అంశం కాదు." నవ్వుతూ అన్నాడు శంకర్.

లేదు, లేదు, వీళ్ళు తనను పూర్తిగా తీసిపారేస్తున్నారు. మళ్ళీ చెప్పాడు; "ఎక్కువ శబ్దం విన్నా... ఇద్దరు ముగ్గురు గట్టిగా మాట్లాడుతున్నా తల తిరిగినట్లు అయిపోతుంది. వణుకు వస్తుంది."

డాక్టర్ రెడ్డి నవ్వుతూ శంకర్ వైపు చూసి దగ్గరకు వచ్చి భుజం తడుతూ, "మైడియర్ యంగ్‌మాన్... ఇవన్నీ కొంతకాలం వుంటాయి. సైకలాజికల్ ఫీలింగ్ ఇది. వీటిని గురించి భయపడాల్సిన అవసరం లేదు. నువ్వు మరో జన్మ ఎత్తినవాడివి. ఇవి చాలా సింపిల్... వీటిని గురించి మరచిపో... విష్ యు బెస్ట్ ఆఫ్ లక్." అన్నారు డాక్టర్‌శ్రీనితో.

తన బాధ తనలోనే మిగిలిపోయింది.

వాళ్ళు తన మాటల్ని చాలా తేలిగ్గా తీసికున్నందుకు బాధగా వుంది. ఏదో జరిగింది. తన జ్ఞాపకశక్తి విషయంలో ఏదో జరిగింది... ఒకవేళ ఆపరేషన్ సమయంలో తన మెదడుకు చాలినంత రక్తం అందలేదా! ఆ కారణంగా మెదడులో కొంతభాగం



gudachari.com

దెబ్బతినిందా!! మెదడులో కొన్ని వేల రక్తనాళాలు వుంటాయి. ఆ నాళాలేవైనా రక్తం గడ్డకట్టుకుపోయి మూసుకుపోయాయా! ఒకవేళ అలా జరిగినా మిగతా నాళాలు తిరిగి ఆప్రదేశానికి మరో రకంగా రక్తం అందించే అవకాశం వుంది. మరి... ఏం జరిగి వుంటుంది.?! ఏదో జరిగింది...?! యిదే ఆలోచనలతో యింటికి తిరిగివచ్చేశాడు.

దిగులుగా వుంది... డాక్టర్‌శ్రీనికి.

“ఏమండీ... ఎందుకలా వుంటున్నారు...? ఇదేమంత పెద్ద విషయం కాదు, ఎక్కువ ఆలోచించకండి.” డాక్టర్‌శ్రీనిని.

స్వాతి కళ్ళలోకి చూశాడు. ఆ కళ్ళల్లో పూర్తి విశ్వాసం కనిపించింది. నిజమే... ఇదేమంత పెద్ద విషయం కాదు. అని సర్దిచెప్పుకోబోయాడు. అయినా.. ఏదో వెలితి.

“పోనీ చెప్పండి మీకెలా వుంటోంది అసలు...?” అంది స్వాతి. వెంటనే చెప్పలేకపోయాడు.

చాలా సేపు ఆలోచించాడు ఎలా వుంటుందని...??!!

ఎలా వుంటుందని చెప్పను, “నాఆలోచన్లకి ఏదో తెర కమ్మేసినట్లు వుంటుంది ఆసమయంలో, అంటే తల తిరిగినట్లుగా కాదు. అంతా పొగమయమైనట్లు నేనందులో గిర్రున తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఆక్షణంలో విపరీతమైన భయం ఆవరిస్తుంది.. కొంతకాలం పోతే నన్ను నేనే మరచిపోతానేమో అనిపిస్తుంది.. నేనెవరో నాకే గుర్తులేకుండా పోతుందేమో అని భయం..” ఆమె ఒడిలో తలదూర్చి ఏడ్చేశాడు

అనునయిస్తూ “పోనీ... ఒకమారు సైకాలజిస్టుని కలిస్తే.” అంది

చివ్వున తలెత్తి, “నువ్వుకూడా ఇది సైకలాజికల్ అనుకుంటున్నావా? నాకు పిచ్చి పట్టేటట్లు ఉంది. పిచ్చివాడ్నయిపోతాను.” అన్నాడు.

డాక్టర్‌శ్రీని ముఖంలోని కన్నీరు చూసి అతని ముఖాన్ని హృదయానికి హత్తుకుని ముద్దులు కురిపిస్తూ, “అంతమాట అనకండి. మిమ్మల్ని ఓదార్చే శక్తి లేదు నాకు. సైకాలజిస్ట్ అయితే మీరు చెప్పిన వన్నీ శ్రద్ధగా విని మీ బాధ అర్థంచేసికోగలడుకదాని! అప్పుడు మీకు మనశ్శాంతి కల్గుతుందేమో!” అంది.

డాక్టర్‌శ్రీనికి ఇది మంచి ఆలోచనే అనిపించింది.

కొంతవరకూ వినేవాళ్ళెవరితోనయినా తన బాధ చెప్పుకుంటే మనసు కుదుట పడ్తుందేమో!

తనకు తెలుసు ఆ డాక్టరిద్దరూ తేలిగ్గా సైకలాజికల్ అని తప్పించుకున్నారు. ఎందుకంటే తన మెదడులో ఏదో లోపం అనే నిజం వాళ్ళకులేదు. దాన్ని భరించలేరు.

ఎవరైనా న్యూరాలజిస్ట్‌ని కూడా కలిస్తే బావుంటుందనిపించింది.



సైకియాట్రిస్ట్‌ని కలిశారు.

అంతావిన్నాడు ఎంతో ఓపిగ్గా. ఆయనకూడా డాక్టర్‌శ్రీని అభిప్రాయంతో ఏకీభవించాడు.

“కొన్ని సమయాల్లో హార్ట్ ఆపరేషన్ తర్వాత ఇలాటివి సహజం. కొన్ని రోజులు లేదా నెలలు వుండొచ్చు. ఆ తర్వాత మామూలుగావచ్చు. అలాగని ఇది కేవలం సైకలాజికల్ అనలేము. నీ మెదడులో కూడా ఏదైనా చిన్నమార్పు జరిగి వుండొచ్చు. న్యూరాలజిస్ట్‌ని చూడ్డం మంచిదే. అయితే దీన్నే.. నీవు ఆలోచిస్తుకూర్చుని మిగిలిన విషయాలు మరచిపోకు. నీకున్న మతిమరపు సంగతి మరచిపో. ఇది నీకు చిన్నప్పట్నించీ వున్నదనుకో. దీని వల్ల ప్రస్తుతం ప్రమాదం ఏమీ లేదు.”

... ఎలా అనుకోమంటాడునన్ను ఇది పుట్టుక నుంచీ వచ్చిందని..? నవ్వుకున్నాడు. నేనీరోజు నుంచీ ఆలోచించడం మానేస్తున్నాను.. అన్నీ శ్రీమతే చూసుకుంటుంది అని మనసును సమాధాన పరుచుకున్నా తృప్తి కలగలేదు డాక్టర్‌శ్రీనికి. ఈఆలోచనలతో మానసికంగా చాలా అలసిపోయాడు. పైగా రోజురోజుకి ఎక్కువ మతిమరుపు.. వీటితో సతమతమయిపోయాడు.

“డాక్టర్ స్వాతీ! ఒక విషయం, అతను మానసికంగా బాగా కృంగిపోయి వున్నాడు. ఇదిలాగే కొనసాగితే జీవితం మీదే విరక్తి కలగొచ్చు, అందుకే ఇతని ఇష్టప్రకారం న్యూరాలజిస్ట్‌ని కలవడం మంచిది.” అన్నాడు డాక్టర్‌శ్రీని లేనప్పుడు సైకియాట్రిస్టు.

నిజం... ఆయన్ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఎంత అందంగా... చలాకీగా... నవ్వుతూ, నవ్విస్తూ వుండేవాడు...?! ఇప్పుడు... ఎక్కడలేని దిగుల్తో తల వేలాడేసి కళ్ళలో దైన్యాన్ని నింపుకుని, పెరిగిన గడ్డం పీల్చుకుపోయిన కళ్ళు... మాసిన బట్టలే మళ్ళీ మళ్ళీ వేసి కుంటూ... శూన్యంలోకి చూస్తూ... రోజులంతా నిస్పృహతో గడిపేస్తున్నాడు అని చాలా బాధపడింది స్వాతి.

మనసు ద్రవించిపోతుంది అతన్ని తలచుకుంటే, అతని ఆరోగ్యం దిన దినానికీ దిగ జారిపోతుంటే స్వాతి మానసికంగా తట్టుకోలేకపోతుంది. కానీ... తనూ కృంగిపోతే... భయపడ్తే జీవితం ఎలా...?! పిల్లలూ...?! హాస్పిటలూ..?! యిదే ఆలోచనలు స్వాతికి.

ఒకవైపు విసుగు, విరక్తి ఇవన్నీ తలచుకుంటే. తన బాధ ఎవ్వరికీ తెలీకుండా ధైర్యంగా వుండాలి తను. “అయితే ఎంతకాలం ఇలా నటించగలను... ఏదో ఒకరోజు బయటపడిపోతుందేమోనని భయం! నావారి కోసం నాప్రేమ మూర్తికోసం ఎన్ని కష్టాలైనా ఎదుర్కోవాలి... అంతటి శక్తిని నేను సమకూర్చుకోవాలి...” అని దృఢంగా నిశ్చయించుకుంది స్వాతి. భయం వ్యాధికంటే మందులే లేని జబ్బు, మానసిక ధైర్యం ఉంటే జబ్బును అతి తక్కువ మందులతో నయం చేస్తుంది.

అయినా కొన్ని కొన్ని సమయాల్లో స్వాతి సహనం సన్నగిల్లిపోయేది.



gudachari.com

ఒకరోజు భోజనాల దగ్గర కూర్చుని అన్నం తినకుండా కెలుకుతూ వున్నాడు. ఆయనే తింటారు లెమ్మని చూస్తుంది స్వాతి. తినే సూచనలెంతకీ కన్పించలేదు.

"ఎంతసేపూ అలా చూస్తూ కూర్చుంటారేమండీ... భోంచేయక."

"వద్దు నాకేమీ ఇష్టపడడం లేదు." అంటూ లేచారు.

స్వాతికి కోపం వచ్చింది.

"ఇక్కడ ఎవరికి ఇష్టం వుండి భోం చేస్తున్నారు...? మమ్మల్నెందుకండీ ఈవిధంగా కష్టపెడతారు... ఉన్నది చాలక, ఇప్పుడేమైందని.... మీకు జ్ఞాపక శక్తి కాస్త తగ్గింది అంతేకదా. దానికే ఏం కొంపలు ముంచుకుపోయాయని. ఏం మేమందరం లేమా... మీకోసం..." వస్తున్న ఏడుపు ఆపుకుంటూ గట్టిగా అంది.

స్వాతి వైపు ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

ఆ చూపుల్లో కోపం లేదు, బాధ... తన అశక్తత మీద జాలి. ఆ భావం స్వాతిని కాల్చేసింది. అథఃపాతాళానికి కుంచించుకుపోతున్న భావన... సిగ్గుపడింది తన ప్రవర్తనకు.

కళ్ళుతుడుచుకుంటూ అంది, "నన్ను క్షమించండి... మిమ్మల్ని బాధ పెట్టాలని అనలేదు."

వెంటనే ఆమె బాధను గ్రహించగలిగాడు.

తను మళ్ళీ భోజనం దగ్గర కూర్చుంటూ "ఓ... స్వీటీ... నేను నిన్ను అర్థం చేసికో గలను." స్వాతి కూర్చోలేక పోయింది. పరుగున వెళ్ళి అతన్ని కౌగలించుకుని, "నన్ను క్షమించండి... నేను మీ పరిస్థితి అర్థం చేసుకోకుండా మాట్లాడాను... ఇంకెప్పుడూ అలా ప్రవర్తించనండీ." అని క్షమాపణ చెప్పుకుంది.

స్వాతి తల నిమురుతూ, "ఓ... డార్లింగ్ ఇదేమంత తప్పని క్షమించడానికి... నేను భోం చేయకపోతే నీకు బాధనే సంగతే మరచిపోయాను. లే... లేచి భోంచేయి.. నాకుపెట్టు" బుజ్జగిస్తూ అన్నాడు. ఎందుకు అలా ప్రవర్తించానా అని కుమిలిపోతూనే వుంది. భోజనం తినబుద్దెయ్యి లేదు స్వాతికి.

ఒకరోజు స్వాతి వచ్చేసరికి పిల్లల్తో ఆడుకుంటున్నాడు. తను రాగానే విష్ణు, "మమ్మీ... డాడీకి ఎక్కాలు నేర్పిస్తున్నాను." అన్నాడు.

డాక్టర్‌శ్రీని స్వాతి వైపు చూసి నవ్వి మళ్ళీ దీపు పలక మీద ఏదో వ్రాస్తే దానిలో మునిగిపోయాడు.

స్వాతి దగ్గరకు వెళ్ళి చూసింది. దీపు వాళ్ళడాడీ చేయి పట్టుకుని బలపంతో అక్షరాలు దిద్దిస్తూ వుంది. అతని ముఖంలో ఆనందం తొంగి చూస్తోంది. కళ్ళలో నీటితడి, అతని స్థితికి జాలివేసింది స్వాతికి తలనిమురుతూ అంది "డాడీని మీతోపాటు స్కూలుకి తీసికెళ్ళండి. ఇంట్లో వుంటే ఊరికే ఆలోచిస్తూ వుంటారు."



"చూడు మమ్మీ... డాడీకి సింపిల్ వర్డ్సుకి కూడా స్పెల్లింగ్స్ రావు." అంది దీపు తను డాడీ కన్న గొప్ప అనే వుద్దేశ్యంతో.

"వీళ్ళు స్కూలు నుంచి వచ్చింది మొదలు నాకు ట్యూషన్ ప్రారంభించారు. ఒక్క టీచరైతే ఫరవాలేదు. ముగ్గురు టీచర్లతో వేగలేక ఛస్తున్నాను. బిందు ఏమో కథ చెప్పి, తిరిగి నన్ను చెప్పమంటుంది. దీపు స్పెల్లింగ్స్ వ్రాయమంటుంది. ఈ విష్ణుగాడేమో ఎక్కాలు చెప్పమంటాడు." ఆమాటలంటున్నపుడు అతని కళ్ళలో నిలచి వున్న నీళ్ళు జల జలా రాలాయి.

ఉద్వేగంతో అందర్నీ దగ్గరకి తీసికుంటూ

"మై డార్లింగ్స్.. మైలవ్... ఐవిల్ లివ్ ఫార్ యువర్ సేక్... లక్కీయస్ట్‌మాన్. మనిషికి ఇంతగా ప్రేమించే వ్యక్తులుంటే వేరే ఏం కావాలి... మీ కోసం, మనకోసం నేను బాగవుతాను," అంటూ సంతోషంగా అన్నాడు.

ఇలా కాసేపు సంతోషంతో మరికాసేపు నిస్పృహతో రోజులు గడుస్తున్నాయి నెమ్మదిగా.

ఒకరోజు స్వాతి హాస్పిటల్ నుంచి వచ్చేసరికి డాక్టర్ శ్రీని బయట వరండాలో నిల్చుని వున్నారు. ముఖం కందిపోయి ఎర్రబారి వుంది. కళ్ళు కూడా ఎర్రగా వున్నాయి. చేయి పట్టుకుని చూస్తే కాలిపోతోంది.

"జ్వరం వచ్చినట్లుంది మీకు." ఆతృతతో అంది స్వాతి.

"ఏం లేదు కాసేపు ఎండలో వున్నాను. అందుకని వేడిగ వుంది." అన్నాడు.

టెంపరేచర్ చూస్తే 102 డిగ్రీలుంది. స్వాతి గుండెల్లో రైళ్ళు పరుగెత్తసాగాయి. వెంటనే డాక్టర్‌రెడ్డికి మద్రాస్‌కి ఫోన్ చేసింది.

వెంటనే రమ్మన్నారు.

ఊపిరితిత్తుల్లో కొద్దిగా మళ్ళీ నీరు చేరిందట, కొద్దిగా (హార్ట్ ఫెయిల్యూర్) గుండె పెరిగిందట, మరి జ్వరం..?!

దీనిమీద భిన్నభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆపరేషన్ చేసింతర్వాత ఐ.వి. పెట్టినపుడు చేతిమీద ఏర్పడిన గాయం ద్వారా ఏదైనా బాక్టీరియా ప్రవేశించి వుండొచ్చని ఒకరు.

బహుశా పోస్టు వెరికార్డియాటమీ సిన్‌డ్రోమ్ అయి వుండొచ్చని మరొకరూ అన్నారు.

అంటే...?!

"నిజంగా ఈ కేసు అదని చెప్పలేము. ఎందుకంటే ఆజబ్బు అయితే జ్వరం, ఊపిరితిత్తుల్లో నెమ్ముతోపాటు గుండెనెప్పి రావాలి. అయితే ఇతనికి గుండెనొప్పి లేదు. అయినా లక్షణాలు దీనికి దగ్గరగా వున్నాయి."

"ఆ జబ్బు ఎందువల్ల వస్తుంది?" ప్రశ్నించింది స్వాతి.



gudachari.com

"కారణం సరిగా తెలియదు. ఆపరేషన్ చేసింతర్వాత గుండెలో చేసిన గాయం మానేపుడు శరీరంలో కొన్ని యాంటీబాడీస్ వుంటాయి. వీటికి విషక్రిములనెదిరించే శక్తి వుంటుంది. ఈ రెండింటి సంఘర్షణలో ఆ గాయం మానుతుంది. మామూలుగా మన శరీరం మీద ఏదైనా గాయం అయి మానితే మచ్చలాగా మందంగా ఏర్పడుతుంది. అలాగే గుండె గాయం కూడా తయారయి గుండె చుట్టూ వుండే పెరికార్డియమ్ అనే పొరకు వ్రాసుకుంటుంది. ఆసమయంలో రాసుకున్న శబ్దం వస్తుంది. గుండె నొప్పి కూడా వస్తుంది. స్కెతస్కోప్ పెట్టి వింటే ఆ శబ్దం స్పష్టంగా వినిపిస్తుంది."

"ఇప్పుడు అలాంటి శబ్దం వినిపిస్తోందా,?"

"లేదు."

"మీరిప్పుడు ఏ లైన్‌లో (ట్రీట్) చేస్తారు?!"

"ఏముందీ.. హార్ట్ ఫెయిల్యూర్‌కి డిగాక్సిన్ (గుండె క్రమపద్ధతిలో ఆడనప్పుడు ఇచ్చేమందు), డైయూరిటిక్స్ (ఊపిరితిత్తుల్లోని నీరు తాగేసేందుకు), యాస్పిరిన్ (జ్వరం, నొప్పి తగ్గేందుకు) వాడితే సరిపోతుంది."

"వాటికీ తగ్గకపోతే" అంది స్వాతి.

చాలాసేపు ఆలోచించి అన్నాడు,"విధిలేని పరిస్థితిలో కార్టిజోన్... (దీన్ని చాలా జాగ్రత్తగా వాడాలి. అత్యవసర పరిస్థితిల్లో ఎంత మంచి పని చేస్తుందో, వాడకూడని సమయాల్లో వాడితే అంత చెడ్డ చేస్తుంది)."

...విసుగు, కోపం వొక్కమారే వొచ్చాయి స్వాతికి. ఏం మందులో... ఏం డాక్టర్లో... నని.

"ఒక సంవత్సరం లోపల అంత పెద్ద ఆపరేషన్ చేసికుని, మరలా ఈ జబ్బు...?" అంది కోపాన్ని అణచుకుంటూ.

"డాక్టరు అయివుండీ అలా మాట్లాడు తారేమిటి... ఆపరేషన్ చేసింది ఆయన్ని బ్రతికించడానికి, మరలా ఇలాటివి రావని గ్యారంటీ ఇవ్వడానికి కాదు."

...నిజమే! ఒక జబ్బును బాగుచేస్తే మరొకటి రాదని ఏముందీ... ఆపరేషన్ చేయకపోతే ఎప్పుడో చనిపోయివుండేవాడనిపించింది స్వాతికి.

రక్త పరీక్షలూ అవీ చేశారు.

జ్వరానికి కారణం తెలియలేదు. అలాగే జ్వరమూ మరుసటిరోజుకి తగ్గిపోయింది.

వారం రోజుల హాస్పిటల్ తర్వాత మళ్ళీ బయట పడ్డారు. డాక్టర్‌శ్రీని చాలా బల హీనంగా ఉన్నట్లనిపించింది. మరీ నీరుడు మాత్రలు వాడ్డం వల్లనేమో సాయంకాలానికి లేవలేకపోతున్నాడు... కానీ ఏం చేయను...?! ఎటూ తోచలేదు స్వాతికి.



ఈ నీరుడు ఇంజెక్షన్ ఇచ్చే ఆపరేషన్ అయిన తర్వాత ప్రాణం పోయి మళ్ళీ బ్రతికి బయట పడ్డారు. కానీ ఇప్పుడంత ప్రమాదం చేయడం లేదు. అలవాటయిపోయింది.

ఈసారి హాస్పిటల్లో వున్నప్పుడు డాక్టర్‌శ్రీని అడిగాడు.

"ఇక్కడున్నపుడే న్యూరాలజిస్ట్‌ని చూడాలి" అని.

వాళ్ళు నవ్వి ఊరుకున్నారు.

ఎందుకైనా మంచిదని రెండు రోజులు సిటీలోనే వుండి, చూసుకుని పోతే బావుంటుందని నిర్ధారించుకున్నారు.

రెండో రోజు రాత్రి భూకంపం వచ్చినట్లు బెడ్ కదుల్తొంటే అదిరిపోయి లేచింది స్వాతి. డాక్టర్‌శ్రీని మెలికలు తిరిగిపోతున్నాడు. ఎగిరెగిరి పడుతున్నాడు. తనకేం చేయాలో తోచలేదు. గట్టిగా అదిమి పట్టుకుని, "ఏవండి... ఏమయ్యిందండీ" అంది. అతనిని పట్టుకోవడమూ తన వల్ల కావడం లేదు.

"చలి... చ.. లి..." ఎంతో శ్రమతో చెప్పారీ మాటలు. శరీరం కాలిపోతోంది. అయినా చలికి విపరీతంగా వణికిపోతున్నాడు. టెంపరేచర్ చూస్తే 105 డిగ్రీలుంది. స్వాతికి గుండె పగిలిపోతుందేమో అనిపించింది.

హాస్పిటల్‌కి ఫోన్ చేసి డాక్టర్ రెడ్డిగాని, శంకర్ చౌదరి గాని కావాలని అడిగింది.

ఇద్దరూ లేరు వేరే డాక్టరున్నారట. అతనూ వార్డులో పేషెంటును చూస్తూన్నారని చెప్పారు.

ఆయన్తో వెంటనే మాట్లాడాలంది.

అంత అర్జంటా...?

పదినిమిషాలకు లైన్‌లోకి వచ్చారు.

విషయం చెప్పింది. ఫోన్‌లోనే గత చరిత్రంతా అడగడం మొదలెట్టాడు. ఆపరేషన్ ఎప్పుడు చేసింది. ఎవరు చేసింది. జ్వరమెప్పుడు వచ్చింది.. ఇవన్నీ..

స్వాతికి వొళ్ళు మండి పోయింది.

"ఇప్పుడు సమస్య అదికాదు. నూటఅయిదు డిగ్రీల జ్వరం."

"అయితే వెంటనే హాస్పిటల్‌కి తీసుకురండి."

"హాస్పిటల్‌కా ఇంతరాత్రిపూట!" ఎందుకు వేసిందో ఆ ప్రశ్న.

సంభాషణంతా వింటున్న డాక్టర్‌శ్రీని, "నేను రాలేను... నావల్లకాదు... ఇక్కడే వుంటాను" అన్నాడు వణికిపోతూ.

"పేషెంటుకు హాస్పిటల్‌కి రావడం ఇష్టం లేదట."

"అయితే నన్నేం చేయమంటారు... ఏదో వొక మాత్రవేసి ఉదయం తీసుకురండి." అని ఫోన్ పెట్టేశాడు.



gudachari.com

డాక్టర్‌శ్రీని వైపు చూసింది. చలికి ఇంకా వణికి పోతున్నాడు. ఉన్న దుప్పట్లన్నీ తీసి కప్పేసింది. అయినా తగ్గలేదు. తనవైపు చూసే చూపుల్లో వేడికోలు వ్యక్తమవుతోంది. చలి తగ్గించమనో... బ్రతికించమనో... స్వాతి మనసు ద్రవించిపోయింది.

ఏం చెయ్యాలో తోచలేదు. మళ్ళీ హాస్పిటల్‌కి ఫోను చేసింది. నో రెస్పాన్సు.

జ్వరానికి మాత్రవేసి గట్టిగా అదిమి పట్టుకుని పడుకుంది. ఏదేదో మాట్లాడ్తూనే వున్నాడు. ఎప్పుడో వేకువజాముకి చలి తగ్గి నిదురపోయాడు. స్వాతి మాత్రం తెల్లవార్లు జాగారం చేసింది.

స్వాతికి వేరే ఏ ఆలోచనలేదు. ఉదయం వరకూ భర్తనెలా బ్రతికించాలా అని తప్ప. తర్వాత గుర్తొచ్చింది రాత్రి ఎంత పొరపాటు పని చేసిందోతను. ఒకవేళ పేషెంటు రానన్నాడని ఆస్థితిలో వున్న అతన్ని హాస్పిటల్‌కి తీసుకుపోక పోవడమేనా! ఆమాట ఆ డాక్టర్‌తో చెప్పడమేనా! చెప్పినా... ఆ డాక్టర్ కూడా మీ ఇష్టం... ఉదయం తీసుకురండని చెప్పొచ్చా... ఏవైనా జరిగివుంటే... ఎంత పొరపాటు...?! అనిపించి భయంతో కంపించిపోయింది స్వాతి.

ఉదయం హాస్పిటల్‌కి వెళ్ళగానే డాక్టర్లంతా మూకుమ్మడిగా ఆయన చుట్టూ చేరిపోయారు.

ఒక్కోక్కరూ ఒక్కో అభిప్రాయం... ఒకరి అభిప్రాయానికి మరొకరి అభిప్రాయానికి పొంతన లేదు. అన్ని రకాల పరీక్షలూ చేయడం ప్రారంభించారు. రక్తాన్ని కల్చర్‌కి పంపించారు. అంటే రక్తంలో ఉన్న బాక్టీరియాను తెలిసికొనేందుకు రక్తాన్ని పెట్రీడిష్ అనే ప్లాస్టిక్ గిన్నెలో చల్లి కొంతకాలం వుంచితే, పెట్రీడిష్‌లో వుండే పదార్థం (కల్చర్ మీడియా)లో బాక్టీరియా పెరుగుతుంది. ఇందులో కూడా ఒక్కోరకమైన బాక్టీరియాకు ఒక్కో పద్ధతి ఉంటుంది.

అనరోబిక్, ఎరోబిక్ అని బాక్టీరియాలు రెండురకాలుంటాయి. అనరోబిక్ అంటే ఆక్సిజన్ లేకుండా పెరిగేది. ఎరోబిక్ అంటే ఆక్సిజన్‌తో పెరిగేవి. ఇటువంటి కల్చర్‌లు ఎన్ని వున్నాయో అన్నీ చేశారు.

ఎక్స్‌రే తీశారు. ఊపిరితిత్తులు స్క్రీనింగ్ చేశారు. మూత్రపిండాల్లో ఏవైనా జబ్బేమో అని ఇన్ట్రావీనస్ పైలోగ్రఫీ పరీక్ష (శరీరంలోని వీను ద్వారా ఒకరకమైన రంగు పదార్థం పంపి వాటిని ఎక్సురేలు తేయడం) చేశారు. లివర్‌ని పరీక్ష చేశారు. తలలో ఏమైనా వుంటుందేమో అని పరీక్ష చేశారు. కళ్ళు చెక్ చేశారు. పొట్టలో చూశారు.

శరీరంలో ఎన్ని అవయవాలుంటాయో అన్ని సోధించి పారేశారు. జవాబు దొరకలేదు.

మలేరియా స్పెషలిస్ట్ వచ్చి కొన్ని పరీక్షలు చేయమని చెప్తే, ఊపిరితిత్తుల స్పెషలిస్ట్ ఇంకోటి చెప్పారు. చెవి, ముక్కు గొంతు స్పెషలిస్టు మరేదో పరీక్ష చేయమంటారు... మొత్తానికి అందరూ అన్ని పరీక్షలూ చేశారు. ఏమీ మిగల్లేదు. ఏమీ తేలలేదు.



వాళ్ళనుకున్నది ఏదీ డాక్టర్‌శ్రీనిలో లేదు.

అయితే జ్వరం ఎందుకు వస్తున్నట్లు..??!!

అంతు దొరకని ప్రశ్న.

తర్వాత రోజు డాక్టర్ శంకర్ చౌదరి వచ్చి

"నా ఉద్దేశ్యం ఇది సబ్ అక్యూట్ బాక్టీరియల్ ఎన్‌డోకార్డయిటిస్" అని.

"అలా అని ఎందుకనుకుంటున్నారు?" డాక్టర్‌శ్రీని ప్రశ్న.

"ఎందుకంటే.. దేనిలోనూ పాజిటివ్ రిజల్ట్స్ రాలేదు. అన్నీ నార్మల్‌గా వున్నాయి మరి జ్వరం వస్తూనే వుంది." కొంచెం తడబాటుతో అన్నాడు.

"అందుకని... నన్ను ఆ జబ్బు మనిషి క్రింద లెక్కకట్టేయడమేనా... ఇక ఎప్పుడైనా జ్వరం వస్తే ఇదీ ఆ కేసే పెన్సిలిన్ ఇవ్వండి అంటారా ఆలోచించకుండా...? మీకు శ్రమ తప్పిపోతుందనా... మరి, నా కల్చరల్ రిపోర్ట్స్ ఏమైనాయి?"

"అన్నీ నార్మల్!"

"మరి నీ అభిప్రాయం ప్రకారం ఆ జబ్బు కుండాల్సిన పెటికే (చేతి గోళ్ళ క్రింద, కంటిపొర క్రింద, కంటిలోపల, ఒక్కోమారు నోట్లో రక్తం చిన్న చిన్న మచ్చలుగా ఏర్పడడం) నాకు వుందా?"

"లేదు."

"జ్వరం కూడా ఎక్కడం, తగ్గడం లేదు కదా?!"

"లేదు."

"మరి అదే అని చెప్పడానికి ఏ ఆధారము లేదు."

"వేరే మరో జబ్బునీ చెప్పడానికి ఆధారాలు లేవు..." "ఆల్‌రైట్. ట్రీట్‌మి యాజ్ యూ లైక్, యు ఆర్ మై డాక్టర్." అని విసుగుతో మౌనంగా ప్రక్కకు తిరిగి పడుకున్నాడు డాక్టర్‌శ్రీని.

స్వాతికి అయోమయంగా వుంది.

ఏవిటీ... వింత జబ్బు...?! స్వాతి కేం తోచడం లేదు.

ఆఖరికీ అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. ఇది ఏ జబ్బైనా కావచ్చు. కానీ జ్వరం తగ్గేందుకు మాత్రమే మందులు వాడి కొంతకాలం చూద్దాం అని.

ఒక డాక్టర్ కాబట్టి ఇంతమంది మేధావుల్ని ప్రశ్నించగలిగేడు. అదే ఒక సామాన్య మానవుడైతే... ఏమై వుండేది అతని గతి...! ఇచ్చిన మందు మింగి కిక్కురుమనకుండా నోరు మూసుకు పడివుండాల్సిందేకదా! తగ్గకపోతే మరో మందు, అదీ పనిచేయకపోతే మరోటి. ఇలా మందులు వాడి వాడి విసుగుపుట్టి వాడ్డం మానేయడమో, లేదా వ్రాసి

gudachari.com

వ్రాసి విసుగుపుట్టి డాక్టర్లు వ్రాయడం మానుకుని, పేషెంటును అతని గ్రహపాటు అని వదలేయడమో జరిగి వుండేది.

ఇటువంటి విషమ పరిస్థితులు సంభవించినపుడు అనిపిస్తుంది డాక్టర్లకు తాము చదివిన చదువు, అనుభవమూ కొట్టుకుపోయినట్లు, ఇక్కడున్న వారంతా వాళ్ళవాళ్ళ డిపార్ట్‌మెంట్‌లలో అజేయులు. అయినా ఏమీ చేయలేకపోతున్నారు. అదే కొంచెం సున్నితమైన డాక్టర్లయితే ఇలాటి వోటమికి నలగిపోతారు మానసికంగా.

అదే మామూలు పేషెంటైతే వాతావరణం అలా వుండేది కాదు. వాళ్ళిద్దరూ డాక్టర్లు అయినందున వాళ్ళ ముఖాల్లోకి చూడ్డానికి అవమానంగా ఫీలవుతున్నారు. వాళ్ళ బాధను చూస్తే వీళ్ళకూ ఇబ్బందిగానే వుంది. ఇటువంటి సమయాల్లో డాక్టర్లు కర్మ సిద్ధాంతం వైపు మళ్ళుతారు.

డాక్టర్ శంకర్ పోస్ట్ వెరికార్డియామీ సిన్‌డ్రోమ్ అనే స్థిర నిర్ణయానికి వొచ్చేశాడు చివరకి. స్వాతి కూడా అదే అనుకుంది. అనుకోవాలి. కొంచెం దగ్గరగా ఆజబ్బు లక్షణాలు మాత్రమే ఉన్నాయి.

మామూలుగా పెద్ద హాస్పిటళ్ళలో రోగ నిర్ధారణ కాకుండా ఏ మందంటే ఆ మందు వాడరు. అయితే ఇతర చోట్ల అన్ని అందుబాటులో వుండవు గనుక తప్పదు.

ఎన్ని పరీక్షలు చేసినా జబ్బేమిటో అంతుపట్టక పోతే ఆ డాక్టర్ పరిస్థితి చాలా ఘోరంగా వుంటుంది. అసలు డాక్టర్ల జీవితాలు చాలా మంది అనుకొనేట్లు పూలపాన్పులు కావు. అందరూ అనుకునేట్లు డబ్బు బాగానే సంపాదించవచ్చు. అయితే డబ్బు సుఖాన్నిస్తుందే కానీ మనశ్శాంతి నివ్వదు. ధనదృష్టే ప్రధానంగా గల్గిన డాక్టర్లు అనేకులు వాళ్ళ జీవితంలో సున్నితమైన మధుర క్షణాలెన్నో పోగొట్టుకుంటారు.

డాక్టర్‌శ్రీని శారీరకంగా బాగా క్షీణించి పోయారు. లేచి నడవడమే కష్టంగా వుంది ఏదైనా పట్టుకునో, ఎవర్నైనా ఆధారంగా తీసికునో నిలబడాల్సి వస్తోంది. డాక్టరు శ్రీని రెండు, మూడు పర్యాయాలు స్వాతితో అన్నాడు. లైన్ ఆఫ్ ట్రీట్‌మెంట్ మారిస్తే బాగుండునని. స్వాతికి కూడా అదే అభిప్రాయం ఉంది. అయినా ఎందుకో మొహమాటం.

కొద్దిరోజులయిన తరువాత యింటికి తిరిగి వచ్చేశారు.

ఇంటికొచ్చిన తర్వాత కూడా ఎక్కువగా కాకపోయినా జ్వరం కొద్దిగా వుంటూనే వుంది. మాటలు కూడా తడ బడుతున్నాయి. వీటికి తోడు మతిమరుపు.

వాళ్ళ ఆర్థిక పరిస్థితి చాలా దెబ్బతినింది. స్వాతి ఆలోచనలో పడింది.

ఇప్పుడు తెలుస్తోంది తను పేషెంట్లు వ్రాసిన మందులు తెచ్చుకోకపోతే కోప్పడేది. అయితే ఏ పరిస్థితుల్లో వాళ్ళు మందులు కొనలేకపోయేవారో ఆలోచిస్తే పశ్చాత్తాపంతో బాధపడక తప్పదు. మందుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవు. ఏ పది



రోజులో మందులు వాడాలంటే అప్పుచేయక తప్పదు. అదే వారాలు తరబడి, నెలల తరబడి అయితే వున్నవన్నీ అమ్ముకోవాల్సిందే. ఉన్నవాళ్ళుమాత్రమే నేడు మందులు కొనగలరు. మధ్యతరగతి కుటుంబీకులకు రోగమొస్తే ఆర్థికంగా, మానసికంగా నలిగిపోక తప్పదు.

ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్ని చూస్తే వొచ్చే మందుల్ని ఎవరికి వారు తెగనమ్ముకుని మిగిలినవి కంటి తుడుపుగా ప్రజల ముఖాన గొడ్తారు. ఈమధ్య గ్రామ గ్రామానికి వెళ్ళి ఆపరేషన్లు చేస్తున్నారు. ఎక్కడో దూరంగా వున్న పట్టణాలకు వచ్చి ఆపరేషన్ చేసికుంటే వాళ్ళకి రోజెలా గడుస్తుంది. మంచి పద్ధతి ఇది. అయితే ఆపరేషన్ తర్వాత వాళ్ళ గతేమిటి...? ఎవరు పట్టించుకుంటున్నారు? ఇదిగాక ఇంటింటికీ పోయి మందులివ్వాలి. ఇస్తున్నారు. అయితే ఏం మందులిస్తున్నారు...? ఎవరికిస్తున్నారు..? దేనికి ఉపయోగపడ్తాయి...?! అవీ సక్రమంగా అందుతున్నాయా...? అన్ని ప్రశ్నించేదెవరు...? కారణం అలసత్వం... రోగుల ఆర్తనాదాలు వినిపిస్తున్నా వినిపించనట్లు నటన....

అందరూ తింటున్నారు.. మనమూ తింటే తప్పేమిటి. ఒకవేళ తినకపోతే అందరిలాగే వుంటుందా! మరొకరు దోచుకుపోతారు. కాబట్టి నేనే తింటాను ఇటువంటి మనస్తత్వం పేరుకుపోయింది నేటి ప్రజల్లో.. ఎలా దీన్ని వెలికి తీయడం...?? ఎవరైనా ప్రయత్నిస్తే వాళ్ళు దీనికి బలి గాక తప్పదు. ఏ కొద్దిమందో ఆలోచిస్తే మానసిక వ్యధ తప్ప ప్రయోజనం లేకుండా పోతుంది..

ఏదో శబ్దానికి ఈలోకంలోకి వచ్చింది స్వాతి.

డాక్టర్‌శ్రీని మంచమ్మీది నుంచి దిగడంలో కొంచెం జారాడు.

పడిపోతాడేమోనని గబుక్కున పట్టుకుంటూ, "ఏమండీ... నన్ను పిలిస్తే నేనురానా!" అంది.

"ఏదో ఆలోచిస్తున్నావు. ఎందుకులే అని ఫరవాలేదు, నడవగలను." అది చిన్నపిల్లల నడకలా వుంది.

అది చూసి స్వాతి మనసు మూగగా రోధించింది.

"ఎట్లావుందండీ మీకు..." అంది.

తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, "నాకేం బావుంది.. ఊరికే ఆలోచించకు." అంటూ స్వాతి భుజం తట్టాడు.

తనకు తెలుసు ఆయనెంత బాధపడుతున్నారో. కానీ తను బాధపడుతుందని అలా అంటాడని.

అతని ఆరోగ్యం బావుండేపుడు ఇతర విషయలేవీ స్వాతి పట్టించుకొనేది కాదు. హాస్పిటల్ నించి రావడం, తినడం పుస్తకాలు చదవడం... పిల్లల్తో సినిమాలకు వెళ్ళడం... ఆయన కౌగిట్లో అన్నీ మరచి నిదురపోవడం...



gudachari.com

... ఎంత మధురమైనదో మా జీవితం... ఏరోజూ అభిప్రాయభేదాలు లేవు... పండంటి పిల్లలు, ప్రేమైక మూర్తి అయిన భర్త... ఎంత సుఖమయ జీవితం గడిపామో...! అనుకుంది స్వాతి గత జీవితాన్ని తలచుకుంటూ.

ఇప్పుడు... పెను తుఫాను రగుల్కొంది వాళ్ళ జీవితంలో.. దీనికి అంతం ఎప్పుడు..?! ఎన్ని రోజులీ మానసిక వ్యధ...?! ఎవరు తీరుస్తారీ బాధ..?! మధనపడసాగింది స్వాతి.

రాత్రిళ్ళు భయంకరమైన కలలు.. స్వాతికి. వాళ్ళనుంచి డాక్టర్‌శ్రీనినెవరో దూరంగా తీసుకుపోతున్నట్లు... వాళ్ళ ఇల్లు కుప్పగా కూలిపోయినట్లు.... ఊబిలో అతను కూరుకుపోతున్నట్లు చేతులు చాపుతూ తన వైపు అర్థిస్తున్నట్లు, నన్ను బ్రతికించు... నన్ను బ్రతికించు అని ఏడుస్తున్నట్లు... అదిరిపాటుతో లేచేది. శరీరమంతా చెమటతో తడిచిపోయేది. అతను ప్రక్కనే వుండడం చూసి తృప్తి పడి మంచినీళ్ళు త్రాగి మళ్ళీ పడుకునేది. అయితే ఆ తర్వాత నిదురపట్టేది కాదు.

ఏ పని మీదా మనసు లగ్నం చేయలేకపోతుంది స్వాతి. కానీ తప్పదు. ఇటు ఈయన్ని, అటు పిల్లల్ని చూసుకోవాలి. హాస్పిటల్ వ్యవహారాలు చూసుకోవాలి.

హాస్పిటల్ వ్యవహారాలు చూసుకోకపోతే డబ్బెలా...? ఇప్పటికే వున్నదంతా అయిపోయింది. ఏరోజు సంపాదన ఆరోజుకే సరిపోతోంది. వాళ్ళ జీవితంలో ఇంతటి దయనీయమైన స్థితి వస్తుందని కలలోనైనా ఊహించలేదు. ఒక్కోసారి జీవితం మీద విరక్తి పుడుతుంది. అయినా జీవించాలి.. పిల్లల కోసం... ఆయనకోసం.. ఆయన ఆరోగ్యవంతులైతే గడపబోయే జీవితం కోసం... అనుకొని ధైర్యం తెచ్చుకుంటుంది స్వాతి.

ఇప్పుడు అన్నింటికన్నా ఎక్కువగా డబ్బు గురించే ఆలోచించాల్సి వస్తోంది. ఇటువంటి సమయాల్లో ఆత్మస్థైర్యం ఎంత అవసరమో డబ్బూ అంతే అవసరం. ఈ స్థితిలో అతని చెంతనే గడపాలని వుంటుంది. స్వాతికి ఎలా వీలవుతుంది...? తను పనిచెయ్యకతప్పదు... సంపాదించక తప్పదు.

వాళ్ళ పెళ్ళయిన కొత్తలో తన క్లాస్‌మేట్స్ చాలా మంది అమెరికా వెళ్తుంటే అతన్ని అడిగింది, "మనమూ వెళ్దామండీ..." అని స్వాతి.

ఆమె వైపదోలా చూసి, "ఎందుకూ...?" అన్నాడు.

డబ్బు కోసమంటే కాదంటారని, "నాలెడ్జి పెంచుకోవచ్చు కదా.. అక్కడ అన్ని అవకాశాలు వున్నాయి కదా నాలుగేళ్ళుండి తిరిగి వొచ్చేద్దాం."

"పిచ్చిదానా! ఇప్పుడు వెళ్ళే వాళ్ళందరూ విజ్ఞానం కోసమే వెళ్తున్నారా? డబ్బుకోసం."

"పోనీ డబ్బుకోసమే అనుకోండి. దాంతోపాటు విజ్ఞానం కూడా వస్తుంది కదా. మళ్ళీ తిరిగి వచ్చేస్తాంకదా."

"ఇప్పటికి వెళ్ళినవాళ్ళు ఎంతమంది తిరిగి వచ్చారో చెప్పు?"



స్వాతి మాట్లాడలేదు.

"డబ్బు... ఆ వాతావరణమూ అలవాటైన తర్వాత ఎవరూ తిరిగి రాలేరు. రారుకూడా. మనది భారతదేశమనే విషయం కూడా మరచిపోతారు. మనది పేద దేశం, ఇక్కడ కోట్లాది ప్రజలు సరైన వైద్యం లేక ఛస్తున్నారు అనే విషయం ఏ కోణానా గుర్తుండదు వాళ్ళకి.

నాదేశం నామీద ఎంతో ఖర్చుపెట్టి నన్నో డాక్టర్ని చేసింది. అందుకు నేను ఋణపడి వున్నాను. అందరికీ కాక పోయినా కొందరికైనా మనం ఉపయోగపడ్తే అంతేచాలు మన జీవితాలకు.

పోనీ వలస వెళ్ళిన డాక్టర్లకి దేశభక్తి లేకపోలేదనే అనుకో... ఇప్పటికే వాళ్ళు బాగా సంపాదించి వుంటారు. డబ్బు, అనుభవమూను. ఏదీ ఎందుకు ఇవ్వకూడదు. కూడబెట్టిన దాంట్లో పదోవంతు, ఆధునిక విజ్ఞానానుభవాన్ని మనకూ పంచవచ్చుకదా! కానీ వాళ్ళు చేయరు. ఎందుకంటే వాళ్ళ ప్రధాన దృష్టి డబ్బే. దేశంకాని దేశంలో వెళ్ళిన వీళ్ళ స్థానం ఏమిటి.. మహా విజ్ఞాన వంతులమని ఫోజు కొట్టే ఆదేశస్థులు వీళ్ళని డబ్బుకోసం వలస వచ్చిన కుక్కలులాగే చూస్తారు. వాళ్ళు దయతలచి పడేసే విజ్ఞానం మనకొద్దు. మేధావులు మనదేశంలో లేరా... ఉన్నారు. అయితే వాళ్ళకున్న టెక్నాలజీ లేదు మనకు.

మొగుడూపెళ్ళాలు కాసేపైనా అరమరికలు లేక హాయిగా మాట్లాడుకోలేని ఆ మర మనుషుల జీవితం నాకిష్టం లేదు. డబ్బే ప్రధానమైతే ఇక్కడా సంసదించవచ్చు. పిచ్చి పిచ్చి ఆలోచన్లు పెట్టుకోక వీళ్ళకు నీ చేతనైన సాయం చేయి. అందులో వున్న తృప్తి, అమెరికా వెళ్ళి కోట్లు సంపాదించడంలోనూ వుండదు."

సుదీర్ఘోపన్యాసంతో స్వాతి నోరు మూసేసేవాడు.

మరి ఇప్పుడో..?! డబ్బు కావాలి. ఎలా వస్తుంది.? ఎవరు ఆదుకుంటారు అవసరానికి అని మధన పడసాగింది స్వాతి.

ఆరోజు డాక్టర్ శంకర్‌చౌదరి దగ్గరకు వెళ్తూనే, "ఇలా నన్నెంతకాలం బ్రతకమంటారు...? నామీద ఇంకా ఎంతకాలం ప్రయోగాలు చేస్తుంటారు? ఏదో వొకటి త్వరగా చెయ్యండి." అన్నాడు డాక్టర్‌శ్రీని విపరీతమైన విసుగుతో.

స్వాతి భయపడింది ఆయనేమైనా అనుకుంటాడేమోనని.

ఆ మాటలకి నొచ్చుకున్నా కొంతసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు డాక్టర్ శంకర్. తర్వాత తేరుకుని.

"ఆల్‌రైట్ .. వుయ విల్ స్టార్ట్ కార్టిజోన్... ఎందుకంటే ఒకే ఒక జబ్బు అది జ్వరానికి దగ్గరగా వుంది. అదే పోస్ట్ పెరికార్డియాటమీ సిన్‌డ్రోమ్," అన్నాడు. కార్టిజోన్ చాలా మంచి రిజల్ట్స్ ఇస్తుంది కానీ పద్ధతిగా వాడాలి.



gudachari.com

"అదే బెటర్. అటో.. ఇటో తేల్చుకోవచ్చు." గొణుక్కున్నాడు తనలో తనే డాక్టర్‌శ్రీని.

స్వాతి భయంగా శంకర్ చౌదరి వైపు చూసింది. ఏం ఫరవాలేదన్నట్లు మందుల చీటీ వ్రాసిచ్చాడు. అంత భయపడాల్సిన అవసరం లేదు. ఇవ్వాల్సిన సమయంలో తప్పక యివ్వాలి. చెడు జరగదని తెలుసు స్వాతికి.

అందులో మామూలు మందులు వాడుతూ కార్టిజోన్ మూడు మాత్రలు వాడమనీ, రీ అష్యూరెన్స్ అంటే వ్యక్తికి మరీ మరీ ధైర్యం చెప్పమని. మామూలు పేషెంటయితే చెప్పవచ్చు. ఈయన డాక్టరు. ఈయనకు తెలియంది ఏముంది. అయినా వ్యాధిగ్రస్తులందరూ ఒకే మనస్తత్వం కల్గివుంటారనుకుంటాను. నా శాయశక్తుల ప్రయత్నిస్తాను.... అని అనుకుంది స్వాతి. ఈ మందు ఇవ్వడానికి ఇంత కాలం ఎందుకు వెనకాడారు. పేషెంటు డాక్టరు కాబట్టి.

మందులు వాడడం ప్రారంభించాక రెండో రోజుకే జ్వరం తగ్గిపోయింది. వారం కల్లా ఆశ్చర్యంగా మామూలుగ నడవగలిగాడు.

ఒకరోజు ఉదయం స్వాతి లేవగానే ఆమె ముందు కాఫీ గ్లాసుతో నిలబడి ఉన్న భర్తను చూసి ఆతృతగా, "ఎలా వుందండీ?" అంది.

"అద్భుతం... చాలా బాగుంది." కాఫీ గ్లాసందించి నవ్వుతూ దగ్గరకు తీసికున్నాడు స్వాతిని.

స్వాతి కళ్ళు ఆనందంతో అశ్రుపూరితలయ్యాయి. భుజం మీద తల వాల్చి తనివి తీరా కన్నీరు కార్చింది.

స్వాతిని తనలో ఇముడ్చుకుంటూ స్వాతి శరీరమంతా నిమురసాగాడు ప్రేమతో. ఆ స్పర్శ తననేదో లోకాలకు తీసుకు వెళ్తోంది. ఈ క్షణం ఇలాగే నిలచిపోతే... ఎంత బాగుండి, ఎంత హాయి ఈక్షణం అనిపించిది స్వాతికి.

స్వాతి లోని నీరసం, భయం, ఆందోళన పటా పంచలైపోయాయి. నూతనోత్సాహం, శక్తి ప్రవేశించాయా క్షణం. అదృష్టవంతురాల్ని నేను, అనుకొంది స్వాతి.

"ఏమండీ... మీకు... బావుందికదా!" అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది మళ్ళీ.

"బావుంది... చాలా బావుంది మైడియర్ స్వీటీ... నాకోసం నువ్వెంత తపించి పోయావో... ఎంత బాధ పెట్టానో నిన్ను."

"ఛ... ఛ.. నన్ను బాధపెట్టడమేవిటండీ... మీకోసం ఏం చేసినా ఆనందమే నాకు."

"ఐ లవ్‌యూ.. ఐ లవ్‌యు సోమచ్." అంటూ కౌగిల్లో బంధించి వేశాడు స్వాతిని.

పిల్లలు వాళ్ల చుట్టూ చేరి ఆశ్చర్యంగా గమనిస్తున్నారనేది కూడా తెలియలేదు.

"హలో! మైడియర్... కుట్టీస్... రండి." అంటూ దగ్గరకు తీసికున్నాడు వాళ్ళను.

పిల్లలు ముగ్గురూ అతన్ని తడిమి తడిమి చూస్తూ "డాడీ... నీకు బావుందా!" అన్నారు.



"ఫైన్... చాలా బావుంది ఉ.... చెప్పండి ఈ రోజు మీకు స్కూలు లేదు. నాతోనే వుండాలి. అందరం ఆడుకుంటాం."

ఆనందంతో గంతులేయసాగారు.

"డాడీ... డాడీ... తోటకెళదాం డాడీ... చాలా రోజులైంది." అన్నాడు విష్ణు.

అందరూ సరే అన్నారు.

"ఓ.కె. కాగితం... పేనా తీసుకు రండి."

"ఎందుకు?," దీపు ప్రశ్న.

"ఎందుకు కేమిటి... పిచ్చి... డాడీ మరచి పోతారు కదా... అందుకని." బిందు అంది.

"ఎందుకివి?" వాళ్ళను ప్రశ్నించాడు. తెచ్చిన వాటిని చూసి.

"ఎందుకేమిటి డాడీ... నువ్వేకదా తెమ్మన్నావు. అప్పుడే మరచిపోయావా."

"ఓహో.... తెమ్మన్నానా.... సరే చెప్పండి."

వాళ్ళు చెప్పడం మొదలు పెట్టారు. అతను వ్రాయడం ప్రారంభించాడు.

తోటకి వెళ్ళాలి.

చెరకు తినాలి.

పావురాళ్ళు చూడాలి.

నెమలి చూడాలి.

కుందేళ్ళు చూడాలి.

గులాబీలు తెచ్చుకోవాలి.

కొబ్బరి నీళ్ళు తాగాలి.

"ఇంటికి వైట్ రాబిట్ తెచ్చు కోవాలి." మధ్యలో విష్ణు అన్నాడు. "వద్దు అదింట్లో పెడితే అంతా వాసన." కసురుకున్నట్లుగా అంది స్వాతి.

"ఆహా తెచ్చుకోవాలి." అంటూ మారాం చేశాడు.

వాడ్ని చూసి నవ్వుతూ, "తెచ్చుకోనిస్తూ మళ్ళీ రేపు పంపేయచ్చుగా." అన్నాడు.

...సుందర దృశ్యం.... మనోహరం... కనుల పండువుగా వుంది. మనసు ఉద్వేగంతో ఎగిరెగిరి పడుతోంది. అతను నవ్వుతూ మామూలుగ మాట్లాడుతూ వుంటే స్వాతికి.

అన్నీ సిద్ధం చేసికుని తోటకి బయల్దేరారు. తోటలో ప్రవేశించగానే కాపలా అతను మొదట ఆశ్చర్యపోయి సంతోషంతో తబ్బిబ్బయ్యాడు.

ఇక మొదలెట్టాడు.... ఈ సంవత్సరకాలంలో ఎన్ని మార్పులు సంభవించిందీ... ఎంత భయపడిందీ, బాధ పడిందీ, చెట్ల గురించి, పిల్లల గురించి ఏకరవు పెట్ట సాగాడు.



gudachari.com

పిల్లలు ప్రతిదీ వాళ్ళ డాడీతో చెబుతూ ఆటలాడు తున్నారు. ఆనందంతో డాక్టర్ శ్రీని ముఖమూ వెలుగుతోంది.

చాలా తృప్తిగా వుంది స్వాతికి.

చాలా కాలం జబ్బున పడినప్పటికీ అతను అందంగానే కన్పిస్తున్నాడు స్వాతి కళ్ళకు ఆ రోజు.

- - -

డాక్టర్ శ్రీని శారీరకంగా కోలుకుంటున్నాడు బాగా. మానసికంగా ఇంకా తేరుకోలేదు పూర్తిగా. దిన దినానికీ జ్ఞాపక శక్తి మందగించి పోతోంది.

ఒకరోజు పిల్లల్తో కలసి సిటీకి వెళ్ళారు. ఒక హోటల్ దగ్గర దింపి కారు ప్రక్కన పెట్టి వస్తానని చెప్పి ఎంతకూ రాలేదు; డాక్టర్ శ్రీని. అరగంటపైనే అయింది స్వాతిలో ఆతృత... మరో అరగంట... రాలేదు. పిల్లలు విసిగించసాగారు "నాన్నెక్కడంటూ."

స్వాతిలో భయం ప్రారంభమైంది.

బయటకు వెళ్ళి చూసింది, కారు లేదు. మనిషీ లేరు.

ఏడుపు వస్తోంది తనకు, ఏమీ చెయ్యలేని పరిస్థితి.... ఎవర్ని అడగాలో, పోనీ వెతుక్కుంటూ వెళితే, తను అటు వెళ్ళగానే, అతను అప్పుడు కన్పించాడు అలసి చిన్నగ నడచి వస్తూ.

"ఎక్కడకి వెళ్ళారండి... ఇంతసేపు? మాకెంత భయం వేసిందో..."

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకనే తల వంచుకుని కుర్చీలో కూర్చున్నాడు. ఆ ముఖంలో బాధ, అవమానం కనిపిస్తోంది.

తర్వాత చెప్పాడు.

కారు పెట్టడానికి స్థలం లేక కొంచెం దూరం వెళ్ళాల్సి వచ్చిందట. తిరిగి హోటల్‌కి దారి మరచి పోయి, ఎక్కడెక్కడో తిరిగి హోటల్ పేరూ గుర్తులేక మధ్యలో మందుల షాపొకటి కనిపిస్తే వెళ్ళి అడిగారట. ఇక్కడో హోటలుండాలి... ఎక్కడ? అని

ఏ హోటల్...? చాలా వున్నాయి.

ఏం చెబుతాడు. పెద్ద హోటల్ అని వర్ణిస్తే వాళ్ళు వేరే మరేదో చూపించారు. అక్కడకు వెళ్ళి అది కాదని మళ్ళీ వాళ్ళ నడిగి మరచిపోతానేమో అని ప్లాన్ గీసుకొని మధ్య మధ్యలో అడుగుతూ వచ్చారట ఇక్కడికి.

ఎంతటి మానసిక వ్యథ... అది విని చాలాబాధ పడింది. ఇక ఎప్పుడూ అతన్ని ఒంటరిగా ఎక్కడికీ పంపకూడదని నిర్ణయించుకొంది స్వాతి.

"నా చేతగాని తనానికి, అసహాయతకు కోపం వస్తోంది..." బాధగా అన్నాడు.



ఆ రోజు నుంచి చాలా మారిపోయాడు డాక్టర్ శ్రీని.

ఎవర్తో అయినా కలవాలంటే భయం.... చివరికి బంధువులొచ్చినా, అందుకే వీలైనంత వొంటరిగ గడిపేస్తున్నాడు. ఆ వొంటరి తనం వలన విపరీతమైన ఆలోచనలు.

ఒక రోజు "నేనిక ఇది భరించ లేను ఏదో ఒకటి చేయాలి... ఏమైందో తెలుసు కోవాలి... లేక పోతే బ్రతకడం వృథా," అన్నాడు మానసిక వత్తిడికి తట్టుకోలేక.

"అంత మాటనకండి...ఏం తక్కువ మీకు ముచ్చటయిన పిల్లలు, ప్రేమించే భార్య ఉండగా."

"అది చాలంటావా.. జీవితాంతం ఉపయోగం లేకుండా ఇలా ఇంట్లో తింటూ, మందులు మింగుతూ పడి వుండడమేనా... నేను బ్రతికుంటే చాలంటావా..."

స్వాతి జవాబు చెప్పలేక పోయింది.

"సాయం చేసే అవకాశం వుండి, చేతగాని వాడిలా ఏమీ చేయలేక శరీరాన్ని పెంచటం వ్యర్థం. ఏం చేయలేనపుడు బ్రతికి ఏం లాభం..."

"మిమ్మల్నే నమ్ముకున్న మేము...?"

"అంటే మీకోసం నే బ్రతికి వుండాలి. మీకు మాత్రం ఏ విధంగా ఉపయోగ పడ్డాను....?"

"మీరు బ్రతికుంటే చాలు మా కళ్ళముందు. మా జీవితాలు సుఖప్రదమైనట్లే."

"జ్ఞాపక శక్తి కోల్పోయి.... అశక్తుడ్నని వొప్పుకోలేక మీ కందరికీ బరువై బ్రతకడం కష్టంగా వుంది."

"అదేమిటండీ అలా అంటారు... ఒక వేళ నేనే మీ పరిస్థితిలో వుంటే మీరు నన్నిలా అనుకుంటారా?"

సమాధానం లేదు.

"కష్టాలు కలసి పంచుకోవడంలోనే బార్యాభర్తల అనుబంధం అమరి వుంది. బాగున్నపుడు కలసి వుండి, బాగు లేనపుడు వొకర్ని వొకరు దూరం చేసుకుంటారా... అప్పుడే కదా అసలు బాధ్యత. అందుకే కదా ఈ కలయిక. అదే కదండీ వివాహానికి అర్థం."

"నా నుంచి నువ్వేం సుఖం పొందుతున్నావు... మానసిక వ్యథ తప్ప... ఎంత కాలమిలా...." మాట పూర్తి చేయలేక పోయాడు.

"పిచ్చి... పిచ్చిగ ఆలోచించకండి. కష్టాల్లో సంసార భారం పైన వేసికోవడం స్త్రీకి మానసిక వ్యథ ఎలా అవుతుంది..? అది బాధ్యత. అసలింత ఆలోచన నెందుకు. మీరనుకొనేట్లు న్యూరాలజిస్ట్‌ను చూస్తే...."



gudachari.com

"చూడవచ్చు. అయితే ఆ డాక్టర్ల ద్వారానే అయితే వాళ్ళకు మనసుకు కష్టం లేకుండా వుంటుందని ఆలోచిస్తున్నాను."

"మనమేమీ వాళ్ళనవమానించడం లేదు కదా... ఇది వాళ్ళకి సంబంధించినదీ కాదు కదా.!"

"అసలెందుకు వాళ్ళు నేనెన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదో అర్థం కావడం లేదు. సైకలాజికల్ అనో, క్రమేణా బాగవుతుందనో అంటున్నారేగానీ, ఏమైనా జరిగి వుంటుందేమో అని ఆలోచించరే..."

"అది బహుశా వాళ్ళమీద వాళ్ళకు గల నమ్మకమేమో,లేదా వాళ్ళ పొరపాటు బయట పడ్తుందనైనా కావచ్చు."

"పొరపాటు జరిగుంటే సరిదిద్దుకొవచ్చు కదా! వేరే మార్గమైనా ఆలోచించ వచ్చుకదా!"

"బహుశా అది సరిదిద్దలేమని వాళ్ళ నమ్మకమేమో."

"ఆ సంగతైనా చెప్పొచ్చుగా."

"చెబితే భరించగలిగే వాళ్ళుంటారు, తట్టుకోలేక కృశించి పోయే వాళ్ళూ వుంటారు. అందుకని చెప్పక పోవడమే మేలని నిర్ణయించుకుని వుండొచ్చు."

"మరి పేషెంటు గతి?!"

"కాలమే నిర్ణయించాలి."

అంటూ లేచి నవ్వుతూ

"చూడండి... ఏదో జరిగింది. అదెలా జరిగిందనికాదు సమస్య.ఎలా బాగు చేసుకోవాలా అని.. కనుక మనం న్యూరాలజిస్ట్‌ని చూద్దాం. మరేమీ ఆలోచించక నిదురపోండి." అంది స్వాతి అతని మనసు కుదుట పరచడానికి ప్రయత్నిస్తూ.

మరుసటి రోజు డాక్టర్ వెంకటరమణ వచ్చాడు. డాక్టర్ శ్రీనిని చూడ్డానికి. ఆయనకూడా ఈ మధ్యనే బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. ఆరోగ్యంగా మామూలుగా వున్నాడు. ఎటువంటి ఉపద్రవమూ లేదు. ఆ సంగతి చెబుతూ,

"మనం ఎన్నో కేసులు చూస్తుంటాం, చేస్తుంటాం అన్నీ బాగవుతాయి. కొన్ని మాత్రమే అడ్డు తిరుగుతాయి." అన్నాడు.

నిజం... ఏ ఒక్కరికో చెడు జరిగిందని అందరికీ అలా జరుగుతుందనుకోరాదు. వాళ్ళెన్నో బైపాస్ సర్జరీలు చేశారు. ఎటువంటి కాంప్లికేషనూ లేవు. మరి... మాకే ఎందుకొచ్చింది. అది మా దురదృష్టం అని అనుకొనే సరికి స్వాతికి ఏడుపొచ్చింది. బైపాస్ సర్జరీ చేయించుకొని నిత్య నూతనంగా వున్న డాక్టర్ వెంకటరణ చూస్తుంటే, అయితే అది ఈర్ష్యతో కాదు. ఆ అదృష్టం తనకు లేకపోయిందే అని మాత్రమే.



gudachari.com

వాళ్ళతో పాటు చదువుకున్న ఒక అతనొకరు హైదరాబాదు ఉస్మానియాలో న్యూరాలజిస్టు. డాక్టర్ శ్రీనికి మంచి మిత్రుడు. అతని పేరు డాక్టర్ జగ్గా రావు.

హైదరాబాదు వెళ్ళారు.

వాళ్ళను చూసి చాలా ఆశ్చర్యపోయాడు.

జరిగిందంతా విని చాలా బాధపడ్డాడు. ధైర్యం చెప్పి అన్ని రకాల పరీక్షలు చేశారు.

"ఇందులో ఆలోచించి బాధపడాల్సిన అవసరం ఏముంది... నువ్వనుకున్నట్లే నీ మెదడుకు జ్ఞాపక శక్తి తగ్గింది. అయితే పూర్తిగా కాదు."

"ఎందువల్లని నీ అనుమానం జగన్?"

"కారణం నీకు తెలియదా!"

"మా శ్రీమతి అంటుంది ఆపరేషన్ తర్వాత తగ్గిపోయిన బి.పి. వల్ల గానీ వెంటనే వచ్చిన జ్వరం వల్ల గాని అయి వుండవొచ్చని."

"ఎగ్జాట్లీ కరెక్టు. ఎక్కువ కాలం తక్కువ బి.పి. వుంటే మెదడులో జ్ఞాపకశక్తి వుండే ప్రదేశానికి రక్తప్రసారం అందక కొంత భాగం దెబ్బతిని వుండొచ్చు. పైగా విపరీతమైన జ్వరం వల్ల కూడా మెదడు దెబ్బతినే అవకాశం వుంది."

డాక్టర్ శ్రీని ప్రశ్నలకు సైంటిఫికల్ సమాధానం దొరికింది. ఆ విషయం అతనికి తెలియక కాదు. బెనిఫిట్ ఆఫ్ డౌట్‌కు మరొకరి స్థిర అభిప్రాయం కావాలి.

అతని ముఖంలో తృప్తి కనిపించింది.

"మరి బాగవుతుందా!"

"అవుతుంది. కాని పూర్తిగ కాదు. జ్ఞాపకశక్తి మామూలుగ వస్తుంది. అయితే పదునుగ వుండక కాస్త ఆలోచించాల్సి రావచ్చు. పాత జ్ఞాపకాలు మామూలుగానే వుంటాయి."

కొంత నిరుత్సాహం మళ్ళీ

"ఏవిటి... అలా అయిపోయావు? నువ్వుచాలా మేలు. కొన్ని కేసులు చూస్తే... ఎందుకు బ్రతికి వున్నారా అనిపిస్తుంది."

"ఏం చేయాలి నేను?"

"నేను చెప్పక ముందే నువ్వు మొదలెట్టావు."

"ఏమిటది?"

"ఒకటి. చేయాలనుకున్న పనులన్నీ లిస్టులాగ వ్రాసుకుని బాగా చదువుకుని జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించడం. అది నువ్వు చేస్తున్నావు. రెండు. ఎక్కడికైనా వెళ్ళాలనుకున్నా, ఏమైనా తేవాలనుకున్నా కళ్ళు మూసుకొని ఊహించుకొని, కళ్ళు తెరచి ఊహించినది జ్ఞప్తికి తెచ్చుకోడం. మూడు. ఏదైనా ఒక వస్తువును బొమ్మ లేదా మరేదైనా చూసి దూరంగా

వున్న మరో వస్తువు దగ్గరకు పోయి ముందు చూసిన దాన్తో దీన్ని పోల్చు కోవడం. నాలుగు చిన్న కథ చెప్పించుకుని తిరిగి వప్ప చెప్పడం."

డాక్టర్ శ్రీని ఆశ్చర్యంగా "ఆరె... మా పిల్లలు నువ్వు చెప్పినవన్నీ ఎప్పుడో మొదలెట్టారు." అన్నాడు.

"తెలివైన వాళ్ళ పిల్లలు కనుక వాళ్ళూ సహజంగానే తెలివైన వాళ్ళయి వుంటారు. నాకన్నా మీకన్నా వాళ్ళే నయంలా వుంది. ఇంత చదువు చదవాల్సి వొచ్చింది నేను అవి తెలుసుకోడానికి. ఇలా చేస్తే నీకు మామూలు జ్ఞాపకశక్తి రావచ్చు."

"......?"

"ఏమిటి అలా చూస్తున్నావు...? నమ్మకం లేదా! పోనీ! నాకు మాత్రం నీ మీద నమ్మకం వుంది. నువ్వలా చేయగలవు. తిరిగి మామూలు డాక్టరు కాగలవు." అంటూ భుజం తట్టి ధైర్యం చెప్పాడు.

డాక్టర్ శ్రీని ముఖంలో అనుమానపు ముడి కొంతవరకూ విడిపోయింది. తిరుగు ప్రయాణంలో వ్యాధి గురించి గాక పిల్లల గురించే కబుర్లు... కాసేపైన తర్వాత స్వాతి చేతులు పట్టుకుని, "నాకు తిరిగి మామూలు జ్ఞాపకశక్తి వస్తుందంటావా...?" అన్నాడు. ఆ చూపులెంతో దయనీయంగా వున్నాయి.

"తప్పక వస్తుంది. ఆ నమ్మకం నాకుంది." అంది స్వాతి.

"అది చాలు... నీకు నామీద నమ్మకముంటే చాలు... నేను సాధిస్తాను... తిరిగి మాములు మనిషినై ఆపరేషన్లు చేస్తాను..." ఉద్వేగంతో చెప్పుకు పోతున్నాడు.

చాలా పట్టుదలగా పరీక్షల్లో రాంకు కోసం కష్టపడి చదివే విద్యార్థిలాగ నిర్విరామంగా తు.చ. తప్పక చేయసాగాడు. రెండు నెలల్లో చాలా మార్పు కనిపించింది.

ఒక్కోసారి బాగా అలసి పోయి చాలా నీరసం. వచ్చేస్తూంది. తలనొప్పి వస్తోంది. శారీరకంగా ఎంతో శ్రమ పడినట్లు వుంటోంది. అనేవాడు స్వాతితో – మళ్ళీ బుజ్జగిస్తే అనునయించి ప్రోత్సహిస్తే మరలా ప్రారంభించే వాడు.

ఈ మధ్య కాలంలో రెండు సార్లు డాక్టర్ రెడ్డి, శంకర్, చౌదరీలను కలిశారు.

శంకర్ చౌదరి అన్నాడు. "నీలో చాలా మార్పు కన్పిస్తోంది. బాగుంది. కాస్త ఎక్సర్ సైజ్ చేయడం మంచిది. సైకిలింగో, స్విమ్మింగో లేదా రెండు, మూడు ఫర్లాంగులు నడవడమో చేయండి."

ఇంటికి వచ్చింతర్వాత అవి ప్రారంభించాడు.

రెండోసారి వెళ్ళింతర్వాత శంకర్ చౌదరి, "వెరీగుడ్ యు ఆర్ ఫుల్లీ రికవర్డ్. ఇక హాస్పిటల్‌కి కూడా వొళ్ళొచ్చు." అన్నాడు. ఆ మాటతో డాక్టర్ శ్రీని పొంగిపోయాడు. యింత కాలానికైనా జయించానని గర్వ పడ్డాడు.



"నేను... హాస్పిటల్‌కి వెళ్ళొచ్చా.... మామూలుగ పనులన్నీ చేయొచ్చా... నిజంగానే నన్ను హాస్పిటల్‌కి వెళ్ళమంటారా... థ్యాంక్యూ... థ్యాంక్యూ వెరీమచ్... ఈ రోజు కోసమే నేను బ్రతికున్నాను. ఈ మాట కోసమే మిమ్మల్ని విసిగించాను..." సంతోషంతో తడబడుతూ అన్నాడు డాక్టర్ శంకర్ చౌదరి చేతులు పట్టుకొని.

"... నో... నాటెటాల్... నీకేమయింది..? మీ ఆరోగ్యమెప్పుడు బాగవుతుందా? అని ఇంతకాలం నేనూ రెడ్డి ఆలోచించని రోజు లేదు. ఈ రోజు మీకే కాదు, మాకూ పండుగ దినం. ఐ విష్ యు బెస్ట్ ఆఫ్ లక్..." అని స్వాతి వైపు చూసి, "డాక్టర్ స్వాతీ! ఈ విజయం నీది.... నీ ధైర్యం, ఓపిక అందరికీ ఆదర్శం..." అన్నాడు.

వారి ఆప్యాయతకూ, తమ మీది ప్రేమాభిమానాలకీ మనసులోనే శిరస్సు వంచి నమస్కరించింది స్వాతి.

నిజం.... ఇక బాగు చేయలేమని నమ్మకం పోగొట్టుకున్న పేషెంటు మరలా మామూలు మనిషి అయితే ఎక్కడ లేని ఆనందం... తృప్తి. అలాంటి తీపి జ్ఞాపకాలు ఆ డాక్టర్లు జీవించినంత కాలం మననం చేసికుంటూనే వుంటారు. అవకాశం దొరికినపుడల్లా అందరితోనూ చెప్పుకుని ఎనలేని ఆనందం అనుభవిస్తారు.

ఒక్కోసారి స్వాతిని చూసి అనే వాడు, "నువ్వ చూసినంతగా నాతల్లి కూడా చూసి వుండదు." అని డాక్టర్ శ్రీని.

"నిజం... మీరు నా బిడ్డ ఇపుడు. నా బిడ్డను నేను చూసుకోక పోతే మరెవరు చూసుకుంటారు...." నవ్వుతూ అనేది స్వాతి.

".... కాలం ఎంత త్వరగా మనుషుల్లో మార్పు తెస్తోంది. ఒకప్పుడు చిన్న పాపను నేను. ఆ తర్వాత వారికి భార్యను, ఇప్పుడు ముగ్గురు పిల్లల తల్లిని. రేపు... ఆ పిల్లల పిల్లలకు అమ్మమ్మను... ఈ మార్పులు, ఈ బాధ్యతలు మనిషికి తెలీకుండానే వచ్చేస్తుంటాయి. ఎంత విచిత్రం...!"

ఆలోచనల్లో మునిగి పోయింది స్వాతి.

అమ్మ... ఎంత ప్రేమ కురిపించేది.

స్వాతి వాళ్ళ అమ్మమ్మకు పక్షవాతం వచ్చింది. ఎంత ప్రయత్నించినా బాగు కాలేదు. నోరుకూడా పడిపోయింది. అమ్మ ఆమెను కనిపెట్టుకొని అహెూ రాత్రులు ఇబ్బంది లేకుండా చూసేది. అమ్మమ్మకు మల మూత్రాలన్నీ పడకలోనే. అవి తీసేందుకు పని వాళ్ళెవరూ రాలేదు. అమ్మే అన్నీ చేసేది. ఆమె ప్రాణం ఉన్నంతవరకు ఎంతో ప్రేమగ చూసేది. ఏరోజూ విసుగు అనేది అమ్మ ముఖంలో కనిపించలేదు స్వాతికి.

ఈ రోజుల్లో అలా కాదు. పెద్ద వాళ్ళకు జబ్బు చేస్తే వాళ్ళపిల్లలు కొడుకులు గానీ కూతుళ్ళు గానీ, "ఇంకా ఎందుకండీ డాక్టరు గారూ! ఆయన బ్రతికి ఎవర్ని ఉద్ధరించాలి!



gudachari.com

వయసు అయిపోయింది. ఎంత త్వరగా దాటుకుంటే అంత మంచిది." అని నిర్దాక్షిణ్యంగా వాళ్ళెదుటే అనే వారున్నారు. పాపం! ఆ వృద్ధులెంతగా ఆ మాటలకు కుమిలిపోతుంటారో, చచ్చిపోవాలని లేక పోయినా అప్పుడు నిజంగానే చావుని కోరుకుంటారు.

వాళ్ళ చేతుల్లో పెరిగి, వాళ్ళ గుండెల మీద ఆటలాడుకున్న వీళ్ళు పెరిగి పెద్దవాళ్ళయి అన్నీ మరచి పోతారు. వీళ్ళకు చిన్నపుడు ఏదైనా జబ్బు చేస్తే ఉరుకులు పరుగులతో హాస్పిటల్‌కు తీసుకువచ్చి బ్రతికించమని ప్రాధేయపడే వారు. అవన్నీ జ్ఞాపకం రావు. నేటి తరానికి, రేపు వీళ్ళను కూడా వీళ్ళ పిల్లలు ఇలాగే అంటే?

ఏ తల్లి రొమ్ము పాలు త్రాగి... ఏ తల్లి తన శరీరంలోనించి రక్తమాంసాలు పంచి, పెంచగా పెరిగిన బిడ్డ పెద్దయి ఆ తల్లినే మరచి అవసాన కాలంలో ఆదుకోక ఎప్పుడెపుడు చస్తుందా అని ఎదురు చూసే కర్కశులున్నారు. బాధ పడింది స్వాతి.

నాలుగైదు నెలలు కాలప్రవాహంలో కలసి పోయాయి. ఎటువంటి ఉపద్రవము లేదు. శారీరకంగాను, మానసికంగాను డాక్టర్ శ్రీనిలో చాలా మార్పు వచ్చింది.

క్రమం తప్పక వ్యాయామం చేస్తున్నాడు.

హాస్పిటల్‌కి కూడా వెళుతున్నాడు. అయితే ఎక్కువ శ్రమ తీసుకోవడం లేదు. పెద్ద పెద్ద ఆపరేషన్లు చేయడం లేదు.

విరామంగా ఉన్నపుడు ఇద్దరు, ఎదురెదురుగా కూర్చుని సినిమాల గురించి పేషెంట్ల మనస్థత్వాల గురించి మాట్లాడుకునే వారు.

అప్పుడప్పుడు అతను చాలా వింతగా అనిపించేవాడు స్వాతికి. ఎవరెంత అన్యాయం చేసినా తిరిగి మనం చేయకూడదనేది అతని పాలసీ. ఎవరైనా తమ గురించి తప్పుగా మాట్లాడితే ఖండించక ఆ తప్పు చేసేందుకు అతన్ని ఎలాంటి పరిస్థితులు ప్రోత్సహించాయో ఆలోచించమనే వాడు.

"చూశారాండీ... ఆ డాక్టరు వెంకట్రావు మనమీద లేనిపోని వదంతులు లేవదీస్తున్నాడట." అంటే

"పోనీ లెద్దూ.... అతని బాధను ఆ విధంగానైనా వెళ్ళగ్రక్కేందుకు మనం సహాయ పడుతున్నాం గదా." అనేవాడు.

"అదేమిటండీ... ఈ ప్రజల సంగతి మీకు తెలుసు కదా. వదంతులు నమ్మడం, ఎదుటి వాళ్ళను నమ్మించడం..."

"మనం పట్టించుకోకుండా ఉంటే వాళ్ళే నోరు మూసుకొని ఉంటారు."

"అయ్యో మీరెంత పిచ్చి వారండీ... వాళ్ళంతా కలసి మనల్ని ఊళ్ళో లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారట. పైగా మనిద్దరము విడాకులు తీసుకోబోతున్నామని ప్రచారము."



"చూడూ! ఎవరూ ఎవర్ని ఎప్పుడూ ఏమీ చేయలేరు. కాకపోతే కొంతకాలం ప్రజల్ని నమ్మించగలరేమో. ఆ పైన...? అందుకని ఆ మాటలు పట్టించుకోక మన పని మనం చేసుకు పోదాం." అనే వారు.

ఎవర్నీ సాధారణంగా డాక్టర్ శ్రీని తప్పు పట్టడు. కానీ అమాయక ప్రజల్ని పీడించి మోసగించి సంపాదించే వాళ్ళంటే మాత్రం, అసహ్యం.

అతని రూపమే కాదు, మనసూ అందమైనదే. అందుకే అతనంటే ప్రాణం స్వాతికి. అతను తన కంటికి ఎదురుగ ఉంటే చాలు. అదే జీవితాంతం స్వాతి కోరుకునేది.

మూడు నెలలకు ఒకసారి డాక్టర్ని కలుస్తున్నారు

డాక్టర్‌ని కలిసినపుడు,

"వ్యాయామం చేస్తూ ఉంటే ఆయాసంగా ఉంది. మెట్లు ఎక్కటం కష్టంగా ఉంది." అని చెప్పాడు డాక్టరుకి.

"అదేం చేయదు అంతా బాగుంది. ఇ.సి.జి. కూడా బాగుంది. నువ్వు కోలుకుంటు న్నావు. అలాగే వ్యాయామం చేయి. మిగిలిన ఆహార విషయాలు డాక్టర్ స్వాతి చూసు కుంటారు." అన్నారు స్వాతి వైపు తిరిగి నవ్వుతూ.

ఆ విషయం స్వాతిలో కొంచం ఆలోచనలు రేపింది.

తిరిగి వెళ్ళేటపుడు అడిగింది. "ఏమండీ... ఆయాసంగా ఉంటున్నదని నాతో చెప్పలేదే?"

"పెద్దగా ఏంలేదు. మామూలే!" అన్నాడు.

"మామూలే అయితే అసలు మీరు చెప్పరు కదా!? మళ్ళీ ఏమైనా హార్ట్ ఫెయిల్యూర్ వస్తుందేమో!"

"ఛ... నీ పిచ్చిగానీ... ఇద్దరు హార్టు స్పెషలిస్టులు చూశారు. ఏమైనా ఉంటే వాళ్ళకు తెలియకుండా ఉంటుందా." అని స్వాతికి సర్ది చెప్పాడు. స్వాతికి గుండె దడ బయలుదేరింది. ఏదో అనుమానం... భయం...

"కనీసం ఎక్స్‌రే కూడా తీయలేదు కదండీ...?"

"అవును నేను కూడా అనుకున్నాను; ఎక్స్‌రే గాని, ఎకో కార్డియోగ్రామ్ తీస్తే బాగుంటుందని. అయినా వాళ్ళు నిపుణులు. మనం ఎక్కువ మాట్లాడరాదు కదా!"

స్వాతి ఏం జవాబు చెప్పలేదు. ఆలోచిస్తూంది.

పేషెంటు దొరికితే చాలు అవసరం ఉన్నా లేకపోయినా, ముందు రోజు అన్నీ పరీక్షలు చేసి ఉన్నా మరలా అన్నీ తిరిగి చేసే డాక్టర్లు, హాస్పిటల్స్ ఉన్న ఈ రోజుల్లో, బహుశా డాక్టర్లమయినందువలనో, లేక ఎలా ఉంటుందో వాళ్ళకు తెలుసుగనుక.



gudachari.com

"పిచ్చి... ఎక్కువగా ఆలోచించకు ఏం భయపడవద్దు. నేనంత తేలిగ్గా చావను;" అన్నాడు ఆ మాటలతో స్వాతి ఏం మాట్లాడలేదు. తన అనుమానాలు, భయాలు అన్నీ మనసులోనే ఉంచుకుంది.

ఒక రోజు ఉన్నట్లుండి

"డబ్బులు ఏమాత్రం ఉన్నాయి?" అన్నాడు

స్వాతి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. తేరుకొని నవ్వుతూ "ఏం డాక్టరు గారు పూర్తి బాధ్యతల్ని తీసుకోబోతున్నారా. ఇంకా కొంతకాలం విశ్రాంతి తీసుకోండి. తర్వాత నేనే నా పదవీ విరమణ చేస్తాను." తనలోని భయాన్ని కనిపించకుండా అంది.

స్వాతిని సాలోచనగా చూస్తూ

"చూడు స్వాతీ! నాదగ్గర దాచి ప్రయోజనమేమిటి? లేవంటే భయపడతాననా... అప్పు ఎంతుందో తెలుసుకోడం మంచిది కదాని."

చెప్పక తప్పలేదిక

"ప్రస్తుతానికేమీ లేవు. ఈ రోజు సంపాదన తప్ప. ఏ రోజు వచ్చింది ఆ రోజు అప్పు తీర్చి వేస్తున్నాను."

బాధగా స్వాతి కళ్ళలోకి చూశాడు.

"ఏమిటండీ... తీర్చలేమా..."

"తీర్చలేమని కాదు. ఎలాంటి పరిస్థితి తెచ్చిపెట్టానా నీకు అని తలచుకుంటే బాధగా ఉంది." తలవంచుకుని అన్నాడు.

"చూడండీ... జీవితపు పందెంలో భార్యా భర్తలిద్దరూ ఒక జట్టూ. వీరిద్దరిలో విజయం ఎవరు సాధించినా అది ఇద్దరిదీనూ. మా అందరి బరువూ మీదే కదా. కొంతకాలం ఆ బాధ్యత నేను తీసుకొంటే నాకు కష్టమైనట్లు మీరేదో తప్పు చేస్తున్నట్లు బాధపడిపోతున్నారు. భర్త భరించే వాడనే కాదు. భార్య అంటే భాగం పంచుకునేది అని కూడా ఉంది, సుఖాల్లోనే కాదు కష్టాల్లోనూ."

అప్పటికి ఏం మాట్లాడ లేదు.

స్వాతి లేచి దగ్గరకు వెళ్ళి భర్త చేతిని తన చేతిలోకి తీసికొని అనునయంగా నిమిరింది.

స్వాతి వైపు తలెత్తి చూశాడు. ఆ కళ్ళల్లో మెచ్చుకోలు, ప్రేమ ఉన్నాయి. నీటి పొరకూడా కన్పించింది స్వాతికి.

స్వాతి చేతినలాగే ముద్దు పెట్టుకుని

"ఐ లవ్‌యూ... స్వాతీ... ఐ లవ్‌యూ." అన్నాడు.

ప్రేమ, గౌరవం పెనవేసుకున్నాయి ఆ మాటల్లో



"యస్... ఐ టూ..." అంతకన్నా మాటలు రాలేదు. స్వాతికి

డాక్టర్ శ్రీనికి చాలా విషయాలు చెప్పలేదు స్వాతి. తెలిస్తే మానసికంగా కృంగిపోతాడని. అతనికి మంచి మీద గట్టి నమ్మకం. స్వార్థరహిత స్నేహం అవసరానికి ఉపయోగపడ్తుందనే వాడు. అయితే డబ్బు దగ్గరకు వచ్చేటప్పటికి అవన్నీ పచ్చి అబద్ధాలని తెలియదు. ఒక్కో నిజం తెలుస్తూంటే విపరీతమైన బాధ. రోత కల్గుతూ వుంది స్వాతికి.

తనెప్పుడూ అనుకోలేదు జీవితంలో తనకు అప్పు అడగాల్సి వస్తుందని. అటువంటిది ఇప్పుడా అవసరం కలిగింది. పిల్లల స్కూలు ఫీజులకు, గుడ్డలకు మరి కొన్ని అవసరాలకు డబ్బుకావాలి.

డాక్టర్ శ్రీనికి మంచి స్నేహితుడు వాళ్ళ కుటుంబంతో బాగా పరిచయం ఉండే వ్యాపారస్థుడు ఒకర్ని పిలిపించి పరిస్థితి చెప్పి అడగలేక అడిగింది స్వాతి.

అంతా విని

"మీ లాంటి వాళ్ళకింత కష్టమొచ్చిందంటే నమ్మలేకుండా వున్నాను. అయినా డాక్టరు గారికి నోరు నొప్పి పుట్టేట్లు చెప్పినా వినిపించుకొనే వారు కారు. ఏది లేక పోయినా బ్రతక వచ్చు కానీ డబ్బు లేక పోతే బ్రతక లేము." అని ఆలోచిస్తూ కాసేపు మౌనంగా ఉండిపోయాడు. పాపం! ఆయనెంత బాధ పడుతున్నాడో అనిపించింది స్వాతికి.

ఏమిటి ఆలోచిస్తున్నారు?

"ఏం లేదమ్మా... మీరడిగినంత మొత్తం దగ్గర లేదు ఎప్పుడూ అడగని వారు... నాకు ప్రాణ బిక్ష పెట్టిన డాక్టరు గారికి సాయపడకలేక పోతున్నాననే అని మనస్సు గిలగిల లాడుతూ వుంది."

... ఏమిటీ అతని దగ్గర డబ్బు లేదా!!

ఆశ్చర్యం... రోజూ లక్షల మీద కమీషన్ వ్యాపారం చేసే వ్యక్తి దగ్గర డబ్బులు లేవు...?! నమ్మలేక పోయింది స్వాతి.

ఆ తర్వాత తన దగ్గర లేకపోయినా డాక్టరు గారి కోసం వేరే వాళ్ళను అడుగుతానని, అయితే వాళ్ళు వడ్డీ తీసికొంటారని, చెప్పి ఆ సాయంకాలం డబ్బు తెచ్చి యిచ్చి కాయితం మీద స్వాతి చేత సంతకం చేయించుకొని బాధ పడి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత తెలిసింది స్వాతికి

డబ్బు విషయంలో అతను పరమ నీచుడని వడ్డీ లేకుండా ఎవరికీ ఇవ్వడని.

స్వాతికి తెలిసినప్పట్నించీ అతనికీ, అతని కుటుంబానికీ వాళ్ళే వైద్యం చేసేవారు. వాళ్ళ బిడ్డలకంతా తనే కాన్పులు చేసింది. అతనికి హెర్నియా కాంప్లికేషన్ వస్తే ఆపరేషన్ చేసి బ్రతికించాడు డాక్టరుశ్రీని. ఒక్కపైసా యివ్వలేదు. వీళ్ళు అడగనూ లేదు. ఇంత



gudachari.com

చేసినా డబ్బు విషయానికి వచ్చేసరికి అతని మనస్తత్వం ఎలా మారిపోయిందో... తలచుకుంటే అసహ్యం వేసింది స్వాతికి.

కొందరైతే అడగ్గానే ఇచ్చారు.

కానీ మద్రాసు నుంచి రాగానే హాజరైపోయేవారు. అడగలేక అడిగినట్లు చాలా ఇబ్బందుల్లో వున్నట్లు మాట్లాడేవారు.

స్వాతికి ఆశ్చర్యం వేసేది. బాధ... విసుగు కల్గేది. వాచ్చీరాక ముందే ఎక్కడ్నించి వస్తుంది తమ దగ్గర? అయినా నాల్గు రోజులాగ వచ్చుకదా! మేం ఇవ్వలేమా...! అని

మరికొంతమందైతే

"చాలా రోజులైందమ్మా! ఇట్లా చేస్తే ఎలా... ఏదో అవసరానికి ఆదుకుంటే ఇలా చేయొచ్చా?" అనేంత దూరం వచ్చారు.

మామూలుగా అయితే తన ముందు నిలుచోడానికి భయపడే వాళ్ళు అయితే, ఇప్పుడు తననే బెదిరించినట్లడుగుతున్నారు. తన అసహాయతకు ఏడుపొచ్చేది స్వాతికి. ఎందుకు యిట్లా ప్రవర్తిస్తారో మనుషులు అర్థంకాలేదు.

తర్వాత గ్రహించగలిగింది. వారికి డాక్టర్‌శ్రీని ఎక్కువ కాలం బ్రతకతారనే నమ్మకం లేక. ఏమైనా జరిగితే ఆడది ఎలా తీరుస్తుంది. తర్వాత ఎలా అడగడం అనే అనుమానంతో ఎవరికి వారు త్వరపడ్తున్నారు వసూలు చేసికోవడానికి.

బాగా దగ్గర వాళ్ళు కూడా దూర దూరంగా వుండడం ప్రారంభించారు. అదే మంచిది. అవసరానికి ఉపయోగపడని మనుష్యులెందుకు... అనిపించేది స్వాతికి.

"మేం ఇంత సాయం చేశాం కదా!" అంటే, "మిమ్మల్నెవరు చేయమన్నారు ఊరికే... అది మీ తెలివితక్కువ", అని కూడా అనొచ్చనిపించింది.

వీళ్ళనంతా చూస్తుంటే ఈలోకానికి ఎదురు నడుస్తున్నామేమో అనిపించింది స్వాతికి. లోకాన్ని, కాలాన్ని గమనించడం ఇకనైనా నేర్చుకోవాలి.... ఆలోచనలతో నిదురలోకి జారుకుంది స్వాతి.

ఉదయం లేస్తూనే భర్త వైపు చూసింది స్వాతి. ప్రశాంతంగా నిదురపోతున్నాడు. కానీ ఆ ముఖంలో ఏదో మార్పు కొట్టొచ్చినట్లు కనిపించింది స్వాతికి.

తెల్లగా... కోలముఖం, సోగకళ్ళు పొడవాటి ముక్కు... హరివిల్లు ఆకారంలో పెదాలు... నవ్వినప్పుడు సొట్టలుపడే బుగ్గలు... పర్‌ఫెక్ట్ ఆర్యుల ముఖం అనేవారు అందరూ డాక్టర్‌శ్రీనిని.

"మీరే ఆడపిల్ల అయితే చాలా మంది ఆత్మహత్యలు చేసికొని వుండే వాళ్ళు." అనేది తను.



అలాంటిదీ రోజు ఆ ముఖంలో సునిశితమైన పోలికలేవో లోపించినట్లుగా. ముఖం అంతా ఉబ్బినట్లుగా వుంది స్వాతికి.

ఈ మధ్య మనిషి కొంచెం బరువెక్కినట్లనిపించి, "కొంచెం బరువు తగ్గాలి. అందుకే కాబోలు ఆయాసంగా వుంటోంది." అనేవాడు డాక్టర్‌శ్రీని.

"అయినా డైయూరిటిక్ టాబ్లెట్లు (నీరు తగ్గించేందుకు) వాడుతున్నారు కదా!"

"దానివల్ల నీరసం వస్తోందే గాని, లావు అయిపోతున్నాను."

స్వాతికి అనుమానం మళ్ళీ మొదలయింది.

అతను నిదుర లేచినతర్వాత తన అనుమానం చెప్పింది స్వాతి.

"నాకూ! అనిపిస్తోంది మళ్ళీ ఫెయిల్యూర్‌లోకి వెళ్తున్నానా అని, మిగిలిన ఇబ్బందులేమీ లేవు."

ఎందుకైనా మంచిదని డాక్టర్లను సంప్రదిద్దామని ఫోన్ చేసింది. శంకర్ రిసీవ్ చేసికున్నాడు. తనను కలిసేందుకు వారం వరకూ వీలుపడదట. డైయూరిటిక్స్ టాబ్లెట్‌లు కొంచెం ఎక్కువ తీసుకోమని, పొటాషియం లిక్విడ్ కొంచెం పెంచమని చెప్పారు.

శరీరంలో ఎక్కువ నీరు ఎందుకొస్తుందంటే, సహజంగా గుండె ఎడమప్రక్క భాగం పెరిగి క్రమ ప్రకారం రక్తాన్ని శరీరంలోకి పంపలేకపోతుంది. అలాగైతే శరీరంలోని రక్తాన్ని కూడా గుండె సరిగా తీసికోలేకపోతుంది. రక్తాన్ని గుండెకు చేర్చేందుకు వీన్‌లలోని వత్తిడి శక్తే కారణం. దీన్నే హైడ్రోస్టాటిక్ ప్రెషర్ (HYDROSTATIC PRESSURE) అంటారు. హార్ట్ ఫెయిల్యూర్ సమయంలో ఈ వత్తిడి ఎక్కువై వీన్ పొరలలోనుంచి రక్తంలోని లవణాలు ఖనిజాలతో కూడిన ద్రవం శరీరంలోకి పోవడం జరుగుతుంది. అందువల్ల హార్ట్ ఫెయిల్యూర్‌లో, శరీరంలో ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాళ్ళు, ముఖం, ముదిరిన కేసుల్లో శరీరమంతా నీరు వస్తుంది.

డైయూరిటిక్ టాబ్లెట్లు ఎక్కువ వాడడం వలన ఈ లవణాలు, ఖనిజాలు మూత్రంలో వచ్చేయడం జరిగి మనిషికి నీరసం వస్తుంది. ముఖ్యంగా పొటాషియం పోతే గుండె బలహీనమైపోతుంది. అందుకే పొటాషియం ఎక్కువగా తీసుకోవాల్సి వస్తుంది. పొటాషియం ఎక్కువగా, వాడితే కడుపులో మంట వుండే అవకాశం వుంది.

డాక్టర్ మాటకు డాక్టర్‌శ్రీని బాధపడ్డాడు. తను వస్తానంటే తీరికలేదని చెప్పాడని.

స్వాతి సర్దిచెప్పింది. "ఆయనెంత బిజీగావుంటే మనల్ని కాదని వుంటారు. పైగా మీసంగతంతా బాగా తెలుసుకదా! అందుకని రాకపోయినా ఫర్వాలేదనుకొని వుంటాడు."

ఆమాటకు సంతృప్తి కలగలేదు.

"బహుశా నన్ను చూడ్డం ఆయనకి ఇష్టం లేదేమో!"

"అలా ఎందుకనుకుంటారు...."



gudachari.com

నన్ను చూడాలంటే భయమేమో! ఇదొ జిడ్డుకేసని... అందులోనూ ఇది మొండికేసు, అర్థంకానిది. పైగా వాళ్ళు ఇద్దరు డాక్టర్లు. వాళ్ళు చేసేదీ, చెప్పేదీ అంతా తమకు తెలుసని వాళ్ళ ఓటమి ఒప్పుకోలేక ముఖం తప్పించుకోడానికైనా అయ్యుండచ్చు. కానీ డబ్బులు ఇవ్వడం లేదని మాత్రం కాదు. ఎందుకంటే అదే ఒక డాక్టర్ మరో డాక్టర్‌కి ఇచ్చే కనీస మర్యాద అనుకుంది స్వాతి.

డాక్టర్ స్వాతి, శ్రీని ఎంతో మంది డాక్టర్లు, వారి బంధుజనాలు దగ్గర డబ్బు, తీసికోరు. ఇవ్వలేదనీ అనుకొనేవాళ్ళూ కాదు. పైగా డాక్టర్‌శ్రీని వారి స్నేహితులు, ఆర్టిస్ట్‌లు, కొంతమంది టీచర్లు దగ్గరకూడా తీసికోరు.

కొంతమంది, "ప్రతిసారి ఊరికే చూపించుకోవడం ఇబ్బందిగా వుంది. ఇలా అయితే మీ దగ్గరకు రాము." అని కూడా చెప్పేవారు.

"రాకపోతే పొండి. నేను బాగా చూస్తాననీ, శ్రద్ధ తీసికుంటాననీ నమ్మకం వుంటే రండి." అనేవాడు నవ్వుతూ!

ఒక్కోసారి జబ్బు తగ్గకపోతే కొంతమంది, "చూశావా! మనం డబ్బు ఇవ్వలేదని సరిగ్గా చూడలేదు." అనుకొనేవారూ వున్నారు.

"అదేవిధంగా మనమూ అనుకుని ఉండొచ్చు కదా!" అని చెప్పింది స్వాతి అతనికి.

ఈ కన్‌సల్‌టెంట్ డాక్టర్లకు ప్రత్యేకంగా నర్సింగ్‌హోమ్‌లుండవు. పేషెంట్లను మరెవరో నర్సింగ్‌హోమ్‌లలో చేర్చి వాళ్ళు వెళ్ళి చూస్తుంటారు. పేషెంట్లను చూసి మందులు వ్రాసిచ్చి రెండు వారాలో, నెలో, మూడు నెలల తర్వాతో మళ్ళీ రమ్మంటారు. అదీ ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని, ఆ అపాయింట్‌మెంట్ కూడా నెల రోజుల ముందుగా తీసికోవాలి. అంటే జబ్బు ఈ మహానుభావులు దయతలచి చూసేంతవరకూ అలాగే వుండాలి. ప్రాణం పోతోంది వెంటనే చూడండంటే వీలవదు. ఒకవేళ తెగించి వెళితే అదృష్టం బాగుంటే అందర్నీ చూసిన తర్వాత ఏ రాత్రి పది గంటలకో చూస్తారు. చిన్న ఉపన్యాసం సైతం ఇస్తారు ఇలా చెప్పాపెట్టకుండా వచ్చి ఇబ్బంది పెట్టొద్దు అని. పేషెంటేమైనా వీళ్ళకి అవసరం లేదు.

నువ్వు పాత పేషెంటు అయినా, జబ్బు నీ నెత్తిమీదికి ముంచుకొచ్చినా నీ గతీ అంతే. గంటల తరబడి పేషెంటు బయట పడిగాపులు కాయాల్సిందే. అయినా ఈ ప్రజలు ఇంతే, ఏ సమయంలో వెళ్లినా చూసే మంచి డాక్టర్ల మీద నమ్మకముండదు. ప్రజల మనస్తత్వాన్ని బాగా స్టడీ చేసినవాళ్ళు ఈ కన్‌సల్‌టెంట్‌లు. జనరల్ ప్రాక్టీషనర్లన్నా చిన్న డాక్టర్లన్నా చిన్నచూపు వీళ్ళకి. కానీ వీళ్ళు బ్రతుకంతా ఈ చిన్న డాక్టర్లమీదే ఆధారపడి వుంటుంది.

జనరల్ ప్రాక్టీషనర్‌లకీ, కన్‌సల్‌టెంట్‌లకీ, అవినాభావ సంబంధం వుంటుంది. జనరల్ ప్రాక్టీషనర్స్ ఒక కన్‌సల్‌టెంట్‌ను పట్టుకుంటాడు. తాను బాగా ముదరపెట్టిన, తనకు



సాధ్యం కాని కేసుని, అది చిన్న పిల్లలదైనా కావచ్చు, గుండెకో, సర్జరీకో సంబంధించినదైనా కావచ్చు కడకు మెదడుకు సంబంధించినదైనా, ఆ కన్‌సల్‌టెంట్ దగ్గరకే పంపుతారు. ఆయన తను వసూలుచేసికోవాల్సింది, వసూలు చేసికుని మళ్ళీ మరో కన్‌సల్‌టెంట్‌ను పిలుస్తాడు. ఇలా ఆ పేషెంటును క్షుణ్ణంగా అన్ని పరీక్షలు చేయించి జేబులు ఖాళీ చేసి పంపుతారు.

చాట భారతమంతా చీటీ మోయలేనన్ని మందులు.... అవి చూస్తే చాలా, చాలా మంది జబ్బులు ఇట్టే మాయమయిపోతాయి.

ఒక్కోసారి ఈ కన్‌సల్‌టెంట్‌లు చాలా వింతగా కూడా ప్రవర్తిస్తుంటారు. ఎవరైనా ఒక డాక్టర్ ఒక కన్‌సల్‌టెంట్ దగ్గరకి తన స్వవిషయమై వెళ్తే అది ఆ కన్‌సల్‌టెంట్‌కే చాలా గౌరవప్రథమైన విషయం. ఎందుకంటే తనూ డాక్టరేగనుక అందర్నీ క్షుణ్ణంగా పరిశీలించి వారిలో అతిమంచి డాక్టర్నే ఎన్నుకుంటాడు. అది అర్థం చేసికోకుండా

"డాక్టర్...! నేను చాలా బిజీగా వున్నాను. మరో డాక్టర్‌ని చూడండి." అంటే ఎలా వుంటుంది.

కొంతమంది అయితే, "చెప్పాపెట్టకుండా వొస్తే మా డెయిలీ రొటీన్ ఎంత చెడిపోతుంది... మీరూ డాక్టర్లే కదా! ఆమాత్రం మీకు తెలియదా?" అంటూ ఫోజు కొడతారు. కానీ రోగం చెప్పిరాదని వీళ్లు ఆలోచించలేకపోతారు.

పోనీ వీళ్లు చూడరు. వేరెవరి దగ్గరకైనా ఈలోగా వెళ్తే, తమ కసినంతా వెళ్ళగ్రక్కి వాళ్ళనేమీ చేతగాని వాళ్లక్రింద తీసిపారేసే వాళ్ళూ వుంటారు.

వీరిలో కొంతమంది మంచివాళ్ళు వుంటారు. వెళితే ఎంతో మర్యాదగా ప్రవర్తిస్తారు. అనవసరమైన పరీక్షలు చేయక, మందులు వ్రాయక రోగికి ఇబ్బంది కలక్కుండా ఎప్పుడు వెళ్లినా బాగా చూస్తారు.

డాక్టర్ రెడ్డి గానీ, శంకర్ చౌదరి వాళ్ళు తమ కెంతో ఆప్తులయి పోయారు. వాళ్ళనెంతో శ్రద్ధగా చూసేవారు. జఠిలమైన సమస్యలు ఒకదాని మీద ఒకటి వస్తూవుంటే వాళ్ళకూ అసహనంగానే వుందేమో! వాళ్ళ విజ్ఞానమూ, అనుభవమూ ఎందుకు పనికి రాకుండా పోతున్నాయనే బాధతో పదే పదే తమని చూడ్డానికి అవమానంగా వుందేమో...! అనిపించింది స్వాతికి.

దీర్ఘకాలపు రోగుల మనస్తత్వాలు చాలా సున్నితంగా మారిపోతాయి. వాళ్ళకు తెలియకుండానే వాళ్ళలో మనోధైర్యం పూర్తిగా సన్నగిల్లిపోతుంది. వాళ్ళ మనసుకు కష్టం కలిగించకుండా ప్రవర్తించడం చాలా కష్టం. ఇతరులెవరి మీద విసుగూ, కోపం కనపరచినా వీళ్ళమీదే అని బాధపడ్తారు. డాక్టర్‌శ్రీని ఆలోచన్లు కూడా ప్రస్తుతం అలాగే వుంటున్నాయి.

"నేనే విధంగానూ వాళ్ళకు సాయపడని డాక్టర్ని కదా! నా ఆరోగ్యం బావున్నప్పుడు పేషెంట్లను వాళ్ళవద్దకే పంపేవాడ్ని. అందుకే నన్ను చూడ్డం వాళ్ళకిష్టం లేదేమో!" అనేవాడు. డాక్టర్‌శ్రీని, స్వాతి వాళ్ళకు సంబంధించిన కేసులు మాత్రమే చూసేవారు. ఎవరి దగ్గరకు వెళితే బాగుంటుందో సూచించే వారు.

అతని ముఖంలో, శరీరంలో మార్పు గమనిస్తూనే ఉంది స్వాతి. క్రమం తప్పని వ్యాయామం, మందులు వాడుతున్నా అప్పుడప్పుడు ఆయాసం అంటూనే వున్నాడు. అనుకున్నట్లుగా తన అనుమానం, భయం నిజమయ్యే క్షణం రానేవచ్చింది ఒకరోజు.

ఇద్దరూ కలసి బయటకి వెళ్ళి సంవత్సరం పైగా అయ్యింది. బయట ప్రపంచం ఒకటి వుంది, అందులో వినోదించే అవకాశాలు వున్నాయి అని ఆలోచించే అవకాశమే దొరకలేదింతవరకూ.

ఆరోజు, "ఏవండీ... సినిమాకెళ్దామండీ... మీకూ కాస్త రిలీఫ్‌గా వుంటుంది." అడిగింది స్వాతి.

సరే వెళ్ళారు.

స్వాతి సినిమాలో లీనమైపోయింది. ఉన్నట్లుండి స్వాతి భుజం పట్టుకుని కుదుపుతూ, "వెళ్ళిపోదాం." అన్నాడు.

ఉలికిపాటుతో అతని ముఖం వైపు చూసింది. విపరీతమైన భయం... ఆతృత కనిపించాయి. లేచి నిల్చోలేకపోతున్నాడు. గాలి చాలనట్లుగా నోరు తెరచి పీల్చుకుంటున్నాడు.

అతన్ని కారు దగ్గరకు తీసుకు వచ్చేసరికి స్వాతి పని అయిపోయింది. కారు దగ్గర డ్రైవర్ లేడు. అతన్ని ఎంత గట్టిగా అరచిందంటే థియేటర్ స్టాఫ్ అంతా బిత్తరపోయి చూశారు స్వాతిని.

వెంటనే హాస్పిటల్‌కి తీసుకుపొమ్మనింది. అంతవరకూ బ్రతికి వుంటారా.. అట్లా ఉంది పరిస్థితి.

కళ్ళు పెద్దవి చేసి, నోరు తెరచి గాలిని బలవంతంగా లాక్కుని తింటున్నట్లుంది. అదీ చాలనట్లు ఇంకా గట్టిగా పీలుస్తున్నాడు. అతని ఊపిరితిత్తుల్లో నీళ్ళతో కూడిన శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది స్వాతికి ఏం చేయాలి...? ఏం. చేయాలి...? చెమటలు పట్టేస్తున్నాయి... నోరు తడారిపోయింది. భయంతో గుండెలు పగిలిపోయేటట్లున్నాయి స్వాతికి.

హాస్పిటల్‌కి వెళ్ళగానే ఆక్సిజన్ తీసుకురమ్మని గందరగోళం చేసింది. అతని స్నేహితులైన డాక్టర్లందర్నీ పిలిపించేసింది నిముషాల మీద. ఆశ్చర్యం... వాళ్ళొచ్చేలోగా మామూలుగా అయిపోయాడు డాక్టర్‌శ్రీని.



ఇంత హడావిడి చేసినందుకు స్వాతిని చూసి నవ్వాడు.

"మీకు నవ్వుగానే వుంటుందండీ.. ఎందుకు నన్నిట్లా భయపెట్టి చంపుతారు..?" అంటూ గట్టిగా ఏడ్చేసింది స్వాతి.

వచ్చిన వాళ్ళంతా స్వాతిని ఓదార్చి, కాసేపైన తర్వాత ఆక్సిజన్ తీసేయమని చెప్పారు.

వెంటనే మద్రాసు తీసుకువెళ్తానంది స్వాతి.

అంత అవసరం లేదు. ఇప్పుడు ప్రయాణం చేయడం కూడా అంత మంచిది కాదు. ఉదయం తీసుకెళ్ళమని చెప్పారు.

మద్రాసుకు ఫోన్‌చేసి ఉదయం వస్తున్నట్లు డాక్టర్ రెడ్డికి, శంకర్‌చౌదరికి చెప్పింది.

ఆక్సిజన్ సిలిండర్ ఇంటికి తెప్పించి పెట్టుకుంది.

పక్క సరిచేసి పడుకోబెట్టింది. అతను మగతలోకి జారుకున్నాడు. స్వాతికి నిదురపట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని గడియారం చూస్తూ కూర్చుంది.

మళ్ళీ హాస్పిటలు... ఇది ఎన్నోసారి హాస్పిటల్‌లో చేరడమో గుర్తులేదు స్వాతికి.

"అక్యూట్ హార్ట్ ఫెయిల్యూర్"

మొదటి రోజు కొంచెం అటు ఇటుగానే వుంది. రెండో రోజు సర్దుకున్నారు.

ఆ రోజు ఉదయం ఊపిరితిత్తుల స్క్రీనింగ్‌కి పంపారు. గంటకు పైగా పడుతుంది. ఆహారం ఏమీ తీసుకోలేదు. ఆ రెండ్రోజులూ పొటాషియం ఎక్కువ మోతాదులో ఇచ్చి వున్నారు. మామూలుగా ఏదైనా ఆహారంతో కలిపి ఇవ్వాలి. అలా చేయలేదు వాళ్ళు.

అక్కడకు వెళ్ళింతర్వాత అక్కడి డాక్టర్‌తో డాక్టర్‌శ్రీని

"నాకు కడుపులో నొప్పిగా వుంది. ఏమైనా తీసుకుంటే మంచిదేమో?"

"ఈ పరీక్ష పూర్తయ్యే వరకూ ఏమీ తీసుకోడానికి వీల్లేదు.."

"డాక్టరు గారూ! అర్థంచేసికోడానికి ప్రయత్నించండి. ఈ నొప్పితో మంటతో గంటసేపు నేనుండలేను."

"పోనీ నొప్పి తగ్గడానికి ఏదైనా ఇంజెక్షన్ ఇవ్వమంటారా!"

"తినేదానికేమైనా ఇవ్వమంటున్నాను." కోపంగా అన్నాడు.

"ఇచ్చేందుకు వీల్లేదు. మా ఆర్డర్స్ అలాంటివి". పెడసరంగా జవాబు చెప్పాడు అక్కడున్నతను.

"సరే.. నేను డాక్టర్‌రెడ్డితో మాట్లాడుతాను ఫోన్ ఇవ్వండి."

చాలా గొడవ జరిగింతరువాత ఫోను చేసేందుకు వొప్పుకున్నారు.

డాక్టర్‌రెడ్డి విని పాలు ఇవ్వమని చెప్పారు.

అది అక్కడున్న డాక్టర్‌కి చాలా అవమానంగా తోచింది.



gudachari.com

"డాక్టర్ పేషెంట్లైతే ఇదే గొడవ. చెప్పండి తర్వాత ఏం చేయమంటారో?"

పుండుమీద కారం చల్లినట్లయింది డాక్టర్‌శ్రీనికి విసురుగా, "చెప్పమంటావా! నువ్వు చేసేపనేదో, ఎలా చేయాలో ముందుగా తెలుసుకోమంటున్నాను. పేషెంటును దబాయించి జులుం చూపించవద్దంటాను. పేషెంటు బాధ అర్థంచేసుకుని మసలుకోమంటున్నాను." అన్నాడు అతన్ని అసహ్యించుకుంటూ.

మరలాతనే, "ఈ పరీక్ష చేయాలని ముందే తెలుసుకదా మీకు. అటువంటపుడు పొటాషియం ఇచ్చివుండకూడదు. ఇచ్చారనుకో ఈ పరీక్ష వాయిదా అయినా వేసివుండాలి. ఆరెండూ చేయలేదు మీరు. ఆ... కడుపును కోసే మందు నాకిచ్చి నన్ను నోరు మూసుకుని మీరు చెప్పినట్లల్లా ఆడమంటారా! ఇది మీరు తెలిసి చేసిన తప్పు. చేయకూడని తప్పు. చిన్నవాడివి, వృద్ధిలోకి రావల్సిన వాడివి. పేషెంటును గురించి ఆలోచించడం నేర్చుకో..."

ఆ మాటలకు ఆ డాక్టరు తలవంచుకుని ఏదో గొణుగుతూ వెళ్ళిపోయాడు. తిట్లే అయివుంటాయి! అనుకున్నాడు డాక్టర్‌శ్రీని.

స్వాతి ఆవేశపడవద్దని చెబుతూనే వుంది.

ఇంతలో డాక్టర్ రెడ్డి హడావిడిగా వచ్చాడు. వస్తునే, "ఏవిటీ... చాలా గొడవ చేస్తున్నట్లుందే..." అన్నాడు.

"గొడవా... నేను..." ఇంకేదో చెప్పబోయేలోపల అందుకుని "అంతా నాకు తెలుసు. కొంచెం సర్దుకుపోవాలి. పైగా ఇది ప్రైవేట్ పాలిక్లినిక్. నీకు తెలుసుకదా కష్టనష్టాలు. కొంచెం భరించాలి." అన్నాడు రెడ్డి అతన్ని సముదాయపరుస్తూ.

నిజమే... ఇక్కడి డాక్టర్లకు అనుభవం కన్నా అహంకారంతో కలిసిన అధికారం వుంటుంది. పెద్ద డాక్టర్లు ఎలా చెబితే అలా చేయాల్సిందే. విజిటింగ్ డాక్టర్లు, పేషెంట్లు వీళ్ళతో మంచిగా వుండాలి. లేకపోతే ఎన్ని ఇబ్బందులైనా పెట్టగలరు. అందుకనే అక్కడివాళ్ళతో తగవుపెట్టుకోవడం సుతరామూ ఇష్టం లేదు. తనకిష్టం లేనివి జరిగితే సర్దుకుపోవాలి, తప్పదు.

మంచి డాక్టర్ల గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేదు.

సాయంత్రం మరో డాక్టరొచ్చి సలైన్ తీసేస్తానన్నాడు.

డాక్టర్‌శ్రీని నవ్వుతూ, "అది నా శరీరంలో ఒక భాగమైపోయింది. తీసేస్తే ఎలాగో వుంటుంది నాకు." అన్నాడు.

ముందతనికి అర్థంకాలేదు. అర్థం చేసుకొని నవ్వుతూ

"ఈ రోజు సాయంకాలం చేసిన రక్త పరీక్షలోను ఎన్‌జైమ్స్ (గ్రంధులు) కొంచెం ఎక్కువగా వున్నాయి. అయినా ఇది మరో హార్ట్ అటాక్ అని మేము అనుకోవడం లేదు. హార్ట్ ఫెయిల్యూర్ అని అనుకుంటున్నాము."



"అట్లాగయితే నాదో చిన్న ప్రశ్న నేనెందుకు హార్ట్ ఫెయిల్యూర్‌లోకి అంత సడెన్‌గా వెళ్ళాను. మందులు వాడుతూనే వున్నాను కదా!"

"అదే మాకూ అర్థంకాలేదు. రాకూడదని ఎక్కడా లేదు. రావచ్చు." అంటూ భుజాలు ఎగురవేసి "బహుశా బైపాస్‌ల్లో ఒకటి మళ్ళీ మూసుకుపోయి వుండొచ్చు. యానిజియోగ్రఫీ చేస్తే తెలుస్తుంది. అయినా అది మా పనికాదు. మీ డాక్టర్లు నిర్ణయించాల్సిన విషయం." అంటూ వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరూ ఆశ్చర్యంతో ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ వుండిపోయారు డాక్టర్‌శ్రీని, స్వాతి.

"మీ బైపాస్‌ల్లో ఒకటి మూసుకుపోయి వుంటుంది." అనే మాట చాలు ఎవరికైనా మరో హార్ట్‌ఎటాక్ రావడానికి అతను డాక్టర్ గనుక తట్టుకున్నాడు.

స్వాతి వైపు చూసి, "అంత భయపడిపోతావెందుకు?" అన్నాడు.

"మీరెందుకంత భయపడినట్లు చూస్తున్నారు?"

"నేను భయపడ్డానా..."

"మరి నేనా! అతని పిచ్చిమాటలకు నవ్వొస్తోంది. అతను నేర్చుకోవల్సిందింకా ఉంది." అంది స్వాతి.

"అతను నేర్చుకోలేడు." అంటూ నవ్వబోయి కడుపు పట్టుకుంటూ "నవ్వలేను.. నొప్పిగా వుంది." అన్నాడు డాక్టర్‌శ్రీని.

అప్పటికి వారం రోజులైంది. హార్ట్ ఫెయిల్యూర్‌కి కారణం ఎవరూ చెప్పలేదు. బైపాస్ మూసుకుపోయి వుంటుందన్న విషయం డాక్టర్ రెడ్డికి చెబితే కోప్పడ్డారు. ఆ చెప్పిన డాక్టర్ మీద. అది నిజమేనని అతనికి తెలుసు.

అతని జబ్బే స్వాతి జీవితం అయిపోయింది. మరే ఆలోచన లేదు. పిల్లలు గాని, హాస్పిటల్ గానీ అంతగా గుర్తురావడం లేదు. అయితే డబ్బు గురించి మాత్రం ఆలోచించ కుండా వుండలేకపోతుంది. ఎలా...? ఏం చేయాలి...? ఆయనకు బాగయిపోతే ఎలాగైనా చేయొచ్చు... ఇదే ఆలోచన్లు.

చివరికి ఆ వాతావరణానికి ఎలా తయారయ్యిందంటే, "బజారుకు వెళ్లొస్తానని", చెప్పడానికి బదులు "హాస్పిటల్‌కి వెళ్లొస్తాననేది. ఎవర్నైనా పిలవాల్సి వస్తే "నర్స్" అనో "డాక్టర్!" అనో పిలిచేది. పిచ్చిపడుతుందేమో కొంతకాలానికి...

కడకు డాక్టరుశ్రీనిని బాగా పీల్చి పిప్పి చేసి ఎండబెట్టి పంపారు ఇంటికి. అది తప్పదు. ఇప్పుడు ఆరు డైయూరిటిడ్ మాత్రలు వాడుతున్నారు డాక్టర్‌శ్రీని. దానివల్ల తగ్గిపోయే పొటాషియం లోటును భర్తీ చేసేందుకు ఎక్కువ పొటాషియం తీసుకుంటున్నాడు. మళ్ళీ అందువల్ల కలిగే కడుపు మంట తగ్గేందుకు యాన్‌టాసిడ్ లిక్విడ్ తీసికుంటున్నాడు.

gudachari.com

ఇంకా గుండె బలం కోసం డిగాక్సిన్ మాత్రలు, గుండె పని బరువు తగ్గించేందుకు సార్‌బిట్‌రేటు మాత్రలు, రక్తం గడ్డకట్టకుండా వుండేందుకు యాస్పిరిన్, డైయూరిటిక్స్ వల్ల కలిగే కొన్ని చెడులను అరికట్టడానికి ఆల్‌ప్రొలాల్ మాత్రలు, పొటాషియం మరీ ఎక్కువగా మూత్రంలో రాకుండా మరో ఎక్స్‌ట్రా డైయూరిటిక్ మాత్రలు వాడుతున్నారు.

కొంతకాలానికి వీటి ప్రభావం వల్ల ఒకవైపు రొమ్ము పెద్దదిగా పెరిగింది.

దీన్తోపాటు ఇంకా అనేక లోపాలు కలిగే అవకాశం వుంది. మగతనం తగ్గి, మగవాడికి ఉండాల్సిన లక్షణాలు సన్నగిల్లుతాయి. దీన్నే గైనకోమాషియా అంటారు.

ఆ విషయం డాక్టర్ శంకర్‌కి ఫోన్ చేసి ఎక్స్‌ట్రాగా వాడుతున్న మాత్రలు నిలిపేస్తే మంచిదా అని అడిగితే, ఆయన సరేనని మరో మాత్ర పేరు చెప్పారు.

ప్రతి విషయాన్ని తను వేసుకొనే ప్రతి మందు గురించి క్షుణ్ణంగా చదివి తెల్సుకుంటు న్నాడు. స్పెషలిస్టులకంటే ఎక్కువగానే గుండె గురించి ఉన్న పుస్తకాలు, జర్నల్స్ అన్నీ చదివేవాడు.

"డాక్టర్లు, తెలివి అంతా వాళ్ళసొంతం అనుకుంటారు. డాక్టర్లమైన మనల్నే వాళ్ళు బోల్తా కొట్టించ ప్రయత్నిస్తారు... ఇక సామాన్య మానవుల సంగతేమిటి...?" అన్నాడు స్వాతితో ఒకరోజు.

స్వాతి నవ్వుతూ, "పేషెంటులాగే మాట్లాడుతున్నారు. ఈ మెడిసన్ ఒక మహా సముద్రమని మీకు తెలుసు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఏ మందు ఎలా పనిచేస్తుందో కూడా చెప్పలేనంత మార్పులు సంభవిస్తున్నాయి. ఏ డాక్టరూ కావాలని తప్పు చేయరు. తెలియక చేసిన తప్పును తప్పు అని వాళ్ళు ఒప్పుకోరు."

"అక్కడే నువ్వు పొరబడుతున్నావు. తప్పును ఒప్పుకోవడంలోనే నిజాయితీ వుంది. ఆ నిజాయితీ లేకపోతే డాక్టర్ కాదు. "

"నిజాయితీగా ఒప్పుకుంటే మెచ్చి, అతన్ని అందలం ఎక్కించదు ఈలోకం. అది ఆసరాగా తీసికుని అతన్ని అధఃపాతాళానికి త్రొక్కిపారేస్తుంది. మంచి డాక్టర్లు తప్పును మనసులోనైనా ఒప్పుకుంటారని నా అభిప్రాయం. మూర్ఖపు డాక్టర్ల సంగతి వదిలెయ్యండి."

"మన దగ్గరైనా ఒప్పుకోవచ్చుకదా! ఇంతకు మునుపు నన్ను బాగా వ్యాయామం చేయి అన్ని చెప్పిన వాళ్ళే ఇప్పుడు వ్యాయామం నువు కొంచెం ఎక్కువ చేసినట్లుంది అందువల్ల ఇలా అయింది అంటున్నారు. అలాగాక ఇది మా తప్పే అని ఒప్పుకుంటే ఎంత బావుంటుంది."

"మరీ అమాయకంగా మాట్లాడుతున్నారండీ మీరు." అంతకంటే ఏం అనాలో తెలియక అంది స్వాతి.



అసలు డాక్టర్లకు బాగా పేరు రావడానికి అనేక కారణాలుంటాయి. కొన్ని జబ్బులు ముదరడానికి, తిరిగి రావడానికి కారణం ఎక్కువగా డాక్టర్ల చేతగానితనమే అయి వుంటుంది. డిగ్రీలుండగానే సరిపోదు. తమకు తెలిసినదాన్ని సరైన పద్ధతిలో సరైన సమయంలో ఉపయోగించే ఇంగిత జ్ఞానం వుండాలి.

బ్రహ్మాండంగా అన్ని హంగులతో ఇంద్రలోకంలా మామగారిచ్చిన డబ్బుతో నర్సింగ్ హోమ్ కట్టించి పారేసే డాక్టర్లులో పసలేకపోవచ్చు గానీ పేరుండొచ్చు.

విద్యాధికుల్లో సైతం జాఢ్యంలో అల్లుకుపోతున్న కులతత్వంతో ఈ రోజుల్లో తమ కులం డాక్టర్ని పైకి తేవడానికి ఇతరులపై లేనిపోని పుకార్లు పుట్టించడం ద్వారా పేరు సంపాదించొచ్చు.

అతి మర్యాదగా, అతి అణకువగా నవ్వు పులుముకుని పేషెంటు ఇష్టప్రకారం వాళ్ళదారిలో నడుస్తూ ఏ మాత్రం నొప్పి కల్గించకుండా బ్రహ్మాండమైన పేరు తెచ్చుకోవచ్చు.

ఈ కాలంలో పేషెంటుకి కావల్సింది డాక్టర్ నైపుణ్యం కాదు. వాళ్ళూవీళ్లూ చెప్పే చెప్పుడు మాటలు పదిమంది నీ కులపువాళ్ళో, పదిమంది వందిమాగదులో చాలు డాక్టరుకు పేరు ప్రతిష్టలు వచ్చేందుకు.

ఇక కొందరు డాక్టర్ల ప్రవర్తనలు కూడా వైద్యవృత్తే సిగ్గుపడే విధంగా వుంటాయి.

ఒకరికి హెర్నియా అనుకోండి. (బొడ్డుక్రింద భాగంలో లీనియా ఆల్బా అనే ప్రదేశం వుంటుంది. కొందరికది పలచగా వుండి పొట్టలోని ప్రేవులు పైకి ఉబుకుతాయి. అలా ఉబికిన తిత్తి లాంటి దాన్ని హెర్నియా అంటారు. ఇది పొట్ట మీద వస్తే అబ్‌డామినల్ హెర్నియా అని, తొడ దగ్గిర వస్తే ఫిమోరల్ హెర్నియా అని, జననాంగం దగ్గర వస్తే ఇన్‌గ్వైనల్ హెర్నియా అని అంటారు.) దీన్ని సరైన పద్ధతిలో ఆపరేషన్ చేయకపోతే మళ్ళీ తిరిగి వచ్చే అవకాశం వుంది. అలా జరిగితే అది డాక్టర్ల తప్పే, అయితే డాక్టర్ నేనేం చేసేది... నీ శరీరవాటం అటువంటిది అని తప్పించుకుంటాడు. మరీ పలచనయితే వేరే గ్రాఫ్ట్ వేస్తారు.

అదే విధంగా ఎముకల డాక్టర్ విరిగిన ఎముకను సరిగా పొజిషన్‌లో పెట్టక కట్టు కట్టేసి, వాపు వస్తే "మరీ, నీకు తొందరయ్యా... కట్టుకట్టెయ్యగానే నడిచేయడమేనా!" అని పేషెంటు నెత్తిన రుద్దేస్తారు.

రోగం ముదిరి చావబోతూ వుంటే, "అరెరే.. మీరు కొంచెం ముందుగా వచ్చుంటే బాగు చేసి వుందునే." అని బాధపడ్డట్టు నటిస్తారు.

అంతవరకూ ఆరోగ్యంగా వుండి ఉబుసుపోక తన పాపులారిటీ ఎంతో చూసేందు కెంతమంది వస్తారో తమాషా చూద్దాం అని అపెండిసెక్టమీ చేసుకుందామని, సెంటు పూసుకుని థియేటర్‌లోకి వెళితే, శవం తిరిగి వచ్చిందంటే మత్తిచ్చిన డాక్టర్ "చాలా

కాంప్లికేటెడ్ కేసండీ... చాలా కష్టపడ్డాం అప్పటికీ..." అంటూ చెమట తుడుచుకుంటాడు. తను ఎక్కువ మత్తిచ్చి, ఆక్సిజన్ ఇవ్వడం మరచిపోయి నందువల్ల చనిపోయాడనే నగ్నసత్యం చెప్పలేక.

గుండెపోటుతో అక్కడికక్కడే ఎవరైనా చనిపోతే, "అరే... నాదగ్గరకు తీసుకువచ్చుంటే బ్రతికేవాడు కదా!" అనే కార్డియాలజిస్టులు సహజం. తను సృష్టికి చాలా దగ్గరవాడయినట్లు.

పేషెంట్లూ అలాగే ఉంటారు.

ఇంటి దగ్గర చేయకూడనివన్నీ చేసుకుని వచ్చి ముదరబెట్టుకుని రోజుకో డాక్టర్ని మార్చి ఆఖర్ని ఎవరో ఒకరి దగ్గిర జరగరానిది జరిగితే ఆ డాక్టర్ని అక్షింతలు. శాప నార్థాలు... ఎంత జబ్బయినా అర్జంటుగా తగ్గిపోవాలి. జబ్బు బాగయితే పేషెంటు నోములు ఫలించినట్లు. మందులు సరిగా వాడక, జబ్బు తగ్గక పేషెంటుపోతే డాక్టరుకు హస్తవాసిలేనట్లు.

డాక్టర్లని వచ్చీరాగానే మీ వల్ల అవుతుందా! కాదా! అని దబాయించే వాళ్ళూ ఉన్నారు.

ఎవరికి వారే ఎక్కడికక్కడే తప్పించుకోవాలనే ప్రయత్నం

"తప్పు నీదే!"

"కాదు నీదే!"

"కాదు! కాదు! మీదే... మీదే!!" యుద్ధం అంతులేని యుద్ధం ఎవరికి ఎవరూ తీసిపోరు.

ఇకనైనా ఇటువంటివి మానేసి నిజాయితీ అనే మాటను రంగరించి పాలడతో అందరికీ పోస్తే బావుండునినిపించింది స్వాతికి. ఈ దేశంలో వైద్యవృత్తి ఈ దశకు దిగజారడానికి కారణం ఒక్కటే... నిర్లక్ష్యం. దీనిక్కారణం మళ్ళీ మూర్ఖత్వం.

పేషెంటు డాక్టర్ని నమ్మాలి.

డాక్టర్ పేషెంటును నమ్మాలి.

పేషెంటు డాక్టర్తో నిజాయితీగా ప్రవర్తించాలి.

డాక్టరూ పేషెంటుతో నిజాయితీగా ప్రవర్తించాలి.

డాక్టర్లు డబ్బుకోసం కక్కుర్తి మానాలి.

పేషెంట్లు ఏరుదాటగనే తెప్పతగలేసే మనస్తత్వం మానాలి.

ప్రతి ఒక్కరిలోనూ డాక్టర్ల మీద గౌరవ భావం వున్నపుడు ఆ డాక్టర్ కూడా తప్పు చేయ జంకుతాడు. ఎవరికి ఎంత దొరికితే అంత అనే మనస్తత్వం ఉన్నంతకాలం ఎవ్వరూ బాగుపడరు. మంచి వైద్యం ఎవ్వరికీ అందుబాటులో వుండదు.



ఇదొక పురాణం... అంతులేనిది, అంతంకానిది.

ఆలోచనల్లోంచి బయటపడి "మరలా ఎప్పుడు రమ్మన్నారు?" అడిగింది స్వాతి డాక్టర్శ్రీనిని.

"అవసరం అనిపించినప్పుడు" అని వెంటనే నవ్వాడు.

ఏవిటన్నట్లు చూసింది.

"చిన్న తమాషా చేశాను ఈరోజు. ఒక జూనియర్ డాక్టర్ వచ్చి నా జబ్బు కనుక్కోడానికి ఏవేవో ప్రశ్నలు వేశాడు. అతనికేం అంతుపట్టలేదు."

"ఈ రోజు మీరేం భోం చేశారు?" అన్నాడు.

"చికెన్." అన్నాను.

"ఆ... అదీ సంగతి." అంటూ ఏనుగెక్కినంత సంబరపడిపోయాడు.

నేను, "డాక్టర్... కోడికూరలో ఉప్పుకాస్త తక్కువయింది నా చేతి మీద కాస్త పడింది..." అన్నాను.

"అది, మీరు వాసన చూసి వుంటారు. అది మీ ఊపిరితిత్తుల్లో..." మధ్యలో నావైపు చూసి నేను తనని ఆట పట్టిస్తున్నానని గ్రహించి కోపంతో చర చర వెళ్ళిపోయాడు. అంటూ సంతోషంగా నవ్వాడు.

ఒకరోజు చాలా బావుంటాడు. మరోరోజు చాలా ప్రమాదంలో వున్నట్లుంటాడు. ఎప్పుడేం జరుగుతుందో అనే భయంతో ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని నెట్టుకువస్తుంది స్వాతి.

బావున్నపుడు ఒక్కక్షణం ఖాళీగ వుండడు. స్వాతితో పాటు హాస్పిటల్కి వెళ్ళి అది చెయ్యలేదు, ఇది చేయ్యలేదని అందరికీ పనులు పురమా యిస్తాడు భవిష్యత్ గురించి వివరిస్తాడు.

బాగులేకపోతే మంచం మీద కూర్చుని శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తూంటాడు. ఆ సమయంలో అతన్ని చూస్తే స్వాతికి వాళ్ళ జీవితాలు గాలికి కొట్టుకపోతున్నట్లుంటుంది. ఎంతకాలమీ యాతన...? అనిపిస్తుంది.

అది భరించలేక, "అలా ఉండకండి." అనేది స్వాతి.

"ఎలా వుండమంటావు...? నాకు చేతనైందిది."

"ఆవిధంగా మిమ్మల్ని చూడలేను నేను." వ్యధతో అనేది.

"చూడలేకపోతే ఫో... నానుంచి దూరంగా." అంటూ చిరాకు పడేవాడు.

"ఇలా బ్రతకడం కంటే ఛస్తే మీ అందరికీ పీడ విరగడైపోతుంది."

"మీరెందుకూ... నేను ఛస్తే బావుంటుందంటున్నా!"

"జబ్బునాకు... కష్టపెట్టేది నేను... నేనే కదా చావాలి."



gudachari.com

"నాకు మీరు చావాలనుందా.. ఆమాటే నిజమయితే ఇప్పుడే మీ ముందే ఛస్తాను... చెప్పండి..." తనను అర్థం చేసుకోలేదనే బాధతో ఏడ్చేసేది స్వాతి.

తను చేస్తున్నది తప్పు అనే తెలుసుకొనే లోగా ఇలాంటి వాదనలు అనుకోకుండా జరిగేవి. వెంటనే అతని పరిస్థితి అర్థం చేసుకోకుండా తను చాలా మూర్ఖంగా ప్రవర్తించిందేమో అనిపించేది. అసలే మానసికంగా, శారీరకంగా అలసి కృంగిపోయి వున్న వ్యక్తితో అలా మాట్లాడవచ్చా... తన పొరబాటును తెలుసుకుని కృంగిపోయేది స్వాతి. సహనాన్ని కోల్పోవడం గాని ఎలాంటి విషమ పరిస్థితుల్లోనూ చేయకూడదని నిర్ణయించుకొంది.

డాక్టరు శ్రీని కూడా అదే ఆలోచిస్తున్నాడు.

ప్రక్కకు తిరిగి పడుకున్న అతని దగ్గరకు వెళ్ళి, "ఏమండీ... నేను మిమ్మల్ని బాధ పెట్టాను. క్షమించండి." బ్రతిమాలాడేది.

"ఛీ... ఛీ... ఏడవకు... నేనే కొంచెం విసుగులో ఏదో అన్నాను." అనేవాడు. తనూ తన తప్పును తెలుసుకుని.

"మీ కోసమే ఈ ప్రాణం నాగుండెల్లో నిలచివుంది. మీరు చచ్చిపోతారనేది ఊహించుకునే ధైర్యం కూడాలేదు. మీరలా అంటే నాకెంతబాధ.." మాట్లాడలేకపోయేది.

"నాకు తెలుసు... క్షమించు.. ఎప్పుడూ ఇక నిన్ను బాధపెట్టను." అంటూ దగ్గరకు తీసికునే వాడు డాక్టర్‌శ్రీని.

"నేనూ ఎప్పుడూ ప్రశ్నలతో విసిగించను," అంటూ అతనితో కలిసి పోయేది స్వాతి.

ఏ రోగి బంధువు గాని, వాళ్ళకు దగ్గర వాళ్ళు గాని దీర్ఘకాలపు రోగి దగ్గర, వాళ్ళ ఆర్థిక బాధలు గాని, కించపరిచే మాటలు మాట్లాడకూడదు

ఈ సమస్యకు పరిష్కారమెప్పుడు. తమ జీవితాలు బాగుపడేదెప్పుడు. మరుసటి రోజు ఉదయం డాక్టర్ శంకర్ చౌదరికి ఫోన్ చేసి, "నేను కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను." అంది స్వాతి.

కొంచెంసేపు జవాబు లేదు. స్వాతి అడగబోయే ప్రశ్నలు ఏవైఉంటాయో, ఎలాంటివై ఉంటాయో, ఎందుకో భయం వేసింది డాక్టర్‌శంకర్‌కి.

"ఓ.కె. అడగండి." అన్నాడు ఆలోచనతోనే.

"ఆయన బావున్నారు."

"వెరిగుడ్... గుడ్‌న్యూస్"

"కానీ మళ్ళీ ఉన్నట్లుండి బాగులేకుండా వస్తుంది. ఇలా ఎందుకు జరుగుతోంది...?" తర్వాత మాటకు ధైర్యం తెచ్చుకోవాల్సి వచ్చింది స్వాతికి.



"అది జబ్బు తగ్గుముఖం కాదనుకుటాను..." అంది తన అనుమానం ఎలా వ్యక్తపరచాలో తెలియక.

"కరెక్టు"

"జవాబు మీకు పూర్తిగా తెలియకపోయినా ఊహించి చెప్పగలరా?"

"వెల్... హార్ట్ ఈజ్ నాట్ పంపింగ్ వెల్."

"బట్ వాటీస్ ది కాజ్ ఫర్ ది సడెన్ రివర్సల్?"

"అది అంత సడెన్ కాదేమో.... అతను ఇంతకు ముందు అప్పుడపుడు ఫెయిల్యూర్‌లోకి వెళ్తున్నమాట నిజమేకదా... డైయూరిటిక్స్ పెంచితే మళ్ళీ మాములవుతున్నాడు."

"మరి... ఉన్నట్లుండి ఈ ప్రమాదం రావడానికి కారణం?"

కాసేపు ఆలోచించాడు డాక్టర్ శంకర్

"నిజంగా నాకు తెలియదు." అన్నాడు.

"మరోసారి యానిజియోగ్రఫీ తీస్తే తెలిసే అవకాశం వుంటుందా?"

"ఉండొచ్చు... కానీ ఈ పరిస్థితుల్లో నాకిష్టం లేదు."

"ఎందుకని?"

చాలాసేపు మాట్లాడలేదు. ఆ తర్వాత

"డాక్టర్ స్వాతీ! మీరు నిజాన్ని నిర్భయంగా భరించాలి. యానిజియోగ్రఫీ తీస్తే ఏం జరిగివుంటుందో తెలుస్తుంది. అది మంచిదై వుంటుందని నేను అనుకోను. ఆపరేషన్ చేసినా ప్రయోజనం ఉండదని తెలుసు. అటువంటపుడు చేయడం ఎందుకు. మందులు పనిచేస్తున్నప్పుడు, రిస్క్ ఎందుకు తీసుకోవాలి."

"ఏమై వుంటుందని మీ ఉద్దేశ్యం...?"

"చెడిపోయి బాగు చేయలేని గుండె... క్షమించండి. మిమ్మల్ని బాధపెడ్తున్నాను. డాక్టర్‌గా అడిగారు కనుక చెపుతున్నాను."

"మరే విధంగానూ... బాగవదా?"

"ఉంది. ఒకే మార్గం... హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్. అది ఈ దేశంలో ఇప్పుడిప్పుడే ప్రయత్నాలు జరుగుతున్నాయి." చేయాలనే ఉబలాటం వున్నా... దానికి చాలా అడ్డంకులు ఉన్నాయి.

"ఎక్విప్‌మెంట్ లేదా...?"

"ఉంది. కానీ గవర్నమెంటు నుంచి చాలా అవరోధాలు ఉన్నాయి. అవయవాలు యిచ్చే దాతలు కూడా ఇంకా ఆలోచిస్తున్నారు.

"ఈ హాస్పిటల్ వాళ్ళే తెప్పిస్తున్నారు."

gudachari.com

"మరి... ఈయనకు చేయవచ్చా?"

ఆ ప్రశ్నకు అప్రతిభుడయ్యాడు డాక్టర్ శంకర్. స్వాతి ఏ పరిస్థితులో ఆ ప్రశ్నవేసిందో అర్థం చేసుకుంటే అతని మనసు ద్రవించింది.

చాలా సేపు నిశ్శబ్దం... ఆతర్వాత స్పష్టంగా

"హేట్సాఫ్ డాక్టర్ స్వాతీ! నిజంగా మిమ్మల్ని చూసి నేను గర్వపడుతున్నాను. నీ ధైర్యాన్ని, మనో నిగ్రహాన్ని అభినందించకుండా వుండలేకపోతున్నాను. అందుకే మీరిద్దరంటే మాకంత ఇష్టం. మీ భర్తకూడా అంతే ఫైటర్.. అదే ఇంకెవరైనా అయివుంటే...? అటువంటి మనిషిని నేనింతవరకూ చూడలేదు. ఓ... కే... నీ ఆశ, ఆశయం నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈసారి వచ్చినపుడు మాట్లాడుకుందాం..."

అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ దగ్గరలాగే నిలబడి పోయింది. అతని మాటలు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి. చెడిపోయి బాగుచేయలేని గుండె ఈ మాటలే వేయి వింత శబ్దాలతో... అవే పదాలు.. అవే మాటలు... స్వాతిని శక్తిహీనురాల్ని చేసేశాయి. తన మనస్సు మొద్దుబారిపోయింది. ఏదో నిస్సత్తువ... ఆయనింక బ్రతకరు... ఏదో ఒకరోజు... ఎప్పుడో.. ఏక్షణంలో అయినా చనిపోవచ్చు... ఆ ఆలోచన భరించలేకపోయింది. ఆ ఊహే పిచ్చిదాన్ని చేస్తోంది తనని. తను ఓడిపోతుంది..

లేదు... తను ఓడిపోవడానికి వీల్లేదు... ఆయన చనిపోవడానికి వీల్లేదు... బ్రతకాలి... ఆయన్ని బ్రతికించుకోవాలి... ఎలాగైనా అని అనుకోసాగింది పదే పదే.

ఎలా...? ఎలా బ్రతికించుకోవాలి.. ఏం చేయాలి? హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్. అదిక్కడ చేయడం లేదే... విదేశాలకు వెళ్ళాలంటే.. పోనీ అక్కడున్న స్నేహితులకు వ్రాసి సాయంకోరితే... చేస్తారా.. అనుమానం స్వాతికి.

దానికి డాక్టర్ శ్రీని ససేమిరా వొప్పుకోడని తెలుసు.

ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? సతమతమైపోతుంది.

ఉన్నట్లుండి ఒకరోజు దృఢంగా చెప్పాడు, "ఇక ఎలాంటి పరిస్థితిలోను హాస్పిటల్‌కి వెళ్లను" అని స్వాతితో.

గుండెల్లో రాయి పడింది స్వాతికి.

"డాక్టర్‌గా వుండి, మీరే అలా మాట్లాడితే ఎలాగండీ?" అంది

"ఏం చేయమంటావు... ఏదో చేస్తారని వెళ్ళడం... ఉన్న మందులే కొంచెం పెంచి పంపడం... మళ్ళీ తగ్గించుకోవడం.. అదేదో మనమే చేసుకోవచ్చు."

"మనకు మనం వైద్యం చేసికోవడం తప్పు కదండి, పైగా వాళ్ళు అందులో నిపుణులు."



"అందుకే ఇంతకాలం వాళ్ళచుట్టూ తిరిగింది. జబ్బు పెరిగిందే తప్ప. తగ్గిన పాపాన పోలేదు. ఎందుకు ఎక్కువైందో కూడా తెలియదు వాళ్ళకి."

స్వాతి ఏం జవాబు చెప్పలేదు.

"నేనొక ప్రయోగశాల అయిపోయాను వాళ్ళకి. ఆ ఎక్స్‌పెరిమెంట్స్ ఏవో నేనే చేసుకుంటాను." అన్నాడు నవ్వుతూ అన్నా ఆ వెనుక దాగి ఉన్న నిరుత్సాహం. నిస్పృహ తెలుస్తూనే ఉంది, స్వాతి.

దీని అంతేదో తనే తేల్చుకోవాలని అతనిలోని డాక్టర్ వెలుపలకి వచ్చాడు. ఇంతకాలం డాక్టర్ల మీదున్న నమ్మకం క్షీణించిపోయింది. మందులు వాడే కొద్ది జబ్బు పెరగడంతో భరించలేకపోతున్నాడు, ఏదో చేయాలి... ఏమైంది... వీళ్ళంతా ఏదో దాస్తున్నారు... అది తెలుసుకోవాలి.. అనే తపన. మొదలయింది అతనిలో.

ఒకరోజు నాడి పట్టుకుని స్వాతి దగ్గరకు ఎరిగెత్తుక వచ్చాడు "సీ మై.. పల్స్.. హండ్రెడ్రన్ ఫోర్టీ..." అతని ముఖం పాలిపోయివుండటం గమనించింది స్వాతి.

పల్స్ చాలా ఎక్కువగానేవుంది. అతని చేయి పట్టుకుంటే స్వాతి చేయి వణుకుతోంది.

"డాక్టర్‌కి ఫోన్ చేద్దామా... ఆయాసం వుందా?"

చెమటపోస్తూ ఉంటే ఆత్రుతగా అడిగింది.

"నో... నో... డాక్టర్.. ఐయామ్ ది డాక్టర్.. నేనే దీని సంగతి కనుక్కుంటాను."

అంటూ థిరపీటిక్స్ పుస్తకం ముందు వేసికుని కూర్చున్నాడు. దానిలో ఏమందులు ఎలా పనిచేస్తాయి. చెడుచేస్తాయా... మొదలాలైన వివరాలుంటాయి. అది చూసి ఎదురుచెప్పే ధైర్యం లేక బాధపడింది స్వాతి.

పండ్లరసం ఇస్తే తాగి మళ్ళీ ఆ పుస్తకంలో లీనమైపోయాడు.

మరో పది నిమిషాల్లో మళ్ళీ స్వాతి దగ్గరకు వచ్చి పల్స్ చూడమన్నాడు.

నార్మల్‌గా వుంది.

ఆమె వణుకు తగ్గి ఆమెలోని ఆతృత,భయాన్నంతా నిట్టూర్పు రూపంలో బయటకు నెట్టి అతని వైపు చూసి నవ్వింది. ఆ ముఖంలో ప్రశాంతత కనిపించింది.

మరో రోజు అదేవిధంగా జరిగింది. ఈసారి ఫల్స్ మరీ ఎక్కువ. ఒక్కోసారి పల్స్ బీట్ నిలచిపోతుంది. మరలా మామూలు అవుతుంది. హార్ట్ ఫెయిల్యూర్‌లో ఈవిధంగా జరుగుతుంది. అయితే అది క్రమ ప్రకారం అంటే పదిసార్లకి ఒకసారి లేదా రెండు మూడు మార్లకు ఒకసారి పల్స్ బీట్ తప్పిపోతుంది. ఇది అలా కాదు. ఆ మిస్ కావడం రెగ్యులర్‌గా వుంది.

"ఓ...కె... వుయ్‌విల్ దూ వన్ థింగ్.. నారక్తం తీసి లాబ్‌కి పంపిద్దాం."

"మనం చేద్దామా?" భయపడింది స్వాతి.

"ఏం చేస్తే...!"

రక్తం తీసి లాబ్‌కి పంపాడు. రక్తంలో పొటాషియం శాతం తక్కువ వున్నట్లు రిపోర్ట్ వచ్చింది. అలా మూడునాలుగుసార్లు చేశాడు. అన్నిసార్లు అదే రిజల్ట్.

పొటాషియం లోపం వల్ల అలా జరిగిందని నిశ్చయించుకున్నాడు. పొటాషియం తీసికోవడం ఎక్కువ చేశాడు. దానితోపాటు యాన్‌టాసిడ్... కూడా

ఇంత జబ్బులో వున్నా చూసేందుకు అతను మామూలుగా వుంటున్నాడు. అదే విచిత్రం. అనిపించింది స్వాతికి. చాలా మంది అతన్ని చూసి "ఇప్పుడు మీరు చాలా బావున్నారు." అనేవాళ్ళు.

అసలు సంగతి తెలిస్తే పాపం... వాళ్లు ఆశ్చర్యపోతారేమో...

"నేనిక డాక్టర్లని చూడను. ఎందుకంటే వాళ్ళకి విసుగు పుట్టిపోయింది నా జబ్బుతో. వాళ్ళకీ తెలిసిపోయింది చేయడానికిక ఏమీ లేదని. కాకపోతే దయతో, జాలితో మళ్ళీ మళ్ళీ రమ్మంటూ ఇచ్చిన మందుల్నే పెంచుతూ తగ్గిస్తూ వస్తున్నారు."

"నాకు తెలుసు నా పరిస్థితి." పూర్వం అన్న మాటలకు ఈ మాటలకు చాలా తేడా కనిపించింది స్వాతికి.

ఆ మాటకు ముచ్చెమటలు పోసాయి స్వాతికి.

ఎంతవరకూ తెలుసు.... బాగుచేయలేనంత, బాగుకానంత ప్రమాదస్థితిలో వున్నారని తెలుసా...?! మరి తెలిస్తే అంతటి చేదును భరిస్తున్నారా..? ఏమో! గుండె గుబగుబలాడింది స్వాతికి.

పొటాషియం తీసికుంటున్నా, అతని పల్స్ ఒక్కోసారి రెసుగుర్రాల్లా పరిగెత్తుతున్నట్లు... వెంటనే కుంటి గుర్రంలా వుండి వుండి పరిగెత్తుతున్నట్లు వుంటోంది. రక్తంలో పొటాషియం శాతం తక్కువైనందువల్ల అలా జరుగుతుంది. మరి తీసికుంటున్న పొటాషియం అంతా ఎటు పోతున్నట్లు...? అని అనుమానం వేసేది శ్రీనికి.

ఇలా వొచ్చినపుడల్లా రక్తం తీసి పరీక్షకు పంపుతున్నాడు.

ఒకరోజు స్వాతి ఇంటికి వచ్చే సరికి

"ఓ... డియర్... ఐ గాట్ ది కరెక్టు ఆన్సర్." అన్నాడు ఒక పుస్తకం స్వాతికి చూపుతూ. అందులో రక్తంలో పొటాషియం తక్కువ ఉన్నపుడు డిగాక్సిన్ వాడుతుంటే ఇలా జరుగుతుందని వ్రాసి వుంది.

"సీ... ఐయామ్‌ది డాక్టర్... నాకు నేనే డాక్టర్ని. ఈ విషయం మీ స్పెషలిస్టు లెప్పుడూ చెప్పలేదు." గర్వంగా అన్నాడు.



"ఇప్పుడేం చేద్దాం?" అంది స్వాతి అయోమయంగా.

"ఏముంది. డిగాక్సిన్ తగ్గించేయడమే."

"ఒకమారు డాక్టర్లకి ఫోన్ చేస్తే బావుంటుందేమో."

"ఓహ్.. నీది మరీ విడ్డూరం. ఆమాత్రం మార్పుకూడా చేసికోకూడదా మనం."

"అలా అని కాదు. మర్యాదగా వుంటుందని."

"ఏవిటి మర్యాద? నా జబ్బును గురించి నాకు చెప్పక పోవడం మర్యాదా..? ఎన్నిసార్లు వెళ్లినా అంతా బావుంది, ఫర్వాలేదు. అని నా సంతృప్తి కోసం చెప్పడం మర్యాదా...? వెళ్లినపుడు మనల్ని మర్యాదగా చూస్తున్నారని మనమూ మర్యాదగా వుండాలంటున్నావా...?" మాట్లాడడం నిలిపి కాస్త ఆయాసం తీర్చుకుని మళ్ళీ

"నాకు తెలుసు రోజురోజుకు నేనెంత కృశించిపోతున్నానో... ఆ నిజాన్ని దాచిపెట్టడం మర్యాదా..? ఏది మర్యాద..?" విరుచుకుపడ్డాడు ఆమెమీద.

డాక్టరు పేషెంటు అయినా, అంతా తెలిసి ఉన్నా పదే పదే తన జబ్బు విషయం, ఏం జరుగుతుందో ఎలా జరుగుతుందో అనే తపనగాని, భయంగాని ఉండకూడదు.

"నేను భయపడటం లేదు. కానీ... "నన్ను భయపెడుతున్నారు.

ఆలోచించే కొద్దీ జబ్బు ఎక్కువ అవుతుందని మీకు తెలియదా! అన్నీ తెలిసి మీరే ప్రతి నిముషం అందులోనే కూరుకుపోతున్నారు. మీ ధ్యాసను మరో దానిమీద లగ్నం చెయ్యండి. పిల్లల్ని స్కూలు మానిపించి వేస్తాను. వాళ్ళతో ఆడుకోండి. మంచి పాటలు వినండి. మీకు ఆర్ట్ అంటే చాలా యిష్టం కదా! అన్నీ తెప్పిస్తాను. కావాలంటే నేనూ హాస్పిటల్ మానేస్తాను. నా కళ్ళల్లోకి మీరు మీ హృదయంలోకి నేనూ! మన ప్రేమ సామ్రాజ్యంలోకి మన పిల్లలూ... అంతే. మీకు జబ్బు లేదు. ఉన్నా అది మనల్ని ఏం చెయ్యదు. కోపగించుకోకండి. అర్థం చేసుకోండి. మమ్మల్ని సంతోషంగా ఉంచడమా వ్యాధి ఆలోచనలతో కృంగిపోవటమా.." దగ్గరగా, మరీ దగ్గరగా తీసుకొని ముద్దు పెట్టుకుంది స్వాతి. ఆమెకు మరో లోకంలోకి వెళుతున్నట్లనిపించింది.

ఎందుకయినా మంచిదని డాక్టర్ రెడ్డికి ఫోను చేసింది. పల్స్ గురించి భయపడాల్సినదేమీలేదని, డిగాక్సిన్ ఒకపూట తగ్గించమని, పేషెంటుని ఒకసారి తీసుకురమ్మని చెప్పారు.

స్వాతికి అలాగే అనిపించింది. కానీ వెళ్దామంటే ఏమంటారో... ధైర్యం చాలడం లేదు. ఈ మధ్య అతనిలో కోపం, విసుగూ చాలా ఎక్కువ అయ్యాయి.

స్వాతి ఆరోజు ఇంటికి వచ్చేసరికి డాక్టర్ శ్రీని లేదు. ఎక్కడికి వెళ్ళారని ఇంట్లోవాళ్ళను అడిగింది. మెడికల్ కాలేజి లాబ్‌కి వెళ్ళి రక్తపరీక్ష చేయించుకొని వొస్తానని వెళ్ళారని చెప్పారు.



gudachari.com

"ఒక్కరే వెళ్ళారా..?"

"అవునమ్మా. డ్రైవర్ వొస్తానన్నా కోప్పడ్డారు."

స్వాతి సహనం అంతరించిపోయింది. వాళ్ళది తప్పు లేదని తెలిసినా కోప్పడింది. భయంతో బిక్కచచ్చిపోయి స్వాతి వైపే చూస్తుండిపోయారు పనివాళ్లు.

"ఎంత సేపైంది వెళ్ళి?"

"అరగంట కావొస్తుందమ్మా..."

అంటే తిరిగివస్తూ వుండాలి. ఇంట్లోకెళ్ల బుద్దికాలేదు. కుర్చీ తెప్పించుకుని వాకిట్లోనే కూర్చుంది రోడ్డు వైపు చూస్తూ స్వాతి. ఒక్కో క్షణం గడిచేకొలదీ అణచుకోలేని ఆతృత ఉక్కిరిబిక్కిరి చేయసాగింది.

అయిదు... పది... పదిహేను.. అరగంట స్వాతిలో భయం కొద్ది కొద్దిగా మొదలై భరించలేనంతగా పెరిగిపోయింది.

వెంటనే మెడికల్ కాలేజి లాబ్‌కి ఫోన్ చేసింది. వొచ్చి వెళ్లిపోయి చాలా సేపైందట. స్వాతి గొంతు తడారి పోయింది. అక్కడే వున్న వాళ్ళ అక్కయ్యకు చేసింది. రాలేదు. తెలిసిన వాళ్ళందరికీ చేసింది. రాలేదు. రాలేదు... రాలేదు.. ఇదే సమాధానం... మరి ఏమైనట్టు.

అందర్నీ తలోవైపు తరిమి వీధిలోనే నిల్చుంది. ఏ చిన్న శబ్దమైనా అమ్మయ్య అనుకుని చూస్తే అది వేరెవరిదో కారు. కాళ్ళలో శక్తి సన్నగిల్లిపోయింది. ఆత్రుతతో, భయంతో తిరిగి, తిరిగి అలిసిపోయింది. పడిపోతానేమోనని భయం వేసింది. అప్పుడు కనిపించింది దూరంగా వస్తూ కారు స్వాతికి.

అంత టెన్షన్‌లో ఉంచినందుకు కోపం పట్టలేకపోయింది.

కారుదిగీ దిగకముందే

"ఎక్కడికి వెళ్ళారు? ఏమైపోయారింత సేపు? అసలెవరు వెళ్ళమన్నారు వొంటరిగా...? తిరిగి తాపీగా మీరొస్తే ఇక్కడ మేమంతా చావాలనుకున్నారా...? నేను లేకుండా అసలెక్కడికీ వెళ్ళొద్దన్నాను కదా...?" ఆత్రుతగా అడిగింది స్వాతి.

కారు దిగి స్వాతి భుజం మీద చేతులు వేసుకుని, "ఈజీ... డియర్... ఈజీ..." అంటూ లోపలికి అతి ప్రయాసమీద నడుచుకుంటూ వెళ్ళి బెడ్ మీద వాలిపోయాడు డాక్టర్‌శ్రీని.

అంతవరకూ అతని పరిస్థితే గమనించలేదు స్వాతి. తన కోపం ఆత్రుత వీటితోనే సతమతమవుతుంది. ఒక్కక్షణం ఈ లోకంలోకి వచ్చి, "ఏమండీ ఏమైంది...?" కుదిపేస్తూ భయంతో అడిగింది.



"ప్లీజ్... కాసేపు నన్ను వదలిపెట్టు..." ఆయాసంతో అతి కష్టంమీద వెనక్కు జరిగి గోడకు ఆనుకుని బలవంతంగా గాలిపీల్చుకో మొదలు పెట్టాడు. అసహనంగా అటూ యిటూ కదులుతూ డాక్టర్‌శ్రీని.

ఏ పరిస్థితి అయితే స్వాతిని పిచ్చిదాన్ని చేస్తుందో... ఆమె గుండెల్ని పిండి వేస్తుందో... ఆమెలోని శక్తిని ఆక్షణం హరించి వేస్తుందో.. ఆమెలోని ధైర్యాన్ని దహించి వేస్తుందో ప్రతిరోజూ ఏదైతే జరగకూడదని కోరుకుంటుందో... ఆ పరిస్థితి. అదే గాలి పీల్చుకోడానికి అతను పడే యాతన "ఎయిర్ హంగర్."

వెంటనే వీపు వెనుక ఎత్తుగ దిండ్లు పెట్టి ఆక్సిజన్ ఓపెన్ చేసి ముక్కుల్లో దూర్చింది. ఆ సమయంలో క్షణమొక యుగం స్వాతికి. ఏ క్షణమైన తన గుండె నిలిచిపోతుందేమో ననిపిస్తుంది ఆమెకు.

ఆశ్చర్యం... పది నిమిషాల్లో మామూలుగా గాలి పీల్చుకుంటున్నాడు. ఒక నిమిషంలో ప్రాణం పోతున్నట్టు... మరో నిమిషంలో ఎంతో బావున్నట్లు.... ఈ థ్రిల్లింగ్ భరించలేనంత బాధాకరమైంది స్వాతికి. కొంతసేపయింతరువాత.

"ఐయమ్ సారీ... డియర్... నిన్ను బాధపెట్టాలని కాదు. ఏమీ కాదనుకున్నాను.." నొచ్చుకుంటూ అన్నాడు.

దానికేం సమాధానం చెప్పలేదు. తన ఆలోచనంతా అతన్ని వంటరిగా ఎక్కడికీ పంపకూడదని తప్ప.

"ఏమండీ. ఇంకెప్పుడూ వొంటరిగా వెళ్ళకండి. మిమ్మల్నొదిలి ఉండలేను నేను." బ్రతిమాలాడుతూ అంది.

"వెళ్ళను.. ప్రామిస్." పిల్లలకు, నీకు ఏదైనా కొనాలని కొంచెం తిరిగాను. ఎండ చాలా ఎక్కువగా ఉంది. అలవాటు లేదు కదా!" నవ్వుతూ అన్నాడు.

స్వాతి కళ్ళలో నీరు వరదలవుతున్నాయి.

"ఛీ... ఏమిటిది... చూడు నా పల్స్ నార్మల్‌గా వుంది. ఆయాసం తగ్గిపోయింది. లేచి పరిగెత్తమన్నా పరిగెత్తగలను."

అవును ఆక్షణం గడిచిపోతే మామూలుగానే వుంటాడు. తరువాత చూసే వాళ్ళెవరికీ అతను జబ్బు మనిషి అని అనిపించదు.

ఈ మధ్య మళ్ళీ స్వాతికి పీడ కలలు ఎక్కువైనాయి. అసలు నిద్రే పట్టదు సరిగ్గా... కూర్చుని అతన్నే చూస్తువుండిపోయేది. ఏ కొద్ది సేపో నిదుర పట్టితే పీడకలలు...

అవి ఎంత భయంకరంగా వుంటాయో....

ప్రాణంతో వుండగానే రాబందులు అతన్ని పీక్కుతింటున్నట్లు... రక్షించమని అతను చేతులెత్తి అర్థిస్తున్నట్లు... తను కత్తితో వాటిని ముక్కలు ముక్కలుగా నరుకుతున్నట్లు

gudachari.com

చంపేకొద్దీ వేలకు వేలు రాబందులు పుట్టుకొస్తున్నట్లు, వీలుగాక అతన్ని తన శరీరంతో కప్పేస్తే అవి తనను చీల్చుకు తింటున్నట్లు... ఆ బాధ భరించలేక బిగ్గరగా అరుస్తూ నిదుర లేచేది స్వాతి.

ఒక్కోసారి.. ఏదో నల్లటి మేఘం తనను పిల్లల్ని కప్పేసి అతన్ని దూరంగా ఎత్తుకు వెళ్తున్నట్లు... ఆ చీకట్లో వెర్రిగా అరుస్తూ అతని కోసం తనూ పిల్లలూ వెతుకుతున్నట్లు... గబుక్కున లేచేది. ప్రక్కనే నిదురపోతున్న అతన్ని చూసి అదురుతున్న గుండెల్ని వణుకుతున్న శరీరాన్ని అదుపులోకి తెచ్చుకొని, నిదురపోయేందుకు ధైర్యం చాలక జాగారం చేసేది.

మరోమారు... డాక్టర్లు అతనికి ఆపరేషన్ చేస్తున్నట్లు... వాళ్ళు అతని శరీరంలోని ఒక్కో భాగం ముక్క ముక్కలుగా కోసి తన చేతికిస్తూ ఇది చెడిపోయింది... ఇది చెడిపోయింది అంటూ ముక్కలు చేస్తున్నట్లు.... తను అది చూడలేక బిగ్గరగా ఏడుస్తూ లేచేది. తలబ్రద్దలయిపోతూ ఉంటే, గొంతు తడారిపోతూ ఉంటే దడదడ లాడుతున్న గుండెలతో అతనికి దగ్గరగా జరిగి పొదివి పట్టుకుని పడుకునేది. నానుంచి ఎవరూ విడదీయలేరు... నేను జరగనివ్వను... జరగనివ్వను అని పదే పదే అనుకుంటూ నిదురపోయేదానికి ప్రయత్నించేది.

స్వాతి హాస్పిటల్‌కి కూడా సరిగా వెళ్ళడం లేదు. వెళ్ళాలనిపించడం లేదు. వెళ్ళినా కాసేపు కూడా వుండలేక వెంటనే తిరిగి వొచ్చేస్తుంది. తప్పని పరిస్థితి అయితే అతన్ని కూడా తీసుకువెళ్తుంది.

ఇందువల్ల ప్రాక్టీస్ కూడా అంతంత మాత్రంగానే వుంది. హాస్పిటల్‌కి వెళ్ళకపోతే ప్రాక్టీస్ జరగదు... ప్రాక్టీస్ జరక్కపోతే డబ్బులు రావు... డబ్బులు రాకపోతే ఏదీ జరగదు.

వీటన్నింటి మధ్య నలిగిపోతుంది స్వాతి. "ఎంత కాలం భరించగలనిలా... భరించలేకపోతే ఎలా... భరించాలి. తప్పదు" అనుకుంది. వీటన్నిటికంటే ముఖ్యం పిల్లలకు వాళ్ళకు బాధలు తెలియకూడదు. వాళ్ళకంటే ముఖ్యం ఈ లోకానికీ తెలియనీయ కూడదనుకుంది.

మరుసటి రోజు ఉదయం డాక్టర్‌శ్రీని చిన్ననాటి స్నేహితుల్లో ఒకరు పాము కాటుకు గురై చనిపోయారని ఫోన్ వచ్చింది. ఆ వార్త విని చాలా దిగులు పడ్డాడు.

"పాము కరిస్తే చనిపోవడమా, ఎలా జరిగింది. హాస్పిటల్‌కి ఎందుకు తీసుకు వెళ్ళలేదు...? అంత టైం లేకపోయిందా? వెళ్ళి ఆఖరుసారి చూసొద్దాం.." అన్నాడు స్వాతితో.

"ఈ పరిస్థితుల్లో వెళ్ళడం అంతమంచిదిగాదేమో!"

"ఏం తట్టుకోలేనా...? భరించగలను."

వొద్దంటే ససేమిరా వొప్పుకోలేదు.



బయల్దేరక తప్పలేదు స్వాతికి.

వెళితే అక్కడి పరిస్థితి హృదయవిదారకంగా వుంది. వీళ్ళను చూడగానే వచ్చి చుట్టూచేరి ఏడవడం ప్రారంభించారు. అతనికి వయసు ముప్పయి అయిదు వుండొచ్చు. పిల్లలు చిన్నవాళ్ళే.

"ఎప్పుడు కరిచింది?"

"ఉదయం ఎనిమిది గంటలకు పొలం వెళితే కరిచింది."

"అప్పుడే చనిపోయాడా?"

"లేదండీ, మధ్యాహ్నం రెండు గంటలకు చనిపోయాడు."

"అంతవరకు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళలేదా? మందులివ్వలేదా?"

"ఎందుకులేదూ... ఇచ్చామండీ మంచి మందుచెక్క. ఈ ఊళ్ళోనే వుంది. ఎక్కడిక్కడి వాళ్ళో వొస్తారీ వూరికి ఆ మందు కోసం. నురగలు కక్కుకుంటూ పండ్లు గిటకరించుక పోయినా ఆ మందు పంటికి పూస్తే చాలు లేచి కూర్చుంటారు. పైగా మంత్రం కూడా వేయించాం. లింగం (గుడ్డపేలిక చించి ముడులు వేసి మంత్రాలేవో చదవి మెడలో కట్టడం) వేస్తే ఎంత ముదిరి పోయినా విషం దిగిపోతుంది. అదీ చేశాము. అయినా లాభం లేకపోయింది. అక్కడెక్కడికో ఫోన్ కూడా చేశాం. ఫోన్ మంత్రం వేస్తే ఇక్కడ మనిషి లేచి కూర్చుంటాడంట. ఏదీ పనిచేయలేదు. ఏం చేస్తాం... అంతా ఖర్మ అతని అదృష్టం బాగాలేదు. లేకపోతే ఎంతమంది బాగుకాలేదు."

"ఇంత చేశారు. కాస్తీ దగ్గర్లో ఉన్న డాక్టర్ దగ్గరకు మాత్రం తీసుకుపోలేదన్నమాట." కోపాన్ని బాధనూ అణచుకుంటూ అన్నాడు డాక్టర్‌శ్రీని.

"పాము కరిస్తే డాక్టర్లేం చేస్తారండీ.. నాటు మందులు పనిచేసినట్లు మీ మందులు పనిచేస్తాయా? అదీగాక తాలూకా హాస్పిటల్‌లో మందులు మాత్రం ఎక్కడున్నాయి? మందులుండవు. డాక్టరూ వుండడు."ః

"మీరు ముందుగా తీసుకవెళ్ళుంటే బ్రతికుండే వాడు ఖచ్చితంగా,"

"మీరెన్నైనా చెప్పండి, నాటుమందులు పనిచేసినట్లు ఇంగ్లీషు మందులు పనిచేయవు." మళ్ళీ అదేమాట.

"మరి ఇతనెందుకు చనిపోయాడు."

"అతని అదృష్టం బాగా లేదు. రాత."

"పిచ్చి, పిచ్చిగా మాట్లాడకండి. మీ మూర్ఖత్వంతో అనవసరంగా ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నారు. మీరు మారరు. మీరింతే," ఆవేశంతో కారులో వచ్చి కూర్చున్నాడు.

కారులో... బాధపడ్తూనే వున్నాడు.



gudachari.com

"ఎందుకీ, ముందమోపి ప్రభుత్వం... ప్రజలకేది అవసరమో అది చేయకుండా మొబైల్ డిస్పెన్సరీలు, మొబైల్ ఆపరేషన్ థియేటర్లు పెట్టారట. ఎందుకూ తాలూకా ఆసుపత్రిలో పాముకాటుకి మందులేదు."

నిజమే... డిస్ట్రిక్ హాస్పిటల్‌లో వుంటుంది పాముకాటుకి మందు. అంతదూరం తీసుకుపోయేటప్పటికి చేయిదాటిపోతుంది. పల్లెప్రాంతాల్లో అవసరం వున్నా మందుల్ని ఇక్కడుంచరు. ఉంచాలని కూడా ఆలోచనలేదు. అందుకే ప్రభుత్వ హాస్పిటళ్ళన్నా, వాళ్ళిచ్చే మందులన్నా విశ్వాసం లేదు ప్రజల్లో... అసలు ఇంటింటికీ పోయి మందులిచ్చేకన్నా, ఇంటింటికీ తిరిగి ఆపరేషన్‌లు చేసేకన్నా జబ్బుల్ని గురించి వివరించడం, సినిమాల ద్వారా చూపించడం ఒకసారి కాకపోతే పదిసార్లు తిరిగి వారికి ప్రభుత్వ హాస్పిటళ్ళు.. మందుల మీద నమ్మకం కల్గేలా చేయడం చాలా అవసరం.

"ఏవిటి... అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అంటూ కదిపాడు స్వాతిని.

"ఏం లేదు."

మనసులో ఆలోచన్ల హోరు తగ్గలేదు. అక్కడి శవం, శవం చుట్టూ బంధువుల ఏడుపులు, గుర్తొచ్చి పిచ్చిదాన్ని చేస్తున్నాయి స్వాతిని.

"ఏవిటి... అలా చూస్తున్నావు కళ్ళార్పకుండా..." అన్నాడు మళ్ళా స్వాతిని కదుపుతూ.

"ఏమండీ...!"

"ఊ.... ఏదో అడగాలనుకుంటున్నావ్...." అడుగు. స్వాతిముఖాన్ని చేత్తో పైకెత్తి కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

ఆ కళ్ళల్లోకి చాలా సేపు దీర్ఘంగా చూసి,

"నేను... చచ్చిపోతే.. మీరేం చేస్తారు?" అంది. ఆప్రశ్న వేస్తున్నపుడు గుండెల్లో ఏదో గట్టిగా గుచ్చుకున్నట్లయ్యింది.

పెద్దగా నవ్వుతూ "నువ్వు చచ్చిపోవు. నాకు తెలుసు." అన్నాడు.

"తమాషాకు కాదు... నాకు జవాబు కావాలి." ఏం జవాబు చెబుతాడో అని ఉత్కంఠ ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే

"నిజం చెప్పమంటావా... అబద్ధం చెప్పమంటావా..?" నవ్వుతూ స్వాతి కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"మీ మనస్సులోని మాట కావాలి నాకు." ఆలోచనలోపడ్డాడు. అతన్నే చూస్తుంది స్వాతి గాలికూడా పీల్చకుండా. స్వాతి వైపొకసారి తలత్రిప్పి చూసి మరలా శూన్యంలో దృష్టి మరల్చి దీర్ఘశ్వాసవదుల్తూ

"నేను చచ్చిపోతే నువ్వేం..." పూర్తిగాకముందే అతని నోరు మూసేసింది స్వాతి.



"నేనూ చచ్చిపోతాను." తడుముకోకుండా చెప్పింది.

ఆమాటకు అదోలా నవ్వి, "కానీ నేను చచ్చిపోను. నువ్వు లేవనే నిజాన్ని భరించడం కష్టమే... అయినా నేను బ్రతుకుతాను. దేవదాసును కాను, వ్యసనాలకు బానిసకాను. మనం గడిపిన తీపి అనుభూతుల్ని నెమరేసుకుంటూ, ఆ జ్ఞాపకాలతో ఊహా మందిరాలు మలచుకొని, నిన్ను తలచుకొని ఆస్వప్నంలో జీవిస్తాను. అంతేకాదు ఈ ఇంటినీ, ఈ ఊరునీ కూడా విడిచి ఎక్కడికీ వెళ్ళను. ఎందుకంటే నువు నడచిన ప్రతి అడుగూ ప్రతి నిత్యం నాకు జ్ఞప్తికి రావాలి. నువ్వొదిలి వెళ్ళిన ప్రతి వస్తువూ నాకు అమూల్యమైనది. నువు పడుకున్న పడక, కూర్చున్న కుర్చీ, కట్టుక్కున్న చీరలు ప్రతిదీ నిన్ను గుర్తుచేస్తాయి. ఆ తీపి గుర్తులు చెదిరిపోకుండా ఆ మధుర ఘట్టాలు తలచుకుంటూ జీవితాన్ని గడిపేస్తాను... నేను చేసే ప్రతి పనిలో నువు లేవనే నిజాన్ని మరచిపోడానికి ప్రయత్నిస్తాను.. నీ మనసు. నీస్పర్శ... నీ శ్వాస... నన్ను వదలి వెళ్ళలేవు. నువు నా దగ్గర శాశ్వతంగా వున్నావనే బ్రతుకుతాను.... ఎవ్వరూ ఎవరికోసమూ చావరు. ఎంత బలమైన ప్రేమైనా కానీ ఆక్షణం అలా అనిపిస్తుంది. చావు నిజం. బ్రతుకు నిత్యం. పిల్లల భవిష్యత్తు అన్నిటికన్నా ముఖ్యం నా సుఖం, సౌఖ్యం నీతోనే అంతరించిపోవచ్చు. నీ స్ఫూర్తిని నేను ఎన్నటికి మరవను.

"కాదు నేను బ్రతకను. మీకేదైనా జరిగితే నేనాక్షణమే చచ్చిపోతాను." గట్టిగా ఏడుస్తూ అంది స్వాతి.

"పిల్లల్నేం చేస్తావు..?"

"మీరు లేనపుడు... వాళ్ళూ నా కనవసరం."

"వెల్, పిరికిదానిలా మాట్లాడుతున్నావు. ఒకరికోసం ఒకరు చచ్చిపోవడం కాదు ప్రేమంటే... మిగిల్చిన బాధ్యత సరిగ్గా నిర్వర్తించడం. చావును ఎవ్వరూ చూసి రాలేదు. ఏ రూపంలో వస్తుందో కూడా తెలియదు."

"కాదు... కాదు... మీరు లేని జీవితం నాకొద్దు..."

ఉన్మాదిలా తలను కారు డోర్‌కేసి కొట్టుకుంటూ, ఏడుస్తూ అంది స్వాతి.

ఇంతలో కారు సడెన్‌బ్రేక్‌తో ఆగింది. ఆ కుదుపుకు ఈ లోకంలోకి వచ్చి సర్దుకున్నారు.

డ్రైవర్ కరీమ్ నీరు నిండిన కళ్ళతో వాళ్ళవైపు చూస్తూ చేతులు జోడించి, "అల్లా... మిమ్మల్ని చల్లగా చూస్తాడమ్మ... మీలాంటి వాళ్ళకి ఎన్ని కష్టాలు వచ్చినా అవి క్షణికమే, మంచికి ఇవన్నీ పరీక్షలు తల్లీ. మీరు ధైర్యంగా వుండండి. అల్లా తోడుగా వుంటాడు." అంటూ కళ్ళు తుడుచుకుని కారు స్టార్ట్ చేశాడు.

స్వాతి చెక్కిలి మీద కన్నీటి చారికల్ని చేత్తో తుడుస్తూ "ఇంత పిచ్చిదానివైపోతావను కోలేదు... జరగబోయేదాన్ని గురించి ఆలోచన ఎందుకు... నేనెప్పుడూ నీదగ్గరే వుంటాను." ఓదార్పుగా అన్నాడు. కానీ స్వాతి మనసుకు శాంతి లేదు. ఎన్నెన్నో ఆలోచనలు.



gudachari.com

ఇంటికి వెళ్ళగానే

"ఐవాంట్ టు సీ మై మెడికల్ రికార్డ్." అన్నాడు డాక్టర్‌శ్రీని.

అతనిలోని మానసిక సంఘర్షణ స్వాతికి తెలుసు. అస్థిమితమైన ఆరోగ్యం, క్షణమొక గండంగా ఇంతకాలం ఓపికతో వున్నా అతన్లో ఇక భరించే శక్తి సన్నగిల్లినట్లుంది. ఎప్పుడో వొకసారి ఆ రికార్డు అడుగుతారని భయపడుతూనే ఉంది స్వాతి. తనకు తెలియంది దాంట్లో వుందని అభిప్రాయం. ఇంకేమాత్రం ఎవర్నీ నమ్మకూడదని నిర్ణయించుకున్నట్లుంది. మెడికల్ రిపోర్టు చదివితే జవాబేదైనా దొరుకుతుందేమో అని చాలా రోజుల్నించి అనుకుంటున్నాడు.

ఇవ్వడానికి సంశయించింది. ఇవ్వకపోతే అనుమానం అధికం అవుతుంది. పైగా గొడవ చేయొచ్చు అని అనుకొని ఆ కాగితాలకట్టని అతని ముందుంచి చూస్తూ కూర్చుంది. అతను దాన్లో మునిగిపోయాడు. సమయం గడిచిపోతూవుంది. మధ్య మధ్యలో నిలిపి స్వాతి వైపు అనుమానంగా చూసి మళ్ళీ చదవనారంభించేవాడు. ఆ చూపుల్ని ఎదుర్కొనే శక్తి స్వాతికి లేక తలవంచుకుని కూర్చుంది. ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయపడుతూ ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంది స్వాతికి.

ఉన్నట్లుండి, "ఐ హాడ్ ఏన్ హార్ట్ అటాక్" అన్నాడు.

ఉలిక్కిపడింది స్వాతి.

"యస్.. దిస్ క్లియర్‌లీ టెల్స్‌మీ దట్ ఐ హాడ్ ఎన్ హార్ట్ అటాక్ ఆఫ్టర్ ది ఆపరేషన్ ఇన్ ది రికవరీ రూమ్."

ఆశ్చర్యంగా స్వాతి వైపు చూస్తూ అన్నాడు.

తలొంచుకుంది స్వాతి.

"ఆపరేషన్‌కు ముందు, జరిగిన తర్వాత నాపల్స్, బి.పి. అంతా బావుంది. మత్తులో నుండి వెంటనే తేరుకున్నానని కూడా వుంది. ఆ తర్వాత సడెన్‌గా నా కండిషన్ రివర్స్ అయింది. అప్పుడే ఏదైనా జరిగి వుండాలి. రెండు రోజులు మాత్రమే ఉండాల్సిన ఐ.సి.సి.ఇలో తొమ్మిది రోజులు గడపాల్సి వచ్చింది", అంటూ "ఏం మాట్లాడవు.? నీకు తెలుసా?!"

ఏం జవాబు చెప్పాలో తెలియక, భయంతో విప్పారిన నేత్రాలతో చూస్తుండిపోయింది.

"నీకు తెలుసా!" తెలుసు అన్నట్లు తలవూపింది అతన్ని చూడకనే.

ఇంతవరకు ఏ విషయమూ దాచిపెట్టలేదు. ఇది తప్పలేదు స్వాతికి.

"తెలిసీ... నాకు చెప్పకుండా దాచి పెట్టారన్నామాట." ఆ మాటలు చిన్నగా తేలిగ్గానే వున్నా వాటి వెనుక వున్న బరువు, బాధకు విలవిలలాడి పోయింది స్వాతి.

"ఎప్పుడు తెలుసు నీకు....? ఎవరు చెప్పారు?"



"ఆపరేషన్ అయిన తర్వాత డాక్టర్ శంకర్ చెప్పారు."

ఏం మాట్లాడక కాగితాలు ప్రక్కన పడేసి శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు. మాట్లాడించే ధైర్యం లేదు స్వాతికి. అప్పుడపుడు వదలే నిట్టూర్పులు స్వాతికి కాల్చేస్తున్నట్లుగా వున్నాయి. చిన్నగా అతని మీద స్వాతి చేయి వేసింది. స్వాతి చేయి వణుకుతోంది. ఛీదరింపుగా చూస్తూ విసురుగా తోసేశాడు.

"ఇందులో నా తప్పేం లేదండి." గొంతు కూడా వణికింది.

"మరెవరిది తప్పు? నిజం, ఏవిటో తెలిసుకోకుండా ఇంతకాలం మిధ్యలో బ్రతకడం నా తప్పు. మిమ్మల్నందర్నీ నమ్మడం నా తప్పు. నాకు జరిగింది మామూలు ఆపరేషన్ కదా... మరి మామూలుగా ఎందుకు వుండలేకపోతున్నాను... బైపాస్ సర్జరీ చేసుకుంటే మహా అయితే ఒక నెల లేదా మూడు నెలలు, ఆరు నెలల్లో పూర్తి ఆరోగ్యవంతుడైపోతాడు. అలాంటిది నేనెందుకు కాలేకపోతున్నాను.. అని తల బ్రద్దలు కొట్టుకుంటూ క్షణం క్షణం నరకంలో వుండడం నాదే తప్పు. నిజం తెలిసివుంటే... నీ గుండె చెడిపోయింది. నువ్వో బొమ్మలా వుండగలవు. నీకు పనిచేసే శక్తి లేదు. అనవసరంగా ఆరాటపడి మనసు పాడుచేసుకోకు. ఇక నీ బ్రతుకింతే - అని మనసు కుదట పరచుకుని వుండేవాడ్ని కదా! ఈ రెండు సంవత్సరాలు నిజం తెలియక నేనెంత బాధ అనుభవించానో మీకు తెలుసా! నిజాన్ని దాచి నన్ను నరకయాతనకు గురిచేశారు. ఎంతచేదైనా నిజాన్ని భరించడం తేలిక. మిధ్యలో బ్రతకడం కంటే..."

ఇంతకాలం ఏం జరిగిందో తెలియక ఎలాంటి మందులతోను ప్రయోజనం లేక మానసికంగా, శారీరకంగా కృంగిపోయి వున్నా తను ఇప్పుడీ సంఘర్షణ ఎలా తట్టుకుంటాడు... ఇది దేనికి దారి తీస్తుందో... ఏమవుతుందో... ఏమవుతుందో... అని మధనపడసాగింది స్వాతి.

అసలు తనెంత వరకూ తప్పు చేసింది? "అసలు తప్పు చేశానా..!?"

నిజాన్ని దాచి పెట్టడం నేరమవుతుందా? ఎలా అవుతుంది నువ్వేందుకూ పనికిరావు. నీ గుండె పూర్తిగా చెడిపోయింది అనే నిజం అతనికి తెలిసివుంటే ఆత్మస్థైర్యం కోల్పోయి జబ్బుకి లొంగిపోయే అవకాశం వుంది.

తన జబ్బు నయం అవుతుంది అనే నమ్మకం ఉన్నపుడు ఆత్మస్థైర్యంతో మనిషి జబ్బును అధిగమించే అవకాశం వుంది. ఎంత ఆలోచించినా ఆ నిజాన్ని దాచిపెట్టడం తప్పుకాదనీ అనిపిస్తువుంది. రాత్రంతా ఆలోచనలతో నిదురలేదు. ఎప్పుడో తెల్లవారు జామున కన్నుమూసింది స్వాతి.

ఉదయం నిద్రలేస్తునే ఎదురుగా గ్రీన్ టీ త్రాగుతూ కనిపించాడు. గంభీరవదనంతో తననే గమనిస్తున్నతన్ని ఎలా పలకరించాలో తెలియక చూస్తుండిపోయింది స్వాతి.



gudachari.com

కాసేపటికి టీ త్రాగుతూనే చిన్నగా నవ్వాడు. అంతే, వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు ఒక్కుదుటున బెడ్‌మీది నుంచి దూకి పరుగున వెళ్లి కౌగలించుకోబోయింది స్వాతి.

"అరెరె... ఆగు... టీపైన పడుతుంది." అంటూ టేబిల్‌పై పెట్టి స్వాతి వైపు తిరిగి సీరియస్‌గా, "నమ్మకద్రోహులతో మాట్లాడదలచుకోలేదు నేను," అన్నాడు.

ఏడుపు ముంచుకువచ్చింది స్వాతికి.

"నన్ను క్షమించండి. మీకు తెలియక పోవడమే మంచిదనుకున్నాను."

"అంటే మనసులోనే వుంచుకుని నువ్వొక్కదానివే బాధపడదామనుకున్నావా..!" స్వాతిని దగ్గరకు తీసికుంటూ, "ఐ నో... ఐనో... ఐకెన్ అండర్‌స్టాండ్.." అన్నాడు అనునయిస్తూ.

ఆమాటతో స్వాతిలోని భయం పూర్తిగా పోయింది. కళ్లు తుడుచుకుంటూ "నన్ను క్షమించరూ..." కాళ్ళపై కూలబడుతూ అంది.

"లే... లే... ఏమిటిది... నన్ను మీరు మోసం చేశారని కాదు నాబాధ. నిజం తెలిస్తే నేను కృంగిపోతాననుకున్నారు. కానీ నేను డాక్టర్ని. ఆ విషయం ఆలోచించలేదు మీరు. నిజం తెలుసుకోవాలనే నా పోరాటంలో ఓటమి నన్నెంత కృంగదీసిందో మీకు తెలియదు," కొంచెం ఆగి, "చచ్చిపోతామేమో అనే భయం కన్నా చచ్చిపోతాం అనే నిజం భరించడం తేలికని నా ఉద్దేశ్యం."

"అంతమాట అనకండి... నే భరించలేనా మాట."

"నిజాన్ని ఏరోజైనా ఒప్పుకుని తీరాలి. ఈరోజు నాకెంతో తృప్తిగా వుంది. ...ఓటమిని అంగీకరిస్తున్నాను..." ఆమాట్లో దిగులూ, నిరుత్సాహం...

"మీరంత, నిస్పృహతో మాట్లాడితే ఏ ఆశతో నేను జీవించగలనండీ... మీరు ధైర్యంగా వుంటే ఎక్కడలేని శక్తి వస్తుంది."

"నేను అధైర్య పడడం లేదు చచ్చిపోతానని. కానీ మామూలు మనిషిగా జీవించాలనుకున్నాను. ఆ అర్హత నాకు లేదని తెలుసుకున్నాను. ఈ నిజాన్ని భరించడానికి కొంతకాలం పట్టవచ్చు. ప్రయత్నిస్తాను. మిమ్మల్ని బాధపెట్టకుండా వుండేందుకు."

ప్రతిక్షణం... నేనెందుకు మామూలు మనిషిని కాలేకపోతున్నాను... ఏమైంది... నాకు అని, నిరంతరం పోరాటం సల్పే వ్యక్తేనా, ఇలా దయనీయంగా మాట్లాడుతున్నది...! అనిపించింది స్వాతికి.

ఆరోజు సాయంత్రం కొంచెం జ్వరం వచ్చింది డాక్టర్‌శ్రీనికి. అది చూసి విపరీతంగా భయపడింది స్వాతి. రెండు సంవత్సరాల క్రితం జ్వరం ఎంత గందరగోళం చేసిందో తలచుకుంటే శరీరం గగుర్పొడిచింది స్వాతికి. అందుకే దీన్ని అశ్రద్ధ చేయకూడదు. ఆమాటే అంది.



"ఏదో లెద్దూ.... కాస్త ఆలోచించడం వల్ల వచ్చివుంటుంది. అదే తగ్గిపోతుంది..." అన్నాడు.

కానీ తేలిగ్గా తీసికోడానికి స్వాతి మనసొప్పుకోవడం లేదు. తనకు తెలుసు హాస్పిటల్‌కి వెళ్దామంటే ఒప్పుకోడని. ఏంచేయాలి? ఎలా ఒప్పించాలి...? అర్థంకాలేదు స్వాతికి.

జ్వరం రెండో రోజుకు ఎక్కువైంది. ఆయాసం కూడా వుంది. అంతంత మాత్రంగా వున్న ఆ గుండె తీవ్రమైన జ్వరానికి తట్టుకోగలదా?! స్వాతి అనుమానం. జ్వరం తగ్గడానికి మాత్రలు వేసుకుంటున్నాడు. ఆయాసం తగ్గేందుకు అప్పుడప్పుడు ఆక్సిజన్ తీసుకుంటున్నాడు. డిగాక్సిన్, డైయూరిటిక్, డిస్పిరిన్ సార్బిట్రేట్ మాత్రలు మామూలుగా వేసికుంటున్నాడు.

ఈ రెండు రోజుల్లో అతని స్నేహితుల చేత చెప్పించింది స్వాతి హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే బావుంటుందని.

"ఏం... ఇక్కడున్నది డాక్టర్లు కాదా..? అయితే వెళితే ఏం చేస్తారు వాళ్ళు...? అదేదో మనమే చేసికుంటే పోతుంది."

"... అలా కాదు... ఇంతకాలం చూస్తున్న డాక్టర్లయితే వేరే నిర్ణయం ఏదైనా తీసికుంటారు."

"నాకు తెలుసు ఆ నిర్ణయాలు."

అంతకన్నా ఎక్కువ చెప్పడం కూడా మంచిదికాదని అంతటితో వదిలేశారు.

స్వాతి ఆలోచనల్లో మునిగిపోయి ఉంది. ఎప్పుడొచ్చారో పిల్లలు అతని మంచం ఎక్కి, "డాడీ... డాడీ..." అని పిలవడం కూడా గమనించలేదు.

స్వాతి తేరుకుని

"మీరు, ఈ రోజు డాడీని డిస్టర్బ్ చేయకూడదు. డాడీకి, రెస్ట్ కావాలి." అంది వాళ్ళను దూరంగా తీస్తూ.

"ఉండినిస్తూ! వాళ్ళుంటే కొంచెం టైమన్నా గడుస్తుంది," అంటూ లేచి కూర్చున్నాడు.

అతని ఆరోగ్యం బాగులేనపుడు నుంచీ పిల్లల్ని ఉదయం సాయంత్రం కాసేపు మాత్రమే దగ్గర ఉంచేది. మిగిలిన సమయాల్లో దగ్గరకు వెళ్ళనిచ్చేది కాదు స్వాతి.

ఆ మాటతో దూరంగా పోయి నిల్చుంది స్వాతి.

"డాడీ...! నీకో సీక్రెట్ చెప్పనా...!" విష్ణు అన్నాడు.

"చెప్పు నాన్నా!"

వాడు చిన్నగా స్వాతి వింటుందేమో అని గమనిస్తూ అతని చెవి దగ్గర చేరి, "మమ్మీ త్రీడేస్ నుంచీ అన్నం తినడం లేదు." అన్నాడు. అతను స్వాతి వైపు చూశాడు.



gudachari.com

స్వాతి తలవంచుకుని చేతులు నలుపుకోసాగింది. ఏం చెయ్యాలో తెలియక.

"డాడీ... మమ్మీ రోజు ఏడుస్తుంది. తల కొట్టుకుంటుంది." దీపు వాళ్ళ మమ్మీ వైపు భయంగా చూస్తూ అంది.

స్వాతికి గుర్తొచ్చింది తామెప్పుడో చేసుకున్న నిర్ణయం. ఏ పరిస్థితుల్లోనూ పిల్లల ముందు ఏడవడం గానీ, వాదించుకోడం గానీ చేయకూడదు అని.

"ఐ టోల్డ్‌యు నాట్ టు ఎక్స్‌పోజ్ బిఫోర్ చిల్డ్రన్" అన్నాడు బాధగా.

ఆ మాటతో బిందు, "బట్ యు ఆర్ నాట్ విల్లింగ్ టు గోటుది హాస్పిటల్," అంది.

అతని ముఖంలో ఆశ్చర్యం... ఆనందం.. అబ్బురంగా దాని వైపు చూపిస్తూ, "షి ఈజ్ టాకింగ్ టు మి ఇన్ ఇంగ్లీష్...!" అన్నాడు.

అది చూసి బిందు సిగ్గు, గర్వం మిళితం కాగా, "వాట్ దు యు థింక్ ఆఫ్ మి... ఐ యమ్ గోయింగ్ టు రైట్ టెన్త్ క్లాస్ ఎక్జామ్," అంది.

"రియల్లీ... యు ఆర్ ఇన్ టెన్త్ క్లాస్...?! ఐ డోంట్ నో...!!" అన్నాడు స్వాతి వైపు చూసి.

అవును... కాలమెంత గడచి పోయింది. ఎవరేం చేస్తున్నదీ, పిల్లలెంత ఎదిగిపోయిందీ గమనించే స్థితిలో లేరు వాళ్ళు.

వాళ్ళ బాధల లోకంలో మునిగి మరచిపోయారు. ఒక్కసారిగా ఈ ప్రపంచంలో వచ్చేసరికి వింతగా అనిపిస్తోంది డాక్టర్‌శ్రీనికి.

"ఐ యామ్ రైటింగ్ ఎయిత్ క్లాస్ ఎక్జామ్," దీపు అంది.

"ఐ యామ్... ఓన్లీ ఇన్ సిక్స్త్, క్లాస్..." అన్నాడు దిగులుగా విష్ణు.

"వెల్... వెల్.. మీరేమో... ఒక్కో మెట్టు ఎక్కి ముందుకి వెళ్తున్నారు. మరి నేనేమో... నేను కూడా ముందుకే వెళ్తున్నాను." గుండె లోతుల్లోంచి బరువుగా వచ్చిన మాట అది.

అది చూసి పిల్లలు గంభీరంగా మారిపోయారు.

బిందు, "డాడీ... మద్రాసు వెళ్ళి ఒకమారు చూపించుకు రండి డాడీ..." అంది.

అతను స్వాతి వైపు కోపంతో చూశాడు.

"అమ్మ చెప్పలేదు డాడీ... అమ్మ అనుకుంటుంటే మేమే విన్నాం. ప్లీజ్.. డాడీ... మాకోసం."

అతనేం మాట్లాడలేదు. కొంచెం మెత్తబడినట్లనిపించింది స్వాతికి. ఆ అదునుచూసుకొని ధైర్యం తెచ్చుకుని

"ఈ ఒక్కసారి వెళ్ళొద్దామండీ.. ప్లీజ్ మాకోసం...!" దీనాతి దీనంగా బ్రతిమలాడుతూ అంది.



పిల్లలుకూడా బ్రతిమలాడడం మొదలుపెట్టారు. వాళ్ళనలాగే చూస్తూ దగ్గరకు తీసుకుని, "ఆల్‌రైట్.. ఆల్‌రైట్.. మీకోసం వెళ్తాను. ఈ ఒక్కసారి," అన్నాడు డాక్టర్‌శ్రీని.

పిల్లలు సంతోషంగా గంతులు వేశారు.

"మై చిల్డ్రన్... ఐ విల్ లివ్ ఫర్ దెమ్.. నేను వాళ్ళ కోసం జీవించ ప్రయత్నిస్తాను..." గొంతు బొంగురుపోయింది. డాక్టర్‌శ్రీనికి.

– – –

కారులో అన్నాడు, "నువ్వు అనవసరంగా డాక్టర్లని ఇబ్బంది పెడుతున్నావు. నన్ను చూడ్డానికి వాళ్ళు ఇష్టపడడం లేదు. భూతాన్ని చూసినట్లు భయపడుతున్నారు నన్ను చూసి. కావాలనే కాదనీ తెలుసు. రోగం నయం చేయలేని నిస్సహాయ స్థితిలో డాక్టర్ల ప్రవర్తనలాగే వుంటాయి. నేను కూడా ఒక్కోసారి నా పేషెంట్లు పట్ల అలాగే ప్రవర్తించేవాడ్ని." అని

స్వాతి దానికేం సమాధానం చెప్పలేదు.

హాస్పిటల్‌లో అతన్ని ఇన్‌వెస్టిగేషన్సుకు పంపి డాక్టర్లిద్దరూ, అవన్నీ తీసుకొని స్వాతి ఎదురుగా వచ్చి కూర్చున్నారు.

డాక్టర్ రెడ్డి అన్నారు. "వెల్.. డాక్టర్ స్వాతీ! ఏం చేద్దామంటావు?"

"ఏం చేద్దామని నన్ను అడుగుతారేమిటి..?! మీరు చెప్పాలి ఏం చేస్తే బావుంటుందో."

"వెల్.. దిస్ ఫీవర్... బహుశా వైరస్ అయి వుంటుంది. మరలా పెరికార్డియాటమీ సిండ్రోమ్ అనుకోడానికి వీల్లేదు. ఎందుకంటే రెండున్నర సంవత్సరాల తర్వాత కూడా ఆ జబ్బు వస్తుందనుకోను. తర్వాత హార్ట్ ఫెయిల్యూర్... ఈ విధంగా రెండు రోజుల కొకసారి ఎక్కువ కావడం, తగ్గిపోవడం కాస్త ఆదుర్దాకలిగిస్తోంది."

"బహుశా... ఆయన బైపాస్‌లో ఏదైనా ఒకటి మూసుకుపోయిఉందా...?!" డాక్టర్ శంకర్‌ని చూస్తూ ఎప్పుడో డ్యూటీ డాక్టర్ అన్న మాటలు గుర్తుకు రాగా అంది స్వాతి.

"అలా జరిగివుంటుందని అనుకోను."

"మరి, మనం వాడిన మందుల ప్రభావం వల్ల ఏదైనా జరిగి వుండవచ్చా?!"

"పాజిబిలిటీ... అదీ నిర్ధారణగా చెప్పలేము." డాక్టర్ రెడ్డి అన్నారు...

"ఏం చేస్తే నిర్ధారణగా చెప్పవచ్చు?" అడిగింది స్వాతి.

"మళ్ళీ యానిజియోగ్రఫీ."

"ఇంకా చేస్తే, చూస్తే అంటున్నారు గానీ, చేసి చూసి ఏదో నిర్ధారించలేరా? ఎంతసేపు మందులు మార్చడం, తగ్గించడం, పెంచడం... ఎంతకాల మిలా...? ఆయన్ని చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. ఇంకా మీరు చూద్దాం... చేద్దాం... అంటూ వుంటే ఎలాగా..." వస్తున్న కోపాన్ని ఏడుపును దిగమ్రింగుకుంటూ అంది.

gudachari.com

"చూడు స్వాతీ... ఆయన గుండె చాలా బలహీనంగా వుంది. ఏం చేసినా బాగా ఆలోచించి చేయాల్సిన పని. మనం తొందరపడకూడదు."

"అందుకని.. ఆయన రోజు రోజుకీ కృంగి కృశించి పోతూ వుంటే చూస్తూ వూరు కుందాం అంటారా! అది నేను భరించలేను. బ్రతకడానికి ఆయన చేస్తున్న ప్రయత్నం మానవమాత్రుల తరం కాదు."

"అందుకే అతనంటే నాకిష్టం. అతను చాలా ధైర్యవంతుడు, మనో నిబ్బరం కలవాడు. నీ పరిస్థితిని అర్థం చేసికోలేనంత మూర్ఖులం కాదు. నిన్ను చూసి కూడా మేం గర్వపడుతూ వుంటాం..."

"సర్టిఫికేట్లు, కాదు మాకు కావలసింది. నా భర్త ప్రాణం. అది మీ చేతుల్లో వుంది." కోపంతోనూ, విసుగుతోనూ అంది.

"ఏం చేయమంటావు మమ్మల్ని?"

"అది నేను చెప్పేపనైతే, మీదగ్గరకు రావడం ఎందుకూ... ఆల్‌రైట్... ఎటువంటి పరిస్థితి అయినా, ఎంతకష్టమైనా నేను సిద్ధం. మీరేది మంచి అనుకుంటే అలా చేయండి." ధృఢంగా అంది.

"యస్. వుయ్‌విల్ ట్రీట్ హిమ్ విగరస్‌ల్లీ" బ్లడ్ కల్చరు వచ్చింతరువాత చూద్దాం.

ఆమాట స్వాతీకేమీ అర్థంకాలేదు.

"అంటే..."

"సారీ స్వాతీ... పోయిన సారి హార్ట్ ఫెయిల్యూర్ వచ్చినపుడే అతన్ని విగరస్‌గా ట్రీట్ చేసి వుండాల్సింది."

"మరి ఎందుకు చేయలేదు?"

"హాస్పిటల్‌లో వుండమంటే పేషెంటు మరీ మానసికంగా కృంగిపోతాడేమో అని..."

"అంటే పేషెంటు ఇష్టాయిష్టాలను బట్టి మీరు ట్రీట్‌మెంటు ఇస్తారా, పేషెంటు అవసరాన్ని బట్టి కాదన్న మాట." ఆశ్చర్యంగా అంది స్వాతి.

"అదికాదు.. మా ఉద్దేశ్యం. ఇన్నిసార్లు హాస్పిటల్‌లో చేరడం. వెళ్ళడం... కొంతమందికి..."

"అది ఎవరో రెస్పాన్స్‌బిలిటీ తెలీని మామూలు వాళ్ళ సంగతి. మేం డాక్టర్లం. ఉయ్ రెస్పెక్ట్ అవర్ డాక్టర్స్." అంది కోపంతో.

.... వాళ్ళిద్దరూ ఏం మాట్లాడలేదు.

"అసలు మీరు తప్పించుకోవాలని చేసిన పని అది."

"మమ్మల్ని మీరు అపార్థం చేసుకుంటున్నారు."



"ఏం... ఎందుకు చేసుకోకూడదు.. రెండున్నర సంవత్సరాల నుంచి ప్రతి చిన్న విషయానికీ మేం డాక్టర్లం అయివుండీ మీ దగ్గరకే వస్తున్నాం. మరి మీరేమో ఇంకా ఎక్స్‌పరిమెంటల్ స్టేజిలోనే వున్నారు. మీరెప్పుడు అసలు కరెక్టు ట్రీట్‌మెంట్ ఇచ్చేది...? నేనాయన్ని పోగొట్టుకోలేను. నాకాయన కావాలి..." భోరున ఏడ్చేసింది స్వాతి.

వాళ్ళకు గొంతు తడారిపోయినట్లయింది స్వాతిని చూస్తూ వుండిపోయారు.

కళ్ళుతుడుచుకుని, "ఆల్‌రైట్... ఆయన్ని మీకు వదిలేస్తున్నాను. ఎంతకాలమైనా సరే... బాగు చేయండి." తనను తాను కంట్రోల్ చేసుకుంటూ అంది స్వాతి.

"సారీ డాక్టర్ స్వాతీ...! మేమింతకాలం ఆయన్ని శాయశక్తులా బాగుచేయాలనే ప్రయత్నించాం. ఎందువల్లో మేం ఓడిపోవాల్సి వచ్చింది. ఇక ఇదొక ఛాలెంజి మాకు. అగ్ని పరీక్ష. అసలు మేమిలాంటి కేసులు చాలా అరుదుగా చూస్తుంటాం. యు మస్ట్ అండర్ స్టాండ్ అవర్ పొజిషన్... ఉయార్ సారీ డాక్టర్..." అంటూ తలొంచుకున్నాడు డాక్టర్ రెడ్డి.

అంత పెద్ద డాక్టర్ అలా అంటూవుంటే స్వాతికి ఏదోలాగ అనిపించింది. తనకు తెలుసు అది వాళ్ళ తప్పుకాదని, అయినా ఏం చేయగలదు. ఎవరితో చెప్పుకోగలదు. అదే వేరెవరో అయితే తను మాట్లాడిన దానికి పడి వుండ గలరా...క్షమాపణలు చెప్పుకున్నది తన తొందరపాటుకు స్వాతి.

"ఓకే... జరిగిపోయింది తలచుకుని లాభం లేదు. యిప్పుడు చేయాల్సింది నిర్ణయించుకోవాలి." డాక్టర్ రెడ్డి అన్నాడు శంకర్ చౌదరిని చూస్తూ.

"ఆల్‌రైట్.. ఉయ్ విల్ డు యానిజియోగ్రఫీ... సర్జికల్‌గా చేయగలిగింది ఏదైనా వుంటే సంతోషం. అలా వీలు కానపుడు మెడికల్‌గా బాగు చేయడానికి ప్రయత్నిస్తాము." డాక్టర్ శంకర్ అన్నాడు.

"ఒకప్పుడు, మీరే అన్నారు యానిజియోగ్రఫీ చేయడం ఇష్టం లేదని...?" అంది డాక్టర్ శంకర్‌తో స్వాతి.

"అవును... అప్పుడు ఆ కండిషన్‌లో చేయడం మంచిది కాదని, కానీ ఇప్పుడు వేరే మార్గం లేదు."

"సరే... సర్జికల్‌గా, మెడికల్‌గా కూడా బాగుచేయలేమని తేలినపుడు...?"

వాళ్లిద్దరూ ముఖాలు చూసుకున్నారు ఏంచెప్పాలో తెలియక.

డాక్టర్‌రెడ్డి తేరుకుని అన్నాడు, "ఎందుకు బాగుచేయలేము. ఏదో ఒక మార్గం వుంటుంది. కాకపోతే అతనిక్కడ ఎక్కువ కాలం ఉండాల్సి రావచ్చు. ఒకనెల కాకపోతే మూడునాల్గు నెలలు."

gudachari.com

స్వాతి అలా ఆలోచిస్తూ వుండిపోయింది.

డాక్టర్ రెడ్డి స్వాతి తలపై చేయివేసి నిమురుతూ, "టేకిట్ ఈజీ... మై చైల్డ్... టేకిట్ ఈజీ..." అని వెళ్ళిపోయారు.

.... .... జ్వరం కంట్రోల్‌కి వచ్చిం తరువాత.

ముందుగా ఎకో కార్డియోగ్రామ్ తీశారు.

దానిలో ఏమీ తెలియలేదు. ఇంతకు ముందులాగే ఉంది.

రెండురోజుల తర్వాత యానిజియోగ్రఫీ చేశారు. డాక్టర్‌శ్రీని ఈసారి చాలా తేలిగ్గా తీసికున్నాడీ పరీక్షని. వారం తర్వాత చేయొచ్చు అన్నా కాదు వెంటనే చేయమని పట్టుపట్టాడు కూడా.

స్వాతితో అన్నాడు, "యానిజియోగ్రఫీలో ఏదో ఒక లోపం కనిపిస్తే బావుండునని కోరుకో." అని డాక్టర్‌శ్రీని.

"ఎందుకు?"

"సర్జికల్‌గా ఏదైనా చేయగలిగింది వుంటే పరిస్థితి మెరుగుపడుతుంది. లోపం లేకపోతే మళ్ళీ మామూలే అవుతుంది."

అంటే ఇప్పుడు తను అతనిలో ఏదో లోపం ఉండాలని కోరుకోవాలన్నమాట. ఎంత చిత్రం...! జబ్బేమీ ఉండకూడదని కోరుకోవడం సహజం. కానీ జబ్బు ఉండాలని కోరు కోవడం...? తప్పదు ప్రస్తుత పరిస్థితిలో అనుకుంది స్వాతి.

ఇంతలో ఒక డాక్టర్ వచ్చి బి.పి. చూశాడు.

"ఎంత వుంది?"

"అది నేను చెప్పకూడదు."

"ఏం... ఎందుకని?"

"హాస్పిటల్ రూల్స్‌కి వ్యతిరేకం కనుక."

"ఆరేబాబా.. నేనూ డాక్టర్నే..." అన్నాడు డాక్టర్‌శ్రీని.

"అయినా అంతే..." అంటూ లెక్కచేయకుండా వెళ్ళిపోయాడతను.

డాక్టర్‌శ్రీనికి బాగా కోపం వచ్చింది.

"ఇన్‌సల్ట్... డామ్ డర్టీ ఫెలోస్... ఇవేం రూల్సు అర్థం కావు. పరిస్థితి అడిగితే చెప్పే అధికారం లేదట. పేషెంటుని అడక్కుండా మాత్రం ఏమైనా చేయడానికి అధికారం వుంది." కోపంతో అన్నాడు.

ఒక గంట తర్వాత అదే డాక్టర్ మళ్ళీ వచ్చి బి.పి. చూడబోయాడు.



డాక్టర్‌శ్రీని, "వాటీస్ దట్ యుసెడ్ టుమి లాస్ట్ టైమ్ నా బి.పి. అడిగితే చెప్పకూడదా... అది హాస్పిటల్ రూల్స్‌కి విరుద్ధమా... అయితే నా బి.పి. ఏ పనికి మాలిన డాక్టరో చూడ్డానికి వీల్లేదు. అది నా పాలసీకి విరుద్ధం." కోపంతో అన్నాడు అసహ్యించుకుంటూ.

"డాక్టర్..." ఏదో సర్ది చెప్పబోయాడతను.

"డామ్... బ్లడీ రూల్స్... బ్యూరోక్రటిక్ రూల్స్... ఐ డోంట్ కేర్... వెళ్ళి చెప్పు మీ బాస్‌తో ఇది నా రూల్ అని."

అతను గుర్రుగ చూస్తూ వెళ్లిపోయాడు. స్వాతికి భయమేసింది అనవసరంగా గొడవవుతుందేమో అని. సర్దిచెప్పి ప్రయత్నించింది. వాళ్ళనర్థం చేసుకోండి అని.

"ఏమిటి... అర్థం చేసుకొనేది. ఆమాత్రం మర్యాద ఇవ్వాల్సిన అవసరం లేదా... నేనూ డాక్టర్నే కదా... చెబితే కొంప మునిగిపోయేదేముంది...?"

ఇంతలో డాక్టర్ శంకర్ రూమ్‌లోకి వచ్చాడు.

"ఎక్స్‌రే (యానిజియోగ్రఫీ)లు చూశాను. సర్జికల్‌గా ఏమీ చేయాల్సిన అవసరం లేదు. బైపాస్ బాగుంది. అన్యురిజమ్ ఏమీ లేదు. పోతే గుండె అడుగుభాగం మాత్రం చాలా బలహీనంగా వుంది. అయితే గుండె అనుకున్నంత హోప్‌లెస్‌గా మాత్రం లేదు. ఇంకో మంచి వార్త నైట్రోగ్లిసరిన్ ఇస్తే గుండె ప్రక్క గోడలు బాగా పనిచేస్తున్నాయి. అందువలన నైట్రోగ్లిసరిన్ నీకు పనిచేయవచ్చు. నీకు జబ్బు లేదని చెప్పడం లేదు. అయితే ఇంతకన్నా చెడ్డ కేసులు చూసి వున్నాం మేము. నీకు తెలుసు నువ్వనుకున్నంతగా బాగుకాలేదని, మాకూ తెలుసు మేం అనుకున్నంత బాగా చేయలేదని. గతం మరచిపోదాం. ఇప్పుడు మనం కలసి ఒక పద్ధతి ప్రకారం నడచుకుంటే చాలా వరకు సమస్య పరిష్కరించినట్లే... నువ్వు వ్యాయామం చేస్తున్నావు కదా... ఇంకాస్త ఎక్కువ చేయి."

"మరో బైపాస్ సంగతేమిటి?"

ఉన్నట్లుండి అడిగేసరికి మాట్లాడం నిలిపి, "ఏవిటీ?" అన్నాడు డాక్టర్ శంకర్ చౌదరి.

"నాకు చేసింది రెండు బైపాస్‌లు. ఒక ఆర్టరీ బైపాస్ బావుందన్నారు. మరి రెండోదాని సంగతి?"

"రెండోది..." కొంచెం తడబడ్డాడు.

"అది సరిగా కనిపించడం లేదు ఇందులో..."

వెళ్ళిపోయాడు.

"కనిపించడం లేదంటారేవిటండీ..." అంది స్వాతి అనుమానంగా.

"అంటే... అది... పూడుకుపోయిందన్నమాట." తెచ్చి పెట్టుకున్న నవ్వుతో స్వాతి వైపు తిరిగి అన్నాడు డాక్టర్‌శ్రీని.



gudachari.com

అది చాలు తన తల పగిలిపోవడానికి... ఒకటి పూడిపోతే తర్వాత గతి...? మళ్ళీ హార్ట్ అటాక్ రాదని నమ్మకం ఏమిటి...? గుండె అంత బలహీనంగా వుంటే మనిషి ఎంతకాలం బ్రతుకుతాడు..? అయినా ఫరవాలేదంటా దేవిటి?! అవన్నీ తలచుకొంటుంటే స్వాతికేం పాలుపోలేదు.

నేరుగా డాక్టర్ శంకర్ గదికి వెళ్లింది. తన కోసమే ఎదుర్చూస్తున్నట్లు కూర్చుని వున్నాడు. సూటిగా స్వాతి కళ్ళలో చూడలేక తలొంచుకున్నాడు.

"నిజం.. చెప్పండి... మీరు చెప్పిన దాంట్లో ఎంత నమ్మవచ్చు...?"

స్వాతి వైపు కాసేపు అలాగే చూసి, తర్వాత

"అతని గుండె చాలా బలహీనంగా వుంది. చాలా తక్కువగా పనిచేస్తోంది. కానీ ఒక్కటి మాత్రం నిజం, నైట్రోగ్లిజరిన్ ఇస్తే కొంచెం బాగా పనిచేస్తుంది. అది చాలు మనం దాంతో కొంతవరకూ ఏదైనా చేయచ్చు. అలాగే కొద్దిగా వ్యాయామం చేస్తూ జాగ్రత్తగా చూసుకోవాలి."

"ఇలా ఎంతకాలం?"

"అది చెప్పలేను."

"... మరి... ఈయనెంత కాలం బ్రతకచ్చు....?"

"దానికి సమాధానం చెప్పానుకదా...! నాకు తెలియదు. బహుశ మరో రెండు మూడు సంవత్సరాలు. లేదా..." ఆఖరు మాట అతనిలోనే అణిగిపోయింది. అబద్ధం చెపుతున్నందుకు చాలా బాధపడుతున్నాడనిపించింది.

మరో రెండు మూడు సంవత్సరాలు... మూడు సంవత్సరాలు బుగ్గి కావడానికి ఇంకా మూడు సంవత్సరాలే, ఆ తర్వాత నువ్వు వొంటరిదానవు. కాదు ఏ క్షణంలోనయినా ఏదైనా జరగవచ్చు. నీతోడు, నీవాడు, నీ సౌభాగ్యం నీ కళ్ళముందే దూరం కాబోతున్నాడు అని. దినదిన గండమే. రోజు రోజుకూ కృశించి పోతూ మృత్యువుకు ఒక్కో అడుగు దగ్గరవుతూ వుంటే తను చూస్తూ, ఈనిజం గుండెల్లో పెట్టుకుని ఎలా భరించగలదు. ఎలా బ్రతగ్గలదు... ఆయనకు బాగయ్యే మార్గమేలేదా..? ఆయన జీవించే అవకాశమే లేదా...? అని తలంపురాగానే కుప్పలాకూలిపోయింది స్వాతి.

కానీ అంతలోనే, ఆయన బ్రతకాలి... బ్రతికించుకోవాలి! ఏవిధంగా అయినా సరే.. ఎన్ని రోజులైనా సరే... ఎంత డబ్బైయినా సరే... మొండిధైర్యంతో డాక్టర్ రెడ్డి గదికి వెళ్ళింది. ఆయనలోనూ కలవరపాటు... "కూర్చో," అన్నాడు.

"ఐయామ్ సారీ... రియల్లీ ఇటీజ్ ఎ బాడ్ న్యూస్... రియల్లీ ఐ ఫీల్ సారీ ఫర్ హిమ్. నేనూ ఇందుకు బాధ్యుడ్నేమో అనిపిస్తుంది. ఆపరేషన్ తర్వాత ఎవరూ ఊహించని ఆ ఇన్సిడెంట్ జరగకుండా వుంటే... ఎంత బావుండేదో! కానీ జరిగింది. నాకే ఏదోలా



వుంది అతన్ని తలచుకుంటే. డాక్టర్‌గా పరిచయమే అయినా అతని పట్టుదల, నిగ్రహం, అతన్నో ఆత్మీయుడిని చేశాయి. నా ఇంత అనుభవమూ ఉపయోగపడక పోవడం..." మాటలు రాక గొంతు పూడుకుపోయింది.

సర్దుకుని, "వెల్.. ఒక బైపాస్ మూసుకుపోయిందని శంకర్ చెప్పే వుంటాడు. ఆ భాగం గుండె పని చేయడం లేదు. కొన్ని చిన్న ఆర్టరీలు ఆ ప్రాంతానికి రక్తం సప్లై చేస్తున్నాయి. మిగిలిన బైపాస్ బాగా వుండడం అదృష్టం. నైట్రోగ్లిజరిన్ ఇస్తే పనిచేస్తుంది. అది చాలు... మనం చేయాల్సిందేవిటంటే కంప్లీట్ రెస్ట్... ఏమాత్రం చిన్న శ్రమకూడా పనికిరాదు..." అన్నాడు.

"బట్... డాక్టర్ శంకర్...!"

"నాకు తెలుసు ఏం చెప్పాడో?"

"వ్యాయామం చేయించమన్నాడే...?!"

"అతనేం చెప్పాడో నా కనవసరం నేను చెబుతున్నాను ఎటువంటి వ్యాయామం ఒక నెల వరకూ చేయరాదు. అతన్ని ఉత్సాహపరస్తూ సాధ్యమైనంత వరకూ జబ్బు గురించి ఆలోచించకుండా చేయాలి."

"ఒక్కొక్కరూ ఒక్కో అభిప్రాయం చెబితే ఎలా... ఇద్దరూ మాట్లాడుకొనే ఒకే మాట చెప్తే సంతోషిస్తాను." వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ అన్నది స్వాతి.

"యుటేక్... విచ్ ఈజ్ రీజనబుల్."

"అది నా పని కాదు. మీరు చెప్పాలి విచ్ ఈజ్ గుడ్ ఫర్ ది పేషెంట్...."

"అందుకే నేను చెప్పినట్లు చేయి. అతన్ని నిస్పృహ, నిరాశల్నుంచి తప్పించి ఆశ వైపు నడిపించే భారం నీది. నాకు తెలుసు నువ్వు చేయగలవని."

"ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసికుంటున్నాను. మరి మందుల విషయం...."

"విశ్రాంతి, ఆహారం, ఆలోచన ఈ విషయాల్లో జాగ్రత్త వహిస్తే ఆ మందులు చాలు."

స్వాతి నిశ్శబ్దంగా వుండిపోయింది ఆలోచిస్తూ మళ్ళీ తనే అన్నాడు.

"అంతకంటే వేరే మంచి మార్గం ఏమీ కనిపించడం లేదు. ఎంత ఆలోచించినా వేరే అవకాశం లేదు." గాఢ నిట్టూర్పుతో అన్నాడు.

"హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్...?"

నెత్తిమీద బాంబు పడ్డట్టు ఉలిక్కి పడ్డాడు. ఆశ్చర్యంతో తలెత్తి స్వాతిని చూస్తూ "ఏం చెప్పారు...?"

"గుండె మార్పిడి... అందుకు ఏదైనా అవకాశం వుందా?"



gudachari.com

ఇంకా ఆశ్చర్యం... కాసేపు ఆలోచనల్లో నిమగ్నుడై మెల్లగా,

"యస్... యస్.. చూద్దాం... అమెరికా నుంచి ఇండియన్ కార్డియాక్ సర్జన్ ఈ హాస్పిటల్‌లో కార్డియాక్ సర్జరీ ఛీఫ్‌గా రేపు రాబోతున్నారు. ఆయనతో మాట్లాడుదాం. ఆయన్ని ముఖ్యంగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్‌కే పిలిపించారని చెబుతున్నారు. మంచి అనుభవం వుంది. కానీ ఇక్కడ చేసేందుకు వీలుండదేమో! స్టేట్స్‌కి వెళ్తే... డోనార్ దొరకడం అంత తేలికయిన పనికాదు. అందునా ఫైనాన్సియల్ పొజిషన్..." కాసేపు ఆలోచనలో నిమగ్నుడై "వుయ్ విల్ ఫైండవుట్, శంకర్‌తో కూడా కలసి మాట్లాడితే బావుంటుంది." కాస్సేపాగి మళ్ళీ అన్నాడు.

"ఇట్ ఈజ్ నాట్ సో ఈజీ..."

"ఇక్కడ చేసేందుకు వీల్లేదా.?"

పిచ్చిదాన్ని చూసినట్లు చూశాడు స్వాతిని. ఇంతలోనే ఆచూపుల్లో సానుభూతి, అభిమానం చోటుచేసికున్నాయి. స్వాతి తలదించుకున్నది. తన బాధ వాళ్ళకేం అర్థమవుతుంది అనుకుంటూ.

"యస్... చాలా ప్రాబ్లెమ్స్ వున్నాయి. ఒకవేళ జరిగితే ఇదే భారతదేశంలో మొట్టమొదటి హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ అవుతుంది."

మరుసటి రోజు వాళ్ళగదిలోకి డాక్టర్ రెడ్డి, డాక్టర్ శంకర్ మరో కొత్త వ్యక్తి వచ్చారు.

"వెల్... హౌ ఆర్ యు డాక్టర్ శ్రీని... డాక్టర్ స్వాతి... మీట్ డాక్టర్ సాగర్. ది ఫేమస్ కార్డియోథొరాసిక్ సర్జన్... ఈ హాస్పిటల్ ఛీఫ్‌గా వచ్చారు. హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎక్స్‌పర్ట్.... అమెరికాలో చేశారు. ఫెయిల్యూర్ రేట్ ఈజ్ నెగ్లిజబుల్."

డాక్టర్‌శ్రీని అర్థంకానట్లు స్వాతి వైపు చూసి ఆయన్తో కరచాలనం చేశాడు.

"ఐ హావ్ గాన్ ఆల్ త్రూ యువర్ రికార్డ్. ఇన్‌క్లూడింగ్ బైపాస్ సర్జరీ. మామూలుగా ఆ కాంప్లికేషన్ చాలా రేర్‌గా వస్తుంది. సో... జరిగిపోయింది మరచిపోదాం. నేనేదైనా చేయకలిగి వుంటే అంతకన్నా నాకు అదృష్టం వేరే వుండదనుకుంటాను. కెన్ ఐ ఎగ్జామిన్ డాక్టర్ శ్రీని..." అన్నాడు డాక్టర్ సాగర్.

"ఓ.. ష్యూర్.. నో అబ్జెక్షన్..." భర్తనే చూస్తుంది స్వాతి. అతనిలో ఏ భావమూ కనిపించడం లేదు గానీ ఏదో ఆలోచిస్తున్నట్లు అర్థమవుతూంది.

ఎగ్జామిన్ చేసింతరువాత

"వెల్... డాక్టర్! మరికొన్ని పరీక్షలు చేయాలి. మీకేమైనా అభ్యంతరమా?!" అన్నాడు డాక్టర్ సాగర్.

"ఎన్ని రోజులు పడుతుంది."

"ఒక వారం."



"వారం రోజులు..." ఏదో చెప్పబోయేలోగా

"ప్లీజ్... నాకోసం...." అన్నారు డాక్టర్ సాగర్.

డాక్టర్‌శ్రీని స్వాతి వైపు చూశాడు సరే అనమన్నట్లు వేడికోలుగా చూసింది.

కాస్త విముఖంగానే, "ఆల్‌రైట్.. ప్రోసీడ్" అన్నాడు.

"దటీజ్ ఇట్.. వెరీ గుడ్.. ఐ లైక్‌యు..." అని వెళ్ళిపోయారు.

పరీక్షలు ఈ హాస్పిటల్లో చాలా తక్కువ, అవసరమున్నవే చేస్తున్నారు. తను విన్నది కొందరయితే చాలా ఎక్కువగా, అవసరం ఉన్నా లేకపోయినా, చాలా ఖర్చులతో కూడినవి చేస్తారట. ఒక వేళ డాక్టరు అలా చెయ్యకపోతే ఆడిటింగ్ వాళ్ళు వొప్పుకోరట.

ఒక్కొక్క డిపార్టుమెంటుకు నెలకు యింత ఆదాయం, మందుల వలన గాని, పరీక్షల వలన పేషంట్లను చూసినది ఉండాలి అని హాస్పిటల్ నిర్ణయిస్తుంది. దానికి తగినట్లుగా డాక్టర్ అవసరం ఉన్నా లేక పోయినా అన్నీ చేస్తుంటారు. మానవత్వం, ఆత్మావలోకం, పాపభీతి ఏవీ ఉండదు. డబ్బు... అంతా డబ్బు. దయాదాక్షిణ్యాలను గురించి ఆలోచిస్తే అటువంటివి ఎంత వెతికినా దొరకవు.

కానీ ఏం చేస్తాం. మంచి డాక్టర్లు, మంచి నర్సులు, అవసరానికి పనికి వచ్చే అధునాతన పరికరాలు అక్కడే ఉంటాయి. తప్పదు. అంతే!

గదిలో వాళ్ళిద్దరే మిగిలారు. నిశ్శబ్దం... ఆ వాతావరణం ఇబ్బందికరంగా వుంది స్వాతికి. అతనేం అడుగుతారో అని భయం. భయంగాఉంది. రెండు మూడు సార్లు స్వాతి వైపు చూసి గాఢ నిట్టూర్పు మినహా ఏమీ అడగలేదు. ఆ మౌనం మరీ కష్టంగా ఉంది ఆమెకు. ఏదో ఒకటి లోపలున్నది అడిగేస్తే బావుండుననిపించింది.

"నువ్వు అడిగావా... వాళ్ళే సజెస్ట్ చేశారా హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి..?" వెలువడిందో ప్రశ్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

స్వాతి జవాబివ్వలేదు. తనే ప్రారంభించారు నిదానంగా స్పష్టంగా.

"నేనేమీ భయపడ్డం లేదు. దేనికైనా నేను సిద్ధమే... నా పరిస్థితి ఏమిటో తెలిసిన తర్వాత భయం పూర్తిగా పారిపోయింది. ఇప్పుడు నేను నిజాన్ని ఒప్పుకుంటున్నాను. ఇంతకు మునుపు చావుని ఛాలెంజి చేసేవాడ్ని, కానీ ఇక తిరగబడలేను. అయితే అలాగని నిరాశ చెందడమూలేదు. మరో వింత విషయం ఏమిటంటే నాకిప్పుడు చాలా సంతోషంగా వుంది. హాయిగా... మనశ్శాంతిగా వుంది. ఇంత కాలం నిరాశా నిస్పృహల్తో ఎలా ఉండ గలిగానో అర్థంకాదు..."

అతని గుండెల్లోంచి బాకుల్లా వెలువడిన ఆ మాటలకి స్వాతి మనస్సును ముక్కలు ముక్కలుగా కోస్తున్నంత బాధగా ఉంది. అయినా తను భరించకతప్పదు. తను అధైర్య



gudachari.com

పడకూడదు. నిరాశతో కృంగిపోకూడదు. పరిస్థితిని ఎంత సున్నితంగా, యధావిధంగా తీసుకొని అర్థం చేసుకొనే అతని హృదయ వైశాల్యానికి జోహారులర్పించింది స్వాతి.

వారం రోజుల తర్వాత ఒక నిర్ణయం తీసికోవడానికి డాక్టర్ రెడ్డి, డాక్టర్ శంకర్, డాక్టర్ సాగర్, స్వాతి సమావేశమయ్యారు. అందరూ దీర్ఘాలోచనల్లో వున్నారు. వాళ్ళ నోటివెంట వెలువడే మాట మీద తన జీవితం ఆధారపడి వుంది. తన భర్త ఆపరేషన్‌కి పనికి వస్తాడా... లేదా రోజులు లెక్కించుకుంటూ గడపాలా... అన్నది. అయితే ఆరెండింటిలో ఏదీ తేలికయినది కాదని తెలుసు స్వాతికి.

ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సుంటే అందులో సక్సెస్ కావడానికి అనేక పరిస్థితులు అనుకూలించాలి. మొట్టమొదటిది డాక్టర్ ప్రతిభ. మైక్రో వాస్క్యులార్ అమర్చిన రక్తనాళాలన్నింటిని ఒక్కొక్కటే కరెక్టుగా కుట్టివేయాలి. ఇందుకు అద్భుతమైన నైపుణ్యం అవసరం.

పైగా గుండెను దానం చేసే మహాత్ముడు దొరకాలి. అది చాలా కష్టం. ఏళ్ళ తరబడి ఎదుర్చూడాల్సి రావచ్చు. ఒక వేళ దొరికినా ఆ శరీరానికి సరిపడే గుండె దొరకాలి. అదింకా కష్టం. ఈలోగానే ప్రాణం పోయే ప్రమాదమూ వుంది.

వీటన్నింటి కంటే ముఖ్యమైనది... డబ్బు. ఐశ్వర్యవంతులకే అసలిది పరిమితం. ఇతర దేశాల్లో అయితే మన లెక్కల ప్రకారం ఈ చికిత్సకి చాలా ఎక్కువ అవుతుంది. మరి ఒక్కడ... ఎంత లేదన్నా పది, ఇరవై లక్షలు కావచ్చు. అంత డబ్బు పెట్టి చేయించు కుంటే సక్సెస్ కావచ్చు. కాకపోవచ్చు.... ఆలోచనలు సాగిపోతున్నాయి స్వాతిలో. ఆ తరువాత కూడా చాలా ఖర్చు అవుతుంది. మనో నిబ్బరం కూడా చాలా ముఖ్యం. నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ డాక్టర్ సాగర్. స్వాతి వైపు చూసి అన్నాడు.

"వెల్... స్టేజ్ సెట్ ఫర్ ఎవ్విరిథింగ్"

"వాట్ స్టేజ్?"

"డాక్టర్ శ్రీని... ఈజ్ ఎన్ ఐడియల్ కేస్ ఫర్ ట్రాన్స్‌ప్లాంటేషన్.

ఐడియల్ కేస్:- వయసు 35-45 లోగా ఉంటే మంచిది, మందులతో బాగుకాని గుండె జబ్బు అయి ఉండాలి, షుగర్ వ్యాధి ఉండకూడదు, కడుపులో పుండు ఉండకూడదు. రక్తం అన్ని భాగాలకు ప్రసరిస్తూ ఉండాలి, (పెరిఫెరల్ వాస్కులార్) ఊపిరితిత్తులు బాగుండాలి, త్రాగుడు కాని, మత్తు పదార్థాలు అలవాటు ఉండకూడదు, మందులు తీసుకోవటంలో అశ్రద్ధ లేనివారు, అన్నింటి కన్నా మనోధైర్యం కావాలి, రక్త పరీక్షలో కూడా అన్నీ సక్రమంగా ఉండాలి. ఆల్ ది అదర్ బాడీ ఫంక్షన్స్ ఆల్సో గుడ్ ప్రొవైడెడ్... అతనికి అంతవరకూ... మళ్ళీ ఏమీ రాకుంటే!," అందర్నీ కలియచూస్తూ అన్నారు. వాళ్లూ అవునన్నట్లు తలలు ఊపారు.

"ఎంతకాలం," స్వాతి ప్రశ్న.



"ఉయ్ డోంట్ నో.. మేబి మంత్స్, ఆర్ ఇయర్స్."

"డాక్టర్ శంకర్ మూడు సంవత్సరాలు బ్రతకొచ్చు అన్నారు?" అతన్ని చూస్తూ అంది. అందరూ అతనివైపు ప్రశ్నార్థకంగా చూశారు. డాక్టర్ రెడ్డి ముఖంలో కోపం. డాక్టర్ శంకర్ తడబడి సర్దుకుంటూ,

"ఐ యామ్... ఐ మీన్.. ఐ ఫీల్... ఇటీజ్ గుడ్ థింగ్ టు టెల్ లైక్ దట్." అన్నాడు. ఈసారి తడబాటు స్వాతి వంతయింది.

"యు.. మీన్... మీరు చెప్పింది నిజం... కా... దా..."

"నిజం కాదని చెప్పడం లేదు నేను. ఇటువంటి కేసుల్లో ఖచ్చితంగా చెప్పలేం.. ఉండొచ్చు మూడు సంవత్సరాలు."

"ఐ డోంట్ వాంట్ దట్ ఉండొచ్చు.. పోవచ్చు... నాకు కరెక్ట్ అసెస్‌మెంట్ కావాలి." కోపంతో చిరాగ్గా అంది స్వాతి.

"హౌకెన్ ఐ గివ్ కరెక్ట్ అసెస్‌మెంట్... ఈ కేసులో రోగి ఈ రోజు బావుంటే రేపు బావుండడం లేదు..."

"అవన్నీ అడగడం లేదు నేను. ఇప్పటి పరిస్థితిని బట్టి ఎంతకాలం బ్రతకవచ్చు?"

"మళ్ళీ తిరిగి ఫెయిల్యూర్‌లోకి పోకుండా, మధ్యలో ఏమీ జరక్కుండా, ఇచ్చిన మందు అతనికి సరిపడితే మూడు సంవత్సరాలు పైనే బ్రతకవచ్చు."

"ఫెయిల్యూర్‌లోకి పోకుండా, మరేమీ జరక్కుండా చూసుకోలేమా?" అడిగింది స్వాతి. అందరూ ఆశ్చర్యంతో ఆమె వైపు చూశారు.

"యుమీన్... గ్యారంటీ కార్డ్ ఇమ్మంటారా...?" డాక్టర్ శంకర్ వ్యంగ్యంగా అడిగాడు. స్వాతిలోని కోపం కట్టలు తెంచుకుంది.

"యస్... ఐ వాంట్ గారెంటీ కార్డ్. దగ్గర దగ్గర మూడు సంవత్సరాలు ఆయన్ని మీ చేతుల్లో పెట్టాను. ఇప్పటికీ మీరు కరెక్ట్ లైన్‌లో ట్రీట్ చేయలేకపోయారు. వ్యాయామం చేయమని ఒకరు, చేయొద్దని మరొకరు, మందులు తగ్గించమని ఒకరు, పెంచమని మరొకరు... ఇప్పుడేమో ఆ గుండె పనికి రాదంటున్నారు. అసలు దీనికి బాధ్యులు మీరు... మీరే..."

"ఐ... ఐ కాన్ట్ టాలరేట్ దిస్ టైప్ ఆఫ్ ఇన్‌సల్ట్... ఇంతకాలం మా తలలు బ్రద్దలు చేసుకుంటే మాకు దక్కిన ప్రతిఫలం ఇది..." శంకర్ బాధగా అన్నాడు. అవమాన భారంతో అతని ముఖం ఎర్రబడింది. డాక్టర్ రెడ్డి ముఖం కూడా చిన్నబోయింది.

"నేను చెప్పడం లేదు మీరు అభిమానంతో చూడలేదని... నేను అనడం లేదు మీరు శ్రద్ధగా చూడలేదని, అయితే ఎక్కడ ఏం జరిగిందో మీకు తెలియడం లేదంటున్నాను...."

"డాక్టర్ స్వాతి! కంట్రోల్ యువర్ సెల్ఫ్"



gudachari.com

"ఎలా కంట్రోల్ చేసుకోమంటారో చెప్పండి... ప్రాణ సమానమైన భర్త! మూడు రోజులో, మూడు సంవత్సరాలో చెప్పలేం అంటూ వుంటే..." కట్టలు తెంచుకొని దుఃఖం పెల్లుబికింది. టేబిల్ మీద తలవాల్చి తన బాధను దిగమింగుకోవడానికి శతవిధాల ప్రయత్నించింది.

తలను ఎవరో నిమురుతున్నట్లనిపించి తలెత్తి చూసింది. డాక్టర్ రెడ్డి, అతని కళ్ళల్లో జాలి, ఆప్యాయత కొట్టొచ్చినట్లు కనిపించాయి.

"చూడు స్వాతి! నీ బాధను అర్థం చేసికోలేనంత మూర్ఖులం కాదు మేము. నువ్విన్ని మాట్లాడినా మేమేమీ బాధపడ్డం లేదు. ఎందుకంటే నీ పరిస్థితిలో ఎవరున్నా అలాగే ప్రవర్తిస్తారు. అది సహజం. కానీ డాక్టర్గ నువ్వు మమ్మల్ని అర్థం చేసుకుంటా వను కుంటాను. అదే మరో డాక్టర్ దగ్గరయితే నీ భర్తకు బాగైవుంటుందని నువ్వు నమ్మకంగా చెప్పగలవా...?"

నిజమే... అదే మరొకరైతే చాలా తేలిగ్గా వదిలించుకుని వుండేవారు వాళ్ళను.

"వెల్... మా తప్పులేదని నేను అనను. కానీ ఇటీజ్ ఓన్లీ కమ్యూనికేషన్ గాప్... మీరెక్కడో వుంటూ సమయానికి మీకు తెలియక పోవడం. తర్వాత మేమేదో చెప్పడం... అలా గాక అతన్నిక్కడే వుంచగలిగితే సాధ్యమైనంత వరకు బాగు చేయగలం లేదా కనీసం ఇంతకన్నా దిగజారిపోకుండా చూడగలం."

"ఆ మాట నేనెప్పుడో చెప్పాను. కానీ మీరే ఎక్కడున్నా ఒకటే అంటూ వచ్చారు."

"యస్... యు ఆర్ ఎ ప్రాక్టీసింగ్ డాక్టర్. పిల్లల్ని వదిలేసి హాస్పిటల్ మూసివేసి ఇక్కడొచ్చి వుండమని ఎలా చెప్పగలం.... పైగా అన్నిసార్లు హాస్పిటలూ, మందులూ అంటే పేషెంటు మానసికంగా కృంగిపోతాడు. అందులోనూ బలవంతంగా హాస్పిటల్లో ఉంచడం మా అభిమతం కాదు. తప్పనిసరి అయితేనే ఉంచగలం."

"అలా కాదు... మీరంతా దగ్గరే వుంటే అతనికెంతో మానసిక వ్యథ తగ్గించినట్లు అవుతుంది."

"...ఆల్రైట్ అలాగైతే ఇక ఇక్కడే వుంచేయండి. అదృష్టం బావుండి, అన్నీ కలిసి వస్తే ట్రాన్స్ప్లాంటేషన్ గురించి ఆలోచిస్తాం." మధ్యలో కల్పించుకుంటూ అన్నారు డాక్టర్ సాగర్.

డాక్టర్ శంకర్ వేపు చూసింది స్వాతి ఇంకా తేరుకున్నట్లు లేదు.

స్వాతికి చాలా బాధ వేసింది అనవసరంగా తన మానసిక వ్యధని అతని మీద చూపానే అని

"ఐయామ్ సారీ... మిమ్మల్ని బాధ పెట్టాను. ఇంతకాలం మీరు చూపిన శ్రద్ధకూ, అభిమానానికి దారుణంగా ప్రవర్తించాను. డాక్టర్గా నాకు తెలుసు కానీ పేషెంటు భార్యగా అలా ప్రవర్తించానేమో.... నన్ను క్షమించండి."



దాంతో కొంత తేరుకున్నాడు డాక్టర్ శంకర్.

"నో... నో... యాజ్ ఎ డాక్టర్... యు కెన్ అండర్స్టాండ్ బెటర్ దెన్ అదర్ పీపుల్. ఉయార్ నాట్ అన్ కన్సర్న్డ్ డాక్టర్స్. మేం అతని కోసం అనుక్షణం ఆలోచిస్తున్నాము. అయితే ఒకే ఒక విషయంలో మేము తప్పటడుగు వేశాము. ప్రతిసారి అతను రావడం, బాగై పోవడం, వెళ్ళిపోవడం, కొంతకాలం అబ్జర్వేషన్లో ఉంచకపోవడం..."

స్వాతి వింటూ ఉండిపోయింది మళ్ళీ తనే అన్నాడు.

"సరే... అతన్నిక ఇక్కడే వుంచండి. మళ్ళీ ఫెయిల్యూర్లోకి పోకుండా, శారీరకంగా మానసికంగా బలపడ్డానికి శ్రద్ధ తీసికుంటాం." తేలికపడిన హృదయంతో గాఢ నిట్టూర్పు వదిలాడు డాక్టర్ శంకర్.

స్వాతికి అదే మేలనిపిస్తోంది. కానీ పిల్లలు... హాస్పిటల్... ఏమైనా ఉండిపోవడానికే నిశ్చయించుకుంది. కానీ... డబ్బు.. ట్రాన్స్ప్లాంటేషన్? ఎంతవుతుందో... ఎలా చేయాలి...?

మొహమాటపడ్తూనే అడిగింది డాక్టర్ సాగర్ని ఎంతవుతుందని?

"నిజంగా... ఒకవేళ అదే జరిగితే... జరగనివ్వండి... చూద్దాం!"

"కాదు... ముందుగా అనుకోకపోతే అప్పటికప్పుడు తెచ్చుకోడానికి వీలుండదు..."

"బహుశా ఎంతయినా కావచ్చు. ఇన్సూరెన్సు ఉందా."

"ఉంది"

"చాలు సరిగ్గా ఎవరూ నిర్ణయించలేదు. ఇంతవరకు ఎవ్వరికీ చెయ్యలేదు గనుక. బహుశా ఇరవై అయ్యేటట్లు చూస్తాం".

స్వాతిలో రెప రెప లాడుతున్న ఆశ ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి పోయినట్లయింది. అంత డబ్బు ఎక్కడ్నించి తేవాలి..? ఆయన మీద ఆశ వదులు కోవలసిందే... గుండె పొరల్లోంచి పొంగుకు వస్తొన్న దుఃఖాన్ని నిగ్రహించుకోలేక బోరున ఏడ్చేసింది. ఆపరేషనుకే అంత అయితే మిగిలిన నర్సింగ్హోమ్ ఖర్చులు, వాళ్ళ ఖర్చుల...!?

"డాక్టర్ స్వాతీ... ఏమయింది...?"

"ఏమయిందమ్మ, ఎందుకేడుస్తున్నావు?"

"మేం ఉన్నాం కదా! అతన్ని బాగుచేసే పూచీమాది."

ఓదార్పులేవీ స్వాతి ఏడుపుని ఆపలేక పోయాయి.

"చూడు స్వాతీ! డబ్బు గురించి ఆలోచిస్తున్నావా... దేశంలో చారిటబుల్ ట్రస్ట్లు చాలా ఉన్నాయి. వాటికి అప్లై చేస్తే చాలా వరకు సాయం చేయచ్చు. ఇంకా సైన్స్ ప్రమోటింగ్ అసోసియేషన్స్, వాలంటరీ అసోసియేషన్స్ని కూడా అప్రోచ్ చేద్దాం. అందులోనూ భారద్దేశంలో మొదటి ట్రాన్స్ప్లాంటేషన్ అవుతుంది కనుక కొంత తక్కువే కావచ్చు. అవన్నీ



gudachari.com

మేం చూసుకుంటాం. నా శక్తినంతా ధారపోసి అయినా సరే ఈ ఆపరేషన్ విజయవంతం చేస్తాను" డాక్టర్ రెడ్డి అన్నారు.

... ఎంతటి దయనీయమైన పరిస్థితి... తన భర్త ఆపరేషన్‌కు అందర్ని యాచించాలన్న మాట... అందరి కాళ్ళూ పట్టుకోవాలన్నమాట... కుమిలిపోయింది స్వాతి.

వెంటనే కంట్రోల్ చేసుకుని, కన్నీళ్ళు తుడుచుకుంటూ "సారీ... ఐయామ్... సారీ... మీరందరూ చూపుతున్న అభిమానానికి మనసు తట్టుకోలేకపోయింది. మనుషుల్లో మంచివాళ్ళు వున్నారని ఋజువు చేస్తున్నారు మీరు. నేనెంతో అదృష్టవంతురాల్ని... మరిచిపోలేని ఆత్మీయులు అండ లభించింది..." అంటూ వణుకుతున్న గొంతుతో చేతులు జోడించింది. కళ్ళ నుండి జల జలా నీళ్ళు రాలాయి.

వాళ్ళ దగ్గర శెలవు తీసుకొని రూములోకి వచ్చింది కాసేపైన తర్వాత చదువుతున్న పుస్తకం ప్రక్కనబెట్టి అడిగాడు డాక్టర్‌శ్రీని.

"ఏం చెప్పారు వాళ్ళు?"

"ఏం... లేదు హాస్పిటల్‌లో రెండు నెలలు ఉండమంటున్నారు." ముఖం కనిపించ నీయకుండా అంది.

"ఇటీజ్ ఇంపాజిబుల్... నేనిక ఒక్క క్షణం కూడా ఉండను."

"ఉండకండి... వెళ్ళిపోదాం... ప్రతిక్షణం మీరు మృత్యువుతో పోరాడుతుంటే నేను ఆనందంగా చూస్తూ వుంటాను... ఎందుకండీ అంత మొండిగా మాట్లాడుతారు... నాకిక ఓపిక లేదు... సహనం నశించిపోయింది... ప్రతి క్షణమూ అనిపిస్తూ వుంటుంది. ఆత్మహత్య చేసుకుని మీకన్నా ముందే ఈలోకాన్నుంచి వెళ్ళిపోదామని. ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకుని ఆగమేఘాలమీద మద్రాస్‌కి పరిగెత్తడం... నేనెంత క్షోభ అనుభవిస్తున్నానో తెలియదు మీకు. నా గుండె ఈ ఆటు పోట్లను భరించే స్థితిని కోల్పోయింది... మీరు ఇక్కడ్నుంచి కదిల్తే నా శవాన్ని చూస్తారు."

ఆశ్చర్యంతో అలాగే స్వాతి వైపు చూస్తూ ఉండిపోయాడు.

"ఆల్‌రైట్... నీ ఇష్టం ఇక. నా ఇష్టా ఇష్టాల్ని వదిలేస్తున్నాను. ఎందుకంటే ఏక్షణమైనా నా ప్రాణం పోవచ్చు. ఇంతకాలం నువు నాకోసం అనుభవించిన నరకం చాలు.. కనీసం నా ఆఖరి క్షణాల్లో అయినా నీకు మనశ్శాంతి కలిగిస్తేనయినా నాకు ఒకరకమైన తృప్తి వుంటుంది." గుండె లోతుల్లోనుంచి భారంగా వెలువడ్డాయి ఆ మాటలు.

నిలుచోలేకపోయింది. "అంతమాట అనకండి... మీకు బాగవుతుంది. మిమ్మల్ని రక్షించుకుంటాను." మనసులోనే అనుకుంటూ అతన్ని హృదయానికి హత్తుకుంది స్వాతి.

స్వాతిని దూరంగా జరిపి ఆమె కళ్ళల్లోకి చూస్తూ



"పిచ్చిదానా! నా పరిస్థితి నేను అర్థం చేసికోలేదంటావా... నేను దేనికైనా సిద్ధమే... కానీ నువ్వే నిజాన్ని నమ్మడం లేదు."

"నేను నమ్మను... నమ్మి బ్రతకలేను..."

"... అందుకని హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి ఆలోచిస్తున్నావు. అదెంత ప్రమాదకర మైందో, దాని పర్యవసానం ఎలా వుంటుందో తెలియదు. ఒకవేళ అద్దం తిరిగితే చావు. ప్రస్తుతం ఎలాగో నెట్టుకు వస్తున్నాం."

"అలా జరగదు. నాకు ఆ నమ్మకం వుంది."

ఆశ్చర్యంతో ఆమెను చూస్తుండిపోయాడు అతను.

మళ్ళీ "పోనీ మీరే చెప్పండి... ప్రాణాన్ని రక్షించడానికి ఇక ఉన్నది ఒక మార్గం అయినపుడు, అందువల్ల వచ్చే ప్రమాదానికి భయపడి నిలిపేస్తామా! చెప్పండి?" అంది.

"చేసి.. ప్రమాదం జరక్కుండా శ్రద్ధ తీసికుంటాను." వెంటనే జవాబిచ్చాడు శ్రీని.

"అదే నేనూ చేస్తున్నది."

"ఒకవేళజరగక్కూడనిదే జరిగితే?"

"అప్పుడు మీరుండరు కదా ఏం జరుగుతుందో తెలిసుకొనేందుకు..." అతని కౌగిట్లో ఒదిగి పోయింది స్వాతి. ఇలాగే... ఈ కౌగిట్లో... నా ప్రాణం పోతే.. పోవాలి. ఇప్పుడే ఈ సమయంలోనే పోవాలి... కానీ పోదు.. ఆమె మనసు మొద్దుబారి పోయింది.

మరుసటి రోజు ఉదయం స్వాతి ఊరికి బయల్దేరింది. అతని కింకా జ్వరం వస్తూనే వుంది. వైరల్ ఫీవర్ తగ్గిపోతుందని డాక్టర్ల జవాబు. వదలి వెళ్ళాలని లేదు. కానీ తప్పదు. డబ్బు అవసరం.... ఆమెకు.

ఎవర్నడగాలి అంత మొత్తం... బంధువుల్లో అంతస్తోమత లేదెవ్వరికీ... తల్లిదండ్రుల్ని కూడా అడగలేదింతవరకూ. కానీ... తప్పదిప్పుడు... ఎవర్నైనా సరే... పరువు ప్రతిష్టలు, అభిమానం అవి ఆలోచిస్తూ కూర్చుంటే కాదు. నా భర్త ప్రాణం కాపాడుకోవాలి. అదే ఆమె ఆలోచన, ధ్యేయం.

పుట్టింటికి వెళ్ళింది.

స్వాతికి చూసి వాళ్ళ అమ్మా, నాన్న దగ్గరకు తీసుకున్నారు. సున్నితంగా "ఇలా జరుగుతుందని, కలలో కూడా అనుకోలేదమ్మా... నా బిడ్డ ఇంతటి బాధను తట్టుకుని ఎలా బతుకుతోందో ఆలోచిస్తే గుండె తరుక్కుపోతోంది, కానీ నిన్ను చూస్తే ఎంతో గర్వంగా ఉంది కళ్ళనీళ్ళతో కావలించుకుని అంది. అమ్మ.

అసలు విషయం చెప్పింది వాళ్ళతో.

చాలాసేపు మౌనం. స్వాతి నాన్న అడిగారు, "ఇదే నీ ఆఖరి నిర్ణయమా?"

"అవునని," ఖచ్చితంగా చెప్పింది.



gudachari.com

గట్టిగా ఒక నిట్టూర్పు వదలి ప్రారంభించారు.

"ఏ తండ్రి కూతురి పసుపు కుంకుమలు పోగొట్టుకోమని ఆశించడు. అలాగే భర్తనూ, భర్తతో పాటు డబ్బు పోగొట్టుకుని దిక్కులేని దానిలా వీధిలో నిలబడమని అనడు."

"అంటేమీ ఉద్దేశ్యం?"

"ఈ కాల పరిస్థితులను బట్టి మాట్లాడుతున్నాను... నన్ను అపార్థం చేసుకోకు, నా మాటలు రంపపు కోతల్లా నీ హృదయాన్ని గాయపరచవచ్చు. ఈ మాటలు నీ కెంత మనస్తాపాన్ని కలిగిస్తాయో అంతకంటే ఎక్కువ బాధను భరిస్తూ చెబుతున్నాను." అని స్వాతి వైపు చూసి నెమ్మదిగా

"నీ ప్రయత్నం మానుకో. శక్తికి మించి చేయగలిగింది చేశావు. బాగుకాలేదు. ఆలోచించు. ఏమిలేకపోయినా బ్రతకచ్చుకానీ డబ్బు లేకుండా బ్రతకలేమమ్మా! తలకుమించిన అప్పులు చేసినా భర్త బ్రతక్కపోతే నువ్వు కృంగిపోయేది అతను బ్రతకలేదని కాదమ్మా! అప్పు తీర్చలేక. ఎంతో గొప్పగా బ్రతికిన నువ్వు, పిల్లల భవిష్యత్తు డబ్బుతోనూ, నీ ఆత్మస్థైర్యంతోనూ ముడిపడి ఉంది."

"నాన్నా!" స్వాతిలోని కోపం, బాధ, జుగుప్స పెల్లుబికాయి అరుపులో.

"ఎంత కఠినంగా మాట్లాడుతున్నావు... నా భర్త పోయినా ఫర్వాలేదు అప్పు చేయొద్దంటున్నావు. డబ్బుకోసం నీదగ్గరకు వచ్చాననే కదూ! ఆల్‌రైట్.. మీరివ్వాల్సిన అవసరం లేదు. నా బాధలేవో నేనే పడతాను." అంటూ చరచరా వచ్చేసింది వీధిలోకి.

వాళ్ళ అమ్మ వచ్చి, "ఆవేశంతో నిజాన్ని, లోకాన్ని మరచిపోతున్నావమ్మా! బాగా ఆలోచించు. ఈ మాటలు చెప్పడానికి మీ నాన్న ఎంత తల్లడిల్లిపోయారో ఆలోచించు." అంది.

"ఏది ఆవేశం...? ఏది నిజం...?? నూరేళ్ళు పచ్చగా కాపురం చేయమని చెప్పాల్సింది పోయి, డబ్బుకోసం భర్తను పోగొట్టుకోమంటారా... ఆయన కోసం ఎంతైనా అప్పు చేస్తాను ఏమైనా చేస్తాను..."

కళ్ళలో నీరు నింపుకుని చేతులు పట్టుకుని, "నేను నీ తండ్రినమ్మా! నీ సౌభాగ్యం కోసం కలలు కన్నవాడ్ని. నీ కుంకుమ తుడిచేయమని చెబుతానా... సరే! నీ కోసం నా ప్రయత్నం నేను చేస్తాను. మన పరిస్థితి నీకు తెలుసు. మిగిలింది నీవు చూసుకో. రా... లోపలికి రా..." అంటూ లోపలికి తీసుకువెళ్ళారు ఆమె నాన్న.

ఒక వేళ ఎంత సర్దగలరు వీళ్ళు.. మహా అయితే ఒకటి లేక కష్టమీద రెండు లక్షలు వుంటుంది... మిగిలినది..?

ఇంటికి వెళ్ళి పిల్లల్ని చూడగానే గుండె చెరువైంది స్వాతికి. పిల్లల భవిష్యత్‌ను కూలదోస్తున్నానేమో! వీళ్ళని ఏమీలేని బికారులుగా చేయబోతున్నానా! నా స్వార్థం కోసం...



నా స్వార్థం ఎలా అవుతుంది...? తండ్రిని బ్రతికించుకోవడం వాళ్ళకూ ముఖ్యమే కదా! అయినా తర్జన భర్జనకిది సమయం కాదు. అనుకున్నది చేసేయడమే మంచిది అనిపించింది స్వాతికి.

స్వాతి వాళ్ళ అత్త మామలతో కూడా చెప్పింది. వాళ్ళేమీ సహాయం చేయలేరని తెలిసికూడా.

స్వాతి అత్తగారు కన్నీళ్ళతో, "ఇంకే మార్గమూ లేదామ్మా! మందులతో బాగవదా?" అంది.

"నీ పిచ్చిగానీ మందులతో బాగాయేటట్లయితే వాళ్ళకు తెలియదా!" మామగారు అన్నారు.

"పోనీ తల్లీ... నాగుండె సరిపోతుందేమో కనుక్కో అమ్మా.... నేను బ్రతికుండి ఏం సాధించాలి..."

తమ బిడ్డని రక్షించుకోడానికి వారి ఆరాటమూ, తపనకి స్వాతి మనసు అర్థమైంది.

"బ్రతికున్న వాళ్ళ గుండె తీసికోరు"

"నేనిష్టపడే ఇస్తున్నాను కదా!"

"అయినా కూడా...."

కాసేపు మౌనం రాజ్యమేలింది వాళ్ళ మధ్య.

"అంత డబ్బెలా చేయగలం... ఎలా వీలుపడుతుందమ్మా మనకు?"

"ఎలాగైనా సరే..." చేయాలి.

మాకున్నదంతా అమ్మినా ఎక్కువ రాదే! అక్కడే ఉన్న స్వాతి మరిది ఆలోచించసాగాడు.

"పోనీ... అమ్మెయ్యరా! తర్వాత సంగతి తర్వాత." మామగారన్నారు వెంటనే.

"వద్దు మాకోసం మీ ఆస్తి అమ్ముకుని బికారులు కావద్దు."

"మరి మార్గం...?"

"మాకున్నదే అమ్మేస్తాను" ధృడంగా అంది.

అవును... ఇల్లు తమ స్వంతం... ఎంతో కష్టపడి తమ అభిరుచులకు అనుగుణంగా నిర్మించుకున్న ఇల్లు... తమకెంతో ప్రీతిపాత్రమైన పొదరిల్లు... శ్రీవారి కలల హరివిల్లు... అయినా దాన్నే అమ్మాలి...

ఈ మధ్య ఇళ్ళ స్థలాలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వాళ్ళు కట్టినప్పుడు దగ్గర దగ్గర రెండు లక్షలైంది. ఇప్పుడు ఇరవై లక్షలు పైగా రావచ్చు అనుకుంది. పై ఖర్చు ఎంత అవుతుందో తెలియదు.

కానీ... ఇల్లు అమ్మితే ఆయన తనని క్షమించగలరా... తట్టుకో గలరా... ఇక హాస్పిటల్. అది అమ్మడానికి వీల్లేదు. అదే తర్వాత మమ్మల్ని ఆదుకోవాల్సింది. పోనీ తోట...



gudachari.com

అమ్మితే... వీలుకాదు. ఆయన ప్రాణం పోయినా సహిస్తారు కానీ తోట పోతే భరించలేరు. మరి...?! ఇష్టాయిష్టాలకు సెంటిమెంట్లకూ ఇది సమయంకాదు. డబ్బుకావాలి.. అని నిర్ణయించుకుంది స్వాతి.

కానీ తను అమ్మి డబ్బు తెచ్చినట్లు తెలీకూడదు ఆయనకు. ఆపరేషన్ తర్వాత సంవత్సరం వరకూ అనుమానం రాకుండా ప్రవర్తించాలి... అయితే వీలుపడుతుందా... మనసులో హోరెత్తుతున్న ఆలోచనలు ఒక కొలిక్కిరాక ఉక్కిరిబిక్కిరి అయిపోయింది స్వాతి.

నలుగురైదుగురొచ్చారు ఇల్లు చూసేందుకు. ఇల్లంతా తిరిగి తరచి తరచి తలుపులు, గోడలు శల్యపరీక్ష చేస్తుంటే తనను చూస్తున్నట్లే సిగ్గుతో అవమానంతో కృంగిపోయింది స్వాతి.

మన అవసరం అని తెలిస్తే తక్కువకి అడుగుతారు. అలాగే అడిగారు పది లక్షలకి. అయితే ఇరవై ఐదుకి తగ్గనని చెప్పింది. ఒకవైపు భయం వెళ్ళిపోతారేమో అని. చివరికి ఇరవై లక్షలకు కుదిరింది. ఒక కండిషన్ మీద ఒప్పుకుంది. ఆ ఇల్లు తమకే బాడుగకు ఇవ్వాలని. ఒకవేళ సంవత్సరంలోగా డబ్బు కట్టేట్లయితే వడ్డీ తీసుకుని తమకే ఇచ్చేయాలి. ఆవిధంగా అగ్రిమెంటు చేసుకున్నారు. లక్ష రూపాయలు అడ్వాన్స్ తీసుకుని తోటకి కూడా బేరం చూడమని చెప్పి పిల్లల సాంవత్సరిక పరీక్షలయిన తర్వాత మద్రాస్ తీసికెళ్ళి అక్కడే వుండేట్లు నిర్ణయించుకుని బయల్దేరింది. హాస్పిటల్‌ని ఇద్దరు జూనియర్ డాక్టర్లకు నెలకు పదివేలు మాత్రం తమకిచ్చేట్లు మిగిలిన వాళ్ళనే తీసికోమని చెప్పి యిచ్చింది.

మనసు రాయి చేసుకుని చేసింది.

జీవితంలో ఎంతలో ఎంతమార్పు... రెండున్నర సంవత్సరాల క్రితం... ఏ చీకూ చింతా లేకుండా హాయిగా పిల్లల్తో ఆడుకుంటూ, హాస్పిటల్ చూసుకుంటూ ఎంతో ఆనందంతో గడిపేవాళ్ళు. ఇప్పుడు అన్నింటికీ దూరమై క్షణమొక భయంకర స్వప్నంలా, అడుగు కదిపితే ఏమవుతుందో అనే భయంతో... వ్యధతో జీవితం ఈడ్చుకుపోతున్నాము అని పించింది స్వాతికి.

అప్పటికే ఆర్థికంగా బాగా చితికిపోయారు. స్వాతివి, పిల్లలవి కూడా బంగారమంతా మాయమైంది.

మద్రాసులో అడుగుపెడుతున్నానని తలంపు రాగానే శరీరం భయంతో కంపించింది స్వాతికి. ఎలా వుందో ఆయనకు...? అని, ఎలాటి ఉపద్రవాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందో అని గుండె విపరీతంగా కొట్టుకోసాగింది స్వాతికి.

భయానికి తగ్గట్టే జ్వరం $105^{\circ}$ డిగ్రీలుందనే వార్త తెలిసింది. ముచ్చెమటలు పోసిపోయాయి. వెంటనే డాక్టర్ రెడ్డికి ఫోన్ చేసింది.

"హలో... డాక్టర్ స్వాతీ ఎప్పుడొచ్చారు... అందరూ బావున్నారా...?"



"ఆవిషయం తర్వాత... ముందాయన సంగతి చెప్పండి."

"హి ఈజ్ ఇన్ ది బెస్ట్ హాస్పిటల్... డోంట్ వర్రీ."

"హాస్పిటల్ గొప్పతనాన్ని గురించి అడగడం లేదు. ఆయన జ్వరం గురించి... హార్ట్ ఫెయిల్యూర్ గురించి."

కాసేపు నిశ్శబ్దం.

"ఉయార్ టేకింగ్ ఎవ్విర్ కేర్... కానీ రెస్పాన్స్ రావడం లేదు. జ్వరం వలన..."

"అంటే...?"

"అంటే దిస్ టైమ్... హార్ట్ ఫెయిల్యూర్ కొంచెం సివియర్‌గా వుంది. వేరే మందులు వాడుదామనుకుంటున్నాము. బహుశా అది పనిచేయొచ్చు."

"మళ్ళీ అదేమాట వాడుదాం... చెయ్యొచ్చు అని ఎంతకాలం మీరు నన్ను మోసం చేస్తారు...?"

"అప్‌సెట్ కాకు డాక్టర్ స్వాతీ! అతనికి వచ్చిన భయం ఏమీ లేదు. అందుకనే హాస్పిటల్లో వుండమని చెప్పింది."

"మీకిప్పుడు ఆయన ఏ పరిస్థితిలో వున్నారో తెలుసా?"

"ఓహ్.. డాక్టర్ స్వాతీ మరీ పనికిమాలిన వాడ్నిగా లెక్కవేయకు నన్ను. ప్రతిక్షణం అతన్ని గురించి ఆలోచిస్తున్నాం. తెలుసుకుంటున్నాం. అశ్రద్ధ చేస్తున్నాననే దురభిప్రాయం నీలోరానీకు."

"అంత ఎక్కువ జ్వరం వుంటే గుండె తట్టుకోగలదా?"

"అందుకే జ్వరం తగ్గించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం. నువ్వు ధైర్యంగా వుండు. విశ్రాంతి తీసికో ఉదయం మాట్లాడుదాం."

స్నానం... భోజనాల మాట మరచి వెంటనే హాస్పిటల్‌కి వెళ్ళింది స్వాతి.

ముక్కులో ఆక్సిజన్ గొట్టం పెట్టి వున్నారు. ముఖం కాస్త ఎర్రబడి వుంది. గాలి పీల్చుకోడం కొంచెం కష్టంగానే వున్నా ప్రమాదం ఏమీ లేదనిపించింది. స్వాతి భయం కాస్త తగ్గింది.

స్వాతిని చూడగానే అతని ముఖంలో వెలుగు.. చిన్నగా నవ్వుతూ...! "వచ్చేశావా... రావేమో అని భయపడిపోయానెందుకో ఈరోజు..." అన్నాడు.

దగ్గర కూర్చుని అతని తలను తన ఎదపై వాల్చుకుని, కళ్ళలోకి చూస్తూ "ఏమండీ! ఎలా వుంది మీకు...?" అంది.

"నాకేం బావుంది. కాకపోతే కొద్దిగా ఆయాసం. నువ్వు రావేమో అన్న దిగులు తప్ప. తగ్గుతున్నట్లుగానే ఉంది."

gudachari.com

"నేను వచ్చేశాను కదా! ఇక ఇక్కడే వుంటాను. విశ్రాంతి తీసుకోండి." దిండు సరిచేస్తూ అంది.

"స్వాతీ..." అతని వైపు చూసింది దీనంగా, దయనీయంగా ఉంది ఆ పిలుపు.

భయం వేసింది స్వాతికి.

స్వాతిని దగ్గరకు తీసుకుని నుదిట మీద ముద్దు పెట్టుకుని "నేను నిన్ను చాలా కష్టపెడుతున్నాను కదా?" అన్నాడు.

"మీరిలాగే మాట్లాడితే నేను వెళ్ళిపోతాను."

"లేదు.. లేదు... వెళ్ళకు నీతో ఈరోజు చాలా మాట్లాడాలి. అసలు మధ్యాహ్నం ఏం జరిగిందో తెలుసా..."

"ముందు మీరు విశ్రాంతి తీసుకోండి."

"స్వాతీ! నువు భోం చేశావా...?"

"చేశాను... మరి మీరేం తీసుకున్నారు?"

"నువ్వు భోం చేయలేదని తెలుసు నాకు." అంటూ బలవంతంగా రెండు ఆపిల్స్ కోయించి తనూ రెండు ముక్కలు తీసుకుని స్వాతిచేత తినిపించాడు.

"ఆ... మధ్యాహ్నం సంగతి చెప్పలేదు కదూ... నారక్తం తీసికోడానికి వొక డాక్టర్ వచ్చాడు. నా చేతికి టోర్నికో (మోచేతి పైన ఎలాస్టిక్ లాంటిది కట్టడం, ఇందువల్ల వీన్లు ఉబ్బి రక్తం సులభంగా తీసుకోవచ్చు) కట్టాడు. ఇక సూది గుచ్చబోయాడు.

"ఆ సూదితోనేనా రక్తం తీసేది." గట్టిగా అన్నాను నేను అతను బిత్తరపోయి అర్థంకానట్లు చూశాడు.

"చూడు డాక్టర్ ఆసూది, సిరంజి ఇందాక నువ్వు నా బెడ్‌మీద పడేశావు. అది దుమ్ములో పడి ఎన్ని క్రిములు చేరి వుంటాయో... అటువంటి దాన్తో రక్తం తీస్తావా...?"

"సారీ... డాక్టర్ వేరే తెస్తాను" అని పోయి మరొకటి తీసుకువచ్చి వీనులోకి గుచ్చి రక్తం లాగబోయాడు.

"చూడు బాబూ... పైన కట్టిన టోర్నికో విప్పలేదు." అది తీసెయ్యి...

అతనికి చెమటలు పోసిపోయాయి. గబగబ విప్పి రక్తం తీసికొని వెళ్ళిపోయాడు. పాపం అమాయకుడు.

ఆ తర్వాత ఇంజెక్షన్ వేయడానికి వచ్చాడు.

"ఏవిటిది?" అన్నాను.

"డైయూరిటిక్"

"ఎందుకు?"

gudachari.com



"ఊపిరితిత్తుల్లో నీరున్న శబ్దం వినిపిస్తే డాక్టర్లు ఇవ్వమన్నారిది."

"రక్తం తీసేది చేతగాని వాడివి ఊపిరితిత్తుల్లో నీరుందో లేదో నీకేం తెలుస్తుంది. నో.. నాకొద్దు..." అన్నాను.

వెళ్ళిపోయి ఇన్‌ఛార్జిని తీసుకువచ్చాడు.

"వెల్... ముందు నా ఊపిరితిత్తుల శబ్దాలు వినండి."

చూశారు.

"మీకు నమ్మకం కుదిర్తే ఇవ్వండి." అని ఇంజెక్షన్ వేయించుకున్నాను, అని నవ్వుతూ చెప్పాడా సంఘటన.

"మనమూ డాక్టర్లమే... అందరూ అన్నీ తెలిసిన వాళ్ళుంటారా.." అంది తను.

"ఉండరు... కనీసం తెలుసుకోవాలని కూడా లేదే వీళ్ళకు మందులు ఎంత కాలం యివ్వాలి. ఎప్పుడు నిలిపి వెయ్యాలి అని ఆలోచించరేం."

"సరే... మీరిక పడుకోండి... నేనూ నిదరపోతాను..." అని ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకుంది. లైట్ ఆర్పి.

చీకటితో పాటు భయంకరమైన నిశ్శబ్దం ముసుగువేసికుంది ఆరూంలో.

ఏదో కదలికకు మెలకువ వచ్చింది స్వాతికి. పరిసరాల్ని వెంటనే పోల్చుకోవడం కష్టమైంది.

తలక్రింద దిండు కాస్త జరుపుకుని పైకి జరిగి పడుకుంటూ "చెమటపోస్తూవుంది. గాలి ఆడుతున్నట్లు లేదు" అన్నాడు మెల్లగా స్వాతి లేవడం చూసి.

ఎయిర్‌కండిషన్ బాగానే పనిచేస్తుంది. వెళ్ళి దాన్ని లోపలికి ఫ్రష్ ఎర్ వచ్చేందుకు ఫాన్ ఆన్ చేసింది. అయినా చెమట ఎందుకుపోస్తుందో, గాలి ఎందుకు చాలటం లేదో అర్థంకాలేదు స్వాతికి. తగ్గిపోతుంది లెమ్మనుకొంది.

"టైమెంతయింది?" అడిగాడు.

"పది గంటలు కావస్తోంది."

ఇంతలో డ్యూటీ డాక్టర్ వచ్చాడు.

"హలో... డాక్టర్ శ్రీని... ఎలావుంది..? కొంచెం ప్రక్కకు జరుగుతారా.. ఊ.. .గాలి పీల్చుకోండి... బాగా.. చాలు.." నర్స్ జ్వరం చూసింది. 105 డిగ్రీలు.

అతనుకాస్త ఆలోచనలో పడ్డాడు. తిరిగి మళ్ళీ

"డాక్టర్ శ్రీని... ఎలా వుంది మీకు?" అనుమానంతో ప్రశ్నించాడు.

"ఆల్‌రైట్.. కొంచెం ఆయాసం తప్ప."

వెళ్ళి మరో డాక్టర్ని వెంటబెట్టుకొచ్చాడు.

అతను మళ్ళీ పరీక్ష చేశాడు. స్వాతిలో ఆతృత ఎక్కువయ్యింది. ఏదైనా కాంప్లికేషను డెవలప్ అయ్యిందా అని.

"డైయూరిటిక్ ఇచ్చావా!"

డాక్టర్ శ్రీని నిరాకరించాడని చెప్పాడు. ఇప్పటికే నిద్రలేదు రెండు రోజులుగా. ఈ రోజన్న విశ్రాంతి తీసికోకపోతే ఎలా అని.

వాళ్ళిద్దరూ ముఖాలు చూసుకుని

"అదే మేలనిపిస్తోంది.. వియ్ ఆర్ వర్రీడ్ అబౌట్ ఫీవర్..." అంటూ వెళ్ళిపోయారు.

స్వాతి వాళ్ళ వెనకాలే వెళ్ళి వాళ్ళను కలిసింది, "ఎక్స్‌క్యూజ్‌మి... డాక్టర్స్ ఎలా వుంది...?"

"ఫర్వాలేదు. కాకపోతే హై టెంపరేచర్ వల్ల గుండెకు లోడ్ ఎక్కువైంది. ఇంకో అరగంట చూసి డైయూరిటిక్ ఇస్తాము."

స్వాతికి తృప్తి కలగక పోయినా అంతకంటే వాళ్ళను ఏమీ అడగలేకపోయింది.

"డియర్ కాస్త సాయం చేయి.. ముసలివాడ్ని.... శక్తి సన్నగిల్లింది..." హాస్య ధోరణిలో అంటూ పైకి జరగ ప్రయత్నిస్తున్నాడు. తను రూంలోకి అడుగుపెట్టేసరికి ఆమెను చూసి.

"నాకు నిదుర పోవాలనుంది... ఒక మాత్ర తెచ్చివ్వవు లేదా ఇంజక్షన్ మేలు".

నర్సులను వెళ్ళి అడిగింది. మరో రెండు గంటలవరకూ ఇవ్వద్దని ఇన్‌స్ట్రక్షన్స్ అట. ఏమీ చేయలేక తిరిగి వచ్చేసింది.

పడక కుదరక కదుల్తున్నాడు అతను.

"ఏమండీ... ఎలా వుంది?"

"తెచ్చావా...?"

"ఇస్తారట."

"ఎప్పుడు... నిదురపోవాలి నేను. నన్ను కాస్త పైకి జరుపు.... ఆ.. మరి కాస్త.. దిండు పెట్టు... చాలు... నువ్వు పడుకో... నేను నిదురపోతాను."

అన్నాడేగానీ నిదురపోలేకపోతున్నాడు. తనకెందుకో ఈ రోజు ఆఖరు రోజు అనిపించ సాగింది. స్వాతివైపు చూశాడు. తననే చూస్తుంది. అంతా నిశ్శబ్దం.. ఒక్క ఆక్సిజన్ వస్తున్న బుడగల శబ్దం తప్ప.

అంతలో డాక్టర్‌వచ్చి బి.పి చూశాడు. తొంబై... అరవై... జ్వరం 104 డిగ్రీలు...

"డాక్టర్ నాకు నిదురమాత్ర కావాలి..."

"వస్తుంది, మరో గంట ఆగండి. అప్పుడూ రాకపోతే యిస్తాము"



"నా కిప్పుడే కావాలి. కావాలంటే మీ నోట్స్‌లో వ్రాసుకోండి పేషెంట్ డిమాండ్ చేశాడని." కొద్దిగా కోపంతో అన్నాడు ఆయాసపడుతూ.

ఏమనుకున్నాడోగానీ అతను సరే అని వెళ్ళిపోయి నర్స్ వద్ద పంపాడు.

మళ్ళీ కాస్త పైకి జరిపి పడుకోబెట్టమన్నాడు స్వాతిని. జరిపింది.

"నాకు సరిగా ఊపిరి ఆడడం లేదు." తల అటూ ఇటూ ఆడిస్తూ గాలి పీల్చుకోడానికి ప్రయత్నించసాగాడు.

స్వాతికేమీ తోచక గుండెలమీద చేత్తో సర్దసాగింది.

నిజం. యిదే ఆఖరు రోజు. తప్పదు అనిపిస్తూంది అతనికి.

"ఎవరైనా పిలువు... నావల్ల కావడం లేదు." భారంగా అన్నాడు.

పరుగుమీద నర్స్ రూంలోకి వెళ్ళింది. ఎవరూ కనిపించలేదు. పరికించి చూస్తే ఓ మూల ఎవరో ముసుగు కప్పుకుని పడుకుని వున్నారు.

కాసేపు తటపాయించి పిలిచింది మెల్లగా, పలుకలేదు. దగ్గరకు వెళ్ళి కదిపింది. కప్పుకున్న దుప్పటి కాస్త తొలగించి విసుగ్గా ఏమిటన్నట్లు చూసింది ఒక నర్స్.

"ఆయనకు... ఆయాసంగా వుందట."

"ఉంటే నేను వచ్చి చేసేదేముంది... అయినా నేను ఈ వార్డు నర్సును కాదు. ప్రక్కవార్డు నాది. అక్కడ నిదురపోనీరని ఇక్కడికి వస్తే ఇక్కడా ఇదే గొడవ..."

"పోనీ... ఇక్కడి నర్స్... ఎక్కడికి పోయిందో తెలుసా..."

"తెలియదు... అయినా వాళ్ళకి చూడాల్సిన పేషెంట్లు ఇంకా చాలామంది వుంటారు. ఆ విషయం మరచిపోకండి." అని మళ్ళీ ముసుగుతన్నేసింది.

చేసేదేం లేక తిరిగి వస్తూంటే ఒక నర్స్ ఎదురైంది. ఆమెను బ్రతిమలాడి తీసుకు వెళ్ళింది.

ఆమె ఆక్సిజన్ కాస్త త్రిప్పి మళ్ళీ వస్తానంటూ వెళ్ళింది.

ఆమె అటు వెళ్ళిందో లేదో ఒక్కసారిగా అతనికి తుమ్ములు బయల్దేరాయి. ఎడతెరిపి లేకుండా... తట్టుకోలేకపోయాడు. ఆయాసం... బలవంతంగా గాలి పీలుస్తున్నాడు. అయినా చాలటం లేదు. గాలిరావటం లేదు. ముక్కులు మంటపుట్టి పగిలిపోయేటట్లుగా ఉన్నాయి.

ముక్కులోని ఆక్సిజన్ ప్లాంగ్స్ గొట్టం లాగిపారేసి

"ఎవర్నైనా పిలువ్... భరించలేను... నేను చచ్చిపోతున్నాను..." అతి ప్రయాసమీద చెప్పగలిగాడు.



gudachari.com

స్వాతి బయటకు పరుగెత్తింది. ఎవ్వరూ లేరు. తిరిగి గదిలోకి పరిగెత్తింది. ఇంకా తుమ్ముతూనే వున్నాడు. గాలి కోసం... ఆరాటం... ఆక్సిజన్ అయిపోయిందేమో అని సిలిండర్ దగ్గరకు వెళ్ళింది. స్వాతి గుండె అగినంత పనైంది. మీటర్ రీడింగ్ పది దగ్గరుంది. అంటే నిమిషానికి పది లీటర్ల ఆక్సిజన్... చాలా ఎక్కువ తిప్పేసి వుంది. అందువల్ల ముక్కులు పొక్కిపోయి తుమ్ములు వస్తాయి.

వెంటనే తగ్గించింది. కాసేపటికి తుమ్ములు తగ్గిపోయాయి. అయితే ముక్కుల మంట వల్ల ట్యూబ్స్ పెట్టుకోడనికి వీలుపడ్డం లేదు. కానీ తప్పదు.

స్పృహ కోల్పోతున్నట్లుగా అనిపించింది అతనికి.

మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరిచి, "నువ్వు పడుకో... అది నాకు మామూలే కదా!" అన్నాడు.

స్వాతి కూడా ఇంతసేపూ అలాగే అనుకుంది. అయితే ఏదో జరగబోతోంది... జరగకూడనిది. స్వాతి గుండెదడ ప్రారంభమైంది.

"టైమెంతయింది."

"పదకొండున్నర."

ఇంతలో నర్స్ వచ్చి బి.పి. చూడబోయింది.

"నువ్వు చేస్తున్నావేం... డాక్టరేరి?"

"పడుకున్నారు. నన్నే చూడమన్నారు."

ఇక్కడ పేషెంటు చావు బతుకుల్లో వుంటే అతనికి నిద్దరేనా ముఖ్యం అనిపించింది డాక్టర్‌శ్రీనికి. కానీ కొన్ని హాస్పిటళ్ళలో నర్సులే బిపి, టెంపరేచర్లు చూసి చార్టులో వ్రాస్తుంటారు. ఏదైనా ముఖ్యమైతేనే డాక్టర్ వస్తాడు అది తెలుసు తనకు.

ఆక్సిజన్ విషయం చెప్పింది స్వాతి. వెళ్ళి మాస్క్ తీసుకవచ్చి తగిలించి ముఖం మీద పెట్టింది.

బి.పి. చూసింది. ఎనభై.. అరవై.. టెంపరేచర్ 104 డిగ్రీలు.

ఆమె వెళ్ళిన కాసేపటికి గాలి కోసం అతని ఆరాటం ఎక్కువైంది.

దగ్గరకు వెళ్ళి "ఏమైందండీ... ఎలా వుంది?" అంది ఆతృతగా స్వాతి.

అతికష్టం మీద, "దీన్లోంచి ఆక్సిజన్ వస్తున్నట్టే లేదు." అని మాస్క్ తీసి స్వాతి చేతికిచ్చాడు.

ముఖం దగ్గర పెట్టుకుని చూసింది. ఏ శబ్దమూ రాలేదు.

వెంటనే నర్సు గదికి పరుగున వెళ్ళి చెప్పింది.



ఆమె వచ్చి చూసింది. పనిచేయడం లేదు. గదంతా పరికించి చూసింది. ఆక్సిజన్ గొట్టం వైపు చూసి బిత్తరపోయింది. గొట్టం ఊడిపోయి నేల మీద పడి ఆక్సిజన్ లీక్ అయిపోతోంది.

ఆతృతగా వెళ్ళి ట్యూబ్ కనెక్ట్ చేసి మాస్క్ అతని ముఖం మీద వుంచుతూ "క్షమించండి... ఇలాటివి అనుకోకుండా జరుగుతూ వుంటాయి." అంది చాలా బాధపడుతూ.

అతని ముఖమ్మీదంతా స్వేద బింధువులు పట్టాయి. భారంగా గాలి పీలుస్తున్నాడు. అది చూసి స్వాతి గుండెల్లో భయం నరనరానా ప్రాకసాగింది. డాక్టర్‌కి ఫోన్ చేద్దామని నర్సుని వెళ్ళి అడిగింది.

ససేమిరా వీల్లేదండి. "మీ భర్త ఎమర్జన్సీ లిస్టులో లేరు. ప్రతీ విషయం తెలుపమని లేదు మా ఇన్‌స్ట్రక్షన్స్‌లో. మీరలా చేస్తే మాకు లేనిపోని ఇబ్బందులు వస్తాయి."

"పోనీ... డ్యూటీ డాక్టర్‌కు చెప్పవచ్చుగా!"

"అతనిప్పుడే పడుకున్నాడు. డిస్టర్బ్ చేస్తే కోప్పడుతాడు."

ఏం చేయడానికీ పాలుపోవడం లేదు. భర్త పరిస్థితి చూస్తే ప్రమాదం ముంచుకొస్తున్నట్లుగా వుంది. తను డాక్టరయి వుండీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి... చొరవ తీసికోడానికి జంకు...

మళ్ళీ గదిలోకి వచ్చింది.

బలవంతంగా కళ్ళు తెరచి, "నిద్రకోసం... ఏదైనా మాత్ర చూడు..." జాలిగా బ్రతిమాలాడుతున్నట్లుగా అడిగాడు.

నర్సు దగ్గరకు వెళ్ళింది మళ్ళీ విసుక్కుంది.

"ఇప్పుడే మాత్ర ఇచ్చాము. మరో రెండు గంటలు ఆగాలి." అంది.

కోప్పడితే లాభం లేదు. అధికారం చూపిస్తే ప్రయోజనం లేదు. ప్రాధేయ పడింది చివరికి, "ప్లీజ్... సిస్టర్...!"

ఏమనుకుందో ఇచ్చింది.

ఆమాత్ర వేసి మంచినీళ్ళు త్రాగించింది.

అప్పుడు వినిపించాయి గాలి పీల్చుకొనేపుడు ఊపిరితిత్తుల్లోంచి పిల్లికూతల్లాంటి శబ్దాలు. అంత ఇదిగా వున్నా నవ్వుతూన్నట్లు చూశాడు స్వాతివైపు...

ఏవిటీ... వ్యక్తి... ఎలా నవ్వగలుగుతున్నాడనిపించింది స్వాతికి. తనకేమో గుండెలు బ్రద్దలవుతున్నాయి.

"డియర్.. నన్ను కొంచెం పైకి జరుపు... ఆ... చాలు... చాలు... భయపడకు... నేను మృత్యుంజయుడ్ని..."

gudachari.com

... మృత్యుంజయుడు.

ఆక్సిజన్ మాస్క్ ముఖమ్మీద పెట్టుకుని బలవంతంగా గాలి పీలుస్తూ వదుల్తూ వుంటే మృత్యువు అక్కడే కాపువేసి వున్నట్లుంది. ముఖం మాడిపోయి కళ్ళు మూస్తూ తెరుస్తూ నోటితో గాలి పీల్చుకొంటున్నా విధానం చూస్తే యముడితో పోరాడుతున్నట్లే వుంది స్వాతికి.

స్వాతి ధైర్యం పూర్తిగా సడలిపోతోంది... ఆ నాలుగ్గోడల మధ్య తనూ... ఆయన... వంటరితనం... ఎవరితో చెప్పుకోను తన బాధ.....

దిండు మీద నుంచి కిందకి జారిపోయాడు.

సర్ది మళ్ళీ పైకి పడుకో బెట్టింది.. మళ్ళీ జారిపోయాడు.. అంటే తన శరీరం తనమాట వినడం లేదన్నమాట... తనకు తానుగా పైకి జరగలేక పోతున్నాడన్నమాట... ఇక లాభం లేదనుకున్నాడు డాక్టర్ శ్రీని.

"ఏం ... చేయాలో... అర్థం కావడంలేదు..." చిన్నగా గొణుగుతున్నట్లుగా తనలో తనే గొణుక్కోసాగాడు.

కాసేపటికి మళ్ళీ బి.పి చూడ్డానికి నర్స్ వచ్చింది.

"ఇప్పుడెంత వుంది....?"

"కాస్త తగ్గింది. జ్వరం 102 డిగ్రీలు."

"ఆయన పరిస్థితి మరీ ప్రమాదకరంగా వుంది. ఒకసారి డాక్టర్‌కు చెబితే బావుంటుంది. పోనీ కోప్పడతారనుకుంటే నేనే వెళ్ళి పిలుస్తాను..." అంది స్వాతి తెగించి.

తనే వెళ్ళి చెప్తానని పోయింది.

అంతే...

మళ్ళీ ఆ గదిలో స్వాతి... అతనూ... వంటరితనం. నిపుణులైన ప్రముఖవైద్యులు... నేర్పు గల్గిన నర్సులు... ఉన్నత పరికరాలు... అన్ని వున్నా మేం వంటరివాళ్ళం... అనిపించింది స్వాతికి.

అతని పరిస్థితి మరీ దిగజారిపోతుంది. చూపు కూడా సరిగా కనిపించడం లేదు... ఏదో మాట్లాడుతునే వున్నాడు. అర్థంకాలేదు స్వాతికి. ఇక చేతులు కట్టుకుని కూర్చుంటే లాభం లేదు... మర్యాదలు పాటిస్తూ కూర్చుంటే తన కళ్ళముందే ఆయన్ని పోగొట్టుకోవాల్సి వస్తుంది. వాళ్ళు వచ్చేదాకా అరచి ఆగం చేయాల్సిందే. చేతులు కట్టుకు కూర్చుంటే చేయి దాటి పోయేటట్లునిపించింది స్వాతికి. టైం అయిదు గంటలవుతోంది....

నేరుగా నర్సు దగ్గరకు వెళ్లి, "నువ్వు డాక్టర్ని పిలుస్తావా లేదా?" కోపంగా అరిచింది స్వాతి.

ఏదో నసిగింది నర్సు.



"చూడూ... నువు పిలవకపోతే నేనే పిలుస్తాను. మీ రూల్సు అన్నింటినీ గంగలో కలపండి..." అంటూ సహనం కోల్పోయి కోపంతో కేకలు వేసింది స్వాతి.

దాన్తో పది నిముషాల్లో డాక్టర్ వచ్చాడు ఆవులిస్తూ.

"డాక్టర్... శ్రీని... ఎలా వుంది...?"

జవాబు నెమ్మదిగా బలవంతంగా వచ్చింది

"గోయింగ్ డౌన్..."

"ప్రక్కకు తిరగండి...."

"తిరగలేనన్నట్లు తలఊపాడు. కళ్ళు తెరవలేకపోతున్నాడు."

బి.పి. పల్సు చూశాడు డాక్టర్. అతనికి నిదురమత్తు వదిలింది పల్సు చూడగానే. "ఇప్పుడేవస్తాను." అంటూ చరచరా వెళ్ళిపోయాడు.

తిరిగివచ్చి

"డాక్టర్‌రెడ్డికి ఫోన్ చేశాను."

"మందులేమీ ఇవ్వద్దు. డ్రిప్ స్టార్ట్ చేయమన్నారు. ఎనిమిది గంటలకు వచ్చి చూస్తారట." ఇక్కడ గుండెలు బ్రద్దలవుతూ ఉంటే, అగ్ని పర్వతాలు పొంగి జీవితాల్నే మాడ్చి మసిచేస్తూ వుంటే... ఉదయం రావటమా? ఏంచెయ్యాలి. అత్యవసర పరిస్థితిలో మందులు శరీరంలోకి పంపడానికి మార్గం ఏర్పరుస్తున్నారన్నమాట.... అనిపించింది.

"అదేవిటండీ... అంత సివియర్‌గా ఎయిర్ హంగర్ వుంటే ఫ్లూయిడ్స్ ఇస్తానంటా రేవిటి...?!" కోపంగా అడిగింది స్వాతి.

జవాబు వెతుక్కోవాల్సి వచ్చిందతనికి.

"చూడండీ... వాళ్ళ ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం చేయాల్సిందే. మా అభిప్రాయాలు ఇక్కడ చెప్పకూడదు. ఆచరణలో పెట్టకూడదు." అన్నాడు.

"డాక్టర్ రెడ్డితో నేను మాట్లావడచ్చా?"

"పేషెంట్లు, అటెండెంట్లు డాక్టర్లతో డైరెక్టుగా మాట్లాడకూడదు. అది రూలు."

"ఎక్కడిదండీ ఆరూలు... రాత్రంతా పేషెంటును పట్టించుకోకుండా నిదురపొమ్మని రూలుందా?"

"అంటే! రాత్రంతా ఒక్కరి దగ్గరే...!"

"లేదు... కానీ సివియర్ హార్ట్ ఫెయిల్యూర్ పల్మోనరీ ఎడిమాతో పేషెంటు అవస్థపడుతూ వుంటే, నర్స్‌ని బి.పి. నోట్ చేయమని ఎక్కడా రూల్ లేదే! ఆయాసం క్షణక్షణానికి ఎక్కువ అవుతోంది అంటే ఇది రివర్‌సిబుల్ ఫెయిల్యూర్ లోకి పోతున్నట్లే కదా! అంతా జరిగిన తర్వాతనా మీరు వచ్చి పేషెంటును చూసేది..."



gudachari.com

"అంత ప్రమాదమేమీ జరగలేదు."

ఆమాటతో స్వాతి కోపం తారాస్థాయి నందుకుంది.

"దుయు నో దట్... నీకు తెలుసా...? నీ అనుభవం ఎంత.. ఎన్ని కేసులు చూశావు నువ్వు?" కోపంతో వణికిపోతూ అతన్ని కాలరు పట్టుకుని చంప పగలగొట్టాలనిపించింది స్వాతికి.

"సీ... లేడీ... మీరు మర్యాద లేకుండా మాట్లాడుతున్నారు..." కావాలంటే ఉదయం రిపోర్ట్ చేసికోండి. మా ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం మేం నడుచుకుంటాం.

"కాల్ మి యాజ్ డాక్టర్... పేషెంటు చచ్చినా ఫర్వాలేదన్నమాట."

"అంత ప్రమాదం జరగలేదంటున్నాను కదా!"

"ఓహో జరిగిన తర్వాత చేస్తారన్నమాట."

విపరీతమైన కోపంతో స్వాతి వైపుచూసి విసురుగా వెళ్ళిపోయాడు.

అరె... రె.. ఎలా ఇప్పుడు... అనవసరంగా వున్న ఒక్క ఆశని కూడ పోగొట్టుకొన్నానేమో... అతనుంటే ఏమైనా చేసివుండే వాడేమో! అని అనుకొని వెనకనే పరుగెత్తింది. అతను కనిపించలేదు.

నిస్తేజంగా వున్న భర్తను చూసి వెళ్ళి కదిపింది. మెల్లగ బలవంతాన కళ్ళెత్తి "ప్లీజ్... ఎవర్నైనా రమ్మను... త్వరగా ఏమైనా చెయ్యమను..." అంటూ మైకంలోకి జారుకున్నాడు.

స్వాతికి ఏడుపు, వణుకు వొక్కసారే ప్రారంభమయ్యాయి.

ఇంతలో నర్స్ వచ్చింది.

"సిస్టర్... ప్లీజ్... సేవ్ హిమ్.. చాలా సీరియస్‌గా వుంది. డాక్టర్‌కి చెప్పు... వెళ్ళి పిలుచుకురా..." స్వాతి బ్రతిమలాడింది. తను ఏం చేస్తుందో తనకు తెలియదు.

ఇంతలో అతను ఉన్నట్లుండి లేచి

"బాత్‌రూమ్‌కి పోవాలి తీసుకుపో..." అంటూ లేవబోయి బెడ్‌మీద పడిపోయాడు.

"నర్స్... కొంచెం హెల్ప్ చేయండి..." అతన్ని లేపడం స్వాతి వల్ల కాలేదు. కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. లాక్కుపోతున్నట్లు బాత్‌రూమ్‌కి తీసుకువెళ్ళింది. అతని శరీరమంతా చెమట... ఆయాసం..

నర్సు మాయమయిపోయింది.

"తలుపు వేసేయి..." గట్టిగా అరిచాడు.

ఏమవుతుందో అని దగ్గరగా వేసి నిల్చుంది.

గోడకు చేతులు ఆన్చి ముఖం పైకెత్తి నోరు తెరచుకుని గాలి పీలిస్తే గాని అందేటట్లు లేదు. కళ్ళుమూతలు పడిపోతున్నాయి. ఆయాసం మరీ ఎక్కువ కాసాగింది అతనికి.



అతి కష్టం మీద శుభ్రం చేసి మంచం మీద పడుకోబెట్ట గలిగింది అతన్ని.

స్వాతి తూలి పడబోయి మంచం పట్టుకుని నిలబడింది.

నర్స్ వచ్చింది.

"డాక్టర్‌తో చెప్పాను, వస్తున్నారు."

"టెల్... దెమ్... ఐ... యా...మ్... డై... య్యిం...గ్ రాత్రి... నుంచీ... యూరిన్... రాలేదు... అంటే నాకిడ్నీలు... కూడా... పనిచేయడం మానేశాయని చెప్పు...." ఆ మాటలు చెప్పి వెనక్కు వాలిపోయాడు.

నర్సు పరిగెత్తింది బయటకు

స్వాతి పల్సు చూసింది. చాలా వీక్‌గా వుంది. చేతులు వణికిపోతున్నాయి స్వాతికి.

ఇంతలో ముందు వచ్చిన డాక్టర్ వచ్చాడు. మరో డాక్టర్‌తో.

ఇద్దరూ గబ గబ పరీక్ష చేసి బయటకు వెళ్ళి వాళ్ళలో వాళ్ళు ఏదో చర్చించుకుంటున్నారు... స్వాతి వాళ్ళ వెంటపడింది.

ఆమెను చూసి, "మీరు కొంచెం లోపల వుండండి. మేం మాట్లాడుకోవాలి." అన్నారు.

స్వాతికి ఏం చేయాలో అర్థం కాలేదు... ఆతృత... అయోమయం... భయం... ఆమెను కర్తవ్య శూన్యురాలిగా చేసివేశాయి.

నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా... వున్న ఆప్రదేశం అరగంటలో యుద్ధభూమిలా మారిపోయింది. నర్సులు... డాక్టర్లు... పరుగులు... ఏవేవో తెస్తున్నారు... ఏమేమో చేస్తున్నారు... రూములోంచి బయటకు తీసుకుపోతున్నారు... ఓ మూల ఆలోచనాశక్తి కోల్పోయి నిస్తేజంగా చూస్తున్న స్వాతి తేరుకుని బయటకు పరుగుతీసింది.

ఒకరు సలైన్ బాటిల్ పట్టుకుని పరుగులు తీస్తోంటే ఇ.సి.జి మిషన్‌తో మరొకరు... ఇంకొకరు ఆక్సిజన్... బెడ్ నెట్టుకుని ప్రళయం వస్తున్నట్లుగా పరుగులు... అప్పుడు కనిపించాడు డాక్టర్ రెడ్డి హడావిడిగా ఎదురు వస్తూ స్వాతికి చేయి ఊపి వాళ్ళతో పరుగెత్తాడు.

అందరూ లిఫ్ట్‌లోకి దూరారు.

చిన్నగా... జాగర్త... తగుల్తుంది... పగిలిపోతుంది.. ఆక్సిజన్ పొజిషన్‌లో వుందా... ఈ ప్రక్కకు తిప్పు... గోడకు తగుల్తుంది... మరీ లాగవద్దు... మీరిటురండి... కొంచెం జరుగు... గందరగోళం.. మాటలు... హడావిడి లిఫ్ట్ నిండిపోయింది. డాక్టర్ శంకర్ వచ్చి ఇరుక్కున్నాడు. స్వాతికి చోటు లేదు అందులో. తలుపులు మూసుకుపోయే ముందు డాక్టర్ రెడ్డి స్వాతిని చూసి, "కమ్ టు ది ఫోర్త్ ఫ్లోర్ సి.సి.యు." అని అరిచారు. స్వాతి మెట్లవైపు పరిగెత్తింది.



gudachari.com

అయిపోయింది... అంతా అయిపోయింది... నా బ్రతుకు బుగ్గి కాబోతోంది. సర్వస్వం నాశనం కాబోతోంది అనుకుంటూ పిచ్చిగా పరుగెత్తుతున్న స్వాతిని సి.సి.యు దగ్గర నర్స్ ఆపేసింది.

"...నా భర్త...."

"మేం చూసుకుంటాం... విజిటర్స్ రూమ్‌లో కూర్చోండి." తోసినంత పని చేసి తలుపు వేసేసింది.

విజిటర్స్ రూమ్‌లో చాలామంది వున్నారు. ఆందోళన, ఆత్రుత అందరి ముఖాల్లోనూ స్పష్టంగా వ్యక్తమవుతోంది. తలవంచుకుని ఏడుస్తూ ముక్కులు చీదుకుంటూ కొందరు... తలపైకెత్తి శూన్యంలోకి చూస్తూ గాఢ నిట్టూర్పులొదుల్తూ మరికొందరు... అటు ఇటూ పచార్లు చేస్తూ ఇంకొందరు. ఎదుర్చూస్తున్న ప్రళయం ఏక్షణమైనా మీద పడ్తుందనీ భయం అందరి ముఖాల్లోనూ స్పష్టమవుతోంది. ఇదేం కొత్త కాదు. కానీ వింతగానే ఉంది. అందరికి మంచి జరగాలని మనసారా కోరుకుంది.

స్వాతి వంటరిగా అదురుతున్న గుండెల్ని అదుపులోకి తెచ్చుకుంటూ అందరి ముందు ఏడ్చే ధైర్యం లేక లోలోన గుండె బ్రద్దలయ్యేలా రోదిస్తూ సి.సి.యు తలుపుల వైపే చూపులు కేంద్రీకరించి ఉంది. అయిన వాళ్ళని పిలవాలనే ధ్యాసే లేక భర్త ఏ పరిస్థితిలో వున్నారో అనే ఆలోచనల్తో... ఏక్షణం ఏమాట వినాల్సొస్తుందో అని గిలగిల లాడిపోతూ వుంది.

కార్డియాక్ ఫెయిల్యూర్ (హార్ట్ ఫెయిల్యూర్) సాధారణంగా గుండె శరీరానికి తగినంత రక్తాన్ని వెలుపలకి నెట్టలేనపుడు వస్తుంది. ఇందుకు కారణం చేస్తున్నదానికంటే ఎక్కువ పనిని చేయాల్సి వస్తే గుండె పనిచేయడంలో మార్పు వస్తుంది. లేదా గుండె కండరాలు (మయోకార్డియమ్) హార్ట్ అటాక్ వల్ల దెబ్బతిన్నా, ఎడమ గుండె భాగం (వెంట్రికల్) సరిగా పనిచేయక పోయినా రావచ్చు. ఎప్పుడైతే రక్తాన్ని గుండె సరిగ్గా శరీర భాగాలకు అందించలేకపోతుందో, మెదడు, కిడ్నీ, ఊపిరితిత్తులకు సరయిన మోతాదులో రక్తప్రసారం జరగడం తగ్గిపోయి వాటి పనుల్లో అవకతవకలు ఏర్పడి శరీరంలోని అన్ని భాగాలూ ప్రమాదంలో చిక్కుకుంటాయి. మెదడు, గుండె, ఊపిరితిత్తులు, లివర్ (కాలేయము), మూత్రపిండాలు (కిడ్నీస్) వీటిల్లో ఏ ఒక్కటి సరిగా పనిచేయకపోయినా మిగిలిన అవయవాలన్ని దెబ్బతింటాయి. వీటి మధ్య సన్నిహిత సంబంధం వుంటుంది.

గుండె ఎప్పుడైతే ఎక్కువ పని చేయాల్సి వస్తుందో ధమనులు, సిరలు కూడా ఒక్కోకారణాన్ని బట్టి ఏదో ఒకటి ఎక్కువ పనిచేయాల్సి వస్తుంది. దాన్తో అవి వెడల్పు కావడం, పెరగడం జరిగి వాటి కదలిక శక్తి నశించి తక్కువ పనిచేసేట్లు చేస్తాయి. ఈ కారణంగా గుండె తగినంత రక్తాన్ని శరీరంలోకి పంపలేకపోతుంది... పంపకపోతే ఏం జరుగుతుందో తనకు తెలుసు.



ఇక కిడ్నీలు ఎప్పుడైతే సరిగా పనిచేయవో రక్తాన్ని శుద్ధి చేయలేక పోవడంతో శరీరంలో సోడియం, దానితో కూడిన నీరు ఎక్కువవుతుంది. ఆ నీరు, కాళ్ళు, ముఖం, పొట్ట, ముఖ్యంగా ఊపిరితిత్తుల్లో చేరుతుంది. (ఊపిరితిత్తుల్లో నీరు చేరడాన్ని పల్మోనరీ ఎడిమా అంటారు). ఊపిరితిత్తుల్ని ఈనీరు పనిచేయనీయకుండా చేస్తాయి. తద్వారా రక్తశుద్ధి తగ్గిపోయి, అవసరమైనంత ఆక్సిజన్ మెదడుకు అందించడం క్షీణించి మెదడు పనిచేయడం మందగిస్తుంది. మెదడులో ఏ భాగమైతే పనిచేయదో ఆభాగం ఆధీనంలో వుండే శరీర అవయవాలు పనిచేయకుండా పోవడం, క్రమేణ స్పృహ కోల్పోవడం ఆపైన చనిపోవడం జరుగుతుంది.

వ్యక్తి చనిపోయిన తర్వాత అతని చావుకి కారణం తెలిసికొనేందుకు అటాప్సీ చేస్తారు. అంటే శరీరాన్ని కోసి అన్ని భాగాలు పరీక్ష చేస్తారు. అతడు పల్మోనరీ ఎడిమాతో చనిపోయాడా లేదా అని తెలుసుకొనేందుకు ఊపిరితిత్తుల్ని మొదటి చేత్తో పిండుతారు. గట్టిగా నీరునిండిన స్పాంజిలాగ తగిల్తే పల్మోనరీ ఎడిమా వల్లే. ఆ తర్వాత వాటర్ టెస్ట్ -ఊపిరితిత్తుల క్రింద భాగాన్ని ముక్కలు కోసి నీళ్ళలో వేస్తారు. మునిగిపోతే ఆభాగం అంతకు ముందే నీటితో వున్నట్లు, తేలితే లేనట్లు, అలాగే క్రింద నుండి పైభాగం వరకు అక్కడక్కడ ముక్కలు కోసి నీటిలో వేస్తారు. ఏ భాగం ముక్క మునిగిపోతుందో దాన్ని బట్టి పల్మోనరీ ఎడిమా ఎంత సీవియర్‌గా వచ్చిందో నిర్ధారించవచ్చు.

ఆ తర్వాత నీటిలో మునిగిన ముక్కల్ని పల్చని పొరలుగా కోసి మైక్రోస్కోప్ క్రింద పెట్టి చూస్తారు. ఊపిరితిత్తుల్లో నీరు నింపుకొనే ఆల్వియోలై (చిన్న చిన్న గాలిసంచులు)లో నీరు ఉండడం తెలుస్తుంది.

ఇంత తతంగం వుంది దాని నిర్ధారణకు

ఈ పరీక్షలన్ని ఆయనకు చేయాల్సి వస్తుందేమో... అనే ఆలోచనలకు తట్టుకోలేక పోతుంది స్వాతి. ఎందుకు యిలా ఆలోచిస్తున్నాను తనను తానే తిట్టుకుంది.

అసలు ఊపిరితిత్తుల్తో నీరు చేరడాన్ని నిరోధించి వుండొచ్చు. ఆరాత్రి అందరూ వరుసగా తప్పులు చేయకుండా వుండివుంటే.

మొదటిది అతని పరిస్థితేమిటో అతను అర్థం చేసికోకపోవడం, చేసుకున్నా చెప్పలేక పోవడం. అది సహజం... పేషెంటు తన బాధను సరిగ్గా చెప్పలేకపోవడం. కానీ తరువాత జరిగినవి. జరగకూడనివి.

డ్యూటీ డాక్టర్ విగరస్ ట్రీట్‌మెంటు అవసరం లేదనుకోవడం నిద్రమత్తు డాక్టర్ ఊపిరితిత్తుల్లో నీరుందని తెలిసినా డైయూరిటిక్ ఇచ్చేందుకు వెనుకాడ్డం ఇంత ప్రమాదాన్ని సృష్టించింది.



gulachari.com

నిద్రపోతున్న డాక్టర్ని నర్స్ లేపడానికి వెళితే మాటపడ్డం, డ్యూటీ డాక్టర్ అర్ధరాత్రి కన్‌సర్న్‌డ్ డాక్టర్ని పిలవకపోవడం, ఆతర్వాత చెప్పినా డాక్టర్ అర్థం చేసికుని రాకపోవడం... ఇవన్ని కలసి ఈ స్థితికి చేర్చాయి?

ఇవన్నీ అలా వుండగా అన్నీ చూస్తూ మూగ మొద్దులా గుండెలు బాదుకుంటూ వుండిపోవడం తనలోని ఆడతనం తప్పు... తిట్టుకుంది యిష్టం వచ్చినట్లు తనను తానే స్వాతి.

ప్రక్కనెవరో నిల్చున్నట్లనిపించి ఆలోచనల్లోంచి ఈలోకంలోకి వచ్చింది. ఎవరో వయసుమళ్ళినావిడ ఆదరంగా చూస్తూ, "చాలా సేపటి నుంచి చూస్తున్నాను... వంటరిగా నీలో నువ్వే కుమిలిపోతున్నావు... ఎవరూ లేరా అమ్మా!" అంది.

అప్పటివరకూ ఆ విషయమే గుర్తురాలేదు స్వాతికి.

"ఉన్నారు... తెలిపేందుకే ఎవరూ లేరు. నాభర్త చనిపోబోతున్నాడు..." ఎలా అనగలిగానా మాట... నిజాన్ని వొప్పుకుంటున్నావా... నో... నిజం కాకూడదు. తలబాదుకుంది ఆమాట అన్నందుకు.

"అయ్యో... పోనీ అడ్రసు ఇస్తే ఎవర్నైనా పంపుతాను."

"పంపాల్సిన అవసరం లేదు. ఫోన్ చేస్తే చాలు మా తమ్ముడు ఈ ఊళ్ళోనే వున్నాడు." ఫోన్ నెంబరు ఇచ్చింది స్వాతి.

"బాధపడకమ్మా... ధైర్యంగా వుండు." స్వాతి తల నిమిరి వెళ్ళిపోయింది.

గంట పైగా అయింది లోపలకు తీసుకుపోయి. ఇంతవరకూ ఏ విషయమూ తెలియలేదు... మరో అరగంటలో స్వాతి తమ్ముడు వచ్చాడు. అంతే ఇంతవరకూ తనలోని నిగ్రహం బ్రద్దలైపోగా నిశ్శబ్దంగా ఏడ్చేసింది అతన్ని పట్టుకుని.

ఇంతలో సి.సి.యు తలుపులు తెరచుకుని డాక్టర్ రెడ్డి, డాక్టర్ శంకర్ రావడం కనిపించింది. గబుక్కన లేచి నిలబడింది. తలవంచుకుని నెమ్మదిగా వాళ్ళఎదురుగా వచ్చి కూర్చున్నారు. ఏం మాట్లాడలేదు.

ఏం చెబుతారో అని గుండెను గుప్పెట్లో ఉంచుకుని ఉగ్గబట్టుకొని కళ్ళార్పకుండా వాళ్ళనే చూస్తుంది స్వాతి.

డాక్టర్ రెడ్డి వినీ వినిపించనట్లు అన్నాడు, "ఇటీజ్... వోవర్... ఆల్‌మోస్ట్..."

"నో... ఇట్ కాంట్‌బి... ఐడోంట్ బిలీవ్ ఇట్... టెల్‌మి.. హి ఈజ్ ఆల్‌రైట్..." అరుస్తూ అతని చొక్కా పట్టుకుని కుదిపేయసాగింది.

"ఆరె... డాక్టర్ స్వాతీ... ఏవిటిది... ఆయన చనిపోలేదు... రిలాక్స్... రిలాక్స్..." డాక్టర్ శంకర్, స్వాతిని తమ్ముడు దూరంగా తీశారు.



అందరూ వీళ్ళనే గమనిస్తున్నారా గదిలో అంతా నిశ్శబ్దం... కంట్రోల్ చేసుకో ప్రయత్నిస్తూ డాక్టర్ రెడ్డితో

"నన్ను మోసం చేశారు మీరు... హాస్పిటల్‌లో వుంటే ఏం భయం లేదన్నారు. మీ కళ్ళముందే మీకు తెలిసే చనిపోబోతున్నారాయన.." స్వాతి అతని చేతులు పట్టుకుని ఏడుస్తూ అంది.

డాక్టర్‌రెడ్డి జాలిగా, బాధగా స్వాతి కళ్ళలోకి చూస్తూ అన్నాడు, "చూడమ్మా స్వాతీ! అనుకోనివి ఎన్నో మన జీవితాల్లో జరుగుతూ వుంటాయి. ఇది అనుకున్న ప్రమాదమే అయినా ఇంత త్వరగా ఊహించలేదు. నీ భర్తను బ్రతికించడానికి అక్కడ విశ్వ ప్రయత్నం చేస్తున్నారు వాళ్ళు..."

"స్పృహలోనే వున్నారా..." ఏదో ఆశ

"అదే విచిత్రం.....! అతని మనో ధైర్యాన్ని ఎలా మెచ్చుకోవాలో తెలియడం లేదు. స్పృహలో వుండడమే కాదు చేస్తున్న ప్రతి పనిని తరచి తరచి అడుగుతున్నాడు. ఒక్కోసారి ఇలా చేస్తే బావుంటుందని సలహాలు కూడా ఇస్తున్నాడు."

"మీకు నమ్మకం వుందా ఆయన బ్రతుకుతారని?"

వాళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"చెప్పండి..??"

"... లేదు... కానీ వాళ్ళు చేస్తున్న ప్రయత్నం... ఫలిస్తుందని ఆశ ఉంది."

"అయితే ఆయన్ని ఒకసారి చూడాలి." అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ. ఇప్పుడు భయం పోయింది తెగింపు మొండి ధైర్యం... ప్రవేశించింది స్వాతిలో.

"నువ్విపుడు చూడ్డం..." ఏదో చెప్పబోయారు.

"నో... నేను చూడాలి. ఆఖరుసారిగా మాట్లాడాలి.... ఎలాటి స్థితిలో వున్నా నేను సిద్ధమే...."

డాక్టర్లిద్దరూ ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

"వెల్.. దటీజ్ ఇట్. ఆ ధైర్యమే మాకు నచ్చేది. సరే. నేను వెళ్ళి చూసి వస్తాను. ఈలోగా నీ ముఖం కాస్త సరిచేసుకో. నిన్నిలా చూడ్డం అతనికి బాధ కలుగుతుంది." అని వెళ్ళిపోయారు.

పేషెంటు ప్రమాదస్థితిలో ఉన్నపుడు, అతని బంధువులు గాని, మిత్రులుగాని డాక్టర్లని విసిగించరాదు. అసలే టెన్షన్‌లో వుండే డాక్టర్ని చేయాల్సినది సమయానికి చేయలేరు. ఇందువల్ల పేషెంటుకు మంచికన్నా చెడు ఎక్కువగా జరిగే అవకాశం వుంది. డాక్టర్లకి సాధ్యమైనంత స్వతంత్రం ఇవ్వాలి. అని మనసులో మెదిలింది స్వాతికి.



gudachari.com

స్వాతి కన్నా ఆమె తమ్ముడికి ఆతృత అధికంగా వుంది.

ఇంతలో డాక్టర్ రెడ్డి వచ్చి అన్నాడు, "అంతా క్లీన్ చేస్తున్నారు."

"ఏమిటి... క్లీన్ చేసేది...?"

"నథింగ్ టు వర్రీ... మందులన్నీ ఇవ్వడానికి శరీరంలో అక్కడక్కడా కట్ చేశారు కదా! వాటిని క్లీన్ చేస్తున్నారు. కమ్... కమ్..." మౌనంగా లోపలకి వెళ్ళింది. ఎలాంటి పరిస్థితి నైనా ఎదుర్కోవాలని ధైర్యాన్ని కూడగట్టుకుంది స్వాతి.

ఎదురుగా పడుకోబెట్టివున్నారు. అక్కడక్కడా రక్తం మరకలు... చేతికి, కాళ్ళకు, మెడకు శరీరమంతా వైర్లు... చుట్టూ యంత్రాలు... బైపాస్ సర్జరీ సమయంలో చూసిన స్థితే ఇక్కడా... ముఖంలో అదే మృత్యుకళ... అతను బ్రతికి ఉన్నాడనే నమ్మకం పూర్తిగా పోయింది స్వాతికి.

డాక్టర్ రెడ్డి వైపు చూసింది.

"వెళ్ళు... వెళ్ళు... దగ్గరకు వెళ్ళు.. ధైర్యం చెప్పు...." చిన్నగా అన్నాడు.

నవ్వొచ్చింది స్వాతికి. ధైర్యం చెప్పాలి... చావబోతున్న ఆయనకు నేను ఏ ధైర్యంతో ధైర్యం చెప్పాలి... ఆమె తల తిరిగిపోతోంది. మైకం కమ్ముతున్నట్లు.. శరీరం చల్లబడు తున్నట్లుగా అనిపించింది స్వాతికి.

లేదు... నేను అధైర్యపడకూడదు.... రిలాక్స్... రిలాక్స్ కావాలి. భర్త దగ్గరకు నడు స్తుంది. చావుతో చెలిమి చేస్తున్న అతనికి వీడ్కోలు చెప్పబోతుంది... కనీసం కన్నెత్తి చూస్తారా నన్ను... కడపటిసారిగా ఒక్కమాటన్నా మాట్లాడతారా నాతో...! అని అనుకుంటూ దగ్గరకు వెళ్ళింది.

తనను తాను కంట్రోల్ చేసుకుంటూ... శక్తికూడ గట్టుకుంటూ మెల్లగా చెవి దగ్గరకు వంగింది. తల బరువుగా వుంది.. మాట పెదవి పైకి రావడం లేదు... గొంతు పిడచకట్టుకు పోయింది. ఎలాగో అతి ప్రయత్నం మీద అనగలిగింది, "ఏమండీ.. నేను... స్వాతిని."

అతని ముఖంలో ఏదో కదలిక... స్వాతి గుండె వేగం హెచ్చింది.

కొంచెం గట్టిగా, "నేను.. మీ స్వాతిని... మీరు నాకు మాటిచ్చారు... మృత్యుంజయుడ నని... నన్ను మోసం చేయకండి..." అంది.

కళ్ళు తెరచి స్వాతి వైపు చూసి

"ఎలా... పోరాడమంటావు... ఓ... కె... ఐ... విల్... ట్రై... నీ... కో... సం..." అన్నాడు. కనుపించని చిరునవ్వు అతని పెదవులపై మెరిసినట్లు అనిపించింది స్వాతికి.

ఇక స్వాతిని అక్కడ వుండనివ్వలేదు వాళ్ళు.



ఒక వయసు మళ్ళిన నర్స్ స్వాతిని కౌగలించుకుని ఆత్మీయతతో నొసట ముద్దు పెట్టుకుని దూరంగా తీసుకవచ్చేసింది. అక్కడే అతని సమక్షంలోనే వుండిపోవాలని మనసు విల విల లాడిపోయింది స్వాతికి. కానీ వుండనివ్వరు.

నర్సు స్వాతిని విజిటర్స్ గదిలోకి తీసుకవచ్చింది.

"ఆశ... వదులుకోవద్దు... బి... బ్రేవ్..." అంది. తల్లిలా దగ్గరకు తీసికొని ధైర్యం చెప్పి, "ఎప్పటికప్పుడు నేను విషయాలు తెలుపుతాను... భయపడకు... ఆశ వదులుకోకు..." అని లోపలకి వెళ్ళిపోయింది.

డాక్టర్ రెడ్డి వచ్చి కూర్చున్నాడు. స్వాతి మెదడు మొద్దుబారిపోయింది. స్థాణువులా గోడకు ఆనుకుని శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది.

స్వాతి తమ్ముడు డాక్టర్ రెడ్డితో, "పిల్లల్ని, మిగిలిన వాళ్ళను పిలిపిస్తే బావుంటుం దేమో..." అనడం వినిపించింది.

డాక్టర్ రెడ్డి స్వాతి వైపు చూస్తూ, "పిల్లలు... పిల్లలు... ఇప్పుడు వద్దు... ఎందుకంటే... మరో గం..ట.. అతను... కొంత నిలకడ జరుగుతుంది..." ముఖం తుడుచుకుని "ఇంతలో పిల్లలు... ఈ వాతావరణం బాగుండదు." అని పూర్తి చేసి స్వాతిని చూడకనే అన్నాడు.

స్వాతిని చూస్తుంటే భయం వేసినట్లుంది వాళ్ళకు. డాక్టర్‌రెడ్డి ఇక కూర్చోలేక లోపలకు వెళ్లాడు ఇప్పుడే వస్తానని చెప్పి.

మరో అర గంటకు డాక్టర్‌రెడ్డి హడావిడిగా వచ్చాడు. వస్తూనే తల అటు ఇటు ఆడిస్తూ ఆశ్చర్యపూరిత కంఠంతో అస్పష్టంగా. "నమ్మలేకున్నాను... నిజంగా నమ్మలే కున్నాను..." అన్నాడు.

ఒక్కసారిగా స్వాతి వళ్ళు చల్లబడిపోయింది.

"అయిపోయిందా... అంతా అయిపోయిందా..."

"లేదు... లేదు... అతని పరిస్థితి మెరుగ్గా వుంది... అదే నమ్మలేకుండా వున్నాను." స్వాతి ఆమాటకే ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయింది.

"అంటే మెరుగవుతుందా....! బాగవుతుందా...?" ఆతృతగా అడిగింది.

"యస్... హి ఈజ్ బెటర్ నౌ."

"రియల్లీ... రియల్లీ... నిజం చెబుతున్నారా!! నాకోసం అలా చెబుతున్నారా.!.!.!"

"లేదు... లేదు... నిజంగానే,"

అంతే, "నేనాయన్ని వెంటనే చూడాలి." అంటూ సి.సి.యు వైపు పరుగు తీసింది స్వాతి. వెనకనుంచి ఆగమంటున్నా అరుపులు వినిపించుకోకుండా "డాక్టర్.. స్వాతీ... డోంట్ బి ఎగ్జైటెడ్... కాస్త నిదానించు..." అంటూ డాక్టర్ రెడ్డి వెంటబడ్డాడు.



gudachari.com

లోపల గ్లాస్ డోర్ వద్ద నిలచిపోయారిద్దరూ.

స్వాతికి మార్పు ఏమీ కన్పించలేదు. అదే మృత్యుకళ ముఖంలో... డాక్టర్లందరూ ఎప్పటిలానే గంభీరంగా తమ పనులు తాము చేసుకుపోతున్నారు... మరి..! బావుందంటా రేవిటి...? వీళ్ళకు పిచ్చిపట్టింది. తనను ఓదార్చాలని అలా చెప్పారు. ఆయనిక లేరు... ఆశ నిరాశే... వీళ్ళమాటలు నీళ్ళమూటలే... అనిపించి విసురుగా డాక్టర్ రెడ్డి వైపు చూసి, "బాగుందన్నారే! ఎక్కడ... అబద్ధం చెబుతున్నారు?" కోపంగా అంది వస్తున్న ఏడుపును ఆపుకుంటూ.

మాట్లాడొద్దన్నట్లు సైగ చేసి లోపలకు వెళ్ళి ఒక డాక్టర్‌కు స్వాతి వైపు చూపి ఏదో చెప్పాడు. ఆయన తల ఊపారు. స్వాతిని రమ్మన్నట్లు పిలిచారు. స్వాతి లోపలికి వెళ్ళింది.

"డాక్టర్ స్వాతీ! మీట్ డాక్టర్ భక్తవత్సలం కరోనరీ కేర్ యూనిట్ (సి.సి.యు) ఛీఫ్."

నమస్కారం చేయాలని తలంపే రాలేదు. తనచూపులంత నిర్జీవంగా పడి ఉన్న భర్త మీదే ఉన్నాయి.

స్వాతిని చూసి, "మీ హజ్‌బెండ్... రిమార్కబుల్ మాన్... హిఈజ్ ఎ ఫైటర్... మాట్లాడుతారా..." అన్నారు.

"ఆయన... నాతో... మాట్లాడగలరా!" అడిగింది భర్తనే చూస్తూ.

"మీరే ట్రై చేయండి..." చిన్నగా నవ్వుతూ అన్నాడు.

దగ్గరకు వెళ్ళి చెవి దగ్గర, "డార్లింగ్... నేను... స్వాతిని... మీకేం... ఫరవాలేదు... ధైర్యంగా వుండండి... మీరు... జబ్బుకు లొంగిపోకూడదు... సాధించాలి...!" హృదయాంత రాలల్లోనుంచి దుఃఖపు పొరల మధ్య నుంచి వచ్చాయి ఆ మాటలు.

మెల్లగ కళ్ళెత్తి స్వాతి వైపు చూస్తూ

"ఐ మేడ్ ఇట్... వీళ్ళంతా కలసి... నన్ను...వెనక్కు లాక్కొచ్చారు..." ఆమాట మృత్యుముఖంలో వున్న వ్యక్తి చెప్పినట్లు లేదు.

స్వాతి హృదయం గంతులువేసింది. ఆమె కళ్ళు ఆనందంతో వర్షించాయి. కొన్ని సమయాల్లో డాక్టర్లు అద్భుతాలు చేయగలరు.

మళ్ళీ స్వాతి అక్కడ్నించి దూరంగా తీసుకు వచ్చేశారు. ఆయన ప్రక్కనే వుండాలి... నన్ను వదిలేయండి.. నేనాయన దగ్గరే వుండి చావు ఆయన దరిదాపుల్లోకి రాకుండా కాపలా కాస్తాను. ఆయన్ను నానుంచి ఎవరూ దూరం చేయలేరు... అని స్వాతి మనసు హఠం చేసింది. కానీ వీలుపడదని తెలుసు.

తిరిగి వచ్చేస్తూ డాక్టర్ భక్త దగ్గరకు వెళ్ళి, "మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు... నా జీవితాన్ని నిలబెట్టిన దేవుళ్ళు మీరు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు...." గద్గద స్వరంతో అంది అప్పుడు చేతులు జోడిస్తూ....



"అప్పుడే చెప్పేయకండి. ఇంకా మేము ఖచ్చితంగా చెప్పలేకున్నాము... కానీ ఒకటి మాత్రం నిజం... మీ భర్త నిజంగా అద్భుతమైన వ్యక్తి. మరపురాని మనిషి. ఆ విల్ పవర్, ధైర్యం నేనింతవరకూ ఎవ్వరిలోనూ చూడలేదు... రియల్లీ ఫాన్‌టాస్టిక్.. డోంట్ లూజ్ హోప్... బట్ స్టిల్... ఉయార్ నాట్ ష్యూర్..." అంటూ అక్కడున్న వాళ్ళందర్ని పరిచయం చేశాడు.

అందరికి నమస్కరించింది పొంగుకొస్తున్న కన్నీరు ఆపుకుంటూ.

గంభీరంగా ఉన్నాయి అందరిముఖాలూ...

ఎంతమందికి ప్రాణదానం చేసిన దేవుళ్ళో కదా వీళ్ళు... ఎవరో ముక్కూముఖం తెలియని వ్యక్తి చావుబ్రతుకుల్లో వుంటే తమ శక్తినంతా ధారపోసి రాత్రనక పగలనక ఆవ్యక్తి ప్రాణరక్షణ కోసం పాటుపడతారు. వీళ్ళ సేవల్ని విలువకట్టలేము. డబ్బుతో అసలు కొనలేము.

ఈ గదిలో ఎన్ని గుండెలు బ్రద్ధలయ్యాయో!

ఎందరు దుఃఖార్తులని వీళ్ళు సముదాయించి ఓదార్చారో...!!!

విసుగు, కోపం వీళ్ళ ఛాయలకే వచ్చేట్లులేదు... అనిపించింది వాళ్ళందర్నీ చూసిం తరువాత స్వాతికి.

డాక్టర్ రెడ్డి అన్నాడు "డాక్టర్ భక్త గదిలో కూర్చుందాం కాసేపు" స్వాతితో.

అదే యూనిట్‌లో వున్న గదిలో కూర్చున్నారు.

"బాగా అలసిపోయినట్లున్నారు. కాఫీ తీసుకుంటరా! డాక్టర్ భక్త అన్నాడు రూంలోకి వస్తూనే స్వాతిని చూస్తూ"

వద్దన్నది.

"వద్దనకూడదు... తీసుకోవాలి... నిన్నటి నుంచి మీరేమీ తీసుకోలేదని తెలుసు నాకు." అన్నాడు డాక్టర్‌రెడ్డి

డాక్టర్ భక్త మూడు కప్పుల్లో కాఫీ పోసి వాళ్ళిద్దరికీ ఇచ్చి తనూ తీసుకున్నాడు.

"ఊ... తీసుకోండి... రిలాక్స్... ఉయార్ హియర్... డోంట్ వర్రీ...." నవ్వుముఖంతో చిన్నగా అన్నాడు, స్వాతి చేతికి బలవంతంగా కాఫీ కప్పు అందిస్తూ.

"మొట్టమొదటి పేషెంటును చూసి లాభంలేదనుకున్నాం. బి.పి. లేదు. పల్స్‌వీక్‌గా వుంది. సివియర్ పల్మోనరీ ఎడిమా వుంది. కార్డియోజనిక్ షాక్‌లో వున్నాడు. అసలింత దూరం వచ్చేవరకూ ఎవ్వరూ ఎందుకు పట్టించుకోలేదు..." తలెత్తి స్వాతి వైపు చూపు మరల్చారు. జరిగినదంతా చెప్పేయాలనిపించింది. ఇది సమయం కాదని మాట్లాడలేదు స్వాతి.



gudachari.com

ఆ పరిస్థితిల్లో కూడా అతను స్పష్టంగా మాట్లాడగలుగుతున్నాడు. అదే విచిత్రం.. కార్డియోజనిక్ షాక్‌లో వుండి ఎవ్వరూ అంత స్పష్టంగా మాట్లాడలేదు. ఆశ అణుమాత్రమైనా లేకపోయినా అతని ధైర్యంతో మేము విజృంభించాము. నేను, డాక్టర్‌రెడ్డి, శంకర్, ఇద్దరు అసిస్టెంట్స్, మరో ఇద్దరు జూనియర్ డాక్టర్‌లు, నర్సులు... అందరమూ కలసి కావల్సిందగ్గరంతా ఆలోచించకుండా కోసి ట్యూబ్‌లు దోపడమే టైమ్ పర్మిట్ చేసిన చోటల్లా లోకల్‌గా అనెస్థిషియా ఇచ్చి కట్ చేశాము.

ఇంత చేస్తున్నా అతను స్మారకంలోనే వున్నాడు. మేం చేస్తున్నది అడుగుతున్నాడు. నేనన్నీ చెబుతున్నాను. లేకపోతే ఎదురు తిరిగే అవకాశం వుంది. ఆరిస్క్ ఆ సమయంలో తీసుకోదలచుకోలేదు.

మధ్యలో ఒకసారి ఆయాసం ఎక్కువైపోయి నోటి ద్వారా నురుగు వచ్చింది. అయి పోయిందనుకున్నాము. మాడ్‌డాగ్ (MADDOG) ఫాలో అయ్యాము.

M యం: మార్ఫిన్ - మత్తుగా ఉపయోగపడటమే గాక ఆత్రుత తగ్గిస్తుంది. దాని వలన చాలా ఉపయోగాలున్నాయి.

A ఎ: ఆమైనోఫిలిన్ - ఆయాసం తగ్గించేందుకు

D డి: డిగాక్సిన్ - గుండెను క్రమబద్ధంగా నడిపేందుకు

D డి: డైయూరిటిక్స్ - ఊపిరితిత్తుల్లో ఎక్కువగా ఉన్న నీరు తగ్గించేందుకు.

O ఓ: ఆక్సిజన్ - తెలిసిందే.

G జి: జనరల్ మెషర్స్ : కూర్చోపెట్టడం, ధైర్యం చెప్పటం మొ॥

ఊపిరితిత్తుల్లోని నీరు తగ్గించేందుకు చాలా ఎక్కువ మోతాదులో డైయూరిటిక్స్ ఇచ్చాము. బి.పి. పెరగడానికి డోపమిక్ అనే మందు, గ్లూకోజ్ డ్రిప్పు పెట్టాము. ఒకటి నీరు తీసేందుకు. ఇందువల్ల బి.పి. తగ్గిపోతుంది. మరొకటి బి.పి. పెంచేందుకు. ఈ రెండింటిలో ఏది తక్కువైనా ఎక్కువైనా అనుకున్నదంతా నాశనమైపోతుంది. చాలా సున్నితంగా అతిజాగ్రత్తగా వీటి నిష్పత్తిని అదుపు చేయాలి.

శరీరంలోని ద్రవాల వత్తిడి తగ్గించేందుకు కొంచెం రక్తం కూడా తీసేశాము (దీన్నే ఫ్లెబోటమీ అంటారు. ఆశ వదలుకున్నా కేసుల్లో చేసే చర్య ఇది)

ఏం చేస్తున్నా ఫలితం ఆశాజనకంగా అగుపించడం లేదు. ఇంతలో లాబ్ నుంచి బ్లడ్ రిపోర్ట్స్ వచ్చాయి. అసలే అయోమయంలో వున్న మాకు అవి పిచ్చిపట్టించేట్లు అన్ని వ్యతిరేకంగా వున్నాయి. ఏదీ తృప్తికరంగా లేదు.

ఒక అరగంటలోగా ఒక్కొక్కటే దారిలోకి వస్తున్నట్లనిపించింది. పల్మోనరీ ఎడిమా ఎప్పుడైతే తగ్గిందో దాన్తో హార్ట్‌కు లోడ్ తగ్గిపోతుంది. ఇందువల్ల ఎడమ వెంట్రికల్ సైజ్ తగ్గుతుంది. బి.పి. పెరుగుతుంది. ఎక్కువ రక్తం కిడ్నీలకు ప్రవహిస్తుంది. అప్పుడు రక్తంలోని



అసిడోసిస్ తగ్గి అన్ని శరీర భాగాలు ఒక పద్ధతిలోకి వచ్చేట్లు చేస్తాయి. ఇదంతా ఒక భాగం మరో భాగంను పనిచేయించుకుంటు జరిగిపోతుంది. అదే జరిగింది. మాకు దొరికిన ఆ అవకాశాన్ని జారిపోనీకుండా తగు చర్య తీసుకున్నాము.

అప్పటికి మేం కొంత ఫ్రీ అయ్యాము. అయితే మళ్ళీ రాదని గ్యారంటీ మాత్రం లేదు. ఇన్ని సంవత్సరాల సర్వీస్‌లో ఇంత ప్రమాదం నుంచి తప్పించుకున్న కేసు ఇదొక్కటే.

స్వాతిలో దిగులు మళ్ళీ మొదలైంది... మళ్ళీ రావచ్చు అన్నందువల్ల... తిరిగి అతనే అన్నీ వింటున్న స్వాతితో "ఎలాంటి ఆత్రుత ఆందోళన పడకండి."

"ఉయ్ విల్ ట్రై డాక్టర్ స్వాతీ... మాశక్తి కొలదీ ప్రయత్నిస్తాం..."

డాక్టర్ రెడ్డి స్వాతిని చూసి

"నువ్విక్కడ చేయగలిగిందేమీ లేదు రూమ్‌కి వెళ్ళి విశ్రాంతి తీసుకో." అన్నాడు.

"నేనెక్కడికి వెళ్ళను. ఈరోజంతా ఇక్కడే వుంటాను." అంది మొండిగా స్వాతి.

డాక్టర్ రెడ్డి కాసేపు ఆమెనే చూసి బలవంతం చేయలేకపోయాడు.

విశ్రాంతి.. ఎక్కడిది విశ్రాంతి... ఎలా వుంటుందది... ఎప్పుడో మరచిపోయింది స్వాతి ఆ పదం.

ఇప్పుడు విజిటర్స్ రూమ్‌లో వున్న వ్యక్తుల్ని కొంచెం తీరిగ్గా పరిశీలించే అవకాశం దొరికింది స్వాతికి. అలాగే అందరూ వున్నారు... అదే ఆతృత... ఏడుపులు... తను ఓదార్చిన పెద్దామె కూడా వుందక్కడ. స్వాతిని చూసి దగ్గరకు వచ్చింది.

"ఏమ్మా! ఫరవాలేదా... ఈ డాక్టర్లంతే ఒక్కటీ సరిగ్గా చెప్పరు... ఎక్కువ అడిగితే కోప్పడతారు."

"మీరు ఎవరికోసం వచ్చారు?"

"మా మనవడమ్మా... ఉన్నట్లుండి పడిపోయాడు. వయసు కూడా పెద్దగా లేదు. ముప్పై అయిదు... ఇద్దరు పిల్లలు. అదిగో ఆపిల్లగోడు, చూస్తే గుండెలు బ్రద్ధలయి పోతున్నాయి," అంటూ ఓమూలవున్న ఒకామెను చూపింది.

ఎప్పట్నించీ ఏడుస్తుందో... కళ్ళు ఉబ్బిపోయి, తల చెదిరిపోయి శోకదేవతలా వుంది.

"ఏమైంది ఆయనకి?"

"ఏమైందో! వాళ్ళు చెప్పింది సరిగా అర్థంకాలేదమ్మా! గుండె చిట్లిందన్నారు. వెంటనే ఆపరేషన్ చేయాలట. మూడుగంటలైంది. ఇంతవరకూ ఏమీ చెప్పలేదు. ఏమవుతుందో...! ఏమో!" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"భయపడకండి... ధైర్యంగా వుండండి..."ఆమాటలంటూ వుంటే నవ్వొచ్చింది స్వాతికి. ఇంతకు ముందు ఆమె ధైర్యం చెప్పింది తనకు, ఇప్పుడు తను ఆమెకు ధైర్యం



gudachari.com

చెబుతున్నది.... విపరీతమైన బాధల్లోంచి కాస్త అవకాశం దొరికితే మనిషి మరొకరికి సలహాలివ్వడానికి సిద్ధం అవుతాడనిపించింది.

ఇన్‌టెన్సివ్‌కేర్ వార్డు. చావుకి సమీపంలో ఉన్న వాళ్ళను ఉంచే స్థలం. ఇదొక మంత్రాలయం, ఒక యంత్రాలయం. రోగులు మాట్లాడే పరిస్థితుల్లో ఉండరు. అన్నీ యంత్రాలే చెబుతాయి. వాటి నిర్ధారణ బట్టే వైద్యం జరుగుతుంది. చావు బ్రతుకులు వాటి పనితనం మీదే ఆధారపడి ఉంటుంది. తప్పులు జరిగితే అంతే!

అక్కడున్న డాక్టర్లు, నర్సులు వీటినే చూస్తారు. పేషంటు వైపు కన్నెత్తి కూడా చూసేందుకు వాళ్ళకు తీరిక ఉండదు, యంత్రాల మీద నమ్మకంతో, ఎంకాదులే అనే అశ్రద్ధ. అక్కడున్న డాక్టర్లు అంతా జూనియర్స్, ఇద్దరూ, ముగ్గురు పోస్టుగ్రాడ్యుయేట్స్. అసలు సీనియరు అవసరానికి అందుబాటులో ఉండడు.

పోస్టుగ్రాడ్యుయేట్సు, దూరంగా కూర్చొని, నవల్సు చదువుతూనో, కుర్ర నర్సులతో తమాషా పడుతూనే, ఎప్పుడో ఒకసారి వాకింగ్ వెళ్ళినట్లు పేషంట్సు వద్ద రౌండ్సు వెయ్యటం, రావటం. పనులన్నీ జూనియర్ డాక్టర్స్‌కు, ట్రెయినీ నర్సులకే ఎక్కువ ఉంటుంది. వాళ్ళకు తెలిసింది అంతంత మాత్రమే. తెలిసి అక్కడున్న సీనియర్స్‌తో చెప్పాలంటే భయం.

ఏ క్షణంలో ఏం ప్రమాదమొస్తుందో తెలియదు. సొంత నిర్ణయం తీసుకొనే ప్రావీణ్యం ఉండదు. ఉన్నా యూనిట్ హెడ్ డాక్టరుతో సంప్రదించాలి. ఆయన దొరికేటప్పటికి చేతులు మించిపోతుంది. నిర్దుష్టత, ప్రావీణ్యత, క్షణాల్లో స్పందించే తెగువ ఉండాలి అక్కడున్న వారికి. అక్కడ చేరిన వాళ్ళందరూ చావు తప్పనివాళ్ళు కాదు. బ్రతికేవాళ్ళు కూడా అనవసరంగా వీటిమూలంగా చనిపోయేవాళ్ళు కూడా ఉన్నారు.

మనల్ని లోపలకు రానివ్వరు. నువ్వు డాక్టరువైనా, మేధావి అయినా, నీకు అంతా తెలిసి ఉన్నా నీ అభిప్రాయం తీసుకోరు.

చచ్చిన తరువాత గాని రోగిని చూసేందుకు లేదు. రోజుకు ఒకసారి చూపుతారు. ఎలా ఉన్నారు అని అడిగేందుకు నీకు అవకాశం యివ్వరు. అందుబాటులో ఎవ్వరూ ఉండరు.

చివరిచూపు పేషంట్లుకు గాని, బంధువులకు గాని చాలా ప్రాముఖ్యం కానీ ఆ చివరి చూపుకూడా దక్కదు ఈ ఆసుపత్రులలో. ఇదేం న్యాయం. ఇదేం పద్ధతి. స్వాతికి ఇది నచ్చనే నచ్చదు. దారుణం ఈ వ్యవస్థ. ఘోరం యిలాంటి ప్రవర్తన.

కానీ ఏంచెయ్యలేం... నమ్మకం!! అక్కడ కూడా కొందరు దేవుళ్ళు, దేవతలు ఉంటారు. వాళ్ళ మూలంగానే ఎందరో లేక కొందరయినా ప్రాణాలతో బయటపడుతారు.

తన వాళ్ళంతా పిల్లల్తో వచ్చి పలకరించే వరకూ స్వాతి ఈలోకంలో లేదు.. చూస్తే సాయంకాలం...



వాళ్ళను చూడగానే అంతవరకు అదుపులో ఉంచుకున్న దుఃఖం ఒక్కసారిగా ప్రవాహంలా ముంచుకొచ్చింది. కానీ నిగ్రహించుకుంది.

పిల్లల్ని గట్టిగా గుండెలకు అదుముకుని ముద్దుపెట్టుకుంది. వాళ్ళు బిక్కచచ్చిపోయి, భయంతో ముడుచుకుపోయారు తల్లిని చూసి. వచ్చినవాళ్ళు కూడా స్వాతి తమ్ముడితో ఏదో గుస గుస లాడుతున్నారు. మధ్య మధ్య ఆమె వైపు చూస్తూ.

పిల్లల్ని పొదివి పట్టుకొనే ఉంది స్వాతి.

పిల్లలు వాళ్ళనాన్నను చూడాలని గొడవ చేయడం ప్రారంభించారు. ఆస్థితిలో చూస్తే భయపడతారని నచ్చచెప్ప ప్రయత్నిస్తే వినలేదు. విధిలేక స్వాతి సి.సి.యు. గది దగ్గరకు వెళ్ళింది. ఆమెను చూసి పెద్ద నర్స్ మేరి బయటకు వచ్చింది నవ్వుతూ.

"ఎలా ఉన్నారు?"

"బెటర్... మరలా పల్‌మోనరీ ఎడిమా వచ్చింది."

మనసు విలవిలలాడింది. "మళ్ళీ షాక్‌లోకి వెళ్ళారా...?"

"డోంట్ వర్రీ... వెంటనే కంట్రోల్ చేయగలిగాము. దటీజ్ గుడ్... కానీ చెప్పలేం..."

మళ్ళీ అదే మాట చెప్పలేం... ఎప్పుడు ఫరవాలేదు అనే పదం వినేది...? అసలు వింటానా... అనిపించింది.

"పిల్లలు చూడాలంటున్నారు....."

"సెడేషన్‌లో వున్నారు.. కాస్త వుండండి కనుక్కొని వస్తాను." అంటూ లోపలకి వెళ్ళివచ్చి, "సరే రెండు నిమిషాలు." అంది.

పిల్లల్ని తీసుకుని రూంలోకి వెళ్ళింది.

అతను అదే పరిస్థితిలో వున్నాడు. పిల్లలు జంకుతూ వచ్చారు. తర్వాత మిగతా వాళ్ళుకూడా వచ్చి దూరంగా నిల్చున్నారు.

అతని స్థితిలో మార్పేమీ కనిపించలేదు.... స్వాతికి. ఆయాసం మాత్రం తగ్గినట్లుంది.. కళ్ళుమూతలు పడివున్నాయి... లోపలి కనుగుడ్లు తిరుగుతున్నట్లు వున్నాయి.

ముగ్గురు పిల్లలూ గట్టిగా ఏడ్చేశారు అతన్ని చూసి, వాళ్ళను సముదాయించే శక్తి కూడా లేదు స్వాతికి. అక్కడున్న వాళ్ళంతా వాళ్ళను సముదాయించడానికి ప్రయత్నించారు.

"డాడీకేం... భయంలేదు... బాగవుతుంది... ధైర్యంగా ఉండండి. మంచి పిల్లలు కదూ! మీరేడిస్తే డాడీకి కోపం వస్తుంది. కోపం వస్తే డాడీ జబ్బు ఎక్కువవుతుంది. జబ్బు ఎక్కువైతే డాడీతో మీరు మాట్లాడలేరు..."

వాళ్ళ ముఖాల్లో ఆత్రుత, భయం, వెనువెంటనే అంతులేని బాధ ప్రస్ఫుటంగా తెలుస్తుంది. ఏక్షణంలోనయినా వాళ్ళ హృదయాలు బ్రద్ధలయి దుఃఖం పెల్లుబికే సమయం ఎంతో దూరంలో లేదు.

gudachari.com

కళ్ళనిండా నీరు... ఎలా అదుపు చేసుకున్నారో!

వాళ్ళను చూస్తున్న ఆ డాక్టర్లకు, నర్సులకు హృదయాలు ద్రవించాయి.

"ఎక్కువ సేపు ఉండకూడదు... రండి" అన్న స్టాఫ్ మాటకు కదలలేదు. కన్నీళ్ళు జల్లున రాలాయి.

అతనిలో కొద్దిగా కదలిక... మెల్లగా కళ్ళు తెరచి కాసేపు స్వాతి వైపు చూసి నెమ్మదిగా తలత్రిప్పి పిల్లలవైపు అలాగే ప్రశ్నార్థకంగా చూసి కడకు చిన్నగా నవ్వాడు. అంటే గుర్తు పట్టడానికి అంత సేపు పట్టింది.

"ఐ.. యా... మ్... ఓ.... కే..." పిల్లలకి కళ్ళతోనే సైగ చేశాడు.

వాళ్ళను బయటకు పంపేశారు. తిరిగి తిరిగి చూస్తూ గట్టిగా స్వాతిని పట్టుకుని వచ్చారు పిల్లలు. వాళ్ళతో పాటూ మేరీ నర్స్ బయటకు వచ్చింది.

"మీరు రూమ్‌కి వెళ్ళి పిల్లలకు ధైర్యం చెప్పండి... వాళ్ళతో కాసేపు గడిపితే మనస్సు కుదట పడుతుంది. బట్ డోంట్ లూజ్ హోప్..." అంటూ చేతిలో ఓ కాగితం ఇచ్చి చెప్పింది.

"ఇందులో సి.సి.యు. ఫోన్ నెంబర్లున్నాయి. మీరెప్పుడు చేసినా అన్ని విషయాలూ చెబుతాం... మీకు మంచే జరుగుతుంది..." అని స్వాతిని కౌగలించుకుంది.

ఆమె ఆదరానికీ, ఆప్యాయతకూ మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పింది స్వాతి.

విజిటర్స్ రూమ్‌లో డాక్టర్‌రెడ్డి స్వాతి వాళ్ళనాన్న వాళ్ళతో మాట్లాడుతున్నారు.

"మా గొప్పేం లేదు.. అంతా మీ అమ్మాయి అదృష్టం... తీసుకువెళ్ళి కాస్త విశ్రాంతి తీసుకొనేట్లు చేయండి. లేకపోతే రేపామెను చేర్చాలి హాస్పిటల్లో."

వస్తూనే నేరుగా డాక్టర్ రెడ్డి కళ్ళల్లోకి చూస్తూ

"హి వెంట్ ఇన్‌టు ఫెయిల్యూర్ అగైన్..." అంది స్వాతి

"యస్... ఐనో... దే(బ్రాట్ హిట్ బాక్... దటీజ్ ఎ గుడ్ సైన్... బట్ ఉయార్ హోప్ ఫుల్.."

"అంటే అర్థం...."

"ఓన్లీ డాక్టర్స్ కెన్ అండర్‌స్టాండ్"

... అవును సందిగ్ధంలో పెట్టి చంపడం డాక్టర్లకే చేతనవును. అయినా తన పిచ్చిగానీ... తెలియకనే కదా వాళ్ళు అలా చెబుతున్నారు...

ఎందుకు వాళ్ళని ఇబ్బంది పెట్టడం... ఒకవైపు లాభం లేదంటూనే మరోవైపు ఆశ లేకపోలేదట. ఏదీ తేల్చిచెప్పలేని పరిస్థితి... అంటే ఏక్షణంలో అయినా వినకూడని మాట వినే అవకాశం వుందన్నమాట అని అనుకోసాగింది స్వాతి.



"బట్... హోప్ ఫర్ ది గుడ్..." ఈరోజు స్లోగన్ ఎలక్షన్ మానిఫెస్టో లోగా...

"డుయు ఎక్స్‌పెక్ట్ ఎనీ మోర్ ప్రాబ్లెమ్స్?" అడిగింది.

"యస్..." చెమట తుడుచుకుని తటపటాయిస్తూ.

"డాఫిమిన్ డ్రగ్... బి.పి.ని మెయిన్టెయిన్ చేయడానికి గుండెకు కొంచెం శ్రమ కలిగిస్తుంది... అందుకని..." నిలిపి చూపు స్వాతిపై నుంచి తన బూట్లువైపు త్రిప్పేశాడు.

"ముందుగా... అంటే అటువంటి పరిస్థితి వచ్చేవరకూ వెయిట్ చేయక ట్రీట్‌మెంట్ ఇచ్చివుంటే..." నిలదీసి అడిగింది.

గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది ఆమాటకు ఎందుకంటే అది నిజం కనుక.

"ఓహో... డాక్టర్ స్వాతీ! లే పీపుల్ లాగా మాట్లాడకు."

"జబ్బు వచ్చినపుడు డాక్టర్లకంటే మామూలు మనుషులే నయం" నిష్ఠూరంగా అంది.

కాస్త ముందు వీళ్ళు మేల్కొని వుంటే ఇంత శ్రమ అవసరం వుండేది కాదు. పేషెంటుకు, డాక్టర్లకూ కూడా మానసిక శారీరక క్షోభ తగ్గే అవకాశం ఉండేది... అనిపించింది స్వాతికి.

ఆరోజు రాత్రి కూడా ఎందరు చెప్పినా వినక స్వాతి విజిటర్స్ రూములోనే వుండిపోయింది. ఏక్షణం... ఏం జరుగుతుందో తెలియదు. ఆఖరు క్షణాల్లో అయినా దగ్గరుండకుండా పోవడం...

ఛీ... ఛీ... ఏవిటిది..? ఆయన చావు కబురుకోసం కాచుక్కూర్చున్నావా... మరి ఆయన చనిపోతే నువ్వూ చనిపోతానన్నావే...?! నీకు బాధవేయడంలేదా... నీ గుండె బద్దలవడం లేదా..!? లేదు... నాకు ఆశక్తి కూడా లోపించింది. అనుకోకుండా ఏదైనా జరిగివుంటే చనిపోయి ఉండేదాన్నేమో! ప్రతి నిముషం, ప్రతిక్షణం ప్రమాదం జరుగుతుందని చూసి... చూసి... విని... విని... మనసు మొద్దుబారిపోయింది. అందుకే తనిక్కడ ఇప్పుడు కూర్చోగలిగి వున్నానేమో ననిపించింది స్వాతికి.

ఆ రాత్రి మేరీ నర్స్ రెండుసార్లు వచ్చి పరిస్థితి చెప్పి ఓదార్చి పోయింది స్వాతిని.

"అతని చార్టులంతా చూశాము... ఎక్కడా ప్రమాద సూచన వ్రాయలేదు... ఎందుకో వున్నట్లుండి ఇలా అయిపోయిందో అర్థంకాలేదు..." అంది.

"అది అబద్ధం... ఆయన దగ్గరే వుండి క్షణక్షణం ఆయన పరిస్థితి క్షీణించడం కళ్ళారా చూశాను నేను. ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరికి ఆయనే నాకు యూరిన్ రావడం లేదు. కిడ్నీలు పనిచేయడం లేదు.. నేను షాక్‌లోకి పోతున్నాను అని చెప్పే వరకూ పట్టించుకోలేదు."

ఆమాటలకు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి స్వాతి వైపు చూసి,



gudachari.com

“ఈ ప్రొఫెషన్‌లో కొన్ని సమయాల్లో ఇలాగే జరుగుతుంది క్షమించరానిదే అయినా ఎవ్వర్నీ ఏమీ అని ప్రయోజనం లేదు.” బాధగా అంది.

మరుసటి రోజు డ్యూటీలో వున్న లేడీ డాక్టర్ని ప్రక్కకు పిలిచి అడిగింది స్వాతి.

“ఆరోజు సాయంకాలమే తీసుకొచ్చివుంటే ఇంత ప్రమాదం వుండేది కాదు కదా! అని”

“అవును నిజమే... కానీ ఈతతంగమంతా తప్పదు. అయితే పేషెంటుకి ఇంత బాధ, మాకు టెన్షన్ తప్పివుండేది.”

ఈవిడకు అసలు విషయం తెలిసినట్లు లేదు. స్వాతికి చెప్పాలనిపించలేదు.

“ఆయన ప్రొగ్రెస్ మీద మీ ఒపీనియన్ ఏమిటి?” అడిగింది.

“నేనేమీ చెప్పలేను... ఇటువంటి కేసుల్లో మూడు రకాల ప్రమాదాలున్నాయి.”

“మొదటిది కార్డియాక్ అరెస్ట్. దానికి ప్రిపేర్ అయి ఉన్నాము”.

“రెండు... పల్మోనరీ ఎడిమా విగరస్‌గా రావచ్చు.”

“మూడు... పల్మోనరీ ఎంబాలిజమ్... గడ్డకట్టిన రక్తం ముక్క ఊపిరితిత్తులకి రక్తాన్ని ప్రసారం చేసే పల్మోననరీ ఆర్టరీకి అడ్డం పడడం వల్ల గుండె సడెన్‌గా ఆగిపోవచ్చు.” అన్నీ జాగర్తలు తీసుకుంటున్నాము.

ఆలోచనల్లో వున్న స్వాతిని కదిపి,

“యు డోంట్ వర్రీ... ఇవన్నీ మీకు తెలుసనే అనుకుంటాన్నాను. బట్ వుయార్ హోప్‌ఫుల్...” అని వెళ్ళిపోయింది.

తేరుకుని ఆమె నెందుకు అడిగానా అని బాధ పడింది స్వాతి.

మేరీ నర్స్ వచ్చింది.

“ఈరోజు మీ వారు కోపంగాను, విసుగ్గాను, దిగులుగాను వున్నారు. అందువల్ల చేసేవాళ్ళకు చాలా ఇబ్బందిగా వుంటుంది” అంది.

“సారీ సిస్టర్... ఆయన్ని దయతో అర్థం చేసుకోండి కోపగించుకోవద్దు.” అంది.

“నా... నా... మేం కోప్పడం లేదు. ఒక్కోసారి బాధను అణచుకోడం కన్నా బయటపడితేనే మాకు చాలా తేలిగ్గా వుంటుంది అంది.”

“ఎవర్నైనా ఏమైనా అన్నారా?”

“లేదు... లేదు... ప్రతిదీ తరచి తరచి అడగడం అది చేశారా? ఇది చేశారా? మరచి పోయారేమో! వ్రాసిపెట్టుకోండి... ఇలాటివి. బహుశా అది మేమంతా శ్రద్ధ తీసుకుంటు న్నామా లేదా అని పరీక్ష చేయడం కావచ్చు.”

“నేనొకసారి ఆయన్తో మాట్లాడాలి.”



“ఓ... యస్... దానికేముంది...”

తను వెళ్ళే సరికి నర్స్‌తో ఏదో చెబుతున్నాడు. స్వాతిని చూసి నవ్వుతూ, “హలో... డియర్.. ఏంలేదు... చెక్ చేసుకుంటున్నాను నా ప్రాణనాడులన్నీ సక్రమంగా వున్నాయా లేదో అని. ఇందులో ఏ ఒకటి సరిగా లేకపోయినా నేను అవుట్...” అన్నాడు.

అతని ప్రవర్తన మార్చుకోమని చెప్పడానికి ధైర్యం చాల్లేదు స్వాతికి.

చేస్తున్న వాళ్ళను, బాగా చూస్తున్న వాళ్ళను అనవసరమైన ప్రశ్నలు వేస్తే విసుగు, అసంతృప్తి కలిగిస్తాయి. ఏ కొందరో అర్థం చేసుకోగలరు పేషెంటు పరిస్థితిని.

వారం రోజులు గడచిపోయాయి.

ఇంకా “హిట్‌లిస్ట్” నుంచి పేరు తీసేయలేదు కండిషన్ క్రిటికల్ అనే వుంది. హోప్‌ఫుల్ అని అంటున్నారు. బి.పి. స్థిరపడలేదు. డోపడ్రెక్స్ ఇస్తూనే వున్నారు. ఈ రోజు స్పీడ్ కాస్త తగ్గించారు. బి.పి. స్థిరంగా వుందో లేదో చూసేందుకు.

డాక్టర్ భక్తను అడిగింది స్వాతి.

“ఈడ్రిప్ ఇంకా ఎంతకాలం ఇవ్వాల్సొస్తుంది? ఆయన గుండె తట్టుకోగలదా?”

“వేరే మార్గం లేదు. అదిలేకపోతే అతను జీవించడు. ఇస్తే గుండెకు శ్రమ ఎక్కువవు తుంది. అయినా బి.పి. స్థిరంగా వుండేంతవరకూ తప్పదు. కానీ ఈరోజు నుంచీ తగ్గించాలనుకుంటున్నాము.”

కొంచెం సేపు ఇస్తూ... తగ్గిస్తూ... బి.పి. స్థిరంగా వుంటుందా! లేదా! అని పరిశీలిస్తూ మరో రెండు రోజుల్లో పూర్తిగా తీసివేశారు.

ఆరోజు స్వాతి వెళ్ళేసరికి డాక్టర్‌శ్రీని

“సీ... జైలు నుంచి విడుదలయ్యాను నేను.”

“ఐ... యామ్... ఫ్రీ” చేతులు పైకెత్తి చూపుతూ నవ్వాడు.

దగ్గరకు వెళ్ళికూర్చుంది స్వాతి.

“ఈ సి.సి.యు నుంచి ఎప్పుడెప్పుడు బయట పడుదామా అనివుంది” ఏదో ఆలోచిస్తూ అన్నాడు.

“ఎందుకండి...”

“ఎందుకంటావేమిటి... నాకళ్ళముందే ఈ పది రోజుల్లో ముగ్గురికి టికెట్ ఇచ్చేశారు.”

“భయంగా వుదా!”

“భయంకాదు. భయమనీ అనుకోను. ఇక్కడి డాక్టర్ల పరుగులు... చర్చలు చూస్తూంటే.. లేచి నేనూ వాళ్ళలో కలసి వైద్యం చేయాలని వుంది. నా అశక్తత నన్ను కృంగతీస్తోంది.” అన్నాడు బాధగా.



gudachari.com

నిజమే... అతని లోని డాక్టర్ ఏదో చేయాలని ఉబలాట పడిపోతున్నాడు

"పిల్లలేరీ...?"

"పంపించివేశాను. ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గరకొచ్చాయి కదా. వాళ్ళకు."

"దిగులు పెట్టుకున్నారా?"

"లేదండీ.. మీ పిల్లలు కదా! ధైర్యంగా వున్నారు."

వాళ్ళ ఇంటికి పంపడం చాలా కష్టమైంది. ఎన్నో విధాల నచ్చచెప్పి, త్వరగా వచ్చేస్తాము. రోజూ ఫోన్ చేస్తాము అని చెప్పి పంపింది తను. స్వాతి నాన్న వాళ్ళు మాత్రం వుండిపోయారు తోడుగా.

అంచలంచలుగా మనిషిని చేశారు అతన్ని.

మొదటిరెండు రోజులు కాళ్ళు వేలాడేసి వెనక్కువాలకుండా దిండ్లు పెట్టారు. తర్వాత దిండ్లు తీసేసి సపోర్ట్ లేకుండా చేశారు... ప్రస్తుతం నిలబడ గల్గుతున్నాడు.

బి.పి. తొంభై... అరవైకి పెరిగింది.

డాక్టర్ భక్తితో చెప్పింది స్వాతి, "రూం మార్చితే బాగుంటుందని."

"హిజ్ కండిషన్ ఈజ్ స్టేబిల్ నౌ... మళ్ళీ అటువంటి ప్రమాదం రాదనుకుంటాను. బట్ దిస్ మాన్... నేను మరచిపోలేను అతన్నుంచి మనిషిగా, డాక్టరుగా కూడా నేర్చుకోవాల్సిందెంతో వుంది. నెవర్ లూజ్ హోప్... మనోధైర్యంతో ఎంతటి ప్రమాదాన్నైనా అధిగమించవచ్చు. అని నిరూపించాడు. నిజంగా... అద్భుతమైన వ్యక్తి." పొగుడుతూ అన్నాడు.

వీల్ ఛెయిర్‌లో గదికి తీసుకుపోతూ వుంటే ఒక నర్స్ వచ్చి స్వాతితో అంది. "చాలా అదృష్టవంతులు మీరు... ఆ రాత్రి మీవారికి బాగులేనపుడు వార్డులో వున్నాను నేను. వాళ్ళు హడావిడి చూసి పేషెంటు చనిపోయాడనే అనుకున్నాను. తర్వాత కూడా అదే చెప్పారు. బట్ టుడే హి ఈజ్ విత్ అజ్... ఆల్‌రైట్.. నాకు చాలా సంతోషంగా వుంది."

తర్వాత తెలిసింది. ఆ రోజు డ్యూటీలో వున్న డాక్టర్ మీద డాక్టర్‌రెడ్డి విరుచుకు పడుతుంటే తెలుసుకుని, అతని నిర్లక్ష్యానికి హాస్పిటల్ వాళ్ళు సస్పెండ్ చేశారట అతన్ని. ఏం లాభం... తప్పు తెలుసుకుని మళ్ళీ చేయకుంటే ఫరవాలేదు. తన తప్పు లేదని కావాలనే చేశారని ద్వేషం పెంచుకుంటే నష్టపోయేది అతనే అనుకున్నది స్వాతి.

గదికి రాగానే యూరినల్స్‌కి పోవాలన్నాడు. యూరినల్స్ గిన్నె కోసం చూస్తే కనిపించలేదు స్వాతికి. తొందరచేశాడు. నర్స్‌తో చెప్పింది. తెస్తాను అని వెళ్ళింది. ఈలోపుగా పడక తడిపేశాడు. బెడ్‌షీట్ మార్చమని చెప్పింది నర్స్‌తో. సరేనని వెళ్ళింది. ఆ తిరి రాలేదు. అతనలాగే వున్నాడు లేవలేదు. ఆమెకు జరిపేందుకు వీలుకాలేదు. చెమ్మకు శరీరమంతా మంటాగా వుందని చిరాకు... గంటపైగా గడిచింది ఎవ్వరూ రాలేదు.



"ఏవిటి నిర్లక్ష్యం" చాలాకోపం వచ్చింది స్వాతికి. నేరుగా నర్సస్ రూంకి వెళ్ళింది. ట్రెయినీ నర్సు పుస్తకం చదువుతుంది.

"నర్సులెక్కడ అరిచింది." ఆ అమ్మాయి భయంతో చెప్పింది. "అంతా కాన్ఫరెన్స్‌లో వున్నారని." వెళ్ళిపిలవమన్నది.

"వాళ్ళు కోప్పడుతారండి..."

"డాక్టర్ స్వాతి వెళ్ళమందని చెప్పు... పో..." అన్నది కోపంగా

తటపాయిస్తూ వెళ్ళి ఎదురుగా వున్న ఒక గది తలుపులు తట్టింది. తలుపులు తీసి ఎవరో, "డిస్టర్బ్ చేయద్దని చెప్పలేదు... సస్పెండ్ చేస్తాను నిన్ను..." కస్సుమంది.

ఆ అమ్మాయి.. బిత్తరపోయి నోరు వెళ్ళబెట్టి స్వాతి వైపు చూసింది.

స్వాతికి కోపం తారా స్థాయి నందుకుంది.

వెళ్ళి, "వాట్ కాన్ఫరెన్స్ యు ఆర్ ఇన్... వెన్ ది పేషెంట్ ఈజ్ సఫరింగ్" గట్టిగా అరిచింది.

"మేం ఒకరిదగ్గర చెప్పించుకొనే స్థితిలో లేం. మా డ్యూటీ మేం చేస్తున్నాం."అంది విసుగ్గా నర్సు.

"ఏం చేస్తున్నారు డ్యూటీ... చెప్పి గంటైంది. ఎవరూ పట్టించుకోలేదు. అదే సీరియస్ పేషెంటు అయి వుంటే చచ్చిఊరుకుంటాడు. అదేనా మీరు చేస్తున్న డ్యూటీ.."

"మేమెంత చేసినా మీరనే మాటలవే లెండి. చేసిందంతా మరచిపోయి శాపనార్థాలు పెడతారు" వ్యంగ్యంగా అంది.

"నువ్వు నీ డ్యూటీ చేస్తున్నావు. పేషెంట్ల బంధువుల మెప్పు ఆశించడం తప్పు."

"మేమూ మనుష్యులమేనండీ"

"కాదు. నువ్వు నర్స్‌వి. నర్సంటే అర్థం తెలుసానీకు, అహంకారం, ఈర్ష్యాద్వేషాలు ప్రక్కనపెట్టి నిస్వార్థంగా సేవచేయడం, ఫలితాన్నాశించి కాదు."

"మాకు తెలుసు మా డ్యూటీ."

"మళ్ళీ అదే మాట. తెలుసుంటే ఇన్ని మాట్లాడవు. పిలుస్తానే వచ్చి సారీ చెప్పి నీ విధి నిర్వర్తించేదానివి. మీ చర్యలకి సిగ్గుపడాలి మీరు."

నర్సు ముఖం అవమానంతో ఎర్రబడిపోయింది.

ఆరోజు నుండి స్పెషల్ డ్యూటీ నర్స్‌ను వేశారు.

తన పరిస్థితి గురించి బాగా తెలిసిన నర్స్‌లను మాత్రమే వుంచుకునే వాడు డాక్టర్‌శ్రీని. వాళ్ళని తన ఆరోగ్య పరిస్థితి గురించి తరచి తరచి ప్రశ్నించేవాడు. అంటే తనను కంటికి రెప్పలా ప్రతి క్షణం చూసుకుంటూరనే నమ్మకం కలిగించాలి అతనికి.



gudachari.com

మూడు వారాలు గడిచిపోయాయి.

కొంతవరకూ కోలుకున్నాడు. శరీరమంతా మసాజ్... ఫిజియోథైరఫీ చేస్తున్నారు. దీర్ఘకాలం వల్ల వచ్చే బెడ్‌సోర్స్ రాకుండా శరీరమంతా కడుగుతున్నారు. ఆక్సిజన్ తీసివేశారు. తన భోజనం తనే తీసుకుంటున్నాడు. అయినా ఇది శాశ్వతమా... ఏక్షణమైనా ప్రమాదం రావచ్చు... ఆ ఆలోచనే అనుక్షణం కృంగతీస్తోంది స్వాతిని. అతన్ని చూస్తే ధైర్యం మొక ప్రక్క, గుండెను తలచుకొంటే భయం మరోవైపు....?

ఒకరోజు అతను చాలా దిగులుగా ఉన్నట్లనిపించింది స్వాతికి. ఆమెను చూసి నవ్వకనే తలదించుకున్నాడు. స్వాతి గుండె కలుక్కుమంది.

దగ్గరగా కూర్చుని తల నిమురుతూ, "ఏమండీ... అలా వున్నారేం... ఏమైనా జరిగిందా...?" అని అడిగింది అనునయంగా

"... తరచూ గతం గుర్తొచ్చి దిగులుగా... నిరాశగావుంది. ఎంతమంది బైపాస్ సర్జరీలు చేయించుకుని సంతోషంగా వుండడం లేదు... నాకు మాత్రమే ఇలా ఎందుకయ్యిందో! ఎంతకాలం ఇలా బ్రతగ్గలను.... ఏ ఆశతో జీవితం మీద అనురక్తి పెంచుకోగలను... భవిష్యత్తు ఏవిటో అర్థం కావడం లేదు. ఆలోచించే కొలదీ ఆశ అణగారిపోతోంది. జీవితం అంటే రోత పుడుతుంది. చావు అతి దగ్గరగా వుందని తెలిసీ జీవించడం చాలా దుర్లభంగా వుంది."

"మీరలా ఆలోచిస్తే ఎలాగండీ... మిరకిల్స్ జరుగుతూ వుంటాయి ప్రపంచంలో."

"అవును... ఇప్పుడు నేను నీతో మాట్లాడగలగడమే ఒక అద్భుతమైన విషయం. ఇది డాక్టర్ల మహత్యం... అన్నింటికన్నా నన్ను బాధించే విషయం ఏవిటంటే ఒక చిన్న తప్పు మానవ జీవితాన్ని ఎలా నాశనం చేస్తుందో కదా! అసలు మొట్టమొదట నాకు హార్ట్ అటాక్ వచ్చినపుడు నా గుండె అంతా చెడిపోలేదు, నా గుండె నాళాలు తప్ప. మరి ఇప్పుడు.. నాగుండె అంతా చెడిపోయిందంటున్నారు."

"లేదండీ.. మొదటిసారి మీకు జబ్బుచేసినపుడు మీ గుండె యాన్టీరియర్ వాల్ అంతా దెబ్బతింది."

"ఎవరు చెప్పారు నీకు!!" ఆశ్చర్యంగా అడిగాడు.

"డాక్టర్ రెడ్డి... అప్పుడు తీసిన ఇ.సి.జి. చూపించి చెప్పారు."

"పోనీ అలాగే అనుకుందాం... సర్జరీలో మళ్ళీ హార్ట్ అటాక్ రావడం... అది కూడా డాక్టర్ల పొరపాటు కాదని సర్దుకోవచ్చు. ఎందుకంటే అలాటివి అనుకోకుండా జరుగుతాయి కనుక. కానీ నా జ్ఞాపకశక్తి...?! ఎందువల్ల నా జ్ఞాపక శక్తి తగ్గిపోయింది...? ఆపరేషన్ సమయంలో ఏదో జరిగింది. అది సర్జన్ పొరపాటు అయినా కావచ్చు... లేక అనెస్థీషియన్ పొరపాటు కావచ్చు.... లేదా మరేదో యంత్రంలోని పొరపాటో... ఏమైనా నా పరిస్థితి



మీద, నా జబ్బుమీద నాకే అసహ్యం వేస్తోంది. కోపం... కసి... నా జబ్బును జయించాలని.. అందువల్లే ఇంతకాలం బ్రతికి వున్నానేమో! అంతేగానీ డాక్టర్లు సరిగా చూడలేదనో, వాళ్ళ సామర్థ్యాన్ని శంకించడమో చేయను. వాళ్ళే గనక అసమర్థులైవుంటే నీ నొసటి కుంకుమ ఎప్పుడో చెరిగి పోయి వుండేది. వాళ్ళు నిపుణులని తెలుసునాకు, వాళ్ళనిస్వార్థత తెలుసు... వాళ్ళతప్పులు కూడా తెలుసు. అందుకే నేనిప్పుడు వాళ్ళకి కొరకరాని కొయ్య. నన్ను చూసినపుడల్లా వారి అసమర్థత పొరపాటు దహించి వేస్తుంటాయి వాళ్ళని. నన్నెపుడో హిట్‌లిస్ట్‌లో వేసేశారు వాళ్ళు. అయినా బ్రతికే వున్నాను నేను. ఏశక్తి బ్రతికించిందో నన్ను వాళ్ళకే తెలియదు. "

"మీరు మంచివారు. ధైర్యవంతులు గనుక అదృష్టం ఆదుకుంది."

"దానికి నేను ఒప్పుకోను. మంచితనం... అదృష్టమే వుండి వుంటే అసలు ఈ జబ్బే వచ్చి వుండేది కాదు."

అతని ధోరణి ఆలోచనల్లోకి తీసుకపోయాయి స్వాతిని. ఎంతకాలం బ్రతకుతారో... తెలియదు... ఎప్పుడేం జరుగుతుందో తెలియదు... ప్రతిక్షణం భయంతో చచ్చేకన్నా పూర్తిగా ఛీ... ఛీ... ఆ ఆలోచనకు తిట్టుకుంది. డాక్టర్లతో ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి మాట్లాడాలి.... అని నిర్ణయించుకుంది.

"డాక్టర్లతో మాట్లాడుతావా?"

ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చింది.

"ఏవిటండీ...?"

"నేనెంత కాలం బ్రతుకుతానో డాక్టర్లతో మాట్లాడుతావా?"

ఈసారి ఎలాంటి మానసిక ఉద్రేకానికి లోనుకాలేదు ఆ మాటలకు స్వాతి. కానీ యింత నిర్మోహమాటంగా మాట్లాడుతున్న భర్తను చూసి ఆశ్చర్యపోయింది.

"ఏం ఆశ్చర్యపోతున్నావా?"

"లేదండీ... ఆలోచిస్తున్నాను."

"ఆలోచించేందుకేం వుంది... నా పరిస్థితి నాకు బాగా తెలుసు... ఒకటే మార్గం... ఎలాగూ చావు తప్పదు. హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ వల్ల బ్రతికే అవకాశం వుండొచ్చు."

స్వాతి ఏం మాట్లాడలేదు. కట్టలు తెంచుకు ప్రవహిస్తున్న కన్నీరును ఆపుకోవడం తప్ప. దుఃఖంతో వచ్చినవని అనుకోలేదు స్వాతి.

డాక్టర్ శంకర్ రూమ్‌లో డాక్టర్‌రెడ్డి, అతను, స్వాతి కూర్చున్నారు. ఎవరు ఏం మాట్లాడాలో? ముందు ఎవరు మాట్లాడుతారా అని ఒకర్నొకరు చూస్తూ కూర్చున్నారు.

"ఆయన ఆరోగ్య పరిస్థితి ఏమిటి? స్వాతీ అడిగింది."



gudachari.com

ఎవర్ని ఉద్దేశించో అర్థంకాక ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తర్వాత డాక్టర్‌రెడ్డి గొంతు సర్దుకుని.

"వెల్... హి ఈజ్ డూయింగ్ వెల్." అన్నాడు భుజాలు ఎగురవేస్తూ.

"ఆ సంగతి నాకూ తెలుసు... ప్రోగ్రెస్ ఏమిటి? ఇంకెలాంటి కాంప్లికేషన్లు రావా?"

"ఆ సంగతి మనమెలా చెప్పగలం?" ఇబ్బందిగా నవ్వుతూ అన్నాడు డాక్టర్ శంకర్.

"పోనీ... ఎంతకాలం బ్రతుకుతారో చెప్పగలరా?"

"అదీ చెప్పలేం...."

"నాకోసం ఏదీ దాచాల్సిన అవసరం లేదు. ఏం వినడానికైనా నేను సిద్ధంగా వున్నాను."

"నీకోసం కాదు ఆసంగతి మాకూ తెలీయకనే. అసలెవ్వరూ అంత షాక్‌లోకి వెళ్ళి బ్రతికి బయటపడరు. కానీ ఇతను బ్రతికాడు."

"పోనీ పది సంవత్సరాలు బ్రతకొచ్చా?"

"అది కావచ్చు... ఒక సంవత్సరం... అంతకంటే!" తడబడ్డాయి అతని మాటలు.

"ఈ సంవత్సరం లోపల పల్‌మోనరీ ఎడిమా మళ్ళీ వచ్చే అవకాశం వుందా?"

"ఉంది."

"అంటే ఎప్పుడైనా ఇటువంటి ప్రమాదంలో ప్రాణం పోవచ్చు. అయితే ఎప్పుడో తెలీదు. సంవత్సరంలోగా జరగచ్చు. అవునా?"

సమాధానం ఏం చెప్పాలో తెలీక ఇద్దరూ మౌనం వహించారు.

"పోనీండి... ఆయనకి ఇప్పుడు హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయవచ్చా?"

"భూతాన్ని చూసినట్లు ఆశ్చర్యంగా స్వాతినే చూస్తూండిపోయారు. స్వాతి కల్పించుకుని మళ్ళీ అంది."

"ఇప్పుడు ఆయన ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు తట్టుకోగలడా?"

"ఇంపాజిబుల్... అతని జనరల్ కండీషన్ చాలా నిరుత్సాహకరంగా వుంది."

"జనరల్ కండీషన్ బాగైన తర్వాత?"

"అప్పటి సంగతా... అప్పుడు ఆలోచిస్తాం... అయినా నాకు మనస్ఫూర్తిగా ఇష్టం లేదు... ఎందుకంటే ఇది మొదటిదిగా చేయడం... అంతకంటే మెడికల్ లైన్‌లోనే ట్రీట్ చేస్తే బావుంటుందేమో! ప్రతిసారి అందర్ని ఆశ్చర్యపరుస్తూన్నాడు. ఇలాగే మరో ఇరవై సంవత్సరాలు హాయిగా బ్రతికినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు."

"అంటే క్షణం క్షణం చావాలంటారా! చావు కోసం తలుపు తీసుకుని ఎదుర్చూస్తుండమంటారా? ఆ టెన్షన్‌తో మేం బ్రతగ్గలమంటారా??"

"అది కాదు నా ఉద్దేశ్యం... ట్రాన్స్‌ప్లాంటేషన్ ఇండియాలో ఇంతవరకూ ఎవరూ చేయలేదు. డాక్టర్‌సాగర్ చేయలేరని కాదు. చేయొచ్చు. కానీ అతని జనరల్ కండీషన్..."



"మెరుగైన తర్వాతే కదా చేయమంటోంది."

"ఆపరేషన్ జరిగినా చాలా ప్రాబ్లమ్స్ ఉన్నాయి స్వాతీ! పేషెంటును విషక్రిములు లేని వాతావరణం (స్టెరయిల్)లో కొన్ని నెలలు ఉంచాలి. శరీరం క్రొత్త గుండెను స్వీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు... అప్పుడు చనిపోవడమేకదా... డబ్బు... ఎంతవుతుందో తెలీయదు..."

"పోనీ ఏ కాంప్లికేషనూ లేకుండా బ్రతికి ఉండేమార్గం చెప్పండి."

వాళ్ళిద్దర్నించి జవాబు లేదు.

"భర్తకు అత్యంత ప్రమాదభరితమైన ఆపరేషన్ చేయమని భార్య అర్థిస్తోందంటే... ఆమె పరిస్థితేమిటో అర్థం చేసికోండి... ఆయన ఇన్ని ప్రమాదాల్ని జయించారు. ఈసారి కూడా విజయం ఆయన్నే వరిస్తుందనే నమ్మకం నాకుంది. ఇప్పటికే మీకెంతో ఋణపడి వున్నాను నేను. ఇది కూడా మీరే నిర్వర్తించి నాభర్తను నాకివ్వండి..." అని లేచి చరచరా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది స్వాతి.

వాళ్ళిద్దరూ ఆమె వెళ్ళిన వైపే చూస్తుండిపోయారు.

- - -

అన్నింటి కన్నా విలువైనది కాలం. కానీ నిన్న అనేది ఒకటి జరిగిపోయిందని, రేపు అనేదొకటి వస్తుందని గ్రహించేలోగా నిన్న, రేపు రెండూ గడచిపోతాయి. ఇక వాటి విలువ తెలిసేదేమిటి..? నిన్నలో లేనిదేమిటి? రేపులో మార్పు ఏముంది?? అంతా అగమ్యగోచరంగా వుంది స్వాతి జీవితం...

భవిష్యత్ గురించి ఆలోచించే శక్తీ, ఓపికా లేవు స్వాతిలో. ఈ క్షణం గురించిన ధ్యాసే గానీ, మరోక్షణం ఉందనే ఆలోచనే కల్గడం లేదు. కలలు ఎవరికైనా నిజం అవుతాయా? కావు... కానీ తను నిజం చేసుకోవాలనుకుంటుంది.

... నిజమే... గుండె మార్పిడి... ఒక కలే... అందునా భారతదేశంలో... ఆ అద్భుతమైన కలను నిజం చేసుకోవాలనుకుంది. తనది మూర్ఖత్వం కావచ్చు. ఆత్మవిశ్వాసం కావచ్చు.

నాలుగు నెలలు కాలగర్భంలో కలసి పోయాయి. పిల్లల పరీక్షలయిపోయి ఫలితాలకై ఎదుర్చూస్తున్నారు.

శారీరకంగా డాక్టర్ శ్రీని బాగా కోలుకున్నాడు. వరండాలో కాసేపు ఎవరి నిమిత్తం లేకుండా తిరగ్గలుగుతున్నాడు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోతున్నారు. బాధ, విసుగు ముఖంలో కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. యిద్దరూ. వాళ్ళ మధ్య మాటలు కూడా చాలా తగ్గిపోయాయి. నిరుత్సాహం నిస్పృహ పెనవేసుకుంటున్నా సాధ్యమైనంత మామూలుగా ధైర్యంగా ఉన్నట్లు ప్రవర్తిస్తుంది స్వాతి.

gudachari.com

ఒకరోజు అతని ఎదురుగా కూర్చుని ఏదో పుస్తకం చదువుతుంది.

"స్వాతీ!"

తలెత్తి చూసింది అతని వైపు

"నీకు... నీకు నిజంగా నమ్మకం ఉందా...

ఆపరేషన్ జరిగి సజీవంగా నన్ను ఇంటికి తీసుకవెళ్ళగలవని."

"ప్రవాహంలో కొట్టుకుపోయేవాడు, గడ్డిపరక దొరికినా దాన్ని ఆధారం చేసికొని ఒడ్డుకు చేరుకోవాలనుకుంటాడు. స్పృహలో ఉన్నంతవరకూ ఏదో విధంగా ఎదురీది బ్రతకాలనే ప్రయత్నిస్తాడు."

"మృత్యువు తప్పదని తెలిసీ ఆరాటపడి ప్రయోజనమేమిటి?"

"నేను ఆరాటపడటం లేదు ఆచరిస్తున్నాను. అలా అని ఖర్మ మీద భారం వేసి చూస్తూ మిమ్మల్ని పోగొట్టుకోమంటారా?"

"అలా అని నేనల్లేదు. కానీ మనం మూర్ఖంగా ఆలోచిస్తున్నామేమో... సరిపడే గుండె లభ్యం కావాలి. అందుకోసం ఎంత కాలం యిలా ఇక్కడే వుంటం...? పిల్లల సంగతేమిటి? వాళ్ళ భవిష్యత్ మాటేమిటి?? ఎంత డబ్బుని ఖర్చుపెట్టగలం??"

"మీరు అవన్నీ ఆలోచించకండి. కొంత మనం పెట్టుకుంటే మిగతా డాక్టర్ రెడ్డి, డాక్టర్ శంకర్‌లు చూస్తామన్నారు. హాస్పిటల్ సైతం కొంత భరిస్తుందట. మిగతావి మాత్రం..."

"అంటే ఎంత?"

"ఒక నాలుగైదు లక్షలు..." అని అబద్ధం చెప్పింది.

"అంత డబ్బు..." ఇంతలో నర్స్ వచ్చి ఎవరో చూడ్డానికి వచ్చారని చెప్పింది. రమ్మని చెప్పింది.

గదిలో అడుగు పెడ్తున్న వ్యక్తిని చూసి స్వాతి గుండెల్లో రాయి పడినంతపనైంది.

"ఆరే... లక్ష్మణ్... నువ్వా... చాలా రోజులైంది నిన్ను చూసి." అంటూ పలుకరించాడు డాక్టర్‌శ్రీని.

"మీ ఆరోగ్యం ఎలా ఉందో చూసిపోదామనీ..." కాసేపాగి నసుగుతూ "మీ సంతకాలు కావాలి కాగితాల మీద." అని స్వాతి వైపు చూశాడు అతనూ

"నాదా... ఎందుకు?"

స్వాతి చివాలున లేచి

"అసలు మీరెందుకొచ్చారిక్కడికి... రావొద్దన్నాను కదా?" కోపంతో అంది.

"మీరు అన్నారు సరే... డబ్బు తీసుకుని అప్పుడే ఆర్నెల్లయింది. అయ్యగారి సంతకం లేకపోతే... అది డబ్బు కదమ్మా." అంటూ కాగితాలు తీశాడు.



గబుకున్న అవి లాక్కుని

"తర్వాత నేను మాట్లాడుతాను. మీరు వెళ్ళిపోండి ఇక్కడ్నించి" విసురుగా అంది.

"స్వాతీ! ఏవిటిది... అతనెంతో అభిమానంతో చూడ్డానికి వస్తే... ఏదీ ఆకాగితాలిలా ఇవ్వు..."

"వొద్దండీ... అందులో ఏమీ లేదు..."

"ఏమీ లేకపోవడం ఏవిటి... నాకంతా తెలుసు అతని దగ్గర డబ్బులు తీసుకుని వుంటావు... దానికెందుకంత ఇదైపోతావు.... ఇలా ఇవ్వు..."

తీసుకుని సంతకాలు చేసి ఆయన చేతికి ఇస్తూ "అందరూ బావున్నారా?" నవ్వుతూ అడిగాడు.

"అంతా బావున్నారు సార్." అని నమస్కారం చేసి వెళ్ళిపోయాడు. కొంచెం తన మంచి తనాన్ని గురించి ఎక్కువచెప్పి. ఎంత కుటిలత్వం... ఈ మనుష్యుల్లో ... ఎదుటి వారి మంచి తనాన్ని ఎంత తెలివిగా స్వార్థానికి ఉపయోగించుకుంటారు...?! ఆలోచిస్తూ ఉండిపోయింది స్వాతి.

అతను ప్రక్క సరిచేసుకొని పడుకుంటూ అన్నాడు.

"మనం రేపు వెళ్ళిపోదాం."

"ఎక్కడికి?"

"ఇంటికి..."

"ఎందుకూ?"

"ఇక్కడ ఉండి చేసేదేం లేదు గనుక."

"వీల్లేదు. మీ ఆరోగ్యం బాగయ్యేంత వరకు..."

"ఎప్పుడు ఇక బాగయ్యేది...? ఎంత కాలమిలా ఇక్కడ? కనీసం పిల్లలు, నావాళ్ళ సమక్షంలోనైనా తృప్తిగా ఉండనివ్వు"

కట్టలు తెంచుకొని వస్తున్న స్వాతి ఏడుపుకు తలుపు చప్పుడు అడ్డుగోడ వేసింది.

"హలో... డాక్టర్‌శ్రీని..." డాక్టర్‌రెడ్డి లోపలకి వచ్చారు.

క్షణకాలం వాళ్ళిద్దరినీ చూసి,

"ఎనీథింగ్ రాంగ్... నేను మళ్ళీ వస్తాను." వెళ్ళబోయాడు.

"నొ... నో... డాక్టర్... వెల్‌కమ్... నేను రేపు వెళ్ళిపోదామనుకుంటున్నాను."

డాక్టర్ రెడ్డి స్వాతి వైపు చూశాడు.

స్వాతి కళ్ళు తుడుచుకొని తలదించుకుంది.

"ఎందుకంత సడెన్‌గా నిర్ణయం తీసుకున్నారు? ప్రత్యేకంగా ఏదైనా కారణం ఉందా?"



gudachari.com

"అదేం లేదు... పిల్లల్ని చూసి చాలా రోజులైంది. అందులోనూ వాళ్ళ రిజల్ట్స్ వచ్చే సమయం. అడ్మిషన్‌లు అవీ చూడాలి కదా...!" డాక్టర్ రెడ్డి చూపుల్ని తప్పించుకుంటూ జవాబిచ్చాడు డాక్టర్ శ్రీని.

"వాటికి మీరు వెళ్ళాల్సిన అవసరం ఏవిటి? డాక్టర్ స్వాతి వెళ్తుంది."

"లేదండీ... నేను వెళ్ళాలి."

"డాక్టర్ డోంట్ బీ అడమెంట్... మరలా ఊరెళ్లి మీ ఆరోగ్యం...."

"ఆర్‌యుష్యూర్... దట్ యు విల్ గ్యారంటీ మై లైఫ్..."

"డాక్టర్ శ్రీని... మీరు డాక్టర్ల అసలు విధి ఏమిటో మరచిపోతున్నారు. వైద్యం చేసేది బాధ నుంచి, మానసిక వ్యధ నుంచి తప్పించి ఒక నిలకడైన జీవితాన్ని యివ్వటమే, వాళ్ళ ధ్యేయం." గంభీరంగా అన్నాడు.

"ఈవిధంగా బ్రతకడం మరీ నరకం," కసిగా పిడికిళ్ళు బిగించి బెడ్‌మీద కొడ్తూ అన్నాడు. డాక్టర్‌శ్రీని. తన నిస్సహాయత మీద. తమ పరిస్థితుల మీద విసుగుతో.

గట్టిగా నిట్టూర్పు వదుల్తూ... "డాక్టర్ శ్రీని... సమస్య ఏమిటి..." అనునయంగా అడిగారు బెడ్‌మీద కూర్చుని.

"నేను బ్రతికి ఉన్నాను. అదే..." అతని కళ్ళలో నీటి పొర...

"నేను మీ స్వవిషయంలో జోక్యం చేసుకుంటున్నానుకోకపోతే... అసలు మీ సమస్యే మిటో చెప్పండి..?" స్వాతి వైపు చూసి అన్నాడు డాక్టర్ రెడ్డి.

స్వాతి మౌనంగా ఉండిపోయింది.

"ఓ... కె... మీకు నాతో చెప్పాలని లేనపుడు... నన్ను పరాయివాడుగా భావిస్తున్నప్పుడు... మిమ్మల్ని అడగడం నాదే పొరపాటు... క్షమించండి.. బట్.. మీ శ్రేయోభిలాషిగా మీ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఓ చిన్న కోరిక కోరుతున్నాను... త్వరపడి ఓ నిర్ణయాలూ తీసికోకండి. మనస్సును అదుపులో ఉంచుకొని సమస్యను ఓపెన్ మైండెడ్‌గా ఆలోచించి పరిష్కరించుకోండి...." అంటూ వెనక్కు చూశాడు.

"డాక్టర్!" అన్న పిలుపుతో ఆగి వెనక్కు చూశాడు.

"ఐయామ్ సారీ! నేను చాలా అసహ్యంగా ప్రవర్తించాను."

డాక్టర్ రెడ్డి బెడ్‌ను సమీపించి, "నథింగ్... నథింగ్... నేనలా అనుకోవడం లేదు. ఐ కెన్ అండర్ స్టాండ్..." అన్నారు.

"నేను చాలా అలసిపోయాను డాక్టర్.... ఈ నిరీక్షణ భరించరానిదిగా వుంది. అందుకే కొంతకాలం నా వారి మధ్య గడపాలని ఉంది..."

"అంతేనా?" స్వాతి వైపు. అతని వైపు అనుమానంగా చూశాడు డాక్టర్ రెడ్డి.

జవాబు లేదు.



"వెల్... అదే మీ సమస్య అయితే పరిష్కారం చాలా తేలికే. అలాగాక మరేదైనా అయితే సపోజ్ డబ్బు... చారిటబుల్ ట్రస్ట్‌లకు వ్రాశాము. మంచి రెస్పాన్సు వస్తోంది. హాస్పిటల్ వాళ్ళుకూడా ఇంటరెస్టింగ్‌గా వున్నారు. కావలసిన పరికరాలు సిద్ధంగా ఉన్నాయి. నీకు అన్ని పరీక్షలూ చేసి ఉన్నాం. ఇంక కావలసినదల్లా డోనార్ హార్ట్..." కాసేపు ఆగి గట్టిగా గాలి పీల్చుకుని,

"సరే... మీకు వెళ్ళాలని అంత గట్టిగా కోరిక ఉంటే ఒకసారి వెళ్ళిరావడమే మంచిది. బట్... రిమంబర్... నీకు ఎంతటి మనోధైర్యం ఉందో తెలుసునాకు... దాన్ని మాత్రం ఏ పరిస్థితుల్లోనూ కోల్పోవద్దు..." ఆగి స్వాతి వైపు తిరిగి,

"స్వాతీ! భయపడకమ్మా... నాలుగు నెలల నుంచీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ సంభవించలేదు. ఇకముందూ జరగవనే అనుకుంటాను. కొంతకాలం తనకు ఇష్టమైన వాతావరణంలో గడిపితే, ఆత్మతృప్తికి, సడలిన మనోధైర్యం, మనశ్శాంతి తిరిగి పొందే అవకాశామూ ఉంది."

ఆగి... తిరిగి ప్రారంభించారు.

"వెల్... నేను వెళ్ళి డిస్చార్జ్‌కి ఏర్పాటు చేస్తాను. డబ్బులుంటే కట్టేయండి. లేకుంటే మరలా పంపవచ్చు... ఓకె... డాక్టర్ శ్రీని... నువ్వే గెలిచావు... ఇక ముందు కూడా గెలుపు నీదే కావాలి... ఆ నమ్మకం నాకుంది. హావ్ నైస్ టైమ్ విత్ చిల్డ్రన్... వస్తాను..." అన్నాడు.

వాళ్ళిద్దరూ చేతులెత్తి నీరు నిండిన కళ్ళతో డాక్టర్ రెడ్డికి నమస్కరించారు.

"అరే.. ఏవిటిది... డోంట్ బి సెంట్‌మెంటల్..." అంటూ అటు తిరిగి తనూ కళ్ళు తుడుచుకున్నాడు.

ప్రయాణానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి. ఇంటికి ఫోన్ చేసింది స్వాతి.

ఆతృత... మనసులో ఏదోగా... వికారంగా విచారంగా ఉంది. స్థిమితం లేదు... ఏమిటేవిటో చేస్తుంది స్వాతి. హడావిడి... ఎందుకు...? ఊరికి వెళ్తున్న సంతోషమూ... లేక హాస్పిటల్‌ను వొదలాల్సి వచ్చినందుకు బాధా..? ఏవిటో... ఒకవైపు నిరాశా చిమ్మచీకట్లు... మరోవైపు మినుక్కు మినుక్కు మంటూ ఎక్కడో చిన్న ఆశ... ఎంతకాలం...? ముగింపు ఎప్పుడు...?? జవాబు లేని ప్రశ్నలుగానే మిగిలిపోతాయా ఇవి...

కారు కుదుపుతో ఈలోకంలోకి వచ్చింది స్వాతి.

కాసేపు ఎక్కడ ఉందో అర్థం కాలేదు. స్వాతికి. పరిసరాలను గుర్తుపట్టడానికి ప్రయత్నించింది. అప్పుడే ఊరికి వచ్చేశామా... మరి... ఇది మా ఇల్లు లాగే వుందే... అయితే.. ప్రహరీ గోడ ఎవరు పగుల గొట్టారు.. ఏదో కడ్తున్నారు కూడా.. నాతో చెప్పలేదే... అనుకుంటుండగా



gudachari.com

"వాటీజ్... దిస్... ఏవిటిదంతా?" ఆశ్చర్యంతో అడిగాడు డాక్టర్‌శ్రీని.

జవాబేం చెప్పాలో తెలీక స్వాతి ఇంటివైపు చూస్తుండిపోయింది.

కారు పోర్టికోలో వచ్చి ఆగింది. పిల్లలు పరిగెత్తుకొచ్చారు. వారిని దగ్గరకు తీసికోవడం కూడా మరచి ఇంటి పరిసరాలు చూడసాగింది. ఎవరు చేశారీ పని? ఎందుకు చేశారు? పూలచెట్లు సైతం చాలా వరకూ పీకేశారు. తల్లిలా పెంచి పెద్ద చేసిన చెట్లు ఎవరి కిరాతకానికి బలైనాయి...?! స్వాతికి కోపం కట్టలు తెంచుకొంటుంది. అప్పుడు కనిపించాడు కారు దగ్గరకు వస్తూ లక్ష్మణ్, పరిస్థితి కొంచెం కొంచెం అర్థం కాసాగింది అతన్ని చూసి స్వాతికి.

"ఏవిటిదంతా? నాకేం అర్థం కావడం లేదు." అంటూ తలపట్టుక్కూర్చున్నాడు డాక్టర్‌శ్రీని. లక్ష్మణ్ మీది కోపాన్ని బలవంతంగా ఆపుకొని, "నేనే చెయ్యమన్నాను లెండి వాస్తుకు విరుద్ధంగా ఉందంటేనూ..." అంది స్వాతి.

"వాస్తు... ఎవరు చెప్పారు నీకు? ఎంతో ప్రేమతో పెంచుకున్న పూలచెట్లు ఎలా నాశనం చేయగలిగారు...?"

"ప్లీజ్... మీరు ఎగ్జైట్ కాకండి మీకు ఇష్టం లేకపోతే రేపేదాన్ని కట్టించివేస్తాను. "

"కొట్టించడం... కట్టించడం... బావుంది.. చాలా బావుంది అసలెందుకు చేస్తున్నావిది? ఇంటికివచ్చి మనశ్శాంతిగా ఉందామనుకుంటే.." చిరాకుతో కారులోంచి దిగాడు. స్వాతి చేయి అందించబోయింది. విసురుగా నెట్టేశాడు.

అవును... మీ ఆరోగ్యం బావుంటే మనశ్శాంతి ఉంటుందనేనండీ ఇదంతా... ఇష్టంలేకపోయినా మనసు చంపుకొని తీసుకున్నానీ నిర్ణయం... నన్ను క్షమించండి... మనసులోనే క్షమాపణ కోరింది ఆక్షణానికి.

పిల్లలు ముగ్గురూ వాళ్ళనాన్న దగ్గరకి వెళ్ళారు.

"డాడీ! మా టెన్త్ రిజల్ట్స్ రెండ్రోజుల్లో వొస్తాయట. చాలా బాగా వ్రాశాను డాడీ..." బిందు అంది.

"వెరీ గుడ్... నువ్వెలా వ్రాశావురా దీపూ...."

"అక్కకి నూటికి వొక్కమార్కు తక్కువొస్తుందట ఒహటే ఏడుపు డాడీ" విష్ణు జవాబిచ్చాడు కల్పించుకుని.

"మరి నీకో...?"

"వాడికి జీరో రాంకులో ఫస్టట డాడీ." దెబ్బకు దెబ్బ తీసింది దీపు.

దాంతో వాడిక్కోపం వచ్చి, "నీకే... నూర్లో ఒకటి తీసేస్తే వస్తుందే.... ఆ రాంకు..." అన్నాడు వెక్కిరింపుగా.



"చూడు మమ్మీ... వీడు రోజూ ఇంతే... ఏడిపిస్తున్నాడు." దీపు రిపోర్ట్ చేసింది.

"లేదు మమ్మీ అక్కే రోజూ నన్ను కోడుతుంది."

నువ్వంటే నువ్వంటూ వాదులాడుకోడం మొదలెట్టారు.

"అన్నీ ఇక్కడేనా... ఇంట్లో వెళ్ళి తగవు వేసుకుందాం. నేనిక్కడే వుంటాను కదా!"

"నిజంగానా డాడీ...! ఇక్కడే ఉంటావా?"

"మీకు బాగైపోయిందా డాడీ?" సంతోషంగా అడిగారు పిల్లలు.

"మీరు కాసేపు ఉర్కోండి తర్వాత మాట్లాడుకోవచ్చు." అంటూ లోపలకి దారి తీసింది స్వాతి.

అందరితోనూ మాట్లాడుతూ ఉన్న భర్త ముఖంలోకి కోపం అనుమానం, యివన్నీ గమనిస్తూనే ఉందిస్వాతి.

జరిగిందానికి సంజాయిషీ ఎలా చెప్పుకోవాలో అతన్ని ఎలా సమాధానపరచాలోనని ఆలోచిస్తుంది స్వాతి.

పిల్లల మాటలతో మెలకువ వచ్చింది స్వాతికి. ఆ రాత్రి ఎలాగడిచి పోయిందో తెలియదు ఆమెకు.

అప్పుడే తెల్లవారుతోంది. మామూలుగా వాళ్ళంత ఉదయే నిద్రలేవరు. అయితే వాళ్ళనాన్నతో గడపాలనే ఆతృతకాబోలు ఆయన్ని కూడా లేపుతున్నారు.

స్వాతి లేచి, "నాన్నని కాసేపు పడుకోనివ్వండిరా నిన్న ప్రయాణం చేశారు కదా," అని మందలించిందింది. ఈలోగా అతను లేచాడు.

ఇక ఎడతెరిపి లేకుండా మాటలు ఒకరు మారిస్తే.. ఒకరు...

"మమ్మీ చాలా బాడ్ డాడీ... మనఇల్లు అమ్మేసిందంట..." విష్ణు అన్నాడు. ఏదైతే అతనికి తెలియకూడదనుకుందో ఆ విషయం అతి సాధారణంగా చెప్పేశారు పిల్లలు... ఇప్పుడెలా? ఆ ప్రభావం ఎలా ఉంటుందో.... అని భయపడసాగింది స్వాతి.

అతను స్వాతి వైపు చూసి తిరిగి విష్ణుతో అన్నారు.

"అమ్మేసి మరలా వేరేది కట్టుకుందాం."

"మరి.. మనకు డబ్బులన్ని అయిపోయాయి కదా!?" వాడి అమాయకమైన ప్రశ్న.

తండ్రీ! ఈ పరిస్థితి భరించలేను... పిల్లలు సైతం తమ పరిస్థితి గురించి ఆలోచిస్తున్నారు. వొద్దు... ఎప్పటికీ... ఇటువంటి పరిస్థితి వద్దు.. కుమిలిపోయింది స్వాతి.

వాడ్నింతటితో ఆపడం అవసరం. అందుకే కోపంతో అరచింది "నోర్మూసుకో... నీకెందుకు అవన్నీ."



gudachari.com

"నా... నో... కోప్పడకు. వాడూ పెద్దవాడవుతున్నాడన్నమాట. బాధ్యత వాడికీ అర్థమవుతుంది. డబ్బు విలువ చిన్న వయసులోనే తెలుసుకోడం మంచిదే." అంటూ వాడ్ని దగ్గరకు తీసుకుని.

"చూడు నాన్నా... డబ్బు మరలా మీరంతా బాగా చదివి పెద్దవారై సంపాదిస్తే... మళ్ళీవొస్తుంది. అంతగా అయితే హాస్పిటల్ మీదే మనం ఇల్లు కట్టుకుందాం." అన్నాడు డాక్టర్‌శ్రీని. ఆ మాటలతో స్వాతి మనసు ఒక్కసారిగా తేలికయినట్లు, అలసట తగ్గినట్లు అనిపించింది.

అప్పుడు గుర్తుకొచ్చింది తమకో హాస్పిటలు ఉందని. వెంటనే వెళ్ళి చూసి రావాలనుకుంది స్వాతి.

స్నానాలు, టిఫిన్‌లు అయింతర్వాత బయల్దేరింది స్వాతి.

హాస్పిటల్లో... ఏదో మార్పు... అదేవిటో తెలీడం లేదు.. అయితే అన్నీ ప్రత్యేకంగా కనిపిస్తున్నాయ్. కాంపౌండ్‌లో జనం సంచారం లేదు. గార్డెన్ చిత్తుకాగితాలతో చిందరవందరగా వుంది. చెట్లన్నీ ఎండిపోయి అసహ్యంగా ఉన్నాయి.

ఈ హాస్పిటల్‌లో మనుషులుంటున్నారా అనిపించింది స్వాతికి. వాచ్‌మెన్‌ని కేకేసింది. చాలాసేపటి వరకు రాలేదు.

"ఎక్కడకు వెళ్ళావు...?" గొంతు చించుకొని అరుస్తుంటే...

నసుగుతూ నిలబడ్డ అతని చేతుల్లో ఫ్లాస్క్... సిగరెట్టు ప్యాకెట్టు... ఉన్నాయి.

"ఎవరికవి? డాక్టర్‌కా??"

"కాదమ్మా! స్పెషల్ రూమ్‌లో..." అమ్మగారికి భయపడుతూ జవాబిచ్చాడు. పనిలేనప్పుడు తమకు తెలియకుండా పేషెంట్లకు పనిచెయ్యడం మామూలే వాళ్ళూ చూసి చూడనట్లుగా వుంటారు.

"డాక్టర్‌లు రాలేదా?"

"వచ్చారమ్మా"

"ఎక్కడ? సిస్టర్లెవరూ కనిపించరేం...?"

అతను జవాబిచ్చేలోగా లోపలికి నడిచింది.

స్పెషల్ రూమ్‌లో నుండి నవ్వులు వినిపిస్తున్నాయి. వెళ్ళి తలుపు తట్టింది.

"కమిన్!"

తలుపు నెట్టింది. అక్కడి దృశ్యానికి ప్రమాన్పడిపోయింది స్వాతి.

బెడ్‌మీద జూనియర్ డాక్టర్ పడుకుని సిగరెట్టు త్రాగుతున్నాడు. అతని ప్రక్కన ఒక అందమైన అమ్మాయి కూర్చుని ఉంది. స్వాతిని చూసిన షాక్‌తో అతడు గబుక్కున లేచి



"మా... డమ్... ఎప్పుడొచ్చారు... హాస్పిటల్‌కి అప్పుడే వస్తారనుకోలేదు..." అంటూ గదిలోంచి బయటకు వచ్చాడు.

స్వాతిలో అణువణువు కోపంతో అసహ్యంతో దహించుకుపోయింది "ఎవరీ అమ్మాయి?"

"అవి.. ఆమె... మా కజిన్"

"అయితే హాస్పిటల్‌లో ఎందుకుంది? ఆరోగ్యం బావో లేదా?"

"ఆరోగ్యం... కాదండీ... నిన్ననే నన్ను చూడాలని ఊర్నుండి వచ్చింది."

స్పష్టంగా వ్యక్తమవుతోంది అతని కంఠంలో అబద్ధం... ఏవిటిది..? హాస్పిటల్ ఇలా తయారయ్యింది...?! అత్యంత పవిత్రమైన ఆలయంలా హాస్పిటల్‌కి ఒక్కసారి చిన్న పొరపాటు వల్ల చెడ్డపేరు వస్తే చాలు... అది హాస్పిటల్ భవిష్యత్‌కు అతి ప్రమాదకరం.. అటువంటి అవకాశం రాకుండా ఎంతో జాగ్రత్తగా ప్రవర్తించామే మరేమిటిది... సంవత్సరాల కృషి ఫలితంగా నిలబెట్టిన హాస్పిటల్ పేరు ప్రఖ్యాతలు నిలువునా సమాధి చేసే కార్యకలాపాలు సాగిస్తున్నారు వీళ్ళు...

మూగబోయిన హృదయంతో స్వాతి గదిలోకి వెళ్ళి కూర్చుని వాచ్‌మెన్ పెద్ద నర్సుని పిలవమంది.

"నిలిపేసి నెలరోజులైందమ్మా...."

"అదేవిటి..?! మాతో మాటైనా చెప్పకుండా నిలిచిపోయిందా..." నమ్మకమైన నర్స్ ఆమె. తనపనిలో చాకచక్యంతో పాటు మామీద గౌరవం కలది. ఎందుకలా చేసింది... అదే అడిగిందతన్ని ఆమె నిలిచిపోలేదట. డాక్టర్లే నిలిపేశారట అని చెప్పాడు.

కోపంతో జూనియర్ డాక్టర్ని నిలదీసింది.

"వాటీజ్ దిస్... డాక్టర్?"

"మా మీద బాసిజమ్ చేస్తూందండీ... మరీ చేతగాని వాళ్ళుగా ట్రీట్‌చేస్తుంది... ఆఫ్టాల్ ఒక నర్స్...."

"మనకు తెలీనపుడు సరిదిద్దేదెవరైనా బాధ పడకూడదు."

"ఇంత చదువు చదివి ఒక నర్స్ అవమానిస్తూంటే చూస్తూ ఊరుకోమంటారా?"

"అదే... ఆ అహంకారమే ఉండకూడదు డాక్టర్లకి."

"మీరు డాక్టర్ల పరువుతీస్తున్నారు. ఎంత అనుభవము ఉన్నా తనక్రింది ఉద్యోగి తప్పును ఎత్తిచూపితే ఏ డాక్టరూ సహించలేదు."

"అంటేమీరు తప్పు చేస్తున్నారన్నమాట. చూడండీ.. మిమ్మల్ని హాస్పిటల్ చేసుకొమ్మన్నాం గాని, మానేజ్ చెయ్యమనలేదు. మా స్టాఫ్‌ను తీసేయడానికి ఎవరిచ్చారు. మీకు అధికారం? ఏదైనా ఉంటే మాకు తెలియజేయచ్చు కదా?"



gudachari.com

"రోజూ చూసేవాళ్ళం, చేసే వాళ్ళం మేము. మాకు సహకరించనప్పుడు వాళ్ళతో మేం ఎలా పనిచేయగలం?"

"పనిచేయలేకపోతే మీరే నిలిచిపోవచ్చుకదా!"

"మమ్మల్ని నిలిచిపొమ్మనడానికి గానీ నిలిపివేయడానికి గానీ మీకు అధికారం లేదు." ఆమాటతో తలదిమ్మెక్కింది స్వాతికి వెంటనే కోపం ముంచుకొచ్చింది.

"ఏవిటి... మీరు మాట్లాడేది... ఇది నా హాస్పిటల్. సర్వాధికారాలు నాకున్నాయి. మీరిక్కడ ఉద్యోగులు మాత్రమే. హాస్పిటల్ని బ్రోతల్ హౌస్గా మార్చింది గాక మళ్ళీ నన్ను ప్రశ్నిస్తారా?"

"డాక్టర్! మీరు మర్యాద లేకుండా మాట్లాడుతున్నారు."

"హౌడేర్! యూ... గెటౌట్... నా హాస్పిటల్ నుండి వెళ్ళిపొండి." అంతచులకనగా మాట్లాడుతుంటే తట్టుకోలేక పోయింది స్వాతి.

"మేడమ్! మీరు బెదిరిస్తే భయపడి వెళ్ళే వాళ్ళం కాదు. లీజు అగ్రిమెంటు ఉంది. చేతనైతే కోర్టుకెళ్ళండి."

... అతని సమాధానానికి స్వాతి నోట మాట రాలేదు.. ఆశ్చర్యం... కోపం.. మాట్లాడలేకపోయింది.

"యస్... మీరు మాకు జీతం ఇవ్వడం లేదు. మేమే మీకు డబ్బు ఇస్తున్నాం. మూడు సంవత్సరాల్నుంచీ మేమే టాక్స్ కడ్తున్నాం. వీటన్నిటికీ ఆధారాలు ఉన్నాయ్..."

ఏది మాట్లాడాలో తెలీని అయోమయం... ఏంచేయాలో తెలీని సందిగ్ధత...

"దీసీజ్.. టూమచ్... నీతి, నియమం, మంచి, చెడు విచక్షణ లేకుండా మాట్లాడుతున్నావ్."

"అవన్నీ ఎప్పుడో సమాధి అయిపోయాయండి... చెడులో ఉన్న ఆకర్షణ మంచిలో లేదు, రాదు..."

"స్టాపిట్... నీ దగ్గర నీతులు చెప్పించుకొనేంత స్థితికి దిగజారిపోలేదు. ఉన్నతమైన వృత్తిని వ్యాపారంగా మార్చి డబ్బు చేసికో ప్రయత్నించే నువ్వు...." అసహ్యం చూపింది అతని మీద.

"డబ్బు విలువ మీ కింకా తెలీలేదంటే.. ఐ పిట్ యూ డాక్టర్... అందరూ నడుస్తున్న బాటలోనే మేము నడుస్తున్నాం. కాలాన్ని బట్టి నీతి నియమాలు మారుతుంటాయి."

"చాలు... ఇకచాలు... నీ లెక్చర్ వినడానికి రాలేదు. ఇక మీరీ హాస్పిటల్లో ఉండడానికి వీల్లేదు. రేపటి నుంచీ మేమే హాస్పిటల్ చూసుకుంటాం. ఉద్యోగం లేక వీధులు తిరుగుతున్న నీకు ఒకమార్గం చూపినందుకు మాకే ద్రోహం తలపెట్టావ్... వెళ్ళు... నాముందునుంచి వెళ్ళు..." తలపట్టుకుని కుర్చీలో కూర్చుండిపోయింది స్వాతి.



ఎక్కడుంది మంచితనం? ఏవిటి న్యాయం...? పాత వాళ్ళందర్ని పిలిపించమని చెప్పి ఇంటికి బయల్దేరింది. కోపం జుగుప్స స్వాతిని పిచ్చిదాన్ని చేసేటట్టు ఉన్నాయి. మనసు బాధతో గిలగిల లాడిపోయింది.

ఇంట్లో అడుగుపెడుతూనే లక్ష్మణ్ డాక్టర్శ్రీనితో ఏదో వాదిస్తూ కనిపించాడు స్వాతికి. అసలే హాస్పిటల్ సంఘటనతో కడుపుమండిపోతోంది ఆ కోపమంతా వెళ్ళుకొచ్చింది అతన్ని చూసి.

"ఎవరిచ్చారు నీకు అధికారం? మమ్మల్ని సంప్రదించకనే గోడ ఎందుకు పగుల కొట్టావు" నీకు అప్పు పడినంతమాత్రాన మర్యాద మరచి నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడమేనా?

"అది.... అదీ..." అతన్ని గొంతు పిసికేయాలన్నంత కోపం... ఆమెలో... "ఇల్లు అమ్మేసినట్టేకదమ్మా!"

"నీ దగ్గర అప్పు తీసుకున్నాం. అవసరమైతే అమ్ముతాం అని చెప్పాము కానీ..."

"పత్రాలు ఉన్నాయి కదమ్మా..."

"ఏం పత్రాలు...?" అప్పుడు గుర్తొచ్చింది అతని మీది నమ్మకంతో చదవకనే కాగితాలు మీద సంతకం చేసిన విషయం ఎంత తప్పు చేసింది తను. మనిషిని నమ్మినందుకు ఇంత శిక్షా! ఏవిటిది? వీళ్ళు మనుషులా, మనుషుల్ని పీక్కుతినే రాబందులా... మంచితనంతో ఆడుకుంటున్న కిరాతకులా... అగమ్యగోచరంగా ఉంది స్వాతికి.

హాస్పిటల్లో డాక్టర్ ప్రవర్తన గుర్తొచ్చింది. "వెళ్ళు... ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో... మేమీ ఇంట్లో నుంచి కదిలేది లేదు, నీ డబ్బు కావల్సి ఉంటే నీ ముఖాన పారేస్తాము," విసురుగా అంది.

"మరో లక్ష రూపాయలిస్తాను... కోర్టులు... ఇవన్నీ ఎందుకమ్మా..! మీ పరువు తీయడం నాకిష్టం లేదు" ఏదో పెద్ద గౌరవం యిస్తున్నట్లు,

"పాపం... ఎంత దయ...! అవసరంలో ఉన్నాం కదాని మా మంచితనాన్ని ఉపయోగించుకొని మోసం చేసి ఎదురు తిరిగితే కాళ్ళబేరానికి కొస్తారా...?" కోపం, అసహ్యంతో అన్నది స్వాతి.

"మీరసలు మనుష్యులు కాదు రాక్షసులు... మనిషి నిస్సహాయతను అడ్డుపెట్టుకుని రక్తం పీల్చుకునే నరమాంస భక్షకులు మీరు. వెళ్ళు... వెళ్ళిపో... నాముందు నుంచి వెళ్ళిపో..." హిస్టీరిక్గా అరచింది. కోపంతో వణికిపోయింది. కళ్ళవెంట నీళ్ళు కారిపోతున్నాయి... తల పగిలిపోతోంది... నీరసం.... నిస్సహాయతా... పడిపోతానేమో అనిపించింది స్వాతికి.

gudachari.com

ఇంతలో ఫోన్ మ్రోగింది. బలవంతంగా ఎత్తి "హలో!" అంది.

అంతే తనేం వింటున్నదో అర్థంకావడం లేదు... తన చేతిలో నుండి ఫోన్ జారిపోవడం మాత్రం తెలుసు ఆమెకు.

– – –

మనశ్శాంతీ...! ఎక్కడ...? ఎక్కడ...?? నువ్వెక్కడ...? అదృష్టం...! ఏదీ...? ఏది అదృష్టం...? ఎక్కడ అదృష్టం సంతోషం... సుఖం... ఎక్కడున్నాయి? ఎక్కడ దాగున్నాయవి?? నిరాశ... నిస్పృహ... ఇవేనా ఇంతేనా... జీవితమంటే. పెనుగాలిలో వెలుగుతున్న దీపం... ఆరిపోతుందా... లేదు... లేదు... ఆరిపోనివ్వను. నాదీపాన్ని, నాధ్యేయాన్ని ఆరిపోనివ్వను... నా చేతులు కాలిపోనీ... నా తనువు దగ్ధమైపోనీ... పోరాడతాను... మనసుకొట్టుకులాడింది స్వాతికి.

మనశ్శాంతిని మసి చేసిన మనుష్యుల మధ్య నిరాశా, నిస్పృహల్తో కరిగి పోతున్నపుడు, జీవితం మీద ఆశ అణగారిపోతున్నపుడు... అప్పుడు,.. అప్పుడొచ్చింది డాక్టర్ రెడ్డి దగ్గర నుండి ఫోన్... త్వరగా బయల్దేరి రమ్మని. మరే ఆలోచనకూ తావే లేదు. మొండిగా బయల్దేరింది. డాక్టర్ శ్రీని కూడా ఆమెను చూసి ఎదురు చెప్పలేకపోయాడు.

వాళ్ళు వచ్చారని తెలిసి డాక్టర్ రెడ్డి హడావిడిగా వొచ్చాడు చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాడు.

"వెల్‌కమ్... కంగ్రాట్యులేషన్స్..."

"యువార్ లక్కీ... మాచింగ్ డోనార్ హార్ట్ దొరికింది... వెంటనే ఆపరేషన్ చేయడమే." సంతోషంతో ఉద్వేగంతో చెప్పుకుపోతున్నాడు.

ఆ మాటలతో స్వాతి నిస్తేజంగా అలాగే వుండిపోయింది. అది సంతోషమా..?! దుఃఖమా?!

"వెల్ దటీజ్ ఇట్. కాలం దగ్గర పడిందన్నమాట." డాక్టర్‌శ్రీని నెమ్మదిగానే అన్న స్వాతి గుండెల్లో బాంబు పేలినట్లయింది. తిరిగి స్వాతి వైపు నవ్వుతూ, "వెల్... ఇంతకాలానికి నాకు విమోచనం లభించబోతోందన్నమాట" అన్నాడు.

శిలలా మొద్దుబారిన మెదడుతో అతని వైపలాగే చూస్తూండిపోయింది స్వాతి.

డాక్టర్ రెడ్డి ఇవేవి పట్టించుకోనట్లుగా తిరిగి తన మాటలు ప్రారంభించారు.

"కమ్... కమ్.. టేక్.. రెస్ట్... మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి. మధ్యాహ్నం అన్ని పరీక్షలూ చేస్తారు. ఈరోజు సోమవారం కదూ!... శుక్రవారం ఆపరేషన్. ఈలోగా ప్రిలిమినరీ టెస్టులు అన్నీ చేసి ఆపరేషన్‌కు నిన్ను సిద్ధం చేస్తారు... ఐకాంట్ సే... ఒకటి రెండ్రోజుల ముందుగా కూడా ఆపరేషన్ జరగొచ్చు... ఇక నాల్రోజులు తలమునకలయ్యే పని ఉంది నాకు... ఫీల్ కమ్ ఫర్టబుల్..." అంటూ వెళ్ళిపోయారు.



స్వాతి తలలోంచి ఆవిర్లు వస్తున్నాయి.

ఆ వార్తను ఆమె తట్టుకోలేక పోతుంది.

డాక్టర్‌శ్రీని మాత్రం ప్రశాంతంగా... నిర్వికారంగా తనక్కాదన్నట్లు ఉన్నాడు.

అతని దగ్గరగా జరిగింది స్వాతి.

ఆమె వైపొక సారి చూసి చిన్నగా నవ్వి కిటికీలోంచి ఆకాశంలోకి చూడసాగాడు అతను.

"నాకెందుకో చాలా భయంగా ఉందండీ..." అంది.

వణకుతున్న స్వాతి చేతిని స్పృశిస్తూ "భయమా...? ఎందుకూ...? కోరుకున్నది జరగబోతున్నందుకు సంతోషపడాలికానీ..." అన్నాడు ఆమె కళ్ళల్లోకి నవ్వుతూ చూస్తూ.

"ఏమోనండీ... కోరి ఉపద్రవం తెచ్చుకున్నానేమో అనిపిస్తోంది."

అదోలా నవ్వి స్వాతి తల నిమురుతూ, "ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించమనే నువ్వేనా ఈ రోజులా మాట్లాడుతున్నది....?!" అన్నాడు.

"అయినా ఇప్పుడు మీరు ఆరోగ్యంగానే ఉన్నారు కదా..."

"ఈ కాస్త కూడా లేకుండా పోతుందనా...? ఇంత ప్రయత్నమూ ఈరోజు కోసమేకదా...! నిజంగా మనం చాలా అదృష్టవంతులం ఇంత త్వరగా డోనర్ హార్ట్ దొరకడం..."

తనకు తెలియకనే అతని గుండెలమీద వాలి నిశ్శబ్దంగా జలజల కారుతున్న కన్నీళ్ళను అదుపు చేసుకోలేకపోయింది స్వాతి. ఓదార్చే ప్రయత్నమేమీ అతను చేయలేదు.

ఇంతలో తలుపు శబ్దమయింది. కళ్ళు తుడుచుకుని వెళ్ళి తీసింది స్వాతి.

"గుడ్ మార్నింగ్ డాక్టర్ స్వాతీ..."

ఆయన్ని ఎప్పుడూ చూళ్ళేదు. కొంచెం పొడవుగా చిన్నవయసే అయినా నిశితంగా చూసే కళ్ళు... ఆ కళ్ళలో ఎక్కడో లోతుగా దాగిన నిరాశ... ఎవరితను...?

స్వాతిని తప్పుకుని లోపలికి వస్తూ,

"హలో డాక్టర్ శ్రీని... హౌఆర్యు... బైదిబై ఐయామ్... డాక్టర్ దత్... దత్తపుత్ర... ప్రక్కవార్డు ఇన్‌చార్జిని..."

తలుపు దగ్గరే నిల్చున్న స్వాతిని చూసి, "రామ్మా రా కూర్చో.... నాకూ ఏం పనిలేదు... మిమ్మల్ని అప్పుడప్పుడూ వచ్చి విసిగించడం తప్ప.. అదీ మీకు అభ్యంతరం లేకపోతేనే..."

"నో... నో.... నథింగ్ దట్ సార్ట్... యు ఆర్ వెల్‌కమ్... ఎగ్జామిన్ చేస్తారా!" అన్నాడు డాక్టర్‌శ్రీని అతను ఎందుకు వచ్చాడో అర్థంగాక.



gudachari.com

"ఫర్‌గెట్ అబౌటిట్... అది వేరే వాళ్ళ పని... మిమ్మల్ని పలకరించి పోవడానికి వచ్చాను నేను. బోర్‌గా వుంటే... ఆ... ఏమ్మా మీరు కూర్చోలేదే... పిల్లలు ఎలా ఉన్నారు... ఎగ్జామ్స్ అయిపోయాయనుకుంటాను..."

"వాళ్ళసంగతి మీకెలా తెలుసు డాక్టర్ దత్..??!" ఆశ్చర్యంగా అన్నాడు డాక్టర్ శ్రీని.

"వాళ్ళ సంగతి తెలియకపోవడం ఏవిటి.. వాళ్ళ పేర్లు కూడా తెలుసు నాకు. మీ అబ్బాయి నాటీ కదూ! వాడికి చెట్లు, పూలు పక్షులు అంటే చాలా ఇష్టం కదూ!"

"వాడికేమిటి... మీ కిష్టం లేదా డాక్టర్?"

కాస్త ఆలోచిస్తూ ఆగి, "ఉన్నా! అనుభవించే అదృష్టం ఉండాలి కదా!" అన్నాడు డాక్టర్ దత్.

"అదేవిటి?!"

"అవును డాక్టర్ శ్రీనీ... యుఆర్ లక్కీ స్వాతీ లాంటి వ్యక్తి మీకు తోడుండడం.. ఎన్ని ఇబ్బందులనైనా సునాయసంగా ఎదుర్కొనే శక్తి సహధర్మచారిణి వల్లే లభిస్తుంది."

ఎక్కడో అగాధంలోంచి వ్యధతో వచ్చినట్లున్నాయా మాటలు.

వాళ్ళిద్దర్ని చూసి, "మరలా వస్తాను" అంటూ వడివడిగా వెళ్ళిపోయాడతను.

తలుపువేసి వచ్చి భర్త దగ్గర కూర్చుంటూ,

"ఆయన్ని చూస్తుంటే ఎందుకో జాలి వేస్తుందండీ." అంది స్వాతి

"ప్రతి ఒక్కరికీ నాలాంటి స్వాతి ముత్యం దొరుకుతుందా... అదృష్టం భార్యలోనే వుంటుంది."

ఆ మాటలకి మనసు పొంగిపోయింది స్వాతికి.

మధ్యాహ్నం ఎక్స్‌రే, బ్లడ్ టెస్టుకు లాబ్‌కి తీసుకువెళ్ళారు. తిరిగి వాళ్ళు వచ్చేసరికి డాక్టర్ దత్ వాళ్ళ రూమ్ ముందు నిలుచుని కిటికీలోనుంచి ఆకాశంలో ఎగురుతున్న ఒంటరి పక్షికేసి చూస్తున్నాడు.

వాళ్ళని చూసి, "హలో డాక్... ఇప్పుడే వచ్చాను. అన్ని పరీక్షలూ చేశారా?" నవ్వుతూ అని, "నేను మళ్ళీ వస్తాను... మీరు రెస్ట్ తీసుకోండి..." అంటూ వెళ్ళిపోబోయాడు డాక్టర్ దత్.

"నా.. నా.. మీరు రండి..." ఎందుకో కొద్ది పరిచయంలోనే అతనెంతో ఆత్మీయుడిలా అనిపిస్తున్నాడు వాళ్ళకి.

గదిలోకి అడుగిడుతూనే డాక్టర్ దత్ టేబుల్ మీదున్న యాపిల్స్ చూసి, "బ్యూటిఫుల్... రాయల్ యాపిల్స్... ఏవండీ... ఇన్ని యాపిల్స్ ఇలా వేస్ట్ చేయకుంటే... నాలాంటి వాడికిస్తే వాటి పని పట్టేయడూ..." అంటూ ఒకటి తీసికొని నోటిదగ్గర పెట్టుకోబోతూ... "ఓ... అయామ్ సారీ! నా బాడ్ మానర్స్‌కు క్షమించండి." అని చాకుతో ముక్కలుగా కోస్తూ.



"ప్రకృతి ఎంత విచిత్రమైంది... ఈ పండు రంగు... డాక్టర్ శ్రీని ముఖంలో ఎంత ఆకర్షణీయంగా ఉందో..." అన్నాడు నవ్వుతూ స్వాతి వైపు చూసి.

"ఆమాటెందుకు లెండి... మా ఆవిడ నన్ను పండు కోతీ అంటూ ఉంటుంది అప్పుడప్పుడూ" స్వాతి వైపు కొంటెగా చూస్తూ అన్నాడు డాక్టర్‌శ్రీని.

"రియల్లీ... యు ఆర్ మోస్ట్ హాండ్సమ్ ఫెలో... డాక్టర్ కాలేజీలో మీకు చాలా మంది వలవేసి వుంటారే?"

"వేశారేమో కానీండీ... ఇరుక్కున్నది మాత్రం ఈ అమ్మాయి వలలోనే..."

"నేనేం వలవేయలేదు. మీరే నా వెంట తిరిగారు." స్వాతి జవాబిచ్చింది.

"పచ్చి అబద్ధం... అమ్మాయిలంటే ఆమడదూరం పారిపోయే అమాయకుణ్ని సార్ నేను. ప్రేమాబాణాలు విసిరి విసిరి నా హృదయమంతా తూట్లు పొడిచి తన వల్లో నన్ను చేజిక్కించుకుంది."

"అవును చాలా... అమాయకులు మీరు. లేడీస్ హాస్టల్ చుట్టూ ప్రదక్షిణాలు చేసిందెవరో..."

"నేనా...! నిద్రాహారాలు మాని ఏడుస్తూ కూర్చున్నావని రాయబారాలు పంపితే ఒక అమాయక ప్రాణిని ఆదుకోడానికి విధిలేక వచ్చేవాడ్ని."

"అవున్నెండి, మీరు చాలా అమాయకులు నేనే మీకోసం..."

"కాదు నేనే నీకోసం..."

"లేదండీ... మీరే నాకోసం..."

"అవును నేనే ... నీకోసం..." అంటూ కొంటెగా నవ్వాడు డాక్టర్‌శ్రీని.

మనస్సు ఆనందంతో తుళ్ళిపడింది స్వాతికి. ఎంతకాలమైంది ఇంతటి ఆనందాన్ని అనుభవించి... మనసారా, హాయిగా నవ్వుకుని.

"మనసే మారినది... మధురముగా ఈవేళ..." దత్ వాళ్ళవైపు కొంటెగా చూస్తూ పాడుతూ నవ్వుతున్నాడు.

అదిచూసి స్వాతి బుగ్గలు ఎరుపెక్కాయి. ఎదలో మెదిలిన మధురమైన తలంపులు తనలోని బాధను పటాపంచలు చేశాయి. వాళ్ళముగ్గురూ మనసారా నవ్వుకున్నారు ఒక్కసారిగా.

అది చూసి, "వెల్.. దటీజ్.. ఇట్..." అన్నాడు దత్

"సంగీతమంటే మీకు ఇష్టమా డాక్టర్? ఫ్లాస్క్‌లోంచి కాఫీ వంచి అతనికిస్తూ" అంది స్వాతి ఇందాకటి పాట గుర్తొచ్చి.

gudachari.com

"ఇష్టమా... ప్రాణం... విప్రనారాయణలో, చూడుమదే చెలియ... సుశీల గారు పాడిన, చందన చర్చిత నీలికళేబర... అబ్బ వింటుంటే మనసు పులకించి పోతుందండీ." అన్నాడు దత్.

"సినిమా పాటలు కాదండీ శాస్త్రీయ సంగీతం..."

"అమ్మ బాబోయ్... అదంటే అమితభయం నాకు. వినేవాళ్ళు తలలూపించడం చూస్తే నా తల కూడా ఊగుతుందేమో అని గట్టిగా పట్టుకుంటాను." నవ్వుతూ అన్నాడు దత్.

"నాక్కూడా అంతేనండీ... మా ఆవిడ పాడితే తప్ప."

స్వాతి వైపు క్రీగంట చూస్తూ డాక్టర్‌శ్రీని అన్నాడు.

"ఏవిటీ... స్వాతి పాటలు పాడుతుందా?! ఏదీ ఒక్కపాట వినిపించమ్మ... నాకెలాగూ ఆ అదృష్టం లేదు. మా ఆవిడ పాడుతానంటే కాసేపాగు బాత్‌రూంకిపోయి వస్తానంటాను." ఆమాటతో ముగ్గురు నవ్వుకున్నారు.

"చాలా బోర్ కొట్టించినట్లున్నాను. విశ్రాంతి తీసుకోండి ప్రొద్దుపోయింది. వీలుంటే రేపు మా బాస్‌ని పిలుచుకువస్తాను" అన్నాడు వెళ్ళడానికి లేస్తూ డాక్టర్ దత్.

"బాస్... ఎవరండీ?"

"అదేనండీ... నాప్రాణం మీద... నా శరీరంమీద నా సర్వహక్కుల మీదా సర్వధికారాలూ కలిగిన నా అర్ధాంగి.. కాదు.. కాదు... పూర్ణాంగి."

మళ్ళీ నవ్వుల పువ్వులు విరిశాయి.

"వొస్తానమ్మా... బై డాక్టర్ శ్రీనీ..." అంటూ వెళ్ళిపోయాడు అతను.

నిజంగానే బాగా ప్రొద్దుపోయింది. మనస్సెంతో తేలిగ్గా హాయిగా వుంది స్వాతికి. భర్త ముఖం ప్రశాంతంగా ఉన్నట్లనిపించింది.

"ఇంటికి ఫోన్ చేశావా?"

"చేశానండీ... బుధవారం రమ్మని చెప్పాను."

"మరి డబ్బు సంగతి..."

"ఉన్నదే తెమ్మన్నాను. లక్ష్మణ్‌ని అడగొద్దన్నాను. డాక్టర్‌తో మాట్లాడుదామంటే ఫోన్ చేసినా దొరకడం లేదు. మీరేమీ ఆలోచించకండీ అన్నీ మేం చూసుకుంటామని జవాబు."

"శీనయ్య, పద్మనాభం, శ్రీరామ్, బ్రంహానందం, రమణారెడ్డిలను రమ్మని ఫోన్ చేయి."

"స్టేట్స్ నుంచి రామకృష్ణారెడ్డి వొస్తున్నట్లు ఫోన్ చేశారు."

"ఈజిట్.. వెరీగుడ్.. ఐవాంట్ టు సీ హిమ్ బిఫోర్ మై ఆపరేషన్." సంతోషంతో అన్నాడు వాళ్ళనందరిని తలచుకుంటూ డాక్టర్‌శ్రీని.



"యజ్ఞనారాయణ... గౌర శ్రీనివాస్..." అడిగాడు.

"అందరికీ ఇన్‌ఫార్మ్ చేశాను లెండి"

మనసు బాధతో మూలిగింది స్వాతికి. ఎందుకు వీళ్ళందర్నీ చూడాలని కోరుకుంటున్నారు.. ఇది ఆఖరని భావిస్తున్నారా... అని

"ఏమండీ! డాక్టర్ దత్ చాలా తమాషా అయిన వ్యక్తి కదూ!"

"అవును కల్మషం లేదు."

"నిజంగానే అతను భార్య వల్ల బాధపడుతున్నాడంటావా?"

"కాకపోవచ్చు. దత్ జోక్ చేస్తున్నాడనిపిస్తోంది."

"అలా ఎందుకు చేస్తాడండీ."

"ఎందుకంటే జోక్ కోసం. అతన్ని చూస్తుంటే ఎంతటి విషమ సమస్య అయినా తేలిగ్గా పరిష్కరించుకోగలడనిపిస్తోంది."

"ఇతరుల సమస్యలు పరిష్కరించడం సులభమేమో స్వంత వాటికన్నా."

"ఫర్‌గెటిట్... చాలా ప్రొద్దుపోయింది... శ్రీమతి గారిక నాలుగు గోరుముద్దలు తినిపిస్తే నిదురకు ఉపక్రమిస్తాము."

"ఓ... కే... అయితే ఒక చిన్న రిక్వెస్టు"

"చిన్న దేమిటోయ్... పెద్దదే చేయి."

"మరేం లేదు..."

"అరే...! అదేవిటి సిగ్గుపడుతున్నావు... ఆ... నాకర్థం అయిపోయిందిలే... ఈరోజు నా ప్రక్కన చోటు కావాలి శ్రీమతి గారికి... అంతేకదూ!"

తలెత్తి అతని వేపు చూసింది స్వాతి. ఆకళ్ళలో కొంటె తనం మెరుస్తోంది.

"యు ఆర్ మోస్ట్ వెల్‌కమ్..." అంటూ చాచిన చేతుల్లో వాలిపోయింది స్వాతి.

- - -

మత్తుగా వుంది. కళ్ళు తెరవాలనిపించడం లేదు స్వాతికి. శరీరం స్వాధీనంలో లేనంత బరువుగా వుంది ఆమెకు. ప్రక్కన తడిమిచూసుకుంటే ఎవరూ లేరు. కళ్ళు తెరచి చూసింది.

కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని పేపర్ తిరగేస్తున్నాడు డాక్టర్‌శ్రీని.

"ఎంతసేపయిందండీ మీరు లేచి... ఇంతమొద్దు నిదుర పట్టిందేవిటి..." అంటు లేచి దగ్గరకు వెళ్ళింది.

"మొద్దు నిదురని ఎందుకనుకోవాలి. ప్రశాంతతతో హాయితో వచ్చిందనుకోవచ్చు కదా..!" ప్రశాంతత... హాయి... వింతైన పదాలు...

- - -



gudachari.com

డాక్టర్ రెడ్డి తన రూంలో కూర్చొని ఎడతెరిపిలేని ఆలోచనలో మునిగిపోయి ఉన్నాడు.

ఫోను మ్రోగింది. జవాబు చెప్పాలనిలేదు. మళ్ళీ మ్రోగింది. విధిలేక తీసుకొని, "డాక్టర్ రెడ్డి హియర్..." అన్యమనస్కంగా జవాబిచ్చి ఫోన్ పెట్టేశాడు... ఎయిర్ కండిషన్ రూమ్‌లో కూర్చున్నా శరీరంలోంచి సెగలు, పొగలు, వస్తున్నాయి. తాను చాలా తొందరపడి ఆలోచనా రహితంగా... అనవసరంగా డాక్టర్‌శ్రీనిని రమ్మన్నానేమో... అని పదే పదే అనిపించసాగింది.

ఆరోజు మధ్యాహ్నం... కారు ప్రమాదంలో తలచిట్లి కొనఊపిరితో ఉన్న పేషెంటును అడ్మిట్ చేసికోవడం, పేషెంటు బ్రతికే అవకాశం లేదని న్యూరాలజిస్టు చెప్పడం, అతనికి జరిపిన టెస్టలన్ని డాక్టర్ శ్రీనికి సరిపోవడం, అందులోనూ ఆ పేషెంటుకు సంబంధించిన వారు సంస్కారవంతులుగా అనిపించడంతో ఎక్కడో మినుకుమినుకు మంటున్న ఆశ నిజమవుతొందనే నమ్మకంతో డాక్టర్ శ్రీని రమ్మని తొందర పడ్డానేమో అనిపించింది.

అయితే అనుకున్న విధంగా ఆ పేషెంటు చనిపోలేదు. అలాగని బ్రతికీ లేదు.. మెదడు మొద్దుబారి చైతన్య రహితంగా మారడంతో నిస్తేజంగా బెడ్‌మీద ఉన్నాడు. మెదడు పూర్తిగా చనిపోయింది ఇక పనిచేయదని. ఇద్దరు ముగ్గురు న్యూరో ఫిజీషియన్లైనా గట్టిగా చెబితే గానీ అతని గుండె తీసే వీలులేదు. పేషెంటు బంధువులతో ముందుగానే ఈ విషయమై కదిపితే.. కావాలనే పేషెంటును చంపామనే నిందరావచ్చు... ఆ తర్వాతైనా వాళ్ళిష్టపడకపోతే... ఏంచేయాలి...? ఇదొక అగమ్యగోచరమైన సమస్య. ఆలోచనలతో తల పగిలిపోతోంది డాక్టర్ రెడ్డికి.

ముందు జాగ్రత్తగా అన్నీ సిద్ధం చేసికుని వుంటే అదృష్టం కలసి వస్తే, అనుకున్నది సాధించవచ్చు, అనే నమ్మకంతో అన్ని సిద్ధం చేయమని చెప్పాడు.

ఈరోజు ఏ విషయం గట్టిగా చెబుతామన్నారు. న్యూరాలజిస్టులు... పాథాలజిస్టు కోసం కబురుపంపినా ఇంకా రాలేదు... ఏవిటిదంతా... ఎందుకీ ఆందోళన.. అయినా తనెందుకింత రిస్క్ తీసుకోవాలి...?! ఏవిటో... అర్థంగాని ఆత్రుత.

తలుపు శబ్దానికి తలెత్తి చూశాడు.

"హలో డాక్టర్ రెడ్డీ! అంటూ పాథాలజిస్ట్ వెంకటేశ్వరరావు లోపలికి వచ్చాడు."

"చాలా వర్రీడ్‌గా ఉన్నట్లున్నారే..." నవ్వుతూ అన్నాడు.

"నో సర్.. నా ప్రయత్నం సక్సెస్ అవుతుందా, లేదా అని కొంచెం అనుమానంగా ఉంది."

"డోనార్ బంధువులతో మాట్లాడారా?"

"ఏమని మాట్లాడను... మీవాడు చనిపోతే మేం గుండె తీసుకుంటామనా... చెప్పుచ్చుకు కొడతారు."

ఫక్కున నవ్వుతూ, "నిజమే సుమండీ... అయినా ఈ కేసులో మీ శ్రద్ధకు ఖచ్చితంగా సక్సెస్ అవుతారు." అన్నాడు పాథాలజిస్టు.



"మీ అందరి సహకారం ఉంటేనే కదా! బైదిబై... వాట్ అబౌట్ ది రిజల్ట్స్?" కొంచెం ముందుకు జరిగి అడిగాడు డాక్టర్ రెడ్డి.

"ఎవ్విరిథింగ్ సరిగ్గా మ్యాచ్ అవుతున్నాయి.... బ్లడ్ గ్రూప్ హెచ్.ఎల్.ఎ. టైపింగ్, వైట్ బ్లడ్ సెల్ స్క్రీనింగ్, లివర్ సోసైటీ క్రాస్ మాచింగ్ బయోకెమికల్ టెస్ట్... అన్ని నూటికి నూరు శాతం సరిపోయాయి." రిజల్ట్సు పేపర్లు అందిస్తూ అన్నారు.

గుండె మార్పిడికి - గుండెలో రెండు శీరాలకు సంబంధించిన కణాలు సరిగ్గా సరి పోవాలి. దానికి హ్యూమన్ ల్యూకోసైట్ యానిటిజన్ మాచింగ్ చెయ్యాలి. శక్తిని ఎదుర్కొనే కణాలు (యానిటీ బాడీస్) మరి దానిని మార్చుకొనే రక్తంలోని, శరీరంలోని తెల్లకణాల శక్తి (యాన్టిజన్) చాలా ముఖ్యం. శరీరం అమర్చిన గుండెను తిరస్కరించవచ్చు. దాన్ని అణచడానికి యిచ్చే మందు సైక్లోస్పోరిన్. ఇది కాలేయము (లివర్) మూత్రపిండాలు (కిడ్నీస్) మిగిలిన అవయవాలు మీద ప్రభావం చూపుతుంది. దానికి తగిన మందులు యివ్వాలి.

"యు గాట్ ఎనీ డౌట్...?" నిశితంగా ఆ పేపర్లు చూస్తూ అడిగాడు.

"అబౌట్ వాట్... డాక్టర్ రెడ్డీ?"

"... మళ్ళీ మరోసారి అన్ని చేస్తే..."

"మీకేమైనా అనుమానం ఉందా?" కొంచెం నొచ్చుకున్నట్లుగా అన్నాడు డాక్టర్ వెంకట్.

"సారీ... డాక్టర్! మిమ్మల్ని అనుమానించడం కాదు... కానీ, మొట్టమొదట మనం చేయబోయే ఈ ప్రయత్నంలో ఎలాంటి పొరపాట్లు జరక్కూడదనే నా అభిప్రాయం. అంతే గానీ మిమ్మల్ని తప్పు పట్టే అధికారమూ, అనుభవమూ నాకు లేవు. మీరు నన్ను అర్థం చేసుకుంటారనుకుంటాను."

"ఓ.కె.... సర్... మీకోసం మళ్ళీ అన్ని టెస్టులు చేస్తాం. మీకెట్లాంటి అనుమానం వద్దు... ఇది ఫర్‌ఫెక్ట్ మ్యాచింగ్ హార్ట్..!" డాక్టర్‌రెడ్డి చేతిలో చేయివేసి వెళ్ళిపోయాడు.

ఫర్ ఫెక్ట్... మ్యాచింగ్... హార్ట్... ఆమాటే డాక్టర్ రెడ్డి చెవుల్లో గింగురు మంటోంది.. కానీ, ఎలా..?! అనేది విడివడనిముడి.

ఫోన్ మ్రోగింది.

"హలో... సర్! యాక్సిడెంట్ పేషెంట్ బంధువులు మీతో మాట్లాడాలనుకుంటున్నారు."

"నాకిప్పుడు తీరికలేదు." అని ఫోన్ పెట్టేయబోయి, "సరే పదిహేను నిమిషాల తర్వాత పంపండి." అన్నాడు డాక్టర్ రెడ్డి.

ఏదో తెలియని ఆతృత అతనిలో మొదలయ్యింది.

తలుపు నెట్టుకుని డాక్టర్ విజయ్ న్యూరాలజిస్ట్ లోపలకొచ్చాడు.



gudachari.com

"ఆ... ఆయాక్సిడెంట్ పేషెంట్..." అని అతను ఏదో చెప్పబోతూండగా తలుపు శబ్దమయ్యింది.

"కమిన్..." అన్నాడు డాక్టర్ రెడ్డి.

యాక్సిడెంట్ పేషెంట్ బంధువులు...

"రండి, మేజర్ చౌదరిగారూ... మీట్ డాక్టర్ విజయ్. మీ కేసు చూస్తున్న న్యూరాలజిస్ట్..." అంటూ కుర్చీ చూపించాడు అతనికి, అతను ఏం మాట్లాడలేదు. అతన్నే చూస్తున్నారు డాక్టర్ రెడ్డి. న్యూరాలజిస్టు. గంభీరంగా కనిపిస్తున్నప్పటికీ అతని కళ్ళలో దైన్యం దాగడం లేదు.

కాసేపు మౌనం రాజ్యమేలిందా గదిలో....

"వుయార్ వెరీ సారీ... సర్! మా చేతనైంది చేస్తున్నాము" డాక్టర్ విజయ్ అన్నాడు. అతని కళ్ళల్లోకి ఒకసారి చూసి రెడ్డివైపు చూస్తూ,

మేజర్ చౌదరి గాఢ నిట్టూర్పు వదలి డాక్టర్ విజయ్ వైపు చూసి "కొంచమైనా ఆశ ఉందా?" అన్నాడు.

"ప్రయత్నం చేస్తున్నాం..."

"ఐవాంట్ స్ట్రెయిట్ ఆన్సర్ డాక్టర్... నా కళ్ళముందు రక్తం మడుగులో చస్తున్నా చూస్తూ ముందుకు వెళ్ళిపోయే వాడ్ని నేను. మీరెటువంటి వార్త చెప్పినా చలించను లెండి." అన్నాడు సూటిగా డాక్టర్ విజయ వైపే చూస్తూ

డాక్టర్ రెడ్డి బిగుసుకుపోయి వాళ్ళిద్దర్ని చూస్తున్నాడు.

డాక్టర్ విజయ్, రెడ్డి వైపు చూసి

"వెల్... నాకేమాత్రం నమ్మకం లేదు... ఇంత శ్రమపడుతున్నా బ్రెయిన్ యాక్టివిటీ పెరగలేదు. రోజురోజుకీ తగ్గిపోతోంది... మహా అయితే..." నసుగుతు, "నో హోప్ ఎటాల్" అన్నాడు.

"మరి ఇక్కడుంచి ఏం ప్రయోజనం.. మేం తీసుకెళ్ళవచ్చుకదా?!"

ఆ మాటతో డాక్టర్ రెడ్డి గుండెల్లో బాంబు పేలినట్లయింది.

"తీసుకుపోవచ్చు... డాక్టర్గా నేనామాట చెప్పకూడదు."

"ఇఫ్. దేరీజ్ నో... హోప్.. ఎందుకండీ...?" నిరాశగా అన్నాడు మేజర్ చౌదరి.

"అది మీ ఇష్టం..." రెడ్డి వైపు చూస్తూ అన్నాడు డాక్టర్ విజయ్.

ఏదో చెప్పాలని ఎంత ప్రయత్నించినా... నోట మాట రావడం లేదు... ఎలా ప్రారంభించాలి...? కానీ తప్పదు... ఇదే సమయం... గొంతు పెగల్చుకుని ప్రారంభించాడు డాక్టర్ రెడ్డి.



"మేజర్ సార్... నేను మీతో మాట్లాడాలి."

- - -

"మీతో మాట్లాడాలని బయట చాలా మంది వెయిట్ చేస్తున్నారు" గదిలోకి వస్తూ అన్నారు డాక్టర్ దత్, డాక్టర్ స్వాతితో.

ఎవరై ఉంటారబ్బా. ఊర్నుంచెవరనా వచ్చారేమో! అంటూ తలుపు దగ్గరకు వెళ్ళింది చూసేందుకు డాక్టర్ స్వాతి.

"స్వాతీ! ఆగండి.. నన్నీ కాఫీ అయినా త్రాగనీయండి.. వాళ్ళొచ్చారంటే ఇవి కూడా తీసుకుని వ్రాసేస్తారు."

"తీసుకుని వ్రాసేదేమిటి...?" ప్రశ్నార్థకంగా దత్ని చూస్తూ అంది స్వాతి.

నవ్వుతూ, "అదేనండీ.. ప్రెస్.. మీ వారికేదో బ్రహ్మాండమైన ఆపరేషన్ జరగబోతోందట కదా! వాళ్ళు చెబితేనే తెలిసింది నాకు. ఆ... మీరు కూర్చోండి నేను పిలుస్తాను."

అంటూ తలుపు తీసి, "రండి" అన్నాడు బయట వాళ్ళతో

పది పదిహేను మంది చేతిలో పాడ్లు, పెన్లతో వొచ్చారు బిలబిలమంటూ. స్వాతి, డాక్టర్ శ్రీని ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు... దత్ వాళ్ళకి వీళ్ళిద్దర్ని పరిచయం చేశాడు. వీడియో కెమరాలు స్టార్టు చేసారు. వెలుగు, గదినిండా వెలుగు. గుండె...?

అరగంట సేపు ఏవేవో ప్రశ్నలతో వేధించి వెళ్ళిపోయారు వాళ్ళు. వాళ్ళను పంపించి డాక్టర్ దత్ లోపలకొస్తూ "ఏవిటి అలా వున్నారు...? రేపు ఉదయం దేశమంతా మీరే కనిపించబోతున్నారు మొదటి పేజీలో..." అన్నాడు స్వాతిని చూస్తూ

"ఆ మరుసటి రోజు కూడా కనిపిస్తాను... ఆబిచూరీ కాలమ్లో..." వెంటనే అన్నాడు డాక్టర్ శ్రీని శూన్యంలోకి చూస్తూ.

ఆ మాటకు నవ్వబోయిన దత్ టక్కున ఆగిపోయి స్వాతివైపోమారు చూసి, "కమాన్ మాన్... చెడు ఎందుకు ఆలోచిస్తావు.... యువర్ ఆపరేషన్... జస్ట్ ఎన్ ఆపరేషన్... డాక్టర్ కూలీ.. కూలీ, ఫేమస్ కార్డియోతోరాసిక్ సర్జన్, ఇన్ ది వరల్డ్ వస్తున్నారు తెలుసా!"

"నిజంగానా...! ఈ ఆపరేషన్ కోసం వస్తున్నారా!" ఎగిరి గంతులేసింది స్వాతి. శ్రీని నమ్మనట్లు చూశారు దంత్వైపు.

"మీరు నమ్మడం లేదుకదూ! ఈ రోజు పేపర్ ఏదీ...? ఆ... ఇదిగో ఇక్కడ చూడండి..."

ఆతృతతో స్వాతి తీసుకుని చూసింది.

డాక్టర్ కూలీ మన దేశానికి వస్తున్నారు. అందులోనూ దేశంలో మొట్టమొదటి హార్ట్ ట్రాన్స్ప్లాంటేషన్ ఆపరేషన్కు ఆయన హాజరుకావచ్చు.



gudachari.com

స్వాతి హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. దత్‌కు స్వీటు అందించింది.

"ఒక్కటేనా! ఆ ప్యాకెట్టంతా ఇలా ఇవ్వండి." అంటూ అన్నీ తీసుకున్నాడు.

"ఓ.కె. డాక్... నాక్కాస్త డాక్టర్ రెడ్డితో పనుంది. వెళ్ళాలి." అంటూ బయలుదేరాడు డాక్టర్ దత్.

"నేనూ మాట్లాడాలి. వొస్తాను పదండి." అంది స్వాతి.

"వొద్దమ్మా! ఆయన బిజీగా ఉన్నారు నేను తీసుకువొస్తాను." అంటూ వెళ్ళిపోయాడు.

దత్ అటు వెళ్ళిన వెంటనే తలుపు తీసుకు వస్తున్న డాక్టర్ రెడ్డిని చూసి సంతోషంతో కృతజ్ఞతతో చేతులు జోడించింది అతనికి స్వాతి.

ఇంతలో, మమ్మీ! డాడీ! అంటూ పిల్లలు గదిలోకి వచ్చారు. వాళ్ళని దగ్గరకి తీసుకుని డాక్టర్ రెడ్డిని చూసి "నాన్నా! ఇదిగో వీరే... మీ డాడీని తిరిగి మనకివ్వాలని నిరంతరం కృషి చేస్తున్న మహా మనిషి... నమస్కరించండి" అంది కళ్ళలోంచి నీరు కారుతుండగా

"స్వాతీ! ఏమిటమ్మా ఇది... నేనొక డాక్టర్ని. డాక్టర్‌గా నా విధి నిర్వర్తిస్తున్నానంతే. మన ప్రయత్నానికి మంచి మనసుతో, గుండెనిబ్బరంతో త్యాగం చేస్తున్న మహనీయులకు చెందుతుంది ఇదంతా" అంటూ ప్రక్కనే వున్న వ్యక్తిని చూపించారు.

అంతవరకూ అతన్ని గమనించలేదు స్వాతి.

"అంకుల్... మా డాడీని బాగు చేస్తావా నువ్వు?... మాడాడీని మాకు బాగుచేసివ్వు అకుంల్... మాడాడీ లేకపోతే మేమంతా ఏమయిపోతాం" అంటూ పిల్లలు డాక్టర్ రెడ్డి చుట్టూ చేరారు.

"నేను కాదమ్మ... ఈ తాతయ్య..." బొంగురు గొంతుతో అన్నాడు డాక్టర్ రెడ్డి.

పిల్లలు ముగ్గురూ ఆయన చుట్టూ చేరి

"తాతయ్యా! మా నాన్నను బాగు చేసి మాకివ్వు." అన్నారు.

గుండె బ్రద్దలయ్యింది. దీనాతిదీనంగా పిల్లలు కొత్తవ్యక్తి చుట్టూ చేరి అర్థిస్తుంటే

"అలాగేనమ్మా! ఈ తాతయ్య మీ కివ్వగలిగిందేలాంటిదయినా ఇస్తాడమ్మా... ఏడవ కండి... బంగారు పాపలు కదూ..." అనునయంగా అన్నా ఆయన కళ్ళలోనూ ఆర్ద్రతా బిందువులు....

గదిలోని వాతావరణాన్ని తేలిక పరచడానికి డాక్టర్‌రెడ్డి, "పిల్లలూ... ఈ తాతయ్య ఎవరో తెలుసా మీకు?" అని ప్రశ్నించాడు.

"ఓ... తెలుసు!" విష్ణు జవాబు.

"ఎలా తెలుసు?" ఆశ్చర్యంతో అడిగాడాయన

"చూస్తేనే తెలుస్తుందికదా... మిలటరీ తాతయ్యని!"



ఈసారి ఆశ్చర్యపోవడం అందరి వంతూ అయింది. శ్రీని, స్వాతి కళ్ళల్లో ఆనందంతో కూడిన గర్వం తొణికింది.

"బైదిబై... ఈయని ఆర్మీ ఆఫీసరని తెలిపోయింది కదా. పేరు మేజర్ చౌదరి. విత్ బ్రాడ్ మీసాలు, అన్డ్ కైన్డెస్ట్ హార్ట్, గ్రేటెస్ట్ శాక్రిఫైస్... మీట్ మిస్టర్ శ్రీని అండ్ స్వాతి... ఈయనే మనకు డోనార్ హార్ట్ లభించేందుకు సహకరిస్తున్న మహనీయుడు." అంటూ డాక్టర్ రెడ్డి పరిచయం చేశాడు.

నమస్కరిస్తూ, "పెనుగాలిలో కొట్టుకుపోతున్న మా సంసారాన్ని నిలబెట్టడానికి వచ్చిన పుణ్యమూర్తులు మీరు... మీకెలా కృతజ్ఞతలు తెలియజేయాలో తెలియడం లేదు..." అన్నది స్వాతి.

"థాంక్స్... ఎలాట్... సక్సెస్ అయి మళ్ళీ మిమ్మల్ని చూడగలిగితే," తడబడుతూ, ఉద్వేగంతో అన్నాడు డాక్టర్ శ్రీని.

"నూటికి నూరు శాతం సక్సెస్ అవుతుంది. ఆ మరచాను అదృష్టవశాత్తు డాక్టర్ కూలీ వస్తున్నారిక్కడికి. మనకు అన్నీ కలిసే వస్తున్నాయి." అన్నాడు డాక్టర్ రెడ్డి.

ఇంతలో నర్స్ వచ్చి చెప్పింది.

"సార్! రెండు కాళ్ళూ లేని బెగ్గర్ ఎవరో నిన్నటి నుంచీ డాక్టర్ శ్రీనిని చూడాలని బయట గొడవపెడుతున్నాడు."

"ఏదో ఒకటి చెప్పి పంపేయ్యకపోయారా...?" అన్నాడు డాక్టర్ రెడ్డి.

"లేదు సార్! ఏం చెప్పినా వినడం లేదు. లోపలకి పంపకపోతే గేటు దగ్గరే ఛస్తానని బెదిరిస్తున్నాడు."

డాక్టర్ రెడ్డి డాక్టర్ శ్రీని వైపు చూశాడు.

పంపమన్నట్లు తల ఉపాడు అతను.

నేలమీద రాచుకుంటూ వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు డాక్టర్‌రెడ్డి, చౌదరి.

"అరే...! రాజు ఎలా వొచ్చావిక్కడికి? ఎప్పుడొచ్చావు?" ఆశ్చర్యానందాలతో ప్రశ్నించారు డాక్టర్ శ్రీని.

అతను బిచ్చగాడే కానీ స్వాతి వాళ్ళ అభిమాని. ఒకసారి బజార్లో వాంతులు, విరేచనాలతో దిక్కులేక పడివుంటే ఎవరూ దగ్గరకు వెళ్ళడానికి సాహసించలేకపోయినా డాక్టర్ శ్రీని వెళ్ళి హాస్పిటలుకు తీసుకవచ్చి శ్రద్ధతో బాగు చేశాడు. నాటి నుంచీ అతని దృష్టిలో డాక్టర్ శ్రీని దేవుడు. అప్పుడప్పుడు వచ్చి తను ఏయే ప్రాంతాలు తిరిగిందీ... అనుభవాలు... చెబుతూ వుంటాడు. అతనితో మాట్లాడ్డం డాక్టర్‌శ్రీనికి చాలా యిష్టం. తన బాధల్ని, అవమానాల్ని చెప్పుకుంటూ నవ్వుతూనే ఉంటాడు. ఎంతటి విషమ పరిస్థితినయినా తేలిగ్గా



gudachari.com

మామూలుగా తీసుకుంటాడు. తను బిక్షగాడే తనని బాధ పెట్టిన వారిని, అవమానించిన వారిని నీచంగా మాట్లాడడు. వాళ్ళను చూసి జాలి పడ్డట్లు మాట్లాడుతాడు.

"ఏం హాస్పిటల్ సార్ ఇది... నేనెంత బీద బిచ్చగాడ్ని అయితే మాత్రం... మా దేవుడ్ని చూడాలని మూడ్రోజుల్నుంచీ పడికాపులు కాస్తుంటే కుక్కను విదిలించినట్లు విదిలించి పారేశారు. ఇన్ని రోజులు మీకోసం ఎదురుచూసి, ఒళ్ళు బాగులేదని తెలిసి ఇక్కడకు వొచ్చాను సామీ... మీకు బాగవ్వాలని కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ ప్రెసాదాలు తెచ్చాను సామీ! ఇవిగో ప్రెసాదాలు... తీసికోండి సామీ!" అంటూ ఒక మూట చేతికిచ్చాడు.

"పెట్టమ్మా! అయ్యగారికి... కాశీవిశ్వనాధుని, రామేశ్వరస్వామి, రంగనాధస్వామి విభూతి పెట్టు. మీరూ, పిల్లలూ కూడా పెట్టుకోండమ్మా మీ కష్టాలన్ని తీరిపోతాయి. నా దేవుడికి బాగై మీ నొసట కుంకుమ పది కాలాల పాటు పదిలంగా వుంటుందమ్మా!" అంటూ భోరున ఏడ్చేశాడు.

అంతలోనే కళ్ళు తుడుచుకుని నవ్వుతూ,

"సామీ! మీకు పెద్దాపరేషనంట గదా సామీ... గుండె మార్చేస్తారంట కదా! గుండె దొరకలేదంట కదా! నాగుండె తీసుకోండి సామీ.. నేనుండి ఏం చేస్తాను మీ లాంటోళ్ళు బాగుంటే నాలాంటి పేదోళ్ళని ఆదుకుంటారు... రాత్రికి రైలు కింద పడతాను... నా గుండె తెచ్చి అతికించమను సామీ!" ఉద్వేగంతో అన్నాడతను... నవ్వుతున్నాడు, ఏడుస్తున్నాడు... నవ్వూ, ఏడుపు కలిపి నవ్వుతున్నాడు తను. వాతావరణం గంభీరంగా మారింది.

"ఆ... ఇంతకీ నువ్వు భోం చేశావా?" అన్నాడు డాక్టర్ శ్రీని వాతావరణాన్ని తేలికపరచ డానికి.

"నా తిండికేంలే సామీ! ఎంగిలి మెతుకులేకదా!" అంటూ మూట విప్పి అందులోంచి రెండు, ఆపిల్ పండ్లు తీసిచ్చాడు స్వాతికి.

ఆమె తీసుకున్నదే కాని వాటిని ఏం చెయ్యాలో తెలియలేదు.

"అతనికే ఇచ్చేయి తిండి కూడా తిన్నట్లు లేదు" అన్నాడు శ్రీని.

"వొద్దు స్వామీ! మీ కోసమే తెచ్చాను ఇవి. నాకోసం తినండి సామీ!" అన్నాడు అభ్యర్థనగా

కాదనలేక కడిగి కోసి తలా ఒక్క ముక్క తీసికుని మిగిలింది అతనికే ఇచ్చేసింది స్వాతి.

ప్రక్కనే కూర్చొని దీన్నంతా ఆసక్తితోనూ, ఆశ్చర్యంతోనూ గమనిస్తున్న డాక్టర్‌రెడ్డి, మేజర్ చౌదరిలను చూస్తూ "ఈళ్ళెవరమ్మ!" అని అడిగాడు.

"ఈయన మీ డాక్టర్ని నయంచేసే డాక్టరు. వీరు దానికి సహాయం చేస్తున్న వ్యక్తి." అంది స్వాతి.



"మీకు కోటి పుణ్యాలు జరుగుతాయి స్వామీ! మా సామికి బాగుచేస్తే దేవుడికి చేసినట్లే" అంటూ వాళ్ళ కాళ్ళు కళ్ళ కద్దుకుని సీరియస్‌గా తన మూటలోంచి ఒక కత్తి బయటకు తీసి, "ఇదిగో సామీ! మా అయ్యకి బాగ్గాకపోతే నేను దీనితో పొడుచుకుని సచ్చిపోతా సామీ..."

ఉద్వేగంతో మాటలు రాక, పొంగుకొస్తున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ ఏడుస్తూ నవ్వుతున్నాడు.

\- - -

"డాక్టర్ రెడ్డి ఈజ్ ఇన్..." బయట డాక్టర్ శంకర్ చౌదరి అడగడం వినిపించింది డాక్టర్ రెడ్డికి.

డాక్టర్ రెడ్డి చాలా సేపటి నుంచి ఓంటరిగా తనరూములో కూర్చొని ఉన్నాడు. డాక్టర్ శంకర్‌ని చూడగానే రిలీఫ్‌గా ఫీలయ్యాడు.

కుర్చీలో వెనక్కు వాలుతూ, "ఏమిటో... ఇంతకాలం ఎదురు చూసినది ఇప్పుడు జరగబోతోంటే ఎందుకో ఏదో తెలియని భయం, వెంటనే సంతోషమూ కలుగుతున్నాయి" అన్నాడు.

"భయం ఎందుకూ?" వచ్చి కూర్చుంటూ అన్నాడు శంకర్.

"డాక్టరెప్పుడూ పేషెంటుకు డిటాచ్‌డ్‌గా వుంటూ అటాచ్‌డ్‌గా ట్రీట్ చేయాలి. కానీ, ఎందుకో ఈ పేషెంటుతో మనకు తెలీకనే అవినాభావ సంబంధం ఏర్పరచుకున్నాం. అందకే పేషెంటుతో డాక్టరెప్పుడూ ఎమోషనల్‌గా ఇన్‌వాల్వయి ట్రీట్ చేయకూడదు. ఒక్కోసారి అది తీవ్ర ప్రమాదానికి దారితీయొచ్చు. క్లిష్ట సమయాల్లో నిర్ణయాలు వెంటనే తీసికోలేము. నా భయానికి సంకోచానికీ కారణమదే కాబోలు."

"నిజం, మరో పేషెంటయితే ఇన్ని ఆలోచించి ఉండం కదా!" అన్నాడు డాక్టర్ శంకర్.

"పేషెంటు ఎవరైనా డాక్టర్‌గా ఆలోచించక తప్పదు కదా! ఓ...కే... అది వదిలేసి కేసు విషయానికొద్దాం. ప్రెపరేషన్స్ అన్ని పూర్తయినట్టే. ఒక స్పెషల్ రూమ్ విత్ సోఫిస్టికేటెడ్ ఎక్విప్‌మెంట్‌తో సిద్ధంగా వుంది. ఇక డ్రగ్స్... సైక్లో స్పోరిన్ - ఎ, (ఆర్.ఎ.టి.6) రాబిట్ యాన్టీ థైమోసైట్ గ్లోబులిన్, అబితయోప్రన్, సిద్ధంగా ఉంచాము డాక్టర్లందర్ని కాన్ఫరెన్స్‌కు రమ్మని చెప్పాను." కాసేపు నిశ్శబ్దంగా ఉండి మళ్ళీ ప్రారంభించాడు డాక్టర్ రెడ్డి.

"ఆపరేషన్ సక్సెస్ కావడం ఎంత ముఖ్యమో, తర్వాత ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఐసోలేషన్ అంతకన్నా ముఖ్యం. పేషెంటును ట్రీట్‌చేసేవాళ్ళు, చూసేవాళ్ళు, స్టెరయిల్ మాస్క్ గౌన్స్ తప్పనిసరిగా వేసికోవాలి. చిన్నపాటి జలుబు చేసినా చాలు ఇంతప్రయత్నమూ వృథా అవుతుంది. ఈ రోజు నుంచి విజిటర్స్‌ను కూడా రానియ్య వద్దు. స్వాతి. పిల్లల క్కూడా స్టెరైల్ డ్రస్సు యివ్వండి. రూం మార్చండి."



gudachari.com

"అన్ని బావున్నాయి. ఇంతకీ డోనార్ బంధువుల కన్సెంట్ తీసుకున్నారా" ప్రశ్నించాడు డాక్టర్ శంకర్ చౌదరి.

"తీసుకున్నాను. ఆ మేజర్ ఎంత ఉదాత్తుడో... డాక్టర్ శ్రీని, స్వాతిని, పిల్లల్ని చూసిం తర్వాత మనస్ఫూర్తిగా మనతో సహకరిస్తానని మాటిచ్చాడు. రిటెన్ స్టేట్‌మెంట్ కూడా తీసుకున్నాను."

"దానికి స్టేట్ గవర్నమెంటు అప్రూవల్ కావాలి కదా?"

డాక్టర్ రెడ్డి అవునన్నట్లు తల ఊపాడు. కాన్ఫరెన్స్‌కు పిలిచిన డాక్టర్లంతా వచ్చారు. కార్డియో ఫిజీషియన్‌లు ఇద్దరు, ఇద్దరు కార్డియోథోరాసిక్ సర్జన్‌లు, యూరాలజిస్ట్, పాథాలజిస్టు, బయోకెమిస్టు, అనెస్థటిస్టు వారిలో ఉన్నారు. కాన్ఫరెన్స్‌కు ముందే ఒకసారి పేషెంటు ఎగ్జామిన్ చేసి రమ్మన్నాడు వాళ్ళని. అందరూ కూర్చున్న తర్వాత పేషెంటు పాత రికార్డ్, ప్రస్తుత రిజల్ట్స్ తలా ఒక కాపీ అందజేశాడు డాక్టర్ రెడ్డి. అవి చదవడంలో అందరూ నిమగ్నమయ్యారు.

కార్డియాక్ ఫిజీషియన్ డాక్టర్ కె.ఎన్.రెడ్డి, డాక్టర్ రెడ్డి వైపు చూస్తూ "క్లినికల్‌గా ప్రస్తుతం గుండె తప్ప మిగతా అంతా బాగుందనే అనిపిస్తోంది. అసలు... మెడికల్ లైన్‌లోనే ట్రీట్ చేస్తే మంచిదేమో!" అన్నాడు.

"అతని గుండె పరిస్థితి ఏమిటో మీకు తెలుసు. ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో ఊహించలేని పరిస్థితిలో ఉన్నాం మనం. అందులోనూ అదృష్టవశాత్తు సూటబుల్ డోనర్ హార్ట్ లభ్యమైంది. కనుక రిస్క్ ఎందుకు తీసుకోకూడదు." అన్నాడు డాక్టర్ రెడ్డి.

"యస్... యు ఆర్ కరెక్ట్ డాక్టర్ రెడ్డి... ఇంతవరకూ గుండె మార్పిడి చేయించుకుని దీర్ఘకాలం బ్రతికిన వ్యక్తి 15 సంవత్సరాలు. అంత జీవితాన్ని మనం అతనికి ఇవ్వగలిగితే చాలు." అన్నాడు డాక్టర్ చెరియన్. కార్డియోథోరాసిక్ సర్జను.

ఆ తర్వాత పేషెంటును ఎలా ప్రిపేర్‌చేయాలి... ఆపరేషన్ ఎలా ప్రొసీడ్ కావాలి... ఎదురయ్యే కాంప్లికేషన్స్ ఏమిటి..? ఎలా వాటిని ఎదుర్కోవాలి... మొదలైన అన్ని అంశాల్ని అన్ని కోణాల్లోంచీ చర్చించి, ఎవరేయే పనులు చేయాలి... కావలసిన పరికరాలు, ఏర్పాట్లును కూడా నిర్ణయించేసుకున్నాడు.

ఈ చర్చతో తలదిమ్మెక్కిపోయింది డాక్టర్ రెడ్డికి.

"ఇంతకీ ఆపరేషన్ ఎప్పుడు ఫిక్స్ చేశారు?"

"శుక్రవారం ఇంకా రెండ్రోజులుందికదా! ఈలోగా మరేమైనా కావలసి వుంటే చెప్పండి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది ఫెయిల్ కావడానికి వీల్లేదు. అందునా భారతదేశంలో మొట్ట మొదటి గుండె మార్పిడి గనుక యావత్ ప్రపంచమూ మనల్ని గమనిస్తూనే వుంటుంది."

"వాటాబౌట్ డాక్టర్ కూలీ?"



"ఆయన వొస్తున్నారు... ఓన్లీ సూపర్‌వైజ్ చేయడానికి మాత్రమే. అని నొసటి చెమట తుడుచుకుంటుండగా," ఎక్స్‌క్యూజ్‌మి! అని వినబడ్డంతో తలుపువైపు చూశాడు డాక్టర్ రెడ్డి. ఆందోళనతో డాక్టర్ విజయ న్యూరాలజిస్ట్ రావడం కనిపించింది.

"మీరు ఆపరేషన్‌కు రెడి కావాలి. బ్రెయిన్ యాక్టివిటీ ఆల్‌మోస్ట్ నిల్, ఓన్లీ ఎ స్పిక్" అన్నాడు.

"ఇప్పుడా? ఎలా??" గుండె వేగం హెచ్చింది డాక్టర్ రెడ్డికి. మెదడు చనిపోయిన తర్వాత గుండె ఆగిపోకుండా చూడాలి. మూడున్నర గంటల లోపల ఆ చికిత్స జరిగితే సక్సెస్ అయ్యేందుకు అవకాశాలు ఎక్కువ. అదే ఆలోచించాడు డాక్టర్ రెడ్డి.

"కనీసం మరో ఆరు గంటలు బ్రెయిన్ స్టెములస్ ఉంచలేరా"

"చాలా కష్టం."

"ప్లీజ్! ట్రైయువర్ బెస్ట్... ఈలోపల అన్ని సిద్ధం చేయడానికి ప్రయత్నిస్తాను" బ్రతిమాలుతున్న ధోరణిలో చెప్పాడు డాక్టర్ రెడ్డి.

"ఓ.కె.. ఐకెన్ ట్రై... డు యాజ్ ఫాస్ట్ యాజ్ యుకెన్." అంటూ వెళ్ళిపోయాడతను.

గదిలోని మిగతా అందరూ నిశ్శబ్దంగా గమనిస్తూన్నారు వాళ్ళిద్దర్నీ. డాక్టర్ రెడ్డితో ఎక్సైట్‌మెంటు మొదలయింది. ఏదో ముంచుకొస్తున్నంత ఆత్రుత.

అక్కడున్న డాక్టర్లతో, "జంటిల్‌మెన్! మనం రేపు ఉదయమే ఆపరేషన్ చేయబోతున్నాం... గెట్‌రెడీ! డాక్టర్ శంకర్! అందరికి ఇన్‌ఫార్మ్ చేసి అన్ని సిద్ధం చేయి." అని చెప్పి డాక్టర్‌శ్రీని గది వైపు వెళ్ళడానికి లేచాడు.

ఇంతలో "డాక్టర్ రెడ్డి! వెయిటేమినిట్" అనే పిలుపుతో ఆగి ఎదురుగా చూసాడు.

డాక్టర్ కె.ఎన్ రెడ్డి అతని దగ్గరకు వస్తూ, "బ్రెయిన్ యాక్టివిటీ పూర్తిగా కోల్పోయినా గుండె హైపో థెర్మిక్ ఇస్కీమియా పద్ధతిలో రిమూవ్ చేసి, ఆక్సిజన్‌టెడ్ హైపర్ ఆస్మోలార్ సొల్యూషన్ కంటిన్యుయస్‌గా హైపోథర్మిక్ ప్రాప్యూషన్ చేస్తూ వుంటే ఇరవై నాలుగ్గంటలు కూడా ఉంచవచ్చు. అందువల్ల అంత త్వరపడాల్సిన అవసరం లేదేమో! ఏదో కొంచెం బ్రెయిన్ యాక్టివిటీ ఉందంటున్నారు కదా!"

"లేదు.. మేం ఉంచుతున్నాం.."

"అలాగే ట్రై చేయండి. ఈలోగా ఆ బ్రెయిన్ డెత్ పేషెంటుకి శరీరపు వేడి, గుండె సంకోచవ్యాకోచలకు ఇవ్వాల్సిన వ్యాసోడైలేటార్స్ వ్యాసోప్రస్సార్స్. ఎలాంటి ఇన్‌ఫెక్షన్ రానీకుండా యాన్టీ బయొటిక్స్, ఊపిరితిత్తుల గురించి శ్రద్ధ తీసుకుందాం" అన్నాడు డాక్టర్ కె.ఎన్.రెడ్డి.



gudachari.com

"ఏమైనా ఎంత త్వరగా చేస్తే అంత మంచిది కదా! అన్ని సిద్ధంగా ఉన్నాయి. మీరు కూడా రెడీగా ఉండండి. నేను పేషెంటును సిద్ధం చేసేందుకు వెళ్తున్నాను" అంటూ పరుగు లాంటి నడకతో బయల్దేరాడు డాక్టర్ రెడ్డి.

\- - -

"స్వాతీ! చూడమ్మా వీడు నన్ను ఫూల్ చేశాడు" అంటూ వీపుకి అతికించబడిన టార్జాన్ స్టిక్కర్ చూపించాడు దత్ ఏడుపు ముఖం అభినయిస్తూ. గదిలో నవ్వులు పరచుకున్నాయి. అందరి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరిసింది ఓహ్... ఇది శాశ్వతమైతే ఎంత బావుండును. ఏకొద్ది క్షణాలైనా ఆ సంతోషం కనిపిస్తే అది శాశ్వతం కావాలని కోరుకొంటోంది స్వాతి మనసు. డాక్టర్ దత్, వాళ్ళతో ఉన్న కాసేపూ ఆనందానికే కొదవ లేదు. పిల్లల్తో వాళ్ళలో ఒకడై కలసిపోయి ఆడుతూ ఉన్నాడు అతను.

"మీ వాడు చాలా పోకిరండీ. డిస్ట్రక్టివ్ కాదు, కన్‌స్ట్రక్టివ్ పోకిరి." డాక్టర్ శ్రీని వైపు చూసి నవ్వుతూ అన్నాడు దత్.

అతను ఎక్కడో చూస్తూ దీర్ఘాలోచనలో ఇదేమి పట్టించుకోలేదు.

దత్ స్వాతి ముఖాముఖాలు చూసుకున్నారు. ఏవిటిది... ఇక్కడ ఇంత ఆనందం పొంగిపొరలుతుంటే తనకేదీ సంబంధం లేనట్లు ఏవిటాలోచిస్తున్నారు అనుకొని బాధవేసింది స్వాతికి.

"ఏవిటి... దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అన్నాడు దత్ డాక్టర్ శ్రీనిని కదుపుతూ.

"ఆ...ఏంలేదు... ఏంలేదు..." అన్నాడు సర్దుకుని.

"ఏదో వుంది... దాస్తున్నారు."

"నథింగ్ స్పెషల్... ఏదో పిచ్చి ఆలోచన్లు..."

"లెటజ్ షేర్..."

కాసేపలాగే స్వాతి వైపు చూశాడు

నిట్టూర్పు వదలి వెనక్కి వాలి శూన్యంలోకి చూస్తూ సీరియస్‌గా అన్నాడు.

"నాకు చనిపోవాలని లేదు"

స్వాతి, దత్ బిత్తరపోయి చూశారు అతని వైపు.

ఏవిటితను...? అసలేవిటీయన ఆలోచన్లు... ఈ సమయంలో అతను అలా మాట్లాడు తారని ఊహించలేదు స్వాతి.

వాళ్ళిద్దరి వైపు తిరిగి, "యస్... నాకు చచ్చిపోవాలని లేదు." అన్నాడు చిరునవ్వుతో. ఒకప్పుడు అతను నవ్వితే స్వాతి హృదయం ఆనందంతో నర్తించేది. కానీ... ఇప్పుడు ఆ నవ్వు చూస్తే భయం వేసింది స్వాతికి.

"కానీ ఈ విధంగా బ్రతకాలనీ లేదు."



గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. తిరిగి తనే ప్రారంభించాడు. "మీకు తెలుసా దత్...! ఏ శక్తి నన్నింత వరకూ జీవింపజేసిందో... ఏ శక్తి జీవితం మీద నాకు అనురక్తినీ, ఆసక్తినీ కలిగించిందో... జీవితాన్ని ప్రేమించడమెలా నేర్పిందో..."

డాక్టర్ దత్ ఏమీ సమాధానం చెప్పలేదు. తలెత్తి దత్ వైపొకసారి చూసి అదే చిరునవ్వుతో స్వాతి వైపు చూస్తూ

"ఇటీజ్... షి... మైలైఫ్ ... నా భార్య..." దత్ ముడి విడివడినట్లుగా నిట్టూర్పు వదలి మెప్పుకోలుగా స్వాతి వైపు చూశాడు.

"యస్... మిస్టర్ దత్... ముంగిట అగ్నిపర్వాతాలు పేలినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె ప్రేమే నాకు ప్రసాదించింది. ఆ ప్రేమను దూరం చేసుకోకూడదనే కోరికే జీవించాలనే పట్టుదలను నాలో పెంచింది."

....ఇంతకంటే... ఏంకావాలి ఒక భార్యకి భర్తనుండి... హృదిలోంచి పొంగుతున్న ప్రేమను అతని గుండెల మీద వాలి చల్లబరచుకోవాలన్న కోరికను బలవంతంగా అణచు కున్నది స్వాతి. చాచిన భర్త చేతిని తన హృదికి హత్తుకుని ముద్దులతో ముంచెత్తుతుంటే జల జలా రాలిపోతున్న తన కన్నీళ్ళకు ఆనకట్టల్లేవు స్వాతికి. "వొద్దండి... వొద్దు... నన్ను పొగడొద్దు... నా స్వార్థం కోసం మిమ్మల్ని బలిచేస్తున్నానేమోనని క్షణం క్షణం కుమిలిపోతున్నాను నాలో నేను... మీ నీడలో జీవితాన్ని చాలించాలని, మీ అనురాగ సాంగత్యంలోనే రాలిపోవాలనే పిచ్చి కోరికతో పరతపించిపోతున్నాను..." అంటున్న స్వాతి కళ్ళవెంట కారే నీటికి అడ్డేలేకపోయింది.

"వెల్... డోంట్ బి టూ ఎమోషనల్."

దత్ మాటల్తో ఈ లోకంలోకి వచ్చింది ఆమె. డాక్టర్ దత్ ముందు అలా ప్రవర్తించానే అని సిగ్గు పడడం లేదు తనిప్పుడు. భర్త చేయి ఆమె హృదయం మీద ఇంకా పదిలంగా ఉంది అయినా తీసే ప్రయత్నమూ చేయలేదు స్వాతి. తలుపు దగ్గర ఎవరో వచ్చిన సవ్వడికి వెను తిరిగి చూసింది.

డాక్టర్ రెడ్డి, "హలో స్వాతీ! హలో శ్రీనీ! ఎలా ఉన్నారు? డాక్టర్ దత్ మంచి కాలక్షేపం అనుకుంటాను మీకు" అంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. అతనలా మాట్లాడినప్పటికి, అలసటగా, నీరసం అతని ముఖంలో వ్యక్తమవుతున్నాయి.

"సీ... దీస్ కిడ్స్! మనుషులుగా పుట్టాల్సిన వాళ్ళు కాదండీ వీళ్ళిద్దరూ," వాళ్ళవైపు చూపించి అన్నాడు దత్.

"ఐ... నో... ఐనో..." అంటూ ప్రక్కకు తిరిగి,

"డాక్టర్ శ్రీని... అనుకోని విధంగా మన ప్రోగ్రాములో కొంచెం మార్పు చేయాల్సి వచ్చింది... మీరు... సరే అంటే.." ఆగి స్వాతివైపు చూశాడు.



gudachari.com

"ఎనీ ప్రాబ్లెమ్...?" ఆతృతతో అడిగాడు దత్.

"నా... నో ప్రాబ్లెమ్..." ఆ మాటతో ఎగిరిపోతున్న ప్రాణం తిరిగి వచ్చినట్లయింది స్వాతికి.

"శుక్రవారం అనుకున్న ఆపరేషన్ రేపు ఉదయం చేసేందుకు నిర్ణయించారు. మీకు అభ్యంతరం లేకపోతే..."

"రేపా!?" ఆ పదం మాత్రమే వచ్చింది వెంటనే స్వాతి నోటి నుండి శరీరమంతా వణికినట్లు అనిపించింది. భర్త వైపు చూసింది. అతనిలో ఏమార్పు లేదు. ఇందాకెలా ఉన్నారో ఇప్పుడూ అంతే.

"యస్... అనుకున్న తర్వాత ఎప్పుడైతే ఏం.. మీరు రెడీ అంటే నేనూ రెడీనే" అన్నాడు స్వాతి వైపు చూస్తూ.

"వాట్ స్వాతీ?" డాక్టర్ రెడ్డి ప్రశ్నించాడు.

ఏమీ మాట్లాడలేని స్థితిలో స్థాణువులా నిలుచుండిపోయింది స్వాతి.

"స్వాతీ! కమాన్... వాటీజ్ దిస్... బి బ్రేవ్... ధైర్యంగా వుండు. ధైర్యం మీదనే సక్సెస్ ఆధారపడి వుంటుంది. నేను మిగతా పనులు చూసుకోవాలి వొస్తాను.. గుడ్‌లక్... బి బోల్డ్... గుడ్‌లక్ ట యు డాక్టర్ శ్రీని..." అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు డాక్టర్ రెడ్డి.

నో... అతన్ని ఆపాలి... అతను వెళ్ళిపోతున్నాడు... ఆపరేషన్ మరొక్క రోజుకు పోస్ట్‌పోన్ చేయమని అభ్యర్థించాలి... ఒక్కరోజు... మరొక్కరోజు ఆయన్తో నేనూ, పిల్లలూ గడపాలి... ఇది.. ఇది ఆఖరిరోజు... కాదు... కాదు... ఆఖరి రోజు కాకూడదు... ఏమిటి ఇలా ఆలోచిస్తున్నానేమిటి.. ఇంతకాలం పెంచుకుంటూ వచ్చిన ధైర్యం అంతా ఏమైంది. ఏమిటి... ఎక్కడకో చీకటిలోకి జారిపోతున్నానేమిటి.. అయ్యో... ఎవరూ ఆదుకోరా... గప్పున ఎదో ముఖం మీద పడేటప్పటికి. కళ్ళు తెరిచింది స్వాతి. ఎదురుగా ఆమె ముఖమ్మీద నీటిని చిలకరిస్తూ డాక్టర్ శ్రీని. ప్రక్కనే దత్.

క్షణకాలం వెర్రిగా భర్తనే చూసి గట్టిగా కావలించుకుంది.

"సీ దిస్ లేడీ... దట్ టూ ఎ డాక్టర్..." అన్నాడు స్వాతి తల నిమురుతూ.

"బట్ ... షి... ఈజ్ ఎ ఉమన్..." అని దత్ మాటలు

"యస్... బట్...ఐయామ్ హిజ్ వైఫ్..." గట్టిగా అన్నది అతన్ని చూసి స్వాతి.

"సొ.. వాట్? అందుకేనా నువ్వు బెంబేలు పడిపోయి కాస్తో కూస్తో ధైర్యం ఉన్నవాళ్ళని కూడా పిరికివాళ్ళను చేస్తున్నావు... పేషెంటుకు ధైర్యం చెప్పాల్సిన నీవు భయపెడుతావా...?" కాస్త కోపంగా అన్నాడు దత్ స్వాతితో.

అప్పుడు కానీ గుర్తురాలేదు తను చేసిందెంత తప్పో స్వాతికి. అయినా భయాన్ని అణచుకోవడం స్వాతి వల్ల కావడం లేదు.



"క్షమించండి. రెండ్రోజులంది కదా అనుకున్న ఆపరేషన్ రేపే అనేసరికి ఎందుకో విపరీతమైన భయం వేసింది." లేచి నవ్వేస్తూ అంది.

"ఏరోజైనా ఒకటేకదా! కావల్సింది రిజల్ట్స్."

... అవును... ఎలా ఉంటుందో తన రిజల్ట్స్ ఈ క్షణం నుంచీ టైంబాబ్ క్లాక్ స్టార్ట్ అయింది. స్వాతి మనసులో.

ప్రిపేర్ చేసేందుకు నర్సులు వచ్చారు. అన్నీ యుద్ధ ప్రాతిపదికన చేయడం మొదలు పెట్టారు. అతని చుట్టూ కర్టెన్ వేశారు. పనులన్ని చక చకా చేసుకపోతున్నారు. ఎవరెరో వస్తున్నారు. పోతున్నారు. ఏదేదో చేస్తున్నారు. పిల్లలు ఒక మూల బిక్కుబిక్కుమంటూ కూర్చుని ఉన్నారు.

స్వాతి ఈలోకం నుంచి చాలా దూరం వెళ్ళింది. ఆ సమయంలో పరిసరాలు పూర్తిగా మరచిపోయింది. పిలుస్తున్నాడని చెప్పేసరికి ఈలోకంలోకి వచ్చింది.

"సెడేషన్ ఇచ్చి ఉన్నారు, డోంట్ ఇన్‌వాల్వహిమ్ ఎమోషనల్లీ" దత్ అన్నాడు మెల్లగా ఆమె దగ్గరగా వచ్చి.

స్వాతి వెళ్ళి దగ్గర నిలుచుంది. పిల్లలు కూడా వచ్చారు. దగ్గరకు తీసుకుని, "భయపడుతున్నావా?" అన్నాడు.

లేదని చెప్పబోయి, అవునన్నట్లు తల ఊపింది.

"ఇంతకాలం ఎంత ధైర్యంగా ఉన్నదానివి. ఇప్పుడు పిరికి అయిపోయావేం... ఏం.. కాదు. భయపడకు. నువ్వన్నట్లు మృత్యుంజయుడ్ని నేను. నువ్వే అధైర్యపడితే పిల్లల పరిస్థితి ఏమిటి? వెళ్ళండి వెళ్ళి పడుకోండి."

"మేము కొంచెం సేపు మీ దగ్గర వుంటాం డాడీ!" పిల్లల అభ్యర్థన. కాసేపు వాళ్ళనలాగే చూసి,

"ఓ.కె. అలాగే" అన్నాడు.

"ఆపరేషన్ అయిన తర్వాత, వెంటనే మనం వెళ్ళిపోవచ్చా డాడీ!"

"లేదమ్మా. మరలా కొంతకాలం ఉండాలిక్కడే"

"ఎంతకాలం డాడీ...!? ఎప్పుడూ హాస్పిటల్ అయితే మాతో ఎప్పుడు ఇంక వుండేది నువ్వు...?"

అతను ఆమాటకు స్వాతి వైపు చూసి, "నేను లేకపోయినా మమ్మీ మీతో ఉంటుంది కదమ్మా!" అన్నాడు.

గబుక్కున తన అరచేత్తో అతని నోరు మూసేసింది. ఆమె చేయి విపరీతంగా వణుకుతోంది. కళ్ళలోకి చూస్తూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని పిల్లలున్నారన్నట్లు సైగ చేశాడు డాక్టర్‌శ్రీని.



gudachari.com

"వీల్లేదు డాడీ! నువు కూడా మాతో రావాలి. లేకుంటే మేము వెళ్ళం. కదు మమ్మీ!" అమాయకంగా అంది దీపు.

"డాడీ... డాడీ...! రేపు మా టెన్త్ రిజల్ట్స్ వొస్తాయి. ఎందుకో భయంగా ఉంది డాడీ...!" బిందు అంది.

"ఎందుకమ్మా! నువు బాగా వ్రాశావు కదా!"

"ఆ... బాగా వ్రాశాను. క్లాసు కూడా వస్తుంది."

వాళ్ళందర్నీ ఒకమారు చూసి స్వాతి వైపు తిరిగారు. ఆకళ్ళల్లో గర్వం, ఆనందం తొణికిసలాడటం గమనించిది స్వాతి.

"తప్పక వొస్తుందమ్మా! నాకు తెలుసు.మీరంతా బాగా చదువుకోవాలి. మమ్మీ చెప్పిన మాట కాదనకూడదు. మమ్మీకి ఎప్పుడూ కష్టం కల్గించకూడదు. డాడీ లేకపోయినా దిగులు పెట్టుకోకూడదు."

"ఏమండీ...!" గోడవైపు తిరిగి కట్టలు తెంచుకో ప్రయత్నిస్తున్న దుఃఖాన్ని ఆపుకోడానికి విఫలయత్నం చేసింది స్వాతి. పిల్లల కోసం తప్పదు... వాళ్ళ వైపు చూసింది. అందరి కళ్ళలోనూ నీరు...

అది చూసి అతను ఒక నిట్టూర్పు వదలి.

"ఓ.కె.. బేబీస్.. పోయి పడుకోండి. ఆపరేషన్ అయిన వెంటనే మీరందరూ వచ్చి నాకు ప్రజంటేషన్స్ ఇవ్వాలి. ఇంటికెళ్ళిన తర్వాత మనందరం పిక్నిక్ వెళ్దాం... బోటు షికారు కూడా. మీక్కావలసిన బొమ్మలన్నీ కొనుక్కుందాం." అన్నాడు.

ఆ మాటల్తో పిల్లల్లో కాస్త కళ వచ్చింది.

"సే... గుడ్‌నైట్ అండ్ గుడ్ లక్ టు అజ్, వెళ్ళిపడుకోండి!"

వాళ్ళు కదల్లేదు

"వాటీజ్ ది మాటర్...?" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ

"రాత్రికి నీ దగ్గరే ఉంటాం డాడీ! ఆపరేషన్‌కి ముందు నీకు గుడ్‌లక్ చెప్పాలి కదా!" అన్నారు వాళ్ళు

"అప్పటికి వచ్చేయచ్చు. మీరు వచ్చింతర్వాత నేను ఆపరేషన్ చేయించుకుంటాను. సరా! వెళ్ళండి."

వాళ్ళు అయిష్టంగానే వెళ్ళారు. తలుపువేసి వచ్చి అతని దగ్గర కూర్చుంది స్వాతి. చాలాసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు.

"స్వాతీ! ఇదే ఆఖరు రాత్రా!"

"ఆమాట అనకండి.. నేను వినలేను."

"అలా అని కాదు ఒక వేళ... ఇదే ఆఖరి రాత్రయితే...?"



"...ప్లీజ్.. కాదు. కాకూడదు... మీ నీడలో, మీ అనురాగంలో సంతోషంగా గడపగల ననే నమ్మకం నాకుంది."

"ఒక వేళ నీ నమ్మకం..."

"లేదు... లేదు... నా నమ్మకం వమ్ముకాదు. అన్నింటినీ జయించగల మనోధైర్యం.... ఆత్మవిశ్వాసం మీకున్నాయి."

అతనితో అలా అనగలిగిందే గానీ, తెలీని భయమేదో కంపింపజేస్తోంది. ఆమెను. అయినా తనెందుకు భయపడుతుంది. ఎందుకు కీడు శంకిస్తుంది.... తెలియదు.

"స్వాతీ!" నెమ్మదిగా వినబడింది పిలుపు.

"నేను నీకేమిచ్చానని నా కోసం ఇంత శ్రమ పడుతున్నావ్" ఆమె కళ్ళల్లోకి చూస్తూ ప్రేమానురాగాలతో అన్నాడు.

"భార్యభర్త నుండి ఏం ఆశిస్తుందండీ! ప్రేమ, అనురాగం తప్ప. పసుపు కుంకమలు ముఖ్యం కాదు అవి మీ నుండి పుష్కలంగా లభించాయి నాకు. వాటిలోటు నేనేనాడు పొందలేదు."

"నేను చాలా అదృష్ట వంతుడ్ని కదూ!"

"నేను కాదా!"

"స్వాతీ! మనిద్దరం కలకాలం ఇలాగే ఉండిపోవాలని ఉంది." దగ్గరకు తీసికుంటూ అన్నాడు.

"నిజమే... నాలోని అణువణువు మీ ప్రేమని, ఈ మృధుమధుర స్పర్శని కోరు కొంటుంది."

స్వాతి ముఖాన్ని తన చేతుల్లోకి తీసికుని,

"స్వాతీ! రేపు నిన్ను నేను చూస్తాను కదూ!" అన్నాడు. స్వాతికి ఇంతసేపూ కూడగట్టుకున్న ధైర్యం సడలిపోతుందేమో ననిపించింది. ఆ మాటలోని నిస్సహాయతకు, "తప్పక చూస్తారు. రేపు మీకు, మరో హృదయం రాబోతోంది. మన జీవితాల్లో మరో ఉదయం ఉంటుంది." అంది అతని కళ్ళల్లోకి చూస్తూ.

చాలా చాలా మాట్లాడాలని ఉంది స్వాతికి. కానీ ఉదయం ఆపరేషను. తను ఏ సమయంలోనైనా బయటపడిపోవచ్చు. "చాలా ప్రొద్దుపోయింది. పడుకోండి." అని లైటార్పి భర్తమీద చేయి వేసి కుర్చీ దగ్గరగా లాక్కుని కూర్చుంది. మెదడు ఆలోచనల్తో హెూరెత్తి పోయింది. ఆశ, నిరాశలు దోబూచులాడుతున్నాయి ఆమెలో... స్వాతి చేతిని తీసికొని తన గుండెలమీద పెట్టుకున్నాడు శ్రీని. గుండెకొట్టుకోవడం స్పష్టంగా తెలుస్తోంది ఆమెకు.. ఆ గుండె.. అలాగే...



gudachari.com

"డాక్టర్ స్వాతీ!" డాక్టర్ దత్ పిలుపుతో ఉలిక్కిపడి లేచింది. తూలి పడబోయి నిలదొక్కుకున్న శరీరం గడ గడ వణికిపోతూ వుంది. కళ్ళు భగ భగ మండిపోతున్నాయి. తలనొప్పి విపరీతంగా ఉంది. జ్వరం వచ్చిందేమో! బాగా ప్రొద్దుపోయి వుంటుంది.

డాక్టర్ దత్, డాక్టర్ శ్రీని మేల్కొని ఉండడం చూసి,

"మీరింకా నిదుర పోలేదా?..." వాళ్ళను చూసి అంది. వాళ్ళు వొకరి ముఖాలొకరు చూసుకున్నారు. స్వాతికేం అర్థం కాలేదు.

"ప్లీజ్ డాక్టర్ దత్! గివ్ హిమ్ సమ్ రెస్ట్... మీరు పోయి పడుకోండి. ఆయన్ని డిస్టర్బ్ చేయకండి." కాస్త గట్టిగా అంది విసుగ్గా స్వాతి.

డాక్టర్ శ్రీని నవ్వుతూ, "టైమ్... ఈజ్ సో ఫాస్ట్ డార్లింగ్... గుడ్ మార్నింగ్.." అన్నాడు.

"ఆ... అప్పుడే తెల్లవారిందా?!" బెదిరిపోయి చూసింది వాళ్ళవైపు స్వాతి.

"ఉదయం కోసం ఎదుర్చూస్తూ తెల్లవారిందా అంటావేమిటి?? వాళ్ళపుడే నాకు ప్రిమెడికేషన్ కూడా ఇచ్చారు."

"... మిమ్మల్ని అప్పుడే తీసికెళ్తారా?" విభ్రాంతిగా అడిగింది ఆమె.

"కూల్... డౌన్ డార్లింగ్... అంత టెన్షన్ ఎందుకు?"

"డాక్టర్ దత్.. ముందు మా ఆవిడకివ్వమనండి మత్తు. ఆవిడిప్పుడే స్పృహ కోల్పోయేట్లుంది. నన్ను థియేటర్ దగ్గర క్యూడా తీసుకుపోనిచ్చేట్లు లేదు." నవ్వుతూ అన్నాడు డాక్టర్శ్రీని. ఆ మాటల్లో భయం, తొట్రుపాటు ఎక్కడా లేవు. అతని కళ్ళలోకి సూటిగా చూసింది స్వాతి. ప్రశాంతంగా నిర్భయంగా ఉన్నాయి ఆచూపులు. నేను నా ఆతృత, భయం అణచుకోవాలి... అనుకుంది స్వాతి.

"మీరు కాఫీ తీసుకున్నారా! ఉండండి ఒక్క క్షణం తీసుకువస్తాను."

"ఏం... నన్ను ఆపరేషన్ చేసుకోనివ్వవా?"

"నా మతిమరపు మండిపోను, ఆపరేషన్ కదూ!"

"ఏం తీసుకోకూడదు కదూ!... మీరు బ్రష్ చేసుకున్నారా?... తలంతా అలా చెదిరిపోయి ఉందేమిటి? ఉండండి దువ్వుతాను... మీరు డ్రెస్ మార్చుకోలేదేమిటి? వేరే డ్రెస్ వేసికోండి...."

"స్వాతి, ప్లీజ్! ఏవిటిది? ఏవిటి నువ్వు చేస్తున్నది? కంట్రోల్ చేసుకో! ముందు ఈ టాబిలెట్ వేసికో!" దగ్గరగా వచ్చి బిగ్గరగా చెప్పాడు డాక్టర్దత్.

కాసేపు మెదడు మొద్దుబారినట్లే అలాగే ఉండిపోయింది స్వాతి. టాబ్లెట్ వేసుకుని నీళ్ళు త్రాగింది. రాత్రి గడచి ఉదయం అప్పుడే వచ్చేసిందా... ఎందుకు వచ్చింది అపుడే! అవసరమైనపుడు తెల్లవారనే తెల్లవారదు. తెల్లవార కూడదనుకుంటే కళ్ళుమూసి తెరిచేలోగా భయంకరంగా ప్రత్యక్షమవుతుంది ఉదయం అనుకుంది ఆమె.



పులిని చూసినట్లు లేచి నిలబడింది, ఎదురుగా వస్తున్న వ్యక్తిని చూసి.

"హలో శ్రీని! హౌఆర్‌యూ" డాక్టర్ రెడ్డి పరామర్శ

"ఫైన్."

"రెడీ...?"

"రెడీ... ఫార్ ది ఫైట్... దట్ టు ది యన్డ్."

"కీపిట్ అప్.. కీప్ ది స్పిరిట్.. యువిల్ బి ద విన్నర్.. ఓ... కే... మనం ప్రొసీడ్ అవుదామా?"

"... అప్పుడే ఇంకా పిల్లలు కూడా రాలేదు...?" ఆదుర్దాగా అంది స్వాతి. డాక్టర్ రెడ్డి ఆమెవైపే సూటిగా చూసి, "గుడ్‌లక్ స్వాతీ!" అన్నాడు. తనింకా వణకుతూనే వుంది.

ఆశ్చర్యంగా ఆమెను చూస్తూ.

"ఏవిటి స్వాతీ! ఎందుకమ్మా భయపడుతున్నావు, ధైర్యంగా ఉండు" అన్నాడు డాక్టర్ రెడ్డి

"నేను.. నేను భయపడ్డం లేదు. ఆపరేషన్... ఏం... భయం లేదంటారా?"

చిన్నగా నవ్వి, "ఎవ్విరిథింగ్ ఈజ్ ఫర్‌ఫెక్ట్... ఆపరేషన్ ఫెయిల్ కావడానికి అవకాశమే లేదు. ఒకవేళ అయినా అతని ప్రాణానికేం ప్రమాదం లేదు. మా మీద నమ్మకం ఉంచుకో."

"ఫెయిల్ అయినా ప్రాణం భయం లేదా?"

"లేదమ్మా! అలా అరేంజ్ చేసుకుంటున్నాము."

స్వాతికి అర్థంగానట్లు చూసింది.

అవునమ్మా! రెండు విధాల అనుకుంటున్నాము. ఆపరేషను చేసేటప్పుడు లోపలి భాగాలు అన్నీ పరిశీలించి ఏది మంచో నిర్ణయించుకుంటాము.

ఎండోవెంట్రికులార్ పాచ్‌ప్లాస్టి, దానితోకూడా కరోనరీ గ్రాఫ్టింగ్ చేసి, క్రియోథెరపితో బతికిన వాళ్లు మంచి జీవితం గడిపేందుకు అవకాం వుంది. ఈ పద్ధతి గుండెమార్పిడికి బదులుగా పరిగణించవచ్చు. కాని చాలా కొద్దిమందికి మాత్రమే చేయగలం. ఇంతకు మునుపు బైపాస్‌లో వెంట్రికల్ కండరాలు అంత చెడిపోలేదు. ఇప్పుడు బ్లాక్ అయిన ఆర్టరీ కూడా సరిచేసేందుకూ అవకాశం ఉండవచ్చని ఆలోచిస్తున్నాం. ఈ క్రియోథెరపీని డార్ పద్ధతి అంటారు. కొన్ని పరీక్షలు డాక్టర్శ్రీనికి అనుకూలంగా ఉన్నాయి. మా సాయశక్తులా ప్రయత్నిస్తాం. మంచే జరుగుతుందనుకుంటాం. ధైర్యంగా ఉండు. నీ ధైర్యంమీద మా ఫలితం ఆధారపడివుంటుంది.

చేతులెత్తి నమస్కరిస్తూ అన్ని పర్‌ఫెక్ట్‌గా ఉన్నాయా? మీరు... మీరు మరలా ఒకసారి చెక్ చేసుకోకూడదా! డాక్టర్ కూలీ వస్తున్నారా?" అడిగింది ఆమె.



gudachari.com

"డాక్టర్ కూలీ... " కాస్త తటపటాయింపు. స్వాతి గుండె వేగం హెచ్చింది. "ఇన్‌ఫార్మ్ చేశాము. ఏక్షణమైనా రావచ్చు." అన్నాడు.

"ఆయన వచ్చేదాకా చేయొద్దు." గబుక్కున అంది. భయం భయంగా చూస్తూ అతని వైపు.

విభ్రాంతితో చూశాడు స్వాతిని.

"మీ మీది నమ్మకం లేకకాదు.. క్షమించండి" అంది వెంటనే తలదించుకుని.

"చూడమ్మా స్వాతీ! మరీ ఇంత ఆతృత పనికిరాదు. వెళ్ళు. వెళ్ళి అతనికి ధైర్యం చెప్పు. నువ్వు భయపడ్తున్నట్లు తెలియకూడదు అతనికి. ఇది మేజర్ ఆపరేషన్. మీరిచ్చే సహకారం మీద, మీకు మా మీద ఉండే నమ్మకం మీదా, మీ ధైర్యం మీదా ఆధారపడి వుంటుంది ఫలితం. డాక్టర్‌వై ఉండి ఇంత సెన్సిటివ్‌నెస్ పనికిరాదు. నీ భయం... ఆత్రుతా నాకు తెలియంది కాదు. చూడు... కన్నీళ్ళు తుడుచుకో... ఉయ్ ఆర్ గోయింగ్ టు ప్రొసీడ్... అంటూ తల నిమిరి వెళ్ళిపోయాడు."

"... అరే వెళ్ళిపోతున్నారే... అనెస్థీషియా ఎవరిస్తున్నారో..." అడుగు ముందుకు వేయబోయి ఆగిపోయింది స్వాతి. తన మనసులో ఇవన్నీ వీళ్లు ముందు ఆలోచించలేదా... నాకు ఎందుకు చెప్పలేదు అనుకున్నది స్వాతి.

"మమ్మీ! బిందక్క పాస్... ఫస్ట్ క్లాస్..." గట్టిగా అరుస్తూ ముందుకు పరగెత్తుకు వచ్చి స్వాతిని కావలించుకుంటూ అన్నాడు విష్ణు.

బిందు కాస్త వెనుకగా గర్వంగా వస్తూ వుంది.

సంతోషంగా బిందును ముద్దుపెట్టుకుని కన్నీరు తుడుచుకుని "రండి... డాడీకి చెబుదాం..." అంటూ గదిలోకి తీసుకొచ్చింది వాళ్ళను.

"కంగ్రాచ్చులేషన్స్ నాకు తెలుసు." అన్నాడు డాక్టర్‌శ్రీని సంతోషంగా.

ఇంతలో స్ట్రెచర్ వచ్చింది.

"అప్పుడే తీసుకువెళ్తారా?"

"తీసుకు రమ్మన్నారమ్మా."

"కాసేపు ఉండండి..."

"ఓ.. కె.. కిడ్స్... నేను వెళ్తున్నాను సే... గుడ్ బై టు మి..."

"నో... గుడ్‌లక్ చెప్పండి" అంది గట్టిగా స్వాతి.

అతను స్వాతి వైపు చూసి నవ్వాడు.

"ఓ కె. గుడ్‌లక్‌టు అజ్..." అని తిరిగి, "స్వాతీ! సే... బెస్టాఫ్ లక్ టుమి..." అంటూ దీర్ఘంగా ఆమె కళ్ళలోకి చూశాడు. ఆ చూపుల్లో ప్రేమానురాగాలతో నిండి వున్నాయి. తన మీద జాలి, అభ్యర్థనతో కూడి ఉన్నట్లనిపించాయి స్వాతికి.



మాట పెగిలి రావడం లేదు. గొంతు తడారిపోయింది. అతన్నే చూస్తోంది... మనసు గిల గిల లాడుతోంది. కానీ కంట్రోల్ చేసుకోవాలి.

"యస్... బెస్టాఫ్ లక్... టు అజ్..." తనన్న మాటలు తనకే వినిపించలేదు.

వణుకుతున్న పెదవులతో, అదురుతున్న గుండెలతో వశం తప్పుతున్న మనసులోనుంచి అతి రహస్యంగా అన్నట్లున్న ఆ మాటలు డాక్టర్‌శ్రీనికి మాత్రం బాగా వినిపించాయి.

"స్వాతీ! నీ పరిస్థితి ఎలా వుంటుందో నాకు తెలుసు. ఇది ప్రమాదకరమైన ఆపరేషన్... కానీ, చేసుకోకపోతే నేనెంతకాలం జీవించగలను...? జీవించినా మనశ్శాంతి నా కుటుందం టావా... నిన్ను చూస్తుంటే ఒకవైపు జాలి.. మరోవైపు గర్వమూ వేస్తుంది నాకు. కళ్ళ వెనక దాచుకున్న కలలు నిజం చేసుకోవాలని, భవిష్యత్‌ని రేపులో వెతుక్కుంటూ నొసటి కుంకుమ పదికాలాలపాటు పదిలంగా ఉంచుకోవాలని, నిన్ను ప్రేమతో... అనురాగంతో.. ఆప్యాయతతో దరిచేర్చిన ఈ హృదయం ఎక్కడ బ్రద్దలవుతుందో అని నీ తల ఆలోచనలతో ముక్కలు చేసుకోకు. అదిగో... అటు చూడు, ముత్యాల్లాంటి బిడ్డలు... నేను వాళ్ళలో లేనూ! నా మనసు వాళ్ళలో లేదూ!

నా చూపు, నా మాట, నా నడక, నా నవ్వు, నా హృదయం, నా వ్యక్తిత్వం వాళ్ళలో నిత్యం కనిపిస్తాయి.

నా కోసం నీ హృదయం, నీ కోసం నా హృదయం పరితపిస్తూనే వుంటాయి ఎప్పుడూ... ఇక అనుభవించేందుకేమీ మిగిలిలేదు.

గడచిన జీవితం... గత వైభవం నాకెంతో సంతృప్తిని మిగిల్చాయి. అని చాలు ఈ జీవితానికి.

మధుర స్వప్నాలను నిజం చేసి మధురంగా చవి చూపిన దేవతవు నీవు... నువ్వందించిన ఈ అమృతమయ జీవితం అమరం.

నిజాన్ని నిర్భయంగా ఎదుర్కో..

నీ మీద ఉన్న ప్రగాఢమైన విశ్వాసంతో నిర్భయంగా వెళ్తున్నాను... గుడ్ లక్..." కనుకొనల్లో దోబూచులాడుతున్న నీటి బిందు వొకటి జారిపడింది అతని హృదయం మీద.

స్ట్రెచర్ మీద పడుకోబెట్టి తీసుకువెళ్తున్నారు డాక్టర్ శ్రీనిని. స్వాతి దానివెంట పిచ్చిగా పరుగెత్తుతోంది.

ఏవండీ... ఆగండి... కాసేపు ఆగండి... ఒక్క నిమిషం... ఒకే ఒక్క నిమిషం... నవ్వుతూ విరబూసిన ఆనందమయమైన ఆ ముఖాన్ని ఒక్కసారి తనివితీరా ముట్టుకో నివ్వండి... ప్లీజ్... మీకు పుణ్యముంటుంది. అప్పుడే మమ్మల్ని దూరం చేయకండి... అదిగో.. ఆయన పిలుస్తున్నారు... ఇటే చూస్తున్నారు... ఆగండి... నేనూ వస్తున్నాను.



gudachari.com

బలవంతంగా ఎవరో పట్టుకులాగినట్లయి ఈ లోకంలోకి వచ్చింది స్వాతి. చూస్తె అప్పుడే ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకుంటున్నాయి. ఆమె వొరిగి పోతుంది. ఎక్కడికో లోయల్లోకి జారిపోతున్నట్లుంది... నో... నో... తను ధైర్యం తెచ్చుకోవాలి... ఏరీ... పిల్లలేరీ... ఆమె చుట్టూ చేరి కళ్ళనీళ్ళతో చూస్తున్నారు. గబుక్కున దగ్గరకు వాళ్ళను లాక్కుని, "భయం లేదమ్మా! నాన్నకు ఆపరేషన్ సక్సెస్ అవుతుంది..." అన్నది కారుతున్న కన్నీటితో పిల్లల్ని పొదివి పట్టుకుని.

అక్కడే వున్న కుర్చీలో కూర్చుంది. తల తిమ్మిరెక్కినట్లయ్యింది. చెమటతో ఒళ్ళంతా తడిచిపోయింది. ఏదో మగతలోకి జారిపోతున్నట్లు తలవాల్చుకుంది.

కాసేపటికి కళ్ళు తెరిచి చూసింది. ఎదురుగా టీపాయ్ మీద పేపర్... మసక, మసకగా కనిపిస్తోంది... భర్త ఫోటో... ప్రక్కనే మేజర్ చౌదరి ఫోటో... అక్షరాలు పెద్దవిగానే ఉన్నా స్పష్టంగా కనిపించడం లేదు. అతి ప్రయత్నం మీద చదివింది.

"దేశంలో మొట్టమొదటి గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు, వారం రోజుల క్రితం ఒక రోడ్డు ప్రమాదంలో మెదడుకు తీవ్రమైన గాయాలై గత రాత్రి ఒంటిగంటకు చనిపోయిన మేజర్ చౌదరి ఒక్కగానొక్క కుమారుని గుండెను డాక్టర్‌శ్రీనికి అమర్చబోతున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మానసిక వైద్య నిపుణులు డాక్టర్ దత్ మాట్లాడుతూ, పేషెంటు మానసిక స్థితి మీద ఇటువంటి ఆపరేషన్ ఫలితం ఆధారపడి వుంటుందని, డాక్టర్ శ్రీని దీన్ని స్పోర్టివ్‌గా తీసికున్నారని ఆయన మంచి మనోధైర్యం గల వ్యక్తనీ ఇది నూటికి నూరుపాళ్ళు సక్సెస్ అవుతుందనీ, తన విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఏవిటి డాక్టర్ దత్ సైకియాట్రిస్టా...!"

తలెత్తి చూసింది.

ఎదురుగా ఆపరేషన్ థియేటర్ దగ్గర్నుంచి వస్తూ కనిపించారు మేజర్ చౌదరి, డాక్టర్ దత్‌లు... చేతులెత్తి అతిప్రయాసతో నమస్కరించింది. వాళ్ళకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియలేదు. ఏదో చెప్పాలని విశ్వప్రయత్నం చేసింది. పిల్లల్ని దగ్గరగా తీసుకుంటూ పొదివి పట్టుకొని నవ్వింది. వాళ్ళు కూడా తేలిగ్గా నవ్వుతూ తల్లిని గాఢంగా కావలించుకొని" ఆమెలో వొదిగి పోయారు.

మరో హృదయం...!

మరో ఉదయం....!

– – –

gudachari.com